
Rs. 15.00



'నిర్వాణ తీరాలకి ఆవల'

అఖిల

అఖిల భారత పత్రిక - జనవరి - 2008

'నిర్వాణ తీరాలకి ఆవల'
అఖిల భారత పత్రిక - జనవరి - 2008

<u>విషయ సూచిక</u>

* * *

నిర్వాణం అంటే ఏమిటి?

నిర్వాణం అంటే ఏమిటి? బౌద్దుల సాంప్రదాయం ప్రకారం దాని అర్థం విఘటన. అంటే అది ఆత్మకు సంబంధించినది కాదు - ఎందుకంటే అసలది లేదుగనక - సంస్కార ప్రవాహంనుండి బైటపడడం అనుకొని పొరబడుతున్నాం. మాయావాదులైన వేదాంతుల ప్రకారం దాని అర్థం అది విఘటన కాదు, అదృశ్యం. మనం అనుకొనే అవాస్తవ అసత్య వైయక్తిక జీవి బ్రహ్మములో అంతర్థానం కావడం అన్నమాట. అది వ్యక్తి అనుకునే వేర్పాటు భావం అనేది అనుభవంలో లేకుండా, కన్పించకుండా పోవడం అన్నమాట. దానినే మనం లేనిది ఉన్నట్లుగా భ్రమించే వెలుగు, సత్యజ్యోతిలో కలిసిపోవడం నిర్వాణం అనుకోవచ్చు. మనకున్న ప్రత్యేక వ్యక్తిత్వం అనేది ఆధ్యాత్మికానుభూతిలో అఖండమైన విశ్వచేతనలో అంతరించిపోవడం; వ్యక్తిత్వం అనేది విశ్వచేతనా ప్రవాహంలో ఒక ప్రత్యేక శక్తి లేక చర్య యొక్క ఒక కేంద్రం మాత్రమే లేదా అది అతీతంలో వ్యక్తి. విశ్వం అనే వేరు వేరు భావనా లహరులు కలిసిపోయి అంతర్ధానం కావడం. అలాగే అది విశ్వఖేలనకు ఆధారంగా ఉన్న అతీతం యొక్క స్పృహ (వేరు భావన) అంతర్ధానం కావడం. అయితే వ్యక్తి అంటే మనం ఏమనుకుంటున్నాం? మనం సాధారణంగా అనుకొనేది శారీరక, మానసిక స్థాయిలో పరాప్రకృతి యొక్క సహజసిద్ద అహంకార స్పృహ. ఈ అహంకారమేలేకుండా పోవలసింది. అలాకానపుడు, పరిపూర్ణమైన స్వేచ్ఛ సంభవం కానేకాదు. అయితే వైయుక్తిక ఆత్మ అనేది ఈ అహంకారం కాదు. ఈ వైయక్తిక ఆత్మను మనం కొన్ని సమయాలలో ఆధ్యాత్మిక సత్తగా, దైవం యొక్క అంశగా పిలుస్తున్నాం. అంతేకాక దైవాభివ్యక్తిలో పాల్గొంటున్న అనేకంలో ఒకటిగా వర్ణించుకుంటున్నాంగూడా. పూర్ణసత్వంలో ఆధ్యాత్మిక వ్యక్తి యొక్క స్థానం ఇది. మనం మన యొక్క అహంకారము నుండి

బయటపడినప్పడు మనకో వ్యక్తిత్వం అనేది ప్రత్యేకంగా ఉందన్న అపోహనుండి బయటకు వచ్చినపుడు, ఒకే సమయంలో విశ్వంతో, విశ్వాతీత దైవంతో, అనేకత్వంతో కూడా ఒకటిగా మనగలుగుతాం. దివ్య జీవితాన్ని సుసాధ్యంచేసే స్థితిఇదే. నిర్వాణం అనేది ఈ దిశగాపడే ఒక ముందడుగు మాత్రమే; మనకొక ప్రత్యేకవ్యక్తిత్వం ఉన్నదనే అపోహనుండి మనం బయటపడడం అనేది మనం మన నిజస్థితిలో దైవంలో దైవంగా జీవించేందుకు అవసరమైన అనివార్య స్థితి. అయితే దీనిని మనం ఈ జీవితంలోనే, ఈ ప్రపంచంలోనే పొందగలం.

బౌద్ధమతస్థులు అయినా కాకపోయినా, ఆత్మ (Self) ఒక సువిశాల శూన్యం అనేభావన, స్వేచ్ఛ లేదా మోక్షం పేరిట మనం పొందే అనుభవం అనేది ప్రతీవారు పొందదగిందే. నిర్వాణం అనేదానికి ఒక వ్యతిరేక ధోరణిలో ఇది ఉంటుంది. వ్యతిరేక భావజాలంతో మనలోకి మనం ఉపసంహరించుకున్నపుడు, ఇంకా ముందుకు కదలకుండా ఆగిపోవడం జరిగినపుడు అదే బౌద్ధులుచెప్పే, ఏఉనికిలేని శూన్యస్థితి (నిర్వాణం) అనేది అనుభవానికి రావడం. దానినే శాశ్వత సత్యమని నమ్మడం మానవమనస్సుకు సహజమే. 'ఎక్కడ ఏదీలేదో అదే పరిపూర్ణమైందని' 'లావో-త్సే' చెప్పింది చాలా జాగ్రత్తగా చెప్పిన తెలివైన మాటే. చాలామందిలో దీనికి అనుకూలమైన ఆత్మానుభవం కూడా ఉంది. శంకరాద్వైతాలకు అదొక కేవల ఏకం-గా అనుభవానికి వస్తుంది. అనేక మందిలో అది శూన్యంగా గాక శంకరాద్వైతులు చెప్పే పరిశుద్ధమైన అద్వితీయ కేవల ఏకమాత్రుడి రూపంలో (ఏకమేవా-ద్వితీయం) ఆత్మానుభూతిని కలగడం కద్దు.

ఆంగ్లమూలం - శ్రీఅరవిందులు

అనువాదం - కొంగర భాస్కరరావు.

మాయావాదము

నిర్వాణమును పొందటం నా యోగానికి మౌలికమైన మొట్టమొదటి ఫలితం. ఆలోచన లేకుండా దానికి అతీతమైన పరిస్థితిలోనికి అకస్మాత్తుగా అది (నిర్వాణం) నన్ను నెట్టేసింది. మానసిక ప్రాణిక చలనాల మాలిన్యం లేదు. అహంలేదు. వాస్తవ ప్రపంచంలేదు. నిశ్చలమైన ఇంద్రియాల ద్వారా దర్శించినపుడు మాత్రం అనిర్దిష్టమైనది ఏదో గ్రహించబడినది. మూలాధారపదార్థము ఏమీ లేదు. నీడలు ఆకృతిదాల్చినట్లు, శూన్యమైన ఆకృతులతో కూడిన ప్రపంచం (తోలు బొమ్మల ప్రపంచం) కేవలం నిశ్శబ్దం, పైవహించుకుని ఉన్నట్లు అనిర్దిష్టంగా అనిపించింది. అక్కడ ఏకముకాని లేక అనేకము కూడా లేవు. Only absolutely That - ఉన్నది ఆ ఒక్కటే (తత్). (లక్ష్య) లక్షణాలు లేనిది. బంధము లేనిది. విశుద్ధమైనది. వర్ణనాతీతమైనది. గుణాతీతమైనది. భావాతీతమైనది. అయినప్పటికీ పరమమైనది. ఏకైకవాస్తవమైనది. ఇదేమీ మానసిక సిద్ధికాదు. పైన ఎక్కడో అస్పష్టంగా దర్శించినదీ కాదు - it was positive the only positive reality - సునిసితమైన వాస్తవము. భౌతిక ప్రపంచంగా అగుపించేలా సర్వపరివ్యాప్తమై ముంచెత్తి ఆక్రమించుకుని ఉన్నదీ కూడా కాదు. అయినా మరొక వాస్తవమును గాని యదార్థాన్ని గాని అనిపించేది ఏదీ కూడా అక్కడలేదు. అప్పటి ఆ అనుభవం నన్ను ఉల్లాసపర్చి ఆనందసమ్మోహనం కావించిందని అనలేను. (తర్వాత కొన్నేళ్ల తర్వాత నాకు ఆ అవ్యక్త దివ్యానందం కలిగింది.) అప్పుడు నాకు దానివల్ల కలిగినది అవ్యక్త దివ్య ప్రశాంతత, అత్యాశ్చర్యకరమైన నిశ్శబ్దము. అనంతమైన స్వేచ్ఛ. విముక్తి. మిగిలిన అంశాలకు అందుబాటులో కల్పించేముందు లేదా అది మార్పుచెందేముందు ఆ నిర్వాణంలో రాత్రింబవళ్ళు నివశించాను. ఆ హృదయాంతరంగ అనుభవం, దాని

నిరంతర స్మృతి, పైన ఉన్న ఒక ఉన్నతతర అతి చైతన్యంలోకి, చివరకు అదృశ్యమయే వరకు మిగిలి ఉన్నది. కాని ఇంతలో ఒక సిద్ధికి మరొకటి జతకూడుతూ ఈ మౌలికమైన అనుభవంతో మిళితమై ఒక్కటైనది. పూర్వపుస్థాయిలోని భ్రాంతిమయ ప్రాపంచికదృక్పథం మరొక దానికి చోటు కల్పించింది. ఇక్కడ భ్రాంతి కేవలం ఒక అల్పమైన ఉపరితల దృగ్గోచర విషయం. దానివెనుక ఒక అపారమైన దివ్య సత్యము ఉన్నది. ఊర్ధ్వముగా పరమోన్నత దివ్య వాస్తవము ఉన్నది. హృదయగతంగా తీవ్రవాస్తవమున్నది. ఇదంతా ముందు చలన చిత్ర ఆకృతిగా లేదా ఛాయగా భ్రాంతి కలిగించింది. అలాగని ఇది తిరిగి ఇంద్రియాలకు బందిఖానా కాదు. సర్వోన్నత అనుభూతినుంచి పతనం కాదు. నిరంతరమూ ప్రవర్ధమానమవుతూ పరివ్యాప్తమయ్యే దివ్య సత్యము. విషయాలను అంతరంగం దర్శించింది. ఇంద్రియాలు కాదు. కాలాతీత అనంతదివ్యత్వంలో నిరంతర సంఘటనగా దివ్య శాంతి, నిశ్చలత్వాలు, అనంతత్వములోనికి విముక్తి - లోకాలకు సర్వదా మిగిలే ఉంటవి.

మాయావాదాన్ని దర్శించటంలో అదే నాఇబ్బంది. నిర్వాణం నావిముక్త చైతన్యంలో సిద్ధికి ఆరంభంగా పరిణమించింది. పరిపూర్ణతకు మొదటి అడుగు. కాని అదే పూర్ణమైన సత్యసాధనా సంభావ్యతకాదు. పరాకాష్ఠ కాదు. ముగింపు కాదు. అది అనాయాచితంగా, అప్రయత్నంగా, అడగకుండా వచ్చింది. స్వాగతీకరించవలసినదే. ఇంతకు ముందు నాకు దీనిని గురించి ఏమీ తెలియదు. దానిపట్ల ఆకాంక్షలేదు. చెప్పాలంటే నిజానికి నా ఆకాంక్ష అందుకు భిన్నమైన దానికోసం. ప్రపంచాన్ని ఉద్ధరింపచేసేందుకు పనిచేయడానికి కావాల్సిన ఆత్మశక్తి కోసం. అల్లాగైనా కూడా Nirvana నాకు లభించింది- అందుకు నా ప్రమేయం లేకపోయినా కూడా. అది అలా జరిగిపోయింది అంతే. ఎంతో

కాలంనుంచి ఉంటూన్నట్లు, శాశ్వతంగా ఉండిపోయేలా తిష్ఠ వేసుకుని ఉండిపోయింది - అలానెమ్మదిగా తరగకుండా ముందు వచ్చిన దానికంటె సమధికంగా అభివృద్ధి చెందుతూ. అయితే, మరి నేను మాయావాదాన్నెలా స్వీకరించాలి? నాకు నేనెలా నచ్చచెప్పకోవాలి? అతీత దివ్య సత్యానికి పోటీగా నిలబెట్టడానికి మాయావాదాన్ని శంకరుని హేతువాదాన్ని ఎలా స్వీకరించగలను?

నా అనుభవమే అందరూ పొందాలని నేను అనను, పర్యవసానంగా దివ్య సత్యాన్ని అనుసరించాలనీ నొక్కిచెప్పను. మాయావాదాన్ని ఆత్మసత్యంగా, మానసికవాస్తవంగా, వైశ్వానికి కష్టాన్ని (the cosmic difficulty) , వైదొలగించేదిగా వారు అంగీకరిస్తే నాకు అభ్యంతరమేమీలేదు. నాకు అభ్యంతరం దీనినెవరైనా బలవంతంగా నానెత్తిన రుద్దే ప్రయత్నం చేస్తేనే లేదా- లోకానికి ఇదే సంతృప్తి కరమైన, సర్వతోముఖ గ్రహణశక్తి సాధనమైన ఏకైక వివరణాంశం అని - నచ్చచెప్పే ప్రయత్నం చేస్తేను - నాకు అభ్యంతరం. కారణమేమంటే నిజానికి ఇది అదేమీ కాదు. ఇందుకు ఇంకా ఎన్నో వివరణలు ఉన్నాయి. ఇదేమీ సంతృప్తికరమైనది కాదు. తుదకిదేమీ వివరించేది లేదు. తన హేతువాదంలో స్వవచన వ్యాఘాతం లేకపోతే ఇది సర్వమూ మినహాయించేదే. ఎంత మాత్రమూ సర్వతోముఖమైనదీ కాదు. But that does not matter . అయినా పరవాలేదు. ఏదైనా ఒక సిద్ధాంతం తప్పకావచ్చు, ఏకపక్షంగా ఉండవచ్చు, అపరిపూర్ణమవచ్చు. అయినా కూడా ఎంతో ఆచరణ యోగ్యంగా ఉపయుక్తమవచ్చు. శాస్త్రవిజ్ఞాన చరిత్ర - The history of science - మనకు తెలియచేసేది ఇదే. నిజానికి ఏ సిద్ధాంతం కానీ - విజ్ఞాన శాస్త్రపరంగా, ఆధ్యాత్మిక తత్వ జ్ఞానపరంగా - అది బుద్ధికి ఒక ఆచరణాత్మక పరికరంగా ఉపయోగిస్తుంది. విషయపరిశోధనకు సహాయపడుతుంది. కష్టమైన

ప్రయాణంలో ముందడుగువేయటానికి ఊతకర్రలా ఉపయోగపడుతుంది. మాయావాదం ఒక బలమైన ఊతకర్ర. దానిబలం, దాని యొక్క exclusiveness and one-sidedness. ఒక ఆధ్యాత్మిక ఉద్యమానికది ఒక శక్తివంతమైన ప్రేరణ. మరిఅది ఏకపక్షంగాను, తీవ్రమైనదిగాను, ప్రత్యేకమైనదిగాను ఉండవలసినదే. బుద్ధికి తనను తానుఅధిగమించే కృషిలో జీవితం సాధారణ చైతన్యంనుంచి అతి చైతన్యం (Superconscience)లోకి పోయే కృషిలో ఒక దగ్గర దారి చూపటానికిది సహకరిస్తుంది. లేదా - ఇది మానసిక పురుష (the purusha in Mind). మానసిక, ప్రాణిక పరిధులను దాటి అనంత అతి చేతనలోనికి (into the superconscient Infinite)పోవాలని అభిలషించేది. to deny all its perceptions and all the preoccupations of the vital and see and treat them as illusions - ఇదీ సైద్ధాంతికంగా మనసుకు మార్గం - ప్రాణిక, మానసిక గ్రహణశక్తులు, నిమగ్నతలు - వీటన్నిటినీ భ్రమలుగా చూచి ప్రవర్తించటం వాస్తవంగా, తనకు తాను మనసు ఉపసంహరించుకున్నప్పడు చాలా సులువుగా - it enters easily into a relationless peace in which nothing matters - అది నిరపేక్ష ప్రశాంతతలోనికి ప్రవేశిస్తుంది. ఆ స్థితిలో దానికేమీ పట్టదు. దాని సమగ్రతలో అక్కడ ఆ స్థితిలో మానసిక, ప్రాణిక విలువలు ఉండవు. ఆ స్థితి నుంచి బుద్ధి మానసాతీత అవచేతన - సుషుప్తి - వైపుగా దౌడు తీస్తుంది. ఆ దారి చాలా గొప్పగా దానికి సుగమమవుతుంది. ఆ చలనము యొక్క సమగ్రతకు తగిన ప్రమాణంలో, గతంలో అంగీకరించి, గ్రహించిన విలువలన్నీ అవాస్తవాలుగా - భ్రాంతిగా, మాయగా- మిగిలిపోతవి. it is on its road towards immergence. అది విముక్తి పథం వైపుగా ఉన్నది.

కాబట్టి మాయావాదం, నిర్వాణానికి ఒక్కదానికే ప్రాధాన్యతనిస్తూ, మానసిక సిద్ధాంతంగా లోపాలున్నప్పటికీ, అది ఒక గొప్ప ఆధ్యాత్మిక ప్రయోజనానికి తోడ్పడుతుంది. ఎంతో ముందుకు ఉన్నతంగా ఒక మార్గాన్నిపరిచి నడిపిస్తోంది. ఒకవేళ, మనసే చివరికి మిగిలేది, దానికి మించి, అంతరాత్మ తప్ప వేరే పరిష్కారం లేదన్నా కూడా, దానిని అంగీకరించేందుకు నేను వెనుకాడను. ఇంతవరకు మనసేమో దానిగ్రహణశక్తులతోను, ప్రాణికము తన కామనలతోను ప్రాపంచిక జీవితాన్ని కలగాపులగం చేయడాన్ని బట్టిచూస్తే, అందునుంచి బయట పడేందుకు ఆశించతగిన ఉత్తమమైన మార్గంలేనపుడు, ఈ దగ్గరదారే ఉత్తమోత్తమమైనదిగా ఉంటుందికదా ! కాకపోతే నా అనుభవాన్ని బట్టి మనసుకు అతీతంగా ఒకటి ఉన్నది - there is something beyond Mind ; Mind is not the last word of the Spirit. అంతరాత్మకు సంబంధించి, మనసుది అంతిమనిర్ణయం కాదు. మనసు అజ్ఞానచైతన్యం. (an ignorance consciousness). దానిగ్రహణ శక్తులు (perceptions)తప్పకావచ్చు. కల్తీ కావచ్చు. అపరిపూర్ణంగా ఉండవచ్చు. ఒకవేళ సత్యమే అయినా అది దివ్యసత్యానికి పాక్షిక ప్రతిబింబమే అవుతుంది తప్ప, వాస్తవరూపం అవదు. సత్యచేతన అనేది ఉన్నది. చలనంలేనిది, ఆత్మపరిశీలనాత్మకం కానిది గానేకాకుండా గమనశీలమై, సృజనాత్మకంగా కూడా ఉంటుంది. నేను దానినందుకోవాలని, దాని విషయనిర్ధారణ చేసుకోవాలని అభిలషిస్తాను. అంతేకాని అజ్ఞానం దొడ్డిదారివైపునుంచే ఏమి అందిస్తుందో అది అందుకోవాలనుకోను.

- శ్రీఅరవిందులు

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు.

ముక్తి

క్రమ పరిణామ వికాసశీలియైన చైత్యాత్మకు, పరిశుద్ధాత్మకు, జీవాత్మ లేక అలౌకిక శక్తికి (self or spirit) గల తేడా స్పష్టంగా అవగాహన చేసుకోవడం చాలా అవసరం. పరిశుద్ధాత్మకు పుట్టుకగాని జన్మల జంజాటంగాని లేదు. పుట్టుక, శరీరం, బుద్ధి, జీవితానికిగాని యీ దృశ్యమాన ప్రపంచంలో మరి దేనికి గాని కట్టుబడని స్వతంత్రమైనది పరిశుద్ధాత్మ. అయితే వీటన్నిటికీ హామీగా వుంటూ, అన్నిటికీ ఆధారమైనది. అయినప్పటికీ దేనివల్లా ప్రభావితం కానిది, యే పరిమితులు లేనిది, దేనికీ కట్టుబడనిది. జీవాత్మ అందుకు విరుద్ధంగా యేదోవొక రూపంలో యీ భూమ్మీద పుడుతుంది. మరణంతో ఆ రూపాన్ని విడిచిపెడుతుంది. కానీ అది శాశ్వతమైనది కాబట్టి మరణించదు. ఒక స్థితినించి యింకొక స్థితికి, భూలోకం నించి యితర లోకాలకి తిరుగుతూ మళ్ళీ భూమికే వచ్చి స్థిరపడుతుంది. ఈ క్రమంలో జన్మనించి జన్మకి పరంపరగా ప్రయాణం చేస్తూ పరిణామ క్రమంలో మానవ జన్మస్థాయికి వికాసం చెందుతుంది. ఇదంతా జీవాత్మ క్రమ పరిణామ వికాసం. ఈ క్రమపరిమాణ వికాస జీవాత్మనే (Psychic being) చైత్యపురుష అంటాం. ఆ క్రమ పరిణామ వికాస ఫలితంగా మానవుడు భౌతికంగా ప్రాణికంగా, మేధోపరంగా చైతన్యవంతుడౌతాడు. ఆ చైతన్యమే ప్రాపంచిక అనుభవసారంతో మానవుడు దివ్య మానవుడిగా (దివ్యపరికరంగా) మారడానికి తోడ్పడుతుంది. మార్మికమైనది. అసమగ్రమైనది అయినప్పటికి తననితాను వ్యక్త పరుచుకోగల స్థితికి యెదుగుతుంది. ఇదంతా దివ్యాత్మ తెర వెనుక నుండి ప్రదర్శిస్తున్న నాటకమే. తాను అనుమతించేవరకే పరికరమైన యీ జీవాత్మ నాటకం సాగుతుంది. దివ్యాత్మ తను బయటపడే సమయం వచ్చినప్పుడు తప్పకుండా తెర

చాటునుంచి బయటకువచ్చి తన ఆదేశాలతో యీ సాధన స్వభావాన్ని దివ్యసాఫల్యం వైపు మరలిస్తుంది. ఇది అసలైన ఆధ్యాత్మిక జీవనానికి ప్రారంభం. ఇక్కడితో జీవాత్మ తనున్న బుద్ధిజీవి స్థాయి నుండి క్రమంగా వొక్కక్క మెట్టు ఆధ్యాత్మిక దశలనధిగమించి అధిమానస స్థాయికి చేరుకుంటుంది. అప్పటి వరకు యీ జన్మల రహస్యం పట్టుబడదు. నిజానికి యీ విధంగా జరగడం లేదు. ఆధ్యాత్మిక స్థాయికి ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు యీ ప్రాపంచిక జీవితం నుండి బయటపడడానికే యిష్టపడుతుంది. అదే కోరుకుంటుంది. కాని దివ్య జ్ఞానం వల్ల అంతకంటె ఉన్నత అభివ్యక్తిని చేరే అవకాశం వుందని గ్రహించాలి. అజ్ఞానం వల్ల అది సాధ్యపడదు.

గత మానవ జీవిత ప్రగతి మొత్తం చాలా అస్థిరమైన ఆధారం మీద నిలబడ్డది. యోగాలో అత్యంత వేగంగా దానిని వొక కొలిక్కి తెచ్చి స్థిరపరచి స్వాధీనం చేసుకొనబడుతుంది. అధునాతన మానవుడి మాదిరి అసమగ్రంగా కాక పూర్తి శారీరక విజయం సాధించబడుతుంది. ప్రాణికం పరిశుద్ధమవుతుంది. ఉన్నతమైన వుద్వేగ పూరితమైన, వివేకవంతమైన ఆత్మ పరలోక సంబంధంతో కూడిన దివ్యవరికరంగా వ్యక్తిని తీర్చి దిద్దుతుంది. బాహ్యవాతావరణంలోయేర్పడే ఆలోచనలకి బదులు ఆంతర్యంలోకి దృష్టి మరలి అక్కడి ఆలోచనలకి స్థానం దొరుకుతుంది. పరిణామానికి అవసరమయిన వున్నతాశయలక్షణాలు పని చేయడం ద్వారా నిమ్నస్థాయి వుద్రేకాలు, కోరికలు అన్నీ కట్టగట్టుకొని మాయమయిపోతే వాటిస్థానంలో పవిత్రాశయాలు చోటు చేసుకుంటాయి. అన్ని ఆలోచనలు, వుద్రేకాలు స్తంభించిపోతాయి.ఆత్మప్రబోధంతో, అలౌకికశక్తితో మానసికమైన సన్నిహిత సంబంధం యేర్పడి స్పష్టమైన జాగృతికలుగుతుంది. చివరికి వ్యక్తి అనిర్వచనీయ దివ్యశక్తి

సేవలో సంపూర్ణంగాలీనమయిపోతాడు. దివ్యపరికరంగా మారిపోతాడు.సత్యాత్మలో అసత్యాత్మ ఆనవాలు దొరకకుండా కలసిపోతుంది.మనిషి ఆకాంక్ష ద్వారా పరమాత్మలో ఐక్యమయిపోతాడు. అదేముక్తి,ఆ స్థితే మనిషి స్పష్టంగా గుర్తించిన స్వేచ్ఛ, శాశ్వతత్వము,అదే మానవుడి శాశ్వతత్వం కోసం చేరవలసిన లక్ష్యం.

మూలం : శ్రీఅరవిందులు

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి.

ప్రాచీన మహర్షుల కతీతంగా

హేతువాదం ప్రకారం , హేతువాదం వల్ల క్రొత్త జాతి సృష్టింపబడగలదని-అసలు-ఏజాతి అయిన కూడా సృష్టింపబడుతుందని నేను ఊహించను.అయినా నూతనసృష్టి అనే భావన ఎందుకు సహేతుకంకాదు? ప్రాచీనమహర్షుల విషయానికొస్తే వాళ్ళతో నాకేలాంటి ఇబ్బందీలేదు. ప్రాచీన ఋషులు లేక జ్ఞానులు అనుభవాల కతీతంగా పోవటం అంత దిగ్భ్రమ కలిగించేదే అయితే , ప్రతిఒక్క మహర్షి,జ్ఞాని కూడా ఏదోదిగ్భ్రమ కలిగించేది చేసినవారేమరి. బుద్ధుడు,శంకరుడు,చైతన్యుడు వగైరా-అందరూ ఏదోదుష్టమైన పని చేసినవారే! మరి అలాకాకపోతేకొత్త తాత్వికపద్ధతులు,మతాలు, యోగ సంప్రదాయాలు ఆరంభించవలసిన ఆవశ్యకత ఏమి ఉంది? ఏక్రొత్త అంశాన్ని ప్రపంచానికి తీసుకురాకుండా, వారు,కేవలం, గతపురాతన మహర్షుల, జ్ఞానుల యొక్క, జీవితాలను, అనుభవాలను పరిశీలిస్తూ, విధేయపూర్వకంగా, పునశ్చరణచేస్తూ మాత్రమే ఉంటే ఆసంచలనం కోలాహలం ఎందుకు? అయితే మీరనచ్చు-వారు కేవలం పురాతన సత్యమునే వివరించేవారు అనీ, అదీ సక్రమపద్దతిలోనేనని-అంటే మళ్లీ దాని అర్థం గతంలో

ఎవరూ సరిగా అర్థంచేసుకుని వివరించలేదనేగా,ఇదిమళ్లీ"giving the lie etc"లేదా-నీవనచ్చు-క్రొత్త మహర్షులు, జ్ఞానులు- అందరూ-శంకర,రామానుజ,మధ్వాచార్యులవారు-మొదలైన వారు ఒక్కొక్కరూ కేవలం తమకు ముందు మహర్షులు-గతంలో విసుగు విరామం లేకుండా ఒకే రకంగా చెప్పినదే చెప్తూవచ్చారు-అని Well,well but why repeat it in such a way that each "gives the lie"to the others? పరస్పరం అసత్యమును ఇచ్చి పుచ్చుకొనేలా ఎందుకీ పునరావృతి వ్యవహారం? నిజానికి ఇది గతంపట్ల దిగ్భ్రమ కలిగించే పూజ్యభావం. ఇదెంతో ఆశ్చర్యకరం, భయంకరం! ఎంతచెప్పండి. దైవము అనంతము. దివ్యసత్యఆవిష్కరణమూ ఎంతోకొంత అనంత ప్రక్రియే అయినా ఎప్పుడూ క్రొత్త విషయ ఆవిష్కరణకి, వివరణకి, బహుశ: క్రొత్త సాఫల్యతకు కూడా అవకాశం ఉంటూనే ఉండవచ్చు. ఏఅంశమూ సూక్ష్మాతి సూక్ష్మంగా ఆవిష్కృతంకాదు. సంబంధిత సర్వ విషయాలు నిశ్శేషంగా ఏఒక్క మహర్షిచేత, ఏజ్ఞానిచేత పరిష్కారంకాబడవుకూడా. అదే విషయాన్ని పదే పదే పునశ్చరణచేస్తూ, పూర్వఋషులకు అపరాధం చేస్తున్నామోనని భయంతో వణికిపోనవసరంలేదు.

- శ్రీ అరవిందులు

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు.

ఒకే సత్యము-రెండుపార్శ్వములు

(వేదాంతము-తంత్రము)

ఒకే సత్యానికి (ఏకంసత్యం)వేద,వేదాంతాలు ఒక పార్శ్వమైతే, శక్తి ప్రధానమైన తంత్రశాస్త్రము వేరొక పార్శ్వము. సత్యము యొక్క అన్ని పార్శ్వములు వాటి సారంశములలోనే ఈ యోగంలో స్వీకరింప బడుతవి కాని, గతంలో వాటికీయబడిన క్రమబద్ధమైన రూపములలో

కాదు. అవి పరిపూర్ణ ఉన్నతోన్నత ప్రాధాన్యతకు కొనిపోబడుతవి.కాని , దివ్యజ్ఞాన సూత్రములు, అత్యావశ్యకాంశములు గురించి వేదాంతము మరింత అధికాధికంగా వివరిస్తుంది. అందుచేత ఆధ్యాత్మిక జ్ఞానాన్ని చాలావరకు యధాతథంగా 'ఆర్య' పత్రిక (1914 నుంచి1920 - శ్రీఅరవిందులవారిచే ప్రచురింపబడినది) లో ప్రచురింపబడినది. తంత్రశాస్త్రము ఎక్కువగా రూపములు, ప్రక్రియలు, క్రమబద్ధీకరింపబడిన శక్తులగురించి వివరిస్తుంది. ఇవన్నీ ఎలా ఉన్నవలా స్వీకరింపబడవు. ఎందుచేతనంటే పూర్ణయోగము తనస్వకీయమైనరూపములు, ప్రక్రియలు అభివృద్ధి చేసుకోవలసి ఉన్నది. రూపాంతరీకరణ ప్రక్రియకి పరోక్షంగా, కేంద్రములు, మరింత తాంత్రిక విజ్ఞానంద్వారా చైతన్య అధిరోహణ ఉన్నది. దీనికే అధిక ప్రాధాన్యతనిస్తున్నాను. శ్రీమాతశక్తి ద్వారా తప్పించి ఏదీ జరగదు, అనే సత్యమునకు కూడా (అత్యధిక ప్రాముఖ్యత నిచ్చాను).

కుండలినీ ప్రక్రియని కేంద్రముద్వారా లేపి మేల్కొలిపి దానితో పాటు కేంద్రములను పరిశుద్ధపరచుటయే తాంత్రికవిజ్ఞానం. మనయోగంలో పరిశుద్ధీకరణకి నిర్నిబంధమైన ప్రక్రియలేదు. కుండలినీ ఉద్దీపనకి, కేంద్రములు ఉన్మీలనకి ప్రత్యేక ప్రక్రియలులేవు. మరోపద్ధతి ఉంది. ఉన్నత చైతన్యములో కలియుటకు వేర్వేరు స్థాయిలలో వాటి ద్వారా చైతన్య అధిరోహణం ఉంది. శాశించేకేంద్రముల స్తరముల (మానసిక, ప్రాణిక, శారీరక) ఉన్మీలనము ఉన్నది. అవరోహణము ఉన్నది. రూపాంతరీకరణకు ఇది కీలకం. కాబట్టి, నేను చెప్పినట్లు తాంత్రిక విజ్ఞానము ఈ రూపాంతరీకరణ యోగానికి పరోక్షంగా ఉన్నది.

శ్రీ అరవిందులు

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

బౌద్ధవాదం-ఇతరవాదాలు

బౌద్ధుల దృష్టిలో అహంకారము-దాని కొనసాగింపు అనేది కేవలం భ్రమ మాత్రమే. ఒక నిర్దిష్టమైన ప్రవాహంలో నిరంతరంగా ప్రవాహించే శక్తుల, భావనల ఫలితమే అది. వాస్తవంగా అహంకి రూపంలేదంటారు. విముక్తికి సంబంధించినంతవరకు, అది, దు:ఖ విముక్తి కొరకు అవిచ్ఛిన్నంగాసాగే బాధాయుత శక్తి ప్రవాహవిచ్ఛిన్నం. ఆ కష్టాన్నుండి విముక్తి పొందాలంటే అహంకార ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలి. ఇంతవరకు బాగానే ఉంది. కాని అది ఏవిధంగా ప్రారంభమైంది, ఎందుకు దాన్ని ఆపేయాలి, ఆ విమోచనం వల్ల పొందే ప్రయోజనం ఏమిటి, అంతా భావసముదాయము, కర్మ -ఇంతేకదా? ఇవన్నీ ఛేదించలేని రహస్యాలు. ఇదే ఇబ్బంది, మాయావాదితో కూడా. నిజానికి దేవుడు కూడా లేడు- బ్రహ్మం మాత్రమే సత్యం -ఆ బ్రహ్మతత్వం కూడా నిరంకుశం- నిరవధికం అంటారు. మాయావాదులతో కూడా ఇదే చిక్కు వచ్చిపడుతుంది. ఈ అసంగతమైన మాయావాదం ఎక్కడి నుంచి వచ్చి పడింది? ఎవరు విముక్తులౌతారు? అన్నప్రశ్నలు ఉదయిస్తాయి. అందుకే మన ప్రాచీన మహర్షులు "ఎవరూ బద్ధుడు కాలేదు. ఎవరూ విముక్తుడు కాలేదు- ఎవరూ విముక్తిని ఆశించటం లేదు" అంటారు. ఇదంతా ఎప్పటి నుంచో చేస్తున్న పొరపాటు. బౌద్ధులు కూడా ఈ విషయాన్ని చెప్పగలిగారు.

వ్యక్తిగత సంపూర్ణత్వాన్ని గురించి శ్రద్ధ తీసుకొనేది, జైన సిద్ధాంతం. మాప్రయత్నం పూర్తిగావేరైనది. అతి మానసాన్ని ఒక నూతన శక్తిగా భూతలానికి తీసుకురావడం మా ఉద్దేశ్యం. మానవుల్లో మనస్సనేది ఒక శాశ్వత చైతన్యం. అట్లాగే అతి మానస చైతన్యం శాశ్వతంగా ఉండే మానవజాతి సృష్టి మా ధ్యేయం.

గీతలో చెప్పిన యోగం మేం చెప్పే యోగం ఒకటి కాదు- కాకపోతే, గీతాయోగసారం అంతా ఇందులో ఉంది. భావన, సంకల్పం, సంపూర్ణ శరణాగతి పట్ల అనురక్తితో మా యోగం ప్రారంభమౌతుంది. అదే సమయంలో అధమ ప్రకృతిని మనం తృణీకరించాలి. మన చైతన్యాన్ని అందులోనుండి విముక్తం చేయాలి. అధమ ప్రకృతిలో కొట్టుమిట్టాడుతున్న జీవాత్మను విముక్తం చేసి ఉత్తమ ప్రకృతిలోని స్వేచ్ఛవైపు ఉద్ధరిస్తాం. ఈ ద్వంద్వ చలనం లేకపోతే, తామసికమైన, అవాస్తమైన శరణాగతి వైపు పయనించే ప్రమాదం ఉంది. ఇందులో ప్రయత్నం కాని, తపస్సుకాని, పురోగతి కాని ఉండదు. లేదా రాజసిక శరణాగతిని దైవానికి కాకుండా స్వయం కల్పిత కృత్రిమ భావానికికావచ్చు. లేదా రాజసిక అహాన్ని మరుగుపరిచి ఉంచే ఏదోదైవరూపానికి కావచ్చు. లేదా ఇంకా అధ్వాన్నమైన దానికేదైనా కావచ్చు.

అతిమానస భావన, సత్యచేతన గురించి -ఋగ్వేదం, ఉపనిషత్తులలో ఉన్నట్లు శ్రీఅరవిందులు అర్ధ వివరణ ఇచ్చారు. మానసిక, ప్రాణిక, భౌతిక సత్వానికి అతీతంగా, విజ్ఞానమయ పురుష భావనలో ఉపనిషత్తులు ఈ విషయాన్ని బీజప్రాయంగా ప్రస్తావించాయి. ఋగ్వేదంలో ఈ భావన సూత్రప్రాయంగానే ఉంది. వివరణ లేదు. హిందూ సాంప్రదాయంలో ఆ సూత్రప్రాయంగా ఉన్నది కూడా మృగ్యమైంది.

ఈ విషయాల్లోనే శ్రీఅరవిందుల సందేశం హిందూ సాంప్రదాయంతో పోలిస్తే నూతనత్వాన్ని సంతరించుకొంటుంది. ఈ ప్రపంచం కేవలం భగవంతుని లీల లేదా మాయ కాదు. జననమరణాల పరంపర నుండి విముక్తి కాదు. కాక ఇది ఒక అభివ్యక్త క్షేత్రం ప్రదార్థంలోని జీవాత్మ, ప్రకృతి - వీటియొక్క పురోగమన పరిణామ

ప్రక్రియ. పదార్థం నుండి జీవము, మనసు, దానికి అతీతంగా పయనిస్తూ, జీవితంలో సచ్చిదానంద స్వరూప సంపూర్ణ సాక్షాత్కారం పొందడం. ఇదే వారి యోగానికి ఆధారం జీవితానికి క్రొత్త అర్థాన్ని ఇచ్చేది.

శ్రీఅరవిందులు

అనువాదం : ఆచార్య యం. రాజగోపాలాచార్య

విశ్వము, భౌతిక-ఆధ్యాత్మిక వాస్తవము

(విశ్వం యొక్క) ముఖ్యమైన రెండు అంశాలను నీవు సరిగ్గా గమనించావు. అందులో మొదటిది ఈ ప్రపంచము ఒక పొరపాటో, మాయో అని తిరస్కరించక ఇది దైవశక్తి యొక్క ప్రకటన అని అంగీకరించటము, రెండవది ఆధ్యాత్మిక పరిణామమే, ఈ అభివ్యక్తీకరణకు ఒక ప్రత్యేక లక్షణం. ఇందుకు తోడ్పడేది యోగం. ఆధ్యాత్మిక, దివ్యచైతన్య పరిపూర్ణతకు మానసిక, ప్రాణిక, భౌతికాలు ఉపకరణాలుగా ఉన్నాయి. ఈ విశ్వము ఒక స్థూలభౌతికము (ప్రదార్థము) మాత్రమే కాక ఒక ఆధ్యాత్మిక వాస్తవము కూడా. జీవితము అనేక శక్తుల క్రీడ మాత్రమే కాదు. మానసిక అనుభూతులు మాత్రమే కాదు. వీటన్నటికీ మరుగున దాగి ఉన్న ఆత్మయొక్క పరిణామానికి వలసిన క్షేత్రము కూడా. మానవజీవితము ఈ సత్యాన్ని చేబట్టి దానిని మన ఆస్తిత్వానికి ప్రేరణ శక్తిగా చేసుకుని అమోఘమైన సత్యసాక్షాత్కారాన్ని కనుగొంటుంది. అంతట జీవితం సార్థకతను పొంది తనకు అతీతముగానున్న దానిగా రూపాంతరము చెందుటను కనుగొంటుంది. మన సమస్త అస్తిత్వ భాగాలు దైవముతో సమాగమము చెందిన ఫలితముగా ఐక్యత లేని ఈ భాగాలు ఉన్నత దైవ చైతన్యముతో, దాని ఉనికితో సామరస్యతను పొందునటువంటి

యదార్థాన్ని తెలుసుకుని తనదిగా చేసుకొనుట ఈ పూర్ణ యోగములో సఫలమవుతుంది.

- శ్రీఅరవిందులు

అనువాదము : యస్. త్రివేణి

అవసరమైనది ఆ ఒక్కటే.

విషయాలపై మనకు నిర్ణయించబడ్డ లక్ష్యం. విషయచింతన కాదు. విషయానుభూతి - భగవంతునికి ప్రతిరూపంగా ఎదగటం. ఆయనలో వశించి, ఆయనతో కలిసి, వారి పనులకు ఉపకరణంగా ఉండటం. వారి శక్తి ఆనందాలకు వాహిక కావటం. ఇదీ మనకు ఆదేశం.

అశుభమైన వాటి నుండి శుద్ధి గావించబడి, అతని స్పర్శచే ఆత్మపరివర్తనం పొంది, (భగవంతుని) దివ్య విద్యుత్‌నుత్పత్తి చేసే డైనమోలుగా, మనమే ప్రపంచంలో పనిచేయాలి. ఆ విద్యుత్‌లో పులకింతలు, ఆనందోత్సహాలు, వెల్లివిరిసేటట్లు మానవ జాతిని సంపన్నంచేయాలి. ఈ ప్రపంచంలో ఎక్కడ నిలిస్తే అక్కడ, మనచుట్టూ ఉండే వందలాదిజనంలో, భగవంతుని శక్తి, వెలుగు, ఆనందోత్సాహాలు నింపబడాలి; (అనంత విభూతులున్న విశ్వాత్మ)

మతవర్గాలు చర్చిలు, తత్వశాస్త్రాలు, వేదంతాలు, మానవజాతిని రక్షించడంలో విఫలమయ్యాయి, ఎందుకంటే అవి - బుద్ధికి చెందిన అంతఃశుద్ధి, దర్శనం - వీటితో కూడిన సిద్ధాంతాలు, వ్యవస్థలు, సంప్రదాయాలు, కర్మకాండ - ఇవే మానవజాతిని రక్షించగలవన్నట్లు - కంగారుగా ఏర్పాటుచేసి, జాతి రక్షణకవసరమైన ఆ ఒక్కదానిని - ఆత్మను శుద్ధి చేయడం, తద్వారా లభించే ఆత్మశక్తిని - ఉపేక్షించాయి.

అవసరమైన ఆ ఒక్కదానికొరకు మనం వెనుకకు మళ్ళాలి; క్రీస్తుబోధించిన శుద్ధి, మానవపరిపక్వత, మహమ్మద్ బోధలైన

అణుకువ (భగవంతుని పట్ల), సేవాభావము, ఆత్మసమర్పణ; చైతన్యుని బోధలైన పరిపూర్ణప్రేమ, దివ్యానందము; రామకృష్ణుని బోధలైన సర్వమత ఐక్యత, మానవునిలో దైవత్వము; వీటన్నిటిని మళ్ళీ చేపట్టాలి. ఈ (బోధనా) ప్రవాహాలను సమీకరించి, శుద్ధి చేసి పాప ప్రక్షాళన గావించే గంగ వంటి గొప్పనదిగా చేసి - భగీరథుడు తనపిత్రుదేవుల చితాభస్మాలపై వెల్లువగా గంగను పంపినట్లు - పదార్థమయ మానవ జీవితంలో మృత్యువు పై పోయాలి; తద్వారా మానవులలో ఆత్మ పునరుజ్జీవింపబడాలి; సత్యయుగం తిరిగి కొంతకాలం ప్రపంచంలోకి రావాలి. కాని ఇదొక్కటే లక్ష్యంకాదు. యోగానికి, దైవ లీలకు .... అవతార పురుషుల అవతరణ లక్ష్యం - మానవుని మళ్ళీ మళ్ళీ ఉన్నతస్థాయికి లేపాలని; వానిలో ఒక ఉన్నత - ఇంకా ఇంకా ఉన్నత - మానవత్వం అభివృద్ధి పర్చాలని; ఒక అధిక, అధికతర దివ్యసత్తాను అభివృద్ధి చేయాలని; మళ్ళీ మళ్ళీ ఈ భూమిపై అధికంగా - ఇంకా అధికంగా - స్వర్గాన్ని - మన శ్రమ పూర్తిగా ఫలించే వరకూ - తేవాలని; ఇక్కడే - ఈ భూమిపై కూడా - ఈ ద్రవ్యాత్మక ప్రపంచంలో కూడా - అందరిలో సచ్చిదానందాన్ని నింపాలని.

కేవలం తన విముక్తి కొరకో లేక కొద్దిమంది విముక్తి కొరకో పడే శ్రమ - ఉత్తీర్ణత సాధించినప్పటికీ, అత్యల్పమే. మానవాళి అందరి ఆత్మలో శాంతి, సంతోషము, పరిశుద్ధత, పరిపక్వతల కొరకు మాత్రమే జీవించే వాని శ్రమ - అతను తప్పినా, లేక పాక్షికంగా, కొద్ది కాలం మాత్రమే - ఉత్తీర్ణత సాధించినా - వాని శ్రమ సర్వశ్రేష్టము, అనంత శ్రేష్టము.

మూలం : శ్రీఅరవిందులు

అనువాదం : S.Y. సోమయాజులు.

పూర్ణయోగములోని నవ్యత

నా పూర్ణయోగం అన్ని విషయాలలో అత్యంత నవీనమైనదని నేనేప్పుడూ అనలేదు. అయితే దాని ధ్యేయంలో, దృక్పథంలో, అనుసరించే విధానాల సమగ్రతలో నూతనత్వం ఉంది.

పూర్వపు యోగ మార్గాలతో పోల్చినప్పుడే దీని నవ్యత :-

1. ప్రాపంచిక జీవితాన్ని వదిలి పెట్టి మోక్షాన్నో, స్వర్గవాసాన్నో కోరుకోవటం దీని ధ్యేయం, కాకుండా ఇక్కడి జీవితాన్ని మార్పు చేయాలనేదే ప్రధాన గమ్యం. ఇక్కడి జీవితం అప్రధానమూ కాదు, యాదృచ్ఛికమూ కాదు. అది సర్వార్థాలకు కేంద్ర స్థానము. ఇతర యోగములలో అవతరణమనేది జరిగితే అది ఆరోహణా మార్గంలో ఒక నైమిత్తిక సంఘటన గానీ లేక ఆరోహణా ఫలితమే తప్ప అక్కడ అధిరోహణమే లక్ష్యము. పూర్ణయోగంలో అధిరోహణ మొదటి మెట్టు కాగా అది అవతరణకు మార్గం మాత్రమే. అధిరోహణంలో నూతన చైతన్యాన్ని అందుకొని దాన్ని అవతరింపచేసుకోవడం ఈ యోగ సాధనకు గుర్తు, అదే ప్రత్యేకత. వైష్ణవ, తాంత్రిక సంప్రదాయాల్లో జీవితం నుంచి నిష్క్రమించడంతో సాధన ముగుస్తుంది. ఇక్కడ గమ్యం జీవితంలో దైవత్వాన్ని సిద్ధింపచేసుకోవడమే.

2. ఇక్కడ సాధించవలసింది వ్యక్తిగతంగా ఎవరికి వారు పొందగలిగే దైవసిద్ధి మాత్రమే కాకుండా పృథ్వీ చైతన్యం కోసం సిద్ధింపచేయవలసిన ఒక ఘనతర కార్యం ఉంది. అది దివ్యచైతన్య శక్తి. (అతిమానసం). అది ఇంత వరకు ఇంకా పృథ్విపై వ్యవస్థీకృతం కానటువంటిదీ, ప్రకృతిలోగానీ, ఆధ్యాత్మిక పరిధిలోగానీ క్రియాత్మకంగా లేనటువంటి ఒక చైతన్యశక్తిని (అతి - మానసిక చైతన్యాన్ని) భూమి పైకి దింపటమే ఆ ఘనతర కార్యము.

3. అది సాధించడం కోసం అనుసరించవలసిన పద్ధతిని

ప్రకటించాము కదా! దాని ఆదర్శం మాదిరిగానే అది కూడా సమగ్రమైనదీ, సంపూర్ణమైనట్టిదీ; ఒక్క మాటలో చెప్పాలంటే చైతన్యంలో, ప్రకృతిలో సమగ్రమూ, సంపూర్ణమూ అయినటువంటి మార్పు. పూర్వపు యోగ విధానాలలోని ఆచరణ యోగ్యమైన విధానాలను ఈ ప్రత్యేక పద్ధతిలోకి చేర్చుకోవటం తప్ప ఈ యోగ విధానంలోని సమగ్రత పూర్వము చెప్పిన ఏ యోగ విశేషాలోనూ కనిపించదు. నిజానికి ఇది పూర్వమే చెప్పినదై ఉంటే నేను ఇన్ని సంవత్సరాల నా సమయాన్ని వృధాచేసుకునే వాడినే కాదు. ఇంతకు ముందే ఈ మార్గం తెలిస్తే ఆ ముప్పది సంవత్సరాలలోపు అన్వేషణ లేకుండా సునాయాసంగా సులభమైనటువంటిదీ, చక్కగా కూర్చబడినటువంటిదీ, సుగమ్యమైనటువంటిదీ అయిన ఆ బాహాట మార్గంలో సురక్షితంగా నాగమ్యం చేరి యుండేవాడిని కదా! మన యోగమొక ఆధ్యాత్మిక సాహసకృత్యమే కానీ ఇదివరకు అందరూ వెళ్లిన దారిలోనే వెళ్లటం కాదు.

మన యోగసాధన కేవలం మనకోసమే కాదు, అది భగవంతుని కోసమే. అంటే భగవత్సంకల్పం నెరవేర్చటం కోసమే. దివ్యస్వభావాన్నీ, దివ్యజీవితాన్నీ మానవుల మానసిక, ప్రాణిక, భౌతిక పరిధుల్లో ప్రవేశపెట్టి మానవజీవితాన్ని పరివర్తనచేసి ఆధ్యాత్మికంగా చేయటమే. ఈ యోగానికి ధ్యేయం కేవల వ్యక్తిగత మోక్షం కాక మానవునికి విమోచనము కలిగించి పరివర్తన చేయడము. అది వ్యక్తిగతమైన ఆనందస్థితి కాక దివ్య ఆనందాన్ని భూమిపైకి తెచ్చి, దానిని ఆనందధామంగా చేయటం. అదే ఏసుక్రీస్తు చెప్పిన స్వర్గ సామ్రాజ్యం; మనపురాణాలు చూపించిన సత్య యుగము. ప్రత్యేకంగా మోక్షాన్ని కాంక్షించ నక్కర లేదు. నిత్యముక్తి కలదే ఆత్మ. బంధాలన్నీ మిధ్య. మనం బంధాలలో చిక్కుకున్నట్లు నటిస్తామే తప్ప నిజంగా బంధముక్తులం

కాదు. భగవంతుడు సంకల్పిస్తే మనకు స్వేచ్ఛ. మనలో ఉన్న ఆ పరమాత్మ మనలను ఆడిస్తే ఆడుతూ ఉంటాము. ఆయన అనుమతి, కృపా కటాక్షములు లేకపోతే మనం ఏ ఒక్కరము, భౌతిక లీలావిలాసాన్ని వదిలిపోలేము.

- శ్రీఅరవిందులు

అనువాదకులు,

డా॥ అమరవాది ప్రభావతి

డా॥ అమరవాది వెంకట రామశాస్త్రి

పూర్ణయోగ సాధనా విధానం

లక్ష్యం :- భగవత్సన్నిధిలో, దివ్యచేతనలో ప్రవేశించి, పూర్తిగా దైవంచే ఆవహింపబడడం ఈ పూర్ణయోగ లక్ష్యం. దైవాన్ని దైవం కోసం మాత్రమే ప్రేమించడం ఈ పూర్ణయోగ లక్ష్యం. మన స్వభావాన్ని దైవస్వభావంగా శృతి చేసుకొనడం, మన సంకల్పం, కర్మలు, జీవనం, సమస్తాన్ని దైవానికి ఉపకరణంగా తయారుచేయడం ఈ పూర్ణయోగ లక్ష్యం. ఒక మహాయోగి కావడమో లేక ఒక మహాత్మునిగా ఎదగడమో (అదేలాగూ జరుగుతుంది) లేదా, అహంకారం, గర్వం, లేక స్వీయానందమో ఈ యోగ లక్ష్యం కాదు. ఈ యోగం మోక్షం కోసం గాదు. కేవలం దైవమే మన లక్ష్యం.

సాధన :- నిర్ణీత మానసిక బోధన ద్వారా లేక నిర్ణీతమైన ధ్యాన విధానాల ద్వారా, మంత్రాలు లేక అట్టివే మరేవిధమైన వాటిద్వారా కూడా ఈ యోగసాధన కొనసాగదు. కాని ఆకాంక్ష ద్వారా, అంతరంలోనికి, ఊర్ధ్వంలోనికి నడిపే ఆత్మైకాగ్రత ద్వారా, దైవ ప్రభావానికి, మనకు అతీతంగా ఉన్న దైవశక్తికి, దాని కార్యకలాపాలకు, హృదయంలోని దైవసాన్నిధ్యానికి - విశ్వాసం, ఆకాంక్ష, సమర్పణల ద్వారా జరిగే -

ఆత్మోన్మీలనం ద్వారా, వీటికి అన్యమైన సమస్తాన్నీ తిరస్కరించడం ద్వారా ఈ యోగ సాధన కొనసాగుతుంది.

సాధనా విధానం : మనలో చేతనమైవున్న మొత్తం అస్తిత్వానికి దైవంతో సంపర్కం కలిగించాలి. కలిగించి మన అస్తిత్వం మొత్తాన్నీ ఆయన అస్తిత్వంగా రూపాంతరం చెందించాలని ఆ దైవాన్ని ఆవాహన చేయాలి. ఒక రకంగా, భగవంతుడే, మనలో ఉన్న నిజమైన పురుషుడే, సాధన; సాధన చేసే సాధకుడూ కూడా. అతడే మన యోగీశ్వరుడు కావాలని ఆవాహన చేయాలి. అతడే మనలోని నిమ్న మూర్తిత్వాన్ని, దైవంగా రూపొందే కేంద్రంగా, దైవ పరిపూర్ణతకుపకరణంగా ఉపయోగించుకోవాలని ఆవాహనచేయాలి. తత్ఫలితంగా, మనమిప్పుడు పూర్తిగా ఆధారపడి నివసిస్తున్న మనలోని దివ్యప్రకృతికి సంబంధించిన దివ్య భావన యొక్క చేతనశక్తి, తపశ్శక్తి వల్ల మనం సిద్ధిపొందుతాం. సర్వాన్నీ ఎరిగిన, సర్వాన్నీ సాధించగలిగిన దైవం, మనలో పరిమితికిలోనై, అస్పష్టతకులోనై వున్న దానిలోనికి అవతరిస్తుంది. అవతరించి క్రమంగా నిమ్న స్వభావం మొత్తాన్ని, వివేకవంతం, శక్తివంతం చేస్తుంది. మానవ అజ్ఞానానికి, ఐహిక కార్యకలాపానికి సంబంధించిన అన్నిస్థాయిల్లో తన కార్యకలాపాలను ప్రవేశపెడ్తుంది.

విశాలమూ, అగణనీయమూనై తన కార్యకలాపాలను ఎదురు లేకుండా కొనసాగించే, అహంకారాతీతమైన, దానికి, మన అహంకారం తన సమస్తక్షేత్రం, సాధనసంపత్తితో సహా మొత్తం, సమర్పణ చేసే విధానంగా, దీనిని మనో విజ్ఞాన పరిభాషలో చెప్పవచ్చు. నిస్సందేహంగా, ఇది దగ్గర దారీ కాదు లేదా అనాయాస సాధనగాదు. దీన్ని ఆచరించాలంటే బ్రహ్మాండమైన విశ్వాసం, అప్రతిహత ధైర్యం, అన్నింటికీ మించి ఏ మాత్రం జంకులేని ఓర్పు ఉండాలి. ఎందుకనగా

ఇందులో మూడు దశలు ఇమిడి వున్నాయి. చివరి దశలో మాత్రమే సంపూర్ణ ఆనందం వుంటుంది, వేగంగా ఫలితాలు లభిస్తాయి. సంపూర్ణమూ, సమర్థమూనైన దైవంతో అహంకారం సంపర్కం పెట్టుకోవడమంటే నిమ్న ప్రకృతి మొత్తంలో దైవం పనిచేసి, అది ఉన్నత ప్రకృతిని స్వీకరించి, దానిలా తయారుగావడం. ఆ తర్వాత కాలక్రమంలో జరిగే రూపాంతరీకరణకు సన్నద్ధం చేయడానికై అహంకారం అత్యంత శ్రమతో చేసే మహాప్రయత్నమిది.

ఏదేమైనప్పటికీ, దైవశక్తి మనకు తెలియకుండా, తెరవెనుక నుండి, మనబలహీనతను సరిదిద్ది, మనలో విశ్వాసం, ధైర్యం, ఓర్పు, విఫలమైన సందర్భాల్లో మనకు ఆసరాగా ఉండి, మనల్ని ముందుకు నడుపుతుంటుంది. ఇది వాస్తవం. అది "గ్రుడ్డి వానిని చూడగలగేట్లు " కుంటి వానిని కొండల్ని, దూకి, దాటేటట్లు చేస్తుంది. అపుడు, మనకు ప్రయోజనం కలిగించే వత్తిడి పెట్టే ఒక ధర్మాన్ని, మనల్ని రక్షించి మనల్ని, మనల్నిగా నిలబెట్టే ఒక దివ్య ధర్మాన్ని మన బుద్ధి గ్రహిస్తుంది. సర్వాన్నీ శాసించే వానితో, మానవునికి దివ్యమిత్రుడైన వానితో లేదా మనల్ని అన్ని వడిదుడుకుల నుండి కాపాడే జగజ్జననియైన దివ్యమాతతో మన హృదయం భాషిస్తుంది.

- శ్రీఅరవిందులు

అనువాదం : కోనేరు వెంకటేశ్వర రావు

పూర్ణయోగానికి ముఖ్యంగా మూడు విశిష్టతలు.

నిమ్నప్రకృతి మీద ఊర్ధ్వశక్తి సంపూర్ణంగా పనిచేసేటప్పుడు మూడు విశిష్ట లక్షణాలను కలిగి ఉంటుంది. మొదటగా, అది, కొన్ని ప్రత్యేక ప్రయోజనాలను ప్రతిపాదించే యోగవిధానాలలో మాదిరిగా

ఒక స్థిరమైన పద్ధతి ప్రకారమూ, ఒకదాని తర్వాత మరొకటిగా సాగే క్రమగతిలోనూ పనిచేయదు, కాని ఒక రకమైన స్వతంత్రతతో, చెదరినట్లుగా ఉన్నప్పటికి క్రమమైన తీక్షణతతో ఒక ప్రయోజనాన్ని ఉద్దేశించి, తాను పనిచేస్తున్న వ్యక్తి స్వభావానుసారముగా నిర్ణయింపబడినదై అతని ప్రకృతి అందించే వాటిలో ఉపయోగపడే ముఖ్యమైన భాగాల ద్వారాను, పరిశుద్ధికి, పరిపూర్ణతకు అది సమర్పించే అడ్డంకుల ద్వారాను పనిచేస్తుంది. కాబట్టి, ఒకరకంగా, ప్రతిమనిషి ఈ మార్గంలో తనదైన యోగపద్ధతిని కలిగిఉంటాడు. అయినప్పటికీ, అందరికీ వర్తించే కొన్ని సర్వసాధారణమైన విశిష్టఫలితాల ఆధారంగా, ఎప్పటివలె ఒకేమాదిరి, యాంత్రికంగా అనుకరించేవిగా ఉండవు. అలాలేకపోయినా సంయోజనకరంగాను, శాస్త్రీయ పద్ధతిని ఏర్పర్చుకునే వీలు కలిగించేవిగా ఉంటాయి.

రెండవది, ఇది పనిచేసేవిధానం, పరిపూర్ణమైనదవటం మూలంగా, పరిణామక్రమంలో మన ప్రకృతి ఏవిధంగా ఒక వ్యవస్థగా రూపుదిద్దుకున్నదో దానిని, ఇంకా, అందులో అత్యావశ్యకమైన వాటిని వేటినీ తిరస్కరించకుండా అన్నింటిని దివ్యత్వంగా మార్పుకు లోనయ్యేటట్లు ఒత్తిడి చేస్తుంది. ఒక బ్రహ్మాండమైన శిల్పి హస్తంలో అంతా వశం చేసుకోబడినదై, ఇప్పడు ఎంతో అస్తవ్యస్తంగా ప్రకటితమవాలని చూస్తున్న దానికి ఒక స్పష్టమైన రూపంగా పరివర్తన చేయబడుతుంది. అలా ఎప్పుడూ ముందుకు సాగే అనుభవంలో, మనకు ఈ నిమ్న సృష్టి ఏవిధంగా నిర్మితమైందో, అటువంటి దానిలోని ప్రతిదీ ఎంతగా వికృతమై లేదా అల్పమై లేదా నీచమైనదైనప్పటికి, సామరస్యపూరితమైన దివ్య ప్రకృతిలో అది కొద్దోగొప్పో వక్రీకరించ బడినదైనాగాని లేదా ఒక మూల పదార్థపు అసంపూర్ణ రూపం లేదా కర్మగాగాని అవుతుందనే దానిని గ్రహించటం మొదలుపెడతాం. ఒక

కమ్మరి తన కార్ఖానాలో ముడిపదార్థాన్ని ఏవిధంగా కొలిమిలో సమ్మెట దెబ్బలతో ఒక వస్తువుగా మలచుతాడో, ఆవిధంగా దేవతలను మానవజాతి పూర్వీకులు వర్ణించిన విధానాన్ని వేద ఋషులు చెప్పారో, అది మనం అర్థం చేసుకోవటం మొదలుపెడతాం.

మూడవది, దివ్యశక్తి మనలో ఈ పూర్ణయోగానికి జీవితాన్నంతా సాధనంగా వినియోగిస్తుంది. పరిసర ప్రపంచంతో మనకు సంప్రాప్తమయ్యే ప్రతి అనుభవం, ప్రతి సంసర్గం, అవి ఎంత అల్ప విషయాలైనా లేదా ఘోరవిపత్తులైనా దానిని ఈ పనిలో ఉపయోగించుకుంటుంది. ఇంకా, ప్రతి అంతరంగ అనుభవం, ఏ మాత్రం సానుభూతికి కూడా నోచుకోని బాధ లేదా దుర్భర అవమానభరితమైన పతనం కూడా పరిపూర్ణతా మార్గంలో ఒక మెట్టుగా అవుతుంది. ఇక మనం మనలో విప్పారిన దృష్టితో ప్రపంచంలో దేవుని విధానాన్ని ఏమాత్రం వెలుగు కూడా కానరాని అస్పష్టమైన మసకలో కాంతిని నిక్షిప్తంచేసిన ఆయన ఉద్దేశాన్ని, బలహీనులు, పతితులైన వారిలోని దారుఢ్యాన్ని, అతిఘోరమైన నికృష్టమైనదానిలోని పరమానందాన్ని గుర్తించడం మొదలు పెడతాం. దేవుని విధానం క్రింది స్థాయిలో పనిచేస్తున్నా, పై స్థాయిలో పనిచేస్తున్నా ఒకటేనని మనం చూస్తాం. తేడా అల్లా, అది ఒకదానిలో ప్రకృతిలోని అధోచైతన్యం ద్వారా బహునెమ్మదిగాను, అస్పష్టతతోను కొనసాగబడితే, మరొక దానిలో అదిచాలా వేగంగా, ఆత్మ-చైతన్యంతో ఉంటూండగా, ప్రభువు హస్తాన్ని ఆ పనిముట్టు అంగీకరిస్తుంటుంది. ఈ దివ్య ప్రకృతిలో జీవితమంతా యోగం, అంతర్గతంగా అభివ్యక్తమైన దైవ అన్వేషణ.

ఈ ప్రయత్నంలో ఆత్మ - జాగృతిని పొందగలగడమనే పరిణామ దశ చేరికను యోగం సూచిస్తుంది. కాబట్టే, అది ఆవిధంగా ఒక వ్యక్తిలో సవ్యంగా పూర్తవుతుంది. ఆవిధమైన, దిగువస్థాయిలోని

పరిణామక్రమం ఇదంతా. అస్థిరమైన చలిత చాలనాలసమీకరణ, సుస్థిరత, ఏకాగ్రత.

- శ్రీఅరవిందులు

అనువాదం : డా॥ టి. ప్రసన్నకృష్ణ

రూపాంతరీకరణ అంటే

(శ్రీఅరవిందులతో ముచ్చట్లు - నిరోద్బరన్ - స్మృతి ఆధారంగా)

యస్ : స్వభావ తీవ్రతలో మార్పుకు, రూపాంతరీకరణానికి ఏమిటి తేడా ?

శ్రీఅరవిందులు : స్వభావం అంతా నీ అంతరంగ సిద్ధికి నమూనాగా అమరి ఉంటుంది. అదే రూపాంతరీకరణ. నీవు ఏది సాధించావో అదే బాహ్యంగా నీ స్వభావంగా ముందుకు తోసుకుని వస్తుంది.

నేను మూడు రూపాంతరీకరణలు గురించి మాట్లాడాను. అవి : చైత్యపురుష, ఆధ్యాత్మిక, అతిమానస రూపాంతరీకరణలు. చైత్య పురుష రూపాంతరీకరణ పొందిన వారు చాలా మంది ఉన్నారు. హృదయంలో దైవసాక్షాత్కారం గురించి మాట్లాడిన క్రైస్తవ పుణ్యమూర్తులు వారు. ఆధ్మాత్మిక రూపాంతరీకరణ ఆత్మసాక్షాత్కారాన్ని పైన ఉన్న అనంతుని సూచిస్తుంది. అనంతుడు శాంతి, జ్ఞానానంద స్థితికారకుడు. అంతకుమించి గమనశీలుడు.ఈ రూపంతరీకరణ బహుజటిలం. దానికి అతీతంగా ఉన్నది అతిమానస రూపాంతరీకరణము. అదియే సత్యచేతన. ఇది దివ్య ప్రయోజన సాఫలత్యకు పరిశ్రమిస్తూ ఉంటుంది.

యస్ : అంతరంగసిద్ధి పొందినవానికి ఆ కాంతిలో రూపాంతరీ కరణము వెన్నంటే తప్పనిసరిగా ఉంటుంది.

శ్రీఅరవిందులు : (ఇది) తప్పనిసరికాదు. స్వభావానికి సంబంధించిన భాగంలో తీవ్రత కొంత తగ్గవచ్చు. కాని మొత్తం రూపాంతరీకరణ స్వయం చాలకమైనది కాదు. (not automatic). అది అంత సులువైనది కాదు. లేక (మహారాష్ట్ర యోగి) తోనా ప్రథమ సమావేశం తర్వాత, నా శాంతి నిశ్చలానుభూతి నన్ను ఎన్నడూ వదిలిపోలేదు. కాని బాహ్యస్వభావం ఎన్నో ఆందోళనలకు లోనైంది. అలాంటి ప్రతిసారీ శాంతి, నిశ్చలతలను సుస్థిర పర్చటానికి కృషిచేయవలసి వచ్చేది. ఆ తొలి అనుభవం తర్వాత నుంచి, నా యోగలక్ష్యం అంతరంగస్థితికి అనుగుణంగా, దాని యొక్క తీరులోనే స్వభావాన్ని కూడా తీర్చిదిద్దటమే అయింది. నేను నా సాధనలో చేసినది అదే.

రూపాంతరీకరణం అంటే నా భావన స్వభావంలో ఏ కొంతో మార్పు తీసుకురావటం కాదు. ఉదాహరణకు - పవిత్రత, లేదా నైతిక పరిపూర్ణత లేదా యోగ సిద్ధులు పొందటం (తాంత్రిక పద్ధతిలో వలె) లేదా అతీయ చిన్మయ శరీరాన్ని పొందటం - ఇలాంటివేమీ కాదు. రూపాంతరీకరణం అనే మాట ఒక ప్రత్యేకభావనలో ఉపయోగించాను. చైతన్యం మార్పు. మౌలికంగా విలక్షణమైన పూర్తి మార్పు. భౌతిక, ప్రాణిక జంతు ప్రపంచంలోకి మానసిక జీవిగా మనిషి ఆవిర్భవించాడు. ఇంతకంటే ప్రముఖము, ఉన్నతము, అయిన జీవుడుగా బహువిస్తారమైన సమగ్రతను సంతరించుకునే దానికి ఒక భద్రమైన, దృఢమైన ప్రగతిలో చైతన్యం పరిణమించాలి. నేను ఊహించిన రూపాంతరీకరణము అదియే. అంతకంటే తక్కువ జరిగినా, అందుకు తగినట్లుగా కనీసం ప్రారంభమేనా కాకున్నా, అదిసాధించే దిశగా ఒక ప్రాథమిక దశలోనైనా పురోగతి జరుగకపోయినా, నా లక్ష్యం నెరవేరబడనట్లే, పాక్షికమైన, కలగాపులగంగా, అసంపూర్ణ సిద్ధి నేను

అభిలషించిన యోగానికి, జీవితానికి, సరిపడదు.

సిద్ధి వల్ల పొందిన దీప్తి దివ్య అవరోహణం కానేరదు. సిద్ధి తనకు తాను అవశ్యంగా సత్వమును పరిపూర్ణంగా రూపాంతరీకరించదు. అది చైతన్యమునకు ఒక ఉన్మీలనాన్ని, ఉన్నతిని, విస్తృతిని కలుగచేస్తుంది. ఫలితంగా పరమపురుషవిభాగాన, మౌలిక మార్పులు లేకుండా, పరమ ప్రకృతి విభాగాలలోను సిద్ధి పొందవచ్చు. ఆధ్యాత్మిక చైతన్య శిఖరాగ్రాన దీప్తి పొందవచ్చును. గాని, నిమ్నభాగాలు పునపటివలెనే మిగిలిపోతాయి. అలాంటి సందర్భాలెన్నో నేను చూశాను. నిజమైన రూపాంతరీకరణ చోటు చేసుకునే ముందు (దివ్య) కాంతి బుద్ధిలోనికి మాత్రమే కాక మొత్తము సత్వమంతటిలోనికి - దిగువ భౌతికములోనికి, ఇంకా నిమ్నస్థాయికి తప్పనిసరిగా రావాలి. మానసిక దీప్తి మనసును ఆధ్యాత్మికరించవచ్చు లేదా, కొంతవరకు ఏదోరకంగా మార్చవచ్చు. కాని ప్రాణిక స్వభావాన్ని మారుస్తుందని చెప్పలేం. ప్రాణికసత్వములోని దీప్తి ప్రాణికచలిత చాలనాలను పరిశుద్ధపరిచి విస్తరింప చేయవచ్చు. లేదా దానిని నిశ్చలపర్చి కదలకుండా చేయవచ్చు. కాని శరీరాన్ని శారీరకచైతన్యాన్ని యధాతథంగా ఉంచవచ్చు. 'అచేతనంగా వదలివేసి సమతూకాన్ని కదిలించి చేయవచ్చు. దివ్యకాంతి అవరోహణ చాలదు. పూర్తిగా ఉన్నతతర చైతన్య అవరోహణ, దానితోపాటు, దానియొక్క దివ్యశక్తి శాంతి జ్ఞానాలు, దివ్యప్రేమానందాలు - తప్పనిసరి. ఈ అవరోహణ, విముక్తి కలుగచేయటానికి సరిపడివచ్చుకాని పరిపూర్ణత చేకూర్చదు. అంతస్సత్వాన్ని మార్పు చేయసరిపడదు. పోతే బాహ్యసత్వం అపరిపూర్ణ ఉపకరణంగానే మిగిలిపోతుంది. భావ ప్రకాశకంగా లేక వికృతంగాను వ్యాధిగ్రస్థంగాను ఉంటుంది. తుదకి సాధన వల్ల సాధింపబడే రూపాంతరీకరణ అసమగ్రమే అవుతుంది. సత్వము అతిమాన

సీకరింపబడాలి. చైత్యపురుషీకరణము మాత్రమే చాలదు. ఇది ఒక ఆరంభము మాత్రమే. ఆధ్యాత్మకీకరణము. ఉన్నత చైతన్య అవరోహణా కూడా అసమగ్రమే. ఇంతవరకు ఇది మధ్యంతరానుభోగమే. పరమమైన సాధనకు అతిమానస చేతన, దివ్యశక్తి కావాలి. అంతకు తగ్గినదేదైనా చాలినంత వరకు వ్యక్తిచేత యోచింపబడవచ్చు. కాకపోతే - ఎప్పటికైనా ఏదో సమయంలో నిశ్చితమైన ఒక పెద్ద ముందడుగు వేయవలసిన భూచైతన్యానికిది అసమగ్రమే అవుతుంది.

- శ్రీఅరవిందులు

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

త్రివిధ రూపాంతరీకరణ

చైత్యపురుష రూపాంతరీకరణము :

మనో ప్రాణిక దేహాలకు ఆలంబనగా హృదయానికి వెనుక చైత్య పురుష సత్వము - The Psychic being - నిలిచి ఉన్నది. చైత్య పురుష రూపాంతరీకరణములో మూడు ముఖ్యాంశాలు ఉన్నవి. 1. బాహ్యమనో, ప్రాణిక, శారీరకములు నిగూఢ గుప్త మనో ప్రాణిక శారీరకములకు ఉన్మీలనమై వాటి స్పృహలో ఉండటం. 2. ఉన్మీలిత చైత్య పురుష లేక జీవాత్మ ముందుకు వచ్చి మనో ప్రాణిక దేహాలను దైవత్వం వైపు మళ్లించి వాటిని నియంత్రించటం. 3. నిమ్నసత్వము అంతా ఆధ్యాత్మిక సత్వమునకు ఉన్మీలనమై ఉండటం - చివరిగా వచ్చే ఈ మార్పును The Psycho - spiritual part of the change - అనవచ్చు.

పరిణామక్రమంలో చైత్య పురుష అంశ మానవసత్వములో దైవీ అంశకి సంబంధించిన భాగము. ఇది దైవము నుంచి లేదా ఉన్నత ప్రకృతి నుంచి వచ్చే వాటన్నిటికీ ప్రతిస్పందిస్తుంది. కాకపోతే వర్తమాన

పరిణామక్రమానికి అతీతంగా ఏమాత్రం వ్యక్తిని తీసుకుని వెళ్లదు. సత్వములోని అసుర, రాక్షస, పిశాచ, జంతు - సంబంధిత నిమ్న స్వభావాలకు లొంగదు. దైవీకరణమును నిరోధించే వాటికి వేటికీ కూడా లొంగదు.

ఆధ్మాత్మిక రూపాంతరీకరణము : ఆధాత్మికీకరణం అంటే అర్థం ఉన్నత భూమికల నుంచి శక్తి శాంతి దివ్యానందాలు, స్వచ్ఛ జ్ఞానకాంతులు - వీటి అవరోహణ. ఇది అధిమానసం నుంచి అతిమానసానికి చెందిన ఉన్నత స్థరాలలో ఏదో ఒకదానికి చెంది ఉంటాయి. ఎందుకంటే వీటిలో ఏదో ఒక దానికి జీవాత్మపండి జీవన్ముక్తి ఫలం ఇస్తుంది. ఇది వ్యక్తిగత రూపాంతరీకరణమునకు దోహదపరుస్తుంది. ఇంతవరకు రూపాంతరీకరింపబడిన ఉపకరణాత్మక దివ్య ప్రకృతి విశ్వేశ్వరుని కార్యసాధనకు వినియోగింప బడేటంత వరకే కాని అంతరంగ జీవాత్మ నిశ్చలమై, స్వేచ్ఛగా దైవంతో ఐక్యమై ఉంటుంది. కాకపోతే ఇది వ్యక్తిగతంగా అసంపూర్ణ రూపాంతరీకరణ. వ్యక్తిగత పరిపూర్ణ రూపాంతరీకరణ అతిమానస పరిణామం చోటు చేసుకున్నప్పుడు మాత్రమే, సాధ్యం. అంతవరకు స్వభావం ఎన్నో అసంపూర్ణతలకు నిలయమై ఉంటుంది. ఉన్నత స్థరాలలో జీవాత్మ వీటన్నిటికీ అతీతంగా ఉంటుంది. వీటిని గురించి పట్టించుకోదు. వీటివల్ల ప్రభావితం కాదు. అంతస్సత్వము, భౌతిక అంతస్సత్వముతో సహా, వేటివల్లా ప్రభావితం కాక స్వతంత్రంగానే ఉంటుంది. అధి మానసము (The Overmind) పరిమితులకు లోబడి ఉంటుంది. సమర్థమైన దివ్యజ్ఞాన, దివ్యశక్తి క్రియాకలాపాల పరిమితులలో, పాక్షికమైన పరిమిత దివ్యసత్యమునకు లోబడి ఉంటుంది. అతిమానసములో మాత్రమే (in the supermind) పరిపూర్ణ సత్యచేతన (The full Truth - conscious-ness) అవిష్కృతమవుతుంది.

అతిమానస రూపాంతరీకరణ : చైత్యపురుషపరివర్తన ఆధ్యాత్మికీకరణ పరిపూర్తికి దోహదం చేస్తుంది. అలాగే తొలి ఆధ్యాత్మిక పరివర్తన అతిమానస రూపాంతరీకరణ పరిపూర్తికి నాంది పలకాలి. ఈ పురోగమన చర్యలన్నీ ఇంతకుముందు వాటిలాగే పరివర్తన చెందేవే. పరిణామక్రమంలో మౌలికంగా పరిపూర్ణ పరివర్తన అవిద్య ఆధారంగా భౌతిక అస్తిత్వంలో నుంచి దివ్య జ్ఞాన ఆధారంలోనికి అతిమానస శక్తి యొక్క చర్య నేరుగా కల్పించుకోవటం వల్ల మాత్రమే రాగలుగుతుంది.

ఇదే మూడవది చివరిది అయిన రూపాంతరీకరణ స్వభావ లక్షణం కావాలి. ఇది జీవాత్మ ప్రస్థానానికి ముగింపునిస్తుంది. జీవాత్మ, అజ్ఞానం లేక అవిద్య (Ignorance) ద్వారా పయనిస్తుంది. తన చేతన, జీవనము, శక్తి, తన అభివ్యక్తరూపము - సర్వమూ పూర్తిగా పరిపూర్ణమైన సార్థకమైన ఆత్మజ్ఞానంతో అనుసంధాన పరుస్తుంది. పరిణామశీలమైన దివ్య ప్రకృతి సిద్ధమై ఉండుట గమనించిన సత్యచేతన అందులోకి అవరోహణం కావాలి. అప్పుడది అంతర్గత అతిమానస మూలాధార సూత్ర విముక్తికి మార్గం సుగమం చేస్తుంది. ఆవిధంగా భౌతిక విశ్వంలో తెరచాటున ఉన్న జీవాత్మ, పరమాత్మల అభివ్యక్తీకరణంగా, అతిమానస ఆధ్యాత్మిక జీవి సృష్టింపబడాలి.

- శ్రీఅరవిందులు

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

నిర్వాణ శిఖరాలకు అతీతంగా

ఓ ఆత్మా! సంతోషానికిది సమయం కాదు సుమా !

అవధిలేని పరమాత్మ నిశ్శబ్దం చేరుకున్నావు.

ఆనందమయ దివ్య అగాధంలోకి చొచ్చుకొని పోయావు.

నిత్యదైవం వైపు మహాయాత్రలో ఏ నిర్జీవ తీరంలో

నీ ఆత్మలక్ష్యం, నీ ఆత్మశక్తిని వదిలివేశావు ?

నక్షత్రాల మధ్య భగవంతుని ప్రయోజనం కోసం నువ్వు

ఏంచేశావు ?

(భూమి నుండి) తప్పించుకుని పారిపోతే నీకు విజయం,

కిరీటం లభిస్తాయనుకున్నావా ?

తెలియని లోకాల నుంచి ఏదో చేయడానికి నువ్వు

ఏతెంచావు.

కాని ఏదీ పూర్తి కాలేదు, ప్రపంచం ముందుకు సాగుతోంది.

భగవంతుని విశ్వ కార్యం సగం మాత్రమే నెరవేరింది.

'భగవంతుడు లేడు' అనే శాశ్వత సంకేతం నిన్ను చేరి

నీ కళ్లలోకి తొంగిచూసి, నీ హృదయాన్ని హతమార్చింది.

కాని "నేనున్నాను" అనే అమర ప్రణయేశ్వరుని అమృత

చిహ్నం ఎక్కడ ?

హృదయంలో దాగిన అమరత్వ (మాధుర్యాలు) ఎక్కడ ?

విశ్వాగ్ని సృష్టికర్తను వినుతించే వేద సూక్తమెక్కడ ?

ఓంకార మంత్ర ప్రణవ నాదమెక్కడ ?

ఎక్కడ గొప్పసాధికార దివ్య వాక్కు ?

ఆనంద, ప్రశాంతి తీరాల మధ్య వారధి ఎక్కడ ?

దివ్యవధువు ఆకాంక్ష, అతిలోక సౌందర్య విభవమెక్కడ ?

సముజ్వల శత్రువులు చుంబించే మందిర మెక్కడ ?

(సర్వమానవాళిని) సంరక్షించే (సు) హాస మెక్కడ ?

సృష్టిని దాటి మెరిసే స్వర్ణ శిఖరమెక్కడ ?

మార్మిక దివ్య జీవన గర్భంలో ఇది కూడా దివ్య సత్యమే.

చీకటి ముసుగు తొలగింది. సర్వజ్ఞ ఈశ్వరుని

మహనీయఛాయను చూశాము.

కాని కాంతి తెరను ఎవరు తొలగించారు ?

ఎవరు చూశారు విశ్వవిభుని పార్థివ శరీరాన్ని ?

భగవంతుని జననం, దివ్యకార్యాలు మనసుకందని అద్భుత

రహస్యాలు

సృష్టి చిట్టచివరి అధ్యాయం ఏమిటో అంతుచిక్కదు.

ఈ అసంపూర్ణ ప్రపంచనాటకం అపరిష్కృతంగానే

మిగిలిపోయింది.

తన మారు వేషంలో విశ్వలీలా వినోది నవ్వుకుంటున్నాడు.

ఒక 'రూపం' మానవ తేజస్సు వెనుక,

ఒక 'నామం' బంగారు ప్రతిమ వెనుక

అంతిమ రహస్యం దాగివుంది.

ఒక సుదీర్ఘ శ్వేత వర్ణ రేఖ గమ్యంగా కనిపించింది.

కాని ఇంకా దూరంగా, వర్ణనాతీత సూర్య సువర్ణ తీరాలు

మెరుస్తున్నాయి.

ఆది, అంతంగా కనిపించింది ఒక విశాల ద్వారం మాత్రమే.

నిత్యత్వంలోకి అది చివరి సోపానం.

ఒక నేత్రం కాల రహితంలోకి తెరుచుకుంది.

తాను ఇచ్చిన రూపాలను అనంతం తిరిగి తీసుకుంది.

భగవంతుని చీకటిలో, నిర్మల కాంతిలో ప్రయాణిస్తూ

ఆయన శత కోటి కిరణాలు సత్య చైతన్య సూర్యుణ్ణి

చేరుకుంటాయి.

పరాత్పరుని శూన్య చిహ్నం ఒకటి వుంది.

ప్రకృతి ఆచ్ఛాదన తొలగింది.

భగవంతుణ్ణి ప్రత్యక్షం చేసుకుంది తనలో

కాని ఆమె మహిమాన్విత శూన్య సీమలో సర్వస్వం ఉంది.

బలీయమైన ఆమె బంధాలన్నీ మన నుండి తెగిపోతే,

ఆత్మ అజ్ఞానం నశిస్తుంది, ఆత్మకాదు.

శూన్యంలో సుందర అమృత వదనం దాగి ఉంది.

'భగవంతుడు లేడు, సృష్టికి పరమార్థంలేదు' అని అంటే

చాలదు - అది సర్వజ్ఞత్వం కాదు.

విశ్వమహాప్రళయం భగవంతుని తుది పలుకు కాదు.

అదే జీవిత పరమావధి కాదు, ఆత్మ ప్రస్థాన చరమాంకం

కాదు.

ఈ అపురూప విచిత్ర ప్రపంచం పరమార్థం అది కానే

కాదు.

అనువాదం : కె. యజ్ఞన్న

(శ్రీఅరవిందుని 'సావిత్రి')

సమాచార పత్రం

2008 ఫిబ్రవరి నెలలో కార్యక్రమములు ఈ విధంగా వుండగలవు.


21 ఫిబ్రవరి - శ్రీమాత 130 వ జయంత్యుత్సవములు. 22 నుండి 27 వరుకు సావిత్రి స్టడిసెషన్స్ - డా॥ అలోక్‌పాండే గారితో బీచ్ ఆఫీస్ హాలునందు సాయంత్రం గం॥5.00 లనుండి గం॥ 6.45 ని॥ వరకు (మధ్యలో 15ని॥ విరామం). దీనికి అందరూ ఆహ్వానితులే.

28 ఫిబ్రవరి :- అరోవిల్లి స్థాపన (1968) వార్షికోత్సవాలు.

29 ఫిబ్రవరి :- పృథ్విపై అతిమానస ఆవిర్భావం (1956) వార్షికోత్సవం

నాదియా (ఉ.ప్ర.) బ్రాంచి వారు అక్టోబరు 6,2007న 'శ్రీఅరోబిందో కే జీవన్ కా ఆధ్యాత్మిక పక్ష్' అను విషయం పై శ్రీ పి.యం. సక్సేనా (విశ్రాంతి) డిప్యూటి కమీషనర్ (ట్రేడిటాక్స్) గారిచే ఒక కార్యక్రమం నిర్వహించబడింది. 13 అక్టోబర్ 2007న "ఉపనిషత్తుల అధ్యయనావశ్యకత" అను విషయంపై శ్రీ విష్ణుమోహన్ తివారి, ఎయిర్ మార్షల్ (విశ్రాంతి) గారిచే ఉపన్యాసం ఏర్పాటు చేయబడింది.

కడలూరు (తమిళనాడు) కేంద్రంవారు తమ నాల్గవ వార్షికోత్సవం జరుపుకొన్నారు. శ్రీ అరవిందాశ్రమం, శ్రీఅరవింద అంతర్జాతీయ విద్యా కేంద్రానికి చెందిన శ్రీ. కె. బాలసుబ్రహ్మణ్యం గారిచే "విద్యారంగంలో శ్రీ మాతారవిందులు తెచ్చిన విప్లవం" అనువిషయంపై ఉపన్యసించినారు శ్రీ వరద రాజన్, శ్రీ మహాలింగం, శ్రీ యమ్. సుభాష్ మరియు శ్రీమతి ధనలక్ష్మి (అరోవిల్లి) ప్రభృతులు ఇందులో పాల్గొనిరి.



Rs. 15

సుందర భవితవ్యం

అఖిల

అఖిల భారత పత్రిక, ఫిబ్రవరి 2008

దైవానికి అంకితమైన పుణ్యదినం, (ఫిబ్రవరి 29) ప్రత్యేక సంచిక

సుందర భవితవ్యం

భవిష్య సౌందర్యాన్ని గురించి లోకానికి తెలియచెప్పడానికి శ్రీఅరవిందులు దయచేశారు.

ప్రపంచం, ఉజ్వల వైభవం వైపుగా కదలిపోతున్నదనే ఒక ఆశని కాక, దృఢవిశ్వాసాన్ని కలుగచేయటానికి వారు అవతరించారు. ప్రపంచ మొక దురదృష్టకర సంఘటన కాదు; అభివ్యక్తీకరణ దిశగా కదిలిపోయే అద్భుతం.

అందమైన భవిష్యత్తు గురించి దృఢవిశ్వాసం లోకానికి ఆవశ్యకం. శ్రీఅరవిందులు ఆ హామీని అనుగ్రహించారు.

- శ్రీమాత

<u>విషయసూచిక</u>

Part - II

<u>గీతా వ్యాసములు</u> (ధారావాహికం)

గీతాధ్యయనమెందుకు?

సృష్టి ప్రయోజనం

విముక్తి పొందడానికే అయితే యీ సృష్టి ప్రారంభించడం యెందుకు? విపరీతమైన యీ సంఘర్షణ వల్ల కలిగే లాభమేమిటి? ఇంతబాధ దేనికి? పోనీ, సృష్టింపబడిన దానిలో కొంతైనా, బాహ్యంగా కన్పించేదైనా అత్యంత విషాదంగా, నాటకీయంగా యెందుకుండాలి? ఇదంతా అందులోనించి విముక్తి కోసమే అని చెప్పడానికనుకుంటే యిది యెప్పటికీ ప్రారంభించకుండా వుంటేనే బాగుండేది కదా! ఈ సృష్టి సర్వస్వాన్ని, లేదా ప్రపంచస్వరూపాన్ని గమనిస్తే యిదంతా ఒక వికృత పరిహాసంగా అనిపిస్తుంది.

విషయాంతరాంతరాలలోకి చొచ్చుకుపోవాలి. స్వార్థబుద్ధే కాదు, అహం యొక్క పైపొరలన్నీ తొలగించి పూర్తిగా నిరహంకారంగా ఏ మినహాయింపులు లేకుండా, సంపూర్ణంగా, నిష్పక్షపాతంగా విషయ పరిశీలనకావించినపుడు వ్యక్తి పరమాత్మ ప్రణాళికని అర్థం చేసుకునే సమర్థత కలిగినవాడవుతాడు. అప్పడది వికృత పరిహాసం యెంత మాత్రం కాదని అర్థం చేసుకుంటాడు. ప్రారంభం కంటే తిరిగి వచ్చే మార్గం కాస్త యిరుకైనదే తప్ప వక్రమార్గం మాత్రం కాదని తెలుసుకుంటాడు. తాననుకున్న దానికి విరుద్ధంగా సృష్టి మొత్తం ప్రాణికి తన ఆహ్లాదాన్ని, సౌందర్యాన్ని, గొప్పతనాన్ని, మహోన్నత జీవిత వైభవాన్ని, శాశ్వతాభివృద్ధిని, నిత్య పురోగామితత్వాన్ని ప్రభోధించడానికే అని అర్థం చేసుకుంటాడు. అదే సృష్టి ఆనందం, సౌందర్యం, ఘనత. అప్పడు సృష్టిలో ప్రతివస్తువు అర్థవంతంగా కనిపిస్తుంది. అప్పడెవరూ యీ సంఘర్షణకి, బాధలకి విచారించరు. ప్రతిఒక్కరిలో పరమాత్మ లక్ష్యాన్ని గుర్తించాలనే కుతూహలం కలుగుతుంది. దివ్య లక్ష్యాన్ని గుర్తించే సాధనలో పూర్తిగా నిమగ్నమయి దృఢ విశ్వాసంతో విజయాన్ని సాధిస్తారు.

మూలం : శ్రీమాత

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి

పరమాత్మ ప్రణాళిక

అలా ముసుగులో నున్న అతీత శక్తి సింహాసనం అధిష్టిస్తుంది. పుడమి యెదను అదిమి వూపిరాడనివ్వని తమస్సు గాఢతరమయినపుడు మనిషి కుహనా బుద్ధి మాత్రమే దీపం. నిశీథిలో దొంగలా ఒకడు వక్రమార్గంలో చాటుగా తన యింటిలో చొరబడతాడు.

ఒక అస్పష్ట దివ్య వాక్కు ఆదేశిస్తుంది. ఆత్మ మన్నిస్తుంది. ఒక (దివ్య) శక్తి మానసాంతర మందిరాన్ని వశపరుచుకుంటుంది.

ఒక ముగ్ధ మోహన మాధుర్యం మూసిన జీవిత కవాటాలను తెరుస్తుంది. నిరోధించేలోకాన్ని జయిస్తుంది సౌందర్యం.

(దివ్య) సత్యతేజము ఆశ్చర్యంగా ప్రకృతిని వశం చేసుకుంటుంది. హృదయాన్ని దివ్యానందానికి నిర్బంధిస్తుంది ఒక దేవరహస్యం. (అంతే) భువి దివ్యత్వానికి అనుకోకుండా యెదిగిపోతుంది. పదార్థంలో ఆధ్యాత్మిక తేజం వెల్లివిరుస్తుంది. ప్రతిదేహంలో భగవదర్పితంగా జీవనం జ్వలిస్తుంది. తారాగీతికలలో రాత్రి మేల్కొంటుంది. రోజులు ఆనంద తీర్థయాత్రలే అవుతాయి. మన సంకల్పమే అనంతుని శక్తి తీవ్రత. ఆలోచనలు ఆధ్యాత్మిక రవి కిరణాలు. ఏ వొక్కరికీ యింతవరకు అర్థం కానిదేదో కొద్దిమంది దర్శించగలుగుతారు. జ్ఞానులు మాటలతో (కాలక్షేపం చేసి) నిద్రిస్తుండగా పరమాత్మ పైకెదుగుతాడు. సమయం ఆసన్నమయినప్పుడు తప్ప రాబోయేది మనిషి తెలుసుకోలేడు. నమ్మకం కుదరదు పనిపూర్తికాకుండా.

మూలం : శ్రీఅరవిందులు (సావిత్రి, పే॥55)

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి.

ప్రపంచ చరిత్రకొక మలుపు

ప్రపంచ చరిత్ర ఇంతవరకూ కనీవినీ ఎరుగని ఒక మలుపు తిరిగే అసాధారణ సమయంలో మనం ఉంటున్నాము. ఎన్నడూకూడా ఇంతటి ద్వేషము, రక్తపాతము, అస్తవ్యస్త పరిస్థితులతో కూడిన చీకటి రోజులను మానవుడు అనుభవించలేదు. అయితే అదేసమయంలో మునుపెన్నడూ కూడా ఇంతటి ఉత్సాహభరిత ఆశావహ భావన ప్రజలలో జాగృతంకాలేదు. ఎవరికి వారు హృదయ నాదాన్ని పరిశీలించుకుంటే మనమందరం కూడా ఒక నూతనసన్మార్గాన్వేషణలో సౌందర్య సామరస్యాలతో సదాచార సౌభ్రాతృత్వాలతో కూడిన ఒక నూతన ఏలుబడి కోసం సచైతన్యంగా ఎదురుచూస్తున్నట్లు తెలుస్తుంది. కాని ఇప్పుడున్న ప్రపంచ పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగానే కనిపించవచ్చు. అయితే తెల్లవారే ముందు రాత్రి గాఢ అంధకారంగానే ఉంటుందనే విషయం మనందరికీ తెలుసు. అందువల్ల ఇప్పుడున్న చీకటి, రాబోయే ఉషోదయానికి సూచికే కదా! ఇంతగా ఈదీర్ఘ భయంకర కాళరాత్రి ఉన్నట్లే, రేపటి అరుణోదయం కూడా అంతటి సుందర ప్రకాశమానంగా వెలుగులు చిమ్ముతూ ఉండవచ్చుకదా! పీడకలతో కూడిన రాత్రి తర్వాత నవచైతన్యంతో లోకం మేలుకోదా! (If winter comes can spring be far behind?) భౌతిక ప్రాణికాల తో వ్యవహరించే మానసిక శక్తిపై ఆధారపడిన నేటి నాగరికత ముగియ బోతోంది. అది ప్రపంచానికి ఏం చేసిందని మనం ఇక్కడ చర్చించ వద్దు. ఒక నూతన ఆధ్యాత్మిక శకం రాబోతున్నది. మానవ పరిపాలన పూర్తి అయింది. దైవ రాజ్యం రాబోతున్నది.

దానికిగాను సదవగాహనతో మనం చేయవలసింది ప్రస్తుత అంధకార, కల్లోల పరిస్థితులను కాంతిమంతము, సామరస్యభరితము చేయటానికి తగిన మార్గాలను అన్వేషించడమే.

దానికిగాను అనేక మార్గాలు సూచించబడినాయి. రాజ్యాంగ బద్ధమైనవి, సాంఘిక, నైతిక, మతపరమైనవి. అయితే ఇవేవీ కూడా ఆ గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించలేక పోయాయనే చెప్పవచ్చు. ఒక నూతన ఆధ్యాత్మిక భావం పాదుకొలుపుతేనే మానవులలో నవచైతన్యం వెల్లివిరిసి సాధకులంతా అనుక్షణం తమకు అడ్డు కలిగిస్తున్న కష్ట పరంపరలను అధిగమించగలరు. ఒక నూతన ఆధ్యాత్మిక జ్యోతి అవతరించ బోతున్నది. మున్నెన్నడు యెరుగని ఒక దివ్య, నవ్య ఆధ్యాత్మిక శక్తి దైవీభావ వీచిక భువిపై ప్రభవించి, ప్రసరించి, రూపుదిద్దుకుని, అభివ్యక్తీకరింపబడుతుంది.

మూలం : శ్రీమాత

అనువాదం : అమరవాది ప్రభావతి

అమరవాది వెంకట రామశాస్త్రి

భూమిపై అతిమానస అవతరణ

1956 ఫిబ్రవరి 29

బుధవారం యధావిధిగా ధ్యానం జరుగుతున్న సమయం :

ఈ సాయం సంధ్యా సమయంలో దైవ సన్నిధి ఎంతో స్పష్టంగా, భౌతికంగా మన మధ్య ప్రస్ఫుటమౌతున్నది. నేను ఈ విశ్వాన్ని మించిన ఒక సజీవమైన సువర్ణమయ రూపాన్ని ధరించాను. నా ముందు ఒక పెద్ద బరువైన బంగారపు తలుపు వుంది. ఆ తలుపే ఈ లోకాన్ని దైవానికి వేరుచేసే మధ్య అడ్డు. నేనుదాన్ని చూస్తూనే ఒకే ఒక చైతన్య ప్రకంపనంతో " ఇక సమయం వచ్చేసిందని గ్రహిస్తూ, దృఢంగా సంకల్పించి, నా రెండు చేతుల్తో ఒక బంగారు సుత్తిని పైకి తీసుకొని ఒకే ఒక్క దెబ్బ కొట్టాను. అంతే ఆ బంగారపు తలుపు కాస్తా తునా తునకలై పోయింది. "

అంతే. అప్పుడు అతి మానస ప్రకాశ, శక్తి, చైతన్యాలు అమిత వేగంతో నిరాటంక ప్రవాహధారలుగా భువిని ముంచెత్తవచ్చాయి.

1956

ఫిబ్రవరి 29-మార్చి 29

ప్రభూ! మీరు సంకల్పించారు, నేను నెరవేర్చాను
ఒక నూత్న ప్రకాశం భువిపై వెల్లివిరిసింది.
ఒక క్రొత్త లోకం ఆవిర్భవించింది.
ఏవి జరిగి తీరుతాయని ప్రమాణ పూర్వకంగా
చెప్పడం జరిగిందో, అవన్నీ నెఱవేర్చబడినాయి.

మూలం : శ్రీమాత

అనువాదం : సి.హెచ్ హర్షవర్ధన్.

అతిమానస అవతరణ పర్యవసానం

మన ఈ భువిపై గల సృష్టిలోనికి అతిమనస్సు అవతరించినందు వల్ల మానవాళికి కలిగే ప్రయోజనమేమిటి?

అజ్ఞాన, అచేతనా ప్రపంచంలో జన్మించినప్పటికీ, ఆధ్యాత్మిక అస్తిత్వానికి, ఆధ్యాత్మిక ప్రకృతికి సంబంధించిన వెలుగు, శక్తి, ఆనందాల చేతనకి యెదిగి, వికసించగల, సామర్థ్యం ఈ మానవ జాతికి ఉన్నది. అలాంటి జాతికి అతిమనస్సు అవతరణ వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?

అతి మనస్సు, దానిసత్య-చేతన (ఋత-చిత్) ఎంతో మహోన్నతమైన ఒక సృజన శక్తి. భౌతిక జీవనంలోనికి అది అవతరించడమంటే, ఏ విధమైన ప్రాముఖ్యత లేని ఏదో ఒక నూతన దృశ్యాన్నో లేక ఉన్నత విషయాన్నో ఆ జీవితానికి జత చేయడం మాత్రమే కాదు. లేదా మిగిలిన భౌతిక జీవనాన్ని పెద్దగా ప్రభావితం చేసే ఫలితాలనివ్వని, పరిమితమైన ప్రాధాన్యం కలదాన్ని ఆ జీవితంలో ప్రవేశ పెట్టడం కూడా కాదు. లేదా దానిని ఆ జీవితం ముందుంచడం కూడా కాదు.

ఏ పదార్థ ప్రపంచంలో జోక్యం చేసుకోవాలని అతిమనస్సు అందులోకి అవతరించిందో, దానిమీద అది గొప్ప ఫలితాన్ని సాధించలేక పోవచ్చు. పృథ్వీ జీవన దృక్పథంలో గాని, వికసనంలో గాని సమూలమైన మార్పును తీసుకురాలేకపోవచ్చు. అయినా ముఖ్యంగా మొత్తం మానవ జాతిమీద, బ్రహ్మాండమైన ప్రభావం చూపించడంలో మాత్రం అది విఫలం కాదు.

ఆ ప్రభావం, అది తీసుకొచ్చే మార్పు ఎంతో మహానీయంగా, అపారంగా వుంటుందని చెప్పకతప్పదు.

అది, అతిమనస్సును ఇచట ప్రతిష్ఠించడం, అతిమానస జీవుల జాతిని భువిపై పెంపొందించడం మాత్రమే గాకుండా, మనస్సును ఉద్ధరించే, దాని రూపాన్నే మార్చివేసే పరివర్తనను, మనస్సులో తీసుకొస్తుంది. ఆ పరివర్తనకి అనివార్య పర్యవసానంగా, మానసిక జీవియైన మనిషి చేతనలో మార్పుసంభవిస్తుంది. అదేవిధంగా అతని జీవనాధార సూత్రాలలోనూ, జీవన రూపాలలోనూ, కార్యాచరణ విధానాల్లోనూ, అతని మొత్తం జీవననిర్మాణంలో, జీవన సరళిలో సమూలంగా దాని రూపాన్నే మార్చివేస్తుంది. అతి మానస చేతనలోనికీ, అతిమానస జీవితంలోనికి మనిషి ప్రవేశించేందుకు మార్గం సుగమం చేస్తుంది.

అటువంటి సమూలమైన రూపాంతరీకరణవల్లే అతిమానస జాతి సృజించబడుతుందని మనం గ్రహించాలి. ఎందుచేతనంటే, అంతకంటె తక్కువ స్థాయి రూపాంతరీకరణమే అయినప్పటికీ, చేతనలో చెప్పకోదగ్గ ఉద్ధరణ, వికాసం వల్ల, దైహిక యంత్రాంగంలో మార్పువల్ల, దాని ఆంతరిక మరియు పరిణామాత్మక మానసిక, ఆధ్యాత్మిక సామర్థ్యాలు, శక్తులవల్ల, తన, ఆదిమ జంతుస్థాయి నుండి మానవ జాతి పరిణామమిది. కాని అటువంటి సంపూర్ణ రూపాంతరీకరణ ఇంకా జరగకపోవచ్చు. కాని సత్య-తత్వం ఇంత వరకూ, ఇచటగల, జ్ఞానాన్వేషణ చేస్తున్న అజ్ఞాన స్థితిని తొలగించింది. పాక్షిక జ్ఞానాన్నైనా సాధించ

గలిగింది. ఇక అపుడు మానవ మనస్సు వెలుగు సంధ్యల మధ్యంతర మార్గంలో నివసించదు. అజ్ఞాన సేవకునిగా, దానికి సహాయకారిగా కాకుండా, సత్యం, దోషం కలిసిన మిశ్రమ జ్ఞానాన్ని సరఫరా చేసేదిగా ఉండదు. వెలుగుతో నిండి, తన్ను తాను తెలుసుకొన్న శక్తిగా, అతిమానస అవతరణ పర్యవసానంగా, మానవమనస్సు తయారుకాగలదు.

మనస్సుకు మూలాధారం అతిమనస్సు. మనస్సు, అతిమనస్సు యొక్క నిమ్న స్థాయి, ఒక ప్రత్యేక కార్యంకోసం పరిమితమై, సత్యాన్ని స్వీకరించడానికి తగినంతగా ప్రకాశవంతమైన ఒక పాత్రగా, కనీసం, తాను నిర్వహించే కార్యాలు దోషరహితంగా చేయగలిగేట్లు, అతిమనస్సు అవతరణ పర్యవసానంగా, ఈ మనస్సు తయారుకాగలదు.

అతి మనస్సులేక సత్య-చేతనకు సంబంధించి నిమ్నస్థాయిలో, పరిపూర్ణ మనస్సు లేదా ప్రకాశ మనస్సుతో, వైశ్వానిక అజ్ఞాన పాలనలో గల ప్రస్తుత పరిస్థితుల నుండి విముక్తమయే, పృథ్విపై భౌతిక దేహంతో నివసించే నూతన మానవజాతి తయారవుతుంది.

ఏదేమైనప్పటికీ ఆ మానవ జాతి, సత్యాన్ని స్వీకరించి, మనస్సుకు సంబంధించినంత వరకూ, సమస్త శక్తులనూ, సాధ్యం చేయగల సామర్థ్యం కలిగి వుంటుంది. కనీసం ఆలోచనలోనూ, జీవితంలోనూ అతిమనస్సు యొక్క నిమ్నస్థాయినుండి జీవన సరళిని కొనసాగించే జాతిగా ఒక నూతన మానవజాతి, అతిమనస్సు అవతరణ పర్యవసానంగా భువిపై తయారవుతుంది.

భువిపై దివ్య జీవనమని మనం చెప్పకొంటున్న జీవితంలో, ఆ జీవన సరళి ఒక భాగంగా తయారవుతుంది. పూర్తిగా అజ్ఞానంలో లేదా అజ్ఞాన ప్రభావం క్రింద గాకుండా, దివ్య జ్ఞానంలో జరిగే పరిణామ ప్రారంభాలుగా ఆ జాతి జీవన విధానాలుంటాయి. కాలక్రమేణా ఇది మొత్తం మానవాళినంతా ఆలింగనం చేసుకుంటుందా, లేక ఆమానవుల్లో బాగా పురోభివృద్ధి సాధించిన కొద్దిమందికే పరిమిత

మౌతుందా అనేది, పరిణామంలోనే ఉన్న ఉద్దేశ్యంమీద ఆధారపడి వుంటుంది. లేదా విశ్వానికి మార్గదర్శకత్వం వహించినడుపుతున్న విశ్వాతీతలేక, విశ్వగత దివ్య సంకల్పం మీద ఆధారపడి వుంటుంది. పృథ్విపై అతి మనస్సు అవతరణను మాత్రమేగాక దాని సమస్త సహజ పర్యవసానాలు ఒక అతి మానస జాతిలో వాస్తవరూపం దాలుస్తాయని మనం భావించాం.

ఒక సంపూర్ణ నూతన కార్యాచరణలో నూతన మానవ జాతికి సంపూర్ణ పురోభివృద్ధికి, నూతన సృష్టి క్రమంలో ఆ జాతికోభద్రమైన స్థానం, అతిమానస అవతరణ పర్యవసానంగా లభిస్థాయని కూడా మనం భావించాం.

మూలం : శ్రీఅరవిందులు

అనువాదం : కె .వి.రావు

భవిష్య మానవుడు

భవిష్య మానవుని లేక అతి మానస మానవుని కల్పన చేసుకోవటంలో మనం ముందుగా జాగ్రత్త వహించాలి. ప్రస్తుత సాధారణ మానవుని నమూనాగా స్వీకరించి, అతనిని ఉన్నతంగా పెంపు చేయటం, పరిపూర్ణంగా తీర్చిదిద్దటం లాంటి పొరపాటు చేసే అవకాశం లేకపోలేదు, కాబట్టి దీని నుంచి తప్పించుకోవటానికి మనం జీవ పరిణామక్రమం నుంచి నేర్చుకున్న పాఠాలను శ్రద్ధగా అధ్యయనం చేయాలి.

ఒక నూతన ఆధారసూత్రం, ఒక నవచైతన్యం, ఒక నూతన శక్తి - ఈ భూమిపై వీటి అభివ్యక్తీకరణ, - ఒక నూతనజీవజాతి ఆవిర్భావం ప్రకటిస్తుంది. ఇది మనం గమనించాం. అదే సమయంలో క్రొత్త జీవజాతి, గతంలో లేని కొన్ని నూతన చైతన్య శక్తులను సంతరించుకుంటుంది. గతంలో తనకు స్వతస్సిద్ధంగా ఉండే కొన్ని

శక్తులను కోల్పోతుంది. ఉదాహరణకు - ఇంతవరకూ దివ్య ప్రకృతి తుది పరిణామాభివృద్ధి దశలో ఉన్న మనిషికి పూర్వీకుడైన కోతికి, మనిషికి ప్రముఖంగా కనపడే తేడా ఏమిటి? కోతిలోని ప్రాణిక శక్తి, శరీర దృఢత్వం, సమర్థత పరిపూర్ణగరిష్ట స్థాయికి చేరుకోవటం గమనిస్తాం. ఆ శారీరక దారుఢ్యం, శక్తులను, తర్వాత ఆవిర్భవించిన జీవజాతి (మనిషి) కోల్పోయాడు. మనిషి అయితే అత్యద్భుతంగా చెట్లు ఎక్కడం, తలక్రిందులుగా మొగ్గలు వేయడం, అగాధాలు, కొండలు అవలీలగా దాటడం లాంటి శక్తులను కోల్పోయాడు. ప్రత్యామ్నాయంగా (కోతికిలేని) నిర్మాణాత్మక హేతువాద శక్తి, బుద్ధి, వివేకం మనిషికి సంక్రమించాయి. మనిషితోనే భూమి మీద మనో జీవనం ఆరంభం అయింది. మనిషి సారభూతంగా మనోజీవి. మానసిక సంభావ్యతలు కోతిలో నిద్రాణంగా ఉన్నట్లుగానే మానసాతీత సంభావ్యతలు మనిషిలో ఉన్నాయి. ఇతరలోకాలు, ఇతర ప్రజ్ఞలు, ఇతర చైతన్య భూమికలు భవిష్యమానసాతీత వాగ్దానాలుగా మనిషిలో నిద్రాణంగా ఉన్నవి. వాటిని తాను సంభావించుకోగలడు.

నిజానికి కొంతమంది, అతితక్కువ మనుష్యులు అతీత లోకంలో నివసిస్తారు. అదే మనం ఆధ్యాత్మిక లోకం అంటాం. కొంతమంది నిజంగానే ఆ అతీతలోక నివాసులుగా అవతరిస్తారు. అయితే వారు అసాధారణంగా ఉంటారు. వారు జాతికి దారిచూపే పురోగాములు. భవిష్యసిద్ధికి బాటలు వేసేవారు. అసాధారణ మనుష్యులు గా దేశకాలాలలో అలాఅలా విసిరేసినట్లుగా ఉంటారు వారు. ప్రత్యేక లక్షణాలతో కనపడతారు. క్రొత్తగా ఆవిర్భవింపబోయే నవజాతికి నమూనాలు వారు.

నేటి మానవుడు హేతువాదం చేత జీవితాన్ని నిర్దేశించు కుంటున్నాడు. మానసిక కార్యకలాపాలు తనకు సర్వసాధారణం. గమనించి చూడటం (Observation) అనుమాన ప్రమాణాలు తనకు

విజ్ఞాన సాధనాలు. హేతువాదం చేత, హేతువాదం ద్వారా జీవితంలో నిర్ణయాలు తీసుకుని మార్గనిర్దేశం కావించుకుంటాడు, లేదా కావించుకుంటున్నాను అని అనుకుంటాడు.

క్రొత్త జాతిది అంతర దృష్టి, అంతఃకరణ ప్రవృత్తి (intuition) వీటిచేత జీవితం నియంత్రమవుతుంది. అంటే సూటిగా అంతరంగ దివ్య నియమగ్రహణ శక్తి చేత నిర్దేశించబడుతుంది. కొంతమంది మానవులకు వాస్తవంగా అంతఃకరణ ప్రవృత్తి యొక్క అనుభూతి నిస్సందేహంగా కలుగుతుంది - అడవుల్లో నివసించే గొరిల్లాలకి వాస్తవంగా క్షణిక వివేకము కలిగినట్లుగానే మానవాళిలో అంతశ్చేతన నలవర్చుకున్నవారు సద్యోంతర దృష్టి తాలూకు ప్రజ్ఞకలవారు (the faculty of intuition) ఎంతో కొంత మంది ఉంటారు. నిర్మలమైన చూపుటద్దంవలె, మంద పవనం లేని నాటి నిశ్చల సరోవరంలా మనసు సంపూర్ణంగా నిశ్శబ్దమై ఉన్న వేళ, నక్షత్ర కాంతులు పైనుంచి నిశ్చలోదకంలో అలవోకగా ఒదిగి ఉన్నట్లు, లోనున్న సత్యచేతన -అతిమానసము-యొక్క దివ్యకాంతి నిశ్శబ్ద మానస సరోవరంలో వెలుగొంది సద్యోంతర దృష్టి ఉద్భవిస్తుంది. అటునుంచి నిశ్శబ్దవాక్కును వినటానికి అలవాటు పడినవారికి ఇదే వారి క్రియాకలాపాలకు పురిగొల్పే ప్రేరణ అవుతుంది. సాధారణ మానవులు అయితే హేతువు కనపర్చే చిక్కుదారులు పట్టి అగమ్య గోచరులుగా పోతారు. వారు (క్రొత్తజాతి) అంతఃకరణ జీవన ప్రవృత్తి, ఉన్నతసహజ ప్రచోదనయై, బలమైన, నమ్మకమైన ఆ చేయూతతో సూటి మార్గాన పోతారు.

ఈ ప్రజ్ఞ ఇప్పటి జాతికి అసాధారణం, అపురూపము. కాగా-భవిష్యమానవుడికిది సర్వసామాన్యము అవుతుంది. కాని బహుశః దీని ఎడతెగని ఆచరణ, హేతువాద ప్రజ్ఞలకు హానికరమవుతుంది. కోతి యొక్క అత్యంత భౌతిక (శారీరిక) సామర్థ్యం మానవుడు కోల్పోయినట్లుగానే మానవుని యొక్క అత్యంత మానసిక సార్థ్యమును - తనని తాను, ఇతరులను- మోసగించే మానసిక ప్రజ్ఞ అతిమానస మానవుడు కోల్పోతాడు.

మనిషి తన మస్తిష్కం గురించి ఎంతో గొప్పగా చెప్పకుని గర్వపడుతూ ఉంటాడు. నిజమే. కాని ఇక మీదట నుండి తనలో అంతర్గతంగా, నిర్బంధంలో ఉన్న ఉన్నతతర శక్తిని విముక్తం కావించు కుని తన మేధోపరమైన శక్తి దీనికి సమంకాదని ధైర్యంగా ప్రకటించు కోవాలి. ఆవిధంగానే అప్పడు అతిమానస శక్తికి మార్గం సగమవు తుంది. ఇక మీదటనుండి ఏకాగ్రతతో అతిమానస శక్తిని కనుగొని, దీనిపైనే ధ్యాస కలిగి ఉండాలి. ఇకనుంచి తన వేదాంతము, కళలు, విజ్ఞాన శాస్త్రము, నైతిక సూత్రాలు, సంఘజీవనము, సాధారణ ప్రవృత్తులు మనసు చుట్టూ పరిభ్రమించే శిక్షణలు కాబోవు. మానసిక జీవనానికి అతీతంగా ఉండే ఉన్నతతర దివ్యసత్యాన్వేషణ మార్గాలుగా భౌతిక జీవనంలోకి అతిమానస శక్తిని తీసుకుని వస్తాయి. ఈ అన్వేషణయే వాస్తవమైన దానికై చేసే అన్వేషణ అవుతుంది. మరి ఇదే సర్వోన్నత సత్యము, స్వభావము కాబట్టి.

కాకపోతే, ఆ (నిజ) సత్వమునకు మనము ఇంకా యెదగలేదు. ఎదగాలి. అదే కావాలి. we have to become. కాని అది నీషే కీర్తించిన బలమైన ప్రాణిక ఇచ్ఛాశక్తి కాదు. not the strong vital will, but a spiritual will and spiritual nature. ఆధ్యాత్మిక సత్వము, ఆధ్యాత్మిక స్వభావము. మనం అతిమానసం గురించి ప్రస్తావించేటపుడు బాహ్యంగా శక్తివంతము, అపరిపూర్ణము అయిన నీషే యొక్క Superman భావనతో (Confuse) పొరబడకూడదు.

Superman అనే మాట నీషే సృష్టించాడు. ఎవరైనా భవిష్యమానవ జాతిని గురించి ప్రస్తావించినపుడు నీషే యొక్క Superman భావన మనకిష్టం ఉన్నా లేకున్నా వెంటనే స్ఫురిస్తుంది. వర్తమాన అసంతృప్తికర మానవజాతి నుంచి Superman వెలువడాలి అనేది వాస్తవంగా మన తక్షణ కర్తవ్యం. ఇది నిజంగా వివేకవంతమైన భావనయే. వాస్తవానికి ఆయన సూత్రం మన యొక్క లక్ష్యం - " to

become ourselves." మనం నిజంగా మనం కావాలి. అంటే మనిషి తన యొక్క స్వస్వరూపమును తెలుసుకోవలసి ఉన్నాడు. తన నిజస్వభావానికనుగుణంగా తనకు తానుగా - ఏ బాహ్య ప్రేరణ లేకుండా మనుగడ సాగించవలసినవాడుగా ఉన్నాడు. కాకపోతే నీషే చేసిన పొరపాటు మనం చేయకూడదు. అతని అతి మానవుడు భూతద్దంలో చూపబడినవాడు. అతిశయోక్తిగా చెప్పబడినవాడు. శక్తియే (not spiritual) అతని ప్రాబల్యం. మిగిలిన మానవీయ లక్షణాలన్నీ శక్తి బరువుకి అణగద్రొక్కబడుతవి. అలాంటిది మనకు ఆదర్శంకాదు. ఇపుడు మనకు బాగా కనిపిస్తున్నది అదే. ఈ శక్తి - కేవలం శక్తి ఆరాధన మనలను ఎక్కడికి తీసుపోతోందో చూస్తున్నాం. బలవంతుడు చేసే అత్యాచారం - ఖండఖండాల సర్వనాశనానికి దారితీస్తుంది.

ఇది కాదు. Supermanhood కి మార్గమిలా కానే కాదు. అతిమానసమానవత జీవాత్మ పరిపూర్ణ వికసనంలోనే ఉన్నది. మానవుడు ఆధ్యాత్మీకరణకి ఒక్కసారి అంగీకరించగలుగుతే మాత్రం అంతా మారిపోతుంది. సర్వమూ సుగమమవుతుంది. తనకుతానుగా తన సత్వములో సత్యసిద్ధిపొంది దానికి విధేయంగా ఉన్నప్పడు ఉన్నత ఆధ్యాత్మిక జీవన పరిపూర్ణత లభ్యమవుతుంది. తన నిజస్వభావం తాను తెలుసుకొని, అదే తాను అవాలి. ఇది జంతు సహజ ప్రవృత్తి వలె, అచేతన కౌశలం కాకూడదు. అంతః కరణ ప్రవృత్తిలో పరిపూర్ణంగా, సమగ్రంగా చైతన్యవంతం కావాలి.

భవిష్యత్తులో, ఆధ్యాత్మిక పరిణామం మానవాళికి దివ్య భవితవ్యం కాబోతుంది. ఇది గుర్తించి ఇందుకు సహకరించినవారు మానవుని భవిష్యత్తుకు సహకరించిన వారవుతారు. ఈ నవయుగంలో మానవునికి అత్యావశ్యకమైనది నేటిమానవాళి ఆధ్యాత్మిక మానవాళిగా పరిణామం చెందటం లేదా పరివర్తన చెందటం. ఎలాగంటే జాంతవిక

మానవుడు గొప్ప మానసిక మానవుడుగా పరివర్తన చెందినట్లుగానే.

వాళ్ళు ఎలా ఉంటారంతే - ఒక ప్రత్యేకమైన నమ్మకానికి, మతానికి నిబద్ధులై ఉండరు. ఎవరి నమ్మకాలకి వారిని వదిలేస్తారు. ఆధ్యాత్మిక పరివర్తనయే వారికి ప్రధానం. వారునమ్మేది అదే. ఈ పరివర్తన బాహ్య యంత్రాంగం వల్ల లేదా వ్యవస్థలవల్ల వస్తుందని పొరబడరు. ఇది ప్రతివ్యక్తి అంతరంగంలో అనుభవించి జీవించవలసిన సత్యం అని తెలుసుకుంటారు. అలాకానపుడు వాస్తవం కాబోదు అని తెలుసుకుంటారు. దీని నెన్నటికీ మరువరు.

మత సంబంధమైన నమ్మకాలు, ఆరాధనావ్యవస్థలు అప్రధానమవుతాయి. అలాగే నైతిక నిబంధనలు, ప్రవర్తనాని యమావళి, ఆచారాలు కూడా. ఇవన్నీ వాటి ప్రాధాన్యతను కోల్పోతాయి.

వాస్తవానికి మానవ జీవితంలో నైతిక సమస్య అంతా ప్రాణిక, మానసిక ఇచ్ఛా శక్తుల యొక్క ప్రచోదనల పెనుగులాటలో కేంద్రీకృతమై ఉంటుంది. వ్యక్తిగత, సాంఘిక జీవనాలు ప్రాణిక ఇచ్ఛా శక్తికి విధేయంగా ఉంటే అవి నైతిక జీవనాలు అవుతవి. ప్రాణిక, మానసిక ఇచ్ఛా శక్తులు రెండూ కూడా అతిమానసానికి విధేయంగా, మానసిక జీవనాన్ని అధిగమించిపుడు నిజమైన ఆధ్యాత్మిక జీవనం - అతి మానస జీవనం- ఆరంభమవుతుంది. ఎందుకంటే అతిమానస జీవుని ధర్మము, న్యాయము తన అంతరంగంలోనుంచి ఉద్భవిస్తుంది. అదే దివ్య శాసనంగా ప్రతివ్యక్తి కేంద్రంలో ప్రకాశిస్తుంది. ఆ కేంద్రంనుంచి జీవనాన్ని శాసిస్తుంది. దివ్య శాసనం అభివ్యక్తీకరణలో బహుళంగాను, మూలాధారంలో ఒక్కటిగాను (ఏకమేవ) ఉంటుంది. ఏకత్వం సామ రస్యంతో కూడిన సర్వోన్నత దివ్య ఆదేశంగా భాసిస్తుంది.

మూలం : శ్రీమాత

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు.

సుందర భవితవ్యం

అంతా మారుతుంది, ఈ యాంత్రిక ప్రపంచాన్ని తలక్రిందులు చేసే ఇంద్రజాల సువ్యవస్థ అలరారుతుంది. ఈ మానవ లోకంలో మహనీయ అతిమానవ జాతి పరిఢవిల్లుతుంది.

ప్రకృతి జ్యోతిర్నివహ శిఖరాలలో, పరమాత్మ భూమికపై జీవన సామ్రాజ్య చక్రవర్తిగా దివ్యమానవుడు అభిషిక్తుడవుతాడు.

ఈ భువనాన్ని స్వర్గసీమగా మారుస్తాడు. మనిషి అజ్ఞాన హృదయాన్ని దైవంవైపు, సత్య మహత్వంవైపు సముద్ధరిస్తాడు. మనిషి మర్త్యత్వాన్ని దివ్యత్వ దిశగా లేవనెత్తుతాడు. పరిమిత సరిహద్దుల నుండి ఒక మహాశక్తి విముక్తమవుతుంది. మృత్యుదేవతకరాళ హస్తాలకు అందని ఔన్నత్యాలపై మర్త్యత్వం తేజరిల్లుతుంది. సమున్నత జీవన శిఖరాలు అమృతత్వపు మహాలోచనలతో ప్రదీపిస్తాయి. జీవన పునాదులలో (పేరుకున్న) చీకట్లను భగవత్ మహత్కాంతి మటు మాయం చేస్తుంది. పరిణమించే కాల ప్రస్థానంలో సృష్టి సర్వస్వం ఒకే దివ్య ప్రణాళికగా విరాజిల్లుతుంది. ఒక దివ్య సామరస్యం భువన నియతిగా మారుతుంది. సౌందర్యం, ఆనందం జీనవ సంవిధానాన్ని పునర్నిర్మిస్తాయి. పార్థివ శరీరం సైతం భగవంతుడ్ని స్మరిస్తుంది. మర్త్యత్వం (వలయం) నుండి ప్రకృతి ఉపసంహరించుకుంటుంది. పరమాత్మ మహాగ్నిశిఖలు తమోమయ జగత్తును నడుపుతాయి.

ఆకాంక్షించే ఆలోచనా తీరాలలో ఒక మహావిజ్ఞానం మహత్స్వానికి భగవంతునికి సంవిధాన పరుస్తుంది. అతి మనస్సు ఈ ప్రపంచంలో భగవత్ రోచిర్నివహాన్ని ప్రసరింపచేస్తుంది. సమా కర్షిత హృదయం భగవత్ ప్రేమ సుధారస పారవశ్యం చెందుతుంది.

ప్రకృతి మహోన్నత శీర్షంపై కాంతి కిరీటం మెరుస్తుంది. ప్రకృతి సుస్థిర భూమికలో కాంతి సామ్రాజ్యం భాసిస్తుంది.

భూమికి మించిన ఒక మహనీయ సత్యం భూమిని ఆవహిస్తుంది. మానవ రహదారులపై తన సూర్యకిరణాలను విరజిమ్ముతుంది.

ఒక అప్రతిహత చిచ్ఛక్తి ఆలోచనను నడుపుతుంది. భవిష్యత్‌లోకి వీక్షించే ఒక అనంత శక్తి, మానవ జీవితాన్ని శాసిస్తుంది.

మానవ హృదయాలలో అమృతత్వ అగ్నిజ్వాల రగులుతుంది. నిశ్చేతన మందిరంలో ఒక ఆత్మ మేలకుంటుంది. మనస్సు భగవత్ దర్శన దేవాలయమవుంది. శరీరం అంతస్స్ఫూర్తి ప్రజ్వలిత ఉపకరణం అవుతుంది. జీవితం భగవంతుని దృశ్యమాన శక్తి ప్రవాహంగా మారుతుంది. ఈ భువనమంతా భగవంతుని అభివ్యక్తధామంగా వెలిగిపోతుంది. మనస్సులోని ఆజ్ఞానం, జీవన శరీరాలు ఇక ఎంత మాత్రం ఆ వెలుగును దాచలేవు. ఒక పరిపూర్ణ దివ్య హస్తం ప్రతి సంఘటనను, ప్రతిచర్యను తీర్చిదిద్దుతుంది. పరమాత్మ నేత్రాలే ప్రకృతి నేత్రాలవుతాయి. పరమాత్మ శక్తి ప్రకృతి శక్తిని ఆవహిస్తుంది. ఈ ప్రపంచం భగవంతుని దృశ్యమాన బృందావనమవుతుంది.

అనువాదం : కె. యజ్ఞన్న

(శ్రీఅరవిందుల 'సావిత్రి' నుండి)

నిమ్న ప్రకృతి నుండి బయటపడేందుకు కీలకం

- శ్రీమాత

............నిజం చెప్పాలంటే, నిమ్న ప్రకృతికి అతీతంగావున్న దివ్య జ్యోతిలో నీవు కుదురుకొననిదే అహిత శక్తులనుండి బయటపడడం కుదరదు. అప్పడు 'అహిత శక్తులు' అన్నమాట తన అర్థాన్ని పూర్తిగా కోల్పోతుంది. అక్కడ ప్రగతిశీల శక్తులు మాత్రమేవుండి, నీవు ప్రగతిని సాధించే వరకు అవి ఊరుకోవు. అది అలా జరగాలంటే నీవు నిమ్నార్థగోళము (Lower Hemisphere) నుండి బయటి పడి తీరవలసిందే.....

దీనికి భిన్నంగా బలమైన మరియు పటిష్టమైన తనను తాను మరింత శక్తివంతముగా అభివ్యక్తము చేసుకొనే వేరొక అర్థగోళమిక్కడ వుంది. దానినెలా చెప్పాలి! అది నీ వల్ల కాదు. చేతన యొక్క

ప్రామాణికత మారాల్సిన అవశ్యకత అగుపిస్తుంది. అదేదో అన్నింటికీ అతీతంగా మనం చేరుకోవాల్సినది లేదా ఒక అడుగు మాత్రం ముందుకు వేయడంలాంటిది కాదు. అది మనం చేరుకోవాల్సిన అత్యున్నత, చివరి స్థాయి. దాని స్థాయి పూర్తిగా భిన్నం. ఇక్కడ స్థాయి అంటే అర్థం అక్కడ అంతా సమృద్ధం శోభామయం. శక్తిమయం. అదొక రూపాంతరం అని మనం అర్థం చేసుకోవాలి. అయినా ఏదో మన నుండి దూరమవుతున్నది. నిజానికి అది పూర్తిగా తిరగబడిన చేతన (reversal of consciousness) .

మనం ఆధ్యాత్మిక జీవితం ప్రారంభించగానే, చేతన పూర్తిగా మారిపోవడం జరుగుతుంది. అదే మనం ఆధ్యాత్మిక జీవితంలో అడుగిడినా మనేందుకు తార్కాణం. సరే. అలాగే అతిమానస చేతనలో అడుగిడగానే, చేతనలో మరింత పూర్తి మార్పుకు లోనవుతాం......

ఎంతవరకైతే ఈ అనుభవం అనేది మనకు సిద్ధించదో అంతవరకూ మనం ఆ దిశగా సాధనా పథంలో ఊర్ధ్వ దిశగా పురోగమిస్తున్నామనే అనుకోవాలి. నీవు ఏదో పొందుతావు. భూమిక సిద్ధం అవుతున్నది. ఊర్ధ్వముఖంగా నీవు ముందుకు సాగిపోతున్నావనుకోవాలి. ఎంత వరకైతే చేతనలో ఈ మార్పు సిద్ధించదో, అంతవరకూ చేసిందే చేస్తుండాలి. ఈ స్థితి పునరావృతం అవుతూనేవుంటుంది, అది మరల మరల జరుగుతూనే వుంటుంది. (అదే సాధన అంటే.)

ప్రతీసారి నీవు బాహ్యతలంలోనే జీవిస్తున్నట్లు అన్పిస్తుంది. ఇలా అనుకోవడం అనేది తిరిగి తిరిగి పునరావృతమౌతుంది. అలా జరిగిన ప్రతీసారీ నీవు అనుకుంటావు. " నేనింతవరకూ బాహ్యతలంలోనే జీవించాను. బాహ్యంలోనే చిక్కుకుపోయాను. అనుభవాలలో, సమర్పణలో, శక్తులలో అన్నింటికీ ఉపరితలంలో మాత్రమే జీవిస్తున్నాను." దీని లోతులలో ఏదోవుంది. ఆ లోతులలో దిగినపుడే

అసలైన దానిని అందుకోగలవు. ప్రతీసారి అదే అనుభూతి. ఇంక అగాధంలో కన్పించిం దంతా ఉపరితలంలోకి వస్తుంది. ఉపరితలంలోకి అంటే అర్థం, ఏదో అస్పష్టమైన, కృత్రిమమైన - కృత్రిమం అనిపించేలా, అది నిజమైనది, సజీవమైనది కాదనిపించేలా - అది కేవలం ప్రతీకగా, ఛాయా మాత్రంగా, ఊహాజనితంగా, ఒక ప్రతిబింబంగా ఉంటుంది. అది అసలైనదికాదు. నీవు మరొక స్థాయికి చేరుకుంటావు. అక్కడ నీవు అసలు మూలాన్ని, శక్తిని, సర్వంలోని నిజస్థితిని కనుగొంటావు. ఇదిగో! ఈ మూలం, ఈ శక్తి ఈ నిజస్థితి, ఇదీ నీ సిద్ధికి సంబంధించిన అసలు వాస్తవం, అసలు స్థితి అనేది తెలుస్తుంది.

అంతవరకూ, మనకు సరైన కీలకం దొరికినట్లుకాదు. అది మన చేతిలో లేదు. అంతే కాదు. అదెక్కడుందో కూడా తెలియదు. అందాకా మనం చేయాల్సింది శ్రీఅరవిందులు చెప్పే సంపూర్ణ సమర్పణం. దైవ సంకల్పానికి పూర్తిగా ఆత్మ నివేదన చేసుకొనడం. అంతే. అవి చీకటిరాత్రులైనా సరే. సిద్ధంగా వుండాల్సిందే.

అక్కడ చీకటి రాత్రికావచ్చు. వెలిగే సూర్యుడు కావచ్చు. తిరిగి చీకటి, వెలుగు, అలా చాలా రాత్రులుండవచ్చుగాక, ఎమైనా సరే సమర్పణను విడిచిపెట్టకూడదు. తుఫానుహోరులో దేనినో ఆసరాగా అంటిపెట్టుకున్నట్లుగా వుండి పోవాల్సిందే. సర్వాన్ని పరమ ప్రభువు చేతుల్లోనే విడిచివేయాలి. ఆఖరి సూర్యోదయం వచ్చేదాకా, అంతిమ విజయం సిద్ధించేరకూ అలా అంటిపెట్టుకొనేవుండాలి. అదంతే.

అనువాదం : కొంగర భాస్కరరావు

రేపటి సంపూర్ణ సిద్ధికోసం

<u>ప్రశ్న</u> :- అమ్మా! మధుమయీ! ఈనవ్య చైతన్యము పట్ల మన వైఖరి ఎలా ఉండాలి?

దానితో నీవేమి చేయాలని కోరుకుంటావో దానిమీద ఆధారపడి ఉంటుంది, అది.

జిజ్ఞాసగా నీవు దానిని పరికించాలని కోరుకున్నట్లైన, దాని నవగతం చేసుకోటానికి, దానిని నీవు గమనించాలి.

అది నిన్ను పరివర్తింప చేయగలదనుకున్నట్లైన, దానికి నీవు ఉన్మీలనమై ఉండి, పురోభివృద్ధికి కృషి చేయాలి.

- శ్రీమాత

కాలము గురించిన చింతనలేక, స్థలము గురించిన భయములేక, అగ్నిజ్వాలలవంటి విషమపరీక్షల సంక్షోభాలనుంచి పరిశుద్ధులమయి, మనగమ్యము- అతిమానస విజయము, - సిద్ధింపచేసుకొనే దిశగా, నిరాటంకంగా, మనము ఎగురుకుంటూ పోవుదము గాక!

రేపటి పరిపూర్ణ సిద్ధినందుకునే వరకు సత్యమునుంచి సత్యమునకు, ఒక్కొక్కమెట్టే పెకెగబ్రాకుతూ పోదము.

- శ్రీమాత

అనువాదం : త్రివేణి

విజయప్రదమైన భవిత

మేము 'జయప్రదమైన భవిత' అని పిలిచే పుష్పాన్ని నీకు ఇచ్చినపుడు దాని ప్రాముఖ్యత ఏమిటో నీకు తెలుసా? అది ఆశావహాన్ని సూచిస్తుంది- అంతేకాకుండా, అది ఒక వాగ్దానం కూడా. ఏమంటే నీవు అతి మానసం అవరోహించిన ప్రపంచంలో పాల్గొనబోతున్నావు. మేము తలపెట్టిన పనికి దాని అవరోహణం విజయవంతమైన పరిపూర్ణమగు ముగింపు కాగలదు. ఆ అవరోహణపు పూర్ణ వైభవం ఇంకా రాలేదు. అదే జరిగితే, జీవితం మొత్తం అంతా మరొక విధంగా ఉండేది. చాలా తక్కువ మోతాదులలో అతిమానసం తన ప్రభావాన్ని చూపిస్తున్నది. ఒకప్పుడు అస్తిత్వంలోని ఒక భాగం, మరొకప్పుడు మరొకటి దాని కౌగిలి అనుభూతికి లోనవుతున్నది లేదా దాని

దివ్యత్వస్పర్శను పొందుతున్నది. కాని అది దాని పూర్తి ఆత్మ-సత్వశక్తితో క్రిందికి దిగివచ్చినప్పుడు, ఒక పరమోత్కృష్టమైన సమూల మార్పుకు మొత్తం ప్రకృతి అంతా లోబడుతుంది. మనం ఆ విజయపు ఘడియకు ఇంకా దగ్గర, దగ్గర అవుతున్నాము. ప్రపంచ పరిస్థితులు అనుకూలంగా తయారయినపుడు, పూర్తి అవరోహణం జరుగుతుంది. అది సర్వాన్ని తనతో తీసుకువస్తుంది. దాని ఉనికి శంకించలేనిది. దాని శక్తి ఏ ప్రతి ఘటనను సహించదు. సంశయాలు, కష్టాలు ఇక ఏ మాత్రమూ నిన్ను బాధించలేవు. ఎందుచేతనంటే, దైవప్రకటన ప్రస్ఫుటమవుతుంది, తెర తొలగిపోతుంది. పరిపూర్ణ దివ్య సాక్షాత్కారం లభిస్తుంది. అంత మాత్రాన, ప్రపంచం అంతా ఒక్కసారిగా దాని ఉనికికి సంబంధించి అనుభూతిని పొందుతుందని కాని, పరివర్తనకు లోనవుతుందని కాని నేను చెప్పటంలేదు. కాని నేను ఏం చెప్తున్నానంటే, ప్రపంచ మానవాళిలో కొద్దిమంది దానిని తెలుసుకొని క్రిందికి అవరోహించిన అతిమానస శక్తిలో పాలుపంచుకుంటారు-అక్కడ నుంచి ఉన్నత రూపాంతరం చెందిన అనుగ్రహం ఎంతో సఫలీకృతంకాగా, దాని ప్రభావం పరిసరాలన్నింటి మీదా ప్రకాశిస్తుంది. అదృష్టవశాత్తు ఆకాంక్షాపరులకు, అజేయమైన ఆ భవిత సఫలీకృతం అవుతుంది. కొత్త ఆధ్యాత్మిక భావాలకు స్పందించిన మానవాళి సహజ స్వభావ సిద్ధ అన్ని అడ్డంకులను అధిగమిస్తుంది. అనుగ్రహం సఫలమవుతుంది.

- శ్రీమాత

అనువాదం : డా॥ టి. ప్రసన్న కృష్ణ

Part - II

గీతా వ్యాసములు

1. గీతాధ్యయనమెందుకు?

1. మా మతమే పరమసత్యం:

ప్రంపంచలో, వైదిక, లౌకిక శాస్త్రాలు, శ్రుతి స్మృతులు, మతాలు, దర్శనాలు, శాఖలు, సంప్రదాయాలు చాలా ఉన్నాయి. జ్ఞాన పరిపక్వతలేని వాళ్ళు, లేక అజ్ఞానులు, వీటిలో కేవలం ఒక దానియందు మాత్రమే అమిత ఆసక్తులై, ఆగ్రంధమే భగవంతుడు చెప్పినదనీ, మిగతావన్నీ బూటకాలనీ అంటారు. తన దర్శనశాస్త్రమే హేతుబుద్ధికి సంబంధించి చివరిమాట అనీ మిగతావన్నీ తప్పులతడికలనీ లేక తన దర్శన శాస్త్రాన్ని ఆశ్రయించి వున్నాయనీ, కనుక వాటిల్లో కొంత సత్యం ఉండి ఉండవచ్చనీ చెప్పి గర్వపడ్తారు. భౌతికశాస్త్ర పరిశోధనలను కూడా గొప్పమతంలాగా పూజిస్తున్నారు. మతంగా పూజించే భౌతికశాస్త్రం పేరుతో, ఈశ్వరుని అంగీకరించే మతాన్ని, ఆధ్యాత్మిక మార్గాన్ని, అజ్ఞానం, అంధవిశ్వాసం అనీ, దర్శన శాస్త్రాన్ని ఆడంబరమైన, రమ్యకల్పన అనీ తిరస్కరిస్తున్నారు. ఈ మూర్ఖతిరస్కారాల్లో, వ్యర్ధవివాదాల్లో విజ్ఞులు కూడా తరచుగా పాలుపంచుకోవడం విచిత్రంగా వుంది. వారి నిర్మల ప్రకాశంలో ఏదో తామసికత చోటుచేసుకొని, బుద్ధికి సంబంధించిన అహంకారాన్నో, ఆధ్యాత్మిక గర్వాన్నో పుట్టించి, వారిని పెడదారి పట్టించి వుంటుంది. అయితే మానవ జాతి ఇపుడు కొంచెం సహనం, విజ్ఞతలవైపు మొగ్గు చూపుతున్నట్లు కన్పిస్తుంది. ఎందుకంటే మతం పేరుతోగాని, వాళ్ళు మరో రకంగా శిక్షణ పొందారు లేక వాళ్ళ మనస్తత్వం వేరు అని గాని మనమిపుడు తోటిమానవుల్ని చంపడం లేదు. అదేవిధంగా, మన అభిప్రాయంతో విభేదించిన పొరుగు వారిపై మనమిపుడు దుమ్మెత్తి పోయడంలేదు. సత్యం అన్నిచోట్ల ఉంది. అది మన ఒక్కరి సొత్తు మాత్రమేగాదు అని అంగీకరించడానికి కూడా మనమిప్పుడు

సంసిద్ధంగా ఉన్నాం. ఇతర మతాలు, దర్శనాలలో గల సత్యాన్ని, సహాయాన్ని స్వీకరించడానికే వాటిని చూడాలంటున్నాం గాని, వాటిని అసత్యమని నిందించడానికి, వాటిలో తప్పులనుకొన్నివాటిని, తప్పులని విమర్శించడానికి గాదు. అయినా మనమిప్పటికీ మన మత మొక్కటే జ్ఞాన శిఖరాన్ని చేరుకొన్న మతమనీ, ఇతర మతాలు లేక శాస్త్రాలు మన సత్యం యొక్క నిమ్న రూపాలను మాత్రమే చూపుతున్నాయనీ, లేక అర్హతలేని వారిని మన సత్య శిఖరాన్నధిరోహించి సిద్ధంచేస్తున్నవి మాత్రమేననీ ప్రకటించుకొంటున్నాం. ఇంకా మనమిప్పటికీ, మన మభిమానించే గ్రంథం, లేక ఉపదేశంలోని ప్రతిఅక్షరం భగవంతుని ప్రేరణతో వచ్చినదే గనుక, అది శాశ్వత సత్యం అని చెప్పి దానినంతా తు.చ. తప్పకుండా మనపైనా, ఇతరుల పైనా రుద్దజూస్తున్నాం.

2. కాలానుగుణసత్యం, శాశ్వత సత్యం :

కనుక వేదం, ఉపనిషత్తులు లేక గీతలాంటి ప్రాచీన గ్రంథాన్ని తీసుకొన్నప్పుడు, ఏ ఉద్దేశ్యంతో దానిని మన చేతిలోనికి తీసుకొంటున్నామో, ఇప్పటి, మరి, ముందుతరాల మానవాళికి ప్రయోజనం కలిగించే ఏ విషయాన్ని దానినుండి పొందాలను కొంటున్నామో దానిని ముందుగానే కచ్చితంగా సూచించడం మంచిది. మొదటి విషయం: ఏకం, నిత్యం, అయినటువంటి ఒక పరమసత్యం ఉన్నదనే దాన్లో ఎట్టి సంశయం లేదు. దానినే మనం అన్వేషిస్తున్నాం. దానినుండే ఇతరమైన సత్యమంతా ఉద్భవిస్తోంది. దాని వెలుగు చేతనే ఇతర సత్యమంతా, జ్ఞాన ప్రణాళికలో తన యధాస్థానాన్ని, యధావివరణను, యథా సంబంధాన్ని కనుగొంటుంది. కాని సరిగ్గా అదే కారణంతో ఆ పరమసత్యం ఒకే ఒక నిశితమైన సూత్రంలో బంధింపబడజాలదు, తన సంపూర్ణ రూపంలో గాని, సర్వసంబంధాలలో గానీ, ఒకే దర్శన శాస్త్రంలో, లేక మత గ్రంథంలో లభించడం కష్టం. లేక ఒకే గురువుతో గాని, అవతారంతోగాని చెప్పబడడం కష్టం. అంతేగాక ఇతర సంప్రదాయాలకు ఆధారభూతమైన సత్యాన్ని మనం అసహనంతో నిరాకరిస్తే, మనకీ పరమసత్యం పూర్తిగా

అర్థం కానట్లే, అంధావేశంతో ఒక సత్యాన్ని నిరాకరిస్తే పూర్ణసత్యంలో దాని స్థానం ఎక్కడో, మనకు తెలియలేదనే అర్థం. అధ్యయానానికి సంబంధించిన రెండో విషయం: ఈ పరమసత్యం ఏకం, నిత్యం ఐనప్పటికీ కాలగమనంలో మానవమనస్సు ద్వారా తనను వ్యక్తం చేసుకుంటుంది. కనుక ప్రతి శాస్త్రంలో రెండు విభాగాలు ఉంటాయి. 1. తాత్కాలికం, నశించిపోయేది. ఇది తాను వ్యక్తమైన దేశ కాలాల్లోని భావాన్ని బట్టి ఉంటుంది. 2. సనాతనం, నశించనిది. ఇది సర్వ దేశ కాలాలకు వర్తించే సత్యం. ఈ పరమసత్య ప్రతిపాదనలో దానికివ్వబడిన వాస్తవ రూపం, రచనా విధానం, ఆధ్యాత్మిక మరియు భౌతిక ఆకారం-ఇవన్నీ కాలంతో పాటు మారిపోయేవి. కనుక కాలాన్ని బట్టి బుద్ధి కూడా తనను మార్చుకుంటుంది. అలా తాను మారుతూ, తాను చేసే సమన్వయాలను కూడా మారుస్తూవుంటుంది, కొత్త సమన్వయాలను సాధిస్తూంటుంది. వెనుకటి శబ్దాలను, సంకేతాలను విడిచి పెట్టి నూతనమైన వాటిని గ్రహిస్తుంది. ఒకవేళ వెనుకటి దానినే ప్రయోగించిన దాని అంతరార్థాన్ని మార్చివేస్తుంది. కాబట్టి తన కాలం వాళ్ళకు గీత ఇచ్చిన అర్థాన్ని, భావాన్ని ఇప్పుడర్థంచేసుకోగలం అని నిశ్చయంగా ఎప్పటికీ చెప్పలేం. బుద్ధి ఇలా మార్చి వేస్తుంది. కనుక ఏది సార్వకాలికం కావడంతో బాటు, బుద్ధికి మించిన దృష్టితో చూడబడుతుందో, దేనిని మనం అనుభవించి జీవిస్తామో, దానికే శాశ్వతమైన విలువ ఉంటుంది.

3. గీతనుండి మనకు కావలసిన సజీవ సత్యం :

కనుక ఆనాటి వారికి సంబంధించిన గీత యొక్క నిగూఢ తాత్త్విక అర్థాన్ని యాథాతథంగా బయట పెట్టడం ఒకవేళ సాధ్యమైనప్పటికీ దానికి నేను విలువనివ్వను. పైగా అలా వెలికి దీయడం సాధ్యంకాదని, ఈనాటికీ వ్రాయబడుతున్న వ్యాఖ్యానాల మధ్య గల అఖాతం మనకు తెలుపుతోంది. ఆ వ్యాఖ్యానాలన్నీ, పరస్పరం అంగీకరించుకొనక పోవడాన్ని అంగీకరిస్తున్నాయి. ప్రతీవ్యాఖ్యానం గీతలో తనతాత్త్విక వ్యవస్థయే, తన ధార్మిక ప్రవృత్తియే ఉన్నదని చెప్తోంది. అంతేగాక

పండితులెంత నిష్పక్షపాతంగా ప్రయత్నించినప్పటికీ, భారతీయ తత్త్వ శాస్త్రాన్ని గురించి, చారిత్రక పరిశోధకులు ఎటువంటి ప్రకాశమయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినా, గీతార్థ విషయంలో జరిగే అనివార్య ప్రమాదాన్ని నివారించలేవు. కాని వాటి తార్కిక రూపాన్ని గాక గీతలోని వాస్తవ సజీవ సత్యాన్ని అన్వేషిస్తే మనకూ, విశాలప్రపంచానికీ ఉపకరించే అంశాలను గీతనుండి వెలికితీయగలిగితే, ఇప్పటి మానవ మనస్తత్వానికి, ఆధ్యాత్మిక అవసరాలకు అనువైన భాషలో చెప్పగలిగితే, అదిగో, అది మనకు లాభం కలిగించేదవుతుంది. నిజమే, ఈ ప్రయత్నంలో గూడా మనవ్యక్తిత్వం నుండి, ఇప్పటి భావాల్నుండి పుట్టిన దోషాలెన్నో అందులో కలిసిపోతాయి. కాని ఈ మహాగీతా శాస్త్రం యొక్క మూలభావంలో మనం మునిగితే, విశేషించి ఆ భావంలో నివసించ ప్రయత్నిస్తే, నిశ్చయంగా మనం స్వీకరించ గలిగినంత వాస్తవసత్యాన్ని, అలాగే వ్యక్తి గతంగా మనకుద్దేశించబడిన ఆధ్యాత్మిక ప్రభావాన్ని, ప్రక్రియాత్మక సహాయాన్ని మనం గీతలో పొందగలం. చివరకు దీనిని ప్రసాదించడానికే శాస్త్రాలు వ్రాయబడ్డాయి. తక్కినదంతా పాండిత్య వివాదం లేక ఈశ్వరవాదం. ఏ పవిత్రగ్రంథాలను, మతాలను, దర్శనాలను ఇలా నిరంతరం నవీకరించి జీవించగలమో, వికాసశీల మానవ జాతియొక్క ఆంతర విచారణలో, ఆధ్యాత్మి కానుభవంలో వేటిలోని శాశ్వత సత్యానికి సంబంధించిన ద్రవ్యానికి ఎల్లపుడూ నూతన రూపమిచ్చి, పెంపొందించగలమో, అవియే మానవాళికి సజీవ ప్రాముఖ్యత గలవిగా కొనసాగుతాయి. తక్కినవి గతానికి సంబంధించిన భవ్యస్మారక చిహ్నాలుగానే నిలుస్తాయిగాని, వానిలో భావానికి సంబంధించిన ఎట్టి వాస్తవిక శక్తీ, సజీవ ప్రేరణావుండదు.

4. గీత సంకుచితమైన దాన్ని విశాలం చేస్తుంది :

గీతలో కేవలం ఒకే దేశానికి వర్తించేది, ఒకే కాలానికి వర్తించేది చాలా స్వల్పం. అంతేగాదు గీత భావం ఎంతో ఉదారం, గంభీరం, సార్వత్రికం కాబట్టి దేశకాలాలకు పరిమితమైన ఆస్వల్పాన్ని

గూడా తేలికగా, శ్రమపడకుండా సార్వత్రికం చేయవచ్చు. పైగా అలా చేయడం వల్ల గీతార్థం గాంభీర్యంలోనూ, సత్యంలోనూ, శక్తిలోనూ మరింతగా పెరుగుతుంది. స్వయంగా, ఒక స్థానానికి, పరిమితికి లోనైన తన భావానికి ఇవ్వగలిగిన సర్వవ్యాపక రూపాన్ని గూడా గీతయే తరచుగా మనకు సూచిస్తుంది. ఉదాహరణకు, భారతదేశంలోనే కనుమరుగుకానున్న ప్రాచీన యజ్ఞభావాన్ని తీసుకొని, యజ్ఞమంటే దేవతలకు, మానవులకు మధ్యజరిగే ఆదాన ప్రదానమని చెప్పి ఆ యజ్ఞభావాన్ని అత్యంత సూక్ష్మం, అలంకారికం, సంకేతాత్మకం చేసి వేసింది. అంతేగాక ఇచటి దేవతా భావన, స్థానికం లేకపౌరాణికం గాక పోగా, సార్వజనీనం, దార్శనికంగా మారింది. ఇలా ఈ రెంటినీ మనో విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన వ్యవహారిక సత్యాన్ని, ప్రకృతి యొక్క సార్వత్రిక నియమాన్ని వ్యక్తం చేయడం చేత రెంటినీ తేలికగా అంగీకరించవచ్చు. అంగీకరించిన ఆధునిక మనో భావాలకు వాటిని అన్వయించి, వాటి ఆశయాన్ని విశాలతరం, గంభీరతరం చేయవచ్చు. అపుడు యజ్ఞ భావానికి, దేవతభావానికి అధికతర ఆధ్యాత్మిక రూపం, అధికతర దూరంలో వున్న సత్య ప్రకాశం ప్రాప్తిస్తాయి. ఇలాగే గీతలో మరికొన్ని భావాలున్నాయి - కార్యాకార్యాల్లో శాస్త్ర ప్రమాణం, చాతుర్వర్ణ్యం, చతుర్వర్ణముల ప్రతిపత్తిలో తారతమ్యం, ఆధ్యాత్మిక విషయాల్లో స్త్రీ, శూద్రులకు అధికారం లేదనడం, ఈ భావాలు, చూడగానే, ఈ ఒక్కదేశానికే పరిమితమైనవిగా, ఆకాలానికే పరిమితమైనవిగా కన్పిస్తాయి. వీటి శబ్దార్థాన్ని ఎంతగా నొక్కిచెప్తామో అంతగా గీతబోధనను సంకుచిత పరచి, దాని విశ్వజనీనతను ఆధ్యాత్మిక గంభీరతను తొలిగించి, జన సామాన్యానికి, దాని ప్రయోజనాన్ని పరిమితం చేసి అందించిన వారమౌతాం. కాని శబ్దాల వెనుకనున్న భావాన్ని, ఆశయాన్ని పరిశీలించినట్లైతే, ఆశయం గంభీరం, సత్యం అనీ, భావం దార్శనికం, ఆధ్యాత్మికం, సార్వత్రికం అని ఈ సందర్భంలో కూడా మనం చూడగలం. చూడండి, శాస్త్రమంటే, అసంస్కృత, ప్రాకృత మానవుని అహంకార చేష్టకు బదులుగా మానవ

జాతి తనపై తాను విధించుకొన్న నియమం అనీ గీత తెలుపుతుంది. (ఈ అర్థంలో శాస్త్రప్రామాణ్యం అపేక్షణీయమేగదా). అదేవిధంగా స్వయంగా రూపానికి అందని ఒక ఆధ్యాత్మిక సత్యానికి సంబంధించిన ప్రత్యక్ష రూపమే చాతుర్వర్ణ్యమని మనకు తెలుస్తుంది. ఒక వ్యక్తి చేయవలసిన కర్మ, అతని స్వభావాన్ని బట్టి వుంటుంది. అంటే అది అతని స్వభావం యొక్క సహజ గుణంతో నిర్ణయించబడి (18-47), స్వభావం యొక్క స్వీయ ధర్మ క్రియచేత నిర్వహించబడుతుంది. - గుణకర్మ విభాగశః (4-13). ఈ విధంగా చాతుర్వర్ణ్యం వెనుక ఈ ఆధ్యాత్మిక భావం ఉంది. ఎక్కువగా ఈ దేశానికే ప్రత్యేకమై కన్పించే గీతలోని ఇతర విషయాల వెనుక గూడా ఇటువంటి గంభీరతర భావాలుండడం యదార్థం కాబట్టి, వాటినన్వేషించడం మనకు న్యాయమే.

5. గీతలో సాంఖ్యము, యోగము భిన్నములు గావు :

ఆ కాలం నాటి దార్శనిక పరిభాషను, ధార్మిక సంకేతాలను ఉపయోగించడంచేత గీతలో ప్రవేశించిన లేక దాని నావరించివున్న దార్శనిక సిద్ధాంతంతోగాని, ధార్మిక మతంతోగాని, ఇతర భావంలో అంటే తార్కిక భావంతో మనం వ్యవహరించబోవడంలేదు. గీత సాంఖ్య, యోగములను ప్రస్తావించినపుడు (2-39) మన విచారణకు అవసరమైన అవధులనుమించి, గీతా సాంఖ్యానికి, సంప్రదాయ సాంఖ్యానికిగల సంబంధాలను గాని, గీతా యోగానికి, పాతంజలి యోగానికి, గల సంబంధాలను గాని మనం చర్చించబోవడంలేదు. గీతాసాంఖ్యంలో పురుషుడొక్కడే. ప్రకృతి అతనిశక్తి ; సంప్రదాయ సాంఖ్యంలో ఈశ్వరుడుండడు, పురుషులనే కులుంటారు, ప్రకృతికి స్వతంత్ర సత్త ఉంటుంది. అంతేగాక గీతా యోగం, బహుముఖ, సూక్ష్మ, flexible సౌలభ్యం కలది; కాగా, పాతంజలి యోగం, శాస్త్రీయం, కఠోరం, సఈశ్వరం, అంటే దానికి ఈశ్వరుడుంటాడు. గీతయందు సాంఖ్యం, యోగం ఒకే వేదాంత సత్యం యొక్క ఏకకేంద్రాభిముఖమైన రెండు భాగాలు, లేక వేదాంత సాక్షాత్కారం వైపు సాగిపోయే రెండు సహకార

మార్గాలు- ఒకటి, బుద్ధికి సంబంధించినది, వివేచనాత్మకమైనది. రెండవది, హార్దికం, హృదయానికి సంబంధించినది, ఆచరణరూపం కలిగింది, మరియు అన్నింటినీ సమన్వయంచేసేది; ఇది వివేచన ద్వారాగాక, అనుభవంద్వారా జ్ఞానం పొందుతుంది. గీత సాంఖ్య, యోగముల బోధనల్లో ఎట్టి వాస్తవ భేదాన్ని గుర్తించదు. గీత యొక్క మూలాలు ఎటువంటివైనప్పటికీ, దాని బోధన సార్వకాలికం, సార్వజనీనం. కనుక ఆ మూలాలను చర్చించనవసరంలేదు.

6. గీత సమన్వయం చేస్తుంది, చీల్చదు :

గీతలోని దార్శనిక విధానం, అంటే అది సత్యాన్ని ప్రతిపాదించిన పద్ధతి, తన బోధనలోని అతి ముఖ్యమైన, చిరస్థాయియైన విభాగంగాదు. కాని ఈ విధానానికి మూలద్రవ్యమైన ప్రధాన భావాలు మాత్రం, సర్వదా విలువకలిగినవే, ప్రామాణికమైనవే, ఎందుచేతనంటే ఇది ధార్మిక, బుద్ధి యొక్క భావ చమత్కారాలు లేక ఆకర్షక విచారణలు మాత్రమే కాక, ఆధ్యాత్మికానుభవం యొక్క స్థాయీ సత్యాలు, మన అత్యున్నత మనోభూమికలో నిరూపించుకొనగల యదార్థాలు. సృష్టిరహస్యాన్ని ఛేదింపగోరే ప్రయత్నమేదీ ఈ తథ్యాలనుపేక్షించలేదు. గీత ప్రతిపాదించే పద్ధతియేదైనప్పటికీ అది ఏదోఒక ప్రత్యేక దార్శనిక సంప్రదాయాన్ని సమర్థించడం కోసం గాని, ఏ యోగ విషయాన్నో పోషించడం కోసంగానీ ఉద్దేశించబడలేదు. గీత యొక్క భాషా ప్రయోగం, ఆలోచనా రచన, భావాల సంయోగంలో సమతుల్యత, సాంప్రదాయిక గురువు యొక్క, తీవ్ర ప్రకృతికి గాని, కఠోరతర్కం యొక్క అంతర్భావానికి గాని చెందవు; కారణం, ఇవి ఏదో ఒక కోణాన్నవలంబించి, తతిమ్మా వాటిని వెలివేస్తాయి. పైగా గీతలో, విశాలం, నిమ్నోన్నతం, ఆలింగనాత్మకం అయిన భావగతి కన్పిస్తుంది. ఇది ఒక వ్యాపక, సమన్వయాత్మక మనస్సు, సమృద్ధ, సమన్వయాత్మక అనుభవాల అభివ్యక్తీ అవుతుంది. ప్రగాఢమైన తక్కిన వాటిని వెలివేసే వ్యావర్తక జ్ఞాన పద్ధతులను, భక్తి సాధనలను, భారతీయుల ఆధ్యాత్మికత ఎంత పుష్కలంగా సృజియించిందో, అంత పుష్కలంగానూ ఆ

ఆధ్యాత్మికత తనలో మహాసమన్వయాలను సృజించింది. అలా సృజించబడిన సమన్వయాలలో గీత ప్రముఖ స్థానమాక్రమిస్తుంది. గీత అన్నింటినీ దగ్గరచేర్చి, ఏకం చేస్తుందేగాని, దూరంచేసి విడదీయదు.

7. గీత ఏదో ఒక్కటి మాత్రమే గాదు :

సమస్త విశ్వం యొక్క అస్తిత్వానికి, ఆధారాన్ని గీత ఒకే అవ్యయమైన శుద్ధ సనాతనాత్మలో చూస్తుంది. అయినా అది శుద్ధాద్వైతం గాదు; అభివ్యక్త ప్రపంచంలో, సర్వవ్యాపియగు త్రిగుణ మాయను గురించి గీత తెలియజేస్తుంది (7-14) : అయినా గీత మాయా వాదంగాదు; భగవంతునిలో, భగవంతుని సనాతన పరప్రకృతి ఉంటుంది. అది జీవ రూపం ధరించి అపరాప్రకృతిలో వ్యక్తమౌతుంది, అంతేగాక భగవంతునిలో లయంగాక ఆతని యందు నివసించుటయే జీవుని ఆధ్యాత్మిక చేతన యొక్క పరమావస్థయని గీత చెప్పినప్పటికీ అది విశిష్టాద్వైతంగాదు (7-5); ప్రకృతి పురుషుల సంయోగంతో జగత్ సృష్టి జరుగుతుందని గీత చెప్పినప్పటికీ (13-27) గీతామతము సాంఖ్యంగాదు; విష్ణుదేవుని అవతారమైన కృష్ణుడు, పరమ పురుషుడనీ (7-7) సర్వలోక మహేశ్వరుడనీ, సర్వభూత సుహృదుడనీ (5-29) గీత చిత్రిస్తుంది. మరియు ఈ కృష్ణునకూ, నిర్విశేష బ్రహ్మానికీ ఎట్టి వాస్తవ భేదాన్ని గాని, బ్రహ్మం యొక్క ఆధిక్యాన్ని గాని గీత అనుమతించదు. అయినప్పటికీ గీత వైష్ణవ మతంగాదు. ముందు వచ్చిన ఉపనిషత్తుల ఆధ్యాత్మిక సమన్వయంలాగానే ఆధ్యాత్మికం, బౌద్ధికంగూడ యైనటువంటి గీతా సమన్వయం గూడ సర్వాన్నీ ఆలింగనం చేసుకొనేటటువంటి సర్వగ్రాహిసమగ్రతకు భంగం కలిగించే కఠోర విభజనలను సహజంగానే త్రోసివేస్తుంది. అత్యున్నత వేదాంత ప్రమాణ త్రయంలో గీత ఒకటి గనుక, స్వమతాన్ని సమర్థించుకోడానికి, పరమతాన్ని ఖండించడానికి గీతనొక ఆయుధంగా మార్చుకొన ప్రయత్నించే 'ప్రతివాదిభయంకర' వ్యాఖ్యాతల లక్ష్యానికి గీతాలక్ష్యం శుద్ధవిరుద్ధం. గీత తర్కయుద్ధానికి ఒక ఆయుధం

గాదు. అది ఆధ్యాత్మిక సత్యం, అంతేగాక, అనుభవ రూపమైన యావత్ప్రపంచమునకు తెరచుకొని ఉన్న ఒక ఆధ్యాత్మిక సత్యకవాటం. అది మనకు ప్రసాదించే దృశ్యాల్లో ఆ పరమధామం యొక్క సర్వప్రాంతాలు, వచ్చిచేరతాయి. గీత ఆయాప్రాంతాల సమగ్రపటాన్ని తయారుచేస్తుందే గాని, వాటిని విడగొట్టదు లేక వాటి మధ్య గోడలు, కంచెలు నిర్మించి మన దృష్టి కడ్డుతగలదు.

8. భారతీయుల ఇతర సమన్వయాలు :

భారతీయ విజ్ఞానం యొక్క సుదీర్ఘ చరిత్రలో ఇతర సమన్వ యాలు గూడా వెలిసాయి. వైదిక సమన్వయంతో ప్రారంభిద్దాం: అది మానవుని మానసిక సత్తకు, దేవతల విశాల సత్తకు మధ్య సమన్వయం: మానవ మనస్సు దివ్య జ్ఞానం, శక్తి మొదలైన వాటికి సంబంధించిన తన అత్యున్నత గతుల్లో, భౌతిక సూర్యుడు మొదలైన సంకేతాల వెనుక, స్థూల చక్షువున కందని ఊర్ధ్వతర భూమికల్లో విహారించు సూర్యాధిదేవతలతో సంపర్కం పొందడంలో ఈ సత్తా సమన్వయం సిద్ధించింది. ఈ సమన్వయంలో వర్థమాన మానవాత్మ, దేవతల ఆదిత్య పూర్ణత కలిసికొని పరస్పరం పూరించుకొంటాయి; వైదికఋషుల అనుభవంలో, ఈ సమన్వయ శిఖరం దివ్యం, అతీతం, ఆనందమయం, అయినటువంటి ఒక దివ్య వస్తువు. వైదిక ఋషుల ఈ అనుభవాగ్రాన్ని స్వీకరించి, ఆధ్యాత్మిక జ్ఞానం యొక్క, ఒక సమున్నత గంభీర సమన్వయాన్ని సాధించడానికి ఉపనిషత్తులు దానిని మూలంగా చేసుకొన్నాయి; అంతః స్ఫురితులు, ముక్తపురుషులు అయినటువంటి బ్రహ్మవేత్తలు ఫలప్రదమైన ఒక ఆధ్యాత్మిక మహా యుగం పొడవునా, దేనిని చూచి, అనుభవించారో దానినంతా ఉపనిషత్తులు ఒక మహాసామరస్యంలో పొందుపరచాయి. ఇక గీత ఈ ఉపనిషత్సమన్వయము నుండి ఆరంభించి, దాని మూల భావాల ప్రాతిపదికపై, మహితసాధనాలు మరియుశక్తులు అయినటువంటి భక్తి, జ్ఞాన, కర్మల మూడింటి యొక్క మరో సామరస్యతను తయారుచేసింది; ఈ సమన్వయం ద్వారా మానవాత్మ పరమ పురుషుని సరాసరి

సమీపించి వానిలో ఏకంకాగలదు. తాంత్రికమని పిలువబడే మరొక సమన్వయం ఉంది. ఇది అంత సునిశితమైనది, ఆధ్యాత్మికమైనది, గంభీరమైనది గాకపోయినా, గీతా సమన్వయంకంటె ఎక్కువ సాహసవంతం, శక్తివంతమైనది. ఎందుకనంటే అది ఆధ్యాత్మిక జీవితానికి ఆటంకాలైన వాటిని గూడా చేపట్టి, వాటిని బలాత్కరించి, సంపన్నతర ఆధ్యాత్మిక విజయానికి, వాటిని సాధనాలుగా చేసి జీవితాన్నంతా మన దివ్య పరిధిలో భగవల్లీలగా ఆలింగనం చేసుకోడానికి బాట వేస్తుంది. పైగా కొన్ని విషయాల్లో ఇది ఎక్కువ త్వరగా పుష్టిని, ఫలితాలను ఇస్తుంది. ఎలా అంటే అది దివ్యజ్ఞానం, దివ్యకర్మ, దివ్యప్రేమతోబాటు హఠయోగ, రాజయోగ రహస్యాలను, శరీరోపయోగాన్ని మానసిక తపస్సును గూడ వ్యవహారంలోనికి దెచ్చి, అన్ని భూమికల్లోనూ, దివ్య జీవనానికి ద్వారం తెరుస్తుంది; కాగా గీత, హఠయోగం మొదలైనవాటిని సందర్భవశాత్తూ మాత్రమే ప్రస్తావిస్తుంది; అంతేగాక తాంత్రిక సమన్వయం మానవుడికి దివ్య పరిపూర్ణత సాధ్యమే అనే రహస్యాన్ని గ్రహిస్తుంది. వైదిక ఋషులకు, ఈ అవగాహన ఉన్నప్పటికీ మధ్యయుగాలలో అడుగున పడిపోయింది. అయినా ఈ రహస్యం మానవ విచారణ, అనుభవం, ఆకాంక్షల, ఎట్టి భావి సమన్వయంలోనైనా మహనీయస్థానం ఆక్రమించకతప్పదు.

9. ఇంత కంటె విపుల తరమైన సమన్వయమావశ్యకం :

ఈనాడు మనం వికాసశీలమైన ఒక నూతన యుగ ప్రాంగణంలో నిలబడివున్నాం. ఈ యుగం అటువంటి విపుల తర సమన్వయానికి దారితీసి తీరుతుంది. మనం మూడు వేదాంత సాంప్రదాయాల్లో ఏదోఒకదానికి చెందిన కఠోర వేదాంతులం గానవసరం లేదు. తాంత్రికులంగానవసరం లేదు, గతానికి చెందిన ఒక ఆస్తికతను అంటి పెట్టుకొని యుండవలసిన పనిలేదు. అలా చేసినందువల్ల మన స్వీయసత్తా, స్వభావ శక్తులనుండి గాక, గతంలోని వాళ్ల సత్తా స్వభావాలతోనే మన ఆధ్యాత్మిక జీవన కట్టడాన్ని నిర్మించ యత్నించిన వాళ్లమవుతాం. మనం గతంలోని ఉదయాలకు

గాక భావి యొక్క మధ్యాహ్నాలకే చెందిన వాళ్ళం. నూతన సాధనాసామగ్రి మనలోనికి వచ్చిపడుతోంది. భారతదేశపు, ప్రపంచపు, ఈశ్వరునంగీకరించు మహామతముల ప్రభావాలను, పునఃప్రాప్తమైన బౌద్ధమత మూలాశయాన్ని జీర్ణించుకొనడమే గాక, ఆధునిక విజ్ఞానం, మరియు పరిశోధనలవల్ల, పరిమితమైనప్పటికీ, పటుతరమైన, ఆవిష్కరణలను పూర్తిగా పరిగణించవలసి ఉంది. చచ్చిసమసి పోయిందనుకొన్న గతం నుండి ఇంకా ఎన్నో ప్రకాశమయరహస్యాలు మనపై ఆవిర్భవిస్తున్నాయి. ఇదంతా ఒక నూతన, సుసమృద్ధ, సువిశాల సమన్వయాన్ని సూచిస్తోంది; మనకు ప్రాప్తించిన ఈ సమస్త సామరస్యీకరణం, మన భావగతికి బౌద్ధికంగాను, ఆధ్యాత్మికంగానూ ఉభయత్రా ఆవశ్యకమైన విషయం. కాని పూర్వసమన్వయాలు, అంతకు ముందున్న సమన్వయాలతో ప్రారంభించినట్లే, భావ సమన్వయం గతంలో సిద్ధించిన ఆధ్యాత్మికానుభవాల మహారాసి నుండి ప్రభవించాలి. అప్పడే దానికి మంచి దృఢమైన ఆధారం లభిస్తుంది. అలా సాధించిన సమన్వయాల్లో గీత అత్యంత ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తుంది

10) కాబట్టి ఒక పండితుని వలెనో, విద్యాలయంలోలానో గీతను అధ్యయనం చేయడం మన లక్ష్యం కాదు. లానే ఆధ్యాత్మిక చరిత్రలో ఒక దర్శన శాస్త్రంగా కూడా గీతను నిర్ణయించటం మన ఉద్దేశం కాదు. శల్య పరీక్ష చేసే తార్కికునిలా గీతను విచారించబోవడం లేదు. సహాయం కొరకు, ప్రకాశం కొరకు మనం గీతను ఆశ్రయిస్తున్నాం. మన లక్ష్యం దానియందలి సజీవ సారభూత సందేశాన్ని గ్రహించుటయే. మానవజాతి తన సంసిద్దతకి, అత్యున్నత ఆధ్యాత్మిక శ్రేయస్సుకి అట్టి సందేశాన్నే అవలంబించాలి.

- శ్రీఅరవిందులు

అనువాదం : శ్రీ చెలసాని నాగేశ్వరరావు

(సశేషం)

సమాచార పత్రము

ఫిబ్రవరి నెలలో ఈ క్రింది కార్యక్రమములు జరుగును.
21-02-08 : మదర్ 130వ జన్మదిన వేడుకలు.
22 నుండి 27 వరకు సావిత్రి అధ్యయనం :- బీచ్ ఆఫీస్ నందు డా॥ అలోక్ పాండేగారు సాయంకాలము గం॥ 5.00ల నుండి గం॥ 6.45 ని॥ వరకు (మధ్యలో 15 ని॥లు విరామంతో). అందరూ ఆహ్వానితులే
29న పృథ్విపై అతిమానస అభివ్యక్తి వార్షికోత్సవాలు. (1956)

శ్రీప్రదీప్ నారంగ్ 28 అక్టోబర్ 2007న సింగపూర్ కేంద్రమును సందర్శించిరి. నిత్యజీవితంలో సమగ్ర యోగము యొక్క అమలు ప్రధానాంశముగా కేంద్ర సభ్యులతో చాలా ఆసక్తికరమైన చర్చలు జరిగాయి.

పుదుచ్చేరి శ్రీ అరవింద సొసైటి బీచ్ ఆఫీస్ హాలు నందు డా॥ అలోక్ పాండే 'సావిత్రి' మహాకావ్యంపై సెప్టెంబర్ 25నుండి 30 వరకు స్వాధ్యాయ కార్యక్రమం జరిగింది. వీరిచే ఫిబ్రవరి 21 నుండి 27 వరకు సావిత్రిపై తదుపరి స్వాధ్యాయం నిర్వహించబడును.

2007 నవంబరు 21 నుండి 23 వరకు శ్రీఅరవింద సొసైటి ఉమెన్స్‌కౌన్సిల్ వారిచే బీచ్‌ఆఫీసునందు "రూపాంతరీకరణం" పై సెమినార్ నిర్వహించగా అనేకమంది వక్తలు ఈ అంశంపై అనేక కోణాలలో తమ అభిప్రాయాలను వెల్లడించినారు.

శ్రీ అరవింద సొసైటి బీచ్ ఆఫీసునందు WEBOLIM వారి సహకారంతో "వేదసంస్కృతిలో మాతృత్వ పరమార్థము" అను అంశముపై నవంబరు 4న (2007) ఒక వర్క్‌షాపు నిర్వహించబడింది. డా॥ సంపదానందమిశ్రా (సొసైటి రీసెర్చి స్కాలర్) WEBOLIM స్థాపకులు శ్రీరంగన్‌జీ శ్రీ వివేకానంద యోగ అనుసంధాన సంస్థానం బెంగుళూరు (భారతప్రభుత్వం వారిచే యోగ మరియు సైన్సులో యూనివర్సిటీగా గుర్తింపుపొందిన సంస్థ)కు చెందిన డా॥ శమంత కమణి నరేంద్రన్ మరియు డా॥ అలోక్ పాండే ప్రభృతులు దీనిని నిర్వహించగా శ్రీ విజయ్‌భాయ్ ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులో ఎలా ముందుకు తీసుకెళ్ళాలి అనే విషయంపై ఒక చక్కని కార్యాచరణ ప్రణాళికను అందించారు.

Rs. 15

అఖిల

అఖిల భారత పత్రిక - మార్చి 2008

పదార్థము పరార్థమునావిష్కరిస్తుంది



అఖిల

అఖిల భారత పత్రిక - మార్చి 2008

పదార్థము పరార్థమునావిష్కరిస్తుంది - శ్రీఅరవిందులు

విషయసూచిక :

మొట్ట మొదటిసారిగా శ్రీమాత యొక్క లక్షణాలు ప్రస్తావించే సందర్భంలో శ్రీఅరవిందులు అన్నారు - అంత సమగ్రమైన, నిర్నిబంధమైన ఆత్మార్పణ తామెప్పుడూ ఎక్కడా చూడలేదని - అంటూ - ఇంత సులువుగా ఉత్కృష్టంగా పూర్తిగా తమకుతాము అర్పించు కోగల్గటం ఆడవారికే చెల్లిందని కూడా వ్యాఖ్యానించారు. గతాన్ని - దానికి సంబంధించిన మంచి చెడులతో సహా - తుడిచివేయటాన్ని ఇది సూచిస్తుంది.

- నళినీ కాంతగుప్త

ప్రార్థనలు - ధ్యానములు

(ఫ్రాన్సు నుంచి వస్తూనే, శ్రీమాత మార్చి 29, 1914న శ్రీఅరవిందుల వారితో పుదుచ్చేరిలో, వారి నివాసంలో సమావేశ మయ్యారు. కవరు పేజీ మీద (నివాసగృహం యొక్క) మెట్ల వరుస ప్రచురించబడింది. అది సంజీవన్‌గారి పెయింటింగు.)

మార్చి 30, 1914న శ్రీమాత తమ డైరీలో వ్రాసుకున్నది -

గాఢ అజ్ఞానాంధకారంలో వేలమంది మునిగిఉన్నా మరేమీ ఫర్వాలేదు. నిన్న మేము దర్శించిన వ్యక్తి ఈ భూమి మీద ఉన్నారు. వారిసాక్షాత్కారమే చాలు చీకటి వెలుగుగా పరిణమింపబడేరోజు రాబోతోందనే నిరూపణకు, నీ దివ్య పాలన ఈ నేలపై వాస్తవంగా ప్రతిష్ఠింపబడటానికి-

ఓ ప్రభూ! మహిమాన్విత దివ్య నిర్మాతా! ఇది తలుచుకుంటే నా హృదయం కృతజ్ఞతానందాలతో పొంగి పొరలుతున్న దయా! ఆశకు అవధులు లేవయా!

మాటలకు అందని భక్తి. నిశ్శబ్ద పూజ్యభావం నాది.

- శ్రీమాత

ఏప్రిల్ 1, 1914

నీ దేవాలయ గర్భగుడిలోనికి మేము ప్రవేశించి, నీ దివ్యేచ్ఛ తెలుసుకున్నామని, భావిస్తున్నాను. నాలో పరమానందము, గాఢ ప్రశాంతత పరిపాలిస్తున్నవి. కాకపోతే, నాలో నిర్మించుకున్న అంతర నిర్మాణాలు పేక మేడల్లా చెదిరిపోయినాయి. ఇపుడు నీ మహత్వము ముందు నాకంటూ ఒక వ్యక్తిత్వములేక, సాకార నిరాకారములనేవి లేక, అవ్యక్తీకృతంగా ఉన్నాను. గతమంతా దాని బాహ్యరూపంలో పరిహాసాస్పదంగా నిర్హేతుక మనిపిస్తోంది నాకు. అయినా సమయం వచ్చినపుడు దాని ప్రయోజనం దానికి ఉండేదని నాకు తెలుసు.

కాని ఇపుడైతే అంతా మారిపోయింది. ఒక నూతన కార్యరంగ మేర్పడినది.

ఏప్రిల్ 2, 1914

ఏదో ఒక నూతన దశ - కేంద్రీకృతమైనదిగా గాక, నలుదిశలా పరివ్యాప్తమయ్యే దశ - మా ముందు ఆవిష్కృతమవుతూన్నట్లు అనిపిస్తూ, ప్రతిదినము, ఏదైనా వ్రాసుకోవాలను కున్నపుడు అంతరాయం కలుగుతోంది. మంత్ర, తంత్ర, ధ్యాన ఉపాసనలతోకాక, అనుక్షణము చేసే ప్రతికార్యకలాపంలో నీతోమమేకమై నిన్ను సేవించాలి.

నీ సంకీర్తనా గానంలో నా హృదయమెన్నటికీ అలసిపోదు. ఎప్పుడూ నా తలపులు నీతోనే నిండి ఉంటాయి.

- శ్రీమాత

ఏప్రిల్ 3, 1914

నాకనిపిస్తుంది, నేనొక క్రొత్త జన్మెత్తినట్లు, గత పద్ధతులు అలవాట్లు ఏవీ నాకిక పనికిరావని- నేను గతంలో ఊహించి పొందిన ఫలితాలు అన్నీ ఒక సన్నాహం, సంసిద్ధత కోసమేనని - నేనింతవరకు అసలు ఏమీచేయలేదని భావిస్తాను. ఆధ్యాత్మిక జీవనమనేది నాకింతవరకు లేనేలేదని, ఆ దిశకి ఇప్పడిపుడే మరలినానని అని పిస్తున్నది. నా కసలు ఏమీ తెలియనే తెలియదు; నేను దేనికీ రూప కల్పన చేయగలిగే దానిని కాదు; అసలైన అనుభవం ఇంకా ప్రారంభం కాబడవలసేయున్నదనిపిస్తుంది. నాగతం - దాని సంబంధిత జయా పజయాలతో సహా - నానుంచి జారిపోయినట్లనిపిస్తోంది - ఒక క్రొత్త బిడ్డ జన్మకు సావకాశము ఇచ్చేటందులకో - అన్నట్లు. ఆ బిడ్డ నవ జీవనమింకా ఆరంభంకావలసియున్నది - పాఠాలు నేర్చుకోవలసిన కర్మానుభవాలు లేవు. సరిదిద్దుకోవలసిన తప్పలు లేవు. వ్యర్థ ఆలోచనల నుంచేకాక దృఢవిశ్వాసాలనుంచి, సర్వవిజ్ఞానంనుంచి నా బుర్ర కాళీ అయి పోయింది. ఏ ప్రతిఘటనాలేకుండా, నేనేదో తెలుసుకోవాలి అని ప్రయత్నించకుండా నన్ను నేనెలా అర్పించుకోవాలో తెలుసుకుంటే, ఓ నిష్కపట అమాయక పసివానిలా ఉండటానికి స్వచ్ఛందంగా ఒప్పకుని ఉంటే, ఒక నూతన సంభావ్యత నా ముందు తెరుచు కుంటుంది. నేనిపుడు, నిశ్చింతగా, నన్ను నేనర్పణకావించు కోవాలని నాకు తెలుసు. పూర్తిగా ఒక తెల్ల కాగితమై ఉండాలి. దాని మీద, ఓ ప్రభూ! నీ దివ్య ఆలోచన, ఇచ్ఛ లిఖింపబడగలగాలి. ఎలాంటి వికృతానికి లోబడే ప్రమాదం దానికి రాకూడదు.

ఓ మహత్తరమైన కృతజ్ఞతాభావన నా హృదయంలోనుంచి పైకెగసి పడుతున్నదయా, ప్రభూ!

- శ్రీమాత

రూపుదిద్దే ఉపకరణం ఆలోచన

మానవ పురోగమనానికి ముందుగానే ఏర్పర్చుకున్న భావాలను మథించాలి. అలాంటి భావమథనంలోనుండి హఠాత్తుగా ఆలోచన మొలకెత్తుతుంది. ఆలోచన సృష్టి కర్త అవుతుంది. అలా కాకపోతే అది యాంత్రికంగా చర్విత చర్వణంగా ముందు కెళ్ళకుండా ఉండి పోతుంది. అదే దానికి సక్రమచర్య అని పొరబడుతుంది.

తన చుట్టూతాను గానుగెద్దులా, గుడిగుడిగుండం గుండా రావంగా తిరుగుతూ ఉండవలసినది కాదు, మానవాత్మ. తరగని వెలుగునిచ్చే సముద్యంత భాస్కరుని చుట్టూ తిరుగాడవలసి పని దానికి ఉంది.

ముందు అంతరంగంలో సచ్చైతన్యంగా ఉండు, తర్వాత ఆలోచించు, పిదప ప్రవర్తించు. సజీవమైన ఆలోచనా శక్తి అంతా, సన్నద్ధంకాబోతూన్న ఒక నవలోకం అన్నమాట. వాస్తవమైన చర్య, క్రియా కలాపం అంతా అభివ్యక్తీకరింపబడిన ఆలోచనే. all real act is a thought manifested. దివ్యచేతన యొక్క దివ్యభావచలిత చాలన హేల ఈ భౌతిక అస్తిత్వం. అస్తిత్వానికి ఆలోచన అత్యావశ్యకం. కాదు, కారణముకాదు. రూపాన్ని కల్పించే ఒక ఉపకరణము ఆలోచన. నాలో నేను ఏమి దర్శిస్తానో అదే నేను అవగల్గుతాను. ఆలోచన నాకు సూచించినదంతా నేను చేయగల్గుతాను. నాలోని ఆలోచన నాకు ఏమిదర్శింపచేస్తుందో అది నేను కాగల్గుతాను. ఇది మానవునికి దృఢనమ్మకం కావాలి. ఎందుకంటే తనలో భగవంతుడు ఆవాసమై ఉన్నాడు కాబట్టి.

- శ్రీఅరవిందులు.

శ్రీమాత వ్యాఖ్య:-

ప్రశ్న: "ఆలోచన మేల్కొంటుంది, సృష్టికర్త అవుతుంది" - అంటే ఏమిటి?

కాదు. శ్రీఅరవిందులు వాక్యానికి ఆరంభంలో అన్నది - "ఆ విధంగా మధింపబడిన ఆలోచన మేల్కొంటుంది"- "Thought thus smitten awakes". వారు చెప్పేది - పాత నిర్మాణాలను కూలగొట్టాలి. ముందుగానే ఏర్పర్చుకొన్న భావాలను తర్జనభర్జన చేయాలి. సాధారణంగా అలవాటుగా ముందుగానే ఏర్పర్చుకున్న మానసిక భావ ప్రపంచంలో నివసిస్తాం. అవి స్థిరపడిపోయి ఉంటాయి - గట్టి దుర్గాలుగా స్థిరపడి ఉన్నందువల్ల ఇక పురోగతి అసాధ్యమైపోతుంది. అందుకే సలహా - ముందుగా ఏర్పర్చుకున్న భావాలను కూలగొట్టు. ధ్వంసంచేసి పారవేయి. నవ్య సృజనాత్మక భావాలు, ఆలోచనలు ఉద్భవించాలంటే మరి ఇదే రహదారి.

ఇంకాస్త ముందుకు వెళ్ళి శ్రీఅరవిందులు ఏమంటారంటే - ముందు నీవు తప్పక సచ్చైతన్యంగా ఉండాలి. తర్వాతే ఆలోచన. ఆ తర్వాత క్రియ. ఏపని అయినా కూడా అంతరంగ సత్య దర్శనం తర్వాతనే. ముందు కావల్సినది సత్య దర్శనం. The vision of the

truth. ఆ తర్వాత ఈ సత్యము ఆలోచనాత్మకంగా సూత్రబద్ధం కావటం - పిమ్మట సూత్రీకరింపబడిన ఆలోచన క్రియాత్మకంగా సృజింపబడుతుంది. ఇదీ సాధారణ ప్రక్రియ.

శ్రీఅరవిందులు మనకు అందించిన సృష్టి ప్రక్రియ ఇదీ. అనభివ్యక్తమైన దానిలో- in the Unmanifest - ఒక ఆలోచన ఊగిసలాడటం ఆరంభించింది. అంటే - మేల్కొంది. క్రియాశీలమైనది. ఆలోచన కదలాడింది. కాబట్టి, ప్రపంచం సృజింపబడినది.

చివరికి శ్రీఅరవిందులు ప్రకటించేదేమంటే- ఉనికి లేక అస్తిత్వానికి ఆలోచన అత్యావశ్యకం కాదు - అని. అస్తిత్వానికి అది కారణం కూడా కాదు. కేవలం అదొక ప్రక్రియ మాత్రమే. తయారవటానకి ఉపయోగపడే ఉపకరణం. స్పష్టమైన నిర్దిష్టమైన రూపకల్పనకి ఆలోచన మూలకారణం. అది సృజానాత్మక శక్తి కలది. ఇందుకు దృష్టాంతంగా శ్రీఅరవిందులు అంటారు - వ్యక్తి తాను ఆలోచించనదే తాను అవుతాడు; కాగల్గుతాడు. - by the very fact of that thinking - తాను ఏదైతే ఆలోచిస్తాడో అదంతా తాను కాగల్గుతాడు - ఈ నిజాన్ని తెలుసుకోవటం, ఆ యెరుక - జీవుని పురోభివృద్ధికి కీలకమైనది. వక్తి సంభావ్యతలకి, తనను నిర్దేశించుకోవటానికి, నియంత్రించుకోవటానికి, - ఈ పరిజ్ఞానం చాలా కీలకమైనది.

మనమేమిటో మనకు తెలియజేసే సత్యాన్ని, ఆకాంక్షను, ధ్వంసం చేసే ఏరకమైన ఇతర ఆలోచనను మనలో చొరబడనీయకూడదు - అనేది మనకు తెలుస్తోంది. నీవు కాకూడదు అనుకున్నది, చేయకూడదనుకున్నది నీలో సూత్రబద్ధం కాకూడదు. వాటిని గురించి ఆలోచించటమంటే - అపుడే - అది సిద్ధింపచేసుకోవాలనుకోవటమే అవుతుంది. ఏ దృక్పథం నుంచి చూచినా నీకు కానిది, అక్కర్లేదనుకున్నది - వీటిపై ఏకాగ్రత పనికిరాదు. అసలు ఆ ఆలోచనల ఉనికినే నీవు త్రోసిపుచ్చాలి. అలాకాక వాటిని నీలో గూడు కట్టుకోనిస్తే నీలో స్థిరపడేహక్కు వాటికి కల్పింపబడుతుంది. విధ్వంసక సూచనలు నీలో చొరబడకూడదని దానియొక్క ప్రాముఖ్యతను నీకు తెలియాచేయటానికే ఇది చెప్పేది. దుష్ట ఆలోచనలు, అసూయ, విధ్వంసం నీలో రానీయకూడదు. కేవలం వాటి స్మరణ వల్లనే వాటికి శక్తి నందించడమవుతుంది. ఆలోచన మన ఉనికికి అవసరం

కాదంటారు శ్రీఅరవిందులు. ఇవి ఒక మధ్యవర్తిలాంటివి. జీవితానికి ఒక రూపం కల్పించటానికి, సృష్టించటానికి ఉపకరణాలు. ఈ ఉపకరణాలను అదుపులో ఉంచుకోవల్సిన ఆవశ్యకత చాల ప్రముఖ మైనది. అస్తవ్యస్త ఆసురిక సృష్టికి దూరమటానికి చాలా అవసరం.

ఆలోచనలే కదా - అని దుష్టఆలోచనల్లకి నీలో చోటు కల్పించ కూడదు. అవి ఆచరణకు పరికరాలు. వాటికి నీలో స్థానం కల్పిస్తే నీలో విధ్వంసానికి, వాటికి అవకాశమిచ్చినట్లే.

- శ్రీమాత.

ప్రశ్నలు - సమాధానాలు

(శ్రీమాత ఒక యువ శిష్యునికిచ్చిన సమాధానాలు)

ప్రశ్న :- రాత్రి 11 గం.ల తర్వాత బాగానే నిద్రపోతాను. 5.30కి లేస్తాను. కాని 4 లేక 4.30 కే మెలకువ వస్తుంది.

నీవు మెలకువగా ఉన్నపుడు పక్కమీదపడుకుని ఉండటం మంచిది కాదు. అది విశ్రాంతి కంటే మరింత అలసట. తమస్సును పెంచుతుంది. మెలకువ రాగానే పక్కమీద నుంచి బయటపడడం శ్రేయస్కరం. అపుడు సాయంత్రం వేళ నిద్రబద్ధకంతో తొందరగా పడుకోగలుగుతావు. అర్థ రాత్రికి ముందు నిద్ర చాలమంచిది. అత్యంత విశ్రాంతికరమైనది.

ప్రశ్న :- మరింత బాగా నిద్రించటానకి ప్రాణికాన్ని ఎలా నిశ్చల పర్చగలగుతాను? ఆకాంక్ష ద్వారానా?

ఇంకా ఏకాగ్రత, అశాంతిని నిరాకరించే ఇచ్ఛ (ద్వారాకూడా)

ప్రశ్న :- నేను ఎలా ధ్యానం చెయాలి?

నీ ఆకాంక్ష పైననే మనసును స్థిరీకరించు. మిగిలిన దానినంతటిని బయటికి నెట్టివేయి.

ప్రశ్న :- ఆలోచనలు వస్తే ఏమి చేయాలి?

బయటకు నెట్టివేయాలి.

ప్రశ్న :- ఏది వాస్తవమైన ధ్యానం?

దివ్య సమక్షములో శ్రద్ధాళువై సావధానంతో కూడిన ఏకాగ్రత, ఇంకా మహనీయ సత్యముపై జాగృతి కలిగిన నిరంతర ధ్యానము.

ప్రశ్న :- కేవలం తీవ్రమైన ఆకాంక్ష ద్వారా సత్వము నంతటిని నిశ్శబ్దీకరించి నిశ్చలతలో సాధన చేయగలమని మీరు భావిస్తున్నారా?

అవును.

ప్రశ్న :- మానసిక, ప్రాణిక, శారీరక అపవిత్రతలన్నీ ఈ నిశ్శబ్దీకరణం వల్ల తొలగిపోగలవా?

నిశ్శబ్దము అన్ని అపవిత్రతలను తొలగించలేదు. వాటిలో చాలా వాటిని ఇది ఉపశమింప చేయగలదు.

ప్రశ్న :- "నిష్కపటమైన ఆకాంక్ష", అంటే ఏమిటి?

అహంకారములేక, స్వార్థపూరిత పన్నాగంతో కూడని - ఆకాంక్ష

ప్రశ్న :- మీకిలా వ్రాయవచ్చునా! 'కె' అనే ఆయన తాను చాలా క్రమశిక్షణ కలవానిననుకుంటాడు. ఆయనలా మాట్లాడినపుడు ఎక్కడ ఉంది ఆ క్రమశిక్షణ? నా చివరి మాటలు గోరంతలు కొండంతలు చేసినట్లు ఉన్నవా?

గోరంతలు కొండంతలు చేసినట్లుండక పోవచ్చును; కాని ఏమైనా అవి సహృదయతతో కూడినవి కావు. చైతన్య వైశాల్యానికి, ప్రకాశవంతంగా ఉండటానికి సహృదయత అత్యావశ్యకం.

ప్రశ్న :- డిశంబరు 31న 'క' అనారోగ్యంగా ఉన్నపుడు డా॥ బాబును మీరు అడిగారు - " 'క' ఈ రాత్రికి బాగుంటారా?" అని, "అసంభవం" , అనే బదులు , " మీరు, ఇచ్చగిస్తే అలానే జరుగుతుంది", అని, ఆతను చెప్పిఉంటే, అపుడు 'క' బహుశా నూతన సంవత్సరం ఆరంభంగా అర్థరాత్రి ధ్యానానికి హాజరు కాగలిగి ఉండేవారు.

పరిస్థితులు మారటానికి సమాధానమొక్కటే చాలదు. ఆకాంక్ష, నమ్మకము వల్ల మాత్రమే అది సంభవం. ఇవే దివ్యకృపను ప్రవర్తింపచేసేవి.

ప్రశ్న :- కాని - ఈ ఉదయం, ప్రణామం అయాక నాకు చాలా ఆనందం కలిగింది. తీవ్రమైన ఆకాంక్ష ఉన్నాకూడా సాధారణ మనసుకి దైవంవైపు సులువుగా మరలటం అసంభవమా?

సకాలంలో పరివర్తన అసంభవం అనటానికేదీ లేదు. కాకపోతే అది చిట్టచివరిగా చేయటమే ఇబ్బంది.

ప్రశ్న :- జీవితానికి నిజంగా పరమోన్నత లక్ష్యం - దైవము. దైవేచ్ఛని మనం సిద్ధింపచేసుకోవాలి. అయితే ఎవరు దైవము? ఏది దైవేచ్ఛ?

ఈ విషయాలు మాటలలో అనుకోగలిగేవి కావు, వ్యక్తిగత అనుభూతివల్ల కనుగొనవలసినవి.

కష్టాలకి కారణం, ప్రయోజనం.

మన సాధన మరింత పరిపూర్ణంగా పరిపుష్టం కావించటానికే ప్రత్యేకంగా మనకు కష్టాలు కల్పించబడతాయి.

మనమేదైనా సాధించాలని చేసే సాధనలో ప్రతిసారి, ఒక అంతరాయమో, ప్రతిఘటనో, లేదా చివరికి వైఫల్యమో ఎదుర్కోవలసి వచ్చినపుడు - అది వైఫల్యమే అనిపించినా - అది కేవలం సాధన మరింత పరిపుష్టం కాబడటానికే ప్రత్యేకంగా ఉంటుందనే విషయం ఎపుడూ విస్మరించకూడదు.

అందుచేత, ఈ నిరాశ, నిస్పృహ, నిరుత్సాహంలో "అయ్యో! మళ్లీ పొరపాటై పోయింది" అనుకోవటం - భయంతో ముడుచుకు పోయే అలవాటు, ఇదంతా పూర్తిగా తెలివి తక్కువ తనమే.

" చేయబడవలసిన రీతిలో పనులు చేయుటం మనకు తెలియదు. ఏదేమైనా కానీ! అవి మనకోసం జరుపబడుతవి"- అని నీకు నీవే అనుకో. నీవనుకునే కష్టం, పొరపాటు, వైఫల్యం, ప్రతిఘటన - ఇవన్నీ నీ సాధన పరిపూర్ణతకు సహకరించేవే అని నీవెంతగా అనుకుంటే, అంతగా, అవి నీ సాధనకు సహకరిస్తాయి.

ఈ విషయం ఒక్కసారి నీవు తెలుకుంటే అంతా సులువై పోతుంది.

జీవితంలో మనమెంతగా ఏఏ అంశాలలో ఎక్కడ కొరవడి ఉన్నామో మనకు తెలియపర్చటానికే, దైవానుగ్రంగా, మనకు ఆఘాతాలు, ఇబ్బందులు ఎప్పడూ వచ్చి మీదపడు తూంటాయి. అపుడు ఆత్మపరిశీలన చేసుకునే బదులు, మానసిక, ప్రాణిక సత్వములలో చెలరేగే గందరగోళం పైనే ధ్యాస కలిగి ఉంటాం.

భగవత్ప్రేరిత ఆఘాతాలను ఎలాస్వీకరించాలో సవినయంగా తెలుసుకోగలిగితే, ఒక్క గంతులో సునాయాసంగా చాలా దూరం పోగల్గటం ఖాయం.

- శ్రీమాత

ఆరోగ్యము - చికిత్స

రోగానికి కారణమేదైనా, అది అంతర్బాహ్యాలకు, శారీరక, మానసాలకు చెందినదైనా, శరీరాన్ని ప్రభావితం చేసే ముందు, జీవుని చుట్టూ శరీరాన్ని కాపాడుతూ ఉండే ఒక పొరను స్పృశిస్తుంది. ఇది సూక్ష్మ రూపంలో ఉండే పొర. దీనిని భిన్నతత్వాలలో, భిన్నమైన పేర్లతో పిలుస్తారు. ప్రత్యేక ఆచ్ఛాదనంగా ఉండే వాయుశరీరం, నాడీ శరీరం. ఇది ఒక సూక్ష్మ శరీరం. చూడగలిగేదిగానే ఉంటుంది. దీని సాంద్రత, వేడెక్కి సెగలు పొగలు వచ్చే వస్తువునుండి ఉద్భవించిన స్పందనలను

పోలి ఉంటుంది. ఇవి భౌతిక శరీరంనుంచి ఉద్భవిస్తాయి. దానిని పూర్తిగా దట్టంగా కప్పి ఉంచుతాయి. బాహ్య ప్రపంచ సమాచారాలన్నీ ఈ మాధ్యమంద్వారానే జరుపబడతాయి. శరీరం వ్యాధిగ్రస్తమవటానికి ముందు, ఈ సూక్ష్మ శరీరం వశపర్చుకో బడాలి. దీనినుంచి లోపలికి చొచ్చుకుపోబడాలి. ఈ ఆచ్ఛాదనం చెక్కుచెదరకుండా శక్తివంతంగా ఉంటే, ప్లేగు, కలరా వంటి భయంకర వ్యాధులు ప్రబలి ఉన్న చోట్లకు నీవు పోయినా నీకేమీ కాదు. రక్షణ కలిగి ఉంటావు. అన్ని రకాలైన వ్యాధులనుంచి నిన్ను కాపాడే రక్షణ కవచమిది. కాకపోతే ఇది పరిపూర్ణంగా పరిశుద్ధమై ఉండాలి. దీని మూలకాల కూర్పు సమగ్రమై, లోపరహితమై, సమతూకంలో ఉండాలి. సూక్ష్మ శరీరం ఒక వైపు భౌతికంగా, భౌతిక నిబంధనలతో నిర్మాణం కాబడింది. మరోవైపు మానసిక స్థితి ఆధారంగా మానసిక స్పందనలతో నిర్మాణం కాబడింది. ఈ మానసిక మూలకం, శాంతి, సమచిత్తం, ఆరోగ్యం పై నమ్మకం, స్థిరమైన నిశ్చలత, ఉల్లాసము, తేజోమయ ఆనందము - వీటిని వ్యవస్థీకరిస్తుంది. ఇది తేలికైన, శీఘ్రమైన ప్రతిక్రియలు కలిగి ఉండే చాలా సున్నితమైన వాహకం. అన్నిరకాలైన సూచనలను ఇది నిస్సంకోచంగా తనలోనికి తీసుకుంటుంది. ఇవి తొందరగా దాని పరిస్థితిని మార్చివేస్తాయి. మరొక ఆకారాన్ని తీసుకుని వస్తాయి. ఒక చెడు సూచన దానిపై బలంగా పని చేస్తుంది. అదే రీతిలో ఒక మంచి సూచన కూడా దానికి భిన్నంగా అదే శక్తితో ప్రవర్తిస్తుంది. క్రుంగిపోవడం, నిరాశ చెందటం - ఇవి హానికరమైన పరిణామాలు కలిగి ఉంటాయి. మూలపదార్థాన్ని తూట్లుపెట్టి, పాడుచేస్తాయి. బలహీనపరుస్తాయి. శరీరంపై హానికరమైన దాడులకవి దారిని సుగమం చేస్తాయి.

ఈ మాధ్యమం ద్వారా జరుపబడే చర్యవల్లే, వ్యక్తులు తరుచు, ఏ బాహ్యేంద్రియ ప్రేరణ లేకున్నాకూడా, నిర్హేతుకంగా పరస్పరము ఆకర్షణ, వికర్షణలకు లోనవుతూంటారు. ఈ ప్రతిక్రియలన్నిటికీ తొలి ఆధారం ఈ రక్షణ కవచంలోనే ఉంది. ఈనాడీ nervouse enve-lopes ఆవరణని మరింత బలపర్చేవ్యక్తులకు చాలా సులువుగా మనం ఆకర్షితులం అవుతాం. దానిని చికాకుపెట్టి, హాని కలిగించే వారికి దూరమవుతాం, సౌఖ్యాన్ని, సౌలభ్యాన్ని, విస్తరణ భావాన్ని (a sense of expansion) సుఖ, సంతోషాలను కలిగించేలా మనలను ప్రభావితులను చేసే వాటి పట్ల ఆకర్షితులమవుతాం. వీటికి వ్యతిరేక ప్రభావం చూపేవాటి జోలికిపోము. ఇద్దరు కలిసినపుడు ఈ ప్రవర్తన

పరస్పరం సాధారణం. ఈ ఆకర్షణలకు ఇదొక్కటే కారణమవదు. కాకపోతే తరుచుగా ఇదే కారణమవుతూంటుంది.

రోగానికి మూలకారణాలు అనేకం; అస్పష్టం కూడా. ప్రతి దానికి అనేకమైన కారణాలుంటాయి. అయితే అదెప్పుడూ సత్వములోని బలహీన భాగాన్ని సూచిస్తుంది.

నూటికి తొంబై పాళ్లు రోగం వచ్చేది భయం వల్లే.

- శ్రీమాత.

భారతీయ సంస్కృతి

భారతీయ నాగరికత లక్ష్యం ఆధ్యాత్మికమైనది. ఈ లక్ష్యం నుంచి పుట్టుకు వచ్చినదే భారతీయ యూరోపియన్ సంస్కృతుల మధ్య ఉన్న తేడా. ఈ నిర్దేశిత లక్ష్యం ఈ సంస్కృతికి ఒక రూపాన్నిచ్చింది. ఈ సంస్కృతి యొక్క సుసంపన్నమైన వైవిధ్య రూపాలకు లయబద్ధమైన సంచలనాలకు సాటిలేని విశిష్టతను సంతరించి పెట్టింది. ఈ సంస్కృతిలో ప్రముఖంగా గమనించదగిన మౌలికతత్వం ఆధ్యాత్మిక లక్ష్యం. అదేదాని ప్రత్యేక విశిష్టత. ఇదే ఇతర సంస్కృతులతో ఈ సంస్కృతికి సారూప్యతను కలుగ చేసేది. ఈ సంస్కృతికి ఆధ్యాత్మిక ఆకాంక్షయే నియంత్రణ శక్తి. నిర్దేశించే గాఢావేశం. ఆలోచనాకేంద్రం. ఆధ్యాత్మికతనే ఇది తన సర్వోన్నత జీవితలక్ష్యం కావించుకొన్నది. అంతే కాదు. తన మానవజాతియొక్క గత పరిస్థితులు అనుకూలించి నంత వరకు జీవన విధానాన్నంతటినీ ఆధ్యాత్మికదిశగా మళ్లించటానికి ప్రయత్నించింది. మతం మనిషి మనసులో ప్రథమ స్థానిక నివాసి (... religion is in the human mind the first native). కాగా అది ఆధ్యాత్మిక ప్రేరణయొక్క అసంపూర్ణ రూపం. అలా అయినపుడు ఆధ్యాత్మిక ప్రాబల్యం, జీవితాన్ని పట్టి ఉంచు కోవాలనే దాని కృషి, ఆలోచన, ఆచరణ మత రూపంగా పోతపోసి అమర్చవలసిన అవసరం ఏర్పడింది. ప్రతి జీవన పరిస్థితి మతపరమైన భావనతో నింపివేయాల్సిన అవసరం వచ్చింది. మతతాత్విక సంస్కృతి - religio - philosophic culture - వ్యాప్తి కావలసివచ్చింది.

భారతీయ ప్రజల అసాధారణ ఆధ్యాత్మిక ప్రతిభకు లేదా భారతీయ నాగరికత ఆధ్యాత్మిక సంస్కృతిగా ముందు వరుసలో ఉండవలసిన నిజాన్ని గుర్తింపచేయటానికి అనుకూలంగా చెప్పవలసి నదేమీ లేదు అని అనుకోవచ్చు. ఒకవేళ అనుకున్నా, ఒక్క యదార్థం చాలు దాని యొక్క సత్యాన్ని నిరూపించటానికి, ఈ అత్యంత విశిష్టము,

అత్యంత విస్తారము, అయిన, ఆధ్యాత్మిక సత్యము అసాధారణ తీవ్రతతో భావింపబడింది, వ్యక్తీకరింపబడింది. వీలైనంతవరకు అన్నివైపుల నుంచి దర్శింపబడింది. దగ్గర కాబడింది. జీవితాన్ని ఉద్ధరించే అసాధారణమైన భావనగా సచ్చైతన్యంగా తయారుకాబడింది. సర్వ భావనాకేంద్రంగా, సర్వమత ఆధారంగా, నిగూఢజ్ఞానంగా, మానవ మనుగడకు పరమమైన లక్ష్యంగా ప్రకటించబడింది. ఇలా ప్రకటితమైన సత్యము భారతీయ ఆలోచనా విధానానికి విలక్షణమైనదికాదు. ప్రతిచోటా మహనీయులైనవారి చేత దర్శింపబడుతోంది, అనుసరింప బడుతోంది. ఇతరత్రా అయితే, కొద్ది మంది జ్ఞానులకు, అసాధారణ మార్మికులకు, అపురూపమైన ప్రతిభ గలవారికి, ఆధ్యాత్మిక స్వభావ లక్షణాలు, కలవారికి ఇది సచ్చైతన్య మార్గదర్శి. అధిక జనాభాకి అవగాహన కాని, సంశయాత్మకంకాని గ్రహణ శక్తిగాని లేదు. అతీతమైన దానియొక్క అస్పష్ట దర్శనం - a reflected glimpse of this Beyond - అయినా కూడా లేదు. వారుకేవలం మతానికి సంబంధించి అల్పమైన శాఖాపరమైన పార్శ్వంలో నివశించారు. సర్వేశ్వరునికి ఒప్పని నిమ్నస్థాయి భావాలలో నివశించారు. ఐహిక బాహ్య జీవన దృక్పథానికే పరిమిత మయినారు. కాని భారతీయ సంస్కృతి - శక్తివంతమైన దానియొక్క దార్శనికత, తీవ్ర అన్వేషణ, సార్వత్రిక సామీప్యతల వల్ల విజయవంత మైనది. సారభూతమైన ఆధ్యాత్మిక వాస్తవం ఆదర్శంగా సాధికారిక ముద్ర వేయటంలో విజయాన్ని సాధించింది. మరి ఏ ఇతర సంస్కృతి వల్ల ఇది కాలేదు. మతానికి సంబంధించి ప్రతి రంగంలో భాగంలో, ఆ సర్వోన్నత ఆధ్యాత్మిక సత్యము యొక్క సజీవకాంతిని ప్రతి ఫలింపచేసింది. ఊపిరిపోసి సజీవంగా నిలబెట్టింది. భారతీయ మతతత్వ ప్రధాన ఆధ్యాత్మిక సత్యాలు వాటి విశాల భావనా దృక్పథంలో, అత్యధికంగా కావ్యకళాత్మక రంగాలలో కూడా ప్రాతినిధ్యం వహిస్తూ గమనశీలంగా ప్రజల మనోభావాలపై చెరగని ముద్రవేశాయి. (దైవ) మాయ, లీల, భగవంతుని సర్వవ్యాప కత్వము - ఈ భావాలు గుళ్లో పూజారికి, మఠంలో సన్యాసికి, ఆశ్రమ వాసికి, వేదాంతికి ఎంత పరిచయమో వీధిలో తిరిగే సామాన్యుడికీ అంతే పరిచయం.

ఈ విషయం నిజానికి మానసిక కృషి, పరిశ్రమవల్ల కాక, భక్త్యావేశం వల్ల జనావళికి సిద్ధించాయి. మరి అది తప్పని సరిగా అలానే జరగాలి. ఎందుకంటే దివ్య సత్యము హృదయానికే దగ్గరగాని మస్తిష్కానికి కాదుగా! బాహ్యమైన వాటికి మరింత ప్రాముఖ్యత

నిచ్చేందుకు మొగ్గుచూపడం వల్ల అంతరంగ ఆధ్యాత్మిక ప్రేరణ మసకబారుతుంది. ఎపుడూ ఉన్నదే ఇది. అయితే ఇది ఒక్క భారత దేశానికే విలక్షణమైనది కాదు. ఇది మానవ స్వభావ దౌర్బల్యం. ఆసియాలో కంటే యూరపులో మరింత స్పష్టంగా కనిపించే లక్షణం ఇది. రూపము, కర్మ, అనుష్ఠానము - ఇవి వీటి బరువుతో నిజవాస్తవాన్ని మొద్దుబారేలాచేస్తాయి. దీనిని నిరోధించి అసలు వాస్తవాన్ని దగ్గరగా దర్శింపచేయటానికి నిరంతరాయంగా ప్రవాహంలా జ్ఞానసంపన్నులైన సన్యాసులు, తత్వవేత్తలు, దివ్య పురుషులు అవసరమవుతూ వచ్చారు. ఈ ప్రవక్తలకెప్పుడూ కొదవలేదు. వారి సందేశాన్ని ఆనందంగా ఆలకించే సాధారణ మనుష్యులకీ లోటులేదు. భారత ప్రజకి - 'అజ్ఞానపుమూక' - అనుకునే వారికి కూడా, శతాబ్దాల శిక్షణ వల్ల, విచక్షణాజ్ఞానం ఉంది. అంతరంగ వాస్తవాలకు వారు సన్నిహితులు. దీనినుంచి వారిని వేరు చేసే సార్వత్రిక అజ్ఞానపు పొర బహుపల్చటిది. అందుచేత మరెక్కడున్న ఇతర ఉన్నత వర్గాలకంటే కూడా వీళ్ళు (భారతీయులు) దైవము, పరమాత్మ - వీటి క్షణికసందర్శన సౌలభ్యం కలిగి ఉంటారు.

- శ్రీఅరవిందులు

మేడమెట్టుపైనిల్చున్న నిరాశ

పై చిట్టచివరిమెట్టుపై నిల్చున్నదామె నిశ్శబ్దంగా.
శోకానికి ఉదాత్తమైన ప్రతిరూపం.
ఒక విషాదకర ఊహా ప్రాభవం
మేల్కొన్నది తన మహిమాన్విత విశాలనేత్రాలలో.
సౌందర్యానికి మూగ నిగూఢార్థభంగిమలో ఆమెను
గుర్తించాను.
అద్భుతావహ విషాదమానసం
అయినా ఆమె గభీర వైభవోపేతమైన నిండు సొగసరి.
కదలని ఆమె మోము యోచనాకృతి ముసుగు.
దిగ్విజయ కేతనం నిటారుగ నిల్చిన ఆమెతోక
ఆడించే (స్వ) ధర్మ మెరుగదు ఆమె యొక్క హుందాతనం.
జంతుజీవి అద్భుతమానవి,
ముగ్ధమనోహర అద్భుతమా నాల్గుకాళ్ళ బ్రహ్మము.
ఆమె జీవాత్మయా, స్త్రీయా, మార్జాలమా
ఇదే సమస్య ఆశ్చర్య చకితుని చేస్తున్నదిపుడు నన్ను.

- శ్రీఅరవిందులు

పిల్లి, పిల్లికూనలతో శ్రీమాత

నాకో పిల్లి ఉంది. అది మొదటిసారి పిల్లలని పెట్టింది. అప్పటినుంచి అది ఎక్కడికీ కదల్లేదు. తిండి తినలేదు. కాలకృత్యాలు తీర్చుకోలేదు. కూనలనంటి పెట్టుకుని, వాటి పోషణ, సంరక్షణలలో అక్కడే ఉంది. వాటికి ఏమైపోతుందోనని దానికెంతభయమో ! సహజంగానే. ఇక అవి పెరిగి పెద్ద అయ్యాక వాటికి శిక్షణనీయాలని తాపత్రయం. ఎంతఓరిమి ! ఆశ్చర్యం ! ఇవతల గోడ మీద నుంచి అవతల గోడమీదకి దూకటం, ఆహారం అందుకోవటం ఎంతో జాగ్రత్తగా, పలుమార్లు చేసి, చూపించి, ఎలా మప్పిందో ! చేసిందే చేయ్యటం ఒకసారి కాదు, పదిసార్లు కాదు. అవసరమైతే వందసార్లైనా చేస్తుంది. తాను అనుకున్నది ఆ కూనలు చేసే దాకా అలుపులేకుండా నేర్పింది. అసాధారణ శిక్షణ అది. గోడల అంచుపట్టుకుని యెగబ్రాకటం, జారిపడిపోకుండా నడవటం, గోడకి గోడకి మధ్య జాగా ఉన్నపుడు, ఈ గోడమీద నుంచి ఆగోడ మీదకి దూకటం - వాటికి నేర్పింది. గోడల మధ్య జాగా చూసి ఆ కూనలు తెగ భయపడిపోయినాయి. దూకటానికి ఒప్పుకోలేదు. భయం. అప్పుడు తల్లి దూకి చూపించింది. తనవైపు రమ్మని పిలిచింది - ఇలా రండీ, రండీ - అని. అది కదల్లేదు. వణికిపోయాయి. తల్లి మళ్లీ ఇవతలికి దూకింది. వాటికి నచ్చచెప్పింది. పంజాతోచిన్నగా చరిచింది. వాటిని నాకింది. అయినా అవి కదల్లేదు. తల్లి దూకింది. ఓ అరగంట అది అలా, అటూ, ఇటూ దూకడం చూశాను. అరగంట తర్వాత అవి తమకి కావల్సినది నేర్చుకున్నట్లు గమనించింది. అప్పుడు అది సమర్థవంతంగా సంసిద్ధమై ఉన్న కూనను వెనుక నుంచి, తలతో ఒక్క తోపు తోసింది. అంతే. ఆ కూన తనకు తానే ఓదూకు దూకింది. ఒకసారి దూకిన తర్వాత మళ్లీ మళ్లీ దూకింది.

ఓరిమి ఉన్న తల్లులు కొద్దిమందే ఉంటారు.

శ్రీ మాత

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

గీతా వ్యాసాలు

2. దివ్య గురువు

1. గీతలోని ప్రత్యేక లక్షణం :

ప్రపంచంలోని యితర మహాగ్రంధాలకు లేని ప్రత్యేక లక్షణం ఒకటి గీతకు వుంది. ఇది క్రీస్తు, మహమ్మదు, లేక బుద్ధుని లాంటి, సృజనాత్మక మహాపురుషుని ఆధ్యాత్మిక జీవన ఫలితంగా ఉద్భవించింది గాదు. వేదం, మరియు ఉపనిషత్తులలాగా కేవలం ఆధ్యాత్మిక అన్వేషణకే ప్రాధాన్యమిచ్చిన ఒక యుగ కృషి ఫలితంగాదు. ఇది భారత ఇతిహాసంలోని ఒక ఉపాఖ్యానంగా మన ముందుకొచ్చింది. ఆ ఇతిహాసంలోని ఒక ముఖ్య పాత్రయొక్క అంతర్మథనమునకు సంబంధిన ఒక క్లిష్టమైన క్షణంలో ఉద్భవించింది. ఆ క్షణం ఎందుచేత క్లిష్టమైందంటే, ఆ సమయంలో అతడు భయంకరం, దారుణం, అయిన, అతని జీవితానికి సంబంధించిన అతి ప్రధాన కర్మ చేయవలసి వచ్చింది. అతడా కర్మను నిర్వర్తించక పోవడమో, లేక దాని అంతు చూడడమో చేయాలి. గీతను తర్వాత వ్రాసి, దానికి మహాభారతానికున్న ప్రామాణికతను, విలువను కట్టబెట్టాలనే ఉద్దేశ్యంతో, అందులోనికి చొప్పించి వుంటారనే ఆధునిక విమర్శకు విలువలేదు. ఎందుకనంటే ఆ ఊహకు విరుద్ధంగా బలమైన కారణాలు కన్పించడమే గాక, దానికనుకూలంగా దాని లోపల, బయట కన్పించే సాక్ష్యాధారాలు చాలాతక్కువ. బలం లేనివి. ఒక వేళ బలమైనవే అనుకొన్నా, గీతాకారుడు గీత పుట్టడానికి మూలమైన యుద్ధ సందర్భమును పదేపదే జాగరూకతతో జ్ఞప్తికి తెస్తాడు. దీనికేం సమాధానం చెప్తారు?.... గీతాకారుడు దీనిని గీతకు చివర్లో చేప్పడమే గాక, గంభీరతమమైన తత్త్వాన్ని నిరూపించే సమయంలో కూడా ఆ విషయాన్ని తిరిగి తిరిగి ఎత్తి చూపుతాడు. గీతాకారుని ఈ వత్తి చెప్పడాన్ని అంగీకరించి, గురుశిష్యుల సంభాషణలో పదేపదే తలెత్తే ఈ విషయానికి మనం ఎక్కువ ప్రాముఖ్యమివ్వాలి. కాబట్టి గీతాబోధనను సర్వసాధారణమైన ఒక తత్త్వ శాస్త్రంగానో, నైతిక సిద్ధాంతం గానో చూడ గూడదు. మానవ జీవితానికి ఆతత్త్వాన్ని నీతిని, అన్వయించడంలో ఎదురైన ఒక వ్యావహారిక సంకటంతో ముడిపడివున్నవనే విషయాన్ని దృష్టిలో వుంచుకొని దాన్ని పరిశీలించాలి. ఈ సంకటం దేనికి చిహ్నం ? ఈ

కురుక్షేత్ర సంగ్రామం యొక్క మర్మమేమిటి ? అది అర్జునుని అంత:సత్తనెలా ప్రభావితం చేసింది ? అనేటటువంటి గీత భావాలకు సంబంధించిన కేంద్రీయ ధోరణిని మనం గ్రహించాలనుకొంటే ఈ ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పకోవాలి.

2. గురు, శిష్య, సందర్భాల, ఆవశ్యకత.

గంభీరతమమైన ఉపదేశాన్ని కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పడ మనేది సామాన్య సంఘటనలనాధారం చేసుకొని చెప్పలేమనేది సుస్పష్టమే. ఆ సంఘటన బాహ్యరూపం వెనుక గంభీరమైన సూచనలు, సందిగ్ధ సంకటముల అఖాతాలు దాగి ఉండకపోతే, సామాన్య ప్రమాణాలతోనే ఆ సంఘటనలతో వ్యవహరించ గలిగితే, గంభీరత మమైన ఉపదేశం వెలువడదు. నిజానికి గీతలో ఆధ్యాత్మికంగా అర్థవంత మైన మూడు ముఖ్య విషయాలున్నాయి. అవి ఆధ్యాత్మిక జీవనానికి, మామూలు మానవ జీవనానికి సంబంధించిన గంభీర విషయాలకు, సమస్యలకు దాదాపు సంకేతాలు, మూల రూపాలు. అవి, గరువు యొక్క దివ్యవ్యక్తిత్వం, శిష్యునితో అతని విశిష్ట సంబంధాలు, ఉపదేశ సందర్భం అని చెప్పకోవచ్చు. గీతలోని గురువు మానవ భావంలోనికవతరించిన భగవంతుడే. శిష్యుడు తన సమకాలికులలో అగ్రగణ్యుడు. ఇప్పటి భాషలో మానవ ప్రతినిధి. అవతారమైన కృష్ణునకు మంచి స్నేహితుడు, అతని అభీష్టాన్ని సాధించగలిగినవాడు. ఒక మహాకార్యంలోనూ సంఘర్షణ సమయంలోనూ అతని కుడిభుజం. అయితే ఈ మహాకార్యానికి సంబంధించిన నిగూఢ ప్రయోజనం అవతరించిన భగవంతునికే తప్ప, అందులోని పాత్రధారులకు తెలియదు. అతడే అంతటినీ తెర వెనుక నుండి నడిపిస్తాడు. ఇక సందర్భం, ఆ కర్మ, ఆ సంఘర్షణల ముందు ఉత్పన్నమైన ప్రచండ సంకటం, ఆ సంకటం వల్ల కలిగిన మనస్తాపం. నైతిక సంబంధమైన విషమ సమస్య, శస్త్రాస్త్రాలతో సంభవించే అంధహింస, మానవ ప్రతినిధియైన అర్జునునిలో కనువిప్ప కలిగించగా, ప్రపంచంలో భగవంతుడుండడంలో అర్థమేమిటి ? మానవ జీవన ప్రవర్తనల గమ్యం, గతి, ఆశయాలు ఏమిటి ? అనే ప్రశ్న అతనిలో ఉదయించింది.

3. సచేతనావతరణము శ్రేష్టావతారము:

అవతార సత్యంలోనూ, సాకారంగా భగవంతుడు అవతరి స్తాడనే విషయంలోనూ, మానవ భావంలో పరతత్త్వం ఆవిష్కరించ బడుతుందనే విషయంలోనూ, భారతదేశానికి ప్రబల విశ్వాసం ఉంది.

అయితే పాశ్చాత్య లోకంలో ఈ విశ్వాసమెప్పుడూ మనస్సు పై ముద్ర వేయలేదు. కారణం బహిరంగ క్రైస్తవమతంతో అది ఆదేశ మాత్రం గానే పరిమితంచేసి చెప్పబడడం వల్ల, హేతుబుద్ధిపైన, సార్వజనీన చైతన్యంలో అదెప్పడూ చొచ్చుకుపోలేదు. కాని భారతదేశంలో, వేదాంత దృష్టి యొక్క సహేతుక పరిణామంగా ఈ విశ్వాసం పెరిగి, జాతి చైతన్యంలో వేళ్ళు పాదుకొంది. ఉన్నది కేవలం భగవంతుడే గనుక, సృష్టి అంతా అతని అభివ్యక్తే అయి ఉండాలి. అంటే అతని వాస్తవ రూపంగానో, కల్పిత రూపంగానో తప్ప మరేదీ కాదు. కాబట్టి ప్రతిజీవినీ ఆంశికంగానో, మరొకరకంగానో నామరూపాల సాంతతలోనికి అనంతుని అవతరణే అవుతుంది. అయితే ఇది తెర మరుగైన అభివ్యక్తి. దైవం యొక్క పరభావనకు, సాంతతలోని ఆత్మ యొక్క అజ్ఞానంతో పాక్షికంగా లేక సంపూర్ణంగా కప్పివేయబడిన చేతనకు మధ్య ఎన్నో అంతస్తులున్నాయి. దేహి (జీవుడు) భగవదగ్ని యొక్క ఒక విస్ఫులింగము. ఈ జీవాత్మ, ఆత్మ జ్ఞానంనుండి పరమ సత్త్వలోనికి పెరిగే కొద్దీ, ఆత్మజ్ఞానం స్వీకరించేందుకు విచ్చుకొంటుంది. దైవం గూడ పై నుండి సృష్టిలో గల రూపాల్లోనికి తనను తాను గ్రుమ్మరించుకొంటూ, తన శక్తి, జ్ఞాన, ప్రేమ, ఆనంద విభూతి రూపాల్లో వికసిస్తుంది. ఇది భగవంతుని సాధారణావిర్భావం. కాని భగవంతుని చిచ్ఛక్తి మానవ రూపాన్ని, మానవ క్రియను స్వీకరించేటప్పడు, ఆ రూపాన్ని వెనుక నుండి తన శక్తులతోను, బాహ్యాకారముల చేతను మాత్రమే గాక తన సనాతన ఆత్మజ్ఞానంనుండి సరాసరి అధిష్టించి నడుపుతాడు. ఈ అజుడగు భగవంతుడు (4-6) మానసిక సత్త, జన్మాభాస చట్రంలో తన స్వస్వరూపాన్నెరిగి ఉండే వ్యవహరిస్తాడు. దేశకాల బద్ధమైన భగవదభివ్యక్తిది పరాకాష్ఠ; ఇదిపూర్ణం, సచేతనం అయిన భగవద వతరణం, అవతారమంటే ఇదే. ఇతడే.

4. సనాతన అవతారం - అభివ్యక్త అవతారం.

అవతారభావనకు అత్యధిక ప్రాముఖ్యమిచ్చే వైష్ణవ వేదాంతం, మానవునిలోగల భగవంతునికి, భగవంతునిలో ఉన్న మానవునితో సంబంధాన్ని, నర-నారాయణుల ద్వివిధ రూపంలో వ్యక్తం చేస్తుంది. చారిత్రకంగా ఈ నర - నారాయణులు గీతకు మిక్కిలి దగ్గరగా ఉండే మరోమత సంప్రదాయపు మూల పురుషులుగా చెప్పబడ్డారు. ఆధ్యాత్మికంగా నరుడు మానవాత్మ, భగవంతుని నిత్యసఖుడు. ఇతడు ఈ సఖ్యతకు కన్నుతెరచి, గీతభాషలో, ఎప్పడు భగవంతునిలో

నివసింప మొదలు పెడ్తాడో (2-8), అపుడు తనను దాను కనుక్కొంటాడు. ఇక నారాయణుడు మానవభావమున సదా నిలిచి యుండు దివ్యాత్మ. ఇతడు మానవుని రహస్య గురువు, సుహృదుడు, సహాయకుడు.

ప్రాణుల హృదయంలోపల ఆసీనుడై వుండే ప్రభువు (18-61). మన లోపలి ఈ నిగూఢ గర్భాలయాన్ని వేరుచేసే తెరతొలగించ బడినపుడు, మానవుడీ భగవంతునితో ముఖాముఖి మాట్లాడతాడు. అతని వాణిని వింటాడు. అతని వెలుగును స్వీకరిస్తాడు. అతని శక్తితో, శక్తిలో పనిచేస్తాడు. పుట్టుకలేని, సనాతనుడైన భగవంతునిలోనికి దేహధారియైన మానవుని పరమోద్ధరణ సాధ్యమౌతుంది. ఇపుడతడు భగవంతునితో నివసిస్తూ, తన సర్వచేతనను అతనిలోనికి అర్పించి వేయ సమర్థుడౌతాడు. దీనినే గీత ఉత్తమలేక పరమ రహస్యమని చెప్తుంది (4-3). కొంతమంది తమ మానవ భావంలోనే నివసిస్తూ తమను గమనిస్తూ సూచనలిస్తూ, నడుపుతుండే దివ్యవిజ్ఞానం (Gnosis) యొక్క కొంచెం శక్తి, ప్రకాశం, లేక ప్రేమను పొంది ప్రపంచం లో నాయకులౌతారు. అలాగాక, మానవునిలోని భగవంతుడు మానవ చేతనను[1] ఆంశికంగానో, పూర్ణంగానో ఆవహించి, ప్రత్యక్షంగా జగద్గురువు, ఆచార్యుడు, నాయకుడుగా అయి తన దివ్య విజ్ఞానం నుండే ఎప్పడు సరాసరి వ్యవహరిస్తాడో, అప్పడతడు
అభివ్యక్తమైన అవతారం (16-వ వ్యాసమున అభివ్యక్తమైన అవతారపు స్థాయిని ఇంకో మెట్టు పెంచుతారు) లోపలి భగవంతుడు, నారాయణుడని చెప్పబడే మానవునిలోని నిత్యావతారం. మానవరూపంలో అతని అభివ్యక్తి, బాహ్యజగత్తులో అతని సంకేతం, వికాసం అవుతాడు.

5. లోపలి కృష్ణుడే మనకు ముఖ్యుడు:

అవతారతత్త్వాన్నిలా అర్థం చేసుకొన్నపుడు, మన ప్రస్తుత విషయమైన గీత, మూల బోధనకోసం గాని, సామాన్య ఆధ్యాత్మిక జీవనంకోసం గాని, అవతారంయొక్క బాహ్యరూపానికి అల్ప ప్రాముఖ్యం మాత్రమే ఇస్తుంది. క్రీస్తు చారిత్రకతను గురించి యూరోపులో చెలరేగిన వాదవివాదాలు అంతర్దృష్టి గల భారతీయునికి కాలం వృధా చేయడంగా కన్పిస్తుంది. అతడు దానికి కొంత చారిత్రక విలువనే యిస్తాడు గాని, ఎట్టి మత ప్రాముఖ్యాన్ని దాదాపు ఇవ్వడు. ఆధ్యాత్మిక

---

[1] చైతన్య ప్రభువు ఇట్లు ఆవహింపబడేవాడు - శ్రీఅరవిందు

అనుభవంచేత లోపలి క్రీస్తును ఎరుగగలిగి, అతని సందేశప్రకాశంలో పైకెగసి జీవిస్తూ శిలువ చిహ్నముగా ఉన్నటువంటి ప్రాయశ్చిత్తంతో నిమ్న ప్రకృతిబారినుండి తప్పించుకొన గలిగినట్లైతే, బాహ్యంగా జోసెఫ్ అనే వడ్రంగికి ఏసు పేరుతో ఒకరు పుట్టారో, లేదో, దానితో మనకేం ప్రయోజనం? అలాగే మనకు ముఖ్యంగా కావలసిన కృష్ణుడు, భగవంతుని సనాతనావతారంగా లోపలనున్న కృష్ణుడేగాని,మానవులకు చారిత్రక గురువు, నాయకుడు అయినటువంటి కృష్ణుడుగాడు.

6. చారిత్రక కృష్ణుడును సత్యమే

కావున గీతా శాస్త్రసారాన్ని అన్వేషించడంలో, కురుక్షేత్రంలో పార్థసారథిగా, అర్జునుని గురువుగా మహాభారతం మనముందుకు దెచ్చి చూపుతున్న మానవ-దివ్య కృష్ణుని యొక్కచారిత్రక సత్యంతో గాక, మనకు ప్రమేయముండేది ఆధ్యాత్మిక మర్మంతోనే. అయినప్పటికీ చారిత్రక కృష్ణుడు నిస్సంశయంగా సత్యం. మున్ముందుగా కృష్ణనామం మనకు ఛాందోగ్యోపనిషత్తులో కన్పిస్తుంది. అచట అతడు బ్రహ్మవేత్తగా, ఆధ్యాత్మిక సంప్రదాయంలో సుప్రసిద్ధుడు. అదే ఉపనిషత్తులో విచిత్ర వీర్యుని పుత్రుడగు ధృతరాష్ట్ర మహారాజు కూడా పేర్కొనబడ్డాడు. ఇక వీరిరువురు మహాభారత వ్యవహారంలో ప్రముఖ పాత్రలు గనుక, వీళ్ళు సమకాలికులనీ, మహా భారత మహాకావ్యం, చారిత్రక పాత్రలతో, జాతి స్మృతిపై దృఢంగా ముద్రపడిన చారిత్రక యుద్ధంతో వ్యవహరిస్తున్నదనే, నిర్ణయానికి మనం రావచ్చు. క్రీస్తు పూర్వశతాబ్దాల్లో కృష్ణార్జునులను మతపరంగా పూజిస్తూండే వారనీ మనకు తెలుసు. ఆ మతమొక ధార్మిక, దార్శనిక సంప్రదాయమని అనుకోడానికి కారణం వుంది. ఈ సంప్రదాయంలో నుంచే గీత తన సూత్రాలలో అనేకమైన వాటిని, తన జ్ఞాన భక్తి, కర్మ సమన్వయపు మూలాన్ని సైతం సేకరించి ఉండ వచ్చు. అంతేగాక మానవ కృష్ణుడు ఈ సంప్రదాయాన్ని స్థాపించిన లేక పునరుద్ధరించినవాడు, లేదా కనీసం దాని మొట్టమొదటి గురువుల్లో ఒకరని అనుకోవడానికి ఆధారం వుంది. గీత యొక్క రూపం, తర్వాత మారినప్పటికీ, అది భారతీయ చింతనా పరంపరలో, చారిత్రక కృష్ణోపదేశం యొక్క పరిణామమునే తెలియజేస్తుంది. అంతేగాక కృష్ణునితోనూ, అర్జునితోనూ, కురుక్షేత్ర సంగ్రామంతోనూ ఉపదేశానికి గల సంబంధం నాటకీయ కల్పనను మించిన సత్యం అవుతుంది. మహాభారతంలో శ్రీకృష్ణుడు రెండు విధాలా-చారిత్రక పాత్రగా, భగవదవతారంగా - చిత్రించబడ్డాడు. కనుక భారతకావ్యం

వ్రాయబడే నాటికే, స్పష్టంగా క్రీస్తుపూర్వం 5-1 శతాబ్దం నాటికే శ్రీకృష్ణుని ఉపాసించడం, అతడు అవతారం అనేది అంగీకరించడం వుంది. అంతేగాక బృందావనంలో కృష్ణుడు బాల్య జీవన కథ లేక గాథకు సంబంధించిన సూచన కూడా మహాభారతంలో వుంది. ఈ బాల్య జీవనం శక్తివంతమైన ఆధ్యాత్మిక సంకేతంగా పురాణాల్లో పెంపొంది, భారతీయుల ధార్మిక చిత్రం మీద ఎంతో ప్రభావం చూపింది. హరివంశ గ్రంథంలో కృష్ణుని వృత్తాంతం కన్పిస్తుంది. అనేక కథలతో నిండివున్నా, ఇదే పురాణ కథనాలకు ప్రాతిపదికగా వుండి వుండవచ్చు.

7. హృదయంలో నిలిచివున్న అవతారానికే ప్రాముఖ్యం:

దీనికంతా విశేషచారిత్రక ప్రాముఖ్యత ఉంది; అయినప్పటికీ మన ప్రస్తుత విషయంలో దీనికెటువంటి విలువాలేదు. గీత మన ముందుంచే దివ్యగురువు యొక్క ఆంతర రూపంతోనూ, జీవుని ఆధ్యాత్మిక ప్రబోధానికీ, ఆ రూపంగా ప్రసరించే శక్తితోనూ మాత్రమే మనకిపుడు ప్రమేయముంది. మానవరూప అవతారతత్త్వాన్ని గీత ఆమోదిస్తుంది. ఎందుకనంటే "నాకెన్నియో జన్మలు గడిచినవి (4-5), యుగ, యుగమున నేను జన్మింతును (4-8)" - అని భగవానుడు తెలుపు తున్నాడు. అతడు సనాతనడై వుండే, పుట్టుకలేనివాడైవుండీ తన మాయ చేత సంభూతి నియమాలైన పుట్టుట, పెరుగుట, మొదలైన భావాన్ని స్వీకరిస్తాడు; దీనినే జన్మ అంటాం. ఇక్కడ మాయ అంటే బాహ్యంగా పరిమిత రూపాల చొక్కాను ధరించగల అనంత చేతనకుగల అద్భుత శక్తి. కాని గీత ఒత్తి చెప్పేది ఈ బాహ్య రూపాన్ని గాదు. అతీత, విశ్వగత, అంతరంగ భగవంతుడు, అంటే సర్వభూతాల కు మూలం, సర్వ భూతాలకు నియామకుడు (5-29), రహస్యంగా మానవుని లోపల హృదయంలో నివసించే భగవంతుడు. ప్రచండ, ఆసురిక తపస్సు చేయువాడు లోపల ఉన్న నన్ను బాధపెడ్తాడు (17-6); మానవ శరీరంలో నివసిస్తున్న నన్ను అవమానించేవాళ్ళు పాపులు (9-11); హృదయంలో ఉండేనేను భక్తుని అజ్ఞానాంధకారాన్ని సముజ్వల జ్ఞాన దీపంతో నాశనం చేస్తాను (10-11) - అని చెప్పిన వాడు అంతరంగంలోఉన్న భగవంతుడే, హృదయంలోని సనాతన అవతారమే. ఇతడు జీవితార్థాన్ని, దివ్యకర్మ రహస్యాన్ని తేటతెల్లంచేస్తాడు. దివ్యజ్ఞానం, ఉపదేశాల వెలుగునిస్తాడు. అంతేగాక మానవాత్మ ప్రపంచ రహస్యాన్నెదుర్కొని, దారి తెలియక పరితపించే సమయంలో, అతనికి బలాన్ని, విశ్వాసాన్ని కలిగించే పలుకును పలుకుతాడు. విగ్రహం ద్వారాగాని, అవతారాల నుపాసించడం ద్వారాగాని, గురువును, లోపలి

గురువుకు ప్రతినిధిగా భావించి, పూజించుటంతోగాని, భారతీయుల ధార్మిక చేతన ఈ ఆంతర భగవంతుణ్ణే సమీపంచ గోరుతోంది. వీటిద్వారా అంతర్వాణిని విని, రూపంలేని వాని రూపాన్ని ఆవిష్కరించుకొని, అప్పడు అభివ్యక్తమయ్యే దివ్యశక్తి, ప్రేమ, జ్ఞానాలతో భక్తుడు వ్యవహరించ ప్రయత్నిస్తాడు.

8. కృష్ణుడు సారథ్యం వహించడంలోని రహస్యం:

రెండవ విశేష మేమిటంటే మానవ కృష్ణుడు భారతమహా యుద్ధానికి, బాహ్యంగా నాయకత్వం వహించకుండా, దాని వెనుక దాని రహస్య కేంద్రంగా వుండి, అజ్ఞాతంగా దానిని నడుపుతాడు; కృష్ణుని సారథ్యం, కత్తిపట్టని సారథ్యం, ఈ సత్యానికి లక్షణం, దాదాపు సంకేతం కూడా. ఆ యుద్ధం, వ్యక్తులు, జాతులు, అందరు పాల్గొనిన ప్రపంచమహా యుద్ధం. వాళ్లల్లో కొందరు స్వీయ లాభం లేకుండానే ఒక ఉద్యమ సహాయకులుగా పాల్గొన్న వాళ్ళు. వీరికి మానవ కృష్ణుడూ విరోధే. అతడు వీళ్ల వ్యూహాలను తారుమారు చేసి వారిని హతమార్చిన వాడయ్యాడు. వీళ్లకు కృష్ణుడు ప్రాచీన వ్యవస్థకు నిప్ప పెట్టిన అధర్మ ప్రేరకుడిగా కన్పిస్తాడు. మరికొందరు ఉద్యమాన్ని పూర్తి చేసే ప్రతినిధులుగా యుద్ధం లో పాల్గొన్న వాళ్ళు. వీళ్లకు కృష్ణుడు సచివుడు, సహాయకుడు, మిత్రుడు. ఎచట ఉద్యమ కర్మ తన సహజగతి ననుసరిస్తుందో, లేక ఎక్కడ శత్రువులు పెట్టే బాధల వలన తన పక్షం వాళ్ళు అగ్ని పరీక్షలకులోనై, తద్వారా తర్వాత పాలకులుగా కావడానికి సిద్ధం కావలసివుందో, అచట కృష్ణుడు కన్పించడు, ఒక వేళ కన్పించినా కొంచెం ఓదార్చడానికే కన్పిస్తాడు. కాని ప్రతి సంకటం లోనూ అతని అదృశ్య హస్తం అనుభూత మౌతూనే ఉంటుంది. (ద్రౌపదికి వలువలిచ్చిన హస్తం); అయితే అది అదృశ్యంగా వుంటుంది గనుక, అందరూ స్వయంగా తామే కార్యకర్త లమని ఊహించుకొంటారు గాని, ఉపకరణాలం మాత్రమేనని తెలుసు కోలేరు. కృష్ణుని ప్రాణమిత్రుడు, ప్రధాన ఉపకరణం అయినటువంటి అర్జునుడు కూడా ఈ విషయాన్ని తెలుసుకోలేక పోయాడు. తన దివ్యసఖుని యథార్థ రూపాన్ని తెలుసుకోలేకపోయాడు. అర్జునుడు, కృష్ణుడందించిన జ్ఞానంనుండి హితోపదేశాన్ని, అతని శక్తినుండి సహాయాన్ని పొందినప్పటికీ, అతనిని ప్రేమించి, ప్రేమించబడినప్పటికీ, అతని దివ్య స్వరూపం తెలియకుండానే, సాక్షాత్తు ఆరాధించినప్పటికీ, అర్జునుడు కృష్ణునిచేత చివరివరకు అందరిలాగానే తన అహంకారం తోనే నడుపబడ్డాడు. పరిస్థితులు విషమించి, సర్వమూ, కురుక్షేత్రంలో,

భయంకర సంగ్రామరూపం ధరించగా, తనతోబాటు, యుద్ధ భవిత వ్యాన్ని గూడ తేల్చే రథంలో, ఇప్పటికూడా యోధుడుగా గాక, సారథిగానే కృష్ణుడు పాదం పెట్టే చివరి క్షణం దాకా అతడు తాను కావాలను కొన్నవారికి గూడా తానేమిటో చెప్పలేదు.

9. సమస్తక్రియా దివ్య గురువు పరిధిలోనిదే:

ఇలా మానవ జాతితో (లోపలి) భగవంతుని వ్యవహారానికి, మానవ కృష్ణుడు ప్రతీకలా తయారవుతున్నట్లు కన్పిస్తున్నాడు. ఎందు కనంటే, మనల్ని, మన అహంకార జ్ఞానాల ద్వారా లోపల ఉన్న భగవం తుడు నడుపుతున్నట్లే, బాహ్య కృష్ణుడు గూడా అర్జునుడు మొదలైన వాళ్లను చివరి క్షణం దాకా, వాళ్ల వాళ్ల అహంకార జ్ఞానాల ద్వారానే నడిపాడు. ఇందుచేత మన కర్మలకు మనమే కర్తల మనుకొంటాం. మనకు లభించే ఫలితాలకు మనమే కారణమని గర్వపడతాం. ఇక మన కర్మ ప్రేరణను గురించి మనకేమీ తెలియనట్లే, ఏదో ఒక వెలుగు లేక శక్తి ఆ ప్రేరణకు మూలమని మనకెప్పుడైనా అస్పష్టంగా అన్పిస్తూ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఆ మూలం మానవ మూలమేనని అన్పిస్తుంది. (కృష్ణుడు అర్జుననకు మానవుడిగానే అన్పించాడు) ఆ మూలస్వరూపాన్ని తెలియకుండానే, ఆరాధిస్తాం కూడా. బాహ్యరూపం వెనుక ఉండే స్వరూపాన్ని - విశ్వరూపాన్ని - గాంచి చకితులమయ్యే దాకా ఇలాగే చేస్తుంటాం. ఆంతరజీవితం విషయంలోనే గాక, సమస్త జీవనక్రియలో గూడా అవతార భగవంతుడు వ్యవహరిస్తాడు. మనకు అంతుబట్టని ప్రపంచం యొక్క, అస్పష్టగతికి సంబంధించిన సమస్య లను గూడ అతడు తన చేతిలోనికి తీసుకొంటాడు. లౌకిక కర్మకు సంబంధించిన క్లిష్ట సమస్యను పరిష్కరించే సందర్భం నుండే గీతోప దేశం వెలువడింది. అదే దాని విశిష్టత. కాబట్టే గీత కర్మ సిద్ధాంతం, ప్రముఖమైందిగా, ఎంతో ఉన్నతమైందిగా కన్పిస్తుంది. కర్మపై ఇటువంటి సునిశిత విశ్లేషణ ఇతర భారతీయ శాస్త్రాల్లో కన్పించదు. గీతలోనేగాక, భారతంలో ఇతర ప్రకరణాల్లో కూడా కృష్ణుడు కర్మావశ్యకతను గట్టిగా ప్రవచిస్తాడు. కాని గీతలో మాత్రమే అతడు కర్మరహస్యాన్ని, మనం చేసే కర్మ వెనుక నున్న మూలాన్ని ప్రకటించాడు.

10. గీతాగురువు కర్మాధీశ్వరుడు.

కృష్ణార్జునులకు, అనగా దివ్యాత్మ మానవాత్మలకు గల సంకేత రూప సఖ్యం ఇతర భారతీయ గ్రంథాల్లో గూడ వర్ణించబడింది. 1. ఇంద్రుడూ, కుత్సుడూ ఒకే రథంలో ఆసీనులై స్వర్గానికి పయనించారు.

2. కఠోపనిషత్తులో ఒకే వృక్షం మీద నివసించు రెండు పక్షుల సంకేతం (Symbol) గలదు. 3. జ్ఞానం కోసం కలసి తపస్సు చేసిన నర నారాయణ ఋషుల రెండు రూపాలు, ఈ మూడు రూపకాల్లోనూ, దేనిలో, గీత ప్రకారం (4-33), సర్వకర్మ పరిసమాప్త మౌతుందో, అట్టి జ్ఞానమే లక్ష్యం. కాని గీతలో కృష్ణార్జునుల సఖ్యానికి లక్ష్యం జ్ఞానానికి దారితీసే కర్మ, అంతేగాక దివ్య జ్ఞాత అంటే భగవంతుడే ఇచట కర్మక్షేత్రంలో ప్రత్యక్షమౌతాడు. ఇచట కృష్ణార్జునులు - దేవుడు, మానవుడు - ఒక ప్రశాంతాశ్రమంలో ధ్యానం చేస్తూగాక, భీషణ యుద్ధ రంగంలో శస్త్రాస్త్ర సంఘట్టనాల మధ్య, సంగ్రామ రథంలో సారథిగా, రథిగా కలిసి దర్శనమిస్తారు. కాబట్టి గీతాగురువు జ్ఞాన ప్రపంచంలో మాత్రమే గాక తనను ఆవిష్కరించుకొనే మానవునిలోని భగవంతుడేగాక, మన కర్మ ప్రపంచ మంతటినినడిపే మానవునిలోని భగవంతుడు గూడా అవుతాడు; ఇతని చేతే, ఇతని కోసమే మన మానవ జాతి అంతా మనుగడ సాగిస్తోంది. పెనగులాడుతోంది. ఇంకా శ్రమిస్తోంది. ఇతని దిశగానే మానవజీవన మంతా పయనిస్తోంది. పురోగమిస్తోంది. ఇతడు కర్మ యజ్ఞాల రహస్య ప్రభువు, సర్వమానవుల సుహృదుడు.

మానవ శిష్యుడు

1. దివ్యగురు రేఖాచిత్రము

కావున గీతయొక్క దివ్యగురు వట్టివాడు, సనాతనావతారము, మానవ చేతనలోని కవతరించిన భగవంతుడు, సర్వభూతముల హృదయమునం దాసీనుడైన ఈశ్వరుడు (18-61); తన సత్తయందు తాను అభివ్యక్తముచేసిన ప్రపంచమహాక్రియను దృశ్య, స్పృశ్యములగు రూపములు, శక్తులు, మరియు ప్రవృత్తుల తెరవెనుకనుండి అతడు నడుపును; అటులే వ్యక్తిగతముగా తెరవెనుకనుండి మన సమస్తచింతన, క్రియ మరియు హృదయాన్వేషణలను త్రిప్పుచుండును. మనమీతెరను చీల్చివేసి, మన బాహ్యాత్మ వెనుకనున్న (దివ్యగురురూపమగు) ఈ వాస్తవాత్మను పొందగలిగినపుడు; మన సత్తయొక్క ఈ సత్యప్రభువు నందు మన సమస్తసత్తను చూడగిలిగినపుడు; ఏకమాత్రము, వాస్తవమునగు ఈ పురుషునికి, పురుషునిలోనికి మన వ్యక్తిత్వమునంతను సమర్పించి వేయగలిగినపుడు; సదా చెదరిపోవుచు, తిరిగి సదా

కూడుకొనుచునుండు మన మానసిక క్రియలను ఇతని పూర్ణప్రకాశములో లీనముచేయగలిగినపుడు; చంచలము, ప్రయాసగ్రస్తమునగు మన సంకల్పమును, చేష్టలను ఇతని వ్యాపక, జ్యోతిర్మయ, అవిభక్త మహాసంకల్పమునకు నివేదించగలిగినపుడు, మన విక్షిప్త, బహిర్ముఖ కామనలు, మరియు భావావేగములను ఇతని స్వయంసిద్ధానందము యొక్క పూర్ణతలో సన్యసించి, ఆ సన్యాసముచేతనే వానిని తృప్తి పరచగలిగినపుడు-అపుడు మన ఊర్ధ్వముఖ ప్రయత్నము యొక్క క్లేశమంతయు సంతృప్తసాఫల్యము నందు ఉపశమించును, ఇతడే జగద్గురువు; ఇతరుల అత్యున్నతోపదేశ మంతయు ఇతని సనాతనజ్ఞానము యొక్క వివిధ ప్రతిబింబము మరియు అంశికవచనము మాత్రమే; ఇతని వాణికే మన ఆత్మశ్రుతి మేల్కొనవలెను.

౨. అర్జునుడు మానవ ప్రతినిధి

అర్జునుడు, యుద్ధరంగమున ఉపదేశమును బొందు శిష్యుడు, ఈ భగవద్భావనకు ప్రతిరూపము; ఇతని కింకను జ్ఞాన మబ్బలేదు, కాని జ్ఞానమబ్బుటకు అర్హత గడించిన సాధక మానవుల కితడు ప్రతినిధి (నమూనా) - మానవుని యందలి ఉన్నత దివ్యాత్మతో సన్నిహిత సఖ్యము గలిగి ప్రపంచమునందు కర్మ చేయుటచే నితని కీ అర్హత అబ్బినది. గీతయు, గీతకు మాతృకయగు మహా భారతము సైతము అంతర జీవనమును చిత్రించు ఒక రూపకము, దీనికి బాహ్యమానవజీవనము మరియు క్రియతో నెట్టి సంబంధము లేదు: అంతరాత్మకును. మనలోపల మనపై నధికారము కొరకు పెనగులాడు శక్తులకును మధ్య జరుగు యుద్ధములను మాత్రమే అవి తెలుపును-అని వాఖ్యానించు ఒక పద్ధతి గలదు. మహాభారతముయొక్క సామాన్య స్వభావముగాని, వాస్తవ భాషగాని యీ దృష్టిని పోషించదు, మరియు దీనికే ప్రాముఖ్యమిత్తుమేని, ఇది గీతయొక్క సరళ, దార్శనిక భాషను క్లిష్టము, అయోమయము గావించును. వేదభాషయు, కొంతవరకు పురాణభాషయు సంకేతాత్మకమ్మైన, తెరవెనుక నుండు సూక్ష్మవస్తువుల రూపకములతోను, స్థూలచిత్రణలతోను నిండియుండును; కాని గీత స్పష్టపదములలో వ్రాయబడి, మానవ జీవితము లేవనెత్తు పెద్దపెద్ద నైతిక, ఆధ్యాత్మిక కఠినతలను పరిష్కరింప ప్రతిజ్ఞ చేయును. కావున స్పష్టమగు గీతాభాషను, భావమును విరిచి విరిచి, మన కల్పనను

బోషించుకొనుట భావ్యముగాదు. కాని ఈ దృష్టిలో ఈ మాత్రపు సత్యమున్నది; గీతాసిద్ధాంత సన్నివేశము (లోపలి విషయమును సూచించు) ఒక సంకేతము గాకపోయినను, అది (అందరికి వర్తించు) ఒక ఆదర్శము (నమూనా); అట్లు గానిచో సన్నివేశమునకు, సిద్ధాంతమునకు నెట్టి సంబంధము నుండదు. అర్జునుడిచ్చట జనులు, జాతులు పాల్గొనుచున్న ఒక ప్రపంచ మహా సంగ్రామము యొక్కయు, భగవంతుడే నడుపుచున్న ఒక మహోద్యమము యొక్కయు ప్రతినిధి మానవుడు. కర్మ ప్రధాన మానవులు ఒక్కొక్కపుడు తమ కర్మ విషయమున అత్యుత్కట, అతిభీషణ సంకటములోబడి, జీవనసమస్య నెదుర్కొందురు, ఆధ్యాత్మిక స్థితితో, లేక కేవల నైతికాదర్శనముతో సైతము జీవనమునకు గల బాహ్య విరోధము వలన భ్రాంతచిత్తు లగుదురు: అట్టివారికి అర్జును డాదర్శము.

3. అర్జునుడు కర్మియే గాని మౌనిగాడు

దివ్యకృష్ణుడు సారథికాగా, నదే రథమున అర్జునుడు యోధుడు. వేదము నందును మన కీ రూపకము (image) తగులును : మానవాత్మయు, దేవుడును ఒకే రథమున స్వారి చేయుచు, యుద్ధము ద్వారా ఒక సమున్నతాకాంక్షాగమ్యమునకు పురోగమింతురు. కాని అచ్చటి పయనము ఒక శుద్ధ అలంకారము మఱియు సంకేతము. అచ్చటి దేవుడు ఇంద్రుడు, ప్రకాశము మఱియు అమృతత్వముల లోకమునకు అధిపతి; దివ్యజ్ఞానశక్తియగు ఈ ఇంద్రుడు అనృతము, అంధకారము, పరిమితత్వము, మర్త్యత్వముల సంతానముతో యుద్ధము సలుపుచున్న మానవ సాధకుని సాహాయ్యార్థము దిగివచ్చును; ఇచ్చటి యుద్ధము మన సత్తయొక్క ఊర్ధ్వలోక మార్గమున కడ్డువచ్చు ఆధ్యాత్మిక శత్రువులతో; ఇక దీని గమ్యమొక సువిశాలసత్తా భూమిక, ఇది పరమసత్యము యొక్క తేజోవిరాజమానము, ఇంద్రపాలితమును; సంసిద్ధి బొందిన అంతరాత్మ ఇచ్చట సచేతనామృతత్వ మనుభవించును. పోగా ఇచ్చటి మానవాత్మకుత్సుడు, అనగా శబ్దార్థమును బట్టి, ఋషి - జ్ఞానము నపేక్షించు సాధకుడు; ఇతని తండ్రి అర్జునుడు - తెల్లనివాడు, తల్లి స్విత్ర - తెల్లనిది; అనగా నీ కుత్సుడు సాత్త్వికము మఱియు ప్రకాశపూర్ణమునగు అంతరాత్మ, ఇట్టి ఆత్మ దివ్యజ్ఞానము యొక్క సంతతవైభవమునకు ఉన్మీలితమై యుండును. చివరకు ఆ రథము ప్రయాణాంతమగు ఇంద్రుని స్వధామము చేరుకొనినపుడు, కుత్సుడు తన దివ్య సఖునితో సంపూర్ణ సాదృశ్యములోనికి పెరిగియుండును;

వీరిని, వీరు వీరని తెలిసికొన ఇంద్రుని సతియగు ఒక్క శచీదేవికే సాధ్యము, ఏలన ఆమె "ఋత-చేతన" (Truth-Conscious). ఈ రూపక విషయము స్పష్టముగా మానవుని అంతరజీవనము; ప్రవర్ధమాన జ్ఞాన ప్రకాశముచేత మానవుడు సనాతన భగవంతుని సాదృశ్యములోనికి పెరుగుట నీ రూపకము తెలుపును. కాని గీత కర్మనుంచి ఆరంభించును, మఱియు నర్జునుడు కర్మిగాని, జ్ఞానికాడు; యోద్ధగాని, ముని లేక మేధావి గాడు.

4. అర్జునుని కర్మస్వరూపము ఆదినుండియు స్పష్టమగును

గీతారంభము నుండియు శిష్యుని ఈ ప్రత్యేక స్వభావము సూచింపబడి, మఱల మఱల చెప్పబడును. తాను ఆచరించవలసిన ఘోర సంహారభావమునకు అతడు మేల్కొనిన రీతియందును, అతని మనస్సులో నుదయించు అనంతర ఆలోచనలందును, సర్వానర్థము నుండియు అతనిని విముఖుని గావించిన దృక్కోణము మఱియు మానసిక ప్రేరణలయందును అతని స్వభావము తొలుత వ్యక్తమగును. ఆ ఆలోచనలు, దృక్కోణము, ప్రేరణలు అట్టి జీవన సమస్య నెదుర్కొనిన ఒక దార్శనిక లేక గంభీర మననాత్మక లేక ఆధ్యాత్మిక స్వభావమునకు జెందవు. ఇవి వ్యావహారిక లేక ఫలపరాయణ మానవునికి, భావిక, ఇంద్రియాధీన, నైతిక, మఱియు బౌద్ధిక పురుషునికి జెందునని చెప్పవచ్చును; ఇట్టి మానవుడు గంభీర, మౌలికచింతనకు గాని, లోతులను కనిపెట్టుటకుగాని అలవడి యుండడు, ప్రత్యుత ఉన్నతము, కాని రూఢమగు ఆలోచనా ప్రమాణములకును, మార్పులు మఱియు కష్టములను ఆత్మ విశ్వాసముతో దాటుటకును అలవడి యుండును. మఱియు తన ప్రమాణములు తనకిపుడు పనికిరాలేదనియు, తనయందును, తన జీవితమునందును తనకు గల విశ్వాసాధారము ఒక దెబ్బతో కొట్టివేయబడినదనియు అతడిపుడు కనుగొనును. ఇదియే అతనిని పైకొనిన సంకట స్వరూపము.

5. అర్జునుడును గుణాధీనుడే

గీతాభాషలో, నర్జనుడును, జనసామాన్యమువలె, గుణాధీనుడు మఱియు అలవాటుచొప్పన, యథారీతి వాని క్షేత్రమునందే చరించును. అయితే అతడు విశుద్ధుడు, సాత్వికుడునై, ఆ మేరకు తన పేరును సార్థకము చేసికొనును. అనగా ఉన్నత, విస్పష్ట సూత్రములు మఱియు ప్రేరణలచే పాలింపబడుచు, తా నెఱింగిన ఉదారతమ ధర్మముచే తన నిమ్నప్రకృతిని అభ్యాసవశమున నియమించుకొనును.

అతనిది ఉద్దండ అసురప్రకృతిగాదు, అతడు తన ఆవేగములకు దాసుడుగాడు; తాను బొందిన శిక్షణ వలన నతడు శాంతుడు, దాంతుడు; తన విధులను తు.చ. తప్పకుండ ననుష్ఠించును; తన కాలము మఱియు సమాజముయొక్క ఉత్తమ సిద్ధాంతములకును, తనకు ఉగ్గుబాలతో నబ్బిన మతము మఱియు నీతి సూత్రములకును దృఢ విధేయుడుగా నుండును. అతనికిని ఇతరులకువలెనే అహంకార మున్నది, కాని అది సాత్విక మగుటచే, కేవలముగా లేక ప్రధానముగా తన ప్రయోజనములు, కామనలు, మఱియు నా వేగములనే గాక, నైతిక ధర్మమును, సమాజమును. ఇతరుల అధికారములను గూడ పాటించును - నైతిక, సామాజిక నియమావళి రూపమగు శాస్త్రము ననునరించి అతడు జీవించును, వర్తించును. అతడు శిరసావహించు ప్రమాణము 'ధర్మము' - ధర్మ మన మతపర, సామాజిక నైతిక ప్రవర్తనా నియమమునకు సంబంధించిన భారతీయుల సామూహిక భావన; విశేషించి, ధర్మమన క్షత్రియ వర్ణము యొక్క పదవి మఱియు కర్మకు వర్తించు నియమము. క్షత్రియుడగు అర్జునుడు ధీరుడు, సంయతుడు, ఉదారుడగు రాజపుత్రుడు మఱియు యోధుడు, ఆర్యజాతినాయకుడు. ఈ క్షాత్ర ధర్మము ననుసరించుచు, సద్గుణ సదాచారముల నెఱింగి, అతడింత వఱకు వచ్చి, అదే ధర్మమిపుడు తన నొక మహోగ్ర సంహారమునకు ప్రధాన పాత్ర గావించినదని ఆకస్మాత్తుగా కనుగొనును - ఈ కరాళ అంతర్యుద్ధమునందు సంస్కృతిసంపన్న ఆర్యజాతులన్నియు పాల్గొనుచున్నవి. ఇది పురుషపుంగవుల నందరిని తప్పక సర్వనాశన మొనరించును, దీనివలన వారి వ్యవస్థిత నాగరికతకే కల్లోల వినాశముల ముప్వ కలుగును.

6. ఇంద్రియముల ద్వారా అర్థ స్ఫూర్తి

అర్జునుడు కర్మ ప్రధాన మానవుడనుటకు మఱియొక లక్షణమేమన, తన కర్మయొక్క అర్థము అతనికి ఇంద్రియ సంవేదలన ద్వారా స్ఫురించును. ఎట్టి గంభీరతరాశయముతోను గాక, సగర్వముగా అధర్మపరులను తేఱిపాఱజూచి, ఆహవఖేలయందు వారిని తుదముట్టించు కోరికతోనే ఉభయ సేనల మధ్య, రథము నిలుపుమని, అర్జునుడు తన సారథి నభ్యర్థించును. అట్లు తేఱిచూచునపుడే, అంతర్యుద్ధముయొక్క అర్థము అతనికి ప్రత్యక్షమగును. ఎట్లు? ఒకే జాతికి మాత్రమేకాక, ఒకే కుటుంబమునకు చెందినవారు

ఎదురెదురుగా నిలిచియున్నారు. సాంఘిక మానవుడెవరిని ప్రియపవిత్రులనుగా భావించునో, అతడట్టి వారితో తలపడి, వారిని వధించవలెను - వారు తాను పూజించిన ధనురాచార్యుడు, తనను లాలించిన పితామహుడు, వరుసనుబట్టి తాతలు, మామలు, తండ్రులు, పుత్రులు, పౌత్రులు-ఈ రక్తసంబంధము లన్నింటిని రణఖడ్గముతో ఛేదించవలెను; ఈవిషయ మతనికి ముందు తెలియదని కాదు, కాని అది అతనికి గ్రుచ్చుకొనలేదు. నాకు హక్కులు గలవు, నా కపరాధము జరిగినది. నేను క్షత్రియుడను గనుక, న్యాయముకొఱకు పోరాడి, అన్యాయమును, అరాజ కాత్యాచారమును రూపుమాపుట నాధర్మ - మను చింతనయే ఇంతదనుక అర్జును నావహించి యుండెను; అతడు సంహారపరిణామము నింతదనుక లోతుగా చింతించలేదు. తన హృదయమును, మఱియు తన ప్రాణకేంద్రమున దాని ననుభవించలేదు. కాని ఇపుడు దివ్యసారధి సంగ్రామార్థమును అతని అంతర్నేత్రమునకు జూపి సాంవేదనికముగా అతని బహిర్నేత్రము ముందుంచగా, అతని, సాంవేదనిక (sensational)'ప్రాణిక' భావిక సత్తయొక్క కేంద్రమునందే కొట్టిన దెబ్బవలె అది అతనికి తగులును.

7. అర్జునుని సంకటముయొక్క అంతస్తులు

దీని ప్రథమ ఫలితము ప్రచండమగునొక సాంవేదనిక మఱియు శారీరక సంకటము; ఇది కర్మవట్లను, దాని స్థూలఫలితములపట్లను, చివరకు జీవితము పట్లను జుగుప్స బుట్టించును. తర్వాత, అహంకారిక మానవాళి తన క్రియయందు అన్వేషించు సుఖ, భోగరూపమగు ప్రాణిక లక్ష్యమును అతడు నిరాకరించును; విశేషించి, క్షత్రియుని, ప్రాణికలక్ష్యమగు, విజయమును,శాసనమును, అధికారమును ప్రజాపాలనమును అతడు త్యజించివేయును. ధర్మము పేరిట జరుగు నీయుద్ధము వాస్తవముగా తనకొఱకు, తన భోగముకొఱకు, తన రాజ్యము కొరకుగాదా? కాని ఇంత మూల్యము చెల్లించి పొందదగిన వస్తువులు గావివి. ఏలన జాతీయ, సామాజిక జీవనమును సరిగా నిర్వహించు నిమిత్తమే తప్ప, స్వతః వీని కెట్టి విలువయు నుండదు. మఱియు తనవారిని చంపి, తనవారికొఱకు ఉద్దేశించిన ఈలక్ష్యములనే తాను చంపినవాడగును (1-33). దీనికి పిమ్మట అతని భావముల అక్రోశము వినబడును: ప్రతిపక్షమున నున్న వారు "స్వజనులు" (1-37). పృథివీనిమిత్తముగాని, త్రైలోకరాజ్యము నిమిత్తము గాని

ఎవరు వీరిని వధింపగోరును (1-35)? ఇట్టి కృత్యమునకు బిమ్మట జీవితమునం దేమి సుఖముండగలదు? తనపట్ల తనకెట్టి తృప్తి యుండగలదు? అహో! ఇదంతయు నొక భయంకర పాపము (1-36) - అని చెప్పి ఇపుడతని నైతిక భావము మేల్కొని, అతని సంవేదనలు మఱియు భావముల తిరుగుబాటును సమర్థించును. అది పాపము, పరస్పర సంహనన మునందు ధర్మము నుండదు, న్యాయము నుండదు; విశేషించి ఎవరిని చంపవలెనో, వారు పూజార్హులు, ప్రేమాస్పదులు గావున, వారిపట్ల గల పవిత్రభావముల నతిక్రమించుట ధర్మ మెట్లగును? నికృష్టమగు నేరమే యగును. పరిస్థితి నీ దశకు దెచ్చిన అపచారము, ఆక్రమణము, పాపారంభము, లోభాపరాధము, స్వార్థావేశము-అన్నియు ప్రతిపక్షమునుండియే వచ్చిన వను కొందము, అయినను ఇట్టి పరిస్థితులందు అన్యాయమును సాయుధముగా నెదిరించుట వారి పాపమును మించిన పాపమే యగును. ఏలన వారు లోభాంధులు గనుక వారికిది దోషమనియే తెలియదు; కాగా మనకిది దోషమని తెలియునుగాన తెలిసియే పాపమాచరించిన వారమగుదుము. మఱియు దేనికి పాపాచరణము? కులధర్మమును, సంఘ ధర్మమును, జాతి ధర్మమును రక్షించుటకా? ఈధర్మములే జాతి అంతర్యుద్ధ పిశాచికి ఆహారమగును; కులము నష్టప్రాయమగును, జాతి శీలము చెడును, వర్ణసంకరమగును; సనాతన జాతి ధర్మములు, కుల నైతిక ధర్మములు మాసిపోవును (1-43). జాతి వినాశము, ఉన్నత సంప్రదాయముల అవసాదము, నైతిక పతనము, అట్టి అపరాధులకు నరకప్రాప్తి - ఇవి మాత్రమే ఈ వికృత గృహ కల్లోలమునకు సంభవమగు వాస్తవఫలితములు (1-44) "కావున", అర్జునుడు గొంతెత్తి పలుకును, "శస్త్రపాణులగు దుర్యోధనాదులు నిరాయుధుడు, నిష్ప్రతీకారుడనగు నన్ను వధించుటయే నాకెక్కువ క్షేమకరము. చేయను నేను యుద్ధము." (1-46,47).

8. అర్జునుడు కర్మధర్మమును మాత్రమే కోరును.

కావున ఈ అంతఃసంకటము యొక్క స్వభావము మేధావిలో నుదయించు ప్రశ్నపరంపర గాదు; అది జీవితముయొక్క మిథ్యారూపముల నుండి పరావర్తనము (recoil) గాదు; అది వస్తుతత్త్వమును, జీవితార్థమును, నిగూఢ ప్రపంచ ప్రహేళికకు పరిష్కారమును అన్వేషింపగోరి దృష్టిని లోనికిమరలించుటయు గాదు. పోగా నది ఇంతదనుక కర్మతోను, దానిప్రచలిత ప్రమాణములతోను

తృప్తిపడియున్న మానవుని సాంవేదనిక, భావిక, నైతికవిద్రోహము (తిరుగుబాటు). ఏలన ఇపుడా ప్రమాణములే అతనినొక వికృతకల్లోలములోనికి జాఱవిడిచినవని అతనికి దెలియవచ్చెను. అవి ఇపుడు పరస్పరము విరోధించుకొనుచు, నిలుచుటకు ఏ ఆధారమును, అవలంభించుటకు ఏప్రాపును - "ధర్మమును" మిగుల్చలేదు. కర్మప్రధాన మానవున కింతకు మించిన సంకటము, వైఫల్యము, పరాభవము మఱియొకటుండదు. వస్తుతః ఈ విద్రోహము కడు సాధారణము మఱియు సహజము; సాంవేదనికముగా, నది భయము, జాలి, జుగుప్స పెనగొనిన ఒక ఉద్వేగము; ప్రాణికముగా, నది జనమాన్యము, పరిచితమునగు కర్మాశయము లందును, జీవితలక్ష్యములందును అభిరుచిని, విశ్వాసమును గోల్పోవుట; భావికముగా, నది సాంఘిక మానవుని అనురాగము, ఆదరము, కుటుంబ సుఖకామన, మఱియు తృప్తిరూపమగు సాధారణభావములు తమను చెఱబట్టు కఠోరకర్తవ్యము నుండి విముఖమగుట; నైతికముగా నదిపాపము, నరకము, రక్తసిక్త భోగముల (2-5) నిరాకరణమునకు సంబంధించిన ప్రాథమిక చిత్తవృత్తి, చివరకు వ్యావహారికముగా, నది కర్మప్రమాణములు కర్మఆశించు వ్యావహారిక ఫలితములనే నాశనముచేయు యుద్ధములోనికి దింపినవను చింత. కాని ఈ విద్రోహము యొక్క పూర్ణఫలిత మేమన, అర్జునుని ఆపాదమస్తకము ముంచెత్తిన ఒకడు దేనిని ఊతగా ధరించునో, ఏది వస్తువులను సంఘటితముగా ధరించునో, అది ధర్మము; అది స్వభావనియమము, కర్మప్రమాణము, జీవన నిబంధనము.

- శ్రీ అరవిందుడు

ఒక అంతరశూన్యత; అతని చేతనసత్త యంతయు - బుద్ధి, హృదయము, ప్రాణమే గాక, సర్వసత్తయు - భ్రమకు వశమై ఎచ్చటను, పనికివచ్చు నొక కర్మ ప్రమాణమును, అనగా ధర్మమును గనజాలకున్నది (2-7). ఈ కారణము చేతనే అతడు శిష్యుడుగా శ్రీ కృష్ణునాశ్రయించును; ఆచరణ దృష్ట్యా అతడిట్లు అభ్యర్థించును; నేను పోగొట్టుకొనిన దానిని నాకిమ్ము, ఒక యథార్థధర్మమును ఒక నిర్దిష్ట కర్మనియమమును, నేను తిరిగి నమ్మకముగా నడువగల ఒక మార్గమును జూపుము. అతడు జీవనరహస్యము గాని, జగద్రహస్యమును గాని, దీనికంతటికి అర్థమును గాని, ప్రయోజనమును గాని కోరడు, అతడు కోరునది ధ-ర్మ-ము.

౮. కృష్ణుడు మాత్రము ధర్మాతీతమునకు నడుపును.

అయినను సరిగా నీ రహస్యమునకు తన శిష్యుని నడుపుటయే పరమగురుని ఉద్దేశ్యము; ఏలన భగవంతుని యందు సచేతనముగా నివసించుచు, ఆ చేతన నుండియే కర్మచేయుటయను ఏకైక, విశాల, వ్యాపక నియమమును తప్ప, తక్కిన ధర్మము లన్నియు విడచివేయవలెననియే ఉపదేశఫలితము (18-66). కావున కర్మను నిర్ణయించు సాధారణ ప్రమాణములపై అతని తిరుగుబాటునకు తిరుగులేదని తెలిసికొని, దివ్యగురువు ఆత్మస్థితికి సంబంధించియే ఎక్కువ చెప్ప నారంభించును గాని, కర్మకు సంబంధించిన బాహ్య నియమమును గుఱించికాదు. అర్జునుడు ఆత్మయందు సముడైయుండవలెను (2-15); కర్మఫలమును త్యజించవలెను (2-47). పుణ్యపాపములకు సంబంధించిన బౌద్ధిక భావముల నతిక్రమించవలెను (2-50); మనస్సును సమాధిస్థము గావించి, అనగా భగవంతుని యందే స్థిరముగా నిలచి అట్టి యోగమునందు నివసించవలెను, కర్మచేయవలెను (2-53). అర్జునుడీ ఉపదేశముతో తృప్తిజెందడు; ఈ యోగస్థితి మానవుని బాహ్యక్రియనెట్లు మార్చునో, అతని మాటపై, నడతపై దాని ఫలిత మెట్లుండనో - అర్జునుడు తెలిసికొన గోరును. కాని కృష్ణుడు కర్మ వెనుకనున్న ఆత్మస్థితిని గుఱించియే ఇంకను, చెప్పనుగాని కర్మను గుఱించి కాదు. నిష్కామసమతయందు బుద్ధిని స్థిరముగా స్థాపించుటయే ఏకమాత్రావశ్యకత (2-56...) కాని ఇచ్చట తాను గోరిన కర్మ నియమము లేకపోగా, కర్మనిషేధమే గన్పించునుగాన, అర్జునుడసహనముతో బైటపడి అడుగును - "బుద్ధి కర్మకంటెను శ్రేష్ఠమని నీ మతమగుచో, స్వభావముచేతనే ఘూరమగు ఈ కర్మయందెందుకు నన్ను నియోగించుచున్నావు? మిశ్రవాక్యము చేత నా బుద్ధిని మోహింపజేయుచున్నట్లున్నావు; దేనివలన శ్రేయమును బొందగలనో, నిశ్చితముగా నట్టిదానిని చెప్పుము" (3-1,2). ఇట్లు కర్మ ప్రధాన మానవుని దృష్టిలో తాత్త్విక చింతనుకుగాని, అంతర జీవనమునకుగాని, స్వతః ఎట్టి విలువ యుండదు; ప్రపంచ జీవనమునకుగాని, ఆవశ్యకముగుచో, దాని పరిత్యాగమునకుగాని ఒక ప్రమాణము నివ్వగలిగిన మేరకే వానికి విలువ; ఏలన పరిత్యాగముకూడ ఒక స్పష్టమైన క్రియయే. కాని ప్రపంచమున జీవించుచునే, కర్మచేయుచునే, దానికి పైగా నుండుట - ఇది "మిశ్రము," విమోహకమునగు వచనము, దీని మర్మమును గ్రహించు సహన మతనికి లేదు.

10. స్వధర్మమా? పాపము మాటేమిటి?

అర్జునుని తక్కిన ప్రశ్నలును, పలుకులును అదే స్వభావము మఱియు శీలమునుండి ఉద్భవించును. ఒకసారి ఆత్మస్థితి కుదురుకొనినపుడు కర్మలో నెట్టి పైమార్పు నుండ నవసరము లేదు. అనగా పరధర్మముకంటె స్వధర్మము దోషయుక్తమైనను, స్వధర్మమునుబట్టియే చేయవలెను - అని చెప్పినప్పుడు అర్జునుడు కలతచెందును. స్వభావధర్మమా! తనను వేధించుచున్న పాపము, మాటేమిటి! బలాత్కరించినట్లు, బలాత్కరించి, మానవుని సత్సంకల్పమును కొట్టివేసి, పాపములోనికి మెడబట్టి త్రోయున దీస్వభావము గాదా? (3-35,36) ఇంకను, నే నీ యోగము పూర్వము సూర్యున కుపదేశించితిని. కాని అది ఈ లోపున నశించిపోగా, నీకు మఱల ప్రవచించు చున్నాను అని కృష్ణుడు చెప్పినపుడు అర్జునుని వ్యావహారిక బుద్ధి కది అంతుబట్టలేదు (4-3) ఇది ఎట్లు సంభవము? - అని అతడు ప్రశ్నించగా తఱచుగా ఉదాహృతము, సుప్రసిద్ధమునగు వచనమును భగవానుడు ప్రవచించును; ఇది అవతార తత్త్వమును, ప్రయోజనమును మనకు దెలుపును (4-6,8) కర్మయోగమును, కర్మసన్యాసమును సమన్వయపఱచుచు, కృష్ణుడింకను పలుకుచున్న వచనములచేత మఱల అర్జునుడు తికమకపడి, ఇట్టి "మిశ్ర" వాక్యముగాక, పరమశ్రేయమునకు బాటయగు ఒకే మాటను చెప్పుమని అర్థించును (5-1) తాను సాధించవలసిన యోగమెంత దుస్సాధ్యమో గ్రహించినపుడు, మానసిక సంకల్పము, అభిరుచి, కామములనుండి కర్మచేయుట కలవడిన అతని వ్యావహారిక ప్రకృతి దాని కఠినతకు భయపడి, మఱల నిట్లడుగును - యోగమును సాధింప ప్రయత్నించి, పరాజయము బొందిన ఆత్మగతి ఏమగును? తాను విడిచివేసిన ఇహజీవనమును, తాను ఆకాంక్షించిన బ్రహ్మచేతనను - రెంటిని గోల్పోయి కరిగిపోవు మేఘమువలె నశించి పోదా? (6-37,38).

11. నేను నీ విశ్వరూపమును చూడవచ్చునా?

అర్జునుని సంశయముల వ్యాకులములు పరిష్కరింపబడి, భగవంతుడే తన ధర్మము గావలయునని అతడెఱింగినపుడు, మఱల నెప్పటివలెనే ఆ భగవన్మూలమునకు తనను నడిపించగల విస్పష్టజ్ఞానము నపేక్షించును. మన సాధారణానుభవమును సమకూర్చు వివిధ భావముల మధ్య భగవంతు నెట్లు వేఱుపఱచి

తెలిసికొనవలెను? (10-17), వేనియందు భగవంతుని గుర్తించి పిమ్మట ధ్యానముచేత అతని సాక్షాత్కారము పొందవచ్చునో, అట్టి భగవంతుని మహావిభూతు లెవ్వియగును? మానవ మనః శరీరముల ముసుగుద్వారా తనతో నిపుడు వాస్తవముగా భాషించుచున్న భగవంతునియొక్క విశ్వరూపము నిపుడే తాను చూడగూడదా? (11-4). అతని చివరి ప్రశ్నలు కర్మసన్న్యాసము నకును తాను వరించవలసిన సూక్ష్మతర అంతర సన్న్యాసమునకును స్పష్ట విభేదమును దెలియగోరును. అటులే పురుష ప్రకృతుల వాస్తవ అంతరమును దెలియగోరును, ఏలన భగవదిచ్ఛాప్రేరితుడై నిష్కామకర్మ నాచరింప నీ జ్ఞాన మతి ముఖ్యము; కడకు తా నతిక్రమించవలసిన ప్రకృతి గుణముల స్పష్ట క్రియలను, ఫలితములను స్పష్టముగా నెఱుంగగోరును.

12. కర్మస్థానమున దివ్యకర్మ

అట్టి శిష్యునకు గీతాగురువు తన ఉపదేశము నిచ్చును. అహంకారిక కర్మచేత మానసికాభివృద్ధి నందుచున్న అర్జునుడు, అహంకారిక జీవనమునకు సంబంధించిన మానసిక, నైతిక భావికమూల్యము లన్నియు వ్యర్థములై దివాళా తీయగా, దారితెన్ను గానకపోవును; అట్టి తఱి, గురువు అతనిని పట్టివేయును. గురువిపుడతనిని ఈ నిమ్నజీవనమునుండి ఏది కర్మకు పైనున్నను దానిని ప్రారంభించి నడుపునో, దానిలోని కుద్ధరించవలెను; మనః ప్రాణ శరీరముల జీవనమునుండి మనస్సున కతీతముగానున్న, భగవంతుని ధామమగు దివ్యప్రకృతిలోని కుద్ధరించవలెను; అహంకారమునుండి ఆత్మలోనికి పంపవలెను. అదే సమయమున అర్జునుడు దేని నర్థించుచున్నాడో, తన లోపలి స్ఫూర్తిననుసరించి దేని నన్వేషించుచున్నాడో, తన జీవన కర్మలను నిర్ణయించి అట్టి ఒక నవ్య ధర్మమునుగూడ గురువతనికి ప్రసాదించవలెను; అంత సంఘర్షణములు, ప్రతిఘటనలు, సంభ్రమ వ్యాకులములు, మిథ్యా నిశ్చితములతో గూడిన సాధారణ మానవ జీవనముయొక్క అపర్యాప్త నియమమునకు ఈ ధర్మ మెంతో పైనుండును; ఈ ఉచ్చతర ధర్మము కర్మబంధమునుండి విముక్తమయ్యును, తన దివ్యసత్తయొక్క విశాల స్వేచ్ఛయందు కర్మచేయ గలుగును, నిమ్న ప్రకృతిని జయించనుగలుగును. ఇట్టి ధర్మ మావశ్యకము; ఏలన కర్మ చేయబడవలెను, ప్రపంచము తన గతివలయములను

పూర్తిచేయవలెను, మఱియు మానవాత్మ తానిక్కడ చేయవలసిన కర్మనుండి అజ్ఞానవశమున మఱలిపోరాదు. గీతోప దేశముయొక్క ప్రవాహగతి యంతయు, ఎంతో, ఎన్నో మెలికలు తిరిగినను, ఈ మూడు లక్ష్యములనే లక్షించుచు ఆ వైపునకే నడుచును.

(సశేషం)

అనువాదం:- చెలసాని నాగేశ్వరరావు

సమాచార పత్రము

శ్రీఅరవింద సొసైటి, బీచ్ ఆఫీసు మీటింగ్‌హాల్‌లో, 'సమగ్ర ఆరోగ్యము మరియు వ్యాధులు' అన్న అంశంమీద అక్టోబరు 30నుండి నవంబరు 3 (2007) వరకు డా॥ యువరాజ్ కపాడియా మరియు నీతాకపాడియా (ఇంటర్నేషనల్ అకాడమి ఆఫ్‌లైఫ్, ముంబాయి) వారిచే ఒక సెమినార్ నిర్వహించబడింది.

పుదుచ్చేరి, పోస్ట్ గ్రాడ్యుఏట్ మహాత్మాగాంధి డెంటల్ కాలేజికి చెందిన డా॥ సింగ్ గారిచే సుల్తాన్‌పూర్ (యు.పి) బ్రాంచినందు నవంబరు 27న "శ్రీమాతారవిందుల వెలుగులో బాధ, ఆందోళన మరియు వాటి నివారణ" అనువిషయంపై ఒక ఉపన్యాసం ఇవ్వబడింది.

2007 డిసెంబరు 8 మరియు 9 తేదీలలో ఖమ్మం (ఆ.ప్ర)లో ఆంధ్ర ప్రదేశ్ శ్రీఅరవింద సొసైటీల 13వ రాష్ట్రమహాసభలు జరిగినవి. ఇందులో రాష్ట్రంలోని కేంద్రములు మరియు బ్రాంచిలకు చెందిన ముఖ్య కార్యకర్తలందరితో భవిష్యత్ కార్యాచరణ గురించి సమాలోచనలు జరుపబడినవి. ఇందులో పాల్గొనిన వారంతా చాలా ఆసక్తిదాయకమైన ప్రతిపాదనలు చేయడం జరిగింది.

ఖాండ్వా(యమ్.పి) బ్రాంచివారు తమ భవనంలో శ్రీఅరవిందుల పవిత్ర అవశేషముల ప్రతిష్ట జరిపిన ద్వితీయ వార్షికోత్సవమును ఘనంగా నిర్వహించడం జరిగింది.

రాయపూర్ (ఛత్తీస్‌గడ్) వారు "ఆధునిక దైనందిన జీవితంలో యోగం యొక్క ప్రాధాన్యత" అను అంశంపై ది.17 నవంబరు 2007న పద్మశ్రీ రమేష్‌చంద్రషా గారిచే ఒక ఉపన్యాసమును నిర్వహించారు. రట్లాం(యమ్.పి.)నందు "నవ్యచేతన" పై 2007 డిసెంబరు 5నుండి 9వరకు ఒక సాధనా శిబిరమును నిర్వహించగా అందులో

Rs. 15.00





అఖిల

(ప్రత్యేక సంచిక)

అఖిల భారత పత్రిక - ఏప్రిల్ & మే 2008

(4th ఏప్రియల్ 1910 ★ 24th ఏప్రియల్ 1920 ★ 1th మే 1908)

అఖిల

అఖిల భారత పత్రిక - ఏప్రిల్ & మే 2008

(సంయుక్త సంచిక)

విషయసూచిక :

విద్యయొక్క ప్రధాన ఆశయం


పలురకాల విషయార్జనము, విద్యయొక్క ఒక ఆశయమే కాని, దాని ప్రధాన సాధనంకాని, ప్రధాన అవసరం కాని అదికాదు. దాని ప్రధాన ఆశయం, మానసికశక్తుల, ఆత్మ శక్తుల నిర్మాణం మరియు జ్ఞానాన్ని, శీలాన్ని, సంస్కృతిని, ఉపయోగించు కొనగల శక్తిని, చేకూర్చడం. ఇంక ఎక్కువ లేకున్నా, అంతమాత్రమైనా కలిగించాల్సి వుంటుంది. ఈ భేదం ఎంతో గొప్ప తేడాను కల్పిస్తుంది. విజ్ఞానశాస్త్రం మనకందించే విషయసేకరణే మనకోరికైతే పాశ్చాత్య విజ్ఞానశాస్త్రాన్ని యధాతధంగా అంతాగాని లేక ముక్కలు ముక్కలుగా కాని గ్రహిస్తేచాలు. మనం ఏ విజ్ఞానశాస్త్రాన్ని చదువుతామనేది ప్రధాన ప్రశ్నకాదు. ఆ విజ్ఞానశాస్త్రంతో మనమేమిచేస్తా మనేది, మన మార్జించిన ఆశాస్త్రజ్ఞానాన్ని, శాస్త్ర పరిశోధనా ఫలితాలను, మానవ మానస శక్తులతోను, ఇతర జ్ఞానంతోను, ఎట్లా అనుసంధానం చేస్తా మనేదే ప్రశ్న.

భారతీయ మనస్సు, దాని సాంప్రదాయాలు, దాని పూర్వీకులశక్తి, జ్ఞానము, వాటి పాత్ర ఉత్కృష్టమైన సంస్కృతిని కొని తెచ్చింది. సంస్కృతాన్ని కాని,లేక మరే భాషనైనా కాని మనస్సుకు ప్రోత్సాహాన్ని, నేర్పును ఇవ్వగల్గిన సహజపద్ధతిలో నేర్చుకోవాలి. ఈ విషయంలో గతానికి లేక వర్తమానానికి చెందిన బోధనావిధానానికే మనం అంటిపెట్టుకొని వుండరాదు. స్వాయత్తమైన జీవలక్షణాన్ని పట్టుకుని పునరుద్ధరించి, పరిపుష్టం చేసి, అవిచ్ఛిన్నంగా సాగేటట్లు స్థిరపర్చుకోవాలి. మరి ఇప్పటకీ సజీవంగా వున్న మన గతశక్తి, ఇంకను యేర్పడని భవిష్యత్‌శక్తికీ మధ్య అది స్పష్టమైన అనుబంధాన్ని ఏర్పరచాలి.

అలానే ఆంగ్లమును, ఇతర విదేశీ మాతృభాషలను కూడ ఆయాదేశాల జీవితాన్ని, వారిభావాలను, సంస్కృతులను, తెలిసికొని, మనచుట్టూవున్న ప్రపంచంతో సరైన సంబంధాలను నెలకొల్పు కొనేట్లు నేర్చుకోవాలి. ఇదే నిజమైన జాతీయ విద్యావిధానం. మనం ఆధునిక సత్యాన్ని, జ్ఞానాన్ని నిర్లక్ష్యం చేయరాదు. కాని మనమానస, ఆత్మల ఆధారంగానే మనం మనసు పునాదిని నిర్మించుకోవాలి.

మూలము : శ్రీఅరవిందులు

అనువాదం :- బి. నరసింహయ్య



శ్రీ అరవిందులు 1908

ఏప్రిల్ 4, 1910

శ్రీ అరవిందో జీవిత స్వీయకథనాల నుండి . . . . .

శ్రీ అరవిందో 'కర్మయోగిన్' పత్రికా కార్యాలయంలో ఉండగా ఆయనను పట్టుకొనేందుకు బ్రిటిష ప్రభుత్వం తమ కార్యాలయాన్ని వెతకబోతున్నదనే సమాచారం ఆయనకు అందింది. దానికి ఆయన తమ వైఖరి ఏమిటని యోచిస్తున్నప్పుడు ఆకస్మాత్తుగా 'పై నుండి' ఫ్రెంచి పరిపాలనలో వున్న చంద్ర నాగూర్ వెళ్ళమన్న ఆదేశం అందింది. ఇప్పుడు దేవుని మార్గనిర్దేశానికి అనుగుణంగా నడవడమే ఆయన కర్తవ్యం. దానిని ఏమాత్రం వ్యతిరేకించేది లేదు. దాని నుండి వైదొలగేది లేదు. ఇక ఈ విషయంలో ఎవ్వరినీ సంప్రదించాల్సింది లేదు. కేవలం పదే పది నిముషాల్లో గంగాతీరానికి చేరడం, బోటు ఎక్కడం జరిగిపోయింది. కొద్ది గంటల్లోనే చంద్రనాగూర్ చేరుకొని రహస్య నివాసానికి వెళ్ళిపోయారు. తరువాత ఆయన నడుపుతున్న 'కర్మయోగిన్' పత్రిక సంపాదకత్వ బాధ్యతను చేపట్టవలసినదిగా సిస్టర్ నివేదితకు సందేశాన్ని పంపారు. చంద్ర నాగూర్‌లో ఆయన పూర్తి ఏకాంతంలో ఉంటూ తక్కిన కార్యకలాపాన్ని, నిలిపివేసి పూర్తిగా ధ్యాన నిమగ్నులయ్యారు. అప్పడే పాండిచ్చేరికి పయనమవ్వమన్న పిలుపు అందింది. ఉత్తరపారాకు చెందిన కొందరు యువ విప్లవకారులచే మళ్ళీ కలకత్తాకు తీసుకొని రాబడ్డారు. అక్కడ నుండి ఆయన 'Dupleix' అనే నౌకలో 1910 ఏప్రిల్ 4న పాండిచేరి చేరుకొన్నారు.

- శ్రీ అరవిందులు

అనువాదం : హర్షవర్ధన్

శ్రీ అరవిందుల రాజకీయ విరమణకి కారణాలు

(శ్రీ అరవిందుల జీవిత స్వీయ కథనాల నుండి)

1910 సంవత్సరం తర్వాతనుంచి శ్రీ అరవిందులు అంతకంతకు యోగసాధనలో తీవ్రస్థాయిలో నిమగ్నమవసాగారు. ఆయన ప్రజా సంబంధిత క్రియాశీలక రాజకీయాలనుంచి వైదొలగి, పునర్వ్యవస్థీ కరింపబడిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు అధ్యక్షత వహించమనే అనేక మంది కాంగ్రెస్‌వారి అభ్యర్థనలను నిరాకరించారు. తన ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సంబంధంలేని విషయాలపై మాట్లాడకూడదని 'ఆర్య' పత్రికకు తప్పించి వేరే వ్రాయకూడదని నియమం పెట్టుకున్నారు. ఆయనకు స్పష్టంగా భవిష్యదర్శనం కావటం ఎక్కువవుతున్న కొలది క్రమబద్ధంగా ముందుకు సాగే శక్తుల గమనాన్ని బట్టి స్వతంత్ర భారతం నిశ్చయం అని, భారతీయుల ప్రతిఘటన, అంతర్జాతీయ సంఘటనల యొక్క పర్యవసానాల ఒత్తిడికి, బ్రిటీషువారు, భారత స్వాతంత్ర్యాన్ని ఆమోదించి తీరాలని, వ్యతిరేకతలు, అసమ్మతులున్ననూ, స్వాతంత్ర్యం పొందే వీలున్న అంశాల దిశగా భారతమాత నడక మొదలైందని శ్రీఅరవిందులు గ్రహించారు. ఈ జాతీయ ఉద్యమానికి సాయుధపోరాటం, దీనికి కావలసిన రహస్య సన్నాహాలు ఇక అవసరం లేదని అయితే ఈ విప్లవభావం కొనసాగాలి, అది కొనసాగుతుంది అని ఆయన భావించారు. స్వయంగా రాజకీయాలలో తనజోక్యం ఇక అవసరం లేదనుకున్నారాయన. ఇవన్నీ కాక తన ఆధ్యాత్మిక కార్యక్రమం యొక్క ఆవశ్యకత, విస్తారత, మరింత స్పష్టమై దానికి అవసరమైన శక్తులను కేంద్రీకరించవలసిన అవసరం ఉందనుకున్నారు శ్రీఅరవిందులు.

అనువాదం : త్రివేణి

అజ్ఞాతంలోకి వెళ్లింది ఒక ప్రత్యేకమైన కార్యం కోసమే!

(శ్రీఅరవిందులు స్వీయచరిత్ర కధనాలనుంచి)

1910లో ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళడంతో వారు రాజకీయాలనుండి తప్పుకొనడం పూర్తయిందనుకోవాలి.

అయితే అందరూ అనుకొన్నట్లు వారు భారతదేశ భవిష్యత్తును గానీ, ప్రపంచం గురించిగాని పట్టించుకోకుండా కేవలం తాను ఉన్నతమైన ఆధ్యాత్మిక అనుభవాలను సంపాదించడం కోసం అలా చేసారని దానిఅర్థం కాదు. వారి ఆధ్యాత్మిక లక్ష్యం కేవలం ఆధ్యాత్మికమైన అనుభూతులను పొందడం మాత్రమే కాదు. యావత్తు ప్రాపంచిక జీవితాన్ని ఆధ్యాత్మిక పునాదుల మీద, ఆధ్యాత్మిక చేతనలో నిర్వహించేందుకు ఎంతవరకు అవకాశం వుందనే విషయాన్ని అనుభవం ద్వారా గ్రహించడం అనేది కూడా కలిసేవుంది. తను ఏకాంతంలో వుంటూనే భారతదేశంలోనూ, ప్రపంచంలోనూ జరుగుతున్న విషయాలన్నింటినీ నిశితంగా పరిశీలిస్తూనే అవసరం వున్నప్పుడు తాను జోక్యం చేసుకుంటూనే వున్నారు. అయితే అది కేవలం మౌనంగా తన ఆధ్యాత్మిక శక్తిని వినియోగించి అలా చేసారు. యోగంలో చాలా ముందుకు వెళ్ళినవారు అంటే శరీర మనః ప్రాణ శక్తుల కతీతంగానూ, ఊర్ధ్వ ముఖంగానూ బలమైన శక్తులను స్వాధీనం చేసుకొన్న వారు మాత్రమే అలా చేయగలరు. వారికి ప్రచండమైన ఆధ్యాత్మిక శక్తి స్వాధీనమౌతుంది. అది ఏ ఇతర శక్తులన్నింటికన్నా గూడా బాగా ప్రచలితం, ప్రబలం. దానిని స్వాధీనం చేసుకోవాలనీ ఉపయోగించుకోవాలనీ ఎవరూ అనుకోరు. కానీ అది వున్నమాట నిజం. ఇదిగో! ఈ ప్రచండమైన శక్తిని గమనించి ముందడుగుగా, పరిమిత క్షేత్రానికే, దానిని స్వాధీనం చేసుకొని వినియోగించుకున్నా, తర్వాత దానిని ప్రాపంచిక శక్తుల మీద కూడా

ప్రయోగించారాయన. దాని ఫలితాల పట్ల ఆయన ఎప్పుడూ అసంతృప్తి చెందడం గానీ, ఇతరత్రా వినియోగించడం గానీ జరుగలేదు. కేవలం రెండు సందర్భాలలోనే ఈ శక్తుల వినియోగాన్ని బయటకు కన్పించేలా గూడా తన ప్రయత్నాలను చేసారు. అందులో మొదటిది ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామానికి సంబంధించినది. ప్రారంభంలో దానిని గురించి పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఎప్పుడైతే హిట్లర్ మిగిలిన శక్తులన్నింటి మీద పైచెయ్యి గాబోతున్నాడనీ నాజీలు మిగిలిన ప్రపంచం మీద ఆధిపత్యం నెరపబోతున్నారని తలిచారో, అపుడు ఆయన జోక్యం చేసుకున్నారు. తాను మిత్రపక్షాలను బలపరుస్తున్నాను అని బహిరంగంగా ప్రకటించారు. యుద్ధనిధికోసం చేసిన విజ్ఞప్తికి స్పందించి దానికి ఆర్థికంగా తనవంతు సాయం అందజేయడమేగాకుండా, సైన్యంలో చేరి యుద్ధంలో పాల్గొనాలను కొన్న వారిని అలా చేయమని ప్రోత్సాహించారు గూడా. అంతేగాక డంకర్క్ సంఘటనలో ఇంక హిట్లర్ విజయం నిశ్చయమనీ, దానితో ఇంగ్లండ్ పతనం ఖాయమనీ అందరూ ఊహిస్తున్న సమయంలో మిత్రరాజ్యాలకు మద్దతుగా వారి ఆధ్యాత్మిక శక్తిని వినియోగించి, దానితో జర్మనీల ఆటకట్టించి యుద్ధగతి వారికి వ్యతిరేకంగా మారాకనే ఆయన సంతృప్తి చెందారు. హిట్లర్ మరియు నాజీల వెనుక అంధ, తామసిక ఆసురిక శక్తులు అండగా నిలిచాయని అవి గనక జయిస్తే యావత్తుమానవజాతి రాక్షసులకు బానిసలుగా జీవించాల్సి వస్తుందనీ, పరిణామగతి చాలా మందగిస్తుందనీ, ముఖ్యంగా మానవుడి ఆధ్యాత్మికప్రగతికి అది అవరోధమనీ అందువల్ల యూరోపు మాత్రమేగాక మొత్తం ఆసియా ఖండం బానిస జాతిగా మారి తద్వారా భారతదేశ విముక్తి కోసం అంతవరకు జరిగిన కృషి అంతా వృధా అవుతుందనీ, గుర్తించారు గనుకనే అలా చేసారు. ఈ కారణంగానే

క్రిప్స రాయబారాన్ని బహిరంగంగా స్వాగతించి, దానిని ఆమోదించాల్సిందిగా కాంగ్రెస్ నాయకులకు సందేశం పంపారు. క్రిప్స్ ప్రతిపాదనలను ఆమోదించడం జరిగితే, ఆసురిక శక్తులను భారత్, బ్రిటన్‌లు సంయుక్తంగా ఎదుర్కొనడం, అది భారతదేశ స్వాతంత్ర్యానికి త్రోవదీయడం జరుగుతుందని అదే సరైన పరిష్కారమనీ ఆయన భావించారు.

అనువాదం - కొంగర భాస్కరరావు

పృథ్వీ చైతన్యం కోసం సాధన

నా సాధన లక్ష్యం కేవలం నాకోసం కాదు. మొత్తం భూ చైతన్యం దివ్యచైతన్యంగా మరల్చే మార్గం చూపడానికి. దానివలన అంతరప్రగతి, పరిణామం, నూతననైపుణ్యం మొదలయినవి చూపడం సాధ్యమవుతుంది. కాని అవి ఎవరికీ అంత ముఖ్యమైనవి కావు. కాకపోతే జరగవలసినదానికి సంసిద్ధపరచే మార్గనిర్దేశం జరుగుతుంది.

భూచైతన్యంలోకి అవతరించవలసిన ప్రశాంతత, దివ్య సామరస్యం, దివ్యకాంతి, ఆంతర్యపు దివ్యసత్యసిద్ధాంతమేదో, దానిని తీసుకురావాలనే నేనన్వేషిస్తున్నాను.

పైన దానిని చూస్తున్నాను. అదేమిటో కూడా తెలుసు. పైనించి నాచైతన్యంలోకి దిగి అణువణువునా ప్రకాశిస్తున్నది. అది నా అనుభూతికి తెలుస్తున్నది. సగం వెలుగు, సగం చీకటిల మధ్య తారట్లాడుతూ అలాగే సాగిపోతున్న మనిషి స్వభావానికి బదులు తన స్వయం ప్రతిభతో జీవిపూర్తిగాపైకి ప్రగతిపథంలో పోగలగడం సాధ్యమయ్యే దానికోసం అన్వేషిస్తున్నాను.



శ్రీమాత 1918

దివ్యసత్య అవతరణ భూమ్మీద చైత్యన్యాభివృద్ధికి ద్వారాలు తెరుస్తుంది. అదే భౌతిక పరిణామంలో అంతిమ పరిజ్ఞానం (The final sense of the earth evolution)

నా కోసం మాత్రమే అతిమానసాన్ని సాధించడం నా వుద్దేశం కాదు. నా కోసం నేనేదీ చెయ్యడం లేదు. మోక్షంగాని అతిమానసంకాని వ్యక్తిగతంగా వీటి అవసరం నాకేమీలేదు. అతిమానసికతకోసం నేనన్వేషిస్తున్నానంటే దానర్థం భౌతిక చైతన్యాని కవసరమైన కర్తవ్యమేదైతేవుందో దానిని నిర్వహిస్తున్నానని. నా అతిమానసికత అనేది కేవలం అతిమానసాన్ని భూచైతన్యానికి తీసుకుపోయే ద్వారాన్ని తెరిచే తాళంచెవి. అతిమానసాన్ని అతిమానసం కోసమే సాధించడం అయితే అది ఖచ్చితంగా వ్యర్థప్రయాసే.

★ ★ ★

(శ్రీమాత జపానులో వున్నప్పుడు ఆమెకి వ్రాసిన వొక జాబు నుండి)

స్వర్గం మనం పొందాము. కాని భూమిని పొందలేదు. వైదికసూత్రం ప్రకారం, యోగం పరిపూర్ణమయేది భూస్వర్గాలు సమానమై, ఒకటే అయినపుడు మాత్రమే.

మూలం : శ్రీఅరవిందులు

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి

ఏప్రియల్ 24, 1920

(శ్రీమాత జపానునుంచి పుదుచ్చేరికి చివరిగా విచ్చేసిన తేది)

ఏప్రియల్ 24, 1920న పుదుచ్చేరి తీరాలదరికి చేరుకున్న నావలో ప్రయాణిస్తున్న శ్రీమాత అనుభవం.

"నేను జపానునుంచి వస్తున్నప్పుడు, సముద్రంమీద నావలో ఉన్నాను. ఆ సమయంలో నేను దేనినీ ముందుగా ఊహించడం లేదు. (సహజంగానే నేను నా అంతరంగజీవన సాధనలో నిమగ్నమైఉన్నాను భౌతికంగా నావమీదనే ఉన్నాను అప్పుడు ఒక్కసారిగా, అసంగతంగా, పుదుచ్చేరికి రెండు నాటికల్ మైళ్లదూరంలోలక్ష్యము ఉండగా పరిసరగాలి, దానిలక్షణం, సరిగా చెప్పాలంటే వాతావరణపు భౌతికలక్షణాలు కూడా ఎంతగా మారిపోయాయంటే నాకు శ్రీఅరవిందుల తేజఃపుంజంలోకి (aura) ప్రవేశిస్తున్న భౌతికానుభూతి కలిగింది.

నేను చాలాకాలంనుంచి, నిరంతరంగా శ్రీఅరవిందులతో ఆధ్యాత్మిక అనుసంధానంలో ఉన్నాననే సంగతి నాకు బాగా తెలుసు; ఒకరకంగా చెప్పాలంటే అది శ్రీఅరవిందుల వాతావరణంలో అనుసంధానం. కాని నేనెప్పుడూ భౌతికవాతావరణంలో మార్పును గురించి ఆలోచించలేదు. దానిని ఎంతమాత్రమూ ముందుగా ఊహించను కూడాలేదు. అందువల్లనే ఆ అనుభవానికి అంత మహత్వం వచ్చింది. అది ఏవిధమైనదంటే, ఒక్కసారిగా వేరే శీతోష్ణస్థితిలో ఉన్న ప్రదేశంలోకి ప్రవేశించినట్లు లేదా మరొక ఎత్తైన ప్రదేశానికి చేరినపుడుండే అనుభూతి.

శ్రీఅరవింద వాణి

1915 నుంచి 1920 మధ్యకాలంలో నేను 'ఆర్య' కోసం వ్రాస్తున్నాను. శ్రీమాతరాకకోసం సాధన, పని వేచిఉన్నాయి.

16-9-1935

నేను నా యోగాన్ని 1904 సం॥లో ఏ గురువు లేకుండా మొదలుపెట్టాను. 1908లో మరాఠా యోగినుంచి ముఖ్యమైన సహాయం పొందాను. నా సాధనకు ఆధారమైన ప్రాతిపదికలు తెలుసుకున్నాను. కాని అప్పటినుంచి శ్రీమాత ఇండియాకు వచ్చేదాకా నాకు ఎవరినుంచి ఆధ్యాత్మిక సహాయం అందలేదు.

నా సాధన అంతకుముందుకాని ఆ తర్వాతకాని ఏ పుస్తకాల మీద ఆధారపడలేదు. కాని అది నా అంతరంగంలోనుంచి నన్ను కమ్మేసిన నావ్యక్తిగత అనుభవాల మీద ఆధారపడినదే.

13-9-1946

అనువాదం: డా. ఇ. ప్రసన్న కృష్ణ

లక్ష్యము

చేసినపనే చేస్తూండటం కాక, క్రొత్త గమ్యాలు, కనీవిని యెరుగని ఆధిపత్యాలు సాధించటం మానవుడు చేయవలసిన, పని మనకు కార్యరంగాలు లోకం, కాలం, ఆత్మ. ప్రేరణలు ఆశ, సృజనాత్మక భావనాశక్తి, దూరదృష్టి, పరిపూర్ణసాధనకు ఉపకరణాలు - ఇచ్ఛాశక్తి, ఆలోచనా శక్తి, కృషి.

ఇప్పటికీ ఇంకా మనం సాధించవలసిన దేముంది? ప్రేమ. ఇంతవరకు మనంద్వేషం స్వీయభోగానందాలను మాత్రమే సాధించాము. మనం ఇంతవరకు విజ్ఞానానికి బదులు, గ్రహణశక్తి భావుకత పొరపాట్లు చేయటం వరకే సాధన చేశాము. దివ్యానందానికి బదులుగా భేదం, మోదం, నిర్లక్ష్యం - ఇవే సాధించాం. శక్తికి బదులుగా ఇంతవరకు మనం - కృషి, బలహీనత, భంగంపాటుతో కూడిన విజయమే సాధించాం. జన్మ మృత్యు జరాభయాలనే తెలుసుకున్నాం ఇంతవరకు తప్ప, అసలు జీవనంగురించి ఇంకా తెలుసుకోనేలేదు. పోట్లాడుకోవటం, కలుసుకోవటమే మనకు తెలుసు కాని సమైక్యత గురించి మనికింకా తెలియనే తెలియదు.

ఒక్కమాటలో చెప్పాలంటే (మనం సాధించవలసినది) దైవత్వం అందుకు మనలను మనం దివ్యంగా రూపుదిద్దుకోవటం.

- శ్రీఅరవిందులు

శ్రీమాత వ్యాఖ్యానం :-

బలహీనత, కృషి, భంగపాటుతో కూడిన విజయాన్ని మాత్రమేనా మనం ఇంతవరకూ సాధించినది?

మనమింతవరకూ సాధించిన విజయాలన్నీ ప్రతి క్రియాత్మకంగా చివరికి మిగిలిన భంగపాట్లే, ఖచ్చితంగా పూర్తి కాబడేదేదీ ఉండదు. ప్రతిసారీ ఏదో విజయం సాధించామనుకుంటాం. తీరాచూస్తే - అది అసమగ్రం, పాక్షికం, అశాశ్వతం -అయి ఉంటుంది. నిన్ను నీవు బహుజాగ్రత్తగా పరిశీలించుకుంటే ఈ నిజాన్ని గుర్తిస్తావు. అయితే విషయాలెప్పుడు గతంలోవలెనే ఉండాలని ఏమీలేదు. అలాకాదు. మార్పు అయితే కొంత ఉంది. కాని పూర్తిగా మారలేదు. పరిపూర్ణంగా మారలేదు.

భౌతికంగా శారీరకమైన విజయాలు-స్పష్టమైనవి, గమనించతగినవే. బలహీనత, పరిమితి, చెడు అలవాట్లు-పట్టుదలతో శ్రమించి, వీటిని అధిగమించవచ్చు. నిశ్చయంగా విజయమనీ భావించవచ్చు. పోతే కొంతకాలం అయాక, కొండొకచో వెన్వెంటనే ఏమీ జరగనేలేదనే గ్రహింపు కలుగవచ్చు. సాధించామనకున్నది, తిరిగి మరల చేయవలసిరావచ్చు. చైతన్యంలో పరిపూర్ణమైన మార్పువచ్చి, తలక్రిందులై, నూతనోత్తేజం జోక్యం చేసుకోవటంవల్ల విజయం పరిపూర్తిగా సఫలమవుతుంది.

పూరాతన కార్థియన్ సంప్రదాయంలో క్రొత్తగా దీక్ష తీసుకోవలసిన యువకులచేత తెల్లటి దుస్తులు ధరింప చేస్తారు. అప్పుడు వాళ్లకి చెప్తారు - "ధరించిన అంగీమీద ఉన్న మరకలను ఒక్కొక్కటే శుభ్రపర్చటంకాకుండా, పూర్తిగా ఒక్కమారే ప్రక్షాళన చేసుకోవాలి. అని నీ లోపాలను ఒక్కొక్కటే సరిదిద్దు కోవటం కాదు. ఒక్కొక్క దానినే అధిగమించటం కాదు. ఇలా ఎంతో ముందుకు

సాగిపోలేవు. కావల్సినది పూర్తి ప్రక్షాళనం. చైతన్యము అంతాపరివర్తన చెందాలి. రూపాంతరీకరణం సాధించాలి. ఉన్న స్థితి నుంచి ఒక్క ఊపులో ఉన్నత తర స్థితికి ఎగసిపోవాలి. నివారించవలసిన బలహీనతలన్నీ సమసిపోవాలి. సాధించవలసిన వాటియొక్క సమ్యక్‌దర్శనం కలగాలి.

శ్రీఅరవిందులు చెప్పినది నేను నమ్ముతున్నాను. అంతా పరిపూర్ణంగా జరిగేవరకు అసలు ఏమీ జరగనట్లే, ఓ అడుగు ముందుకు వేయటంకాదు. కావల్సినది పరిపూర్ణపరివర్తనం. కాస్తంత ప్రయత్నంచేసి ఇలా చెప్పేవాళ్ళనెంతోమందిని ఎన్నో సార్లు విన్నాను. నేను ప్రయత్నించాను. నా ప్రయత్నం వల్ల ఏమి ఉపయోగం? నేనేదో కొంతసాధించాననుకొన్న ప్రతీసారీ, తిరిగి మళ్లీ మొదలు పెట్టవలసివస్తోంది." ఇలా జరగటానికి కారణం తాము ఉన్నచోటునుంచి కదలకుండా ముందుకు పోవాలను కుంటున్నారు. (ఇదెలాసాధ్యం!) చైతన్య పరివర్తనలేకుండా అభివృద్ధి సాధించాలనుకుంటున్నారు. యావదృక్పథం మారాలి. చైతన్యం ఉన్నగాడిలోనుంచి పూర్తిగా బయటపడాలి. పైకి యెదగాలి ఊర్ధ్వముఖంగా విషయాలను దర్శించాలి. అపుడు మాత్రమే విజయాలు విజయాలుగా ఉంటాయి. భంగపాట్లుండవు.

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

సాధనకు కొన్ని సూచనలు

సాధన ఆత్మార్పణంతో ప్రారంభంకావాలి; అదే అత్యంత ప్రయోజనకరమూ, శీఘ్రకరమూ అయినపద్ధతి. నీవు చేరాలనుకునే ధ్యేయం ఏదైనప్పటికి అది పరమేశ్వర భావమైనా, పరిపూర్ణతా భావమైనా ఆత్మార్పణతో ప్రారంభిస్తే అంతకు మించిన ఆనందాతిశయం వేరే ఉండదు. అత్యంతశ్రద్ధతో పట్టుదలతో ఆత్మార్పణ

కొనసాగిస్తుంటే నీవేర్పరుచుకున్న భావనాగ్రాన్ని మించిన అనుభవం నీకు ప్రాప్తిస్తుంది. అది వర్ణనాతీతమే అయినప్పటికి దానిప్రభావం మాత్రం ఇంచుమించు సమానంగానే ఉంటుంది. ఇంకా ఇంకా నీ ఆత్మార్పణము సమగ్రంగా, పరిపూర్ణంగా అవుతున్న కొద్దీ ఐక్యమవాలనే ఆకాంక్షకూడా నీలో ఏర్పడుతుంది. అంటే ఏ పరమేశ్వరుని కోసం నిన్ను అర్పించుకుంటున్నావో ఆ పరమేశ్వరునితో ఐక్యంకావాలని ఆకాంక్ష ప్రబలమౌతుంది. ఇకనీలో ఉండే భిన్నత్వాలూ, విరోధాలూ తొలగిపోతాయి. ముఖ్యంగా నీ ఆకాంక్ష ప్రగాఢమైన స్వతస్సిద్ధమైన ప్రేమతో కూడి ఉన్నప్పుడు, విజయపథంలో నీకు ఏదీ అడ్డురాదు.

ఎవరైనా భగవంతునికి పూర్తిగా సర్వసమర్పణం చేసుకుంటే వారు వారి సంకల్పబలాన్నీ ఎంపిక శక్తితో అభివృద్ధి చేసుకోవాలంటారా?

ఇవన్నీ వారికి అంతరాయాలు కావా? స్వయంసంకల్పం, ఇచ్ఛాశక్తి కూడా సామాన్య అజ్ఞానంలోనూ, మోహంలోనూ జీవితం గడిపేవారికి అవసరమే. పూర్తిగా ఆత్మార్పణమంటే వీటిని సమర్పించు కోవడమే అయితే దురదృష్టవశాన చాలామంది ఆత్మార్పణం చేసుకున్నామన్న భ్రమలో ఉంటారు కానీ వారి అహాన్నిమాత్రం వదిలిపెట్టరు. దానివల్ల వారు భగవత్సంకల్పాన్ని గుర్తించలేరు. ఇటువంటివారు వారి సంకల్పశక్తినీ, వివేచననూ కనక వదిలి పెడితే అస్తవ్యస్తంగానూ, అసంగతంగానూ తయారవుతారు.

అందువల్ల ముఖ్యంగా నీవు సంపూర్ణమైన నిజాయితీ అలవరచుకోవాలి. నిన్ను నీవు మోసగించుకోకుండా నిన్ను నడిపించే సంకల్పం భగవంతుని దేనని నీకు స్పష్టమైన నిదర్శనం కావాలి.

- శ్రీమాత

అను: డా॥ అమరవాది ప్రభావతి, డా॥ అమరవాది వెంకట్రామ శాస్త్రి

ఆరోగ్యము - చికిత్స

ప్రశ్న: మధుమయీ మాతా! "భౌతిక నిశ్శబ్దీకరణము" - అంటే ఏమిటి? ఆ నిశ్శబ్దంలోనే అలా ఉండి పోవటం ఎలా?

భౌతిక చైతన్యం అనేది మన శారీరక సంబంధమైన చైతన్యమేకాక ఇంద్రియగ్రాహ్యంగానున్న చుట్టూ పరివేష్టించి ఉన్నదంతాకూడా. రికార్డింగ్ చేసి ప్రసారం చేసే ఒకరకమైన యంత్ర పరికరంలాంటిది ఇది. వెలుపలి నుంచి వచ్చే అన్నిస్పర్శలకి, అఘాతాలకి ఉన్మీలనమై ఉంటుంది. ఖేద, మోదాలుగా వాటిని తిరస్కరిస్తూ, స్వాగతీకరిస్తూ ప్రతిస్పందిస్తుంది. బాహ్యసత్వాన్ని ఇది నిరంతరం క్రియాశీలంగా ఉంచుతుంది. అలజడి కలుగజేస్తుంది. వీటికి మనం బాగా అలవాటుపడి ఉంటాము. అందుచేత పాక్షికంగానే వీటితాలూకు యెరుక కలిగి ఉంటాము.

కాని మనం ధ్యానం లేదా ఏకాగ్రత ద్వారా అంతరంగంలోనికి లేదా ఊర్థ్వ ముఖంగా కాని మళ్ళినట్లైతే లోలోతుల నుంచి పైనుంచి మన అంతరంగంలోనికి నిశ్చల శాంతి, ప్రశాంతము చివరికి నిశ్శబ్దత పొందగలుగుతాం. ఆ నిశ్శబ్దం యదార్థమైనది. తిరుగులేనిది. గోల, గందరగోళంతర్వాత వచ్చే నిశ్శబ్దంలాంటిది కాదు. ఎంతసేపు ఉన్నా దానికి మార్పు ఉండదు. బాహ్యంగా ప్రభంజనంలాంటి సంక్షోభంలో లేదా, యుద్ధరంగంలో ఉన్నా ఈ నిశ్శబ్దం చెక్కుచెదరదు. సుస్థిర ప్రశాంతతకి పర్యాయపదం ఈ నిశ్శబ్దం. ఇది సర్వశక్తి మంతము. అంతర్గతంగా విపరీతమైన అలజడి గందర గోళాల మధ్య జన్మించే అలసట, ఉద్వేగం, నిస్త్రాణ, రాత్రింబవళ్లు. వదలకుండా పట్టి వేధిస్తూంటాయి. తప్పించుకోలేం. వీటిని నివారించటానికి నిశ్శబ్దం అమోఘమైన చికిత్స.

అందుచేత యోగం చేయగోరేవారు ముందుగా నిశ్చలత ప్రశాంత నిశ్శబ్దత-వీటిని తమలో ఆవహింప చేసుకొని స్థిరపర్చుకోవాలి.

- శ్రీమాత

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

వాస్తవంగా భారతీయ మేధస్సుకి ఆధ్యాత్మికత అత్యంతకీలకమైనది. (The master-key) అనంతత్వభావన దానికి పుట్టుకతోనే వచ్చినది. బాహ్యజీవనం వాస్తవమైనది, పరిపూర్ణమైనది కాదు అని భారతదేశం ఆదిలోనే సుక్ష్మబుద్ధితో గ్రహించింది. హేతువాదయుగాలలోనూ, అజ్ఞానపు చీకట్లు ముసిరిన యుగంలోనూ కూడా ఈసునిశ్చిత దృష్టిని ఈదేశం కోల్పోలేదు. ద్రవ్యవినియమ సూత్రాలు, శక్తుల ప్రాముఖ్యతను ఆమె విస్మరించలేదు. భౌతిక శాస్త్రాల ప్రాచుర్యం గురించిన నిశితదృష్టి కలిగి ఉన్నది. సాధారణ జీవన క్రియాకలాపాలను సొగసుగా కళాత్మకంగా మలుచుకోవటం ఆమెకు తెలుసు. భౌతికం, అతీతభౌతికంతో చక్కటి సమన్వయంతో పొందికగా నిలిచి ఉంటేనే, అది పరిపూర్ణ మవుతుందని ఆమె గ్రహించింది. ప్రస్తుత కాలమాన పరిమితులలో ఆధునిక మానవుడు తన బాహ్యదృష్టితో విశ్వంయొక్క చిక్కుముడిని విప్పలేడని ఆమె తెలుసుకుంది. వెనుక పరోక్షంలో అదృశ్యశక్తులున్నాయని, తనకు తెలియని శక్తులు తనలో నిక్షిప్తంగా ఉన్నాయని, తన్ను గురించి తనకు తెలిసినది బహుస్వల్పమని, పైకి అగుపించే దానిచుట్టూ, అగుపించనిదెంతో ఉన్నదనీ, అలాగే, తనకు తెలిసిన దానివెనుక తెలియనిది, పరిమితమైన దానిచుట్టూ అపరిమితమైనది ఎంతో ఉన్నదని భారతీయ మేధస్సు గ్రహించింది. మానవుడు తననుతాను అధిగమించగల శక్తివంతుడు; ఇంతకన్నా మరింత పరిపూర్ణంగా లోతుగా జీవించగలడని గ్రహించింది. యూరపు, ఈ మధ్యకాలంలో కనుగొన్న సత్యాలు- సాధారణ తెలివికి అసాధారణంగా కనిపించేవాటిని కూడా, భారతదేశం (ఏనాడో) గ్రహించింది. మనిషినిమించిన అసంఖ్యాక దేవతలను దర్శించింది. దేవతలకి అతీతంగా దేవదేవుని దర్శించింది. ఆ దేవదేవునకు కూడా అతీతంగా అనిర్వచనీయమైన అనంతత్వాన్ని సాక్షాత్కరింప చేసుకుంది. సాధారణ జీవనానికి అతీతజీవన శ్రేణులు, సాధారణ మనస్సుకు అతీత మానసిక శ్రేణులు, ఇంకా వాటినిమించి ఆత్మోజ్వల కాంతులు - దర్శించింది. అపుడు అంతస్ఫూర్తితో నిర్భయంగా, సాహసోపేతంగా, అల్పమనేదిలేకుండా ఏ పనిచేయటానికి సంకోచించలేదు - అది ఆధ్యాత్మికంకాని, మానసికంకాని, నైతికంగా కాని, లేక, ప్రాణికస్థాయి కార్యమేనా కానీ - ఏదీమనిషికి

అసాధ్యముకాదని ప్రకటించింది. కాకపోతే తనలోని జ్ఞానఇచ్ఛా శక్తులు సుశిక్షితంగా ఉంచుకోవాలి. అపుడే ఈ మానసిక శ్రేణులను జయించగలడు. తానే ఆత్మకాగలడు. దైవము కాగలడు. దైవంతో ఏకత్వం సిద్ధించుకోగలడు. అనిర్వచనీయ పరబ్రహ్మ తానుకాగలడు. దీనికి మార్గాన్వేషణ సహేతుకమైన వాస్తవికత, శాస్త్రవిజ్ఞానము, ఆధారంగా వ్యవస్థీకృత పద్ధతిలో జరిగింది. నిశితదృష్టితో కూడిన కార్యాచరణ యుగయుగాలనుంచి ఆమెకు ఉన్నది. ఆత్మశక్తి ఉంది. అనంతత్వమును సాధించిపొందాలనే పరితాపం ఉంది. దైవభక్తి పూరితమైన సంవేదన ఉంది. ఆదర్శంఉంది. యోగము ఉంది. కళ, వేదాంతముల పట్ల నిరంతర అభిరుచి ఉంది. తన ఆధ్యాత్మిక జీవకణాలలో ఇవన్నీ నాటుకుపోయినాయి. అందుకే నిశిత దృష్టితో కూడిన ఆధ్యాత్మిక ఆచరణ.

అయితే ఇదే ఆమెయొక్క పరిపూర్ణ మనస్తత్వము, సమస్త ఆత్మశక్తి కాజాలదు. ఏ ఆధారములేకుండా గిరిశిఖరాలు వాటంతటవి లేచి నిలబడవు. అవి మేఘాలలో విహరించే ఉల్లాసకర సుందర స్వప్నాలు కావు. భారతదేశ గతాన్ని చూస్తే మనకు ప్రస్ఫుటంగా కనిపించేది దానియొక్క అద్భుతమైన ప్రాణికశక్తి. అపరిమితమైన జీవశక్తి. దానిజీవనోత్సాహంతో మూడు వేల సంవత్సరాలుగా -ఇంకాపైమాటే-ఎడతెరపిలేకుండా, సుసమృద్ధిగా, పుష్కలంగా అపరిమిత వైవిధ్యంతో, ఊహకు అందని విస్తారమైన కల్పన, సృష్టికావిస్తూనే ఉంది. గణతంత్రరాజ్యాలు, రాచరికాలు, సామ్రాజ్యాలు, సృష్టిస్తూనే ఉంది. తత్వచింతనలు, విశ్వసృష్టి రహస్యాలను తెలియచేసే శాస్త్రాలు, విజ్ఞానశాస్త్రాలు, సిద్ధాంత సంగ్రహాలు, కళలు, కావ్యాలు సృష్టించింది. ఎన్నోరకాలైన స్మారక నిర్మాణాలు రాజప్రాసాదాలు దేవాలయాలు నిర్మించింది. ఎన్నో ప్రజోపయోగ కరమైన పనులు చేసింది. ఉమ్మడి యాజమాన్యాలు సంఘాలు మతవర్గాలు రూపొందించింది. చట్టాలు, శాసనసంహితలు రచించింది. మతపరమైన అనుష్ఠానాలు, భౌతిక విజ్ఞానశాస్త్రాలు మానసిక విజ్ఞానశాస్త్రాలు, యోగదర్శనాలు రాజకీయ, వ్యవస్థలు, ప్రభుత్వ యంత్రాంగాలు ఆధ్యాత్మిక లౌకికకళలు, వ్యాపారాలు, పరిశ్రమలు లలితకళలు - ఇలాఎన్నెన్ని -

అంతులేనన్ని సృష్టిస్తూనే ఉన్నది. ప్రతి అంశము లెక్కలెనెన్ని క్రియాకలాపాల సందడి సంరంభాలతో నిండినదే. నిర్విరామంగా అలాసృష్టిస్తూ ఇంకా మరింత సృష్టిస్తూనే ఉన్నది. అనంతంగా ప్రతి అంశంలోను అవసరాలకి మించిన కార్యారంగాల సందడి.

- శ్రీఅరవిందులు

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

ఆహ్వాన గీతం

(ఆలీపూర్ కారాగారం నుండి)

- శ్రీఅరవిందులు

ప్రభంజనాలు అటూ ఇటూ విజృంభించినా,
పర్వతాగ్రాలకూ బురదనేలలకూ తరలిపోతాను.
ఎవరు తోడుగా వస్తారు? ఎవరు ఆరోహిస్తారు?
వాగులు దాటుతూ మంచులో ముందుకు సాగుతూ
వెంటెవరువస్తారు?
తలుపులూ గోడలూ నిర్బంధించే సంకుచిత నగరాల పరిధిలో
నివసించను నేను
నా శిరస్సుమీద నీలగగనంలో శ్యామసుందరమూర్తి
నా మీదికి ఫెనుగాలులూ తుఫానులూ విరుచుకు
పడుతున్నాయి.
ఇక్కడ ఏకాంతసీమలో నా ఖేలావిలాసం
ఆపదలే నాకు ఆప్తమిత్రులు.
ఎవరు నిరవధిక జీవనం కావాలనుకుంటారో
ఎవరు స్వేచ్ఛా జీవితం కోరుకుంటారో
వారంతా తరలిరండి.
పవన ప్రకంపిత పర్వతసీమల్లో విహరించాలి.
పర్వతాగ్రాల అధివసించే ప్రభంజనస్వామిని నేను,
గర్వగౌరవ విలసిత స్వేచ్ఛా ప్రబలశక్తిని నేను,
నా సామ్రాజ్యంలో సహచరులై నాతో విహరించదలచిన వారందరూ
ప్రమాదాలకు ప్రియబాంధవులై దిగంబరులై తరలి రావాలి మరి!

అనువాదం

- చతుర్వేదుల నరసింహాశాస్త్రి

(అమరేంద్ర)

శ్రీఅరవిందుల జీవితంలో ఒక మలుపు

(Excerpts from Sri Aurcbindo's Tales of Prisent Life", Translation by Sisirkumar Ghose from original in Bengali)

- ఆంధ్రానువాదం

ప్రొఫెసర్ ఎస్. జయప్రకాష్

(మధురై కామరాజ్ యూనివర్శిటీ)

1908వ సంవత్సరం మే నెల మొదటి తారీఖు శుక్రవారం రోజున నేను వందేమాతరం కార్యాలయంలో కూర్చొని ఉన్నప్పుడు. అపుడు ముజఫర్‌ఫూర్ నుండి వచ్చిన ఒక టెలిగ్రామును శ్రీశ్యామసుందర్ చక్రవర్తి నా చేతిలో పెట్టారు. ఒక బాంబు ప్రేలుడు సంఘటనలో యిరువురు ఐరోపియను యువతులు మరణించినట్లు దాన్ని చదివిన తర్వాత తెలిసింది. ఈ హత్యకు కారణమయిన వారెవరో తనకు తెలుసని వారు త్వరలోనే ఖైదు చేయబడుతారని, పోలీసు కమీషనరు చెప్పినట్లు ఆనాటి 'ఎంపైర్' పత్రికలోని వార్తను కూడా నేను చదివాను. ముఖ్యంగా సందేహపడవలసిన వాడిగా ప్రధమ హంతకుడిగా, భయంకర వాదులైన యువకులను, విప్లవకారులను ప్రోత్సహించే మాంత్రిక గురువుగా, వాళ్ళ రహస్యనాయకుడిగా పోలీసులు నన్ను అనుమానిస్తున్నట్లు అపుడు నాకు తెలియదు. ఆ రోజు నాజీవితంలో ఒక అధ్యాయపు చివరిరోజు. నా ముందు ఒక ఏడాది జైలు జీవితం వుంది. ఆ ఒక్క సంవత్సరం సకల మానవ సంబంధాలను తెంచుకొని సమాజంతో ఎలాంటి సంబంధమూ లేక బోనులో చిక్కుకున్న మృగంవలె జీవించి ఉండవలసి వస్తుందని నాకప్పుడు తెలియదు. మళ్ళీ యీ క్రియా ప్రపంచంలో అడుగు పెట్టినపుడు పాత అరవింద్‌ఘోష్‌గా ఉండను. ఒక నూతన మార్గంలో పయనించే నూతన వ్యక్తిగా, నూతన మేధస్సుతో, సరికొత్త మనస్సుతో నూతన ప్రాణిక శక్తి, వీటితో ఆలీపూర్ ఆశ్రమం నుండి

వెలుపలికి వస్తానని తెలియదు. ఒక సంవత్సరం జైలు జీవితం అని చెప్పాను; ఒక సంవత్సరం వనవాసం, ఒక సంవత్సరం ఆశ్రమవాసం అని చెబితే సముచితంగా ఉంటుంది. చాలా సంవత్సరాలుగా నా ఇష్టదైవం ప్రత్యక్షదర్శనం కోసం ఎంతో ప్రయత్నం చేశాను. లోకాలను సంరక్షించే పురుషోత్తముని స్నేహితునిగా, దైవంగా అనుభవంలోకి తెచ్చుకోవాలని చాలా ఆశపడ్డాను. అయినప్పటికి అసంఖ్యాకాలైన ఇహలోక వాంఛలకారణంగానూ, వేర్వేరు పనులమీదున్న కారణంగానూ, అజ్ఞానాంధకారంలోవున్న కారణంగానూ అది సాధ్యంకాలేదు. చివరికి పరమదయాళుడు, అపద్బాంధవుడు అయిన శ్రీహరి ఆ శత్రువులందరినీ ఒక దెబ్బతో పడకొట్టి నాకు మహోపకారం చేశాడు. అతడే యోగాశ్రమాన్ని నాకు చూపించి నేను ఒంటిగా జీవించడానికి ఆ ఇరుకుగదిలో నాకు సహాయకుడిగా, నా యోగసాధనానికి గురువుగా, నిలిచాడు. ఆంగ్లేయుల చెరసాలయే ఆ ఆశ్రమం. నా స్నేహితులు సహృదయంతో చేసే మేలుకంటే; నాకెవరూ విరోధులు లేరు కదా! నన్ను ప్రతిఘటించిన వారే అధికంగా నాకు మేలు చేశారనే విచిత్రమైన పరస్పర వైరుధ్యాన్ని నాజీవితంలో తరచూ చూడగలిగాను. వాళ్ళు నాకు అపకారం చేయాలనుకున్నా అది నాకు ఉపకారంగానే పరిణమిస్తోంది. బ్రిటిష్ ప్రభుత్వంవారి కోపంవల్ల ప్రయోజనం నేను భగవంతుని చేరుకోవడమే. చెరసాల జీవితంలో నా అంతరంగ జీవన చరిత్రను వ్రాయడం ఈ వ్యాసం ఉద్దేశ్యం కాదు. బాహ్యా వివరాలు కొన్నింటిని మాత్రం పేర్కొనబోతున్నాను. అయితే ఆ చెరసాల జీవితంలోని ముఖ్య విషయాలను గురించి ప్రారంభంలో ఒక్క సారైనా పేర్కొనడం ఉచితం. జైలు జీవితం అంటే కష్టాలు మాత్రమే అని పాఠకులు భావించవచ్చు. అసౌకర్యాలు లేవని చెప్పలేము; అయితే మొత్తానికి చెరసాల జీవితం ఆనందంగానే గడిచిపోయింది.

శుక్రవారం రాత్రి నేను ఎలాంటి విచారమూ లేక నిద్రపోతూ ఉన్నాను. తెల్లవారుజామున సుమారు 5గంటలకు నా చెల్లెలు కలవరపాటుతో నా గదిలోనికి దూసుకువచ్చి నన్ను పేరుపెట్టి పిలిచింది. నేను మేల్కొన్నాను. మరుక్షణమే ఆ చిన్నగది సాయుధులైన పోలీసులతో నిండిపోయింది. సూపరిండెంట్ క్రేగన్, క్లార్క్, పేరుపొందిన శ్రీమాన్ వినోద్‌గుప్తా సమ్మోహనాకారం, కొంతమంది ఇనస్పెక్టర్లు, ఎర్ర తలపాగాధారులు, గూఢచారులు, ఇంటిని సోదాచేయడానికి వచ్చిన సాక్షులు ఇత్యాది. తుపాకీలు. ఫిరంగులతో నిండిన ఒక కోటను ముట్టడించడానికి వెళ్ళే వీరులవలే అందరూ చేతిలో తుపాకులతో పరిగెత్తుకుంటూ వచ్చారు. ఒక తెల్లదొర నా చెల్లెలు గుండెవైపు తుపాకీని గురిచేసినట్లు నేను విన్నాను. అయితే నేను ప్రత్యక్షంగా చూడలేదు. పడక మీద సగం నిద్రలో కూర్చొని ఉన్న నన్ను క్రేగన్ 'అరవింద్‌ఘోష్ ఎవరు? నీవేనా?' అని అడిగారు. నేను 'అవును. నేనే అరవింద్‌ఘోష్' అన్నాను. వెంటనే నన్ను ఖైదు చేయమని ఒక పోలీసుకు ఉత్తరువిచ్చారు. దాని తరువాత క్రేగన్ ప్రయోగించిన కొన్ని మాటల కారణంగా మా ఇరువురి మధ్య కొంత వాగ్వాదం జరిగింది. సెర్చ్ వారెంట్ చూపించమని అడిగి చదివి సంతకం పెట్టాను. వారంటులో బాంబును గురించి చదువుతున్నపుడే ముజఫర్ పూర్‌లో జరిగిన హత్యకు ఇప్పటి పోలీసుల రాకకు సంబంధం ఉందని నేను అర్థం చేసుకున్నాను. అయితే మాఇంట్లో బాంబుకానీ, ప్రేలుడు పదార్థాలు కానీ ఏదైనా కనిపెట్టి పట్టుకోవడానికి పూర్వమే అరెస్ట్ వారంట్ లేకుండా నన్ను ఎందుకు ఖైదు చేశారనేది నాకు అర్థం కాలేదు. అయితే ఆక్షేపణల వల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదని ఊరుకున్నాను. తరువాత క్రేగన్ ఆదేశాల మేరకు నా చేతులకు సంకెళ్ళువేసి, నడుముకు తాడు కట్టారు. ఒక హిందుస్థానీ కానిస్టేబుల్ ఆ తాటిని పట్టుకొని నా

వెనుక నిలబడ్డాడు. ఆ సమయంలో శ్రీ అవినాశ్ భట్టాచార్య శ్రీమాన్ శైలేజ్‌బోస్ ఇరువురినీ పోలీసులులోనికి తీసుకువచ్చారు. వారి చేతులకు కూడా సంకెళ్ళు, నడుముకు తాడు బిగించారు. ఎవరు చెప్పారో తెలియదు కానీ అర్ధగంట తరువాత చేతి సంకెళ్ళు, నడుముకు కట్టిన తాడు తీసివేశారు. క్రేగన్ మాటల ద్వారా ఆయన క్రూరములైన అడవి జంతువులున్న గుహలో ప్రవేశించినట్లు, మేము చదువురాని మూర్ఖులమూ, చట్టవిరోధులమూ, మాదగ్గర మర్యాదగా మాట్లాడ్డమూ, నడుచుకోవడమూ అవసరం లేదనేది ఆయన అభిప్రాయమైనట్లు మాకు తోచింది. అయితే వేడివేడి వాగ్వాదం తర్వాత తెల్లదొర కొంత శాంతించాడు. వినోద్‌బాబు నా గురించి ఏదో వివరించడానికి ప్రయత్నించాడు. దాని తర్వాత క్రేగన్ "నాకు మీరు బి.ఏ. చదివినట్లు తెలిసింది. మీ వంటి విద్యావంతులు మేజా, కుర్చీ ఏవీ లేని ఇలాంటి ఒక ఇంట్లో నేలమీద పడుకోవడం మీకు సిగ్గు కల్గించే విషయం కాదా!" అని అడిగారు. 'నేను పేదవాణ్ణి, పేదవాడిలాగానే జీవిస్తున్నాను.' అన్నాను. ఐతే ధనవంతుడౌదామనే ఉద్దేశ్యంతోనే ఈ దుండగాలు చేస్తున్నావా! అని క్రేగన్ బిగ్గరగా అరిచారు. మాతృదేశంపైప్రేమ, త్యాగం, పేదరికాన్ని వ్రతంగా చేసికొన్న ఉత్కృష్టత - మొదలైనవన్ని ఆంగ్లేయుడైన యీ మూర్ఖుడికి అర్థమయ్యేలా చెప్పడం అసాధ్యమని భావించి ఆ వ్యర్థ ప్రయత్నం నేను చేయలేదు.

అంతసేపూ అన్వేషణ సాగుతూనే వుంది. ఉదయం 5-30 గం॥లకు ప్రారంభమైన యీ అన్వేషణ సుమారు 11-30గం॥లకు ముగిసింది. పెట్టెలో ఉన్న లేక బయటవున్న నోటుపుస్తకాలు, ఉత్తరాలు, కాగితపు ముక్కలు, కవితలు, నాటకాలు, వచనగ్రంథాలు, వ్యాసాలు అనువాదాలు ఏదీ తదేక దృష్టితో చేసిన యీ అన్వేషణ నుండి తప్పించుకోలేదు. సాక్షులలో రక్షిత్ కొంత హృదయ

సంచలనానికి లోనయ్యారు. పోలీసులు తమతో ఏమీ చెప్పకనే తమను లాక్కుని వచ్చారనీ, ఇటువంటి ఘోరపాపకార్యానికి తాము తోడ్పడగలమని తమకు తెలియదనీ చెప్పి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యానికి తనను, బలవంతంగా ఎత్తుకొని వచ్చినట్లు ఎంతో దీనంగా వివరించారు. మరొక సాక్షి అయిన సమర్‌నాథ్ ప్రవర్తన వేరువిధంగా ఉంది. దానికోసమే జన్మించినట్లు, సిసలైన రాజభక్తునివలె ఉత్సాహంతో పని చేశాడు. వాళ్ళ అన్వేషణలో చెప్పదగింది ఏదీ జరగలేదు. ఒక చిన్న అట్టపెట్టెలో; దక్షిణేశ్వరం నుండి తీసుకువచ్చిన పవిత్రమైన మట్టి కొంత వుంది. అది ఏదో నూతనమైన, అతి భయంకరమైన ప్రేలుడు పదార్థమై వుండవచ్చనే సందేహంతో క్లార్క్ చాలాసేపు దాన్ని గుచ్చిగుచ్చి చూస్తూ వుండసాగారు. ఒక విధంగా క్లార్క్ సందేహం నిరాధారమైందని చెప్పలేము. చివరికి యీ మట్టిని రసాయన పరిశోధన నిమిత్తం పంపించనవసరం లేదని తీర్మానం చేయబడింది. శోధనా సమయంలో పెట్టెలుతెరిచి చూపించడంతప్ప నేను ఏ పనీ చేయలేదు. ఏ కాగితమూ నాకు చూపించడంగానీ, నాముందు చదివించడంగానీ జరగలేదు. అంకధారినుండి వచ్చిన ఒక ఉత్తరాన్ని మాత్రం క్రేగన్ దొర తమదైన పెద్దగొంతుతో చదివారు. మిత్రులు వినోద్‌గుప్తా తన సహజగంభీరమైన శైలిలో అడుగులు వేస్తూ యిల్లంతా అదరగొడుతూ చుట్టివచ్చారు. అల్మారానుండి లేక వేరే ఏదో ఒక చోటునుండి కాగితాలను లేక ఉత్తరాలను వెలుపలికి తీసుకొచ్చి మధ్యమధ్య 'చాలా ముఖ్యమైంది, చాలా ముఖ్యమైంది' అని చెబుతూ క్రేగన్‌కు సమర్పించారు. ముఖ్యమైన ఆ పత్రాలు ఏమటనేది నాకు తెలియలేదు. ప్రేలుడు పదార్థాలను తయారుచేసే విధానానికి సంబంధించిగానీ, కుట్రకు సంబంధించిగానీ ఏ

కాగితమూ మా ఇంట్లో వుండే అవకాశం లేదన్న విషయం నాకు తెలుసు. కాబట్టి యీ విషయంలో నాకు ఎలాంటి ఆసక్తిలేదు. నాగదిని క్షుణ్ణంగా తిరగవేసి చూసిన తర్వాత పోలీసులు మమ్మల్ని పక్కనున్న గదికి తీసుకెళ్ళారు. క్రేగన్ మా పిన్ని పెట్టెను తెరిచి ఒకటి రెండు ఉత్తరాలను చూశారు. తర్వాత ఆడవాళ్ళ ఉత్తరాలు అవసరం లేదని చెప్పి వాటిని అక్కడే వదిలివెళ్ళారు. దాని తర్వాత మేడకింద పోలీసు మహానుభావుల ఆగమనం. క్రేగన్ అక్కడ కూర్చుని టీ త్రాగారు. నేనూ కొంత రొట్టె, ఒక కప్పు కోకో తీసుకున్నాను. ఆ సమయంలో క్రేగన్‌దొర నాతో వాదించి తన రాజకీయ సిద్ధాంతాలను చెప్పేందుకు ప్రయత్నించారు. నేను ప్రశాంతంగా యీ మానసిక చిత్రవధను సహించి ఊరకుండిపోయా. ఐతే ఒక ప్రశ్న. శరీరాన్ని చిత్రహింసలుపెట్టడం పోలీసులకు సహజం. ఐతే ఇలాంటి ఘోరమైన మానసిక చిత్ర హింసలు వాళ్ళ అలిఖిత చట్టంలో వున్నాయెూవెూ! గౌరవనీయులైన 'దేశబంధు' శ్రీమాన్ జోగేంద్రచంద్రఘోష్ దీన్ని గురించి చట్టసభలో ప్రశ్నిస్తారని నమ్ముతున్నాను.

కింది అంతస్తులోని గదులను, 'నవశక్తి' కార్యాలయాన్ని పరిశోధించిన తరువాత పోలీసులు నవశక్తికి స్వంతమైన ఒక ఇనుప అలమరాను తెరవడానికి మళ్ళీ మొదటి అంతస్తుకు వచ్చారు. అరగంట ప్రయాసపడినప్పటికి దాన్ని తెరవడం వీలుకాకపోవడం వల్ల దాన్ని పోలీసు స్టేషనుకు తీసుకువెళ్ళాలని తీర్మానించారు. అదే సమయంలో పోలీసు అధికారి ఒకరు కుష్టియా స్టేషన్ లేబిల్ అంటించి వున్న సైకిలును చూశారు. అది కుష్టియాలోని, ఒక దొరను చంపినవాని సైకిలు అని భావించి ఈ ముఖ్యమైన సాక్ష్యాధారాన్ని వాళ్ళు ఎంతో సంతోషంగా ఎత్తుకు వెళ్ళారు.

సుమారు 11-30 గం॥ లకు మేము ఇంటినుండి బయలుదేరాము. వాకిలి బయట మా చిన్నాన్న, శ్రీమాన్ భూపేంద్రనాధ్ బసు ఇరువురూ ఒక కారులో కూర్చోనున్నారు. 'నీవు ఏనేరం చేసావని నిన్ను అరెస్టు చేసారు' అని మా చిన్నాన్న అడిగారు. 'నాకు ఏమీ తెలియదు. ఇంట్లో ప్రవేశించిన వెంటనే అరెస్టు చేశారు. నా చేతులకు సంకెళ్ళు వేశారు. అని చెప్పాను. 'చేతులకు సంకెళ్ళు వేయవలసిన అవసరం ఏం వచ్చింది?' అని మా చిన్నాన్న అడిగినపుడు వినోద్‌బాబు 'సార్! నేను ఏతప్పూ చేయలేదు. కావాలంటే అరవింద్ బాబుని అడగండి. నేనే దొరగారితో చెప్పి సంకెళ్ళు తీసేయించాను.' అని చెప్పారు. భూపేన్‌బాబు 'నానేరం ఏమిటని' అడిగినపుడు గుప్తాగారు ఐ.పి.సి.కోడ్ పేర్కొంటూ హత్యోదంతాన్ని చెప్పారు. దీన్ని విన్న భూపేన్ బాబు స్థంభించిపోయారు. ఏమీ మాట్లాడలేదు. మా వకీలు శ్రీమాన్ హరేంద్రనాధ్ దత్తా ఇల్లు సోదా చేసేటపుడు నా తరుపున వుండటానికి తన సంసిద్ధతను వ్యక్తం చేసారు. కానీ పోలీసులు దానిని అంగీకరించలేదని తర్వాత తెలిసింది.

మమ్మల్ని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళే బాధ్యత వినోద్‌బాబుకు అప్పగించబడింది. పోలీస్ స్టేషన్‌లో, వారు మాతో ఎంతో మర్యాదగా, నడుచుకున్నారు. అక్కడే స్నానం చేసి, అన్నంతిని లాల్‌బజారుకు బయలుదేరాము. అక్కడ కొన్ని గంటలు వేచివున్న పిదప రాయడ్ వీధికి తీసుకువెళ్ళారు. మంగళప్రదమైన ఆ ప్రదేశంలో సాయంత్రం వరకు వున్నాము. ఇక్కడే మొట్టమొదటిసారిగా జిత్తులమారి గూఢచారి మౌల్వీషామ్స్ - ఉల్ - ఆలమ్ పరిచయం కలగడం, అతనితో ఆత్మీయమైన మైత్రిని పొందే అవకాశం లభించడం జరిగింది. అప్పటికి మౌల్వీసాహెబ్ అంత పలుకుబడిగానీ, శక్తి సామర్థ్యాలను కానీ సంపాదించుకోలేదు. ప్రేలుడు బాంబు ఉపద్రవంలో ప్రధాన

పరిశోధనాధికారిగా, నార్టన్‌గారి నమ్మకమైన అనుచరుడిగానూ, అకుంఠిత జ్ఞాపకశక్తి గలవాడిగానూ ఎదగలేదు. అపుడు రాయ్ సదయ్‌బాబు యీ కేసుకు ముఖ్య సూత్రధారి. మతానికి సంబంధించి మౌల్వీసాహేబ్ హృదయాలకు హత్తుకునే ఒక చక్కటి ప్రసంగం చేశారు. "హిందూ"లో-మూడక్షరాలున్నాయి. అదే విధంగా ఖురాన్‌లో మొదటి మూడు అక్షరాలు అ-ల-మ్. భాషా శాస్త్రరీత్యా 'ఉ' అక్షరం 'ల' స్థానంలో వ్యవహరించబడుతుంది. కాబట్టి హిందూ-ముస్లిం మూలమంత్రం ఒకటే. ఇరువురూ ఒకే పవిత్రాక్షరాలను కలిగివున్నారు. అయినప్పటికి తమ మత వైశిష్ట్యాన్ని పరిరక్షించడం తప్పనిసరి. కాబట్టి ఒక హిందువు ముస్లింలలో ఒకడిగా కూర్చుని భోంచేయడం తప్పు అని భావిస్తాడు. సత్యసంధత అనేది మత జీవనంలో ఒక ప్రధానాంశం. అరవిందఘోష్ హంతకులకు నాయకుడని దొరలు చెప్తున్నారు. ఇది యీ దేశానికి అవమానాన్ని, దుఃఖాన్ని తెచ్చిపెట్టే విషయం. ఐతే న్యాయ మార్గంలో పయనంచేస్తే పరిస్థితిని యింకా కాపాడవచ్చు. బిపిన్‌లాల్, అరవింద ఘోష్ మొదలైన బుద్ధిమంతులు, మంచివారు ఏంచేసినప్పటికి వాటిని బహిరంగంగా అంగీకరిస్తారు అనే విషయంలో తనకెలాంటి సందేహమూ లేదన్నారు మౌల్వీ సాహెబ్. అక్కడున్న శ్రీమాన్ పూర్ణచంద్రశాస్త్రికి సందేహం తీరలేదు. ఐతే మౌల్వీ సాహెబ్ తన అభిప్రాయాలను మార్చుకోలేదు. వారి విజ్ఞానం, బుద్ధి చాతుర్యం, మతవిశ్వాసం మొదలైనవి నాకు మిక్కిలి ఆనందాన్ని కల్గించాయి. నేను అధికంగా మాట్లాడ్డం మంచిది కాదని భావించి ఆయన అమూల్యములైన ఉపదేశాలను వినయంతో విని హృదయంలో పదిలపరచుకొన్నాను. ఐతే మతం మీదెంత విశ్వాసమున్నప్పటికీ మౌల్వీ తన గూఢచారివృత్తిని మాత్రం వదలలేదు. 'ప్రేలుడు పదార్థాలను తయారు చేసేటందుకు తోటను మీరు మీ తమ్ముడికి యివ్వడం చాలా పొరబాటు. ఇది మంచి పనికాదు.' అని


ఒక పర్యాయం చెప్పారు. వారి మాటల్లోని అంతరార్థాన్ని నేను అవగతం చేసుకున్నాను. మందహాసంతో 'అయ్యా! తోటమీద నాకున్న హక్కు మా తమ్ముడికీ వుంది. నేనది నా తమ్ముడికి ఒదిలివేసాననీ, లేకప్రేలుడు బాంబులు తయారుచేయడానికి అతనికి యిచ్చివేశాననీ మీకు చెప్పింది ఎవరు?' అని అడిగాను. ఒకింత సిగ్గుతో 'లేదులేదు ఒకవేళ అలా చేసివుంటే!' అని అన్నారు. అపుడు మహాత్ముడైన మౌల్వీ తన స్వీయచరిత్రలో ఒక అధ్యాయాన్ని నాకు తెరిచి చూపించాడు. 'నైతికంగా, ఆర్థికంగా నేను యింతవరకు సాధించిన అభివృద్ధి అంతా మా నాన్నగారి ఉపదేశం వల్లనే సాధ్యమైంది'. 'ఎదురుగా సిద్ధంగా వున్న లాభాన్ని ఎపుడూ వదులుకోకు' అని మా నాన్నగారు చెపుతుండేవారు. ఈ మహావాక్యమే నా జీవితానికి మూలమంత్రమైంది. దీన్ని ఎల్లపుడూ జ్ఞాపకం వుంచుకోవడం వల్లనే నాకు యింతటి అభివృద్ధి సాధ్యమయింది- అని చెప్పారు. ఇది చెపుతున్నపుడు నాపై వారు ప్రసరించిన తీవ్రమైన చూపుల్లో నేను వారికి ముఖ్య ఆహారమని తోచింది. సాయంత్రం ప్రముఖులైన రాయ్‌సదయ్ ముఖోపాధ్యాయ వచ్చారు. వారు నాపై ఎనలేని ప్రేమను, దయను కురిపించారు. నా భోజనం విషయం గురించి, పడక వసతుల గురించి శ్రద్ధ వహించవలసిందిగా, అక్కడున్న ప్రతి ఒక్కరికీ చెప్పారు. మరుక్షణమే కొందరు నన్నూ, శైలేంద్రునీ యిరువురినీ భోరున కురిసే వర్షంలో లాల్ బజారుకు పిలుచుకువెళ్లారు. ఈ ఒక్క పర్యాయమే నేను రాయ్‌సదయ్ గారిని కలుసుకొనడం జరిగింది. వారు మేధాసంపన్నులని, చురుకైనవారనీ తెల్సింది. అయితే నాటక రంగంమీద నటించేవారివలె వారి మాటలు, భావన, గొంతు, నడక అన్నీ కృత్రిమంగానూ, అసహజంగానూ తోచింది. మాటలు, శరీరం, క్రియ అన్నీ అసత్యపు అవతారాలుగా కల్గినవాళ్ళు కొందరున్నారు. హృదయపరిపక్వత లేనివారిని బానిసలుగా మార్చడంలో వీరు

నిష్ణాతులు. అయితే మనుషులను గురించి, వాళ్ల ప్రవర్తన గురించి తెలిసిన వాళ్ళు వీళ్లను వెంటనే గుర్తుపట్టగలరు.

లాల్‌బజారులోని ఒక ఇంటికింది అంతస్తులోని ఒక విశాలమైన గదిలో ప్రవేశించారు. వాళ్లలో ఒకరు పోలీసు కమీషనరు హాలిడే అని తర్వాత తెలిసింది. మేమిరువురం ఒకటిగా వుండటం చూసి మిస్టర్ హాలిడే సార్జెంట్ పై కోప్పడ్డారు. నన్ను చూపి "జాగ్రత్త ! వారితో కలిసి వుండడమో మాట్లాడ్డమో చేయకూడదు" అని చెప్పారు. వెంటనే శైలేన్‌ను వేరొక గదికి తీసుకువెళ్లి బంధించారు. అందరూ వెళ్లిపోయిన తర్వాత "పిరికితనంతో క్రౌర్యంతో, కూడిన యీ పనిలో పాల్గొనడం నీకు సిగ్గుగాలేదా?" అని నన్ను అడిగారు. 'నాకు దీనితో సంబంధం వుందని ఊహించడానికి మీకున్న ఆధారం ఏమిటి?' అని నేను అడిగాను. దానికి 'వారు నేను ఊహించడం లేదు. నాకు అంతా తెలుసు' అని జవాబిచ్చారు. 'ఏం తెలుసు, ఏం తెలియదు అనేది మీకే తెలియాలి, యీ హత్యతో నాకు సంబంధం వున్నదనే విషయాన్ని ఖండిస్తున్నాను' - అన్నాను.

ఆ రోజు రాత్రి నన్ను చూడ్డానికి చాలామంది వచ్చారు. అందరూ పోలీసు శాఖకు సంబంధించిన వాళ్లే. వీళ్ళు రావడానికి గల మర్మాన్ని నేను యింతవరకు తెలుసుకోలేక పోయాను. నేను అరెస్టు కావడానికి 1½ మాసాలక్రితం నాకు పరిచయంలేని ఒకరు నా దగ్గరికి వచ్చి 'అయ్యా! నేను మిమ్మల్ని యింతకు ముందు కలుసుకోలేదు. ఐతే మీరంటే నాకు ఎనలేని గౌరవం. అందువల్లనే మీకు రాబోయే పెద్ద విపత్తును గురించి హెచ్చరించాను. కోనగర్‌లో మీకు పరిచయమున్న వాళ్ళు ఎవరైనా ఉన్నారా? ఎప్పుడైనా అక్కడికి వెళ్లారా? అక్కడ ఇల్లులాంటిది ఏదైనా వుందా!' అని అడిగారు. నేను 'లేదు, నాకు అక్కడ ఇల్లు ఏదీ లేదు. ఐతే కోనగర్‌కు ఒక పర్యాయం వెళ్లాను. అక్కడ కొంతమంది తెలుసు'

అని చెప్పాను. 'నేను ఇక ఏమీ చెప్పబోవడం లేదు. ఐతే ఇక కోనగరలో ఎవరినీ కలుసుకోకండి. మీకు మీ తమ్ముడు బరేంద్రకూ వ్యతిరేకంగా కొందరు దుర్మార్గులు కుట్రపన్నుతున్నారు. మిమ్మల్ని త్వరలోనే కష్టాలపాలు చేయనున్నారు. ఇంతకుమించి నన్ను ఏమీ అడక్కండి' అని ఆ అపరిచితుడు చెప్పాడు. 'అయ్యా! ఈ అరకొర వివరాలు వల్ల నాకు ఏం సహాయం కలుగుతుందనేది అర్థం కాలేదు. ఐనప్పటికీ సహాయం చేయడానికి వచ్చినందులకు కృతజ్ఞతలు. ఇక ఏదీ తెలుసుకోవడానికి నేను ఇష్టపడ్డం లేదు. భగవంతుడి మీద నాకు పరిపూర్ణ విశ్వాసం వుంది. ఆయన నన్ను ఎల్లపుడూ కాపాడుతారు. ఈ విషయంలో నేను ప్రయత్నం చేయడమో, జాగ్రత్తగా వుండటమో అవసరం లేదు.' అని నేను చెప్పాను. దాని తరువాత నేను యీ విషయమై ఏదీ వినలేదు. అపరిచితుడైన ఆ వ్యక్తి ఊహాగానం ఏమీ చేయలేదనడానికి ఆధారం ఆ రోజురాత్రి నేను చూశాను. ఒక ఇన్‌స్పెక్టర్ మరి కొందరు పోలీసు అధికారులు వచ్చి కోనగర్‌కు నాకున్న సంబంధాన్ని నా నుండి లాగడానికి ప్రయత్నించారు. 'కోనగర్ మీ స్వంత ఊరా? అక్కడికి ఎప్పడైనా వెళ్ళారా? ఎప్పడు? ఎందుకు? బరీంద్రులకు అక్కడ ఆస్తిపాస్తులు ఏమైనా వున్నాయా?' ఈ విధంగా చాలా ప్రశ్నలు అడిగారు. ఈ మర్మం ఏమిటో తెలుసుకోవడానికై నేను ప్రశ్నలన్నింటికి సమాధానమిచ్చాను. ఈ ప్రయత్నంలో నేను విజయవంతం కాలేదు. ఐతే పోలీసువాళ్ళు ప్రశ్నల నుండి, విచారణ పద్ధతి నుండి వాళ్ళు ఏదో సమాచారం పేరుతో ఆ సమాచారం సరైనదా అని తెలుసుకోవడానికై వచ్చినారని తెలియవచ్చింది. తాయి మహారాజు కేసులో తిలక్‌గారిని ఒక సయవంచకుడు అనీ, అబద్ధాలకోరు, మోసగాడు ప్రజాపీడకుడు అనీ నిరూపించే ప్రయత్నంలో బొంబాయి ప్రభుత్వముతో చేతులు కలిపి ప్రజాధనాన్ని



ఆలీపూర్ కారాగారంలో శ్రీఅరవిందుల గది

వ్యర్థం చేసిన విధంగా నన్ను కూడ కష్టాలపాలు చేయాలని అభిలషించేవాళ్ళు కొందరు వున్నారని అనుమానించారు.

ఆదివారమంతా లాకప్‌లోనే గడిచిపోయింది. నా గదిముందు మేడ మెట్లు వున్నాయి. ఉదయం కొంతమంది యువకులు మెట్లుదిగి రావడం చూశాను. వాళ్ళతో నాకు పరిచయం లేదు, ఐతే వాళ్ళు కూడా యిదే అభియోగానికి సంబంధించి అరెస్టుచేయబడ్డారని అర్థంచేసుకున్నాను. వాళ్ళు మాణిక్ తోలా ఉద్యాన వనానికి సంబంధించిన యువకులని తర్వాత తెలసింది. ఒక నెల తర్వాత వాళ్ళతో పరిచయమైంది. కొంతసేపైన తర్వాత కాళ్ళు చేతులు కడుక్కోడానికి నన్ను కూడా క్రిందకి తీసుకెళ్ళారు. స్నానం చేయడానికి అక్కడెలాంటి సౌకర్యమూ లేకపోవడం వల్ల నేను స్నానం చేయలేదు. మధ్యాహ్న భోజనంగా ఎంతో ప్రయాసతో కొంత ఉడికిన అన్నం, పప్పు మింగాను. ఈ ప్రయత్నం కఠినమనిపించడం వల్ల మానివేశాను. మధ్యాహ్నం కొన్ని అటుకులు యిచ్చారు. మూడు రోజులుగా యిదే మా ఆహారం. ఐతే సోమవారం నాడు సార్జంట్ తామే స్వయంగా వచ్చి మాకు టీ, రొట్టె యిచ్చాడు.

నా జైలుగది పొడవు తొమ్మిది అడుగులు, వెడల్పు అయిదు అడుగులు, కిటికీలు లేవు. ఎదురుగా బలమైన ఇనుప కమ్ములు. ఈ బోనే నాకు ఇవ్వబడిన విడిది, బయట నేలమీద రాళ్లు పరిచిన చిన్న వరండా, ఎత్తైన ఇటిక గోడ, చిన్న కొయ్యతలుపు. ఆ తలుపు పైభాగంలో కంటి ఎత్తున ఒక చిన్న ద్వారం, తలుపులు వేసిన తరువాత ఖైదీ ఏం చేస్తున్నాడో తెలుసుకోవడం కోసం కావలివాళ్లు అప్పుడప్పుడు ఆ ద్వారం గుండా, చూడ్డం కద్దు, అయితే నా వరండా తలుపులు అధికభాగం తెరిచే ఉంటాయి. గదులు పక్క పక్కనే ఉండడంవలన జైలు భాషలో వీటికి "ఆరు డిగ్రీలు" అని పేరు, ఇవి

న్యాయమూర్తుల వలనగాని, జైలు సూపరెండెంటు వలన గాని తీవ్రదండన విధించిన వాళ్లకోసం ఏర్పాటు చేయబడిన చిన్న గుహలు. ఈ ఏకాంత జైలుజీవితంలో కూడా హెచ్చుతగ్గులున్నాయి. తీవ్రదండన విధించబడిన వారి వరండా తలుపులు ఎప్పుడూ మూయబడి ఉంటాయి. రోజు రెండుసార్లు భోజనం తీసుకువచ్చే తన సహఖైదీ, తనను పర్యవేక్షించడానికి వచ్చే కావలివాడు, వీళ్లు తప్ప మానవసమాజంతో వీళ్లకు ఎలాంటి సంబంధంలేదు. హేమచంద్రదాస్ నాకంటే భయంకరమైన తీవ్రవాది అని సి.ఐ.డి. పోలీసులు భావించడంవలన ఈ తీవ్రదండన ఆయనకు విధింపబడింది. అయితే ఈ ఏకాంత జైలు జీవితానికి కొన్ని అలంకారాలు కూడా ఉన్నాయి. అవి చేతులకు కాళ్లకు సంకెళ్లు, జైలు ఏకాంతతకు భంగపరచిన వాళ్లకు, మొరటుగా ప్రవర్తించిన వాళ్లకు, జైలు పనుల్లో అశ్రద్ధగా ఉంటున్న వాళ్ళకు ఈ దండన లభిస్తుంది. ఏకాంత జైలువాసంలో ఉన్న విచారణా ఖైదీలను ఇంకా ఇబ్బంది పెట్టడం చట్టరీత్యా విరుద్ధమైనప్పటికీ "స్వదేశీ" లేక "వందేమాతరం" ఖైదీలును చట్టానికి అతీతులు కావడంవలన పోలీసులు కావలసినపుడంతా ఈ విధంగా దయారసాన్ని కురిపిస్తుంటారు.

మాకు ఏర్పాటు చేసిన జైలు గదుల పరిస్థితి ఈ విధంగా ఉంది. ఉదార స్వభావం కలిగిన అధికారులు మాకోసమని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అతిథి సౌకర్యాలు ఆశించడానికి వీలుకాని విధంగా ఉన్నాయి. ఒక కంచం, ఒక గిన్నె, వరండాకు అలంకరించి ఉన్నాయి. అన్ని పనులను పూర్తి చేసే ఈ కంచాన్ని, గిన్నెను బాగా తోమి శుభ్రం చేసినట్లయితే, ఇవి వెండి గిన్నెవలె మెరుస్తుంటాయి. ఇది నా జీవితానికి కొంత ఊరటను కలిగిస్తుంటుంది. ఈ జైలు అనే స్వర్ణ సామ్రాజ్యంలో నిష్కలంక బ్రిటిష్

ఆధిపత్యానికి చిహ్నమైన ఈ పాత్రల ప్రకాశాన్ని చూస్తున్నప్పుడు రాజభక్తితో కలిగిన ఆనందం నాలో ఉప్పొంగుతుంది. అయితే దురదృష్టవశాత్తు కంచంకూడా ఈ ఆనందంలో పాలు పంచుకోవటం కద్దు. వేళ్లను దానిపై కొంత గట్టిగా ఆదిమినట్లయితే అరేబియా దేశంలో సంచారం చేసే మహమ్మదీయ సన్యాసులవలె అవి గుండ్రంగా తిరిగి వస్తాయి. అప్పుడు ఒక చేత్తో కంచాన్ని పట్టుకొని మరొకచేత్తో తినడంతప్ప, వేరే మార్గం లేదు. లేకపోతే పోల్చడానికి వీలుకాని జైలు ఆకారంతో పాటు అది తిరుగుతూ జారిపోవచ్చు. అయితే కంచంకన్న, గిన్నె నాప్రేమకు, నా అవసరాలకు ఉపయోగకరంగా ఉంటుంది. జడ పదార్థంలో ఇది బ్రిటిష్ సివిలియన్ లాంటిది. వారు ఏవిధంగా అన్ని పనులకు ప్రకృతి సహజంగా అర్హులైన వారిగా ఉన్నారో - న్యాయమూర్తి, మెజిస్ట్రేట్, పోలీసు, రెవిన్యూఅధికారి, మునిసిపాలిటీ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు, మత ప్రచారకులు - ఏ పని అయినా సరే చెప్పిన వెంటనే స్వీకరించడానికి తగినవాళ్లుగా ఉన్నట్లు విచారణ అధికారి, వాది, పోలీసుఅధికారి కొన్ని సమయాల్లో వాది వకీలు - ఇవన్నీ ఎలాంటి సంకోచం లేకుండా వారి శరీరంలో కలిసి పోయినట్లు నా అభిమానానికి పాత్రమైన, ఈ గిన్నెకూడా ఎన్నో పనులుచేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గిన్నెకు మత సంబంధమైన కట్టుబాట్లు లేవు. పక్షపాతం లేదు. జైల్లో ఈ గిన్నె ఉదయం పూట కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఉపకరిస్తుంది. పిదప ఈ గిన్నెలోని నీటితో నోరు పుక్కిలించుకుంటాను, స్నానం చేస్తాను. కొంత సేపైన తరువాత అన్నం తినేటప్పుడు అదే గిన్నెలో కూర వడ్డించబడుతుంది. అదే గిన్నెలో నీళ్లు కూడ తాగుతాను, పిదప నోరు కడుక్కుంటాను. ఈ విధంగా అన్ని పనులకు ఉపయోగపడే ఒక అమూల్యమైన వస్తువు, బ్రిటిష్ వారి చెరసాలలో తప్ప వేరెక్కడ దొరుకుతుంది! గిన్నె నా

లౌకికి అవసరాలను పూర్తి చేయడమే కాదు, నా ఆధ్యాత్మిక అవసరాలకు కూడ సహాయం చేసింది. అసహ్యభావన నాలో తొలగిపోవడానికి సహాయం చేసే ఇలాంటి గురువును వేరక్కడ పొందగలం! ఏకాంత జైలుజీవితం మొదటి అధ్యాయం తరువాత మమ్మల్ని కలిపి ఒకచోట ఉంచినపుడు నా పేర, హక్కులు విభజింపబడ్డాయి. అధికారులు ఉదయంపూట కాలకృత్యాలకు మరొక పాత్రను ఏర్పాటు చేశారు. అయితే ఒక నెలలోనే అసహ్యభావాన్ని నియంత్రించడానికి ఒక భోజన పద్ధతిని నేను తెలుసుకొన్నాను. కాల కృత్యాలను తీర్చుకోవడం కోసం చేసిన ఏర్పాట్లన్నీ ఒక మనిషి తనను తాను నియంత్రించుకొని ప్రవర్తించాలి అనే పాఠాన్ని బోధించడం కోసమే నియమింప బడినట్లు నాకు తోచింది. ఏకాంత జైలుజీవితం అనేది తీవ్రమైన దండనగా పరిగణింపబడుతుంది. మానవులతో సహవాసాన్ని, బాహిర ప్రదేశాల్లో సంచరించడాన్ని నిరోధించడమే దీని మూలతత్వం. కాలకృత్యాలకోసం బయటి ప్రదేశాలను, ఉపయోగించడం ఈ సిద్ధాంతాన్ని అతిక్రమించినట్లు కదా! కాబట్టి గదిలోనే తారు పూయబడిన రెండు బుట్టలు ఉంచబడ్డాయి. ఉదయం, సాయంత్రాల్లో పనివాడు వచ్చివాటిని శుభ్రంచేసి వెళ్తుంటాడు. తీవ్రమైన ఆందోళన కారణంగానూ, హృదయావేశాన్ని కలిగించే ఉపన్యాసాల ఫలితంగానూ కొన్ని సమయాల్లో వాటిని శుభ్రం చేయటం కద్దు. అయితే ఆ కాలంలో పాయిఖానా ఉపయోగించుకున్నట్లయితే వానికి దండనగా కొన్ని గంటలు దర్వాసనను భరించవలసి ఉంటుంది. మా జైలుజీవితం రెండో అధ్యాయంలో, వీటికి సంబంధించి కొన్ని సౌకర్యాలు చేయబడ్డాయి. బ్రిటిష్‌వారి సంస్కరణలు పరిపాలనలో కొన్ని మార్పులకు అనుమతిస్తాయిగాని దాని మూలతత్వాన్ని కొంతకూడా మార్చదు.

ఈ ఏర్పాట్ల కారణంగా ముఖ్యంగా భోజనం చేసేటప్పుడు, రాత్రి వేళల్లో ఈ చిన్న గదిలో తీవ్రమైన ఇబ్బందులు అనుభవించవలసి వచ్చిందని చెప్పవలసిన పనిలేదు. స్నానం చేయడానికి తగిన వసతులతో అనుసంధానమై ఉన్న గదులు పాశ్చాత్య సంస్కారంలో ఒక భాగమని నాకు తెలిసిఉన్నప్పటికీ ఒక చిన్న గదిలోనే పడుకునే గది. భోజనాలు చేసే గది, మరుగు దొడ్డి అన్నీ కలిసి ఒకటిగా ఏర్పరచడం ఇది వాళ్ల తాహతుకుమించిన సౌకర్యం అనే చెప్పవలసి ఉంటుంది. భారతీయులమైన మనం విచారించవలసిన ఆచారాలను కలిగి ఉన్న వాళ్లు, ఇంతటి అత్యున్నత నాగరికత మనకు బాధాకారం.

ఇక మిగిలిన వసతులు - ఒక చిన్న బకెట్, నీళ్లు ఉంచడానికి తగరపు డబ్బా, రెండు చిన్న కంబళ్లు ఉన్నాయి. స్నానం చేయడంకోసం ఉపయోగించడానికి ఒక చిన్న బకెట్ వరండాలో ఉంచబడింది. నేను స్నానంచేయడం కూడ అక్కడే, ప్రారంభంలో నాకు నీళ్లకొరత లేదు. తరువాత ఆ ఇబ్బంది కూడ ఎదురైంది. పక్కన పశువుల కొట్టంలో ఉన్న ఖైదీ నేను కోరినపుడంతా కావలసినన్ని నీళ్లు తెచ్చి ఇస్తుండే వాడు. అందువలన సంయమనంతో కూడిన జైలు జీవితంలో స్నానం చేసేటప్పుడు మాత్రం సొంత ఇంట్లో ఉంటున్నట్లు ఆనందంతో కూడిన తృప్తిని రోజూ అనుభవించాను. మిగిలిన ఖైదీలు ఇంతటి భాగ్యానికి నోచుకోలేదు. ఒక బకెట్ నీళ్లతోనే రోజువారి కృత్యాలు, పాత్రలు తోమడం, స్నానం అన్నీ పూర్తి చేసుకోవాలి. విచారణలో ఉన్న ఖైదీలు కావడం వలన ఈ అమోఘమైన సౌకర్యం వాళ్లకు ఇవ్వబడింది. విచారణ ముగిసి దండింపబడిన దోషులకు ఒకటి లేక రెండు గిన్నెల నీళ్లు మాత్రమే స్నానం చేయడానికి దొరుకుతుంది. భగవంతునిపై ప్రేమ, శరీర ఆరోగ్యం ఇవి రెండూ సమమైన అరుదైన గుణాలని భావించే బ్రిటిష్ వాళ్ల హక్కులను

నిరూపించడం కోసం జైలు విధులు ఏర్పాటు చేయబడినవా? లేక స్నానంచేసే వసతులు అధికంగా కల్పించడం వలన ఖైదీల అభీష్టానికి విరుద్ధమైన సంయమనాన్ని నిరోధించడానికా? అనేది నిర్ణయించడం కష్టం, ఖైదీలు కాకిస్నానం అని చెప్పి అధికారుల ఈ ఔదార్యాన్ని గేళి చేస్తుంటారు. సహజంగానే మనుషులకు తృప్తి ఉండదు. తాగేనీళ్ల కోసమైన ఏర్పాట్లు, స్నానపు ఏర్పాట్లు కన్న ఎంతో మేలు. అప్పుడు ఎండాకాలం, నా చిన్న గదిలోనికి గాలి చొరడానికి అనుమతి లేదు. అయితే మేనెల దహించివేసే ఎండలు ఏ అడ్డంకీ లేక నా గదిలో ప్రవేశిస్తాయి. గది మొత్తం ఆవంలో ఉన్నట్లుగా వేడెక్కుతుంది. ఈ వేడిలో అణచుకోవడానికి వీలులేని దప్పికను తీర్చుకోవడానికి తగరపు డబ్బాలోని వేడెక్కిన నీళ్లను తాగడం తప్ప వేరేమార్గం లేదు. మళ్లీమళ్లీ నేను ఆ తగరపు డబ్బాలోని నీళ్లనే తాగుతూ వచ్చాను. అయితే దప్పిక ఏమాత్రం తీరలేదు. అధికంగా చెమటలు పోయడం కారణంగా కొంతసేపటికే మళ్లీ దాహం వేస్తుంది. ఒకరిద్దరి వరండాల్లో మట్టికుండలు పెట్టి ఉంటే తాము పూర్వ జన్మలో చేసిన తప్పు ఫలితంగా ఈ అదృష్టం లభించిందని వాళ్లు భావించేవాళ్లు, స్వప్రయత్నంలో తీవ్రమైన విశ్వాసమున్న వాళ్లు కూడ ఇది విధి వైపరీత్యమని అంగీకరించవలసి వచ్చింది. కొందరికి చల్లని నీళ్ళు దొరికాయి. మరి కొందరు సదా దాహంతో అవస్థపడవలసి వచ్చింది. తలరాత ప్రకారంగానే అన్నీ జరుగుతాయి. అయితే తగరపు డబ్బాలనుగాని, కుండలను గాని, పంచడంలో అధికారులు ఏ చిన్న పక్షపాతమూ లేక ప్రవర్తించారు. ఈ విధమైన ఏర్పాట్ల వల్ల నేను సంతోషించానో లేదో కాని ఉదార స్వభావంగల జైలు డాక్టరు నా నీళ్ల కష్టం సహించలేకపోయారు. నాకోసం మట్టి కుండను ఏర్పాటు చేయడానికి ఆయన ప్రయత్నించారు. అయితే పంపిణీ చేసే అధికారం ఆయన చేతిలో లేకపోవడం వల్ల చాలా

రోజులకు గానీ, ఆయన సఫలీకృతుడు కాలేకపోయాడు. చివరకు ఆయన ఆజ్ఞలకులోబడి పనివాడు ఎక్కడో ఒక కుండను కనిపెట్టాడు. అంతకు ముందే దాహంతో సాగించిన దీర్ఘపోరాటం ఫలితంగా నేను దాహాతీత స్థితికి చేరుకున్నాను. వేడి అధికంగా ఉన్న ఈ గదిలో రెండు జైలు కంబళీలే నాపడక. తలగడా లేదు. ఒక దుప్పటిని పరుచుకొని, మరొక దుప్పటిని మడిచి, తలగడగా చేసుకొని నేను నిదురించాలి. ఎండ వేడిమి భరించలేనప్పుడు నేలమీద పొర్లిపడుకొని ఆనందించే వాణ్ణి. నేల తల్లి చల్లని స్పర్శ ఎంత తీయనైనదో అప్పుడు నేను తెలుసుకొన్నాను. అయితే జైలు నేల స్పర్శ అంత మృదువుగా లేకపోవడం వలన నిద్ర చెడింది. అప్పుడు మళ్ళీ దుప్పటి సహాయాన్ని ఆపేక్షించవలసి వచ్చింది. వానరోజులు చాలా సంతోషకరమైనవి. అయితే వీనిలో ఒక కష్టం ఉంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు గాలి వేగానికి చిక్కుకొని ధూళి, ఆకులు, గడ్డి వీటి తాండవ నృత్యం తరువాత ఒక చిన్న వరద ఉధృతం నా గదిలో ఏర్పడుతుంది. దాని తరువాత తడిసిన నా దుప్పట్లను మోసుకొని వెళ్లడం తప్ప వేరుమార్గం లేదు. ప్రకృతి కేళీ వినోదం ముగిసిన తరువాత కూడ నేలతడి ఆరేదాక నిద్రను గురించిన ఆశను వదలుకొని జ్ఞాపకాలగూడులో ఆశ్రయాన్ని కోరి ఒదిగి ఉండవలసిందే. దొడ్డికి వెళ్ళే స్థలంలో మాత్రమే కొంత పొడి స్థలం. అయితే దుప్పటిని అక్కడ పరచుకోవడం నాకు ఇష్టం లేదు. ఇన్ని కష్టాలున్నప్పటికి గాలివీచే దినాలలో, నాగదిలో గాలి ప్రవేశించి గదిలోని అగ్ని గుండాన్ని పోలిన ఉష్ణాన్ని చల్లార్చడం వలన గాలి వానలను నేను ఆహ్వానిస్తుంటాను.

ఆలీపూర్ ప్రభుత్వ హోటల్‌ను గురించి నేను ఇచ్చిన, ఇవ్వబోతున్న వివరణ నా కష్టాలను ప్రకటించుకోవడానికి కాదు.

నాగరీకులమని చెప్పుకునే ఆంగ్లేయుల ప్రభుత్వంలో విచారణ ఖైదీల కోసం ఎంతటి విచిత్రమైన ఏర్పాట్లు చేయబడిఉన్నాయో, అమాయకులు అంతులేని వేదనలు ఎలా అనుభవిస్తున్నారో ఎత్తిచూపడానికే ఈ వివరణ. ఈ కష్టాలన్నీ వాస్తవాలే అయినప్పటికీ భగవంతుని కృపాకటాక్షాలలో, నాకున్న దృఢవిశ్వాసంతో మొదటి కొన్ని రోజుల వరకే అవి ఉన్నాయి. దాని తరువాత నామనసు ఈ వేదనలన్నింటినీ అధిగమించి, ఇక ఏ కష్టమూ బాధించని, అతీత స్థితికి చేరుకుంది. ఇది ఎలా జరిగిందనేది నేను తరువాత వివరిస్తాను. దీని కారణంగానే ఇప్పుడు కూడా నాకు జైలుజీవిత జ్ఞాపకాలు వచ్చినపుడంతా కోపమో, దుఃఖమో కలగకుండా నవ్వు వస్తుంటుంది. మొట్టమొదటి వినోదకరమైన జైలు దుస్తులు ధరించి నా బోనులో ప్రవేశించి మాకోసం చేయబడిన ఏర్పాట్లను చూసినపుడు ఈ భావమే నాకు కలిగింది. మనసులోనే నవ్వుకున్నాను. ఆంగ్లేయుల చరిత్రను వాళ్లు చేస్తున్న చేష్టలను గురించి నేను చదివిఉండడం వలన వాళ్ల విచిత్ర స్వభావాన్ని గురించి క్షుణ్ణంగా అవగతం చేసుకొన్నాను. అందువల్ల వాళ్లు మాపట్ల నడుచుకొన్న విధానం నాకు ఆశ్చర్యంగాని, దుఃఖాన్ని గాని కలిగించలేదు. వాళ్ళు మమ్మల్ని పరిగణించిన విధానం మిక్కిలి నీచమైందనీ, ఖండించ తగినదనీ భావించవచ్చు. మేమందరం ఉన్నత కుటుంబాల నుండి వచ్చిన వాళ్లము. చాలామంది భూస్వామి కుటుంబాలకు చెందిన వాళ్లు. తమ కుటుంబం, విద్య, గుణగణాలు, ప్రవర్తన కారణంగా కొందరు ఇంగ్లాండులో ఉన్నత కుటుంబాలకు చెందిన వ్యక్తులకు సమానమైన వాళ్లు.

మేము ఖైదు చేయబడడానికి కారణం సాధారణ హత్యగాని, దొంగతనం గాని, లేక దోపిడిగాని కాదు. మాతృదేశం కోసం స్వతంత్ర

పోరాటంలో పాల్గొని దేశాన్ని పరాయి ప్రభుత్వనుండి విడుదల చేసే ఉద్యమంలో పాలు పంచుకోవడం, లేక పరాయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవాన్ని రేకెత్తించడం - ఇవే మా నేరాలు. మమ్మల్ని చెరసాలలో పెట్టడానికి ముఖ్యకారణం అనుమానం మాత్రమే. అందులో కొంతమంది విషయంలో పోలీసుల సందేహానికి తగిన కారణం కూడా లేదు. ఈ స్థితిలో సాధారణమైన దొంగలవలె, దోపిడీదారులవలె, మూకుమ్మడిగా మమ్మల్ని అణగదొక్కి ఉంచడం, దొంగలను దోపిడీదారులను, అంతెందుకు బోనులో మృగాలను బంధించడం వంటిదనే చెప్పాలి. మృగాలకు కూడ పనికిరాని ఆహారాన్ని ఇచ్చి, నీళ్ళకొరత, దాహం, ఆకలి, ఉష్ణం, వాన, చలి వీటిని ఓర్చుకొనేటట్లు చేయడం - ఇవన్నీ బ్రిటిష్ జాతి యొక్క, బ్రిటీష్ ఆధిపత్య అధికారుల యొక్క గొప్పదనాన్ని పెంపొందించడానికి కాదు. ఇది ఆంగ్లేయులలోని గుణలేశమే తప్ప మరొకటి కాదు. క్షత్రియుల స్వభావం కలిగి ఉన్నప్పటికీ విరోధులతో, ప్రతి పక్షులతో నడుచుకునే విధంలో వీళ్లు నూటికి నూరు పాళ్లు వ్యాపారులే. అయితే నా మనసులో ఎలాంటి ద్వేషభావమూ అప్పుడు కలగలేదు. పైగా నాకూ, చదువురాని వారికీ మధ్య ఎలాంటి వ్యత్యాసమూ చూపించక పోవడాన్ని చూసి కొంత ఆనందించాను. అంతేగాక, ఈ ఏర్పాటు నా మాతృభక్తి అనే అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. యోగాభ్యాసం చేయడానికి, ద్వంద్వాలకు అతీతంగా వెళ్లడానికి ఇది ఒక అపూర్వమైన అవకాశంగా నేను తీసుకున్నాను. ధనవంతుడు, పేదవాడు - వీళ్ల మధ్య సమానత్వం, ప్రజాప్రభుత్వం ఇవి జాతీయతా ప్రధాన అంగాలని భావించిన తీవ్రవాదులలో నేనూ ఒకడిని. ఈ సిద్ధాంతం అమలు పరచడం మా బాధ్యతగా భావించినందు వల్లనే సూరత్‌కు వెళ్లినపుడు మేమందరం మూడో తరగతి పెట్టెలో ప్రయాణం చేశాము. అక్కడ బస చేసినపుడు నాయకుల ప్రత్యేక ఏర్పాట్లు ఏమీ చేసుకోకుండా మిగిలిన వాళ్లతో కలసి ఒకే గదిలో ఉండడం నాకు జ్ఞాపకం వచ్చింది. అప్పుడు ధనవంతుడు, పేదవాడు, బ్రాహ్మణుడు, వైశ్యుడు, శూద్రుడు, వంగదేశస్థుడు, మరాఠీ, పంజాబీ, గుజరాతీ - అందరమూ సహోదరులవలె ఒకే గదిలో బస చేశాము. భోజనం చేశాము. అందరమూ నేల మీద పడుకొని నిద్రపోయాము.

అన్నం, పప్పు, పెరుగు, మొదలైన సాధారణ ఆహారమే మేమందరం కలసి తిన్నాము. అది అన్నివిధాల స్వదేశీ జీవితంగా పరిగణింప బడుతుంది. పాశ్చాత్యదేశాలకు వెళ్లివచ్చిన కలకత్తా, బొంబాయి వాసులు, మద్రాసులో బొట్టు పెట్టుకున్న బ్రాహ్మణులు ఒకే శరీరంగా కలసిపోయారు. ఆలీపూర్ జైలులో ఉన్నప్పుడు నా దేశస్థులైన సహ ఖైదీలు రైతు, కంసాలి, కుమ్మరి, మాల, మాదిగ వీళ్ళతో కలసి అన్నంతిని కష్టాలను, సౌకర్యాలను సమానంగా పంచుకొని, అందరి హృదయాల్లో భగవంతుడు ఉన్నాడని తెలుసుకొన్నాను. ఈ సోషలిజం, ఐకమత్యం దేశమంతటా వ్యాపించిన సహోదరత్వం నా జీవితంలో అంకితభావాన్ని ముంద్రించింది. దేశమాత రూపంలో దైవ సన్నిధిలో దేశంలోని అన్ని వర్ణాలవారు సహోదరులే నన్న భావంతో ఒకే హృదయం కలిగిన వారుగా, సగర్వంగా తల ఎత్తుకొని తిరిగే సుదినం కోసం ఎదురుచూశాను. నా జైలు జీవితంలో నాతోపాటున్న నేరస్తులు, ఖైదీలు ప్రేమాభిమానాలు, దయాభావం బ్రిటిష్ ప్రభుత్వపు పక్షపాతం లేని ప్రవర్తనను చూసినపుడంతా చాలాసార్లు, ఆనందంతో పులకాంకితుడనయ్యాను.

పూనా నుండి వెలువడే Indian Social Reformerలో "చెరసాలలో ఉన్నపుడు భగవంతుని మీద భక్తి శ్రద్ధలు అధికంగా ఉండడం చూస్తున్నాము" అనే నా వ్యాసాన్ని తప్పు పట్టడం నాకు వింతగా కనిపించింది. అయ్యో! బొటాబొటి చదువుల్లోనూ, సద్గుణాల్లోనూ గొప్పవారమనే గర్వాన్ని కలిగిన వారి అహంకారాన్ని, అల్పత్వాన్ని ఏమని చెప్పేది? చెరసాలల్లో గుడిసెలలో, ఆశ్రమాలలో, బాధితుల హృదయాల్లో భగవంతుడు తన్నుతాను ఆవిష్కరించుకొంటాడు గాని ధనవంతుల ఉద్యానవనాల్లోనూ, స్వార్థ సుఖభోగవాసుల హంసతూలికా తల్పాలలోనూ ప్రత్యక్ష మవుతాడా? భగవంతుడు చదువు సంధ్యలు, తెలివితేటలు, పేరుప్రఖ్యాతులు, ఉన్నత పదవులు, స్తోత్రపాఠాలు, సుఖభోగాలు, నవనాగరికత - వీటిని చూడడు. పేదసాదల పట్ల కరుణయే మూర్తీ భవించిన మాతృమూర్తిగా దర్శన మిస్తాడు. ఎవరు మానవులందరిలో, అన్ని జాతుల్లో ముఖ్యంగా బాధితులు, పాపులు, పేదలు పతితులు- వీళ్ళల్లో, మాతృదేశంలో భగవంతుని దర్శించి, వాళ్ళసేవలో తమ ప్రాణాలను అర్పిస్తారో వాళ్ల హృదయాలలో జగన్నాయకుడైన ఆ భగవంతుడు

సాక్షాత్కారిస్తాడు. తానే స్వయంగా వచ్చి ఆవాస మేర్పరచుకుంటాడు. కాబట్టి పతనమైనప్పటికీ చైతన్యంతో పురోగమించే ఒక దేశంలో చెరసాలలో ఏకాంత వాసం అనుభవిస్తున్న దేశభక్తునికి భగవంతుని సాన్నిధ్యం సుకర మవుతుంది.

జైలరు కంబళి, గిన్నె, కంచం ఇచ్చి వెళ్లిన తరువాత నేను కంబళి మీద కూర్చొని జైలులో నా ముందున్న దృశ్యాలను చూడ్డంలో లీనమయ్యాను. ఈ ప్రత్యేక చెరసాల లాల్ బజారు లాకప్పుకన్న ఫరవాలేదని తోచింది. అక్కడి సువిశాలమైన హాలు నిశ్శబ్దం ఒక గాఢమైన ప్రశాంతతను ఏర్పరిచింది. ఇక్కడ జైలు గోడలు సర్వవ్యాపియైన భగవంతుడు ప్రేమతో నన్ను కౌగిలించు కోవడంకోసం దగ్గరకు వచ్చినట్లు తోచింది. అక్కడి మొదటి అంతస్థులో ఎత్తైన కిటికీ గుండా ఆకాశాన్ని చూడ్డం వీలుకాదు. ఆ లోకంలో చెట్లు, మొక్కలు, మనుషులు, జంతువులు, పక్షులు, ఇళ్ళు ఉన్నాయని ఊహించడం కూడ కష్టమే. కాని ఇక్కడ వరండా తలుపు తీసి ఉన్నట్లయితే చెరసాల కమ్ముల దగ్గర కూర్చొని అనంతమైన ఆకాశాన్ని, ఖైదీల రాకపోకలను చూడవచ్చు. వరండా గోడ పక్కగా ఒక చెట్టు ఉంది. దాని పచ్చని ఆకులు కళ్లకు విందు కలిగిస్తూ ఉంటుంది. 'ఆరుడిగ్రీ' లకే ఈ ఆరుగదుల ముందున్న కేవలం వాళ్ల ముఖం, నడిచే శబ్దం స్నేహితుని ఆగమనం తెలియజేసే విధంగా ఉండేది. పక్కనున్న పశువులకొట్టం నుండి కూడా ఖైదీలు పశువులను మేపుతూ రోజూ నాగదిముందు వాటిని వదిలి వెళ్లేవారు, పశువులు, పశువులను మేపేవాళ్ళు కళ్ళకు విందును కలిగించే దృశ్యాలు. ఆలీపూర్ ఏకాంత జైలువాసం నాకు ప్రేమకు సంబంధించిన ఒక అపూర్వ పాఠాన్ని బోధించింది. ఇక్కడికి రావడానికి ముందు నా ప్రేమ మానవ సమూహంపై కూడ ఒక సంకుచిత వృత్తానికే పరిమితమై ఉండేది. ఈ సంకుచితమైన ప్రేమ పరిధిలో చాలా అరుదుగా మాత్రమే పక్షులు, జంతువుల వచ్చేవి. గ్రామంలోని ఒక చిన్నపిల్లవాడు ఒక గేదె మీద చూపిన ప్రేమను గురించి రవిబాబు రచించిన ఒక అందమైన కవిత జ్ఞాపకానికి వచ్చింది. అంతకు ముందు చదివినపుడు అది నాకు కొంతకూడ అర్థం కాలేదు. ఆ వర్ణనలు అసహజంగానూ, అతిశయోక్తిగానూ

నాకు తోచాయి. ఇప్పుడు చదివినట్లయితే వేరొక దృష్టితో వాటిని రసాస్వాదన చేసి ఉంటాను. సృష్టిలోని సమస్త ప్రాణుల మీద మానవునికి ఎంత గాఢమైన ప్రేమ ఏర్పడగలదనేది ఒక ఆవు, ఒక పక్షి, ఒక చిన్న చీమ వాటిని చూడడంలో కూడా ఎంత ఆనందాన్ని అనుభవించగల మనేది ఆలీపూర్‌లో నేను గ్రహించాను.

జైలు జీవితంలో మొదటిరోజు ప్రశాంతంగా గడిచి పోయింది. ప్రతి ఒక్కటీ కొత్తగా తోచడం వలన ఉల్లాసంగా కనిపించింది. లాల్‌బజార్ లాకప్పుతో పోల్చినపుడు నా ప్రస్తుత స్థితి సంతోషకరమైనదే. భగవంతుని పై అచంచల విశ్వాసం ఉండడం వలన ఏకాంతం నన్ను బాధించలేదు. చెరసాలలోని మితమైన ఈ తిండికూడ నా మానసిక స్వభావాన్ని చలింపచేయలేదు. ముతక బియ్యపు అన్నం, దానిలో తవుడు, చిన్నచిన్న రాళ్లు, పురుగులు, వెంట్రుకలు, ధూళి మొదలైన వాటితో తాళింపు చేయబడింది. ధారళంగా నీళ్లు కలిపి ఉప్పు లేని పప్పు, కాయకూరలు, ఆకులు కలిపి చేసిన కూర. ఇంత రూచిపచీలేని, పోషక పదార్థాలు లేని ఒక భోజన పదార్థం ఉండగలదని అంతకు పూర్వం నాకు తెలియదు. నల్లగా మాడిపోయి దుఃఖకరమైన ఆ పదార్థాన్ని చూసినపుడు భయపడి పోయాను. ఒకటి రెండు పిడికిళ్ల తరువాత మర్యాదగా ఒక దండంపెట్టి దానికి వీడ్కోలు చెప్పుకొన్నాను. ఖైదీలందరికి ఒకే ఆహారం. ఒకే రకమైన తిండి. ఒక పర్యాయం ప్రారంభమైతే అంతులేకుండా అదే రోజూ కొనసాగుతూ ఉంటుంది. అప్పుడు రోజులు, వారాలు, నెలలు గడిచిపోయాయి. అయినప్పటికి అదే ఆకుకూర. అదే పప్పు, అదే అన్నం, ఆహార పద్ధతి మార్చడం అలాగుండని. వంటకం పూర్తిగా కొంత కూడా మారకూంటే మొదటి నుండి చివరివరకు ఒక విధంగా శాశ్వతమైన, నిరంతరమైన, అవమానకరమైన ప్రత్యేక పదార్థంగా వెలసింది. రెండు రోజుల్లోనే ఈ ప్రపంచం మాయ అనేది ఖైదీలకు అర్థం కావాలనే ఉద్ధేశంతో ఇది తయారు చేయబడినదిగా తోచింది. డాక్టరుగారి దయవలన ఈ విషయంలోనూ మిగిలిన ఖైదీలకన్న నేను అదృష్టవంతుడిని. వారు నాకోసం ఆస్పత్రి నుండి పాలుతెప్పించే ఏర్పాటు చేయడం వలన ఆ కూర దర్శనం నుండి కొన్నాళ్లు తప్పించుకొన్నాను.

Rs. 15 /-

అఖిల

అఖిల భారత పత్రిక - జూన్ 2008

శ్రీమాతారవిందుల వాక్కులు

అఖిల

అఖిల భారత పత్రిక - జూన్ 2008

విషయసూచిక :

జీవాత్మ పరమాత్మ, దైవము - వీటియెరుకలో ప్రవేశించే చైతన్యం ఆధ్యాత్మిక చైతన్యం. అన్నిటా అత్యావశ్యకమైన వాస్తవికతను దర్శించగలుగుతాం. ఇంకా అత్యావశ్యక దివ్యవాస్తవంనుంచి జాలువారే ఇంద్రియగ్రాహ్య విషయాల, శక్తుల హేలనూ దర్శిస్తాం.

- శ్రీఅరవిందులు

ఆధ్యాత్మిక దృక్పథంతో కూడిన అస్తిత్వం


ఆధ్యాత్మికత అనేది ప్రత్యేకమైనదికాదు. వేరైనది కాదు. అది సర్వాన్ని తనలో ఇముడ్చుకోగలుగుతుంది. ఇముడ్చుకోగలగాలి కూడా. అయినప్పటికీ కేవలం భౌతిక మానసిక జీవనదృక్పథానికి ఆధ్యాత్మిక దృక్పథానికి మధ్య గొప్ప వ్యత్యాసం ఉంది.

మనో, ప్రాణికదేహాలు మనిషికి తన లక్ష్యసాధనలో సహకరించే సాధనాలు మాత్రమే. అవే లక్ష్యాలు కావు. అవికూడా ఉన్నత అంతిమ సాధనాలు కూడా కానేరవు. ఆధ్యాత్మిక దృక్పథం వాటిని మనిషికి బాహ్యఉపకరణ సత్వంగా దర్శిస్తుందే తప్ప అవే తనకు పూర్ణసత్వముగా కాదు.

ఆధ్యాత్మిక దృక్పథం పరిమిత అంశాలకు వెనుక అపరిమిత తత్వాన్ని దర్శిస్తుంది. పరిమిత అంశాలు విలువను ఉన్నత అపరిమిత విలువలతో బేరీజు వేస్తుంది. భౌతికం పరిమితమైనది. అపరిమిత అనంతత్వాన్ని ప్రకటించే దానియొక్క అసమగ్ర ప్రతిరూపం అది. దాని ప్రయత్నం ఎప్పుడూ తన స్వస్వరూపమును చేరుకొనటానికే.

ఆధ్యాత్మిక దృక్పథం వ్యక్తిలోను, లోకంలోను బాహ్యంగా కనిపించే దానినేగాక, పరోక్షంగా ఉన్న, ఉన్నత వాస్తవాన్నీ దర్శిస్తుంది. ఇది మనిషిలోని దివ్యత్వమును-జీవాత్మ, ఆత్మ-సర్వోన్నత ప్రాధాన్యత కలదిగా పరిగణిస్తుంది. ఈ దివ్యత్వాన్ని సర్వత్రా, అన్ని ఆకృతులలోను గుర్తించి దర్శించే ప్రయత్నం చేస్తుంది. దానితో బుద్ధి, జీవనములను సమైక్యం కావించుకుంటుంది. ఆ విధంగా సాటి వారితో ఏకత్వమును సాధిస్తుంది.

ఇది తప్పనిసరిగా విషయాలను దర్శించటంలో సాధారణ దృక్పథాన్నే మార్చివేస్తుంది. మానవ జీవన లక్ష్యాలన్నిటినీ పరి రక్షించటంలో భిన్నమైన దిశానిర్దేశాన్ని, సమగ్ర విజ్ఞానాన్ని సమకూరుస్తుంది.



శ్రీఅరవిందులు

ఆధ్యాత్మికతను జీవితానికి అనువర్తింపచేయడం

మంచి ఆరోగ్యాన్ని, శరీర దారుఢ్యాన్ని ఉద్దేశిస్తాం. ఏ లక్ష్యసాధన కోసం? అవి అందుకోసమే. ఇది మామూలు సమాధానం. ఇవి కలిగి ఉండవలసినవే కదా. ఇంకా ఇవి దీర్ఘాయువు కోసం. ప్రాణిక మానసిక ఉద్వేగ పరితృప్తికి దృఢమైన ఆధారంగా ఉండటంకోసం. అవును. అందుకోసమే. ఒకవిధంగా ఈ భావనా పరంపరలో శారీరకం, జీవాత్మకీ వ్యక్తీ కరణే అవుతుంది. శారీరక పరిపూర్ణత అవశ్యమైనదే. నిండైన మానవత్వ జీవన ధర్మంలో ఇదీ భాగమే. ఇంకా ఊర్ధ్వ ఉన్నతతర జీవన వ్యాపారాలకీ, దివ్యాత్మను కనుగొని వ్యక్తీకరించే పర్యవసానం కోసం ఇది తప్పదు. 'శరీర మాద్యంఖలు దర్మసాధనం' అని ఆర్యోక్తి. ధర్మసాధనకు శరీరం మొదటి ఉపకరణం. సత్వము యొక్క దివ్యానుశాసన పాలనకీ ఇది సాధనమే. మనిషిలో మానసిక ఉద్వేగభరిత, సౌందర్యాభి రుచిగల భాగాలు అభివృద్ధి కాబడవలెనన్నది సాధారణ దృక్పథం. ఆ విధంగా అవి మంచి సంతృప్తిని పొందుతాయి. మనిషికి ఆ విధంగా సాత్వికభావన కలుగుతుంది. వ్యక్తిగతంగా తాను సఫలీకృతుడైనట్లు భావిస్తాడు. చైతన్యవంతుడైనట్లు భావిస్తాడు. ఇంతేకాదు. ఇవికూడా జీవాత్మ వ్యక్తీకరణలే. అంతరంగంలోని దైవత్వ విలువలను అన్వేషించడమే. ఇంకా వాటి అభివృద్ధి, సూక్ష్మత, సౌలభ్యం, శక్తి, తీవ్రతల వల్ల ప్రపంచంలో దివ్య అస్తిత్వానికి చేరువ కాగలుగుతాడు. పలురకాలుగా దానిపై పట్టుసాధిస్తాడు. ఫలితంగా చివరికి మొత్తం జీవితమే దివ్య అస్తిత్వంతో ఐక్యతకి, సారూప్యతకి శృతిబద్ధం కాబడుతుంది. నైతిక ప్రవర్తన, చక్కగా క్రమ బద్ధీకరింపబడిన వ్యక్తిగత, సాంఘిక నడవడిక. ఇది సంఘాన్ని ముందుకు నడిపిస్తుంది. తోటివారితో నడవడిక సంయమనంతో,

నిగ్రహంతో, సానుభూతి పూర్వకంగా సత్సంబంధాలతో నెలకొనేటట్లు ఉంచుతుంది. అయితే ఆధ్యాత్మిక దృష్టిలో నీతిశాస్త్రం మరింత విశిష్టమైనది. కార్యసాధనలో పురోగతికి ఇదొక ప్రక్రియ. ఇంకా మరింత అత్యావశ్యకంగా సత్వమునకు ప్రత్యేక లక్షణమైన దివ్యాంశను పెంపుచేసేది కూడా. దివ్య ప్రకృతిలోనికి పెరుగుదలకు ముందడుగు.

ఆధ్యాత్మికత, సర్వమునూ స్వీకరించి వాటికి ఒక ఉన్నత దివ్య స్వాభావిక సంవేదనను కల్పిస్తుంది. మన లక్ష్యాలు కార్య కలాపాలన్నిటితో ఇదే మోస్తరు. పాశ్చాత్యపద్ధతిలో తత్వశాస్త్రం రాగద్వేషాలకతీతంగా, హేతువాద దృష్టితో అస్తిత్వంయొక్క ప్రాధమిక సత్యవిచారణ చేస్తుంది. శాస్త్రవిజ్ఞానం మనముందుంచిన వాస్తవాలను పరిశీలించటం ద్వారా లేదా సైద్ధాంతికపరంగా నిశితపరిశీలనద్వారా, లేదా రెండు పద్ధతులను మిళితం చేసి విచారణ చేస్తుంది. అయితే ఆధ్యాత్మిక దృక్పథం అస్తిత్వ సత్యమును సద్యోంతర దృష్టి, అంతరానుభూతి వల్ల కనుగొంటుంది. శాస్త్రపరిశోధనా హేతువాదం చాలదు. తత్వశాస్త్రం చేసేదేమంటే, వివిధ విజ్ఞాన సాధనాలద్వారా అందించబడిన ఆధారవిషయాలను, ఏమినహాయింపు లేకుండా క్రమపద్ధతిలో "ఏకంసత్యం"నకు, to the one Truth, పరమోన్నత, వైశ్వానిక వాస్తవానికి, సంయోజనాత్మకంగా సంవిధాన పరుస్తుంది. పర్యవసానంగా మానవుని ఆధ్యాత్మిక సాధనకు తనలోని దివ్య స్వభావ ఉద్దీపనకు ఒక భూమిక సిద్ధమవుతుంది. ఇదీ దానియొక్క real value, వాస్తవమైన విలువ. శాస్త్ర విజ్ఞానమైనాకూడా విశ్వాత్మ తత్సంబంధిత అంశాలపైన అదనపు విజ్ఞాన కాంతిని ప్రసరించే ప్రపంచవిజ్ఞాన సంచయమే అవుతుంది. భౌతిక విజ్ఞానానికి, ఆచరణలో చూపే దానిఫలితాలకు, లేక, భౌతిక భావన, భౌతిక శక్తులపై ఆధారపడి ఉండే మనిషి, మనసు, జీవన విధాన విజ్ఞానాలకి పరిమితమై ఉండదు. ఆధ్యాత్మిక సంస్కృతి క్రొత్తపరిశోధనారంగాలకి అవకాశం

కల్పిస్తుంది. ఆధునిక ప్రాచీన భౌతికశాస్త్ర విజ్ఞానాలకు, ఫలితాలకు అవకాశం ఇస్తుంది. జీవాత్మ నుంచి ప్రభవించి ఆదిసత్యముగా, మనోశక్తినుంచి ప్రభవించి, మానసాతీతంగా, భౌతికపదార్థంపైన, జీవితంపైన పనిచేసే అవకాశం కల్పిస్తుంది. ప్రాచీనకాలంలో, మానవునికి, దివ్యప్రకృతికి ప్రతిరూపాలు సృష్టించడం, కళాకవిత్వముల లక్ష్యం. ఇవి సౌందర్య సంవేదనను సంతృప్తి పరుస్తాయి. జీవితం గురించి గ్రహించి సేకరించిన భావాలను, కళాత్మకంగా వ్యక్తపరుస్తాయి. మనో కల్పనలకి ప్రేరణ కల్పిస్తాయి. అయితే ఆధ్యాత్మిక సంస్కృతిలో అవి మనిషిలోను, దివ్యప్రకృతిలోను నిక్షిప్తంగా ఉన్న ఉన్నత అంశాలను, ఇంకా ప్రగాఢమైన ఆధ్యాత్మిక సార్వత్రిక సౌందర్యాన్ని స్పష్టంగా అభివ్యక్తీకరిస్తాయి. రాజకీయ, సాంఘిక, ఆర్థిక వ్యవస్థలు మానవజీవన తొలిరూపంలో మనుష్యులు కలిసిమెలసి జీవించగలగటానికి, ఉత్పాదనకి, ఇతర అవసరాలు తీర్చుకోవటానికి, ఆనందంగా ఉండటానికి, శారీరక, ప్రాణిక, మానసిక సామర్థ్యాలు పెంపొందించుకోవటానికి చేసుకున్న ఏర్పాట్లు. అయితే ఆధ్యాత్మిక లక్ష్యం, జీవితాన్ని మరింత ఉన్నతంగా ఉంచుతుంది. మొదటిది- ఒక వ్యవస్థ నేర్పర్చుకొని అందులో తన నిజసత్వాన్ని, దివ్యత్వాన్ని అన్వేషించగల్గటం. రెండవది-జీవితంలో దివ్యధర్మసత్వాన్ని ఇతోధింగా అభివ్యక్తీ కరించగల్గటం, మూడవది. దివ్యమానవాళికి ఉన్నతదైవీ, స్వభావములైన శాంతి, జ్ఞాన, శక్తి, సామరస్య, సమైక్యతల దిశగా సామూహికంగా ముందుకు సాగటం. ఇదే జాతియొక్క క్రమరూపాంతరీకరణ ప్రయత్నం. ఇదే ఇంతకుమించి ఎక్కువాకాదు, తక్కువాకాదు. సర్వ అంతర్నిహిత శక్తులతో కూడిన, ఆధ్యాత్మిక సంస్కృతి అంటే మాభావన ఇదే. ఆధ్యాత్మికతను జీవితానికి అన్వయించడం అన్నా ఇదే.

- శ్రీఅరవిందులు

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

ప్రార్థన : విశ్వజనీన సంకల్పం

ప్రార్థన ప్రయోజనాన్ని చాలామంది శంకిస్తారు. ప్రార్థన హేతుబద్ధంకాదని, శుద్ధ అనావశ్యకమని, ఎటువంటి ఫలితం ఉండబోదని వారి ఉద్దేశ్యం. ఒక విశ్వజనీన సంకల్పం తన పని తాను చేసుకునిపోతూంటుంది. నిరంతరం తన లక్ష్యం నెరవేర్చుతూ పోతూంటుంది. తనపై అనుగ్రహం కలిగేటట్లు ప్రాధేయ పూర్వకంగానో, అహంతోనో చేసే ప్రార్థన వల్ల ఆ సంకల్పం ఎంతమాత్రం తన దారి నుండి తప్పుకోదని అనడం సబబే. విశ్వజనీన నియతిలో తనకు తాను అభివ్యక్తం చేసుకునే విశ్వాతీత దైవం సర్వజ్ఞుడైనందున ఏమి చేయాలో తన విజ్ఞాన నేత్రం ముందుగానే వీక్షించగలదని అనడం కూడా సమంజసమే. ఏ మానవుడు కూడా తన ఆలోచనా శక్తితో భగవంతునికి దిశానిర్దేశంకాని, ప్రేరణకాని ఇవ్వలేడు. వ్యక్తి కోరికలు ప్రపంచ నియంత్రణ వ్యవస్థలో నిజమైన నిర్ధారణ అంశాలుగా బోవు. అయితే విశ్వజనీన భగవదేచ్ఛ నిర్వహణ తీరును యాంత్రిక నియమావళి క్రమబద్ధం చేయలేదు. మానవసంకల్పానికి, ఆకాంక్షకు, విశ్వాసానికి కనీస ప్రాముఖ్యం ఇవ్వగల శక్తులు, బలసంపద ఆ సంకల్పాన్ని నెరవేరుస్తాయి. ఆ మానవ సంకల్పానికి, ఆకాంక్షకు, విశ్వాసానికి ఇచ్చిన ఒక ప్రత్యేక రూపమే ప్రార్థన. ఆ రూపాలు చాలావరకు మొరటుగా, అనాగరికంగా కనిపిస్తాయి. కొన్ని అమాయకంగా కనిపిస్తాయి. అది లోపంకాదు. కొన్ని తెలివిహీనంగా కనిపిస్తాయి. అయినప్పటికీ అటువంటి ప్రార్థనకు నిజమైన శక్తి, విశిష్టత ఉన్నాయి. దానికిగల శక్తితో మానవ సంకల్పాన్ని, ఆకాంక్షను, విశ్వాసాన్ని దైవసంకల్ప పరిధిలోకి తీసుకొని వెళ్ళవచ్చును. చైతన్యమయమైన భగవత్ తత్త్వంతో మనం చైతన్య ప్రదీప్తమైన సంబంధ బాంధవ్యాలను పెంచుకోవచ్చును.

మన సొంతశక్తితో, ప్రయత్నంతో ఈ సంకల్పం, ఆకాంక్షలను నెరవేర్చవచ్చును. ఉన్నత, నిమ్న ప్రయోజనాలకోసం వాటిని నిస్సం దేహంగా మహనీయమైనవిగా మలచవచ్చును. ఒకశక్తిగా ఉపయోగించడానికి వాటిని తీర్చిదిద్దే సాధనా మార్గాలు చాలా వున్నాయి. లేదా భగవంతుని సంకల్పానికి అనుగుణంగా, దానిపై ఆధారపడేటట్లుగా కూడా మలుచుకోవచ్చును. ఈ రెండవ పద్ధతిలో ఒక శక్తికి సంబంధించిన నియతిప్రకారం, మన ఆకాంక్షకు ప్రతిస్పందనగా దాదాపు యాంత్రికంగా ఆ సంకల్పాన్ని పరిగణించ వచ్చును. లేదా పూర్తిగా నిర్వ్యక్తిగతంగా (quite impersonally) పరిగణించవచ్చును. లేదా మానవాత్మలోని దివ్య ఆకాంక్ష, విశ్వాసాలకు చైతన్య ప్రతిస్పందనగా పరిగణించవచ్చును. చైతన్యంతో దానికి తానుకోరిన సహాయం, మార్గదర్శకత్వం, రక్షణ, సఫలత తీసుకుని వచ్చేదిగా తలచవచ్చును. యోగక్షేమం వహామ్యహం.

నిమ్నభూమికలో మొదట భగవంతునితో సంబంధం పెట్టుకోవడానికి ప్రార్థన సహాయ పడుతుంది. అయితే ఆ స్థితిలో కేవలం అహం, మనోభ్రమలు కలిసివుంటాయి. కాని దరిమలా దాని వెనుక మెరిసే ఆధ్యాత్మిక సత్యంవైపు మనం పురోగమించవచ్చును. అడిగిన వరం దైవం ఇవ్వడం మాట ఎలావున్నా, అసలు భగవంతునితో బంధం, భగవంతునితో మానవ జీవితం పెనవేసుకోవడం, స్పృహతోకూడిన పరస్పర మార్పు-ఇవీ ముఖ్యమైనవి. ఆధ్యాత్మిక విషయాలలో, ఆధ్యాత్మిక సిద్ధులకై అన్వేషణలో ఈ చైతన్యంతమైన సంబంధం ఎంతో శక్తి వంతమైనది.

స్వశక్తి పై ఆధారపడి సాగించే ప్రయత్నం, యాతన కన్నా అది మరింత మహనీయ శక్తి. అది పూర్ణ ఆధ్యాత్మిక అనుభవానికి, పెరుగుదలకు దోహదంచేస్తుంది. మనల్ని ఏ మహనీయ స్థితికి

చేరుకోడానికి ప్రార్థన మనల్ని సంసిద్ధం చేసిందో ఆ స్థితిలో అది ముగిసిపోతుంది-నిజానికి ఆకాంక్ష, విశ్వాసం, సంకల్పం ఉన్నప్పుడు ఈప్రార్థన అవసరంలేదు. కాని భగవంతునితో సంబంధం ఆనందమయం కావడానికి ఈ ప్రార్థన కొనసాగవచ్చును.

ప్రార్థనతో మనం నిర్ణయించుకున్న లక్ష్యాలు (మామూలు ప్రయోజనాలు) మరొక ఉన్నత స్థాయిని అందుకొని, అత్యున్నతమైన, ఏ ఉద్ధేశ్యాలు లేని భక్తి తన్మయ స్థితిని మనం చేరుకుంటాం. ఎటువంటి కోరికలు, అభ్యర్థనలు లేని దివ్య పరిపూర్ణ పవిత్ర ప్రేమ పారవశ్యం అది.

మూలం : శ్రీఅరవిందులు

- అనువాదం : యజ్ఞన్న

4. భయము - కారణము - నివారణ

భయం నిశ్చైతన్యం వల్ల కలుగుతుంది. అజ్ఞానం వల్ల వచ్చే పరితాపం. మనకెన్నో విషయాలు తెలియకుండా ఉంటాయి. వాటి స్వరూపస్వభావాలు, ఫలితాలు యెరుకకురావు. చేసే పనుల తాలూకు పరిణామాలు ఎలా ఉంటాయో తెలియదు. ఇదే పరిస్థితి భయాన్ని కలుగచేస్తుంది. మనకు తెలియని విషయమే మనకెపుడు భయం గలిగించేది. ఉదాహరణగా ఒక పశివానిని తీసుకో. తెలియని కొత్తవాని దగ్గరికి తీసుకొనివెళ్లు. తనకి ముందు కలిగేది భయమే. (అంతరంగ చైతన్యం జాగృతం కాబడిన శిశువు గురించి నేను చెప్పటంలేదు. నేను చెప్పేది సాధారణ పశివాని గురించి.) అసాధారణమైన పిల్లలు చాలాధైర్యంగా ఉంటారు. వారి చైతన్యం వేరేగా ఉంటుంది. గ్రహణశక్తి ఓరకమైన అచేతన కౌశలం instinct తో మిళితమై ఉంటుంది. ఏదో ముప్పు వాటిల్లినపుడు, దానికి పరిష్కారం తెలియక ఎలా రక్షించుకోవాలో తెలియని పరిస్థితిలో

భయం పట్టుకుంటుంది. భయానికి లెక్కలేనన్ని కారణాలు. అయితే అది ఒక నిశ్చైతన్య చలిత చాలనం.

తెలిసిన విషయం గురించి భయం ఉండదు. చైతన్య వంతంగా పరిపూర్ణ జాగృతిలో తెలిసిన దానిని గురించి భయం ఉండదు. చీకటి మరుగున ఉన్న దానిని గురించే ఎప్పుడూ భయం.

నీవు దేనిని గురించి భయపడతావో దానితో నేరుగా భేటీపడు. ఆవిధంగా భయాన్ని జయించు. భయాన్ని ముఖాముఖీ ఎదుర్కొన్నపుడు భయమెక్కడిదీ! భయం పారిపోతుంది.

భయం కలిగినపుడు యెరుక కలిగి, శక్తి, కాంతి పరిజ్ఞానాలతో ఉంటే దానిని పూర్తిగా నివారించగలవు. ఈడెన్ తోటలో ఏపిలుపండు తినటంవల్ల భయం కలుగుతోందని క్రైస్తవ మతం చెప్తోంది. జ్ఞానంతో భయం వచ్చింది. ఈ భయమే ఈనేలపై మానవజీవితాన్నంతటినీ శాసిస్తోంది. ఇక్కడ నా వాదనేమంటే- పశువులకీ భయముంది. కాని అవి ఏపాపం చెయ్యలేదు. ఏపిలుపండూ తినలేదు. వాటికే భయమూ ఉండకూడదు మరి! అజ్ఞానపు అచేతనకౌశలం ignorant instinct తో కూడిన పాక్షిక చైతన్యం ప్రమాదాన్ని బలపరుస్తుంది. దానికి నివారణ తెలియదు. దైవకార్యక్రమానికి వ్యతిరేకంగా పోరాడే హానికరమైన ప్రాణికస్థాయి జీవులు, శక్తులు భయాన్ని విస్తృతంగా వినియోగించుకుంటాయి. అలానే ఇవి మనుష్యులను స్వాధీనంలో ఉంచుకుంటాయి. ఇది ఒకటేకాదు. రాజకీయ, మతసంబంధమైన సాధనాలు కూడా ఇలాటివే. ఇవి కూడా వాటికి తోడవుతాయి. ఇంకా కొన్ని మతశక్తులున్నాయి. నమ్మేవాళ్లను మృత్యుభయంతో ఇవి తమ గుప్పిట్లో ఉంచుకుంటాయి. గుడ్డిగా వాటి నియమాలను పాటించకపోతే తర్వాత రాబోయే ఉపద్రవాలను గురించి భయపెడతాయి.

అయిష్టతవల్ల, సారూప్యత, సన్నిహితత్వం లేకపోతేనూ కూడా భయంకలుగుతుంది. కొంతమందికి నిప్పు అంటే భయం మరికొందరికి నీరు అంటే భయం. ఇంకా కొంతమందికి ప్రత్యేకంగా ఏదైనా జంతువు అంటే భయం ఉంటుంది. ఇది ప్రాణిక స్పందనల మధ్య సామరస్యం లేకపోవటం వల్ల వస్తుంది. అప్పుడు ఇది శారీరక నిశ్చైతన్యంగా అనువర్తింపబడుతుంది. శరీరం ఒక భయంకరమైన నిశ్చైతన్యపదార్థం. ఏకాస్తైనా దానిని చైతన్యవంతం కావించటానికి ఎంతో కష్టపడాలి. శరీరం యాంత్రికంగా, అలవాటుప్రకారం జీవిస్తుంది. భయంకరమైన నిశ్చైతన్యంలో ఉంటుంది.

★ ★ ★ ★

భయపడినపుడు ఏంచేయాలి?

భయాన్ని పోగొట్టే మార్గాలు చాలా ఉన్నాయి. నీ వ్యక్తిత్వానికి అనుగుణంగా మార్గం ఉంటుంది.

నీకు చైత్యపురుషసంసర్గం ఏపాటి ఉన్నా వెంటనే దానిని ఆవాహనం చేసుకోవాలి. చైత్య పురుషకాంతిలో విషయాలు తిరిగి చక్కబడతాయి. ఇది చాలా శక్తివంతమైన మార్గం.

చైత్య పురుషసంసర్గం లేనప్పుడు యుక్తియుక్తంగా ఉంటూ, వివేకవంతమైన బుద్ధికలిగి సహేతుకంగా నీలో నీవు తర్కించు. చిన్నపిల్లవానికి నచ్చచెప్పినట్లుగా నీకు నీవే నచ్చచెప్పుకో. ఈభయం చెడ్డదని భావించు. ఏప్రమాదాన్నీ కూడా భయంతో ఎదుర్కొనటం శుద్ధతెలివి తక్కువ. నిజంగా ఏదైనా ప్రమాదాన్నే ఎదుర్కోవలసి వచ్చినపుడు ఏ కొంచెం భయపడినా, నీపని అయిపోయినట్లే. కాబట్టి ఈ రకమైన తార్కికబుద్ధితో నీలోని భయపడిన భాగానికి భయంకూడదని నచ్చచెప్పు.

నీకు దైవం పట్ల నమ్మకం ఉండి, అర్పణభావం కలిగి ఉంటే ఒకేఒక సూక్ష్మమార్గం. నీ ఇచ్ఛప్రకారమే జరుగనీ. నీ మార్గదర్శకత్వంలో సాగుతున్న నాకు భయమేమిటి! నన్ను భయపెట్ట గలిగేదేదీ లేదు. నేను నీకు చెందిన వాడిని. నన్ను నీవు నడిపిస్తున్నావు" ఇది వెంటనే పనిచేస్తుంది. అన్ని మార్గాలలో కెల్లా ఇదే most effective అంటే తప్పనిసరిగా, యదార్థంగా దైవానికి అర్పణకావించుకోవాలి. వెంటనే దీని ఫలితం కనిపిస్తుంది. కలలా భయం మాయమైపోతుంది. చెడు ప్రభావంలో ఉన్న సత్వం కూడా వైదొలుగుతుంది.

కొంతమంది ప్రబలమైన ప్రాణికశక్తి కలిగి ఉంటారు. వాళ్లు fighters. వెంటనే తలబడటానికి సిద్ధపడతారు. "ఇదిగో! ఇక్కడే ఉన్నాడు శత్రువు. కొట్టిపడగొడదాం" అంటారు. అయితే ఇందుకు కొంత పరిజ్ఞానం, దానితోపాటు గొప్ప ప్రాణికశక్తి కలిగిఉండాలి. అతడు అతి మానుషాకారుడు giant కావాలి. అందరికీ అది సాధ్యంకాదు.

ఇలా అనేక పద్ధతులు. అన్నీ మంచివే. నీ స్వభావానికి యోగ్యమైన దానిని వినియోగించుకోవాలి.

- శ్రీమాత

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

5. దివ్యమాత ఒక శిష్యునికిచ్చిన సమాధానాలు

(దివ్యమాత అతన్ని ఆప్యాయంగా బేబి అని పిలిచేవారు. 17 సంవత్సరాల వయస్సులో అతడు ఆశ్రమంలో చేరాడు. 1933లో అతను దివ్యమాతకు ఉత్తరాలు వ్రాయడం మొదలు పెట్టేనాటికి అతని వయస్సు 23సంవత్సరాలు. ఈ క్రింది ఉత్తరప్రత్యుత్తరాలు 1935వ సంవత్సరానికి సంబంధించినవి)

ప్రియమైన అమ్మా! నాశరీరం బాగా అలసిపోయింది, దానితోపాటే మనస్సు గూడా అలసిపోయింది. నాలో అంతా నీరసం ఆవహించింది.

నాప్రియమైన బేబీ: నీవు అలసిపోయావని విని చాలా విచారిస్తున్నాను. నీవు విశ్రాంతి తీసుకోవాలి, లేదా డాక్టరునన్నాచూడాలి, నీకు హుషారు కలిగేందుకు అతడేమైనా చేస్తాడు.

సదాప్రేమ పూర్వక ఆశీస్సులతో ......

ప్రియమైన అమ్మా! నా నరాలుకూడా యిబ్బంది పెడ్తున్నాయి. నీరసంగా అనిపిస్తోంది. అవయవాలూ అలసిపోయాయి.

నాప్రియమైన బేబీ! నీకు బాగాలేదని తెలసి విచారించకుండా ఎలావుంటాను. నీనరాలు బలపడాలంటే ఏంచేయాలి? లోపల, బయట ప్రశాంతంగా వుండాలి. అదే నరాలను బలోపేతం చేస్తుంది.

నా ప్రేమపూర్వక ఆశీస్సులు సదా నీకుంటాయి.

నాప్రియమైన బేబీ! నీకు భాగులేకపోవడానికారణం కనుపించడంలేదు. నిన్ను నీవు తెలుసుకొని, నీస్వాధీనంలో నీవుంటే నీకు తప్పక బాగుంటుంది.

నీకు నా ప్రేమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి.

నాప్రియమైన బేబీ! నిరాశ నిన్ను క్రుంగదీసినట్లని పిస్తున్నందుకు నాకు విచారంగా వుంది. నీవు గట్టి ప్రయత్నం చేయాలి. గట్టిగా తీర్మానించుకొని కృషి చేస్తే, దాన్నుండి నీవు తప్పకుండా బయట పడ్తావు.

నీకు నా ప్రేమ ఆశీస్సులెప్పుడూ వుంటాయి.

నాప్రియమైన బేబీ! నీకు విశ్రాంతి అవసరమైనట్లు నాకర్థమౌతోంది. నీవు కొద్దిరోజులు విశ్రాంతి తీసుకొంటాననంటే నేనందుకు పూర్తిగా సమ్మతిస్తాను. కాని నా భయమేమిటంటే నీకు కావలసింది శారీరక

విశ్రాంతిగాదు. నిజంచెప్పాలంటే విశ్రాంతి కావలసింది నీ హృదయానికి-ఆ విశ్రాంతి తీసుకోవడానికి నీవు సిద్ధమేనా?

నాప్రేమ ఆశీస్సులు నీకెప్పుడూవుంటాయి.

నాప్రియమైన బేబీ! నేను విశ్రాంతి అన్నదానికర్థం, నిజమైన విశ్రాంతి; నిన్ను ఇబ్బంది పెడ్తున్న, నిన్ను నీరసింపజేస్తున్న సమస్త సంపర్కాలనుంచి నీవు విడవడిపోయి, ఆంతరికంగా నాలో విశ్రమించాలి.

మరణంలో విశ్రాంతి వుంటుందనుకోవడం అజ్ఞానం. చనిపోయి ఎవరూ విశ్రాంతి పొందలేరు, జీవించి వుండగా ఏచేతన ఉందో, ఏ అనుభూతులున్నాయో, అవే చనిపోయినా కొనసాగుతుంటాయి. నీకీ విధమైన యిబ్బందులూ, నిర్వేదమూ ఉండగా నీవు చనిపోతే, ఆతరువాత అవి మరింత తీవ్రంగా కొనసాగుతాయి. దానివల్ల ప్రయోజనమేమీవుండదు. వీటినుండి నీకు స్వేచ్ఛ లభించాలంటే ఇచట జీవితంలోనే నీవు వాటిని అధిగమించాలి. వాటికి గల కారణాన్ని నీలోనుండి నెట్టివేస్తే తప్ప వాటినధిగమించలేవు.

నీకు నాప్రేమ ఆశీస్సులు ఎప్పుడూవుంటాయి.

నాప్రియమైన బేబీ! అవును. అహంకారానికి, అంతరాత్మకు మధ్య వుండే మామూలు సంఘర్షణే అది. ఆ సంఘర్షణే నీవు అలసిపోయేట్లు చేస్తోంది. అదేవిధంగా నీకు మేలు చేసే సాయం ఎక్కువగా నీకుపయోగపడకుండా చేసేది నీలోని విశ్వాస రాహిత్యమే. కోపంతో నేనీమాట అనడంలేదు.

నాప్రేమ ఆశీస్సులు నీకెప్పుడూవుంటాయి.

నాప్రియమైన బేబీ! గీతావాక్యాన్ని గుర్తుపెట్టుకో: "దైవమే నీ రథసారథి" కావాలి. అపుడు నీకు విజయం తథ్యం.

నాప్రేమ ఆశీస్సులు నీకెపుడూ వుంటాయి.

అనువాదం : శ్రీ.కె.వి. రావు

6. దైహిక చైతన్యము

ప్రశ్న: ఆలోచన చేసేది మనస్సు అయినప్పుడు దేహము ఆకాంక్షించడమేమిటి? మనస్సు ఆలోచిస్తున్నంతసేపూ నీదేహానికి ప్రత్యేక చైతన్యం లేకుండా మూడువంతులు జడంగానే ఉంటుంది. అయితే దైహిక చైతన్యమంటూ ఉన్నది. శరీరం తనచైతన్యంలో తాను ఉంటుంది. దానికి స్వంతమైన ఆకాంక్ష ఉంది. ఎవరి శరీరాన్ని గురించి వారు ఆలోచించేటప్పుడు దైహిక చైతన్యంలో ఉండరన్నమాట. మనస్సుతో ఏ విధమైన సంబంధమూ లేకుండా స్వకీయమైన చైతన్యం దేహానికి ఉన్నది. తాను పనిచేసే విధానమూ, తన సమతౌల్యమూ, అస్థిరత మొదలైనవన్నీ దానికి బాగా తెలుసు. తనకు సంబంధించినంత వరకూ ఎక్కడ ఏవిధమైన అస్థవ్యస్థత, అసౌకర్యము కలిగినా అది స్పృశించి అనుభవిస్తుంది. బాహ్యానికి ఏవిధంగానూ లక్షణాలు కనిపించకపోవచ్చు. శరీరమంతా మంచి సామరస్యంగా పనిచేస్తూ, సమతౌల్యంలో ఉంటూ, సక్రమంగా తన విధులను నిర్వహిస్తూంటే అదే దానికి పరిపుష్టి. అప్పుడది పుష్టిలోని ఆనందాన్నీ, జీవితానందాన్నీ, చురుకుదనాన్నీ పొందుతూ సంపూర్ణప్రాణశక్తితో సమతాస్థితిలో పనిచేయగలదు. అలాలేనప్పుడు ప్రాణికమూ, మానసమూ తనని అనుచితరీతిలో వినియోగిస్తున్నట్లు తెలుసుకొని బాధపడుతుంది. అప్పుడు దానికి అస్థిరతలాంటిది ఏర్పడడం మొదలైనవి జరుగుతాయి.

దైహికచైతన్యాన్ని ఎంతైనా వృద్ధి చేసుకోవచ్చు. అలా పెంపొందింప చేసుకున్నప్పుడు వారెటువంటి పరిస్థితుల్లో ఉన్నాగానీ, అంటే వారు పూర్తి బాహ్యీకరణం పొందినా, అంటే ప్రాణికం పూర్తిగా

బయటకు వచ్చేసినా కూడా దేహం యథాప్రకారంగా పనిచేయగలదు. దాని స్వతంత్ర చైతన్యంవల్ల మనస్సు, ప్రాణికముల ప్రమేయం లేకుండా కూడా అంటే అవి దేహానికి బయట ఎక్కడో దూరంగా ఉన్నాకూడా దేహం మాట్లాడగలదు. ప్రాణికం, మానసమూ ఎక్కడోదూరంగా ఇతరత్రా నిమగ్నమై ఉన్నప్పటికీ దేహం సచైతన్యమై ఉండుటవల్ల దానిద్వారా అవి తమను వ్యక్తం చేసుకోగలవు. అంటే శరీరంతో వాటికుండేబంధం వలన అవిచెప్పినట్లు అది విని నడుచుకోగలదు. మరీకష్టమైనవి చేయలేకపోయినా అది నడుస్తూ చిన్నచిన్న పనులు చేయగలదు, నేర్చుకొని వ్రాయగలదు. మాట్లాడగలదు కూడా, నిదానంగా కష్టపడి ఎదుటివారికి అర్థమయేటట్లు మాట్లాడగలదు. ఇదంతాకూడా మనస్సూ, ప్రాణం ఎక్కడో దూరాన ఉన్నప్పుడు దైహికచైతన్యం వల్ల జరిగేపని.

ఈవిధంగా దైహిక చైతన్యం వృద్ధి చేసుకున్నవారు తమలోని భిన్న చైతన్యాల మధ్యనుండే వైరుధ్యాలని స్పష్టంగా గుర్తించగలరు. దేహం ఒకటి కోరుతుంటే, ప్రాణికం ఇంకోటి అడుగుతుంటే, మనస్సు మరొకటి కావాలంటే వీటి మధ్య చర్చలూ, సంఘర్షణలూ జరగవచ్చు, దైహిక చైతన్యం ఉన్నవారు ఇటువంటప్పుడు చక్కగా తెలుసుకోగలరు. శరీరం దేనికి మొగ్గుతున్నదో దాని అవసరమేమిటో, ప్రాణికం ఏవిధంగా తన అజ్ఞానం వల్ల అక్కర్లేని జోక్యం చేసుకొని సమతాస్థితిని చెడగొట్టి అభివృద్ధికి ప్రతిబంధకం కల్గిస్తోందో, ఈరెండిటికీ ఉన్న వైరుధ్యం చాలక మనస్సు తన ఊహలను, ప్రమాణాలను, తన నీతి నియమాలనూ ప్రవేశపెట్టి మిగతా వాటి అవసరాలను

గమనించకుండా లోక రివాజు పాటించాలంటూ మరింత క్రమరాహిత్యాన్ని కల్పించటం మొదలైనవి చక్కగా తెలుసుకోగలరు. మనసస్సు కల్పించుకొని సమతౌల్యాన్ని చెడగొట్టటంవల్లనే జంతువులకంటే మానవుల ఆరోగ్యం సున్నితంగా, అనిశ్చితంగా తయారైంది. దానంతదాన్ని వదిలేస్తే దేహానికి మంచి సహజాత శక్తి ఉంది. అది కాలసినంతవరకే తింటుంది. అక్కర్లేనివి తిని ఆరోగ్యం పాడుచేసుకోదు. నిద్ర వచ్చినప్పుడు నిద్రపోతుంది. ఏపని చేయవలసి వచ్చినప్పుడు దాన్ని చేస్తుంది, దానిది ఖచ్చితమైన సహజాత శక్తి. మనస్సు తన నీతినియమాలతో, క్రమశిక్షణతో ఊహలతో దాన్ని పాడుచేస్తే ప్రాణికం తనకోరికలతో ఆశలతో దాన్ని కలుషితం చేస్తుంది. నాగరికతపేరుతో, మనం పిల్లలకు బోధించే విద్యావిధానం వల్ల ఈనిశ్చిత సహజాతశక్తి పూర్తిగా నాశనమై మిగిలినవన్నీ ప్రాముఖ్యత పొందుతున్నాయి. దానివల్ల ప్రస్తుత పరిస్థితిలో పిల్లలు హానికరమైనవే తింటున్నారు.

విశ్రాంతి అవసరమైనప్పుడు తీసుకోకుండా అక్కర్లేనప్పుడు అతినిద్రపోతూ చేయకూడని పనులన్నీ చేస్తూ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. దైహిక చైతన్యాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే దేహసంస్కృతి చాలా శ్రేష్ఠమైన మార్గము. శరీరానికి చైతన్యం పెరిగినకొద్దీ దాన్ని పరివర్తనచేసి నూతనజాతి ఆవిర్భావానికై పనిచేస్తున్న దైవికశక్తులను గ్రహించగల సామర్థ్యం కూడా పెరుగుతుంది.

- శ్రీమాత

అనువాదం : అమరవాది ప్రభావతి

అమరవాది వెంకటరామశాస్త్రి

7. పిల్లల పెంపకం

మచ్చలేని సౌందర్యం, అన్యాయమంటేనే తెలియని న్యాయం, హద్దుల్లేని మంచితనం, ఇంకా వొక, చైతన్యం, నిరంతర విజయం, ప్రతిరోజు ఒక అద్భుతం, వంటి యేవేవోవింత కోరికలతో వూహలతో నిండినది పసివాడి చైతన్యం. నేను చెప్తూవుంటాను. "ఉత్తమజన్మ" అంటే చైత్యపురుష చైతన్యంతో కూడిన జన్మ అని. అటువంటి బిడ్డ అతి చిన్న వయసునుండి ఒక రకమైన ఆకాంక్షతో నిరంతరం కలలుకంటూ వుంటుంది. పసితనంలో మనిషి అద్భుతాన్ని గూర్చి కలలు కంటాడు. ఆ వయసులో దుష్టత్వం మొత్తం మాయమావాలనుకుంటాడు. ప్రతి వస్తువు ఎంతో అందంగా తేజోవంతంగా వుండాలనుకుంటాడు. అందరూ హాయిగా ఆనందంగా వుండాలనుకుంటాడు. సుఖాంతమైన కథలే ఇష్టపడతాడు. గాలిలో పైకి లేచి ఎగిరిపోతున్నట్టు ఎక్కడ కావాలనుకుంటే అక్కడికి క్షణాలలో వెళ్ళగలిగినట్టు, చిందరవందరగా, అస్తవ్యస్తంగా వున్న వస్తువుల్ని చక్కగా క్రమపద్ధతిలో సర్దినట్టు, రోగగ్రస్తుల్ని ఆరోగ్యవంతులుగా మార్చివేసినట్టు ఇలా వొకటేమిటి! ఎన్నోరకాల కలలు పసివయస్సులో వస్తాయి. కాని సాధారణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వాళ్ళవూహల మీద, వుత్సాహం మీద చన్నీళ్ళు జల్లేస్తారు. అది ఎప్పటికీ నిజంకాదు. వట్టికల మాత్రమే అంటూ. అందుచేత పిల్లలు నిజం అనేది తనకలలకి పూర్తి భిన్నంగా వుంటుందనుకుంటారు. అందుకే పిల్లల్ని అలా నిరుత్సాహ పరచకూడదు. "తప్పకుండా అలా జరుగుతుంది. జరుగడం అసాధ్యంకాదు. అది మీరు గుర్తుంచుకొని నిజంకావడానికి మీరేం చెయ్యాలో తెలుసుకుని కృషి చెయ్యాలి, చేస్తే తప్పకుండా సాధ్యమవుతుంది. అదే మీ జీవితానికి

మార్గదర్శకమవుతుంది. అసలు సత్యంవైపు మిమ్మల్ని నడిపించి ప్రగతి పథం చేరుస్తుంది. దానిని మామూలు ప్రపంచం భ్రాంతి అంటుంది" అనిచెప్పాలి.

మందకొడి తనం, అవలక్షణాలతో కూడిన గుణాల్ని లౌకిక జ్ఞానం (Common sense) పేరుతో పిల్లలకి నేర్పకూడదు. ఆ అలవాట్లు వాళ్ళకి తరవాత మార్చుకోలేని అలవాట్లుగా మారిపోతాయి. అలా తయారు చెయ్యడానికి బదులు వాళ్ళని సహజ వాతావరణంలో వారిని వారుగ ఎదగనివ్వాలి. సరిగ్గా పెరుగుతున్నవాణ్ణి చూసి సందేహపడకూడదు. తోటివారితో దయగా, వున్నవాడినిచూసి ఇప్పడిలావున్నా, భవిష్యత్తులో తప్పకుండా మారిపోతాడని, చక్కగా ఒక పనిచేసిన వాడిని చూసి, వీడు ఇప్పడేదో బాగా చేసేడుకాని, ఇంతచక్కగా ఇకమీదట చెయ్యలేడని అనుకుంటూ, వ్యతిరేక భావాలు ఏర్పరుచుకోకూడదు. ఆ భావాలతో వ్యాఖ్యానించడం పిల్లల అభివృద్ధికి Acid లాంటిది. అత్యంత విధ్వంసకరమైన Acidలా, వాళ్ళ మీద వ్యాఖ్యానాలు పనిచేస్తాయి. దీనివల్ల వాళ్ళ ఊహలు, నిర్ణయాలు, ఉత్సాహపూరిత నిర్మాణాత్మక లక్షణాలన్నీ నాశనమయి పోతాయి.

ఒక పిల్లవాడు అత్యంత కుతూహలంతో జిజ్ఞాసతో వున్నప్పడు 'జీవితం నువ్వనుకుంటున్నట్టువుండదు సుమా'! అంటూ వాడి కుతూహలాన్ని నీరు కార్చకూడదు. నిరంతరం ప్రోత్సహించాలి.

ఇప్పడెంతో అందవికారంగ పైకి కనిపించేదీ ఏదీ నిజానికి అలాగే వుండదు. జాగ్రత్తగా పరిశీలించి అధ్యయనం చేస్తే దాని వెనకగల అందం చూడగలవు. ప్రేమగా దరికి చేర్చుకుని ఆదరిస్తే అది నీకలలకి ప్రతిరూపంగా మారుతుంది. నీవు ఆశించిన వస్తువుగా రూపొందుతుంది అని చెప్పాలి.

బాగా పసితనంలోనే పిల్లల్ని అలా తయారు చెయ్యాలి. ముందే ఆ విధంగా తయారుచేస్తే తరవాత ఎక్కువ కష్టపడకుండానే వాళ్ళు అనుకున్న విధంగా తయారవుతారు. సమయం మించి పోయిన తరువాత ఎంత ప్రయత్నించినా ఫలితం వుండదు. విద్యా విధానంలో లోపాలు, మందకొడితనం, అసభ్య ప్రవర్తన, మాటలు, చేతలవల్ల కలిగిన దుష్పరిణామాలు తరవాత అరికట్టబడవు. దానిఫలితంగా ఎన్నో ఆశలు, అందమైన కలలకి విరుద్ధంగాజీవితం నిస్సారంగా, నిరుత్సాహంగా, విసుగ్గా తయారవుతుంది.

నీకు నువ్వు లేదా ఒక పసివాడికి తప్పకుండా చెప్పవలసినది. 'నువ్వు పసివాడివి కావు'. అంటూ.

మనలో అసత్యం గాను, అసాధ్యంగాను, భ్రాంతిగాను కనిపిస్తున్నదంతా ఏదైతే ఉందో అదే నిజమైనది, తెలుసుకోదగినది. ఆ భావనే పెంపొందించు కోవాలి. ఎప్పుడైతే నీలో ఈ ఆకాంక్ష ఉందో నీలో నువ్వే దృఢమైన నిర్ణయం తీసుకోవాలి. అప్పడు కొన్ని పరిమితులకి లోబడి అసమర్థడు కాకూడదు. ఏదో కుశ్శంకతో వెనక్కి లాగబడకూడదు. అత్యవసరమయిన యదార్థం అదే. అదే తప్పనిసరిగా తెలుసుకోవలసిన సత్యం. అప్పడే శరీర కణాల్లో నమ్మకం కుదురుకుంటుంది. నీ శరీరంలో ప్రతి స్పందన అప్పడు నువ్వు గుర్తించగలవు. శరీరం తనంతట తాను, తన ఆంతర్యం చేసే సహాయం, ఇచ్చే ప్రోత్సాహం, మార్గ నిర్దేశం చేసి నడిపించడం, చక్కదిద్దడం గుర్తిస్తుంది. పరిమితులన్నీ పటాపంచలయి పోతాయి.

శరీరం తనంతట తను దైవ స్పృహ, అనుభూతి పొందుతుంది. మొదట నీవు కోల్పోయినప్పటికీ తిరిగి దీనిని పొందగలగాలి. ఇదే నీ ప్రయత్నం కావాలి. ఎప్పడైనా ఒక పిల్లవాడు తన అందమైన

కలగురించి చెప్పేడనుకో. ఆ కలలోవాడు ఎన్నో అందమైన వస్తువులు, అసాధారణ శక్తులు కలిగివున్నానని చెప్తాడు. అటువంటి సందర్భంలో వాడికి పొరపాటునైనా, "అయ్యో బాబూ! అది కల! జీవితం అలావుండనే వుండదు" సుమా! అని మాత్రం అనకండి. అదే నువ్వు చేస్తున్న పొరపాటు. నువ్వు చెప్పవలసినది. జీవితం అలాగే వుండాలి. అలాగే వుంటుంది." అని.

మూలం : శ్రీమాత

1అనువాదం : నడిమింటి విజయలక్ష్మి.

8. సంధ్యాసమయం

ఒక సువర్ణ సంధ్య, యోచనా పూరిత భాస్కరుడు తన సాధారణ వైభవోపేత శోభను తిరస్కరించి నిష్క్రమించే తరుణం, తరులు తమ పచ్చని పచ్చిక చెలి సాఫల్యమాత, (పుడమితల్లి) వైపు వంగి ఏదో గుసగుసలాడుతున్న వేళ -యివి, ఇంకా ఒక సువిశాల నిశ్శబ్ద సాగరం. ఇదే పరమాత్మకత్వంత సన్నిహిత సమయం. సుదీర్ఘ మార్గాలెన్నో నడయాడిన సుసంపన్న ప్రాచీన యుగం వంటిది.

మూలం : శ్రీఅరవిందులు

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి

4. గీతా హృదయము

- శ్రీ అరవిందులు

1. పాక్షికవాదానికి గీతలో అవకాశము

దివ్య గురువును గుఱించి, మానవశిష్యుని గుఱించి తెలిసికొనియున్నాము; ఇప్పుడిక గీతా సిద్ధాంతమును గుఱించి ఒక స్పష్టభావన నేర్పఱచుకొనుటయే మిగిలియున్నది. గీతాబోధనయొక్క కేంద్ర హృదయము మీద నాధారపడిన ఒక స్పష్టభావన గీతయందు మఱింత అవసరము; ఏలన గీతావిచారణ సుసమృద్ధము, బహుముఖము; ఆధ్యాత్మిక జీవనముయొక్క విభిన్న పార్శ్వముల గీతాగ్రహణము సమన్వయాత్మకము; దాని తర్కగతి సవేగము, భ్రమణ శీలము: కావున ఇతర గ్రంథములందుకంటెను గీతయందు పక్షపాత బుద్ధితో స్వపక్షమును నిరూపించుకొనుటకు అవకాశ మెక్కువగలదు. మఱియు తాను అభిమానించిన ఒక సిద్ధాంతమునకు పోషకముగా ఒక వాస్తవమును, పదమును మఱియు భావమును తెలిసియో, సగము తెలిసియో, విఱిచి వ్యాఖ్యానించుట భ్రాంతనిర్ణయమునకు ఒక సులభమార్గమని భారతీయ తార్కికులు అంగీకరించియే యున్నారు; మఱియు నిట్టి తప్పును తప్పించుకొనుట సత్యపరాయణుడగు మనీషికి సైతము మిక్కిలి కష్టము. ఏలన ఈ విషయమున మానవబుద్ధి తనపై తానే గూఢచారి పని చేయలేదు; ఒక పాక్షికసూత్రము నభిమానించి దానినే సర్వసత్యమునకు కీలకముగా స్వీకరించుట దాని స్వభావమే యగును; మఱియు తన స్వభావగతమగు ఈ ప్రియదోషమును తన తర్కక్రియయందు తన దృష్టి బడకుండ చేసికొనుట కీ బుద్ధికెంత సామర్థ్యముగలదో! ఇట్టి దోషమునకు గీత ఇట్టే అవకాశమిచ్చును; ఏలన గీతలోని ఒక సిద్ధాంతమునో, ఒక ప్రముఖ వాక్యమునో ఎత్తిచూపి, తక్కిన పదునెనిమిది ఆధ్యాయాలను వెనుకకు నెట్టి, లేక వానికి గౌణ స్థానమిచ్చి, మన స్వీయ సిద్ధాంతము లేక వాదముయొక్క పక్షపాతినిగా గీతను మార్చివేయవచ్చును.

2. గీత కర్మసన్న్యాసమును బోధించదు

ఇట్లు గీతచేత కర్మయోగము నే మాత్రము గాక, కర్మసన్న్యాసమునకు సన్నాహ సాధనను మాత్రమే బోధింప జేయువారున్నారు: విహితకర్మలనో, చేతికి వచ్చిన కర్మలనో ఉదాసీనముగా చేయుటయే ఈ సాధన; జీవన కర్మల చరమ సన్న్యాసమే దీని ఏకైక, వాస్తవలక్ష్యము. గీతనుండి ఉదాహరణ లిచ్చుటచేతను, దాని ప్రతిపాదనా పద్ధతిని ఒక విధముగా సాగలాగుటచేతను, విశేషించి 'సన్న్యాసము' వంటి పదమునకు గీత యిచ్చు విలక్షణార్థమును పాటించక పోవుటచేతను ఇట్టి అభిప్రాయమును సమర్థించుట తేలికే. కాని నిష్పక్షపాతముగా గీతను చదివినపుడు ఈ అభిప్రాయమున కొనసాగుట అసంభవమగును; ఏలన అకర్మకంటెను కర్మ మేలనియు (3-8), సమత్వముద్వారా కామము యొక్క యథార్థ అంతర సన్న్యాసము నందును, పరమపురుషునికి కర్మలను సమర్పించుటయందును ఆధిక్యము గలదనియు (3-30) చివరివరకు గీత నిరంతరము వక్కాణించును.

3. గీత కేవల భక్తియోగమును గాదు

ఇంకను కొందరు గీతా బోధన యంతయు భక్తి సిద్ధాంతమే యని చెప్పి, గీతలోని అద్వైతాంశములను, ఏకాత్మయందు ప్రశాంతమునకు గీత యిచ్చు ఉచ్చస్థానమును వెనుకకు నెట్టివేతురు. నిజమే, గీత భక్తిని ఒత్తి చెప్పును; అటులే భగవంతుని ప్రభువు మఱియు పురుష రూపములను పట్టుతో ప్రతిపాదించును; ఇంకను పురుషోత్తమ సిద్ధాంతమును వివరించి, ఇతడు క్షరపురుషుని కంటె నతీతుడనియు, అక్షరాత్మకంటెను శ్రేష్ఠుడనియు (15-18) వక్కాణించును - ప్రపంచమునకు సంబంధించినంతవఱకు ఇతనినే మనము భగవంతునిగా నెఱుంగుదుము : ఇవి నిజమే.

గీతయొక్క అతి ప్రముఖ మఱియు ప్రాణప్రదమైన తత్త్వములలోనివే. అయినను గీతా పురుషోత్తముడు, ఎవనియందు భక్తిహృదయము ప్రవేశించునో, అట్టి భక్తి ప్రభు వైనట్లే (18-55), ఎవనియందు సర్వజ్ఞానము పర్యవసించునో (13-30), అట్టి ఏకాత్మయునగును, మఱియు సర్వకర్మయు ఎవనికి దారితీయునో, అట్టి యజ్ఞప్రభువు నగును (5-29) ; మఱియ అప్పటి విచారణాప్రవతను బట్టి గీత ఒకసారి జ్ఞానమును, ఒకసారి కర్మను, ఒకసారి భక్తిని వక్కాణించినప్పటికి, ఈ మూడింటి మధ్య పరిపూర్ణ సామ్యమును నిలబెట్టును ; ఏ యొక్క దానియందును గీతకు అత్యంత ప్రత్యేకాభిరుచి లేదు. ఎవనియందు ఈ మూడును కలిసి ఏకమగునో, అతడు గీతా పురుషోత్తముడు.

4. గీతాకర్మ దివ్యకర్మగాని, మానవకర్మగాదు.

కాని ప్రస్తుతకాలమున, నిజానికి ఆధునిక మనస్సు గీతను గుర్తించి, ఉపయోగించ నారంభించినప్పటినుండియు, గీతయందలి భక్తిజ్ఞానములకు గౌణస్థానమిచ్చి, కర్మపట్ల గీతకు గల పట్టునుండి లాభముగొని, గీతయందు కర్మశాస్త్రమునే కర్మపథమునందు మనలను నడిపించు వెలుగునే, కర్మ సిద్ధాంతమునే చూచుటయందు ఇప్పటివారి మొగ్గు కన్పించుచున్నది. నిశ్చయముగా గీత ఒక కర్మసిద్ధాంతమే, కాని గీతాకర్మలు జ్ఞానమునందు (4-33), అనగా ఆత్మసాక్షాత్కారము నందును, శమమునందును పర్యవసించు కర్మలు ; మఱియు నవి భక్తిప్రేరితకర్మలు, అవి ఆధునికమనస్సునకు దెలిసిన కర్మలుగావు, అహంకార, పరోపకారభావము లాదేశించిన కర్మలెంత మాత్రముగావు. సామాజిక, భూతదయా పరహితువుల చేతను, సూత్రములచేతను, ఆదర్శములచేతను చోదితకర్మలు కానేకావు. కాని నేటి వ్యాఖ్యానములు ఈ కర్మలే గీతహృదయమని

చెప్పజూచుచున్నవి. సాధికారపురుషులు మనకిట్లు నిరంతరము ఘోషించి చెప్పచున్నారు. భారతీయుల ఆధ్యాత్మికత యందు గన్పడు తాపస ప్రవృత్తిని, శమప్రవణతను గీత కర్మవిషయమున విరోధించుచున్నది : గీత మానవకర్మను, సామాజికవిధులను నిస్వార్థముగా నాచరించుట యను ఆదర్శమును, ఇంతేకాదు, మిక్కిలి ఆధునికమగు సాంఘిక సేవాధర్మమును సైతము గొంతెత్తి చాటుచున్నది. ఇది ఇప్పటివారి వాదముకాగా, దీనికంతకు నేనుచెప్ప ఏకమాత్రసమాధాన మేమన, ఈవాదముయొక్క ముఖము చూచినను, గీత ఇట్లు చెప్పట లేదని స్పష్టముగా దెలిసిపోవును ; ఇది ఆధునికులు చేసికొను అపార్థము - ఇది ఇప్పటి ఐరోపీయుల లేక వారి మానస పుత్రులగు భారతీయుల మనస్స సర్వదా పురాతనము, ప్రాచ్యము, విశేషించి భారతీయమునగు ఒక బోధనలోనికి చొప్పించు స్వీయార్థము. గీత బోధించునది మానవ కర్మగాదు, దివ్యకర్మ ; అది సామాజిక విధుల నిర్వహణముగాదు, మన ప్రకృతిద్వారా పనిచేయు భగవదిచ్ఛను నిరహంకారముగా నిర్వహించు నిమిత్తము విధిలేక సదాచారమునకు సంబంధించిన తక్కిన సర్వధర్మముల పరిత్యాగము (18-66); అది సాంఘిక సేవ కాదు, శ్రేష్ఠులు (3-21), భగవదాయత్తులు (18-57) నగు మహాపురుషులు లోకసంగ్రహార్థము (3-25) నిరహంకారముగా, మానవునికిని, ప్రకృతికిని వెనుకనిలబడి, వానిని నడుపు కర్మప్రభువునకు ఒక యజ్ఞముగా చేయుకర్మ.

5. భగవంతుని మాట ఆదివారమునాడే

తాత్పర్యముగా, గీత ఆధ్యాత్మిక జీవనగ్రంథము గాని వ్యావహారిక నీతి శాస్త్రముగాదు. ఆధునికమనస్సు ఇపుడు ఐరోపియ మనస్సు-అందునను తనకు మూలమగు అత్యుత్తమ

గ్రీకు - రోమను సంస్కృతియొక్క దార్శనిక ఆదర్శ వాదమునే గాక, మధ్యయుగములనాటి క్రైస్తవ భక్తి వాదమును గూడ త్యజించి వేసి, మఱియొక రూపమున వెలసిన ఐరోపీయ మనస్సు; అది దార్శనికా దర్శమును వ్యావహారికాదర్శములోనికి, భగవద్భక్తిని మానవభక్తిలోనికి మార్చి వేసినది, ఆధునిక మనస్సు భగవంతునికి స్వస్తిచెప్పినది, లేక ఆదివారమునాడు ఉపయోగించుకొనుటకు మాత్రమే మిగిల్చినది. అది భగవంతునికి బదులు మానవునే దేవతగాను, సంఘము నాదేవతా విగ్రహముగాను నిల్పినది. తన ఉత్తమరూపమున ఆధునిక మనస్సు వ్యావహారికము, నైతికము, సామాజికము మరియు క్రియాత్మకము, పరోపకారము, దయాప్రయుక్తము. కాగా ఇవి యన్నియు మంచివే, విశేషించి నేడు అవశ్యకములు; ఇవి భగవదిచ్ఛలో భాగమే, లేనిచో మానవజాతి యందవి అంత ప్రాబల్యము వహించవు. మఱియు దివ్యమానవుడు, అనగా బ్రహ్మచేతన యందును, భగవత్సత్త యందును నివసించు మానవుడు తన వ్యవహారమునందు ఇవి యన్నియు గాక పోవుటకు కారణము గన్పించదు ; ఇవి యుగధర్మమగుచో వీనికి మించి స్థాపించవలసిన ఆదర్శముగాని, సాధించవలసిన పరివర్తనము గాని లేనిచో, అతడివి అన్నియునగును. ఏలన దివ్యగురువు నిర్దేశించునట్లు, అతడు ఇతరులకు తమ యుగధర్మమున ప్రమాణము నెలకొల్పవలసిన శ్రేష్ఠమానవుడు; నిజానికి కృష్ణుడర్జును నిట్లు ఉద్బోధించును గూడ నీ యుగము యొక్కయు, ప్రచలిత సంస్కృతి యొక్కయు ఉత్తమాదర్శముల ననుసరించి జీవించుము, అయితే సాధారణమానవులవలె బాహ్యాధర్మముల ననుసరించి జీవించుము, అయితే సాధారణమానవులవలె బాహ్యాధర్మమును, నియమమును కేవలము అనుష్ఠించుచునే గాక, బాహ్యాధర్మముల వెనుకఉన్న భగవత్సంకల్పము నెఱింగి వానిననుష్ఠించుచు జీవించుము (4-15).

౬. భగవత్‌స్థితి గీతయొక్క సర్వోత్కృష్ట భావన

ఇంతకు సారాంశ మేమన, భగవంతుడు లేక బ్రహ్మ మఱియు ఆధ్యాత్మికత లేక భగవత్‌స్థితి : ఇవి గీతయొక్క సర్వోత్కృష్ట భావనలు ; ఈ రెండు సారవస్తువులనే ఆధునిక మనస్సు తన వ్యావహారిక ప్రేరకశక్తి నుండి వెలివేసినది. ఆధునిక మనస్సు మానవ భావమునందే నివసించుచుండగా, భగవంతునియందలి ప్రపంచముకొఱకేయైనను, గీత మనలను భగవంతునియందు నివసింపగోరును; అది తన ప్రాణము, హృదయము, మఱియు బుద్ధియందే నివసించు చుండగా, గీత మనలను ఆత్మయందు నివసింపగోరును ; అది సర్వభూత రూపమగు క్షరపురుషుని యందే నివసించుచుండగా, గీత మనలను అక్షరుని యందును, పురుషోత్తముని యందునుగూడ నివసింపగోరును (15-16,17) ; అది మారుచుండు కాలప్రవాహములో నివసించుచుండగా, గీత మనలను కాలాతీతమునందు నివసింపగోరును. అథవా ఆధునిక మనస్సు ఈ ఉత్కృష్ట వస్తువుల నిపుడు అస్పష్టముగా చూడ నారంభించినచో, అది వానిచేత మానవునికి, మానవ సమాజమునకు సేవ చేయించుటకే ! కాని భగవంతుడును, ఆధ్యాత్మికతయు స్వాధికారము చేతనే వర్తించునుగాని, పరాశ్రిత వస్తువులుగాగాదు. మఱియు నాచరణయందు మనయందలి నిమ్నము, మనయందలి ఉన్నతము కొఱకు జీవించ నేర్చుకొనవలెను; అపుడు ఆఉన్నతము సైతము సచేతనముగా నిమ్నముకొఱకు వర్తించుచు, దానిని తన ఉన్నత భూమికల దగ్గరకు ఆకర్షించు నవకాశము గల్గును.

కావున, నిస్స్వార్థముగా నీ విధిని నిర్వహింపుము, అదియే సర్వోత్తమ, సర్వపర్యాప్తధర్మము-అని గీతచేత బలాత్కారముగా చెప్పించుట గొప్ప తప్పేయగును. గీత పరిష్కరింప చేపట్టిన స్థితిని ఇంచుక పరిశీలింతుమేని, గీతార్థమిది కాదని తేలిపోవును. బహువిధములు, అన్యోన్యసంబద్ధములునైన కర్తవ్యభావనలు అర్జునుని మనస్సులో విడదీయరాని విధముగా ఢీకొనును ; అట్టి స్థితిలో మానవ మనస్సుచేత నిర్మించబడిన బౌద్ధిక, నైతికభవన మంతయు పనికిరాక కుప్పగూలిపోవున; ఈ స్థితియే గీతా బోధనకు మూలము, ఇదియే అర్జునుని భగవంతు నాశ్రయింప జేయును. మానవ జీవనమున ఇట్టి సంఘర్షస్థితి తఱచుగా నుదయించును; ఉదాహరణకు, గృహధర్మమునకును, దేశ ధర్మమునకును సంఘర్షము, అటులే దేశాధికారమునకును, మానవాళి హితమునకును, లేక అంతకు మించిన ధార్మిక లేక నైతిక సూత్రమునకును సంఘర్షము. ఇంకను బుద్ధునియందువలె భగవంతుని పిలుపు ననుసరించుటకు బాహ్యవిధులన్నింటిని త్రోసి వేయవలసిన అంతరవస్థ ఏర్పడవచ్చును. అట్టియెడ బుద్ధుని తిరిగి తన భార్య దగ్గరకు పంపించివేసి, గీత అట్టి అంతరవస్థను పరిష్కరించునని నే నూహించజాలను; అటులే బడిపంతులవై నిస్స్వార్థముగా పిల్లలకు పాఠములు చెప్పకొనుమని రామకృష్ణుని వంటి వానిని గీత త్రిప్పిపంపదు; ఇంకను కుటుంబ పోషణార్థము న్యాయ వృత్తినో, వైద్యవృత్తినో, పత్రికావృత్తినో చేపట్టుమని వివేకానందుని వంటి వానిని నిర్బంధించదు. గీత నిస్స్వార్థ విధినిర్వహణమును బోధించదు, పరంతు దివ్యజీవనసాధనమును, సర్వధర్మ పరిత్యాగమును, ఏక మాత్ర పరమపురుషుని ఆశ్రయమును బోధించును (18-66) మఱియు బుద్ధుని, రామకృష్ణుని, వివేకానందుని దివ్యప్రవృత్తి ఈ బోధనతో సర్వదా మేళవించును. ఇంతే కాదు, గీతకు అకర్మ కంటెను కర్మయే ఎక్కువ

ప్రియమైనను (3-8), అది కర్మ సన్యాసమును సర్వదా వర్జించక, దానిని గూడ భగవంతునికి ఒక మార్గముగా నామోదించును (5-2). సన్యాసము చేతనే భగవత్ప్రాప్తి సంభవమగుచో, సన్యాసమునకు లోపలి నుండి పిలుపు బలముగా వచ్చుచో, సన్యాసాగ్నిలో దుముకవలసినదే, గత్యంతరము లేదు. భగవంతుని పిలుపు అప్రతిహతము, దాని ముందు ఇతర ఆలోచనలు పనిచేయజాలవు.

8. పాపము విధి ఎట్లగును ?

కాని అర్జునుని విషయమున మఱియొక సంకటము గలదు - అతని కర్తవ్య మెట్టిదనిన, దాని నుండి అతని నైతికబుద్ధి పరాఙ్ముఖ మగును. యుద్ధ మతని విధి యందువా ? కాని ఆ విధి అతని బుద్ధికిపుడు ఘోరపాప మయినది. అట్టి పాపము నిష్కామముగా, నిర్వికారముగా చేయుమని నీవు చెప్పినచో, అది వానినెట్లు తృప్తిపఱచును ? ఏది నా విధి ? కులమును, జాతిని, దేశమును వధించి, రక్తము పాఱించుట నా విధి యెట్లగును ? అని అతడు తెలియగోరును. అతని పక్షమున న్యాయమున్నదని నీవందువే- అది అతనిని తృప్తి పఱచదు, పఱచజాలదు; కారణము, అట్టి న్యాయము జాతి భవిష్యత్తునకే ముప్పుతెచ్చుదారుణ రక్తపాతమునకు దారితీయజాలదనియే అతని వాదన యంతయు. అయినను తాను యోధుడుగా తన విధిని నిర్వర్తించుచున్నంత కాలము దాని పాపస్వరూపమునుగాని, పరిణామములనుగాని పట్టించుకొన బనిలేదను అర్థమున అతడు నిర్వికారముగా యుద్ధము చేయవలె నందువా ? అది రాజ్యము యొక్క, రాజకీయవాదుల యొక్క, నీతివాదుల యొక్క, న్యాయవాదుల యొక్క బోధనగావచ్చునేమోగాని, జీవన కర్మల సమస్యను మూలమునందే పరిష్కరింప సమకట్టు నొక మహాధార్మిక,

దార్శనిక శాస్త్రము యొక్క ఉపదేశ మెన్నటికిని కాజాలదు. ఒకవేళ మర్మభేదియగు నొక నైతిక, ఆధ్యాత్మిక సమస్యను గుఱించి గీత చెప్పవలసిన దంతయు నదియే యగుచో, ప్రపంచ మహాశాస్త్రముల పట్టిక నుంచి దానిని తొలగించి, రాజకీయ విజ్ఞానము, నైతిక మీమాంసల పుస్తకాగారములోనికి దానిని త్రోసివేయవలెను.

౯. పాపపుణ్యములు లేవని గీత చెప్పదు.

నిజమే, ఉపనిషత్తుల వలె గీతయు పుణ్యపాపములకు పైనను, శుభాశుభముల కావలను భాసించు సమతను బోధించును, కాని బ్రహ్మచేతనలో నొక భాగముగానే దానిని బోధించును, మఱియు సాధనావధమున ఆవరమ నియమమును పాటించగలిగి నంత పురోగమించిన వానికే బోధించును. కాని సామాన్య మానవజీవనమునకు శుభాశుభముల పట్ల ఉదాసీనత నుపదేశించదు; దాని పరిణామము విషతుల్యము కాగలదు. పైగా దుష్కృత్యము నొనరించు వారు భగవంతుని బొందరని గీత వక్కాణించును (7-15) కావున అది భటుడుగా తన విధియేయైనను, నరకవస్తువగు పాపము నాచరింప జూచుట అర్జునునకు సాయపడదు, వేయి విధులు ముక్కచెక్కలైనను, తన నైతికబుద్ధి ఏవగించుకొను దానిని అర్జునుడు చేయరాదు, చేయజాలడు.

10. విధి బాహ్యము, నీతి అంతరము

ఆచరణయందు, సామాజిక భావనల మీద నాధారపడు ఒక భావమే విధియని మనము జ్ఞాపకము చేసికొనవలెను. ఇట్లుగాక, దీనికి అతివ్యాప్తి గల్పించి మనపట్ల మనకుగల విధిని గుఱించి ప్రసంగించవచ్చు, లేక ఒక అతీతార్థమున సర్వమును

త్యజించుట బుద్ధుని విధియని, లేక గుహయందు నిశ్చలముగా నాసనబద్ధుడై యుండుట యతివిధి యని చెప్పవచ్చును. కాని స్పష్టముగా నిదిమాటలతో నాడుకొనుటయే యగును. విధి ఒక సాపేక్షపదము, అది ఇతరులతో మనకు గల సంబంధము నపేక్షించును. ఉదాహరణకు, బిడ్డలను పెంచుట తండ్రి విధి; తన కక్షిదారుడు దోషియని తెలిసినను, అతనిని గెలిపించుట న్యాయవాది విధి; తన బంధువులనే చంపవలసి వచ్చినను, పై వారి ఆదేశమును బట్టి వారిని కాల్చిచంపుట సైనికుని విధి; హంతకుని ఉరిదీయించుట న్యాయమూర్తివిధి. ఈ సంబంధముల నామోదించినంత దనుక, విధిస్వరూపము స్పష్టమే; గౌరవభాజనము, అనురాగాస్పదము గాకపోయినను, అది ఒక వ్యావహారిక విషయము. కాని అంతర్దృష్టి మాఱి, అనృతము అత్యంత పాపమని న్యాయవాదికి కనువిప్పు కలిగినచో, మరణదండన మానవతత్త్వమునకు జేయు మహాపరాధమని న్యాయమూర్తికి లోతుగా నచ్చినచో, మానవమాంసమును భక్షించుటవలె మానవప్రాణమును హరించుటయు ఎట్టి పరిస్థితులలోను క్షంతవ్యము గాదని నేటి సమర విరోధికివలెనో, టాల్‌స్టాయికి వలెనో యుద్ధము చేయవలసిన సైనికునికి లోపల తట్టినచో, అపుడేమి చేయవలెను ? ఇట్టియెడ సాపేక్షవిధులకు పై నుండు నైతిక ధర్మమే ప్రాబల్యము వహించవలె ననుట స్పష్టమే. ఇక నీ ధర్మము సామాజిక సంబంధముపై నాధారపడక, ప్రబుద్ధమైన మానవుని నైతికసత్తయొక్క అంతరబోధము పైననే ఆధారపడును.

11. బాహ్యవిధికి బదులు భగవన్నిర్ణయము

ప్రపంచమున, నిజానికి తన తన భూమికయందు ప్రామాణికములేయైన రెండు ప్రవర్తన ధర్మములు గలవు - 1. ముఖ్యముగా బాహ్యసంబంధముపై నాధారపడు నియమము. 2.

బాహ్యసంబంధము నపేక్షించక, కేవలము లోపల చింతన మఱియు వివేచనలపై నాధారపడు నియమము. గీతఉచ్చతర భూమికను నిమ్నతర భూమికకు అధీనము చెయ్యమని బోధించదు; అది ప్రబుద్ధ నైతిక చేతనను సామాజిక సంబంధమును బట్టి ఏర్పడిన విధివేదికపై బలిగమ్మని ప్రోత్సహించదు. అది పైకి బిల్చునుగాని, క్రిందికిగాదు; రెండు భూమికలకును విరోధమేర్పడినపుడు, ముఖ్యముగా వ్యావహారికము, కేవలముగా నైతికము నగు భూమికలకు పైన వర్తించు పరమస్థితికి, బ్రహ్మచేతనకు (2-72) ఆరోహించు మని గీత మనల నాదేశించును. అది సమాజ విధిభావనకు బదులుగా భగవంతునిపట్ల మనకు గల కర్తవ్యతాభావనను ప్రవేశపెట్టును. బాహ్యనియమునకు గల అధీనత కర్మయొక్క ఒక అంతర స్వయం నిర్ణయసూత్రమునకు తావిచ్చును - జటిలమగు గుణ కర్మ నియమమునుండి అంతరాత్మ విముక్తి నందినపుడే స్వయం నిర్ణయము సాధ్యమగును. బ్రహ్మచేతన, కర్మనుండి అంతరాత్మ విముక్తి. మన లోపలను, పైనను ఉన్న ఈశ్వరునిచే ప్రకృతియందు కర్మ నిర్ణయము - కర్మయోగమునకు సంబంధించి ఇదియే గీతాబోధనయొక్క సారతత్త్వమని తర్వాత మనము చూడగలము.

12. బంకిమచంద్రుడు - గీత

తనవంటి ఇతర ఉద్గ్రంథములవలెనే, గీతయు సాకల్యముగా చదివినపుడే దాని వికాసశీల ప్రతిపాదనను గుర్తించినపుడే, మనకు అర్థము కాగలదు. గీతకు మున్ముందు, అది విధిశాస్త్రమను నూతనార్థమును కట్టబెట్టినవాడు మహారచయిత, బంకిమచంద్ర చటర్జీ; అతని పరంపరలోని ఆధునికవ్యాఖ్యాతలందరు మొదటి మూడు, నాలుగు అధ్యాయములనే విశేషించి ఒత్తి చూపుదురు; అందునను వారి

అభిమాన విషయాలు - 1. సమతాభావము, 2. వారు విధియని అనువదించు "కర్తవ్యకర్మ" (3-19). 3. "కర్మయందే నీ కధికారముగాని, కర్మఫలము నందెట్టి అధికారమును లేదు" (2-47) - అనువాక్యము; ఇపుడు దీనినే జనసామాన్యముముందు గీతామహావాక్యముగా ఎత్తిచూపుచున్నారు. పదునొకండవ అధ్యాయమును మినహాయించి, సమున్నత తత్త్వ విద్యతో నొప్పారు తక్కిన అధ్యాయములకు వీరు గౌణస్థానమునే యిత్తురు. ఆధునిక మనస్సున కిది మిక్కిలి సహజమే; ఏలన నిశిత తాత్త్వికవిషయాలు మఱియు సుదూర ఆధ్యాత్మిక లక్ష్యాల పట్ల దానికి సహనము తక్కువ, అది ఆత్రముగా కర్మలోనికి దిగజూచును. మఱియు అర్జునునివలెనే అది కోరునది ఆచరణయోగ్యమగు ఒక కర్మప్రమాణము, ఒక "ధర్మము". కాని యీ గ్రంథమును విచారించుట కిది అపమార్గమే యగును.

13. గీతాసమత ఉదాసీనత గాదు

గీత ఉపదేశించు సమత ఉదాసీనతగాదు చూడుడు; పునాది వేసి, గీతా భవనముయొక్క ప్రధాన నిర్మాణము ఏర్పరచిన పిమ్మట, అర్జునున కిచ్చిన మహోపదేశమిది - "లెమ్ము, శత్రువులను సంహరించుము, సమృద్ధరాజ్యము ననుభవింపుము" (11-33); ఈ ఆదేశమునందు నిరపేక్ష పరోపకార వాదము యొక్క గాని విశుద్ధ నిర్వికార వైరాగ్యము యొక్కగాని ఛాయలు గన్పించవు; అది అంతః సమత మఱియు విశాలతతో గూడిన ఒక స్థితి, ఈ స్థితియే, ఆధ్యాత్మిక విముక్తి కాధారము. ఆ సమతతోను, ఆ విముక్తియందును మనము "కర్తవ్యకర్మను" చేయవలెను. గీతనుబట్టి ఈ కర్తవ్యకర్మయందు అన్ని కర్మలు - "సర్వకర్మాణి" (3-30) వచ్చివేయును; ఇది సామాజిక విధులను లేక నైతిక ధర్మములను తనలో నొక భాగముగా నిముడ్చుకొనును. ఇంకను,

ఈ కర్తవ్యకర్మను నిర్ణయించవలసినది వ్యక్తిగాదు; అటులే కర్మయందధికారము, కర్మఫలము నందధికారనిరాకరణము (2-47) - ఇది గీతామహావాక్యమును గాదు, ఇది యోగపర్వతము నారోహించ నారంభించిన శిష్యునియొక్క ప్రథమ దశకు ఉద్దేశించిన ప్రాథమిక వాక్యము మాత్రమే, తర్వాతి దశలో గీత దీనిని కొట్టివేసి మానవుడు కర్తగాదని గట్టిగా వక్కాణించును; ప్రకృతియే క్రియాత్మకమగు తన త్రిగుణములతో అతని ద్వారా కర్మచేయును (3-27), కావున కర్మచేయునది తానుగాదు అని అతడు చూడనేర్వవలెను. అందుచేత కర్తృత్వభ్రాంతిలో మనమున్నంత కాలమే 'కర్మయందే నీకధికార' మను భావము మన పట్ల జెల్లును. కాగా నేను కర్తనుగాను అను సత్యము ఏక్షణమున మన చేతన యందు స్ఫురించునో, ఆ క్షణము నుండి ఫలాధికారముతో బాటు మన కర్మాధికారమును మనస్సునుండి అదృశ్యమగును. అపుడు ఫలవిషయక లేక కర్మ విషయక అహంకారమంతయు అంతమొందును.

14. కర్మను నిర్ణయించువాడు భగవంతుడు

కాని ప్రకృతి కర్మను నిర్ణయించు ననుటయు గీత యొక్క చరమ వాక్యము గాదు. (దీని ఫలితములగు) సంకల్ప సమతయు, ఫలనిరాకరణమును, మనోబుద్ధి హృదయములతో భగవచ్చేతనలో ప్రవేశించి, అచ్చట నివసించుటకు సాధనములు మాత్రమే; అట్లు నివసించజాలనంతవఱకు వానిని సాధనములుగా నుపయోగించుకొనవలెను. లేక వానిని అభ్యసించుచు, ఉన్నతస్థితి యొక్క క్రమ వికాసమును బొందగోరవలెను (12-9)- అని గీత చెప్పను గూడ. మఱియు నేను భగవంతుడు - అని కృష్ణుడు ప్రకటించుకొను ఆ భగవంతుడెవరు ? పురుషోత్తముడు (15-18). నిష్క్రియమగు ఆత్మకు అతీతుడు, సక్రియమగు ప్రకృతి కతీతుడు,

ఆత్మకు ఆధారము, ప్రకృతి ప్రభువు; సృష్టి యంతయు ఈ ప్రభువు యొక్క అభివ్యక్తియే; మన ఇప్పటి మాయాధీనావస్థ యందు సైతము అతడు తన సృష్టియగు జీవుల హృదయమున ఉపవిష్టుడై ప్రకృతి కర్మలను నియమించుచుండును; కురుక్షేత్ర సైన్యములు మరణాత్పూర్వమే నిహతములైనవి వీనిచేతనే, ఇతడర్జునుని ఈ మహాసంహారమునకు ఒక ఉపకరణముగా లేక కేవల నిమిత్తముగా నుపయోగించుకొనును (11-33). ప్రకృతి అతని కార్యనిర్వాహకశక్తి మాత్రమే (కర్మనిర్ణేత్రి గాదు). శిష్యుడు ఈ శక్తిని, దీని త్రిగుణములను దాటి పైకెగయవలెను; అతడు త్రిగుణాతీతుడు కావలెను (2-45). తన యే కర్మపై తనకిక స్వత్వముగాని, అధికారముగాని లేదో, ఆ కర్మల నిపుడతడు ప్రకృతికిగాక, పరమపురుషుని సత్తలోనికి సమర్పింపవలెను. తన మనో బుద్ధులను, హృత్సంకల్పములను అతనియందే విశ్రమింపచేసి, ఆత్మజ్ఞానముతోను, భగవత్‌జ్ఞానముతోను, ప్రపంచజ్ఞానముతోను, ఇంకను పరిపూర్ణ సమత, పరిపూర్ణభక్తి, నిశ్శేషాత్మసమర్పణముల తోను తపోయజ్ఞముల అధీశ్వరునికి (5-29) ఒక యజ్ఞముగా అతడు కర్మలను జేయవలెను. అతని సంకల్పముతో మన సంకల్పము నేకముగావించి, అతని చేతనతో మనము చేతనులముకాగా, అతడే కర్మను నిర్ణయించి ప్రారంభించును. ఇదియే దివ్య గురువు తన శిష్యునికి జూపిన పరిష్కారము.

15. గీతా మహావాక్యము

గీతయొక్క మహా పరమవచనమును, మహావాక్యమును వెదకి వెలికిదీయవలసిన పనిలేదు; గీతయే తన అంతిమోక్తి యందు, తన గీతము యొక్క పరమ స్వరము నందును దానిని ఉద్ఘోషించును : "సర్వాత్మనా నీ హృదయములోని ఈశ్వరుని శరణుబొందుము : వాని ప్రసాదముచేత నీవు పరమశాంతిని, శాశ్వత పదమును ప్రాపింతువు (18-62). ఇట్లు గుహ్యముకంటెను గుహ్యతరమగు దానిని నీకు వ్యాఖ్యానించితిని (18-63). ఇంకను

విజయము

...... వ్యక్తిత్వమును సంతరించుకొనుట అనునది మొదటి విజయము. ఈ వ్యక్తిత్వమును దైవానికి సమర్పించుకొనడం రెండవ విజయము. ఇక మూడవ విజయము : దైవము ఈ వ్యక్తిత్వమును దివ్యతత్వములోనికి మార్చుట.

ఈ విధంగా మూడు స్థాయిలున్నవి. మొదటిది : ఒక వ్యక్తిత్వమును సంతరించుకొనుట. రెండవది : అది దైవమునకు సమర్పితమగుట, అనగా దైవమునకు సంపూర్ణ సమర్పణ కాగా అది దైవంతో ఏకత్వమును పొందుట. మూడవది : దైవము స్వయంగా ఆ వ్యక్తిత్వమును స్వీకరించి తనంతగా రూపాంతరం చెందించుట. అనగా ఆ వ్యక్తిత్వము దైవము వలెనే అగుట.

సాధారణముగా యోగములన్నియూ, ఈ రెండవ స్థాయిలోనే ఆగిపోతాయి. దైవానికి తనను తాను సంపూర్ణముగా - ఏ మాత్రము మిగలకుండా - సమర్పితము చేసుకొని అతనితో ఏకమగుట తోడనే తమపని పూర్తి అయినదని భావిస్తాయి.

కానీ మనపని అక్కడే ఆరంభమౌతుంది. మనం చెప్పనది ఏమనగా "ఏ దైవముతో మనము ఏకమయ్యామో, ఆ దైవము మనయందు ప్రవేశించి తనంతగా మనల్ని ఉద్ధరించగా, ఆ దివ్యవ్యక్తిత్వంతో మనం దైవ సామ్రాజ్యంలో పనిచేయాలి". దీనినే మనం రూపాంతరీకరణం అంటున్నాము. ఆ విధంగా మనం ముందుకు జరగాలి. జరిగి తీరాలి. అదే జరుగకపోతే మూడవది (రూపాంతరీకరణం) సాధ్యంకాదు. ఎవరూకూడా మొదటి దానినుండి నేరుగా, మూడవ స్థాయికి చేరుకోలేరు. రెండవ స్థాయి ద్వారా వెళ్ళవలసిందే.

- శ్రీమాత

(స్వేచ్ఛానువాదం - కొంగర భాస్కరరావు)

కవర్ పేజీ మీద పుష్పమునకు శ్రీమాత 'విజయము' అని ఆధ్యాత్మిక సంకేతార్థము ఇచ్చినారు.

ప్రకటనలు

పుదుచ్చేరిలో : ఆగస్టునెల 13, 14 తేదీలలో శ్రీఅరవింద సొసైటి బీచ్ ఆఫీసులో ఉపన్యాస పరంపర ఏర్పాటు చేయబడినది.

డా॥ అలోక్‌పాండే శ్రీఅరవిందుల ప్రముఖ గ్రంథములో ఒకదానిపై శ్రీఅరవింద సొసైటి, బీచ్ ఆఫీసులో ఆగస్టు 16నుండి 20వ తేదీవరకు, ప్రతిరోజు సాయంత్రం గం॥ 5.00ల నుండి 5.45 వరకు మరియు గం॥ 6.00ల నుండి గం॥ 6.45 వరకు (మధ్యలో 15 ని॥ విరామం) ప్రసంగించెదరు. అందరూ ఆహ్వానితులే.

సమాచార పత్రము

తిరుపతి (ఆంధ్రప్రదేశ్)

శ్రీఅరవింద విద్యాలయం పదవవార్షికోత్సవం ది. 29 మార్చి 2008న ఘనంగా జరిగింది. శ్రీమతి కె.యశోద (హెడ్ మిస్ట్రెస్) వార్షిక నివేదిక సమర్పించారు. శ్రీ కె. హన్మంతు, శ్రీ బి. వెంకట్రామయ్య ఐ.ఎ.యస్., శ్రీ యస్. రెడ్డి (ముఖ్యఅతిథి) తమ సందేశాలనిచ్చారు. శ్రీమతి వంశీమాధవి (శ్రీమతి డి. సత్యవాణి, గణేష్‌ల పుత్రిక) తన అసమాన భరతనాట్య ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు.

కడలూరు కేంద్రం (తమిళనాడు)

శ్రీఅరవింద సొసైటీకి చెందిన శ్రీయమ్. యన్. సుందర్‌రాజన్ గారిచే ప్రతినెల ఒక ప్రసంగం ఏర్పాటు చేయుచున్నారు. "శ్రీఅరవిందుల వెలుగులో గీత" అను అంశంపై వారు చక్కని ఉపన్యాస పరంపర కొనసాగించుచున్నారు.

బెంగుళూరు (కర్నాటక)

శ్రీమాతారవిందులు చెప్పిన ముఖ్య విషయాలను గురించి సంక్షిప్తంగా వివరించే రెండు చిన్న పుస్తకాలను శ్రీఅరవిందో కాంప్లెక్స్ ట్రస్ట్ వారు రిలీజు చేసారు. ఇవి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని వారికి ఉద్దేశించబడినవి. ఇవి గాక 29 ఫిబ్రవరి 2008న 'అతిమానస ఆవిష్కరణ' అన్న అంశంపై మరో పుస్తకమును గూడా ఆవిష్కరించారు.

ఢిల్లీ బ్రాంచి

శ్రీమాత జన్మదినాన 21 ఫిబ్రవరి 2008న స్కూలు బాలబాలికలకు ఒక డ్రాయింగ్ కాంపిటేషన్ నిర్వహించారు. అప్పటికపుడు ఏ అంశాల మీద చిత్రాలు వేయాల్సింది చెప్పారు. అవి. ప్రేమ, పృథ్వీ, నాస్వప్నం నవకృతి ప్రిన్సిపాల్ శ్రీమతి నందితాబోస్ ఆయా అంశాలను గురించి పిల్లలకు వివరించి వారిలోని సృజనాత్మక శక్తిని వెలికి తీసుకురావడంలో సాయపడినారు. భారతీలను సంస్కృతి" అను విషయంపై ఒక సదస్సును నిర్వహించారు.

Rs. 15 /-



అఖిల

అఖిల భారత పత్రిక - జూలై 2008



శ్రీమాతారవిందుల వాక్కులు



శ్రీఅరవిందులు

దివ్యానందమంటే

ఇంతకీ దివ్యానందమంటే ఏమిటి? బుద్ధి మాత్రం ఇందులో ఒక ఆహ్లాదకరమైన మానసిక స్థితిని తప్పించి వేరే ఏమీ చూడలేదు. కాని ఇది ఇంతమాత్రమే అయితే భక్తులు, తాత్వికులు పొందే పారవశ్యం ఇది కాదు. నీకు దివ్యానందం కలగటమంటే దైవం నీలో ప్రవేశించటమే. దివ్య ప్రశాంతత నీలో పొంగినపుడు దైవమే నిన్ను ఆక్రమించినట్లుంటుంది. దివ్యకాంతి నిన్ను ముంచెత్తినపుడు, దైవమే వరదలా నిన్ను చుట్టుముట్టినట్లు అవుతుంది. అయితే దైవమంటే ఇంతమాత్రమే కాదు. ఇంకా ఇంతకు మించి మరి ఎన్నెన్నో ఉన్నాయి. వీటన్నిటా ఒక దివ్యసాక్షాత్కారము, ఒకదివ్య సత్వము ఒక దివ్యరూపము ఉంటుంది. కృష్ణుడు, శివుడు, మహత్తరమైన శ్రీమాత దైవములే. కాకపోతే, ఆనందమయ కృష్ణుడు దివ్యానందంగా, అనుభూతమవుతాడు. దివ్యానందము కృష్ణుని సూక్ష్మశరీరము, సత్వము. దివ్యశాంతిలో శాంతిమయ శివుని గ్రహిస్తావు. దివ్యజ్ఞాన ప్రబోధంలో, దివ్యప్రేమలో, దివ్యసాఫల్యతలో ఉద్ధరణలో దివ్యమాత సాక్షాత్కారాన్ని పొందగలుగుతావు.

నిరానంద భగవంతుడు అనే భావం The Idea of Joyless God బుద్ధి యొక్క అజ్ఞానంవల్ల పుడుతుంది. రాధ ప్రేమ అలాంటి దానిమీద ఆధారపడినదికాదు. దైవాన్ని అన్వేషించే మార్గంలో బేధం, మోదం, విరహము, కలయిక ఏవి అడ్డం వచ్చినా, కష్టాలు ఎంతకాలం ఉన్నా, రాధ ప్రేమ చెక్కుచెదరదు. విశ్వాసం, నిశ్చయం, దివ్యప్రేమ సర్వోన్నత లక్ష్యంగా, కాంతితో వెలిగే నక్షత్రంలా, మార్గనిర్దేశం కావిస్తూంటుంది.

- శ్రీఅరవిందులు

(ఒక శిష్యునికి వ్రాసిన ఉత్తరం, నుంచి)

అనువాదం : త్రివేణి

సత్, చిత్, ఆనందం అంటే?

మామూలుగా మనలోని మూడు అంశాలను గూర్చే మనకు తెలుస్తుంది. అవి మనస్సు, ప్రాణం, శరీరం. కానీ వీటికి వెనుక ప్రక్క అతిచేతన అస్తిత్వమున్నది. దానిక్కూడా మూడు సంవిధాన శక్తులు ఉంటాయి. అవి: సత్, చిత్-తపస్సు, ఆనందం.

<u>సత్:</u> అంటే మన ఉనికికి మూలమైన సారతత్త్వం. అది విశుద్ధమైన అనంతత్త్వం, అవిభాజ్యం. ఈ పాంచభౌతిక పదార్థంతో తయారై నిరంతరం మారిపోతూ విభజన శీలమైన ఈ బాహ్యాభౌతిక వ్యక్తిత్వానికి అది భిన్నంగా ఉంటుంది. ఈ 'సత్' ఈ భౌతిక పదార్థానికి ఖచ్చితంగా దైవీ సంభూతమైన ప్రతిరూపం.

<u>చిత్ - తపస్సు</u> విశుద్ధమైన, దివ్యచైతన్య శక్తి. ఈ చిత్-శక్తి జీవన కార్యకలాపాలలోనూ, విరామ స్థితులలోను స్వతంత్రంగా వర్తిస్తుంది. సర్వ స్వతంత్ర ఇచ్ఛా సంకల్పంతో వర్తిస్తుంది. జీవనాధారమైన భౌతిక పదార్థంపై ఆధారపడుతూ ఒక నియమిత పోషణ పరిధికి లోబడి మెరుపు వేగంతో పనిచేసే సంక్లిష్టమై ప్రాణశక్తులకు ఈచిత్‌శక్తి[1] భిన్నమైనది! 'తపస్' ఈ నిమ్న ఉద్రేక పూరితమైన ప్రాణిక శక్తికి దైవీ ప్రతిరూపం.

<u>ఆనందం</u>: అంటే దివ్యానందం. విశుద్ధమైన చైతన్య అస్తిత్వం, మరియు శక్తి . ఇది ప్రాణిక, భౌతికాల సానుకూల, ప్రతికూల ప్రతిస్పందనలకూ, సుఖదుఃఖాలకూ, ప్రాణికభౌతికాల బాహ్య స్పర్శలు ప్రసాదించే ఉప్పొంగులూ, ఆవేశాలతో నిండిన జీవనస్థితికీ వ్యతిరేకమైనది. నిమ్న భావోద్రేకాలూ, ఇంద్రియ సంబంధమైన వ్యక్తి బాహ్య ప్రకృతికి పూర్తిగా భిన్నమైన 'దివ్య' ప్రతిరూపం ఈ 'ఆనందం'.

వ్యక్తిలోని ఈ ఉన్నత అస్తిత్వమే దివ్య సచ్చిదానందానికి స్వంత ఇల్లు. ఈ అస్తిత్వం ఏకీకృతమైనది. సమగ్రమైనది. ఇది 'స్వయం ఆధారిత అస్తిత్వం'. ఇది జనన మరణాలకు లోబడి భ్రమపడదు. కాబట్టి ఇది 'అమర' మని అమృతమయమని చెప్పబడుతుంది. ఇదే మనం సాధించవలసిన లక్ష్యంగా మన కందించబడింది. ఎప్పుడు మనమీ మృత్యుస్థితిని అధిగమించ గలమో అప్పడీ అమృతానందం అనుభవంలోనికి వస్తుంది.

- శ్రీఅరవిందులు — అనువాదం : హర్షవర్ధన్

---

[1]కాబట్టి ఉపనిషత్తుల్లో 'అన్నమ్' భౌతిక సారపదార్థంగా పిలువబడింది. దీనిమూలంలో 'అన్న' మనే పదం జీవమని, సారపదార్థమనే అర్థంలో తీసుకోబడుతుంటి. (ఈశోపనిషత్తు వ్యాఖ్యానాల నుండి)

నిజమైన ఆనందమేది?

ప్రారంభ దశలో జీవితాన్ని గూర్చి, భౌతిక శక్తుల గూర్చి మనిషి మానసికంగా నిమగ్నమై ఉండటం సరైన విషయం మాత్రమేకాదు, అవసరమైన విషయం కూడ . ఎందుకంటే అతని జ్ఞానేంద్రియాలు, మనస్సు, అతని కొసగే భౌతిక జగత్తును గూర్చిన సమాచారమును, దానిపట్ల అతని అనుభవాన్ని అతడు తన తెలివితో విశ్లేషించవలసి యుండుట అతని తొలి అడుగవుతుంది. మనం అక్కడితోటే ఆగిపోతే ఎలాంటి అభివృద్ధిని సాధించలేని వారమవుతాం. ఉన్నచోటనే వుండిపోయిన వాళ్ళ మవుతాం. మనసంచారానికి అవసరమైన కనీస భౌతిక అవసరాలను సమకూర్చుకొన్న వారమవుతాం. భౌతిక జగత్తుకు సంబంధించిన విషయ జ్ఞానాన్ని స్థిరపరచుకొనుటకై మరింత యెక్కువ మనో శక్తిని పొందగల్గిన వారమవుతాం. భౌతిక శక్తుల సామూహిక త్రొక్కిసలాటలో మన కోర్కెలను ముందుకు సాగించుకొని పోవుటకు అపాయకర ఆధిపత్యాన్ని పొందిన వారమవుతాం. సూర్యమండలాన్ని కౌగిలించుకోగల్గినంత, సముద్రపు అగాధపుటంచులను, భౌతిక సూక్ష్మశక్తులను కనుగొనగలినంత భౌతిక విజ్ఞానాన్ని పొందగల్గినా, ఆ విజ్ఞానం ద్వారా మనం ప్రధానంగా పొందవలసిన ప్రయోజనాన్ని పొందలేము. అందువల్లనే భౌతిక విజ్ఞానశాస్త్రం అద్భుత విజయాలే సాధించినా చివరకు నిరుపయోగమైనవిగా ఋజువయింది. విజ్ఞాన శాస్త్రఫలితాలు యెన్నిసౌకర్యాలు సమకూర్చినా, మానవాళికి ఆనందాన్ని, పరిపూర్ణతను సాధించి యివ్వలేవు. నిజమైన ఆనందం, నిజమైన పరిపూర్ణ సాధనలోవుంది. అనగా అది మన మనుగడపై సంపూర్ణ విజయము, మన బాహ్యాంతర జీవితాలపై ఆధిపత్యము, మన బాహ్యాంతర ప్రకృతులపై ఆధిపత్యములతో కూడి వుంటుంది. మనకు పరిపూర్ణత, మనం ప్రారంభించిన భూమిక యొక్క విస్తృత వలయాల పరిజ్ఞానాన్ని వర్ణించడం వల్లగాక, దానికి అతీతంగా అధిగమించడం వల్లనే సాధ్యమవుతుంది. ఈ కారణంవల్లనే జీవితంలో ప్రాథమిక పునాది తర్వాత, మనం మన చేతనా శక్తిని ఉన్నత పరచాలి. లోలోపలికే గొంపోవాలి, విస్తృత పరచాలి, సూక్ష్మగ్రహణ శక్తిని పొందగలిగేలా ఉంచాలి.

★ ★ ★

సంతోషం దివ్య ఆనందం అవదు. అది దివ్యానందాన్ని పొందుటకై చేసే ప్రయత్నం మాత్రమే. ఆ ప్రయత్నం ఆనందాన్ని చేకూర్చక పోగా మళ్ళీ బాధలోనికే లాక్కుపోతుంది. కనుక సంతోషం శాశ్వత దివ్యానంద స్థితికానేరదు. దాని స్వభావంలో అది క్షణభంగురం. బాధ ఆనందం కాదు. దానిలో అనుకూలమైనది, యదార్థమైనది, అవసరమైనది ఏదీ లేదు. అది వ్యతిరేక గుణాన్ని మాత్రమే కలిగివున్నది. అది కొన్ని సంబంధాల ఆధారంగా ఆనందాన్ని ఆశించుటకు ప్రయత్నించి శక్తిహీనమైపోయింది. అదే మన చేతనలో అలవాటుగా తయారైంది. ఆ అలవాటే మనలో లోతున నాటుకొని పోయి మనల్ని మోసగిస్తుంది. తాత్కాలిక సంతోషం నుండి మనం అధిగమించి, దాని పర్యవసానమైన బాధను తొలగించుకొనవచ్చు.

కనుక సంతోషం అంతిమ పర్యవసానం కాదు. జీవితాశయమూ కానేరదు. ఎందుకంటే జీవిత ధ్యేయం ఆనందం. దివ్యానందం తన స్వభావంలో స్వేచ్ఛా పూరితమైనది, అనంతమైనది. మనం సంతోషాన్నే జీవితాశయంగా చేసికొంటే, అపుడు బాధను కూడ జీవిత నిబంధనగా చేసికొనవలసి వస్తుంది. సంతోషం బాధ ఈరెండూ కలిసే సాగిపోతాయి. అవి విడదీయరాని సహచరులు, మీరు దారిలో ఒకరిని జీవిత సహచరునిగ చేసికొనకుండ, మరొకరిని ప్రాణస్నేహితునిగ చేసికొనలేరు. అయిర్వురు భార్యాభర్తలు. వారు నిరంతరం పోట్లాడుకొంటూనే వున్నా, విడాకులకు అంగీకరించరు.

కానీ బాధ జీవితానికి ఆవశ్యకమైన నిబంధన కాదు. బౌద్ధులు ప్రవచించినట్లు ఇంద్రియసుఖ రాహిత్యం బ్రహ్మానందానికి అనివార్యం కాదు.

మూలము : శ్రీఅరవిందులు అనువాదం : బి. నరసింహయ్య

సాధకులకు మార్గనిర్దేశం

మనలో ఒక మాధుర్యం, ఒక ఆనంద భావన పెరగనివ్వాలి. ఆత్మ సాన్నిధ్యానికి, చైత్యపురుషుడు మేల్కొని వున్నట్లు, మనతో సంబంధం కలిగి వున్నదని అనడానికి అవే ప్రబల సంకేతాలు. ఆలోచనలలో కాని, మాటలలోకాని, చర్యలలో కాన వచ్చే తప్పిదాలు

మనమనసులను కల్లోల పర్చకుండా చూసుకోవాలి. వాటిని అనవసరమైన వాటిగా తోసిపడెయ్యాలి. భగవత్‌శక్తి, భగవత్ దీప్తి వాటిని తొలగించి వేస్తాయి. ఒకే ఒక కేంద్ర బిందువును పట్టుకుని వుండాలి. అదే ఆత్మ, అది తనతో పాటు ఈ ఉన్నత వాస్తవాలను అందిస్తుంది.

★ ★ ★

యోగాన్ని అభ్యసించేటప్పుడు, ఎప్పుడూ ముభావంగా, గంభీరవదనంతో ఉండనవసరం లేదు. కాని యోగాభ్యాసాన్ని మాత్రం గంభీరంగా, నిశ్శబ్దంగా చేపట్టాలి. అది ముఖ్యం. అంతర్గత ఏకాగ్రత ఇంకా ముఖ్యం. మన మనస్సును, చైతన్యాన్ని అంతర్ముఖం చేసి, అక్కడి దైవాన్ని చేరుకోవాలన్నది లక్ష్యమైతే, సమయమంతా బహిర్ముఖంగానే గడపకూడదు. అయితే అంతమాత్రాన గంభీరంగా వుంటూ, ఎప్పడూ వళ్ళంతా చీకటిని, నైరాశ్యాన్ని పులుముకుని తిరగాలని అర్థంకాదు.

★ ★ ★

హాస్యమన్నది సుఖానికి క్రియాశీలక పార్శ్వం. అంతరంగంలో ఎల్లప్పడూ నవ్వుతూ, సంతోషంగా వుండాలి. ఆ క్రియాశీలక అంతరంగిక స్థితిని మానసికమైన, భౌతికమైన చేదు అనుభవాలు సంక్షుభితం చేయలేవు. ఆ పరిపూర్ణత్వం సమతాసిద్ధిపై భగవంతుని ఆమోద ముద్రగా భావించాలి. మన అంతరాత్మబృందావనంలో క్రీడిస్తున్న బాలవత్ శ్రీకృష్ణుని, ప్రతిబింబం అది. ఆయన చిరంతన బాలకుడు, కుమారుడు. ప్రపంచవనాంతరాలతో నిత్యబాల కృష్ణుడు.

★ ★ ★

ప్రపంచం ఆనందంలో ఆనందం వల్లనే జీవిస్తుంది. మనం ఆనందం నుండి పుట్టాము, ఆనందంవల్లనే జీవిస్తాం. ఆనందంలోకే తిరిగివెళ్ళిపోతామని వేదాలు ఉద్ఘోషిస్తున్నాయి. మన భౌతిక శరీరాలకు సూక్ష్మకాంతి వలయాలు ఆవరించినట్లు, మన అస్తిత్వాన్ని ఆవరించే ఈ ఆనంద సుధామయ స్వర్గం లేకపోతే, ఏ మనిషికి ఉఛ్వాస, నిశ్వాసాల శక్తి ఉండబోదు. ఆ ఆనంద అమృతధారలే మనల్ని పరిపోషిస్తున్నాయి. శక్తినిస్తున్నాయి. మన జీవన కార్యకలాపాలకు ఆధారభూతంగా వున్నాయి. ఈ ప్రపంచం ప్రధానంగా

ఆనందమయ ప్రపంచం, ఇది ప్రాచీన వేదాంత దర్శనం. వేద ద్రష్ట దృష్టి. బౌద్ధమతం ప్రబోధించే విశ్వవేదన, మాయావాదం ప్రవచించే ప్రపంచ భ్రాంతికన్నా హిందూమతం తొలిశక్తి సంపన్న దశలో విభిన్నమైనదని చెప్పేభావన అదే. కాని ఈ ఆనంద శిఖరాలనుండి పతనమవడం సంభవమే. అపరాప్రకృతిలో, నిమ్న ప్రకృతిలో ఆ ఆనందం సిద్ధించదు. ఆ ఆనందాన్ని బలవంతంగా పొందలేము. మనిషికి ఆనందం పూర్ణంగా సిద్ధించాలంటే రెండు విషయాలు అవసరం, అతనికి పరిపూర్ణ అస్తిత్వం, పరిపూర్ణ జ్ఞానం కావాలి. వాటి సంయోగం సకల అభివ్యక్త రూపాలలో అతని శక్తిని వీర్యం, బలం, తేజస్సు, ఓజస్సును సృష్టించాలి.

ఆనందం, సత్, చిత్ ఇవి మూడూ ఒక సత్యాన్ని రూపకల్పన చేస్తాయి. చిత్ అనేది బాహ్య కార్యరూపంలో ఒక నిర్మల శక్తి. దీనికే ఋషులు తపస్సు అని పేరుపెట్టారు. అస్తిత్వం పరిపూర్ణత్వం పైన, వెలుగు, శక్తిపైన ఆధారపడిన పూర్ణ ఆనందాన్ని భూమిపైనే పొందడం మానవుని సమిష్టి ప్రయత్నం. మానవుని ప్రయాణం అదే. ఈ భూమిపై తనలో, లోకాతీతంగా ఆ ఆనందాన్ని పొందడం నిరంతరం మానవుని ప్రయత్నం. అదే మానవతీరం. ఎక్కడైతే అతనిలోని జ్ఞానం తనలో ఆ ఆనందాన్ని కైవసం చేసుకోగలనని భావిస్తుందో, అక్కడ తన స్వర్గాన్ని స్థాపిస్తుంది. అదే వైకుంఠం, గోలోకం, నిర్వాణం, సురలోకం.

- శ్రీఅరవిందులు

అనువాదం : కె. యజ్ఞన్న

ఆధ్యాత్మిక సిద్ధాంత పర్యవేక్షణతో సాగే భారతీయ పునరుద్ధరణ

ఈ ఆదర్శ పాలనను భారతదేశం ముందు లక్ష్యంగా నిలిపి నందువల్ల మనం దానిని క్రియాశీలమైన, ఆచరణాత్మకమైన జీవన విధానం నుండి దూరంగా, తాత్త్విక చింతన వైపుకు తీసుకుపోతు న్నామేమో అనే సందేహం మనకు కలుగవచ్చు. హేతుబద్ధంకాని, మతపరమైన ఏదో ప్రగతి నిరోధక, ప్రతికూల సిద్ధాంతాన్ని నూరిపోస్తున్నామనే సందేహం మనకు రావచ్చు. ఆధునిక ప్రపంచ ఆటుపోట్లను తట్టుకొని భారతదేశం మనుగడ సాగించడాని కనువైనరీతిగా, ఒక సమర్థవంతమై, సువ్యవస్థిత జాతిగా అది

నిలబడాలంటే, తప్పని సరిగా అనుసరించవలసిన, హేతుబుద్ధి, ఆధునిక మార్గాలనుండి దానిని పెడదారి పట్టిస్తున్నామేమో అనే సందేహం కూడా మనకు రావచ్చు.

అందుచేత ముందుగా, అసలు ఆధ్యాత్మికత సూత్రాన్నాధారం చేసుకొన్న నియంత్రణతో జరిగే పునరుద్ధరణ అంటే ఏమిటో స్పష్టం చేయడానికి మనం ప్రయత్నిద్దాం.

మన ఉద్దేశ్యం ప్రకారం ఈ ఆదర్శం కానిదేమిటో ముందుగా చూద్దాం. ఈ భౌతిక జీవనాన్ని ఒక అనిత్యమైన మిథ్యగా భారతదేశం తలచడం లేదనేది సుస్పష్టం. వీలైనంత వేగంగా మనమంతా మఠం సన్యాసులుగా తయారవ్వాలని ప్రయత్నించడమూగాదు. సన్యాసా శ్రమాల్లోనికి లేదా కొండ గుహల్లోనికి, లేదా పర్వతాగ్రాలకు మనల్ని తీసుకుపోయే విధంగా గాని ఏవిధమైన గొప్ప పురోభివృద్ధిలేని, ఆదర్శాలు లేని నిష్క్రియ జీవితంగా, మన సామాజిక జీవనాన్ని మలచడంగాని కాదు. కేవలం భువికిగాని, మానవజాతి సాముదాయక పురోగతికి గాని సంబంధంలేని ఏదో లక్ష్యం వైపుసాగే జీవితంగా తయారు చేయడం గాని కాదు. ఒకానొకపుడు కొంత కాలంపాటు భారతీయ మానసిక దృక్పథం అలావుండి వుండవచ్చు, కాని అదే దాని శాశ్వత ధోరణిగా, మొత్తం ధోరణిగా ఎప్పుడూలేదు. ఏదో ఒక ప్రత్యేక మతానికి సంబంధించిన సిద్ధాంతాలకు, కట్టుబాట్లకు అనుగుణంగా, మొత్తం జాతిరూపాన్నే మార్చివేయడంగాదు, ఆధ్యాత్మికత అంటే. అలాచేయాలని గతంలోని సంఘాలు తరచుగా ప్రయత్నించాయి. అదొక మానసిక అలవాటుగా మారి, దానితో జీవించడం వల్ల చాలామంది మనస్సుల్లో ఇప్పటికీ ఆ భావం కొనసాగుతోంది. అలా జరగాలని అనుకొన్నప్పటికీ, అత్యంత వైవిధ్యభరితమైన అనేక మతాభిప్రాయాలున్న మనదేశంలో, విశిష్టమైన ప్రత్యేకతలుగల హిందూ, ఇస్లాం, క్రిస్టియన్ మతాలకు-మళ్ళీ వాటిల్లోంచి అసంఖ్యాకంగా ఉత్పన్నమైన ప్రత్యేక రూపాలకు కూడా ఆశ్రయమిస్తున్న భారతదేశంలో అటువంటి ప్రయత్నం ఈ కాలంలో అసాధ్యం అనేది స్పష్టం.

ఆధ్యాత్మికత అంటే ఏప్రత్యేక మతానికీ పరిమితంగాని, చాలా విశాలమైన జీవన విధానం. ఇప్పడు ఆధ్యాత్మికత రూపంలో మనపై

క్రమ్ముకొంటున్న విశాల భావాలతో పోల్చిచూస్తే, ఎంతో గొప్పదనుకొన్న మతంకూడా ఒక పెద్ద తెగగానో, లేదా ఒక విశ్వజనీన మతం యొక్క ఒక శాఖగానో కన్పిస్తుంది.

శాశ్వతుని కోసం, దైవం కోసం, ఏదో ఒక రకమైన సమత కోసం, మానవ విలువల్ని దాదాపు శాశ్వతమైన, దివ్యమైన విలువలుగా కొంత వరకైనా మార్చాలని భవిష్య మానవుని అన్వేషణ జరుగుతుందని దీనిని బట్టి మనం అర్థం చేసుకోవాలి.

మన పరిధి నుండి దేనినీ మినహాయించాలనే ఉద్దేశ్యం ఎంత మాత్రమూ కాదు. మానవ జీవనం యొక్క మహోన్నత లక్ష్యాలను కాని, మన ఆధునిక ప్రపంచం యొక్క విషమ సమస్యలను కాని, వేటినీ ప్రక్కన పెట్టాలనేది మన ఉద్దేశ్యంగాదు. ప్రతి మానవ కార్యకలాపమూ, పురోభివృద్ధి చెందాలనీ, విశాలంకావాలనీ, ఉత్సాహానందాలను, వెలుగును, శక్తిని పొందాలనీ, పరిపూర్ణతను సాధించాలనేదే మన ఉద్దేశ్యం. మానవాంతరాత్మకుగల తృష్ణకు సంబంధించిన, సహజ వనరులుగా ఉన్న ఏ సర్వసామాన్య, లేదా ఆంతరిక ప్రేరణలలో దేన్నీ త్రోసివేయాలనేది మన ఉద్దేశ్యంగాదు. మనిషి అంటే మనస్సులేని ఆత్మ, దేహాన్ని కాదనే ఆత్మ కావాలనుకొనే వాడుగాదు. అందుచేత మానవత్వంతో కూడిన ఆధ్యాత్మికత మనస్సును, జీవితాన్ని, దేహాన్ని కించపరచగూడదు లేదా అలక్ష్యం చేయగూడదు, పైగా వాటి కత్యంత ప్రాధాన్యతనివ్వాలి, అలా భారతదేశం యిచ్చింది. ఖచ్చితంగా చెప్పాలంటే ప్రతి వ్యక్తి యొక్క మనస్సు, జీవితం, దేహం, అప్రత్యేక మనిషిలోని ఆత్మజీవించడానికి ప్రత్యేకించి ఇవ్వబడిన పరిస్థితులు, ఉపకరణాలు. పాత హెల్లెనిక్ సంస్కృతికి సంబంధించిన భావంలాగా, లేదా ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన భావంలాగా, ప్రాచీన భారతీయ సంస్కృతి వేరే లక్ష్యంతో ఒక గొప్ప ఉద్దేశ్యంతో మనస్సు, జీవితం, దేహాల పూర్ణ ఆరోగ్యానికి, అభివృద్ధికి, దృఢత్వానికి ఎంతో విలువనిచ్చింది. ఈ విషయాలను ఆరోగ్యకర విధానాల్లో సుసంపన్నం చేసేందుకు ఉపయోగపడే ప్రతిదాని స్వేచ్ఛావర్తనానికి భారతీయ సంస్కృతి అవకాశమిచ్చింది. సౌందర్యోపాసకునికి సంతృప్తి కలిగే

విధంగా గొప్పవిగానీ, చిన్నవిగానీ, అనేకమైన కళలన్నింటికీ స్వేచ్ఛగా వికసించే అవకాశం యిచ్చింది. ఆరోగ్యవంతమైన, దృఢమైన, భౌతికంగా మరియు ఆర్థికంగా పరిపుష్టమైన, సుఖ సంపదలతో తులతూగే జాతిగా స్వేచ్ఛగా అభివృద్ధిచెందే అవకాశం కల్పించింది - మనల్ని కొందరు నమ్మించాలని చూస్తున్న విధంగా పేదరికాన్ని జాతి ఆదర్శంగా, భారతదేశం ఏ నాడూ అంగీకరించలేదు. అంతేగాదు లేమి, దుర్భరదారిద్ర్యం అనేవి ఆమె ఆధ్యాత్మికతకు తప్పనిసరి అని ఏనాడూ భారతదేశం అంగీకరించలేదు - జాతికి కావలసిన సాధారణ సైన్యం తయారుగావడానికి, రాజకీయంగా మరియు సాంఘికంగా బలపడడానికి, సమర్థవంతంగా తయారుగావడానికి కూడా భారతీయ ఆధ్యాత్మికత స్వేచ్ఛనిచ్చింది. అందుకోవాలనుకున్న లక్ష్యం మహోన్నతమైన దైనప్పటికీ, ఆలక్ష్యాన్ని ప్రతిష్ఠించాలనుకొన్న పీఠం కూడా చాలా స్థిరమైనదిగా, విశాలమైనదిగా భారతీయ ఆధ్యాత్మికత తయారు చేసింది. ఈ రెండూ-చేరుకోవాలనుకొన్న లక్ష్యం, ఆలక్ష్యాన్ని సాధించి ప్రతిష్ఠించాలనుకొన్న భువిపై జీవితం-ప్రాధమిక ఉపకరణాల మీద భారతజాతి, దాని సంస్కృతి, దాని ఆధ్యాత్మికత చూపిన ఆసక్తి, శ్రద్ధ అమోఘ౦. నవీన భారతదేశం కూడా అదే గమ్యాన్ని తాజాగా లభించే విశాలమైన భావాల యొక్క బలమైన ప్రేరణతో, మరింత సంక్లిష్టమైన పరిస్థితులకు తగిన సాధన సంపత్తితో చేరుకొన కాంక్షిస్తుంది, తప్పదు. కాని ఆమె కార్యాచరణకు సంబంధించిన కృషి పరిధి, మరియు ఆమె మనస్సు యొక్క సున్నితత్వం, బహుముఖ ప్రజ్ఞ ప్రాచీనమైన దానికంటె, అల్పమైనవిగా గాకుండా, మరింత మహనీయమైనవై వుండాలి. అన్నింటినుండి విడిపోయి, ప్రత్యేకమైపోయి జీవించడంగాదు ఆధ్యాత్మిక జీవనమంటే. దాని సంపూర్ణ స్థాయిలో, అది సర్వాన్ని తనలో విలీనం చేసుకోగలగాలి, విలీనం చేసుకొంటుంది.

ఇదంతా జరిగినప్పటికీ సృష్టిని గురించిన మానసిక మరియు కేవల భౌతిక దృక్పథానికి, ఆధ్యాత్మిక దృక్పథానికి మధ్య చాలా గొప్ప వ్యత్యాసం ఉంటుంది.

- శ్రీఅరవిందులు

అనువాదం : కె.వి. రావు

దివ్యానందానికి మార్గం

కృష్ణుడు అంతఃస్థదైవం. "ఇందుగలడందులేడని సందేహము వలదు. చక్రిసర్వోపగతుండు". ఆయన పరమోన్నత దివ్యప్రేమ. సర్వోన్నత దివ్యానంద సందర్శనమూ ఆయనే. కోమల మందహాసం, లీలావినోది. ఆయనే ఆట. ఆటగాడూ, ఆడించేదీ అయనే. తోటి ఆటగాళ్ళతో సహా సర్వమూ ఆయనే. క్రీడ, క్రీడాఫలితాలు ముందే ఇచ్ఛగించబడినవే, భావింపబడినవే, మరియు, వ్యవస్థీకరింప బడినవే. అంతా ముందుగా తెలియబడినదే. ఆట కూడా అంతా సచ్చైతన్యంగా కొనసాగింపబడేదే. కాబట్టి అక్కడ క్రీడావినోదానికి మాత్రమే తప్ప మరిక దేనికీ తావులేదు. కృష్ణదర్శనము అంతరంగ దైవదర్శనము. కృష్ణునితో క్రీడించటమంటే అంతరంగ దైవంతో తాదాత్మ్యత పొందటమే. వారి చైతన్యంలో భాగస్వామ్యం కలిగి ఉండటమే. ఈ స్థితి నీవు సాధించిననాడు వెంటనే నీవు దివ్యలీలా వైభోగంలో ప్రవేశిస్తావు. నీ తాదాత్మ్యతా పరిపూర్ణతతో బాటుగానే, నీ స్థితీ ఉంటుంది.

అయితే నీ చేతనలో ఏ మూలనైనా ఏకాన్తంత, సాధారణ సంవేదన, తెలివి, స్ఫూర్తి దాచిఉంచినా అపుడు నీవు ఇతరుల బాధలను వ్యధలను దర్శిస్తావు. ఇంతవేదన కలుగచేసే వినోదం చాలా క్రూరమైనదనుకుంటావు. అలాటి లీలావినోదాన్ని పొందే భగవంతుడు తప్పనిసరిగా భయంకరమైన వ్యధను కలిగించేవాడు అనే నిర్ణయానికి వస్తావు. కాని అలాకాక దైవంతో తాదాత్మ్యతాభావాన్ని పొందావో, ఆయన తన క్రీడావినోదంలో ఎంత అమితమైన అద్భుతమైన అనురాగాన్ని కుమ్మరిస్తాడో విస్మరించలేవు. నీ పరిమితదృష్టి నిన్ను అలా తీర్మానించుకునేటట్లు చేస్తుందని గ్రహిస్తావు. ఇంకా, ఆయన కావాలని బాధపెట్టేవాడు కాదని, ప్రపంచానికి మనుష్యులకు మార్గనిర్దేశం చేసి మేలుచేసే గొప్ప దివ్యప్రేమైక మూర్తిగా తెలుసుకుంటావు. పరిపూర్ణత దిశగా సుగమమైన దగ్గర దారిలో నడిపించే వానిగా తెలుసుకుంటావు. ఎప్పుడూ పరిపూర్ణత అనేది relative term. అంటే ఇపుడున్న పరిస్థితికి మించి అతిశయించి ఇంకా ముందుకుసాగే పరిస్థితి ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది.

కాని ఎప్పుడో ఒక సమయం రాకపోదు. అపుడు (ఆధ్యాత్మిక) అభివృద్ధికి ప్రేరణగా పైకి అగుపించే బాధవ్యధ అవసరం ఉండదు. అభివృద్ధి దివ్య ఆనంద సామరస్యాలలో సాధింపబడుతుంది.

నిజమైన తరగని ఆనందానికి ఒకే ఒక మార్గం, దైవకృపపై పరిపూర్ణ సమగ్రవిశ్వాసం.

ఆనందంగా ప్రశాంతంగా ఉండటానికి అత్యుత్తమమైన మార్గం దైవంపట్ల లోతైన తీవ్రమైన స్థిరమైన కృతజ్ఞతాభావం కలిగి ఉండటమే. దైవంతో తాదాత్మ్యతా భావం కలిగి ఉండటం ద్వారా దైవానికి నీ కృతజ్ఞతను వ్యక్తం చేస్తావు.

ఓయీ ప్రభూ! నీయిచ్ఛయే నెరవేరనీ - నెరవేరనీ సమగ్రంగా. ఇదే నా ఆనందము, నాశాసనము.

మహత్తర ఆనందం, నిర్మల సంతోషం, సుస్థిరప్రశాంతత, నీవైపు మరలి నీతో సమైక్యమై నీలో ఉంటూ నీకొరకే మనుగడ సాగించడంలోనే ఉంది. అంటే అది అనంతత్వంలో జీవనం. శాశ్వతత్వంలోకి రెక్కలు కట్టుకునిపోవటం. ఈ వరాలంటే భయపడినట్లుగా వీటి నుంచి మనుష్యులు ఎందుకు భయపడి పారిపోతారు? బాధకంతటికీ మూలమైన అజ్ఞానం ఎంత విచిత్రమైనది! సంతోషం నుంచి దూరంచేసి కష్టాలతో రూపొందించిన వ్యధాపూరిత సాధారణ జీవనానికి కట్టిపడేసే అస్పష్టత (obscurity) ఎంత దుఃఖ దాయకమైనది!

- శ్రీమాత

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

(ఆరోగ్యము-చికిత్స) వైకల్యం పోగొట్టుకునే విధానము

మనోవ్యాధులకు సంబంధించినంతవరకూ ఎవరైతే స్వస్థత కోరుకొనరో వారికి స్వస్థత చేకూరదు. బహుశా దేహానికి కలిగే అస్వస్థతలు కూడా అంతేనేమో!

(పై రెండు పదాల అర్థాలనూ శ్రీమాత ఇలా వివరిస్తున్నారు :)

మానసిక వ్యాధులంటే అధైర్యం, విముఖత, విషాదము మొదలైన మనోభావాలకు, అనుభూతులకు సంబంధించిన రుగ్మతలు. దైహికరుగ్మతలు శరీరానికి సంబంధించినవి.

క్రుంగిపోకుండా ఉండటం చాలా ముఖ్యము. ఈ క్రుంగిపోవటం అనే వైకల్యం ఒక బలహీనత, ఎక్కడో ఒక దుష్టసంకల్పం, సహాయాన్ని నిరాకరించే బలహీనత బలహీనతతో అలా తృప్తిపడే దౌర్బల్యంవల్ల నిరుత్సాహంగా తయారౌతారు. ఈ అవివేకం ఎంత స్పష్టంగా తెలుస్తుందంటే నీలో ఏదో ఒక చోటు నుంచి ఈవైకల్యం చెడ్డది "అనే మాట నీకు వినిపిస్తున్నట్లుంటుంది. అది నీకు తెలుసు. అయినప్పటికీ ఆ అవివేకం వల్ల " నోర్మూసుకో, నా వైకల్యమే నాకు ఇష్టం అనుకుంటావు. జాగ్రత్తగా పరిశీలిస్తే విషయం నీకు బోధపడుతుంది. ఇది నిజమే కదా? అయినప్పటికీ తర్వాత మళ్లీ అంటావు. "చూద్దాములే, నాకైతే అదే కావాలి. నా కారణాలు నాకున్నాయి". ఇది ఒకరకమైన పెంకితనం. అదే బలహీనత, సత్వములోని బలహీనత. విముఖత్వం.

ఈ వైకల్యాన్ని లేక క్రుంగుబాటును నిరోధించడం ఎలా?

అది చాలా సులభమే. మనోవైకల్యం సాధారణంగా ప్రాణికంలోనే ఏర్పడుతుంది. చైతన్యమంతా ప్రాణికంలో కేంద్రీకరించినపుడు దానికి బలం అధికమవుతుంది. అటువంటప్పుడు చైతన్యాన్ని ప్రాణికస్థాయి నుంచి తొలిగించి ప్రగాఢమైన చైతన్య స్థితిని పొందితే సరిపోతుంది. ఇంకా తేజోవంతమైన ఉన్నత స్థాయిని చేరి ఉత్కృష్ట తలంపులలో నిమగ్నమైతే మాంద్యం తొలిగిపోతుంది. ఆ ఉచ్ఛమైన ఆలోచనా పరిధి చేరినా చాలు. మాంద్యం పటాపంచలవుతుంది. చైత్యపురుష ఆశ్రయం పొందగలుగుతే క్రుంగుబాటు అనే ప్రసక్తే ఉండదు.

బుద్ధి మాంద్యం రెండు కారణాల వల్ల రావచ్చు. ప్రాణికానికి సంతృప్తి లేకపోవటం వల్లగానీ నరాల బడలిక వల్లగానీ కలగవచ్చు. శరీరబడలిక వల్ల బుద్ధి మాంద్యం కలుగుతే అది విశ్రాంతి వల్ల సర్దుకుంటుంది లేదా పూర్తిగాబాగు అయేవరకూ నిద్రలో కలలుకంటూ గడిపేయాలి. ప్రాణిక పరితృప్తి లేకపోవటమనేది తేలికగా

జరుగుతుంది. అటువంటప్పుడు చాలా హేతుబద్ధంగా వ్యవహరించాలి. దానికి గల కారణాన్ని జాగ్రత్తగా వెతికి పట్టుకొని దానిమూలం ఎక్కడున్నదో గ్రహించాలి. అది తన అంతర్గత ఆకాంక్షతో ముడిపడి ఉన్నదో లేక సాదాసీదా అసంతృప్తో తెలుసుకుంటే సరిపోతుంది. సాధారణంగా అంతర్గత ఆకాంక్షకు సంబంధించి ఉండదు. సాదాసీదా అసంతృప్తిని తేలికగానే పోగొట్టి సాధారణ జీవితం గడపవచ్చు. అదికానట్లయితే అంతర్గతంగా లోపలికి చొచ్చుకుంటూ చైత్యపురుషుని సంస్పర్శ పొందాలి. అప్పుడు బుద్ధిమాంద్యం చైత్యపురుష సంసర్గంతో కరిగిపోతుంది.

అయితే ప్రాణిక పరిధిలోని అసంతృప్తితో పోరాటం మాత్రం చాలా కష్టం. కొంతమంది మాత్రమేబాగా పోట్లాడగలరు. నిజం చెప్పాలంటే అది చాలా కష్టం.

నీవు బుద్ధి మాంద్యంలోకి జారుకున్నప్పుడు, నీ చుట్టూ ఆవరించి ఉన్న శక్తి మూలస్థానాన్ని కోల్పోతావు. జడత్వానికిది చక్కటి మార్గమవుతుంది. నీవు తప్పనిసరిగా మనోవైకల్యాన్ని నిరాకరించాలి.

బుద్ధి మాంద్యం తీవ్ర అహంకారానికి గుర్తు. అది ఎప్పుడైనా నీదరి చేరుతున్నదని తెలిస్తే వెంటనే ఇలా అనుకో "అహంకార జాడ్యం నాకు సోకింది. దాన్ని తక్షణం నివారించుకోవాలి".

అందువల్ల నిరాశ, నిస్పృహలు నీ దరిచేరకుండా సర్వదా అప్రమత్తుడవై యుండాలి. అంతేకాక, మందకొడిగా, ఉదాసీనంగా, నిరాశగా ఉండటమనేది బాహ్యసంఘటనల వల్ల జరగేది కాదు. కాగా అది, విశ్వాస రాహిత్యంవల్లనే జరుగుతుంది. తమపై తమకు ఏమాత్రం నమ్మకం ఉన్నా ఎటువంటి గడ్డు పరిస్థితులెదురైనా నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా ఎదుర్కొని నిలువగలరు. చివరి దాకా ధీరునిలాగా పోరాడగలరు. నమ్మకం లేనివారికి ధైర్యమూ, ఓరిమి కూడా ఉండవు.

- శ్రీమాత

అనువాదం - డా. అ మరవాది ప్రభావతి

డా. అమరవాది వెంకటరామశాస్త్రి

సాధనకు చిట్కాలు

మనస్ఫూర్తిగా నీవు దివ్య సత్యము యొక్క ఆధిక్యాన్నే గౌరవించి కోరుకోవాలి. మరొక ఆలోచనకి తావివ్వకూడదు. ఆసాధనలో నీవు ఉన్నతిని సాధించాలంటే నీలో రగిలిన ప్రజ్వరిల్లుతున్న ఆత్మ పరివర్తనా జ్వాలని ఆరిపోనివ్వకూడదు. నువ్వు ముఖ్యంగా గమనించవలసిన విషయం, ఆజ్వాల తీవ్రంగా వున్నప్పుడే నిన్ను ప్రలోభపెట్టే చవకబారు పొగడ్తలని చీదరించుకుంటావు. పొగడ్తలకి పొంగిపోయే గుణం పరిణతి చెందని నిమ్నస్థాయి లక్షణంగా గుర్తించగలవు. ఈ అగ్ని నీ ముందున్న సాధనా మార్గమెంత సుదీర్ఘమయినదో గుర్తించేలా చేస్తుంది. అంతేకాదు ఆ మార్గాన్ని సుగమం చేస్తుంది. ప్రస్తుత సాధన ఎంత అల్పస్థాయిలో వుందో తెలియజేయడంతో పాటు సాధించవలసినది ఎంతవుందో తెలియచేస్తుంది. ఎదుటి వారు నిన్ను ఎంత విచక్షణా రహితంగా భట్రాజు పొగడ్తలతో, ముఖస్తుతులతో ముంచెత్తినా చలించని మనోధైర్యాన్నిస్తుంది. దీనివలన మొదట స్నేహితులుగా భావించిన వారే నీకెంత కీడు చేస్తారో అర్థమవుతుంది. నిన్ను విమర్శించేవారి విమర్శలే నమ్రతతో దివ్య సత్యం దిశగా సాగిపోయే నీతీవ్ర ఆకాంక్షకి సమిధలవుతాయి. ఎవరే మనకున్నా, నువ్వు నిస్పృహచెందడం, నీలక్ష్యం నుండి వైదొలగడం జరగదు. కనీసం నువ్వు వాటిని అతి సులభంగా త్రోసిపుచ్చి ముందుకు పోగలవు. దిగజారని నీ ప్రస్తుత మనఃస్థితికి అదొక అదనపు యోగ్యతాపత్రంగా ఆనందిస్తావు. నిన్ను నీవు అధిగమించి దైవానికి సమర్పించు కోవడంలో అది మరింతగా ప్రేరేపిస్తుంది.

నీ ప్రాణికమైన మార్పుకి మరొక గుర్తించదగిన సంకేతం ఈ అగ్ని ప్రభావం వలన నీకెదురైన కష్టాల్ని, ఆటంకాల్ని చిరునవ్వుతో ఎదుర్కొంటావు. నిలువునా క్రుంగిపోయి, చేసిన తప్పుల్ని, పొరపాట్లని తల్చుకుంటూ యేడుస్తూ కూర్చోవు. ఎందుకంటే అవి చేసినప్పుడు నీకు పరిపక్వత లేదు. ఆ సమయం అటువంటిది. చిరునవ్వుతో నీ నిస్పృహని తరిమేస్తావు. వందలకొద్దీ తప్పులు చేసుండొచ్చు. కాని వాటిని లెక్కచేయవు. చిరునవ్వుతో నువ్వా పొరపాట్లని

తెలుసుకుంటావు. ఇక మీదట ఆ పొరపాటు జరగకూడదు, అని దృఢంగా నిర్ణయించుకుంటావు. ఈ నిస్పృహ, అలసత్వం ఇవన్నీ ప్రతికూల శక్తుల వల్ల సంభవిస్తాయి. నిన్నెంత సంశయంలోకి, విచారంలోకి నెడితే వాటికంత సంతోషం. నిజంచెప్పాలంటే నమ్రత అన్న దొక టైతే నిస్పృహ అందుకు భిన్నమైన వేరొకటి. మొదటిది దైవ ప్రేరితం, రెండోది చీకటి శక్తుల క్రూర వికృతచర్య. అందుచేత నీ కష్టాలన్నింటినీ ఆనందంతో ఎదుర్కో. అపరిమితానందంతో వ్యతిరేకించు. ఏ ఆటంకాలెదురవుతాయో అవే పరివర్తనకి మార్గం సిద్ధం చేస్తాయి శత్రువుని సమూలంగా నాశనం చేసి అతడి మొహంలోకి చూసి నవ్వడమే తగిన శాస్తి. నువ్వుపట్టు విడవకుండా సుదీర్ఘ తీవ్రపోరాటం రోజుల తరబడి చెయ్యవచ్చు. అయినా శత్రువు కూడా వెనక్కి తగ్గక అదే ప్రతాపంతో ఎదురు తిరిగితే భయమేమీ లేదు. అతణ్ణి చూసి వెక్కిరింతగా వొక్కనవ్వు నవ్వుచాలు. అతడు వెనువెంటనే పలాయనం చిత్తగిస్తాడు. పరమాత్మ మీద అచంచల విశ్వాసం, ఆత్మవిశ్వాసంతో కూడిన చిరునవ్వు కొండంత బలాన్నిస్తాయి. అది శత్రువ్యూహాన్ని కకావికలు చేస్తుంది. శత్రుశిబిరంలో వినాశం సృష్టిస్తుంది. నిన్ను విజయవంతంగా నీ లక్ష్యం దిశలో ముందుకి నడిపిస్తుంది.

మూలం : శ్రీమాత

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి

శీలము - దాని రూపాంతరీకరణ

ప్రాణిక విద్యలో రెండవ పార్శ్వం శీలము, దాని రూపాంతరీకరణకు సంబంధించినది. ప్రాణికసత్తను శుద్ధపరచి నియంత్రించటం విషయంలో అన్ని శిక్షణా విధానాలు వత్తిడిని ప్రయోగించటం, బలవంతం చేయటం, వైముఖ్యాన్ని, ఇంద్రియ పరాఙ్ముఖతను కలిగించటంతో ప్రారంభం అవుతాయి. ఈ పద్ధతి నిజంగా సులువైనదీ, త్వరలో ఫలితాలను ఇచ్చేదిగా ఉండవచ్చు. కాని దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగించగలిగే తీవ్రతరమైన, విస్తృతమైన విద్యా విధానంతో పోలిస్తే దీని ప్రయోజనం అంత శాశ్వతమైనది, ప్రగాఢమైనది కాదు. అంతేగాక శిశువులోని ప్రాణిక

శక్తులతో సహజీవనంచేస్తూ, వాటికి సహకరిస్తూ, వాటి కార్యకలాపాల్లో మమేకం అయ్యే అవకాశాన్ని ఈ విద్యావిధానం కలిగించదు. కాని, నిజంగా ఈ విధమైన సహాయం ద్వారానే వ్యక్తి యొక్క అభివృద్ధి, కార్యశీలత పరిపూర్ణత్వాన్ని సంతరించుకో గలుగుతాయి.

వ్యక్తి తనలోని విభిన్న స్పందనలను గమనించగలగటం, ఏది చేస్తున్నాము, ఎందుకు చేస్తున్నాము అనే విషయంపై అవగాహన కలిగియుండటం అవశ్యమైన ప్రారంభస్థితి. శిశువు తన అంతర్గత స్పందనలను, వాటికి గల కారణాలను వాటి ప్రతిచర్యలను గ్రహణశీలత గలిగిన సాక్షిగా దర్శించగల్గటం అతనికి నేర్పాలి. తన కోరికలను, క్షణికోద్రేకాలను, ఆవేశాలను, అదీ, ఇదీ కావాలనే కోరిక స్వప్రయోజనాలను తాను సాక్షిగా మాత్రమే చూడగలగటం అతనికి నేర్పాలి. దీనితో పాటుగా ఈభావాలకు కారణభూతమైన స్వాతిశయం, దర్పం మొదలైన వాటినీ, వీటికి వ్యతిరేకంగా వుండే బలహీనత, నిరుత్సాహం, నిర్వేదం, నిరాశలో సాక్షిగా గమనిస్తూ ఉండగలగటం అతనికి నేర్పాలి.

ఈ ప్రయోజనం చేకూరాలంటే ఆత్మ పరిశీలనతో పాటు పురోగామిత్వ, పరిపూర్ణత్వ భావనలు కూడా శిశువులో అభివృద్ధి చెందాలి. తనదైన ఇచ్ఛాశక్తిని శిశువు పొందగలిగిన ప్రాయంలోనే, అంటే మామూలుగా మనం అనుకునే దాని కన్నా వీలయినంత లేత వయసులోనే ఇటువంటి కోరికను అతనిలో ప్రవేశపెట్టాలి.

"అధిగమించాలి", "జయించాలి" అనే ఇచ్ఛాశక్తి శిశువులో కలగటానికి ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధానం అనుసరించాలి. కొందరి విషయంలో సహేతుకంగా వివరిస్తే సరిపోతుంది. కొందరిలో "అభిమానం సంపాదించుకోవాలనే" భావనను ప్రోత్సహిస్తే సరిపోతుంది. మరో కొందరిలో "హుందాతనం", "ఆత్మగౌరవం" పనిచేస్తుంది. కాని, నిరంతరం నిజాయితీతో చేసే ఆచరణను మించిన విధానం మరొకటి లేనే లేదు!

నిర్ణయాన్ని ఒకసారి స్థిరపరచుకున్న తరువాత ఎట్టి పరిస్థితులలోనూ "ఓటమిని" చిట్టచివరి ఫలితంగా

అంగీకరించకూడదు.తీవ్రంగాకృషిచేస్తూ,నిరంతరంముందుకు సాగిపోవాల్సిందే. వెనుకంజ వేయకుండా ఉండాలన్నా, బలహీనతలకు దూరంగా ఉండాలన్నా, ముఖ్యంగా ఒక విషయాన్ని మరచిపోగూడదు: సాధన ద్వారా, ఒక పద్ధతి ప్రకారం కండరాలను ఎలా క్రమంగా మలచుకుంటామో, అదే విధంగా ఇచ్ఛాశక్తిని కూడా సాధన ద్వారా అభివృద్ధి పరచి నియంత్రించవచ్చును. చూడటానికి అంత ప్రాముఖ్యంగా కన్పించని విషయాల్లోనైనా సరే, ఇచ్ఛాశక్తిని పూర్తిస్థాయిలో ఉపయోగించే విషయంలో వెనుకంజ వేయకూడదు. ప్రయత్నంద్వారాదానిసామర్థ్యంపెరుగుతూక్రమేణాఎంతటిక్లిష్టతర సమస్యనైనాపరిష్కరించగలుగుతుంది.

ఏమైనా సరే, నిర్ణయం చేసిన తరువాత అమలు చేయాల్సిందే! చేసిందాన్ని మరల మరల చేయాల్సి వచ్చినా ప్రయత్నాన్ని పునఃప్రారంభం చేయాల్సిందే. అప్పడే మీ ప్రయత్న కారణంగా మీ ఇచ్ఛాశక్తి బలపడుతుంది. ఇక తెలివితో లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని దాన్ని అమలు చేయటమే తరువాయి.

క్లుప్తంగా ప్రతివ్యక్తి తన ప్రవర్తనను పూర్తిగా అర్థం చేసుకొని, దాన్ని తన అదుపులో వుంచుకోవాలి. తనపై తాను పూర్తి యాజమాన్యాన్ని పొందాలన్నా, చేతనయినంత మేరకు మార్చుకోగల విషయాలను రూపాంతరీకరించుకోవాలన్నా, ప్రతివ్యక్తీ తనప్రవర్తనను పూర్తిగా అర్థం చేసుకొని, దాన్ని తన అదుపులో ఉంచుకోవాలి.

ఎంచుకున్న ఆదర్శం విలువైనది అయితేనే చేసిన కృషికి, పొందిన ఫలితానికి విలువ ఉంటుంది.

- శ్రీమాత

అనువాదం : కె. ఆర్.యల్. నరశింహారావు



5. కురుక్షేత్రము

1. గీతోపదేశ సందర్భము :-

త్రివిధమార్గమునకు గుర్తులు పెట్టుచు పెద్దపెద్ద అడుగులతో ముందునకు సాగు గీతా గురువు ననుసరించుటకు ముందు, గీతోపదేశమునకు మూలముగు సందర్భమును మఱియొకసారి మనము విచారించదగును - ఈసారి ఆ సందర్భమును మానవజీవితమునకును, ప్రపంచగతికిని సైతము ఒక నమూనాగా గ్రహించి, దాని వ్యాపక రూపమును విచారింతము. పోగా త్రివిధ మార్గమన, కర్మ, ప్రేమజ్ఞానముల పరమలక్ష్యమగు పరమపురుషునిలోని కారోహించు (మానవుని) మనోహృదయ బుద్ధుల మార్గము. సందర్భము మూలతః అర్జునుని అంతః సంఘర్షమునకు సంబంధించినదేయైనను, అతడు వేసిన విశిష్టప్రశ్నయు, దానిరీతియు మానవ జీవనకర్మల సంపూర్ణ ప్రశ్నను లేవనెత్తును - ప్రపంచస్వరూపమేమిటి? దాని లక్ష్యమేమిటి? ఇప్పటి ప్రపంచ జీవనమునకు, ఆధ్యాత్మిక జీవనమునకు పొత్తు ఎట్లు సంభవము? అని ఆ ప్రశ్న నిగ్గదీయును. ఈ గంభీర, కఠిన ప్రశ్ననంతను గురువు పట్టుదలతో పరిష్కరించును ; ఏలన ఈపరిష్కారము తానా దేశించిన నూతనకర్మకు పునాది యగును; ఈ నూతనకర్మ నూతనసత్తా స్థితినుండియు విమోచకమగు జ్ఞాన ప్రకాశము చేతను ప్రవర్తించును.

2. జీవనమే సంగ్రామ మైనపుడు :-

కాని ఇప్పటి ఈ ప్రపంచమునందు కర్మచేయుచునే, లోపల ఆధ్యాత్మిక జీవితమును జీవింపగోరు మానవునికి ఎదురగు కఠినత ఏమిటి? అతని ప్రబుద్ధ మానసమునకు భీతిగొల్పి, అతనిలో విషాదమును బుట్టించు ప్రపంచపార్శ్వమేమిటి?- గీతయొక్క ప్రథమాధ్యాయము పేరు 'విషాదయోగ' మగుట అర్థవంతము. ఒకని కింకను తన ఉచ్చతర సత్తతో సమన్వయము కుదరలేదు, అట్టితఱినాది

న్యాయము- అను అతని కంటిపొర చిరిగిపోగా, విశ్వముయొక్క నగ్న రూపమును చూడక తప్పనపుడు, అతని కనుభూత మగునదే ఆ విషాదమును, నిరుత్సాహమును. ఈ విషాదహేతువగు ప్రపంచపార్శ్వము బాహ్యముగా కురుక్షేత్ర హింసా సంహారములు, ఆధ్యాత్మికముగా వికరాళమగు ఈశ్వరుని విశ్వరూపదర్శనము ; ఇచ్చట కాలస్వరూపము ధరించిన ఈ శ్వరుడు తన సంతానమునే మ్రింగివేయుచున్న భయంకర దృశ్యము గన్పించును. "బ్రాహ్మణులును, క్షత్రియులును అతని ఆహారము, మృత్యువతనికి ఊరగాయ" (కఠ. ఉప.) - అనునదియు అతనిని వర్ణించు నిష్ఠుర రూపకమే. అతడు విశ్వస్రష్టయేగాక, సంహారకర్తయు నగును. సంఘర్షముచేతను, వధచేతను సాగుచుండు విశ్వజీవనమును, మానవజీవనమును ప్రపంచ బాహ్యరూపమగును; మహాసృష్టి, మహావినాశములందు తనను దాను పూర్ణమొనరించుకొను విశ్వ పురుషుడు (అర్జునునకు భీతిగొల్పు) ఆంతర రూపమగును. జీవన మొక సంగ్రామము, ఒక కదనరంగము - ఇది కురుక్షేత్రస్వరూపము: భగవంతుడు భయంకరుడు - ఇది అర్జునుడు గాంచిన భగవత్స్వ రూపము.

3. వినాశము సృష్టిమూలము :-

యుద్ధము సర్వవస్తువుల పిత-యని గ్రీకు తత్త్వవేత్త హెరాక్లిటన్ చెప్పెను. యుద్ధమన్నింటికి రాజు; అతని ఇతర సూత్రములవలె నిదియు ఒక గంభీర సత్యమును సూచించును. స్థూల లేక సూక్ష్మశక్తుల సంఘట్టనముచేతనే ప్రపంచమున సర్వము, ప్రపంచము సైతము పుట్టుచున్నట్లు గన్పించును; పుట్టి, శక్తులు, ప్రవృత్తులు మఱియు ప్రాణుల సంఘర్షములచే సదా నూతన వస్తువుల సృజించుచు, సదా పురాణ వస్తువుల బలిగొనుచు ముందుకు సాగుచున్నట్లు గన్పించును. కాని ఎక్కడకు సాగుచున్నదో ఎవరికిని దెలియదు-చరమ ఆత్మ వినాశనమున కని కొందరందురు. ఇది అనంతముగా సాగువ్యర్థ చక్రభ్రమణమని

కొందరందురు. ఈ భ్రమణమున ప్రగతి గలదని ఆశావాది నిర్ణయము; కష్టకల్లోలముల ద్వారా సాగవలసి వచ్చినను, ఇది యొక దివ్యా విష్కృతియొక్క అధికాధిక సాదృశ్యమునకు గొనిపోవునని అతడు చెప్పును. అది ఎట్లున్నను ఒకటి మాత్రము నిశ్చయము; ఇచ్చట వినాశము వినా నిర్మాణము లేదు; విరోధిశక్తుల తుల్యస్థితిచేతనే తప్ప సామరస్యము లేదు; అంతే కాదు, ఆత్మాశనముచేతను (self feeding), పరభక్షణముచేతను తప్ప జీవనము నిరంతరముగా నిలిచి యుండజాలదు. అసలు మన శరీర జీవనమే ఒక సంతతమరణము మఱియు జననము; కాగా శరీరము స్వయముగా శత్రువులు చుట్టుముట్టిన ఒక నగరము, దాని నాక్రమణశక్తులు ఆక్రమించుచుండగా, రక్షణశక్తులు రక్షించుచుండును - ఒకదానినొకటి కబళించుటయే ఈ యుభయ శక్తుల వ్యాపారము, మరియు నిది మన సంపూర్ణజీవనమున కొక ప్రతిరూపము (నమూనా) మాత్రమే. ఆదిలోనే ఈ ఆదేశము వెలువడినట్లు గన్పించును; "నీ సహచరులతోను, పరిస్థితులతోను యుద్ధము చేసిననే తప్ప నీకు విజయ ముండదు; యుద్ధముచేతను, సంఘర్షముచేతను, ఇతర ప్రాణులను పొట్టబెట్టుకొనుటచేతను తప్ప నీవు జీవించును గూడ జీవించవు. నేను చేసిన ప్రపంచము యొక్క ప్రథమ నియమమిది; వినాశముచేతనే సృష్టియు, స్థితియు".

4. బక్షించును. బక్షించబడును

జగత్తును సూక్ష్మముగా పరిశీలించి, చూడగలిగినంత వరకు ప్రాచీన విజ్ఞాన మీ ప్రారంభ ప్రతిపాదన నామోదించును. ప్రాచీనోపనిషత్తులు దానిని స్పష్టముగా దర్శించి, రాజీకి తావులేని స్పష్టశబ్దములలో వచించును; పై పూతలను, సత్యాచ్ఛాదనలను సహించవు. అవి ఇట్లు వక్కాణించును: "అశనాయాహి మృత్యుః" - మృత్యురూపమే యగు ఆకలి ఈ ప్రపంచముయొక్క స్రష్టయు, నియామకుడును; మఱియు ప్రాణికజీవనము నవి 'యజ్ఞాశ్వ' రూపమున చిత్రించును. ఇంకను ఉపనిషత్తులు ద్రవ్యమును 'అన్న'

మని వర్ణించుచు, దానికి కారణమిట్లు నుడువును: "అత్తి అద్యతేచ అన్నం" - ద్రవ్యము భూతములను తినును, తినబడును. గనుక దాని నామ మన్నము. భక్షకుడు భక్షించుచు భక్షించబడును. - ఇదియే జడప్రపంచమును శాసించు సూత్రము. దీనినే డార్విను సంప్రదాయమువారు తిరిగి కనుగొని ఇట్లు ప్రతిపాదించిరి: జీవన సంఘర్షము పరిణామశీల ప్రపంచధర్మము. హెరాక్లిటస్ సూత్రములును, ఉపనిషత్తుల రూపకములును ప్రబలతర, విశాలతర, యథార్థతర సూత్రములందు మున్నే ప్రాచీనసత్యములను వచించియున్నవో, వానినే ఆధునిక విజ్ఞానము క్రొత్త పదములలో కూర్చినది.

5. సమస్యలను గుర్తించినపుడే పరిష్కారము

యుద్ధము జీవితముయొక్క ఒక పార్శ్వము, ఆదర్శ మానవుడొక యోధుడు - అని నీతసే మహాశయుడు పట్టుదలతో ప్రతిపాదించును - మానవుడారంభమున ఒంటె - మానవుడు గావచ్చును, తర్వాత శిశు-మానవుడు గావచ్చును, కాని పిమ్మట సింహ-మానవుడైననే తప్ప పరిపూర్ణతనందు కొనజాలడు. ఈ సిద్ధాంతము లెంతో ఆక్షేపణకు గుఱియైనవి; వీనినుండి నీతసేగారు వెలికిదీసిన నైతిక, వ్యావహారిక నిర్ణయములనుండి మనమెంతగా భేదించినను, వీనిలో కాదనలేని గుణము గలదు, మఱియు నివి మనము చూడనిచ్ఛగించని సత్యమును స్మరింపజేయును. అట్లు స్మరింపజేయుటమంచిది గూడను; ఏలన 1. బలవదాత్మకు దానివలన ప్రోత్సాహము గలుగును; దార్శనిక, ధార్మిక లేక నైతిక భావుకత (Sentimentalism) పుట్టించు అలసటనుండి అదిమనలను కాపాడును - ఈ భావుకత ప్రకృతియొక్క ప్రాణరూపమును, ప్రేమను, అందమును, మంచినే చూడగోరుచు, దాని వికరాళ మృత్యువేషము నుండి మొగము త్రిప్పకొనును; భగవంతుని శివునిగానే ఆరాధించుచు, రుద్రునిగా ఆరాధించ నిరాకరించును; 2. సృష్టి తత్త్వములోనికి నూటిగా చూడగల సత్యతాసాహసములు

మనకున్ననే గాని, దాని అపశ్రుతులు మఱియు విరోధముల శక్తిశాలి పరిష్కారమును మన మెన్నటికి జేరుకొనజాలము. జీవనము మఱియు ప్రపంచముల యొక్క ఉన్న రూపును ముందు మనము చూచినచో, పిమ్మట ఉండవలసిన రూపునకు వానిని మార్చగల సమీచీనోపాయమును కనుగొనుట మనకు తేలికయగును. సృష్టియొక్క అప్రియరూపము నందే దాని చరమ సామరస్య రహస్య మిమిడియున్నచో, ఆ రూపము నుపేక్షించుటచేత లేక తృణీకరించుట చేత, ఆ రహస్యము మనకు చిక్కదుగాన, మన పరిష్కార ప్రయత్నములన్నియు విఫలమయి పోవును. అట్లుగాక, తదప్రియరూపము చావగొట్టి, రూపుమాప వలసిన శత్రువే యగుచో, అప్పడును దానిశక్తిని, జీవితముపై దానికిగల పట్టును తక్కువ అంచనా వేయుటచేత గాని, గతముయొక్క సక్రియభాగము నందును, సృష్టియొక్క కార్యసాధక తత్త్వములందును అది ఎంత లోతుగా వేరూనియున్నదో చూడ నిరాకరించుటచేత గాని మనకేమి లాభము?

6. అంతరజీవితము నందును యుద్ధ తత్త్వము

మన శుద్ధ భౌతిక జీవనమునందే గాక, మన మానసిక, నైతిక జీవనము నందును యుద్ధము మఱియు వినాశము నొక సార్వత్రిక త్త్వమై యున్నవి. ఇది స్వయంస్పష్టము : బౌద్ధిక, సామాజిక, రాజకీయ, నైతిక రంగములందు వాస్తవ మానవ జీవనమున సంఘర్షము లేక మనము ఒక్క ముందడుగు వేయలేము - ఇపుడేది జీవించుచున్నదో, దాని స్థానమున ఇకముందేది జీవింప జూచుచున్నదో, వీనికిని, వీని కుపబలకముగా నున్న వానికిని మధ్య సంతత యుద్ధము సాగుచున్నది. కనీసము మానవులు, ప్రపంచము ఇప్పటివలె నున్నంతవరకు, పురోగమించుచునే అహింసా ధర్మమును అక్షరాలా పాటించుట సంభవము; అయినను ఇదియే సర్వశ్రేష్ఠ అచార నియమముగా మనముందుంచబడుచున్నది ! ఆత్మశక్తినే ఉపయోగించెదము, రక్షణార్థము సైతము బలప్రయోగము

చేయము-అందువా? మంచిది, కాని ఆత్మశక్తి కార్యసమర్థ మగువరకు, మానవులు మరియు జాతుల యందలి ఆసురశక్తి మరింత విశృంఖలముగా రక్తము చిందించుచు, ప్రపంచమున పవిత్రము చేయును; దీనిని మన కళ్లెదుట చూచుచునే యున్నాము. ఇట్లు ఇతరుల బలప్రయోగము కంటెను నీ అస్త్రసన్న్యాసమే బహుశః ఎక్కువ వినాశమునకు కారణమగును. అయినను నీవు చూపిన ఆదర్శము క్రమముగా మంచి స్థితికి దారితీయవచ్చును, కనీసము దారితీయవలయును. కాని ఆత్మశక్తి సైతము, కార్యసమర్థమైనపుడు, ధ్వంసము చేయును. అది ఖడ్గముకంటెను, పిరంగికంటెను ఎంత ఎక్కువ భయంకరమో, వినాశకరమో, కండ్లు తెరచి దానిని ప్రయోగించిన వారికి మాత్రమే తెలియును; మరియు నా ప్రయోగకర్మకును, దాని తక్షణ ఫలితములకును తమ దృష్టిని పరిమితము చేయని వారికి మాత్రమే దాని పశ్చాత్ఫలితము ఎంత దారుణమో, విధ్వంసకరమో కన్పట్టును. తనపై నుపజీవించున దంతయు నష్టముగాకుండ, అధర్మము తాను నశించజాలదు. కావున హింసాదృశ్యమువలన గలుగు బాధ మనకు తప్పినను, ఆత్మశక్తి ప్రయోగమువలన గలుగు విధ్వంశము తక్కువేమియు గాదు.

7. అప్రతీకారమువలన మరింత ప్రతీకారము

ఇంకను, ఆత్మబలము నుపయోగించినపుడెల్ల, మన ప్రత్యర్థిపై ,ొక మహాకర్మశక్తిని రేపిన వారమగుదుము, కాని దీనియొక్క తద్వా తి క్రియ మన అదుపులో నుండదు. ఉదాహరణకు, వశిష్ఠుడు విశ్వామిత్రుని సైనికబలముపై తన ఆత్మబలమును ప్రయోగించి, పైకి మిన్నకుండును; ఫలితము-హూణ, శక, పల్లవ సేనలు విశ్వామిత్రునిపై విరుచుకొని పడును. బలప్రయోగము, ఆక్రమణ జరిగినపుడు, ఆధ్యాత్మిక మానవునియొక్క శమ నిష్క్రియతలే ప్రపంచము యొక్క ప్రచండశక్తులను ప్రతీకారచర్యకు పురికొల్పును. కావున కత్తితోనైనను ఆధర్మ ప్రతినిధులనాపుట వారిపట్ల

అధికతర దయ చూపినట్లే యగును; అట్లాపనిచేయనిచో, వారి దుండగములు మితిమీఱును, అపుడు ప్రతీకారశక్తులు వారినెంతో ఎక్కువగా మట్టుబెట్టును. సంఘర్ష, వినాశధర్మము రూపుమాసి పోవలెనన్న, మన చేతులు శుచిగాను, మన ఆత్మలు నిష్కళంకముగాను నున్న చాలదు; ఆ ధర్మము యొక్క పాదు ముందంతరించవలెను. నిష్క్రియతా జడత లసలే ఈ నియమమును కదల్చలేవు. నిజానికి రజస్సుకంటె తమస్సే ఎక్కువ అపకారము చేయును, ఏలన రజస్సు తాను సంహరించినదానికంటె నెక్కువ సృజించును. కనుక వ్యక్తి స్థూల సంగ్రామము నుండియు, దాని ఆనుషంగిక ఫలమగు వినాశము నుండియు నివృత్తు డగునేని, అది అతని నైతిక భావమునకు సాయపడవచ్చునేమోగాని, భూతముల సంహార శక్తిని యథాపూర్వముగానే విడిచివేయును.

8. ప్రేమధర్మము లేకపోలేదు గాని ....

ఒక్కమాటలో, మానవచరిత్ర యంతయు ప్రపంచమున ఈ సంహార తత్త్వముయొక్క అవిచాల్య శక్తికిని, నిరంతర స్థితికిని సాక్ష్యమిచ్చుచున్నది. కాని సహజముగానే, దీని తీవ్రతను తగ్గించి, దీని వ్యతిరేక రూపములను నొక్కి చెప్పదుము. ఎట్లన సంఘర్ష, వినాశములే సర్వముగావు; అవయోగమును, పరస్పర సంఘర్షమును గలిగించు సంహారకశక్తి యున్నటులే, సంయోగమును, పరస్పర సాహాయ్యమును ఘటించు సంరక్షకశక్తియు నిక్కడగలదు; నేను-అని భుజము చఱచు అహంకారికశక్తి యున్నటులే ప్రేమశక్తియు గలదు; మనకొఱకు నితరుల నాహుతిజేసికొను ప్రేరణవలెనే ఇతరుల కొరకు మన నాహుతిజేసికొను ప్రేరణయు గలదు, కాని ఈ సాధుశక్తులు వాస్తవముగా నెట్లు ప్రవర్తించెనో చూచినపుడు, వాని ప్రతిరూపముల శక్తిని తగ్గించుటకుగాని, ఉపేక్షించుటకుగాని మన ముబలాటపడము. చూడుడు: పరస్పర సాహాయ్యమునకేగాక, ఆత్మరక్షణ,దురాక్రమణలకుగూడసంయోగమును రూపొందించుట

జరిగినది. ఈ సంయోగము స్వయముగా యుద్ధమునకు, అహంకారమునకు, స్వాధికారస్థాపనకునొక సేవకుడుగా నుపయోగింపబడినది. ఇక ప్రేమసదా ఒక మృత్యుశక్తిగానే వ్యవహరించినది. విశేషించి అహంకారము వాని నా లింగనము చేసికొనిన రూపమున, శుభప్రేమయు, భగవత్ప్రేమయు ఎంతో సంఘర్ష సంహార వినాశములకు గారణములైనవి. పోగా, ఆత్మాహుతి ఒక మహిత, సముదారవస్తువు, నిజమే. కాని తన అత్యున్నత రూపమున మరణము చేత జీవనము ధర్మము యొక్క అంగీకారమే యగును; ఏశక్తి దేవతకు బలిపెట్టిన గాని మన కార్యము సిద్ధించదో, మన ఆత్మాహుతి ఆ దేవతావేదికపై నర్పించిన బలియగును. తన బిడ్డలను రక్షించుకొనుటకు తల్లిపక్షి ఘాతక మృగమునకు ఆహుతియగును. దేశభక్తుడు దేశవిముక్తికి ప్రాణములర్పించును. ధార్మికుడు ధర్మముకొఱకు, భావుకుడు భావముకొఱకు బలియగుదురు-ఇవి జంతుజీవనము యొక్క పరావర శ్రేణులయందు గన్పించు, ఆత్మాహుతి యొక్క అత్యున్నత దృష్టాంతములు, మఱియు నివిదేనికి నిదర్శనమో, అది మనకు స్పష్టమే.

9. క్రైస్తవము వ్యాపించెను గాని క్రీస్తుగాదు

తర్వాతి ఫలితముల కేసి చూతుమేని ఆశాభావము మఱింత సన్నగిల్లును. దేశభక్తుడు దేశవిముక్తి కొఱకు మరణించుటను జూడుము, మఱియు కర్మప్రభువట్లు అతని రక్తమును, దుఃఖమును మూల్యముగా జెల్లించివేసిన కొన్ని దశాబ్దుల తర్వాత అదే దేశమును పరికించుము; ఆశ్చర్యము: అదే మఱల ఉపనివేశ దేశములను, పరతంత్ర దేశములను పీడించును, కొల్లగొట్టును, జయించును; తనకండలను పెంచుకొనుటకు ఇతరుల నాక్రమించి మ్రింగి వేయును. క్రీస్తు జయించుట కొఱకు, క్రైస్తవమతము వ్యాపించు నిమిత్తము సామ్రాజ్యశక్తిని ఆత్మశక్తితో ఢీకొనుచు, క్రైస్తవవీరులు వేలసంఖ్యలో ప్రాణములర్పింతురు. ఫలితముగా ఆత్మశక్తి నిక్కముగా

జయించును, క్రైస్తవము నిక్కముగా వ్యాపించును-కాని క్రీస్తుకాదు; ఆ విజయోపేత మతము యుద్ధశీలము, ఆధిపత్యపరమునగు చర్చిగా మాఱి, తాను తొలగించిన మతము మఱియు సామ్రాజ్యముకంటెను ఎక్కువ మతోన్మాదముతో పీడించు శక్తియగుచున్నది. చివరకు మతములే పరస్పర సంఘర్షశక్తులుగా సంఘటితములై, జీవించి, పెరిగి, ప్రపంచము నంతను ఆక్రమింప నుగ్రముగా పోరాడుచున్నవి.

10. కరాళకాళియు భగవంతుడే

ఇదంతయు దేనిని చూపును ? జగజ్జీవనమున ఒక (సంఘర్ష) తత్త్వము గలదు, బహుశః అది యొక ప్రాథమిక తత్త్వము; అయితే దానిని జయించుటెటులో మనకు దెలియదు; కారణము, అసలది అజేయము, లేక దానిని ప్రశాంతముగా గుర్తించి, దాని స్వరూపము నెఱుంగుటకు ప్రబల, నిష్పక్షపాత నిరీక్షణముతో దానిని మనము వీక్షించియుండ లేదు. పరిష్కార మెట్టిదియైనను సమీచీన పరిష్కారము బొందుటే మన లక్ష్యమగుచో, సృష్టి ముఖములోనికి మనము సూటిగా చూడవలెను. మఱియు సృష్టి ముఖములోనికి జూచుట యన భగవంతుని ముఖములోనికి జూచుటయే; వానిని రెండింటిని వేఱుచేయలేము, మఱియు సృష్టి నియమముల బాధ్యతను ఆ నియమములను సృజించిన భగవంతుని పై నుండియు, దానిని గూర్చిన బ్రహ్మము పై నుండియు తొలగింపలేము. ఇచ్చటను మనము సత్యమునకు తేనె బూసి, అటునిటు ఊగులాడ నిచ్చగింతుము. మనమొక ప్రేమ భగవంతుని నిలబెట్టి, న్యాయ, శీల, ధర్మములకు సంబంధించిన మన నైతిక భావనల ననుసరించి, అతడు న్యాయ నిష్ఠుడు, శీలవంతుడు, ధర్మాత్ముడునని అనుకొందుము, మఱియు తక్కిన దంతయు నతడు గాదు లేక అతనిది గాదు అని చెప్పదుము; తక్కినదంతయు నొక సైతాను సృష్టి, అతడేలనో దానిని తన దుష్ట సంకల్పము సాధించుకొననిచ్చెను; లేక తక్కిన దంతయు స్వార్థపరుడు, పాపాత్ముడు నగు మానవుని దుష్కృతిరూపము, భగవంతుడు

మూలమున నిర్దుష్టముగా జేసిన సృష్టి నతడే భ్రష్టము గావించెను - అని చెప్పదుము. కాని మానవునికి పూర్వము జంతులోకములోని మరణము మఱియు భక్షణ నియమము మాటేమిటి ? లేక ఏ ప్రచండ ప్రక్రియచేత ప్రకృతి నిక్కముగా సృజించుచు, పోషించుచు, అదే అడుగులో అదే చేతులతో చంపుచు, నాశము చేయుచు నుండునో, దాని మాటేమిటి ? కొన్ని మతములు మాత్రమే, ఉదాహరణకు, భారతీయుల మతము, ఈ నిగూఢ ప్రపంచ శక్తిత్రిమూర్తియగు నొకే దేవతయని నిస్సంకోచముగా చెప్పసాహసించును; జగద్వ్యాపారము నిర్వహించు మహాశక్తి కల్యాణకారిణియగు దుర్గారూపముననేగాక, సంహారనృత్య కారిణియగు కరాళ కాళీ రూపమునను ఉండును గాన, ఇంకను సాహసముతో నిట్లు పలుకును, "ఈమెయు తల్లియే; ఈమెను గూడ తల్లిగా నెఱుంగుము; నీకు బలమున్నచో, ఈమెను గూడ నారాధింపుము." మఱియు నిట్టి ధీరసత్యతయు, ప్రచండ సాహసమునుగల మతము తదితర మతమేదియు చేయలేని రీతిని ప్రగాఢము, పరివ్యాప్తము నగు ఆధ్యాత్మికతను సృజించగలిగె ననుట చాల అర్థవంతము. ఏలన యథార్థ ఆధ్యాత్మికతకు సత్యము పునాదియు, సాహసమాత్మయు నగు - "తస్యై సత్యం ఆయతనం" (కేన. ఉప)

11. మర్త్యజీవనము ద్వారా అమరజీవనము

సంఘర్ష వినాశములు జీవనము యొక్క ఆద్యంతములు, సామరస్యము యుద్ధముకంటెను శ్రేష్ఠము గాదు, మృత్యువుకంటెను ప్రేమ ఎక్కువగా అభివ్యక్తమైన భగవద్రూపము గాదు - అని మనము చెప్పట లేదు; అటులే పశుబలమునకు బదులు సంఘీభావమును, అహంభావమునకు బదులు విశ్వభావమును ప్రవేశపెట్టు దిశగా మనము పురోగమించరాదని పై చర్చయొక్క తాత్పర్యము గాదు. భగవంతుడు వినాశకర్తయే గాడు. భూత సుహృదుడు గూడను (5-29); విశ్వాధికృత త్రిమూర్తియే గాడు, తదతీతుడును, కరాళకాళి

ప్రేమమయి, హితకరియగు తల్లిగూడను; అటులే కురుక్షేత్రాధినేత దివ్యసఖుడు మఱియు సారథి, భూతమోహనుడు, అవతార కృష్ణుడు. అతడీ సంగ్రామాదుల ద్వారా మనలను సరిగా నెక్కడకునడుపుచున్నాడో తెలియదుగాని. మనము నొక్కి చూపుచున్న ఈ సంగ్రామాదుల కతీతముగా మాత్రమే నడుపుచున్నాడు, సందియము లేదు. కాని ఆ అతీతత్త్వ మెట్టిదో, దాని నిబంధనలేవియో మనము కనుగొనవలసి యున్నది; మరియు నట్లు కనుగొనుటకు ప్రపంచమును యథాతథముగా పరికించి, దానియందు స్వయముగా నభివ్యక్తమగుచున్న అతని క్రియకు సరిగా మదింపు వేయవలెను; అపుడుగాని మార్గమును, గమ్యమును ఎక్కువగా వెలుగులోనికి రావు. అనగా కురుక్షేత్రమును (సంగ్రామును) మన మంగీకరించవలెను; అమర జీవనమునకు మార్గమును కనుగొనక పూర్వము, మరణముచేత జీవనమును నియమమునకు తలయొగ్గవలెను; కండ్లు తెఱచి, అర్జునుని దృష్టికంటె తక్కువ భీతదృష్టితో ఈశ్వరుని మృత్యురూపమును దర్శించి, అది లేదనుటను, దానిని ద్వేషించుటను, లేక దాని నుండి పాఱిపోవుటను మానుకొనవలెను.


(సశేషం)

- అనువాదం : శ్రీ చెలసాని నాగేశ్వరరావు

Rs. 15/-

అఖిల

అఖిల భారత పత్రిక - ఆగష్టు 2008



శ్రీ మాతారవిందుల వాక్కులు

అఖిల

అఖిల భారత పత్రిక - ఆగష్టు 2008

విషయసూచిక

(ఆగష్టు 15, 2008, శ్రీఅరవిందుల 136వ జయంతి)


మానవుడు నిన్నటి సృష్టి . రేపటిసృష్టి అతిమానస జీవుని ఆగమనాన్ని ప్రకటించేందుకు శ్రీఅరవిందులు అవతరించారు.

-శ్రీమాత

కృష్ణ

ఓ అనంత పరివ్యాప్త జ్యోతిర్నివహమా! కృష్ణా,
ఆత్మ-విశాల నిస్సీమ నిఖిలాంతరిక్షమా !
ఎవరిని కౌగిలించుకుని దాగొన్నావు?
మరణ మెరుగని శరీరాంగాలు, మధుర మహోజ్వల వదనం!
వ్యోమం, కాలం అబద్ధ మాడుతున్నాయి -
"మరెవరూలేరు, మేము శూన్యం మాత్రమే" అని.
ఆత్మ, ప్రపంచం వ్యర్థ ప్రగల్భాలు పలుకుతున్నాయి. . .
"నేను, నేను మాత్రమే" అని.
ఒకడున్నాడు - ఆత్మకే పరమాత్మ,
అంతరిక్షానికే మహితాత్మ, కాలానికి ఆదిమూలం
హృదయాలకు హృదయం, మనస్సులకే మనస్సు,
అతను విశ్వసింహాసనంపై ఆశీనుడైనాడు
ఏకాంతమై, మహోదాత్తమై
ఆత్మలీనమైన మూగ సముజ్వల శూన్య నిరపేక్షం కాదు -
కౌగిలించుకునే హస్తాలు పట్టి మురళిని
చుంబించే అరుణాధరాలు ఊదుకున్నాయి.
అందిరినీ ప్రేమిస్తాడు, సమస్తాన్ని కదిలిస్తాడు.
అందరూ అతనివారే, అందరూ అతనే !
అనేక శ్వేతాంగాలు అతని లీలల్ని సంతృప్తి పరుస్తాయి
అతని సుమధుర ఆనంద పారవశ్యాన్ని భరిస్తాయి.
ఒకనిలో ఇరువురు, భిన్నత్వంలోని సురుచిర
ఏకత్వం దీపించిన ఇరువురు, ప్రణయ
పరిష్వంగంలో ఇరువురు, అసలు ఒక్కరే,
అతని అద్భుతావహ, అతిమానుష వైభవం అదే !

మూలం : శ్రీఅరవిందులు — అనువాదం : యజ్ఞన్న



శ్రీఅరవిందులు

15 ఆగష్టు 1947

ప్రశ్న : దేశంలో ఆవశ్యకమైన సంఘటితతత్వాన్ని, విశ్వాసాన్ని, ఏవిధంగా తీసుకొనిరావాలి?

సమాధానం : శ్రీఅరవిందుల సందేశాన్ని అనుసరించటం ద్వారానే. ఆగష్టు 15, 1947నాటి వారి స్వాతంత్ర్యదిన సందేశాన్ని మళ్లీమళ్లీ చదవటం, దాని ప్రాముఖ్యాన్ని కోట్లాది స్వదేశీయులకు వివరించటం అవసరం, శ్రీఅరవిందుల నిష్ఠ, విశ్వాసం, భారతదేశానికి అత్యావశ్యకం.

- శ్రీమాత

శ్రీ అరవిందుల సందేశము
పదిహేనవ ఆగష్టు 1947

ఆగష్టు 15వ తేది స్వతంత్ర భారతదేశ జన్మదినం. ఒక పాతశకం అంతమై నూతనశకం ఆవిర్భవించటాన్ని అది సూచిస్తున్నది. దాని ప్రాముఖ్యత మనకే కాదు, ఆసియాకు, సమస్త ప్రపంచానికే ఉన్నది; ఎందుకంటే మానవజాతి రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక భవితవ్యాన్ని నిర్ణయించటంలో ఘనమైన పాత్రను నిర్వహించవలసిన, చెప్పలేనన్ని సంభావ్యతలతో కూడిన కొత్తరాజ్యం ఒకటి ప్రపంచ రాజ్యకూటమిలో అడుగుపెట్టిన ప్రముఖదినం ఇది. నా జీవితసిద్ధాంతాన్ని అంగీకరించేవారందరూ, నాపుట్టినరోజుగా జరుపుకొనే ఈరోజు ఇంత విస్తృత ప్రాముఖ్యతను వహించటం వ్యక్తిగతంగా నాకు సంతృప్తి కలిగించే విషయం. ఒక యోగిగా ఈ అభేదత్వాన్ని కాకతాళీయంగా, యాదృచ్ఛిక సంఘటనగాకాక, నాజీవితంతోపాటు నేను ప్రారంభించిన కార్యాచరణలో నాకు దారిచూపించే దివ్యశక్తి అనుమతిగా, ఆమోదముద్రగా నేను భావిస్తున్నాను. నా జీవితకాలంలో సఫలం కావటం చూడగలనని నేను ఆశించిన ప్రపంచోద్యమాలు దాదాపు అన్నీ, ఆసమయంలో అసంభవ స్వప్నాలుగా కనిపించినా, ఈనాడు సఫలదశను చేరుకొంటున్నట్లుగా, లేక ప్రారంభమై గమ్యసిద్ధిపొందే త్రోవలో ఉన్నట్లుగా నేను గమనిస్తున్నాను.

ఈ పర్వదినాన సందేశం ఇవ్వమని నన్ను అడిగారు. కాని బహుశః దాన్ని ఇచ్చే స్థితిలో నేను లేను. నా చిన్నతనంలో యౌవనంలో నేను భావించిన కొన్ని లక్ష్యాలు, ఆదర్శాలు ఈనాడు ఫలప్రదాలు కానారంభిస్తున్నట్లు గమనిస్తున్నాను, వాటిని స్వయంగా ప్రకటించడమే నేను చేయగల్గిందల్లా. దీనికి కారణం, భారతదేశ భవిష్యత్ కార్యక్రమంగా నేను నమ్ముతున్న దానిలో వాటికి భాగంగా

ఉండటమేగాక దానిలో భారతదేశం ప్రముఖస్థానాన్ని పొందక తప్పదు కనుక, భారతస్వాతంత్ర్యంతో వాటికి సంబంధం ఉన్నది. భారతదేశావిర్భావం, తన భౌతిక ప్రయోజనాలను నిర్వర్తించు కోటానికిగాని, విస్తృతిని, మహత్వాన్ని, శక్తిని, సంపదను సాధించుకోటానికిగాని కాదనీ - వీటినికూడ అది నిర్లక్ష్యం చేయకూడదు - ఇతర దేశాలవలె పరజాతుల మీద ఆధిపత్యాన్ని వహించటానికి అసలేకాదనీ, దైవంకోసం, సమస్త మానవజాతికి నాయకత్వం వహించి సహాయపడే నిమిత్తం ప్రపంచంకోసం జీవించటానికేననీ నేను సర్వదా భావించటం, చెప్పటం జరిగింది. సహజక్రమంలో ఆ లక్ష్యాలు ఆదర్శాలు ఇవి: భారతదేశ సమైక్యతా స్వేచ్ఛలను సాధించగల విప్లవం; ఆసియా పునరుజ్జీవనాన్ని విముక్తిని పొందటం, మానవనాగరికతా వికాసంలో ఇది గతంలో నిర్వహించిన ఘనమైన పాత్రను మళ్ళీ నిర్వహించటానికి తిరిగిరావటం; నాటి జాతీయజీవనాన్ని పరిరక్షించి భద్రపరుస్తూనే, ప్రజల పూర్ణ ఏకత్వంలోకి అన్నింటిని ఆకర్షించేవిధంగా దేశాల ప్రత్యేక అస్తిత్వాలు అంతర్జాతీయ సమైక్యతమీద స్థిరపడటం వల్లనే సంపూర్ణానుభవాన్ని పొందగల ఒక సరికొత్తదైన, మరింత ఘనము, ఉజ్జ్వలము, ఉదాత్తము అయిన జీవితం మానవజాతికోసం ఉత్పన్నం కావటం; జీవితాన్ని ఆధ్యాత్మిక చైతన్యవంతంగా చేసే తన విధానాలను, ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని, సర్వమానవజాతికి భారతదేశం కానుకగా అందించటం; చివరగా మనుష్యులు వ్యక్తిపరిపూర్ణతను, పరిపూర్ణ సమాజాన్ని గురించి ఆలోచించి కలలు గనటం మొదలు పెట్టినప్పటినుంచి, మానవజాతిని చీకాకుపరచి విసిగించిన జీవన సమస్యలకు పరిష్కారాన్ని ఆరంభించటంలో, చైతన్యాన్ని ఉన్నతస్థాయికి లేవనెత్తటంద్వారా అభివృద్ధి క్రమంలో ఒక కొత్త అడుగువేయటం.

భారతదేశం స్వతంత్రమే: కాని అది సాధించింది బీటలు వారిన, శకలమైన స్వాతంత్రాన్నే గాని సమైక్యతనుగాదు. బ్రిటిషు ఆక్రమణకు ముందున్న ప్రత్యే రాష్ట్రాల గంద్రగోళపరిస్థితిలో పడిపోతుందని ఒకప్పుడు అనిపించింది. అదృష్టవశాత్తు, ఈ వినాశకరస్థితి తిరిగి రాకుండాపోయే ధృఢమైన అవకాశం రూపొందింది. ఏ విచ్ఛేదన, చీలిక లేకుండా దళితవర్గాల సమస్యా పరిష్కారానికి రాజ్యాంగసభ అవలంబించిన, వివేకంతో కూడిన తీప్రవిధానం అవకాశం కల్పిస్తున్నది. కాని, పూర్వపు హిందూముస్లిం మతవిభేదం దేశశాశ్వత రాజకీయ విభజన రూపంలో స్థిరపడినట్లే కన్పిస్తున్నది. ఈవిధంగా స్థిరమైన వాస్తవాన్ని శాశ్వతనిర్ణయంగా, తాత్కాలిక ప్రయోజన సాధకంగా తప్ప మరింకేదిగానైనా, కాంగ్రెస్‌పార్టీ, దేశము అంగీకరించబోవని ఆశించవలసి ఉందడి. ఎందుకంటే, ఇదేపరిస్థితి కొనసాగితే భారతదేశం బలహీనపడవచ్చు; దానిగమనం కుంటుపడవచ్చు; అంతఃకలహానికి సర్వదా అవకాశం ఉండవచ్చు; సరికొత్త దండయాత్రకు, విదేశీ ఆక్రమణకు కూడ అవకాశం ఏర్పడవచ్చు. దేశవిభజన పోకతప్పదు - తీవ్రత సడలటంవల్ల, శాంతి సౌమనస్యాల ఆవశ్యకత, రానురాను అవగాహన కావటం వల్ల, అందరూ కలసి ఐకమత్యంతో పని చేయవలసిన నిరంతర ఆవశ్యకతవల్ల, ఆ ప్రయోజనం కోసం, ఏకసాధనం ఆవశ్యకం కావటం వల్ల ఇది జరుగుతుందని ఆశించవలసి ఉంది. ఈవిధంగా ఏరూపంలోనైనా, ఏకత్వం రావచ్చు; ఆ రూపం సరిగ్గా ఏది అనే విషయానికి ఆచరణాత్మక ప్రాముఖ్యంతప్ప, ప్రధాన ప్రాముఖ్యతలేదు. అయితే ఏ విధానం వల్లనైనా సరే దేశవిభజన పోకతప్పదు, పోయితీరుతుంది. అట్లా కాకపోతే భారతదేశ భవితవ్యం తీవ్రంగా దెబ్బతినటమేగాక నిష్ఫలమైపోవచ్చు. కాని ఆ విధంగా జరగటానికి వీలులేదు.

ఆసియా విజృంభించింది; దానిలో అధికభాగాలు విముక్తి సాధించాయి లేదా ఈ క్షణంలో విముక్తి సాధిస్తూఉన్నాయి. ఇంకా బానిసత్వంలో ఉన్న భాగాలు ఏవో సంఘర్షణల ద్వారా స్వాతంత్ర్యంవైపు పురోగమిస్తున్నాయి. ఇక చేయవలసింది చాలా కొద్దిమాత్రమే. అది కూడా ఈనాడో, రేపో జరుగుతుంది. అక్కడ భారతదేశం నిర్వహించవలసిన పాత్ర ఉన్నది. తన సంభావ్యతల పరిమాణాన్ని, ప్రపంచరాజ్యమండలిలో తాను ఆక్రమించబోయే స్థానాన్ని అదివరకే సూచించిన శక్తి, సామర్థ్యాలతో దాన్ని నిర్వహించటం ప్రారంభించింది.

ప్రారంభం అపరిపూర్ణమైనా, ఐక్యత సాధించేమార్గంలోనే మానవజాతి నడుస్తున్నది. వ్యవస్థీకృతం అయినప్పటికీ అది బ్రహ్మాండమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. అయినా చలన బలం ఉన్నది; చరిత్రనేర్పిన అనుభవం మార్గదర్శకం అయ్యేటట్లైతే ఐక్యత ఇంకా వృద్ధి చెంది విజయం సాధించటం తథ్యం, ఇక్కడగూడ భారతదేశం ప్రముఖపాత్రను నిర్వహించటం ప్రారంభించింది. ప్రస్తుత వాస్తవాలకు, తక్షణ సంభావ్యతలకు మాత్రమే పరిమితం కాకుండా, భవిష్యత్తును దర్శిస్తూ, దాన్ని సన్నిహితం చేసుకోగలిగిన రాజనీతిజ్ఞతను పెంపొందించుకోగలిగితే, భారతదేశం ఉనికి భీరుత్వమందత్వాలతో కూడిన అభివృద్ధికి, ధైర్యంతో శీఘ్రంగా జరిగే అభివృద్ధికే ఎంత తేడా ఉంటుందో స్పష్టం చేస్తుంది. ఒక మహాప్రమాదం జోక్యం చేసుకొని జరిగే పనికి అంతరాయాన్ని గాని, వినాశనాన్ని గాని కల్పించవచ్చు, కాని అంతిమఫలితంమాత్రం సునిశ్చితం. ఏది ఏమైనా ప్రకృతి విధానంలో ఏకత్వం ఆవశ్యకమే గాదు, అనివార్యం. దానిని సాధించగలమని నిర్భయంగా చెప్పగలం. జాతులకు దాని ఆవశ్యకత ఎంతో కూడా సుస్పష్టమే. అది లేకుండా

చిన్న దేశాలకు ఇక మీద భద్రత ఉండదు. పెద్దపెద్ద శక్తివంతమైన దేశాలుగూడా, నిజానికి, భద్రంగా ఉండలేవు. భారతదేశం విభజనస్థితిలోనే ఉండిపోయేటట్లైతే, దానిక్షేమం సందేహాస్పదం అవుతుంది. కాబట్టి అందరి ప్రయోజనాలకోసం సమైక్యత సిద్ధించితీరాలి. దీన్ని నిరోధించేవి మానవబుద్ధిజాడ్యం, మూర్ఖస్వార్థపరత్వం మాత్రమే. దానికి వ్యతిరేకంగా దేవతలు పోరాడినా నిష్ప్రయోజనం అని అంటారు. కాని ప్రకృతి ఆవశ్యకతను, దైవేచ్ఛను ఎదిరించి అది ఎల్లకాలం నిలబడలేదు: అప్పుడే జాతీయత స్వయంసఫలతను పొందుతుంది. ఒక అంతర్జాతీయ చైతన్య దృక్పథాలతోపాటు అంతర్జాతీయ రూపాలు, సంస్థలు వృద్ధిఅవుతాయి. ద్వి, బహుళ పౌరసత్వాలు, స్వచ్ఛందసంస్కృతీ సమ్మేళనంవంటి పరిణామాలు ఈ మార్పుజరిగే ప్రక్రియలో అవతరించవచ్చు. ఉగ్రత్వాన్ని విడనాడుతున్న జాతీయవాదానికి, ఇటువంటివి తన ఋజుదృక్పథంలో పూర్తిగా పొందిక గలవిగా కనిపించవచ్చు. ఒక సరికొత్త ఐక్యతాచైతన్యం మానవజాతిని అవహిస్తుంది.

ప్రపంచానికి భారతదేశం ఇచ్చే ఆధ్యాత్మిక వరం అప్పుడే ఆరంభమైంది. నిత్యం అధికమవుతూ ఉన్న పరిమాణంలో భారతదేశ ఆధ్యాత్మికత యూరప్, అమెరికాలలో ప్రవేశిస్తున్నది. ఈ ఉద్యమం ఇంకా పెరుగుతుంది. కాలానుగతంగా కలిగే విపత్తులమధ్య అధికాధిక నేత్ర దృక్కులు ఆదేశంవైపు ఆశతో తిరుగుతున్నాయి. భారతదేశ బోధలను మాత్రమేగాక దాని ఆత్మ ఆధ్యాత్మికానుష్ఠానాన్ని ఆశ్రయించటం కూడా అధికమవుతున్నది.

మిగిలినది ఇప్పటికి వ్యక్తిగత భావన, ఒక ఆదర్శం, ఒక ఆశాభావము. అది భారతదేశంలోను పశ్చిమంలోను భావిదృక్పథం గలవారందరినీ ఆకట్టుకొన నారంభించింది. ఏ ఇతర రంగంలో

జరిగే ప్రయత్నంకన్నా ఇక్కడ త్రోవలో ఎదురయ్యే కష్టాలు దుర్ఘటమైనవి. కాని కష్టాలు అధిగమించటంకోసమే ఏర్పడ్డాయి. అత్యుత్కృష్టమైన ఇచ్ఛఉంటే వాటిని అధిగమించవచ్చు. ఈ పరిణామం ఆత్మ, అంతరంగ చైతన్యాలు వృద్ధికావటం వల్లనే రావలసిఉంటుంది గనుక, ఇక్కడగూడ భారతదేశమే దీనికి అంకురార్పణ చేయవలసిఉంది. ఉద్దేశం విశ్వజనీనంగానే ఉండవలసినా, ప్రధానగమనం ఆ దేశానిదే (ఇండియాదే)గా వచ్చును.

భారతదేశం విముక్తిపొందిన ఈ తరుణానికి ఇదే నేను ప్రతిపాదించే అర్థం. ఈ రెంటి సంబంధం సఫలమవుతుందా? అయితే ఎంతవరకు, ఎంత త్వరాగాఅనేది ఈ నూతన, స్వేచ్ఛాయుత భారతదేశ మీద ఆధారపడి ఉంటుంది.

- శ్రీఅరవిందులు

అనువాదం : తెన్నేటి పూర్ణచంద్రరావు

శ్రీఅరవిందులు - రెండవ ప్రపంచయుద్ధము
(శ్రీఅరవిందుల శక్తి ప్రయోగము)

వాస్తవానికి, నా శక్తి ఆశ్రమమునకు, దాని స్థితిగతులకే పరిమితము కాదు. యుద్ధము యొక్క సత్పరిణామానికి మరియు మానవలోక పరివర్తనకును, అది వినియోగింప బడుచున్నదనే విషయము మీకు విదితమే. ఆశ్రమేతరమగు కొన్ని ప్రత్యేక ప్రయోజనాలకు మరియు యోగసాధనకు కూడ అది ఉపయోగించబడుచున్నది. కాని, ఈ పని చడీచప్పడు లేకుండ చాలావరకు ఒక ఆధ్యాత్మిక ప్రక్రియ ద్వారా నిర్వహించబడుచున్నది.

(పురాణములు, రామాయణ మహాభారతములు దేవదానవ సంగ్రామ వృత్తాంతములు రామ, కృష్ణులవంటి అవతారపురుషులు వహించిన పాత్రలను గురించి తెలియపరుస్తాయి. అలాంటి నాటకీయ పరిణామములే ఇరవైయవ శతాబ్దములో కూడ చోటు చేసుకున్నవి. శ్రీఅరవిందులు మరియు శ్రీమాత ఒక నూతన స్వర్ణశకానికి పునాదులు వేయుచున్న తరుణంలోనే, హిట్లరు, స్టాలిన్ లాంటి భయంకర రాక్షసులు కాలచక్ర గమనాన్ని తిరోగమింప ప్రయత్నించారు. యుద్ధమునందు మిత్రదేశాలకు సంపూర్ణ సహకారము అందించాలనే ఆదేశమునకు వారి ఒక అనుయాయునిలో రేకెత్తిన సందేహములకు సమాధానముగ శ్రీఅరవిందులు వ్రాసిన లేఖలోని కొన్ని భాగములను క్రింద పొందు పరచడమైనది.)

ఇది శ్రీమాత యొక్క యుద్ధమేనా యను సందేహము నీలో పొడచూపుచున్నది, అవును, అది నిజమే నను భావన నీలో ధృవపర్చాలని నన్ను కోరావు. ఇది శ్రీమాత యొక్క యుద్ధమేనని ఘంటాపథంగా మరోమారు నీకు నొక్కి చెప్పచున్నాను. ఇది కొన్ని దేశాల కొరకు మరికొన్ని దేశాలు సలుపుతున్న పోరుగానో లేక భారత దేశము కొరకు సాగుచున్న పోరుగానో భావించరాదు. ఇది మానవజాతి జీవనయానములో ఈ భూమిపై ప్రతిష్టింప బడవలసిన ఒక ఆదర్శమునకై జరిపే పోరాటము. ఇంతవరకు పరిపూర్ణ అనుభవములోకి రాని ఒక పరమ సత్యము కొరకు సలిపే పోరాటము. రాబోవు కాలంలో సమస్త భూమండలానిని, యావత్ మానవజాతిని ముంచివేయ ప్రయత్నిస్తున్న ఒక అజ్ఞాన అంధకారము పైన, ఒక అసత్యముపైన జరిపే పోరాటము. ఇక్కడ గమనించవలసినది; యుద్ధమును ప్రేరేపించిన శక్తులనేగాని, పైపైన ప్రస్ఫుటమయ్యే సంఘటలను కాదు. దేశముల యొక్క లోపములను, పొరపాట్లను ఎంచుటవలన ప్రయోజన ముండదు.

అందరిలోను లోపాలుంటాయి. అందరూ తప్పలు చేస్తారు. కాని, ఈ పోరాటంలో ఎవరు, ఏపక్షం వహించారనేదే ప్రధానాంశము. ఇది మానవజాతి యొక్క స్వేచ్ఛాస్వాతంత్ర్యములను పెంపొందించుటకై చేసే పోరాటము. మానవులు వారి మనోవికాసమునకు అనుగుణంగా, వారి ఆలోచనలను ఆచరణలను కొనసాగించుటకు తగు స్వేచ్ఛా వెసులుబాటు కలిగించుటకు, వారు సత్యమార్గములో వికసించి ఆత్మోన్నతిని పొందుటకు అనువైన పరిస్థితులను కలిగించుటకై చేయు పోరాటము. ఒకవేళ, ఒక వర్గము గెలిపొందినట్లయితే, స్వేచ్ఛా స్వాతంత్ర్యములపైన, వెలుగు, సత్యములపైన పెంచుకున్న ఆశలు అణగారి పోతాయనుటలో ఎట్టి అనుమానము లేదు. ఈ పరిస్థితుల నివారణకై చేపట్టవలసిన కార్యాచరణ మానవ సాధ్యముకాదు. అసత్యము అంధకారము రాజ్యమేలుతాయి. ఈ దేశ ప్రజలు కలలోనైనా ఊహించని, కనీవినీ యెరుగని అణచివేతకి, అవమానానికి మానవలోకము గురి అవుతుంది. ఈవిధంగా కాక, మానవాళి యొక్క భావి స్వేచ్ఛా స్వాతంత్ర్యముల పరిరక్షణకై ప్రతిజ్ఞ చేసిన మరో వర్గము విజయము సాధించినట్లయితే ఈ ఘోర విపత్తు నివారింపబడుతుంది. ఆదర్శము వికసించుటకు, దైవకార్యము నెరవేరుటకు, ఏ ఆధ్యాత్మిక సత్యమును ఈ భూమిపై ప్రతిష్ఠించుటకు మనమంతా బద్ధ కంకణులమై వున్నామో, అందుకు అవసరమైన అనుకూల వాతావరణము ఏర్పడుటకు, అవకాశము కలుగుతుంది. ఈ లక్ష్యసాధనకై పోరాడువారు దైవ కార్య నిమిత్తము పోరాడిన వారవుతారు. భయోత్పాతమును సృష్టించే అసురాధిపత్యమును ప్రతిఘటించిన వారవుతారు.

- శ్రీఅరవిందులు

అనువాదము

అందుగులపాటి కైలాసపతి,

జానకి.

శ్రీఅరవిందాశ్రమం

1910 నుంచి 1920 వరకు శ్రీఅరవిందులు నలుగురైదుగురు శిష్యులుతో పాండిచ్చేరిలో నివసిస్తూ ఉండేవారు.

శ్రీమాత పాల్‌రిచర్డ్సతో కలిసి 1914లో వచ్చారు. శ్రీఅరవిందులు "ఆర్య" పత్రిక సంపాదకత్వం వహించి నడిపేవారు. 1920, జనవరి దాకా అదికొనసాగింది.

ఏప్రిల్ 1920లో శ్రీమాత జపాను నుంచి తిరిగివచ్చారు. క్రమేపీ జనసంఖ్య పెరగసాగింది. 1926లో ఆశ్రమం స్థాపించబడింది.

సర్వోన్నత చైతన్యంతో (సత్, చిత్, ఆనంద) సమైక్యత, సాధారణంగా సాధనలకు ఆదర్శం. అది సాధించిన వాళ్లు తమ వ్యక్తిగత ముక్తితో సంతృప్తి చెంది ప్రపంచాన్ని దాని పాపానికి దానిని వదిలిపెట్టేవారు. అందుకు భిన్నంగా శ్రీఅరవిందులవారి సాధన ఇతరులు ఎక్కడముగిస్తారో అక్కడ నుంచి ప్రారంభమవుతుంది. సర్వోన్నతునితో సమైక్యత సాధించిన సాధన బాహ్యప్రపంచానికి తీసుకురావాలి. భౌతిక జీవన పరిస్థితులను అది మార్చాలి. పూర్తి రూపాంతరీకరణ సాధించాలి. ఈ లక్ష్యం సాధించేవరకు పూర్ణయోగసాధకులు తపో, ధ్యాన జీవనం కొరకు ప్రపంచంనుంచి విశ్రాంతి తీసుకోరు. ప్రతి ఒక్కరు తమ సమయంలో మూడవవంతు ఏదో ఒక ఉపయుక్తమైన పనికి వినియోగిస్తారు. ఆశ్రమంలో అన్ని రకములైన కార్యకలాపాలకు ప్రాతినిధ్యం ఉంది. ఎవరిస్వభావానికి అనుగుణమైన పనిని వారు యెన్నుకుంటారు. అయితే చేసేపని నిస్వార్థంగా సేవాభావంతో నిర్వర్తించాలి. ఆదర్శం ఎప్పుడూ సమగ్రమైన రూపాంతరీకరణమే. ఇది దృష్టిలో ఉంచుకోవాలి.

ఈప్రయోజన సాధనకే ఆశ్రమం వ్యవస్థీకరించబడింది. బ్రతుకు తెరువు గురించిన చింత ఎవ్వరికీ కలుగకుండా ఆశ్రమ వాసులందరికీ సహేతుకమైన వారి అవసరాలన్నీ తీర్చబడుతవి.

ఇన్నేళ్లుగా ఆశ్రమం ఇక్కడ ఉన్నా స్థానికంగా ఉన్న ప్రజలు ఆసక్తి చూపిస్తూన్నట్లు లేదే అని బాహ్యంగా విషయాలను దర్శించేవారు అనవచ్చు.

దానికి వెంటనే చెప్పే సమాధానం :

ఉన్నత చదువు సంస్కారం తెలివి, మంచితనం ఉన్నవాళ్లంతా ఆశ్రమాన్ని స్వాగతీ కరిస్తున్నారు. ఇంకా సద్భావన, సానుభూతి, ప్రశంసలు వ్యక్తపరుస్తున్నారు. పాండిచేరిలోని శ్రీఅరవిందాశ్రమానికి నిజాయితీకల అనుయాయులు, స్నేహితులు బాగానే ఉన్నారు.

ఇది చెప్పాక మా వైఖరి సుస్పష్టం :

ఏ సిద్ధాంతానికి మతానికి మేము వ్యతిరేకంకాదు,

ఏ ప్రభుత్వాన్నీ మేము వ్యతిరేకించం

ఏ సామాజిక వర్గంతోనూ మాకు పేచీలేదు

ఏనాగరికతకు, ఏదేశానికి మేము వ్యతిరేకం కాదు.

కాకపోతే, మేము పోరాడేది - విభజన, నిశ్చైతన్యం, అజ్ఞానం, జడత్వం, అసత్యం - వీటికి వ్యతిరేకంగా. సత్య, జ్ఞాన, సమైక్యత, చైతన్య ప్రతిష్ఠాపనకే మా కృషి, శాంతి, సత్య, శివ, సౌందర్యాల నూతన సృష్టికి వ్యతిరేక శక్తులపైనే మాపోరాటం.

- శ్రీమాత

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

పూర్ణయోగ లక్ష్యం

1. **సత్తా మొత్తం పరివర్తన:** ఒక ఉన్నత ఆధ్యాత్మిక చైతన్యంతో కూడిన, విశాలతర దైవిక అస్తిత్వంలోకి - సత్తా మొత్తం పరివర్తన పూర్ణయోగమునకు అంతిమ లక్ష్యం.

మనలో భాగాలైన - ఇచ్ఛ, పని, విజ్ఞానము, ఆలోచన, ఉద్వేగము, ప్రాణికము, ఆత్మ, స్వభావము ఇవన్నీ తప్పనిసరిగా - దైవాన్నన్వేషించాలి; 'అనంతునిలో' ప్రవేశించాలి; 'కాలాతీతుని' లో ఐక్యం కావాలి.

2. **ప్రారంభం :** కాని మనిషి ప్రస్తుత నైజము పరిమితమైనది, విభజించబడింది, అసమానమైనది. తను తన సత్తాలో శక్తివంతమైన భాగంపై దృష్టి కేంద్రీకరించి, తన నైజానికి సరిపడే నిర్దిష్ట మార్గంలో పురోగమించడం సులభం. సముద్రం వంటి దైవంలోకి, 'అనంతుని'లోకి, ఒకేమారు సూటిగా దూకగల సత్తా, బలము, కొద్ది మందికే ఉంటుంది. అందుచే కొందరు తప్పనిసరిగా, ప్రారంభంలో, ఆలోచన, ధ్యానంపై దృష్టి కేంద్రీకరించడం ఎంపిక చేసుకోవాలి ; లేదా, కాలాతీత ఆత్మసత్యాన్ని కనుగొనేందుకు బుద్ధినేకాగ్రం చేయాలి; లేదా, సమస్తాన్ని విడిచి, తమ హృదయంలో దైవాన్ని, 'కాలాతీతుని' కల్సుకోవాలి. ఇంకా మరికొందరు - చురుగ్గా క్రియాశీలంగా ఉండేవారు, తమ ఇచ్ఛాశక్తి పై గురి ఉంచి, పనుల ద్వారా తమ సత్తాను విస్తరించుకోవాలి.

తమ ఇచ్ఛను 'అనంతునికి' సమర్పించు కొనుట ద్వారా తమ ఆత్మతోను, అన్నిటికి మూలమైన పరమాత్మతోను, ఐక్యం చెంది - తమలో దాగి ఉన్న 'దైవం'చే తమ పనుల్లో నడిపింపబడి - తమ ఆలోచన, అనుభూతి, పనుల్లో కావల్సిన శక్తిని ప్రసరించే

'జగత్కార్యాధ్యక్షుని'కి ఆత్మ సమర్పణ కావించుకోవాలి. ఈ విధమైన నిస్వార్థ, సత్తా విస్తరణ ద్వారా 'ఆధ్యాత్మిక స్థాయి నిండు దనాన్ని' ముందుగా పనుల ద్వారా సంతరించుకోగలరు.

3. **అతిమానస అస్తిత్వస్థాయి:** కాని అతిమానసాన్ని చేరే మార్గము - దాని ప్రారంభస్థానమేదైనా తప్పనిసరిగా, ఒక విశాలతర ప్రదేశానికి చేరాలి. ఆ మార్గం తప్పనిసరిగా అంతిమంలో సమైక్య విజ్ఞానం, ఉద్రేకం, క్రియాశీల చర్యపై ఇచ్ఛ సత్తాలోను, ప్రకృతి మొత్తంలోను పరిపక్వత వీటన్నిటితో కూడిన సమగ్రత సంతరించుకున్నదయి ఉండాలి.

అతి మానస చైతన్యంలో, అతిమానస అస్తిత్వస్థాయిలో, ఈ సమైక్యతాభావం పరాకాష్ఠ నొందుతుంది. అక్కడ - విజ్ఞానం, ఇచ్ఛ, ఉద్రేకం, ఆత్మ పరిపక్వత, క్రియాశీల నైజపరిపక్వత - ప్రతి ఒక్కటి, పరిపూర్ణ స్థాయికి యెదుగుతుంది. అంతే కాకుండా, ఇవన్నీ, పరస్పర సామరస్యంతో - దివ్యసమైక్యత, దివ్యపరిపూర్ణతల స్థాయిలో పరస్పరం పెనవేసుకుంటాయి. ఎందుకంటే 'అతిమానస' సత్యచేతన దీనిలో సంపూర్ణంగా అభివ్యక్తమైన దివ్యఅస్తిత్వం ఇక ఎంతమాత్రం 'అజ్ఞానం' అనే పనిముట్టు సహకారంతో పనిచేయదు. స్వయంగా అస్తిత్వం, పరిపక్వతలో పూర్ణత్వం, క్రియాశీలత, కల్గిన సత్యస్థాయి' సత్తా - సత్యశక్తితో క్రియాశీలమౌతుంది. దాని ప్రతి కదలికలో - స్వయంగా 'సత్యచేతన' కల్గిన 'దివ్య-సత్తా' కదలికలుంటాయి; ఈ కదలికలో ప్రతిభాగం 'మొత్తం'తో సామరస్యం కల్గి ఉంటుంది. 'సత్యచేతన'లో కల్గే అతిచిన్న, పరిమితమైన చర్యకూడ, ఆ 'అనంతుని' 'కాలాతీతుని', కదలికయే, ఈ స్వల్ప కదలికలలో కూడ ఆ అనంతుని, కాలాతీతుని పూర్ణత్వం, పరిపక్వత, ఉంటాయి.

4. **ఈ యోగం అంతిమ లక్ష్యం:** అతి మానస సత్యంలోకి పెరుగుదల మన ఆధ్యాత్మిక ముఖ్య చైతన్యాలను అదే స్థాయికి పెంచుతుంది. అంతేకాక, అతిమానస 'వెలుగును' 'సత్యాన్ని' మన సత్తా అంతటిలోకి, అన్ని భాగాల్లోకి, ప్రకృతిలోకి క్రిందికి అవతరింప జేస్తుంది. అప్పడంతా, 'దివ్య సత్యం'లో భాగమౌతుంది. ఈ మౌలిక పరిణామమే పరమాత్మలో ఐక్యానికి ఏకత్వానికి సాధనము. అందుచే, తప్పనిసరిగా, ఈ ఆరోహణ, అవరోహణలే ఈ యోగ అంతిమ లక్ష్యం.

5. **వ్యక్తిగత స్థాయిలో :** వృద్ధి పర్చబడిన అతిమానస వ్యక్తిత్వము, అతిమానస పురుషత్వంకాదు. మనం చేరాల్సిన గమ్యం :-

మనసత్వము సమస్త సత్వము 'దైవిక అస్తిత్వం'తో ఐక్యం కావడమే ఈ యోగ ముఖ్య ధ్యేయం: ఈ విషయం గుర్తుంచుకోవటం అవసరం. కేవలం అతిమానసము సంపాదించుటకై ఈ యోగం చేపట్టబడలేదు; దైవం కోసమే చేపట్టబడింది. మనం అతిమానసాన్నన్వేషించేది, దాని ఆనందం కొరకో, ఔన్నత్యం కోసమో కాదు. దానితో మన ఐక్యతను సమగ్రము సంపూర్ణం చేయుటకే; దాని అనుభూతి కోసం, మన సత్తాలోను, నైజంలోను, సర్వత్రా, అన్ని విధాలా, ఈ ఐక్యతను మిక్కిలి తీవ్రతతో, వైశాల్యంతో, క్రియాశీలం చేసి వ్యాప్తి చేయడానికే. ఎక్కువ మంది అనుకుంటున్నట్లు - ఒక శక్తివంతమైన, ఘనమైన అతిమానస పురుషత్వం 'దివ్యశక్తి' గొప్పదనం, ఆత్మ సాఫల్యత - గల వ్యక్తిత్వాన్ని చేరుకోడంకాదు మన అతిమానస యోగలక్ష్యం. ఇది తప్పడు ఆలోచన. ఇదొక ఉపద్రవ పూరిత తప్పడు భావన: ఉపద్రవ పూరితం, ఎందువల్లనంటే, మనలోని రాజసిక, ప్రాణిక బుద్ధినుండి జనించే గర్వం, దర్పం, పేరాశ-బాగా వృద్ధిచెందే అవకాశం ఉంది. వీటిని అధిగమించ లేకపోతే,

తప్పనిసరిగా అవి, వ్యక్తిని ఆధ్యాత్మిక పతనం వైపు నడిపిస్తాయి. ఇది తప్పుడు భావన, ఎందువల్లనంటే, ఇది వ్యక్తిగతమైన, అహంకార పూరిత భావన. వ్యక్తిగత అహంకారాన్ని వదుల్చుకోడమే అతిమానస మార్పునకు మొదటి షరతు, చురుకైన, క్రియాశీల నైజం కల్గి, ఇచ్ఛతో పన్లు చేసే వ్యక్తి విషయంలో ఇది అత్యంత ప్రమాదకరం. దీనివల్ల అతడు, సులభంగా శక్తివంతమైన అధికార అన్వేషణకై నడిపింపబడతాడు. అతిమానస పరిణామంలో ఆధిపత్యము తప్పనిసరిగా వస్తుంది. పరిపక్వ చర్యకు మొదటి షరతు శక్తిరావడం. కాని ఇక్కడ వచ్చేది 'దివ్యశక్తి'. అదే ప్రకృతిని, జీవితాన్ని చేపడ్తుంది. కాని ఇది విలాస వంతమైన వ్యక్తిగత శక్తికాదు. ఆధ్యాత్మిక వ్యక్తి ద్వారా పనిచేసే దివ్య శక్తి. ఇది వేర్పాటు బుద్ధి, ప్రాణికాహంకారాల తుది వైభవం, సఫలత, కాదు. ఆత్మ సాఫల్యత, యోగ ఫలితమే కాని, దాని లక్ష్యం - వ్యక్తి గొప్పదనం కాదు.

౬. **దైవంతో పూర్ణమైన ఐక్యతే ఏకైక ధ్యేయం :** ఆధ్యాత్మిక పరిపక్వత, నిజాత్మను తెల్సుకోడం, దివ్యచైతన్యం, దివ్య ప్రకృతిని పొందటం తద్వారా దైవంతో ఐక్యం కావడమే ఏకైక లక్ష్యం, (సాధర్మ్యముక్తి) మిగిలినదంతా, దాని వివరణ, కావల్సిన పరిస్థితి. అహంకార పూరిత క్షణి కావేశాలు, పేరాశ, అధికారం, గొప్పదనం కొరకు వాంఛ; వ్యామోహమాటం లేకుండా, గర్వంతో పట్టిన పట్టునెగ్గించుకోవాలనే కోర్కె- ఇవన్నీ ఉన్నత చైతన్యానికి వ్యతిరేకమైనవి. అవి - అతిమానసాన్ని, దూరం నుంచైనా సమీపించే అవకాశానికి, దాటశక్యంగాని అడ్డుగా నిలుస్తాయి. తనలోని ఉన్నత జీవాత్మను దర్శించడానికి తన నిమ్న చేతనను తప్పనిసరిగా వదులుకోవాలి. 'దైవం'తో ఐక్యం కావడమే తప్పనిసరిగా, అన్ని లక్ష్యాలను ప్రభావితం చేసే ఏకైక లక్ష్యం కావాలి: తన సత్తాలలోని నిజసత్వాన్ని, అలాగే, అన్ని సత్తాలో సత్వాన్ని; సత్యంలో జీవాన్ని, ఉన్నత చైతన్యాన్ని ప్రకృతిలో

పరిపక్వతను - కనుగోడం - ఇవన్నీ, ఈ ఉద్యమానికి (జీవ-బ్రహ్మైక్య ఉద్యమ) సహజ ఫలితాలే; ఉద్యమ పరాకాష్టకు, విడ్డిపెట్ట వీలుకాని షరతులే; ఇవన్నీ కేంద్ర లక్ష్యంలో భాగమే; ఎందుకంటే, ఇవన్నీ ఈఉద్యమానికి కావల్సినవి. అభివృద్ధికి పరిణామ ప్రక్రియలే.

౭. **అతిమానస పరిణామం మాత్రమే :** అంతిమ దశ. అతిమానస పరిణామం ఒక కష్టమైన బహుదూరపు అంతిమ దశ. ఇది గర్తుంచుకోవాలి. ఇది దూరంగా మనో ఫలకంపై కన్పడే - సన్నని మార్గం యొక్క చిట్టచివరి దృశ్యం. తప్పనిసరి. దీనినే మొదటి లక్ష్యంగా, నిరంతరం దృష్టికి వచ్చే ధ్యేయంగా, లేదా వెంటనే సాధించవల్సిన లక్ష్యంగా - మల్చుకోలేము, మల్చుకోకూడదు. ఎందుకంటే, ఎంతో కష్టమైన ఆత్మవిజయం, తనను తాను అధిగమించడం, అనేక సుదీర్ఘ క్లిష్టదశలతో కూడిన ప్రకృతి స్వయం పరిణామ స్థాయి తరువాతనే, అతిమానస మార్పుజరిగే అవకాశం దృష్టికి రాగలదు.

మూలం : శ్రీఅరవిందులు

అనువాదం : యస్.వై. సోమయాజులు

అతిమానస పరిణామ దశలు

వ్యక్తి తన జీవిత ప్రేరణలు, స్వాభావిక స్పందనలు, వస్తువుల పట్లగల సాధారణ దృష్టి మొదలైన వాటినుండి విముక్తుడు కావాలి. వాటికి బదులుగా ఆ స్థానంలో అంతరంగ యోగ చైతన్యాన్ని, సాధించాలి. ప్రస్తుత జీవనిర్మాణం మొత్తంలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చుకోవాలి. తరువాత యింకా లోతుకిపోయి అక్కడ మరుగున వెలుగుతున్న చైత్యపురుషుని వునికి కనిపెట్టాలి. ఆ వెలుగులో తన బాహ్య, అంతర విభాగాలు, మార్పుకి లోనయిన బుద్ధి, ప్రాణ, శరీర, స్వభావాలు యింకా తన మానసిక, ప్రాణిక, భౌతిక క్రియాకలా పాలన్నీ ఆత్మచైతన్య పరికర్మలుగా, స్థితిగతులుగా మార్చాలి. తరువాత

గాని లేక అదే స్థితిలోగాని ఒక దివ్యకాంతి, తీవ్రత, శుద్ధత, జ్ఞానం, స్వేచ్ఛ విస్తృతి మొదలైన దివ్యలక్షణాల అవతరణ ద్వారా ప్రాణి మొత్తం ఆధ్యాత్మికత సాధించాలి. భౌతికమైన, జీవన సంబంధమైన, వ్యక్తిగతమైన ఆలోచనల నధిగమించాలి. అహాన్ని నీరసింపజేసి పరిమితులన్నింటినీ ఛేదించడం అత్యవసరం. అప్పడే విశ్వ చైతన్యంలో ప్రవేశించి, ఆత్మని గుర్తించగలం. ఆధ్యాత్మిక విశ్వభావన, హృదయ స్పందన పొందగలం. దానివలన జీవశక్తి భౌతిక చైతన్యం కూడా పొందుతాము.

అప్పడు మాత్రమే అతిమానస చైతన్య సాధన మార్గంలో తొలి అడుగు వేసినట్టు. అప్పడు కూడా అధిరోహణలో ఇంకా అతిక్లిష్టమైన ఘట్టం వుంది. ఏ దశకాదశే ఒక ప్రత్యేకమైన ఘన విజయం. యోగా, జీవి ఏకాగ్రతతో కూడిన చైతన్య వికాసం పొందడానికి సహకరిస్తుంది. కాని యెంత తొందరగా అనుకున్నా, ఒకే జన్మలో ఫలించినదైనా కావచ్చు, లేదా, అదే పరికర్మ ప్రకృతి కొన్ని శతాబ్దాలు, సహస్రాబ్దాలు, లేదా కొన్ని వందల జన్మలు పట్టవచ్చు. ఏదేమైనా పరిణామ క్రమంలో అన్ని దశలూ అధిగమించవలసినదే. ఎంత గొప్ప ఏకాగ్రతతో, సాధనతో తొందరగా చేయాలనుకున్నా అందులో సహజంగా దాటవలసిన దశలన్నీ దాటవలసిందే. మధ్యలో కొన్ని మిగిల్చి వేయడానికి గాని, వదిలిపోవడానికి గాని, అడ్డదారిలో తారుమారు చేయడానికి గాని కుదరదు. అజ్ఞానంతో యెవరైనా ముందు పరుగులు పెట్టినా, లేక అతిమానసాన్ని వెంటనే ఒక కొంకి కర్రతో శాశ్వతునిలోని అత్యున్నత స్థానం నించి క్రింద పడేయాలని అనుకోవడం శుద్ధ అవివేకం. అవివేకం మాత్రమేకాదు. అత్యంత ప్రమాదకరం కూడా.

మొదట అంతరంగ చైతన్యం సాధించు

మనిషిలో యెప్పడూ రెండు విరుద్ధ చైతన్యాలుంటాయి. సాధారణ జీవితాలలో వుండే బాహ్య చైతన్యం ఒకటి, అంతరంగంలో దాగివుండి ఆ మనిషికే తెలియని అంతరంగ చైతన్యం మరొకటి, వ్యక్తి సాధనచేయడం యెప్పడు ప్రారంభిస్తాడో, అప్పడు ఈ అంతరంగ చైతన్యం వికసించడం మొదలవుతుంది. అప్పడే అతడు తన అంతరంగంలోకి ప్రవేశించి అన్నిరకాల అనుభవాలు పొందగలడు. సాధన తీవ్రతరమౌతున్న కొద్దీ యెక్కువ సమయం అంతరంగ జీవితానుభవంలోనే గడుపుతాడు. బాహ్యజీవితం నిస్సారంగా, అనావశ్యకంగా తోస్తుంది. మొదటి దశలో యీ - అంతరంగ చైతన్యం ఒక కలలాగ, తరువాతది మేలుకొన్న వాస్తవం అనిపిస్తుంది. తదుపరి అంతరంగ చైతన్యం వాస్తవం అవుతుంది. బాహ్య జీవితమే కొందరికి కలలాగ, భ్రాంతిలాగ తోస్తుంది. అంతరంగ చైతన్యం గంభీర ప్రశాంతత, తేజస్సు, ఆనందం, ప్రేమ, దివ్య సామరస్యం దివ్యసన్నిధి, దివ్యమాత భావనతో ప్రారంభమవుతుంది. అప్పడు మనిషి తన రెండు చైతన్యాలను గుర్తిస్తాడు. అంతరంగం, బాహ్యం పరస్పరం గుర్తించి బాహ్య చైతన్యం అంతరంగ చైతన్యంలో విలీనమయి దానికి పరికరంగా మారిపోతుంది. అదికూడా ప్రశాంతత, తేజస్సు, దివ్యత్వంతో ఏకీకరణ సంతరించుకోవాలి.

- శ్రీఅరవిందులు

తరువాత మరుగున వున్న చైత్యపురుష అస్తిత్వాన్ని కనిపెట్టు

మనలోవున్న చైత్యపురుషభాగం దైవం నించి మనలోకి నేరుగా దిగివచ్చినది. దైవంతో అనుబంధం కలది. మూలంలో ఫలప్రదమయ్యే దివ్యసంభావ్యతలకు ఇది బీజం. నిమ్నత్రయమయిన మనః ప్రాణ శరీరాలలో ఇది గర్భితమై అభివ్యక్తమవుతుంది. ఇది మొదటి దశలో అభివృద్ధి చెందదు. తరువాత అభివృద్ధి చెందినా

ప్రత్యక్షంగా యెప్పుడూ ముందుకు రాదు. సాధారణ చేతనకువెనుక కనిపించదు. దాగి ఉంటుంది. అపరిపూర్ణ ఉపకరణాల పరిమితులకు లోబడి తనను తాను వ్యక్తపర్చుకుంటుంది. దివ్యానుభవం దిశగా చైతన్యంలో యెదుగుతుంది. దానినించి శక్తిని పుంజుకుంటుంది. ఇలా ఉన్నత చలిత-చాలనం జరిగినప్పుడల్లా అద్భుతమైన కదలిక మనలో కలుగుతుంది.

- శ్రీఅరవిందులు

శ్రీమాత మాటలు :

మొదట కావలసినది దైవము కొరకు ఆకాంక్ష, తరువాత నీవు దానిని పరిపోషించాలి. ఆకాంక్షను, సాధనను సజీవంగా నిలుపుకోవాలి. దాని మీద ఏకాగ్రత చాలా అవసరం. దైవం మీద ఏకాగ్రత సంపూర్ణంగా ఆ దివ్యసంకల్పం, దివ్య ప్రయోజనం కోసమే ముడుపు కట్టాలి.

నీ హృదయంలోకి దృష్టి కేంద్రీకరించు. అందులో ప్రవేశించు. నీ కెంత వీలైతే అంతగా లోలోపలికి చొచ్చికొనిపో. అన్నివైపులా వ్యాపించిపరుచుకున్న నీ చైతన్య సూత్రాలన్నింటినీ సేకరించి చుట్టచుట్టి ఒక్క మునకలో లోలోపలికి పో.

అక్కడొక అగ్ని జ్వలిస్తూ వుంటుంది. అది హృదయాంతరంలో ప్రశాంతంగా వెలుగుతూ వుంటుంది. అదే నీలో దాగిన దివ్యచైతన్యం. నీ నిజస్వరూపం. ఆ దివ్యవాణిని విను. ఆ ఆదేశాన్ని మన్నించు.

చైత్యపురుషు ఉనికి కనిపెట్టడం వ్యక్తిగత విషయం. అదొక గొప్ప నిర్ణయం. దానికి దృఢ సంకల్పం, అవిశ్రాంత కఠిన సాధన ఖచ్చితంగా వుంటేనే లక్ష్యాన్ని చేరగలరు. ఎవరికి వారే వారిదైన మార్గంలో సాధనచేస్తూ యెదురైన ఆటంకాల్ని, కష్టాల్ని

అధిగమించడంలో వారికి వారే బాధ్యులు కావాలి. గమ్యం కొంత వరకు తెలుస్తుంది. కొంతవరకు యిది చేరుకున్న వారి వర్ణన ద్వారా కూడా తెలుసుకోగలం. అయితే దానిని కనిపెట్టడం అందులో చాలా యెక్కువ భాగం అనుకోని హఠాత్ జ్ఞానం (spontaneity) సారళ్యతల ద్వారానే. అది మామూలు ఆలోచనలకు, సూత్రాలకు అందని అసాధారణ ప్రక్రియ.

దీనికి ఆరంభంగా నీలో నీ శరీరానికి, ప్రాణికానికి లోబడకుండా స్వతంత్రంగా ఉండే దానిని గురించిన అన్వేషణ కావాలి. అది నీ మానసిక భావనతో కాని, భాషతో కాని యేర్పడలేదు. నీ అలవాట్లు, ఆచారాలు, పరిసర వాతావరణంలాంటి వాటితో దానికి సంబంధం లేదు. దేశకాల పరిస్థితుల ప్రమేయం లేదు. నీ సత్వపు లోతులలో దానిని నీవు కనుగొనాలి. తనలో అది అనంతత్వ భావన కలిగి ఉంటుంది. అది అనంత వ్యాపకమైనది. అవిచ్ఛిన్నమైనది.

కాని నేను మొదటే చెప్పాను. దీని సాధనకి మార్గం చాలా సుదీర్ఘమైనది కష్టమైనది. అనేక రకాల మాయాజాలాలు, సమస్యలతో నిండినది. స్థిరమైన నిర్ణయం కావాలి. ఒక అజ్ఞాత ప్రదేశం కనిపెట్టడానికి దుర్గమారణ్యంలో ప్రవేశించిన పరిశోధన బృందంలా పనిచేయాలి. అంత గొప్పతపన, పట్టుదల వుండాలి. ఒక చైత్యాత్మ కనిపెట్టాలిఅంటే, ఒక కొత్త ఖండాన్ని కనిపెట్టిన వారి కుండవలసినంత గొప్ప కష్ట సహిష్ణుత, పట్టుదల, కార్యదీక్ష వుండాలి. ఏవో కొన్ని సులభమైన సలహాలివ్వడం వల్ల అవి వుపయోగపడి కొంతతేలిక కావచ్చు.

మొదట్లో ముఖ్యంగా ఆధ్యాత్మిక విషయాలను నిర్ధారించే శక్తి మన మనసుకుండదు. ఈ విషయం గురించి వ్రాసినవారు

చెప్పినదిది. చాలా కొద్దిమంది దీనిని ఆచరణలో పెట్టగలరు. అయినప్పటికీ యీ మార్గంలో పోవాలంటే మేధోసం బంధమైన అభిప్రాయాలకు, ప్రతిక్రియలకు లోబడని దృఢనిర్ణయం కావాలి.

వ్యక్తిగతమైన సౌకర్యాలు, సంతృప్తి, వినోదం లేక సుఖం అన్నింటినీ విడిచిపెట్టాలి. ప్రగతికోసం ప్రజ్వరిల్లే అగ్నిశిఖలా కావాలి ఏ సహకారం అందినా అది నీ ప్రగతి కోసమే అనుకొని స్వీకరించాలి. ప్రగతిని యెంత వేగంగా వీలైతే అంత వేగంగా సాధించాలి.

నువ్వు చేస్తున్న సాధనలో ఆనందాన్ననుభవించు. కాని ఆనందం కోసం ఏదీ చేయకు.

అవేశపడకు. ఆందోళనవద్దు. అన్ని పరిస్థితులలో పరిపూర్ణ నిశ్చలతతో ఉండు. నువ్వు కనుగొన్న దానిని జాగ్రత్తగా చేస్తూ చెయ్యవలసినది చెయ్యడంలో కాలయాపన చెయ్యకు.

భౌతిక సంఘటనల పైపై ప్రాధాన్యతలు పట్టించుకోకు. వేరే వాటి గురించి అర్థం పర్థం లేని వివరణ లివ్వడం నిరర్థకం. దాని వలన మనకి కావలసిన యదార్థమైనది కనిపించకుండా పోతుంది.

ఇతరుల ప్రవర్తన గురించి ఫిర్యాదు చేయకు. అలా కాక వాళ్ల ప్రవర్తన మార్చగలిగే సమర్థత వుంటే మార్చు.

ఏలక్ష్యాన్ని నువ్వు నిర్దేశించుకున్నావో ఆ లక్ష్యం నుంచి యెన్నడూ వైదొలగకు. లక్ష్యాన్ని మరిచి పోకు, ఎప్పుడైతే ఒక లక్ష్యాన్ని ఎన్నుకున్నావో దానిముందు ఇంకేవీ ముఖ్యంకాదు. విజయానికి కారణమైన విషయాలన్నీ సమానమే. అవి తొందర పెట్టేవైనా, ఆలస్యం చేసేవైనా ఏవైనా సరే. నువ్వు ఆహారం తీసుకునే ముందు నీ ఆకాంక్ష మీద ధ్యానం వుంచు. నువ్వు తీసుకునే ఆహారం నీ గొప్పలక్ష్యాన్ని చేరుకునే శక్తి నీకివ్వాలని. దాని కవసరమయిన శక్తిని సాధించే పట్టుదల, పరిశ్రమ ద్వారా ఫలితాన్నిచ్చేటట్టు ప్రయత్నించు.

నీ అలసిపోయిన నరాలు తాము పోగొట్టుకున్న శక్తిని తిరిగి సంతరించుకుని ప్రశాంతతని, నెమ్మదితనాన్ని నీ మెదడుకి ప్రసాదించాలని, తిరిగి నీ సాధనా మార్గం నీ గొప్పలక్ష్యాన్ని సాధించాలని నిద్రపోయే ముందు ఏకాగ్రతతో కొద్దిక్షణాలు ధ్యానించు.

నువ్వు యేపని చేసేముందైనా ఆ పని నీలక్ష్య సాధనకు ఎటువంటి అవాంతరం తెచ్చిపెట్టకుండా ముందుకి సాగిపోయేటట్టు చేయాలని ఆకాంక్షించు.

నువ్వు మాట్లాడేటప్పుడు, నీనోటినించి మాటవెలువడే ముందు ఆ మాటల్ని మననం చేసుకుని ప్రగతి కారకమైనవైతేనే మాట్లాడు. అవి నీ ప్రయత్నానికి హానికలిగించేవి కాకూడదు. నీ గొప్ప లక్ష్యాన్ని చేరుకోడానికి తోడ్పడేవి కావాలి. ఇవన్నీ సరిచూచుకుని మాట్లాడాలి.

సారాంశంగా, నీ జీవిత లక్ష్యాన్ని, ప్రయోజనాన్ని యెప్పడూ మరువకూడదు. గొప్ప విషయాన్ని కనుగొనాలనే ఇచ్ఛ ఎప్పడూ ఉన్నతంగా ఉండాలి. నీవు చేసే పనులన్నిటికంటే కూడా వున్నతంగా నీ ప్రాణ స్పందనలన్నింటినీ అధిగమించి ఒక పెద్దతేజో విహంగంలా నిన్నా క్రమించాలి.

అలుపెరుగని నీదృఢ ప్రయత్నానికి ముందుగానే ఒక అంతర్ ద్వారం హఠాత్తుగా తెరుచుకుంటుంది. కళ్ళుమిరుమిట్లు గొలిపే ఒక ఉజ్వల కాంతి వైభవంలోనికి నువ్వు ప్రవేశిస్తావు. అదే నీకు శాశ్వత దృఢ విశ్వాసం తెచ్చిపెడుతుంది. అటువంటి స్పష్టమైన అనుభవంలో నువ్వు యింతవరకు జీవించలేదు. ఇకముందు జీవిస్తావు. ఈ బాహ్యరూపాలు మాత్రమే నశిస్తాయి. ఇవన్నీ నువ్వే వాస్తవంలో వున్నావో దానికి సంబంధించినవి. పనికిరాని దుస్తులు విడిచి పెట్టినట్టు వీటిని విడిచిపెడ్తావు. అప్పడు నువ్వు స్థిరంగా

నిలబడతావు. బంధనాలన్నిటినుంచి విముక్తుడవతావు. ప్రకృతి నీపై మోపిన పరిస్థితుల వత్తిడిలో నలిగి నశించి పోకుండా వుండాలంటే నువ్వు అత్యంత సహనంతో ఆ బాధనంతా భరించాలి. నిటారుగా నిలబడి దృఢ సంకల్పంతో ముందుకు అడుగు వేయాలి ఆత్మ విశ్వాసంతో చైతన్య భవ్యత కోసం.

అయినాకూడా భౌతికమైన, శారీరకమైన వ్యక్తిగత అనుబంధాల బానిసత్వంనుండి విముక్తి పొందడం అంతిమ ఫలితం కాదు. శిఖరాగ్రాన్ని చేరడానికి అత్యున్నత ఫలితం కాదు. ఇంకా అధిగమించవలసిన యితర దశలున్నాయి. అవి వాటితో బాటు తదనంతర, దశలు దాటిన తరువాత భవిష్యత్తుకి ద్వారాలు తెరుచుకుంటాయి.

- శ్రీమాత

తరువాతగాని సమకాలంలోగాని ప్రాణికం ఆధ్యాత్మికం కావాలి.

ఆధ్యాత్మికానుభూతికి, చైత్యపురుషానుభూతికి మధ్య తేడావుంది. ఆధ్యాత్మికత వున్నతత్వం నుండి దిగి వచ్చిన మార్పు. బుద్ధిని, ప్రాణికాన్ని భౌతికాన్ని వశపర్చుకొని వ్యక్తి ఆంతర్యంలో కలిగిన పరిణామం చైత్యపురుష అనుభూతి.

చైత్యపరుష పరిణామం ముందు జరగాలి. మన ప్రస్తుత స్వభావమంతా ఆత్మపరికర్మగా పరిణామం చెందాలి. దాని వలన లేదా దానిద్వారా ఆధ్యాత్మిక పరిణామం కలగాలి. ఉన్నత దివ్య తేజస్సు, జ్ఞానము, శక్తి, శక్తి తీవ్రత, దివ్యానందము, నిర్మలత్వ సత్యము యొక్క నిమ్నాతినిమ్న అంతరాంతరాళాలలోని ప్రాణిక, శారీరక మూలలోనికి, ఇంకా తమస్సుచే ఆవరింపబడిన వుపచేతనలోకి సహితం దిగిరావాలి. చిట్టచివరిగా అతిమానస పరిణామం హఠాత్సం భవంకావాలి. అతిమాన చేతనకి ఆరోహణ, సత్వమంతటి లోనికి, స్వభావంలోనికి అతిమానస దివ్యచేత అవరోహణ, ఒక పట్టాభిషేక సమయం వలె (as the crowning moments) వైభవోపేతంగా సంభావ్యమవాలి.

హృదయకేంద్రంలోని ఏకాగ్రతా శక్తి హృదయ కేంద్రాన్ని తెరుస్తుంది. ఆకాంక్ష, ప్రేమ, భక్తి, సమర్పణశక్తులు జీవాత్మ పైన కప్పిగుప్తంగా ఉంచిన ముసుగును వైదొలగిస్తుంది. అపుడు జీవాత్మ లేక చైత్యపురుష (శక్తి) ముందుకు వస్తుంది. అది మనో, ప్రాణిక, దేహాలను నియంత్రించి వాటిని దైవానికి సుముఖంగా ఉంచుతుంది. అందుకుగల ఆటంకాలను తొలగిస్తుంది. దీనినే ఈ యోగంలో చైత్యపురుష రూపాంతరీకరణంగా పిలువబడుతుంది.

శిరస్సు పై భాగం (సహస్రారం) మీద కేంద్రీకరించిన శక్తి, ప్రశాంతత, నిశ్శబ్దత, శారీరక యింద్రియలాలస నించి విముక్తి ప్రసాదిస్తుంది. బుద్ధి, ప్రాణాలతో అభేదం, నిమ్న చైతన్యం, వున్నత చైతన్యంలోకి, వున్నత చైతన్యం నిమ్న చైతన్యంలోకి దిగిరావడానికి తోడ్పడుతుంది. ఈ యోగంలో దీనినే ఆధ్యాత్మిక రూపాంతరీకరణం అంటారు.

ప్రశాంతత, కాంతి, శక్తి, దివ్యానందాలకు వ్యవస్థీకృత. అవరోహణ ఆధ్యాత్మిక పరిణామమంటే. ఆత్మ, దివ్యతత్వం, వున్నతవిశ్వ చైతన్యం మొదలైన మొత్తం అంతా దివ్యచేతన దిశగాసాగే పరిణామం.

ఆధ్యాత్మిక పరిణామం నా దృష్టిలో ప్రగతి శీలమైనది. (something dynamic) (కేవలం ఆత్మ విముక్తి కాదు. ఏకైకుని The one పొందటమూ కాదు. ఇవి ఏ అవరోహణలు లేకుండానే సాధించవచ్చు.)ఇది సత్వము యొక్క ప్రతిభాగము-కింద అవచేతన వరకూ-ఆధ్యాత్మిక చైతన్యంతో నింపి పరిపుష్టం చేయటం. ఇది ప్రగతి శీలము, స్థితిశీలము కూడా. ఇది చేతనను మౌలికంగా దాని మానాన దాన్ని ఆత్మ ప్రభావానికి వదిలిపెట్టి, కేవలం పవిత్రీకరణ, మనోహృదయ వికాసం, ప్రాణిక నిశ్చలనం కావించటం వల్ల సాధ్యంకాదు. అంటే దీని అర్థం దివ్యచేతనను క్రిందికి తీసుకొని వచ్చి గతిశీలము, స్థితిశీలము అయిన దివ్యచేతనతో అన్ని భాగాలను నింపి, ప్రస్తుత చైతన్యం స్థానంలో, ఆ చైతన్యాన్ని పునః స్థాపన కావించటం.

- శ్రీఅరవిందులు

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి

దాస్యం

మహిళా స్వాతంత్ర్యం ఏ చట్టం వలనా సాధ్యం కాదు. తాముగా స్త్రీలే సంకల్పించుకొని విముక్తిని పొందాలి. స్త్రీల దాస్యానికి గల కారణాలు మూడు.

1) పురుషుని పట్ల ఆకర్షణ అతని శక్తి
2) గృహజీవితం పట్ల కోరిక, దానియొక్క భద్రత
3) మాతృత్వాన్ని ఆకాంక్షించడం

ఈ మూడు బంధాలనుంచి స్వేచ్ఛ సాధిస్తే, యదార్థంగా స్త్రీ పురుషునికి సమానమౌతుంది.

అలాగే పురుషులకూ మూడు బంధాలున్నవి.

1) కైవశం చేసుకొనే బుద్ధి, పెత్తనం చేయాలనే పట్టుదల, అధికార ప్రాబల్యం
2) కామంతో, స్త్రీలని పొందాలనే కోరిక
3) వైవాహిక బంధం కోరుకొని అల్పసుఖాలకై జీవించే దౌర్బల్యం

ఈ మూడింటి నుంచి ముక్తి పొంది మానవుడు స్త్రీలో సమాన స్థితి పొందుతాడు.

పురుషులవలె స్త్రీలకు ప్రాణిక ప్రాపంచిక అవసరాలకు బద్ధుల మనే స్పృహవుండదు. అదేగాక పురుషుల దర్పం, మానసిక ఆడంబరాలూ, పటాటోపాలూ వారికి లేకపోవడంతో సులభంగా తమలోని చైత్యసత్తను గుర్తించి తద్వారా మార్గనిర్దేశకత్వాన్ని పొందుతారు. మామూలుగా మాటలతో వ్యక్తపర్చుకునే ఒక మానసిక చైతన్యం వారికుండదు. తమ భావాభిప్రాయాలను గుర్తించి చక్కని స్పృహతో ఉత్తమ స్త్రీలు చేతలతోనే కార్యాన్ని సాధిస్తారు.

ఆధ్యాత్మికంగా అత్యున్నత వికాసం పొందిన మహిళలున్నారు. అయినా కొందరు నారీమణులు మానసిక ప్రవృత్తి, మేధా సంపత్తి కన్నా కర్మాచరణలోనే ఆసక్తితో జీవిస్తారు. అదేతృప్తి. అందునా తమ

అతీత అధ్యాత్మానుభవాలను లిఖించినవారు అరుదుగా వుండి అజ్ఞాతంగానే జీవించారు.

వాస్తవమైన శిష్యునిగా జీవించడం ఎంత కష్టమో నిజమైన గృహిణిగా వుండడం అంతే దుర్లభం

- శ్రీమాత

అనువాదం : టి.యస్. రామచంద్రరావు

భారతదేశం గురించి శ్రీమాత చెప్పిన మాటలు

ఓ భారతావనీ, జ్యోతిర్మయీ, దివ్యజ్ఞానమయీ! మేలుకో ప్రపంచంలో నీ కర్తవ్యానికి సామరస్య సమైక్యతలకు మార్గ నిర్దేశంకావించు.

శ్రీమాత నాటి ప్రధానికి ఇచ్చిన సందేశము

భారతదేశము ప్రపంచ భవిష్యత్తుకై చక్కని ఆదర్శాన్ని నెలకొల్పుగాక; ఆవిధంగా తన నిజమైన స్థానాన్ని తిరిగి పొందుగాక!

ఎంతో కాలంగా విభజన, వ్యతిరేక భావముల ద్వారానే పరిపాలన జరుగుతోంది. ఇక ముందు మాత్రం సమైక్యత, పరస్పర అవగాహన, సహకారముల ద్వారానే పరిపాలన సాగించాలి. అందుకు సమయం ఆసన్నమైంది.

మనతో కలసి పనిచేసే వారిని (సమన్వయ కర్త) ఎంపిక చేసుకోవటానికి వ్యక్తుల యొక్క విలువలు ముఖ్యం, కాని వారు ఏ వర్గానికి చెందారనేది కాదు!

దేశం యొక్క గొప్పతనం సమైక్యత మీదనే కాని, వర్గాల గెలుపు ఓటముల మీద ఆధారపడి యుండదు.

శ్రీమాత పౌరులకు ఇచ్చిన సందేశము

సంకుచితమైన, అహంకార పూరితమైన వ్యక్తిత్వాన్ని వీడండి. దేశమాతయొక్క ముద్దు బిడ్డలుగా తయారవ్వండి. నిజాయితీతో, ఋజు ప్రవర్తనతో విధులు నిర్వహించండి. ఎల్లప్పుడూ సంతోషంగా నిర్భయంగా ఉండండి. దైవ కృపపై అచంచలమైన విశ్వాసాన్ని కలిగి యుండండి.



శ్రీమాత

ఈనాటి మానవాళి ఎదుర్కొంటున్న ఇబ్బందులన్నిటికీ ప్రతీకగా భారతదేశం నిలిచిఉంది.

కాని భారతదేశం త్వరలో సమున్నతమైన, సత్యవంతమైన జీవనమార్గాన్ని పునరుజ్జీవింపచేయగలదు.

విశ్వసృష్టిలో పృథివికి విశిష్ఠమైన స్థానం ఉన్నది. ఏ ఇతర గ్రహాలలో లేని విధంగా ఇక్కడ పరిణామ శీలమైన అంతః చేతన కేంద్రకంలో ఉన్నది. అందులోనూ భారతదేశాన్ని దైవం ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్నది. అనాది నుండి (కొందరు పండితులు క్రీ॥పూ 8000 సం॥ నాటినుండే అంటారు) భారతదేశం ఆధ్యాత్మిక విజ్ఞానము, ఆచరణలకు ఆలవాలంగా ఉంటున్నది. అత్యున్నతమైన సత్యం ఏదైతే ఉన్నదో దానిలో ఐక్యంకావాలని ఆకాంక్షిస్తున్నది. ఇందుకై తదేకంగా, నిశ్చలంగా తన ధ్యాస అంతా నిలిపింది. సంస్కృతభాష "యోగము" అని ఏ విధానాలను నిర్వచించిందో, బోధించిందో ఆ విధానాలు అనేకమైనవి. వాటిలో కొన్ని భౌతికానికి (శరీరానికి) సంబంధించినవి; కొన్ని మేధస్సును వికసింపజేసేవి. కొన్ని మతపరము, భక్తిపరము అయినవి. కాని కొన్ని విధానాలలో యోగ సమన్వయము ద్వారా సమగ్రమైన ఫలితాలను సాధించటం కూడా సూచించబడింది.

ఆధ్యాత్మిక దృక్పథంలో భారతదేశం సమున్నతమైనది. ఆమె పవిత్ర కర్తవ్యం ప్రపంచానికి ఆధ్యాత్మిక ఆదర్శాన్ని అందించటమే. ఈ సత్యాన్ని ప్రబోధించడానికే శ్రీఅరవిందులు భువిలో అవతరించారు.

విదేశాలలోని మేధావులతో పోల్చిచూస్తే ఈ దేశంలో పుట్టిన ఒక సాధారణ, అమాయక రైతు, కూలీ అయినా హృదయపరంగా దైవానికి సన్నిహితుడే.

- శ్రీమాత

అనువాదం : కె.ఆర్.యల్. నరశింహారావు

పవిత్రత అంటే

పూర్తిగా భగవంతుని ప్రభావ పరిధిలో ఉండేది, భగవంతునినే అభివ్యక్తం చేసేది పవిత్రత.

ఏ ఇతరేతర శక్తుల ప్రభావానికి లోనుగాక, కేవలం భగవంతుని ప్రభావాన్ని మాత్రమే ఆమోదించేది పవిత్రత.

భగవంతుని కోసమే జీవించేవారు, భగవంతుని వల్ల జీవించేవారు పరిపూర్ణ పవిత్రతను సిద్ధింప చేసుకుంటారు.

గతంలో ఏం జరిగినా, ఏ తప్పలు చేసినా, ఎంత అజ్ఞానంలో మునిగినా, ప్రతివ్యక్తిలో, లోలోపల పరమోత్కృష్ట పవిత్రత భాసిస్తుంటుంది. అదే అద్భుతమైన సిద్ధిగా మారుతుంది.

మనం ఆరాధించే మహా సత్యంగా ప్రభవించడమే పరిపూర్ణ పవిత్రత. మరింత, మరింత ఆత్మ వికాసం చెందుతూ ఆత్మ పూర్ణత్వ సిద్ధిని పొందాలి. అదే దివ్యసంభూతి.

- శ్రీమాత

అనువాదం : యజ్ఞన్న

స్వాతంత్ర్యము - సేవ

బాహ్య దృష్టికి - స్వాతంత్ర్యము, సేవ-ఈరెండూ పూర్తిగా విరుద్ధమైనవిగా, పొసగనివిగా కనపడుతాయి. పైకి కనపడే దానిని బట్టి ఎవరైనా ఊహించలేనిది ఏమిటంటే ఒక వ్యక్తి ఒకే మారు స్వేచ్ఛగానూ, సేవాపరాయణుడు గానూ ఉండగలడా అనేది. కాని ఒక దృక్పథం రెండింటిని సమన్వయ పరచి భౌతిక జగత్తులో అత్యంత ఆనంద దాయకమైన స్థితికి చేరుస్తుంది.

స్వేచ్ఛ అనేది అంతః ప్రేరణ నుంచి పొందే ఒక అవసరం. వ్యక్తి సమగ్రాభివృద్ధికి తప్పనిసరి. అంతస్తత్వంలో అది సర్వోన్నత

పరిపూర్ణ చైతన్య సాధన. అది ఏకత్వ వ్యక్తీకరణను, దైవంతో సమాగమాన్ని సూచిస్తుంది. అదే దాని దివ్యమూలాధారతత్వం. అదే సాఫల్యత. కాని ఆ ఏకత్వం అనేకంలోనూ, బాహుళ్యంలోనూ అభివ్యక్తీకరింపబడిన కారణంగా ఆ దివ్యమూలానికి, అభివ్యక్తీకరణకి మధ్య అనుసంధాన సూత్రంగా ఒకటి పనిచేయాలి. 'ప్రేమ' మాత్రమే అటువంటి నిర్దుష్టమైన సూత్రంగా ఎవరైనా ఊహించగలుగుతారు. ప్రేమకు మొట్టమొదటి సూచన ఏమిటి? తనకుతాను అర్పించుకోవడం, సేవ తనంతట తానుగా వెల్లడయే, తక్షణమైన, తప్పనిసరైన దాని చేష్టఏమిటి? సేవనం. అదీ సంతోషంగా, పూర్తిగా, సమగ్రమైన ఆత్మార్పణంతో.

అయితే స్వాతంత్ర్యము, సేవ-ఈరెండూ వాటి స్వచ్ఛత యాదార్థతలలో ఎంతమాత్రం విరుద్ధం కాకపోగా, పరస్పర పూరకాలు. పరమ సత్యంతో పరిపూర్ణ సమైక్యతలోనే పరిపూర్ణ స్వతంత్రత లభిస్తుంది. ఎందువల్లనంటే మొత్తం అజ్ఞానం, మొత్తం నిశ్చైతన్యం అనేది బంధం. అది నిన్ను అసమర్థునిగా, అల్పునిగా, శక్తిహీనునిగా చేస్తుంది. నీలోని ఏ కొంచెం అజ్ఞానమైనా, అదీ నీకు పరిమితియే. ఏ మాత్రం నీవు అపుడు స్వతంత్రుడివి కావు. ఎంతకాలం నిశ్చైతన్య మనేది అస్తిత్వంలో ఉంటుందో, అది ఒక పరిమితే, బంధనమే అవుతుంది. పరమ సత్యంతో పరిపూర్ణ సంయోగంలోనే పరిపూర్ణమైన స్వాతంత్ర్యం మనగలుగుతుంది. మరి ఈ సంయోగం ఏవిధంగా సాధింప బడుతుంది, ఆత్మార్పణ వల్ల కాకపోతే ! అది ప్రేమ ఇచ్చేవరం. నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా, దాని మొదటి వ్యక్తీకరణ అదే. ప్రేమ మొదటి బాహ్యప్రకటన సేవ.

అంటే ఈరెండూ సత్యంలో చాలా దగ్గరగా సమైక్యమై ఉన్నాయి. కాని ఇక్కడ ఈ భూమిమీద అజ్ఞాన జడప్రపంచంలో ఈ సేవ ఏ బాహ్య ప్రేరణ లేకపోతే స్వతస్సిద్ధంగా ప్రేమపూరకంగా ఉండకపోగా అది బలవంతంగా రుద్దబడినదిగాను, తప్పని సరిఅయిన అవసరంగానూ, జీవన చక్రాన్ని కొనసాగించటానికి గాను, బతుకుబాటను అవిచ్ఛిన్నంగా నడిపించటానికి ఉపయోగ పడేదిగా ఉంటోంది. ఆవిధంగా అది ఒకరకంగా వికారంగానూ, నికృష్టంగాను, అవమానకరంగాను తయారయింది. పుష్పం వికసించినట్లు ఆనంద భరితంగా ఉండవలసింది కాస్తా వికృతంగా, విసుగుపుట్టించి బాధ కలిగించేదిగాను, అతిహీనమైన బాధ్యత నిర్వహించేదిగాను తయారయింది. ఇంతటి స్ఫూర్తివంతమైన ఈ స్వేచ్ఛయొక్క అవసరం కూడా వికృతమయి, ఎటువంటి స్వాతంత్ర్య తృష్ణగా మారిపోయిందంటే అది తిరుగుబాటుకు, విడిపోవటానికి ఒంటరి తనానికి దారితీసి నిజమైన స్వేచ్ఛకి విరుద్ధంగా తయారైంది.

స్వాతంత్ర్యం! ఒక తాంత్రికుడు జ్ఞాని చెప్పగా విన్న మాటనాకు గుర్తు. నేను స్వతంత్రుణ్ణి కావాలి, నేను స్వతంత్రుణ్ణి, నేను స్వతంత్రుడుగానే మనగలుగుతాను అని అన్నవాడికి ఆయన నవ్వుతూ ఒక చక్కని సమాధానం ఇచ్చాడు, అంటే నిన్ను ఎవరూ ప్రేమించకూడదన్న మాట, ఎందుకంటే ఎవరైనా నిన్నుగనక ప్రేమిస్తే, నువ్వు ఒక్కసారిగా ఆ ప్రేమకు అధీనం అయిపోతావు".

అది చక్కని సమాధానం. ఎందుకంటే ప్రేమ ఒక్కటే ఐక్యతకు దారితీస్తుంది. ఐక్యతే స్వతంత్రతను నిజంగా వెల్లడించ గలుగుతుంది. అందుకని ఎవరైతే స్వాతంత్ర్యం మాహక్కు అనే మాటను ఉపయోగించి స్వేచ్ఛను కోరుతారో వారు నిజమైన

స్వేచ్ఛను పూర్తిగా నిరాకరించినట్లే. ఎందుకంటే వారు ప్రేమను తిరస్కరిస్తారు.

నిర్బంధం వల్ల ప్రేమ వికృత మవుతుంది. బలవంతంగా ఎవరూ ప్రేమించలేరు. బలవంతపు ప్రేమ ప్రేమకాదు. అందుకని, ఎప్పుడైతే నిర్బంధం అనేది మధ్యలో జోక్యం చేసుకుంటుందో, అప్పుడది అసత్యంగా మారుతుంది. అంతరంగ పురుషుని అన్ని చేష్టలు తనకు తానుగా బయటపడాలి. అంతరంగ సామరస్యత, ఒడంబడిక అనేది తనకు తానుగా వెల్లడయే వాటి ద్వారా, తనంతట తాను స్వతంత్రంగా ఆత్మార్పణం చేయడం ద్వారా వస్తుంది. ఏదయితే అస్తిత్వానికి సత్యమో, మూలమో, లక్ష్యమో, ఆ లోతైన సత్యంవైపు మరలినప్పడే నిజమైన ప్రేమ బహిర్గతమౌతుంది.

- శ్రీమాత

అనువాదం : డా॥ టి. ప్రసన్న కృష్ణ

సక్రమ విద్యాబోధనా సూత్రాలు

దేనినీ బోధించలేము అనేదే నిజమైన విద్యాబోధనకు తొలినియమం. ఉపాధ్యాయుడు బోధకుడు కాదు. కఠిన శిక్షకుడు కాదు. ఆయన కేవలం సహకారి, మార్గదర్శి. ఆయన కర్తవ్యం కేవలం సలహా నివ్వడమేకాని, బైటి నుండి బలవంతంగా విషయాన్ని రుద్దడం కాదు. ఆయన వాస్తవానికి విద్యార్థి మనస్సుకు శిక్షణ నివ్వడు. విద్యార్జనా ప్రక్రియలో విద్యార్థి తన జ్ఞానోపకరణాలను యెలా పరిపూర్ణంగా వినియోగించుకోవాలో సహాయపడుతూ అతనిని ప్రోత్సహిస్తాడు. ఆయన విద్యార్థికి జ్ఞానాన్ని బోధించడు. అతడు తనకు తానుగా జ్ఞానాన్ని యెలా పొందాలో తెలియజేస్తాడు. విద్యార్థిలో గూఢమైవున్న జ్ఞానాన్ని ఆయన బయటికి రప్పించడు.

జ్ఞానం యెక్కడవున్నదీ, దానిని అతడు యెలా బయటికి తెచ్చుకొని గ్రహించాలో తెలియజేస్తాడు. ఈ నియమాన్ని యువకుల బోధనకు ప్రత్యేకించ వచ్చునే కాని చిన్న పిల్లలకు తగదనడం చాంధస భావన, వివేక రహిత సిద్ధాంతం. శిశువుకాని, మనిషికాని, బాలుడుకాని బాలికకాని, మంచి బోధనా పద్ధతికి ఒకే ఒక భద్రమైన నియమం. వయోభేదం, ఉపాధ్యాయుని నుండి పొందే అవసరమైన సహాయ మార్గదర్శకత్వములలో ఎక్కువ తక్కువలుంటాయోమో కాని, అది బోధనా స్వభావాన్ని మార్చదు.

విద్యాబోధన ద్వితీయ నియమం, మనస్సు యొక్క అభివృద్ధి మనోభీష్టం ప్రకారం జరగాలి. తల్లిదండ్రులు కాని లేక ఉపాధ్యాయుడు కాని విద్యార్థిని తమ కిష్టమైన రీతిలో తీర్చిదిద్ద వచ్చు ననే భావన అమానుషమైన, అజ్ఞాన యుతమైన మూఢనమ్మకం. తన స్వభావాను గుణంగా అభివృద్ధి చెందుటకు విద్యార్థిని ప్రోత్సహించ వలెను. తన కుమారుడు ఫలానా గుణాలు, శక్తులు, భావనలు విలువలు వృద్ధి పరచుకోవాలని లేదా ఫలానా ఉద్యోగి కావాలని ఆశించి అందుకై ముస్ముందుగానే అతనిని తయారు చేయాలనుకునే తల్లిదండ్రుల పొరబాటుకన్న మించిన గొప్ప పొరబాటు మరొకటుండదు. స్వీయ ప్రకృతి ధర్మాన్ని కాదని బలవంత పెట్టడం, దానికి శాశ్వత అపకారం చెయ్యడం, దాని అభివృద్ధిని నిరోధించడం, దాని పూర్ణత్వాన్ని చెరచడం వంటిదే యగును. అలాంటి చర్య మానవాత్మపట్ల ఒక క్రూర స్వార్థం, జాతిని గాయపర్చటం అవుతుంది. దానివల్ల మనిషి తాను పొందవలసిన ఒక అమూల్య ప్రయోజనాన్ని కోల్పోయినట్లవుతుంది. ఇంకను విద్యార్థి అసంపూర్ణమైన, కృత్రిమమైన, ద్వితీయ శ్రేణికి చెందిన,

సామాన్యమైన పై పై మెరుగులను బలవంతంగా అంగీకరిం చవలసిన వాడవుతాడు. ప్రతి వ్యక్తిలో దైవ ప్రసాదితమైన కొంత దివ్యత్వం నిగూఢమైవుంటుంది. అది అతనికి స్వంతం. దాని వలన అతడు పరిపూర్ణతను, బలాన్ని, ఎంత కొద్దిగానైనా సరే పొందగల అవకాశం వుంటుంది. అతడా దివ్యత్వాన్ని గ్రహింపవచ్చు, లేదా తిరస్కరింపవచ్చు. ఆ వ్యక్తి దాన్ని కనుగొని వృద్ధి పరచుకొని ఉపయోగించు కోవలెను. విద్య యొక్క ప్రధానాశయం ఎదుగుచున్న విద్యార్థి తనలోని అత్యుత్తమమైన ఆ దివ్యత్వాన్ని బయటికి తీసుకొని దానిని జీవిత విశిష్ట కార్యానికి ఉపయోగించు కొనునట్లు సహాయపడేదిగా వుండాలి.

విద్యాబోధన తృతీయ నియమం విద్యార్థి తనకు వర్తమానంలో అందుబాటులో ఉన్నదానిని ఆధారంగా రేపటికి అవసరమైన దాని నిరూపొందించుకోవటం - దగ్గరనుంచి దూరానికి (from the near to the far)

మూలము :- శ్రీఅరవిందులు

అనువాదం :- బి. నరసింహయ్య

The future of the earth depends on change of consciousness. The only hope for the future is in a change of man's consciousness and the change is bound to come. But it is left to men to decide, if they will collaborate for this change or it will have to be enforced upon them by the power of crashing circumstances - The Mother (August 1964.)

సమాచార పత్రం

అగష్టు 15న శ్రీఅరవిందుల 136వ జయంతి ఉత్సవాలు జరుపబడును. ఈ సందర్భంగా ఈ క్రింది రెండు ముఖ్య కార్యక్రమాలు శ్రీఅరవిందసొసైటి పుదుచ్చేరి బీచ్ ఆఫీసు నందు నిర్వహించబడును.

1. అగష్టు 13 మరియు 14 తేదీలలో ఉపన్యాస పరంపర.
2. అగష్టు 16 నుండి 20 వరకు డా॥ అలోక్ పాండే గారు శ్రీఅరవిందుల గ్రంథములపై స్వాధ్యాయములు నిర్వహించెదరు. ప్రతిరోజు సా॥ 5 గంటలనుండి 5.45 వరకు 6 గంటల నుండి 6.45 వరకు రెండు సార్లుగా స్వాధ్యాయం ఉండగలదు. అందరూ ఆహ్వానితులే. .

4 ఏప్రియల్ 2008న బీచ్ ఆఫీసులో జరిగిన ఒక కార్యక్రమంలో శ్రీ ఆర్. రంగనాథ్ గారిచే రచించబడిన డా॥ యమ్.వి. నడకర్ణి - "వెలుగుబాటలో ప్రయాణం" అను గ్రంథము ఆవిష్కరించబడినది. అందులో ప్రధానంగా ఇటీవలే దివంగతులైన శ్రీ యమ్.వి. నడకర్ణి గారికి శ్రద్ధాంజలి ఘటించబడినది. ఈ గ్రంథములో వారి కొన్ని ప్రసంగాలు గూడా పొందు పరుపబడినవి. శ్రీఅరవిందాశ్రమం మానేజింగ్ ట్రస్టీ శ్రీమనోజ్ దాస్ గుప్తగారు ఈ గ్రంథమును ఆవిష్కరించగా, కార్యక్రమంలో శ్రీయుతులు జంషెడ్, శ్రీరంగనాథ్, శ్రీవిజయభాయ్, శ్రీమనోజ్‌దాస్‌లతోపాటు మరికొందరు పెద్దలు ప్రసంగించినారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో డా॥ నడకర్ణిగారి ధర్మపత్ని శ్రీమతి మీరా నడకర్ణి క్షుప్తంగా ప్రసంగించిరి.

వార్షిక అఖిల భారత ఎడ్యుకేషన్ కాంప్ - కం - వర్క్‌షాప్

20 మే నుండి 27 మే వరకు నిర్వహించబడింది. ఇందులో దేశం నలుమూలల నుండి టీచర్లు, విద్యావేత్తలు, ప్రిన్సిపాల్స్ మరియు తల్లిదండ్రులు మొత్తం 51 మంది పాల్గొనినారు. ఈ కాంపులో పాల్గొన్న శ్రీమతి హిమబిందు హైదరాబాదు - డాన్స్‌స్కూల్, ప్రిన్సిపాల్ ప్రదర్శించిన భరత నాట్యం అందరినీ అలరించినది. శ్రీశివకుమార్ ఈ కాంపును అత్యంత సమర్థవంతంగా నిర్వహించి అందరి మన్ననలను పొందినారు.

హైదరాబాదు:- శ్రీమతి నాగరంజని 'యోగ సమన్వయం' గురించి (శ్రీఅరవిందుల వ్యాఖ్యానమాల) ఏప్రియల్ నెల 21 నుండి 26 వరకు ప్రసంగించినారు.

పశ్చిమ బెంగాల్ శ్రీఅరవింద సొసైటీల వార్షిక సమావేశము బంకూరా బ్రాంచినందు 2008 ఏప్రియల్ నెల 5,6 తేదీలలో జరిగినది. పండ్రెండు బ్రాంచీలనుండి దాదాపు 200 మంది ప్రతినిధులు ఈ సమావేశమునందు పాల్గొనిరి. పాండిచ్చేరి నుండి అరుదెంచిన

Rs. 15/-

అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబర్ - 2008



Faith

సురక్షితమైన జీవితానికి

- శ్రీమాతారవిందుల వాక్కులు

అఖిల భారత పత్రిక, సెప్టెంబరు 2008

సురక్షితమైన జీవితానికి

విషయసూచిక

ఎల్లప్పడూ నీ విశ్వాసానికే విశ్వాసపాత్రుడవై ఉండు. నీకు దుఃఖం ఉండదు.

- శ్రీమాత

శ్రీమాత సందేశం

చివరికి తేలిన సారాంశం - దైవకృప పట్ల ఉన్న పరిపూర్ణ విశ్వాసము, నమ్మకము - ఇదే మహత్తరమైన విజ్ఞానం.



The map was made after the partition.
It is the map of the true India in spite of all passing appearances, and it will always remain the map of the true India, whatever people may think about it.

29th July 1964 The Mother

ఇదే జీవితాంతం పాటించవలసినది

దైవానుగ్రహం పట్ల విశ్వాసం ఉండాలి. అది ఎప్పుడూ ఓకంట కనిపెడుతూ ఏదిఏమైనా అక్కడ సిద్ధంగా ఉంటుంది అని విశ్వసించాలి. అపుడు ఏ ప్రమాదాలు, ఆటంకాలనైనా ఎదుర్కొనగలవు. అధిగమించనూ గలవు. నిన్ను ఏదీ కదల్చలేదు. దైవకృప, నమ్మకము నీకు ఉన్నాయి కదా! ఇది ఎంతో బలమైన, మరింత చైతన్యవంతమైన, ఎప్పటికీ తరగని శక్తి. ఇది నీ భౌతిక నిర్మాణ శైలిపై ఆధారపడదు. ఒక్క దైవకటాక్షంపై తప్పించి మరిదేనిపైనా ఆధారపడదు. కాబట్టి ఇది దివ్యసత్యమునే ఎల్లప్పుడూ అంటిపెట్టుకుని ఉంటుంది. ఏదీ దీనిని కదల్చలేదు.

- శ్రీమాత

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

విశ్వాసంతో పాటు పూర్తి నమ్మకం

. . . . . మరొక ప్రత్యాయ పదం. కాస్తంత పరిమితమైనది. అనిపిస్తుంది. కాని ఇది మరింత ప్రముఖమైనది. ఎందుకంటే ఇది అనుభూతి పరమైనది. నీ విశ్వాసం దైవంపై పరిపూర్ణ నమ్మకంతో నిండి ఉండాలి. అలా కాకపోతే విశ్వాసం ఉన్నా దివ్యశక్తిలో, భగవంతుని ఔన్నత్యంలో అవనమ్మకం కలుగుతుంది. దైవోపహతుడను అని అనుకోగలవు. ఇవి నీకు అవరోధాలు.

కొంతమంది దైవంపై తమది చెక్కుచెదరని విశ్వాసం; అనుకుంటూ ఏమంటారంటే : "చేస్తున్నది సర్వమూదైవమే. చేయగలిగేదంతా దైవమే. నాకు గాని, ఇతరులకుగాని, ఎక్కడగాని ఏమి సంభవించినా అంతాదైవకృతవమే" - ఈ రకమైన తార్కికధోరణిలో ఉంటారు. దేవుని పై నమ్మకం లేకపోతే, కొంతకాలం అయాక ప్రపంచంలో సంభవించే ప్రతిభయంకరమైన సంఘటనకీ దైవాన్ని నిందిస్తారు. నిజంగా దేవుడు భయంకరమైన క్రూర రాక్షసుడు అంటారు.

లేదా - వాళ్ళకి విశ్వాసం ఉంటుంది. కాని, వాళ్ళతోవాళ్ళు అనుకుంటారు: సరే, నాకు భగవంతుని పై విశ్వాసం ఉంది. మరేమిటి ఇది ! ప్రపంచం ఇలా ఉంది! ముందు, చెప్పాలంటే, నేనే ఎంతో బాధపడి పోతున్నాను! నా యిరుగు పొరుగు వాళ్ళకంటె నేనే ఎక్కువ బాధపడుతున్నాను. జీవితం నాకు క్రూరమైనది. నిజంగా దైవము, మరిదైవమే ! He is All - Goodness, All - Generosity, All - Harmony : మరైతే ఎందుకు నేనింత బాధపడి పోతున్నాను? తప్పక ఆయన శక్తిహీనుడై ఉండాలి, కాక అంతమంచి వాడే అయితే నాకెందుకింత దుఃఖాన్ని కలిగిస్తాడు?

ఇది రెండవ అవరోధం.

ఇక మూడవది :

కొంతమంది మితిమీరిన అణకువ, వినయం, నమ్రతతో ఉంటారు. ఇదో మానసిక వక్రత. వాళ్ళు అనుకుంటారు: "దైవం నన్ను నిశ్చయంగా బహిష్కరించాడు. ఇక నేనెందుకూ పనికిరాను. ఆయనకు నాతో ఏ పనీ లేదు. నేను చేయవలసిన దల్లా ఒక్కటే ఇక్కడితో ఇక ఈ ఆట ఆపి వేయడం. అంతే. ఆయనకు తగిన వాడను కాను అని నిర్ణయించాడుగా" !

అందుచేత దైవకటాక్షం పట్ల విశ్వాసానికి తోడు నమ్మకం కూడా జతపర్చాలి. లేకుంటే ఇబ్బందులుంటాయి. రెండూ అవసరమే.

నిష్కపటమైన పశివాడి నమ్మకం. ఇదీ అతి ముఖ్యమైన షరతు. పశివాడు తనకు కావల్సినది తనకు తప్పక లభిస్తుంద నుకుంటాడు. అందుకు తనకెలాటి సంశయమూ ఉండదు. ఇదిగో, ఇలాటి నమ్మకమే అతి ముఖ్యమైన షరతు . . .

సుస్థిర విశ్వాసంతో దివ్యశక్తి, దైవసహకారం కోసం నీవు ఆకాంక్షించి, కోరుకున్నపుడు నీ సంకల్పం నెరవేరకపోవటమనే సమస్యే ఉండదు. తప్పనిసరిగా నెరవేరుతుంది. అవును. ఇదే నిజమైన అంతరంగ ఉన్మీలనం. నమ్మకం. కొంతమంది అన్ని వేళలా ఇదే స్థితిలో ఉంటారు. స్వీకరింపబడవలసినది ఏమైనా ఉంటే స్వీకరించటానికి వారు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు.

నమ్మకం కంటే విశ్వాసం మరింత సమగ్రమైనది. చూడు - నీకు దైవంపై నమ్మకం ఉంది. అంటే, భగవంతుని చేత నీకు ప్రసాదింపబడేదంతా ఎప్పుడూ నీకు పరమ శ్రేష్ఠమైనదే. ఆ నమ్మకం నీకు కుదిరింది. వారి నిర్ణయమేదైనా, వారినుంచి నీవు పొందే ఏ అనుభూతి అయినా, ఏ పరిస్థితిలో ఆయన నిన్ను ఉంచినా - అదెప్పుడూ నీకు సర్వోన్నత శ్రేష్ఠమే ! This is Trust ఇదీ నమ్మకం. కాని విశ్వాసం - భగవంతుని ఉనికి పట్ల నీకున్న దృఢవిశ్వాసం. విశ్వాస మనేది నీ సత్వాన్నంతటినీ పట్టి ఉంచేది. శారీరక, మానసిక, చైత్యపురుష సత్వాలకి మాత్రమేకాక, నీ యావత్ సత్వాన్ని పట్టి విశ్వాసం తొణికిసలాడుతుంది. విశ్వాసం అనుభూతి ప్రదాయిని. అందుకు రాజమార్గం.

విశ్వాసం దేనినీ ప్రశ్నించదు. తన యొక్క ఆత్మార్పణ వల్ల రాబోయే పరిణామం ఏమిటని అడగదు. తననుతాను సమర్పించు కుంటుంది. అంతే. తనప్రగాఢమైన విశ్వాసం, "ఇదే నీకు రాబోయే ఫలితం" అని నచ్చచెప్తుంది. పరిపూర్ణ విశ్వాసం" అంటే ఇదే. ఇందులో ఎలాటి బేరసారాలు, లాభనష్టాల బేరీజులు ఉండవు. దైవానికి ఈ రకమైన శరణాగతి నీకు అన్ని పరిస్థితులలోనూ క్షేమకరంగా ఉంటుంది. శ్రేష్ఠమైనదే నీకెప్పుడూ జరుగుతుంది. కాని ఒక్క విషయం. నీవు తలచిన విధంగా కాదు. ఏది వాస్తవంగా జరగాలో అదిమాత్రమే జరుగుతుంది. బుద్ధికి తెలిసినది ఏపాటి! నీ సత్వములో ఒకభాగం దీనిని తెలుసుకోగలుగుతుంది. నమ్మకమూ కలుగుతుంది నీకు. ఇందువల్ల నీ విశ్వాసం మరింత బలపడుతుంది. సర్వమునూ స్వీకరించి సద్వినియోగం చేసుకోగలిగే శక్తి అది.

- శ్రీమాత

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

ఈ విశ్వాసానికి ఆధారంగా నాకు హేతువేమీ లేదని సణుగుతావు. మూర్ఖుడా! అలాటపుడు నీ విశ్వాసం అపేక్షింపబడదు. దాని అవసరం లేదు.

హృదయంలో మరుగున ఉన్న విజ్ఞానం యొక్క అస్పష్ట వక్ర, ప్రతిబింబం విశ్వాసం.

భక్తుడు, మొండి నాస్తికునికంటే మరింత సంశయాత్మ కుడుగా ఎప్పుడూ పీడింపబడతాడు. అయినాపట్టు సడలనీయడు. ఎందుకంటే తన అంతశ్చేతనలో ఏదో ఉంది. ("A dim disturbing some what"- Savitri). దానికి తెలుసు. కాబట్టి అది గుడ్డి నమ్మకాన్ని, అర్థంలేని సందేహాలను సహిస్తుంది. తనకు తెలిసిన దివ్యజ్ఞాన దిశగా అది ప్రచోదిస్తుంది.

ప్రపంచం, తనను, హేతువాదం నడిపిస్తోందనుకుంటుంది. కాని నిజానికది విశ్వాసాలతో, అచేతన కౌశలములతో (Instincts) ప్రేరేపింపబడుతోంది.

తర్కం విశ్వాసానికి అనుగుణంగా తననుతాను మలుచు కుంటుంది. లేదా, అంతశ్చేతన యొక్క దోషరాహిత్యాన్ని నిరూపిస్తూ వాదిస్తుంది. అయితే ఈ ప్రచోదన అధోచేతన అందిస్తుంది. అందుచేత మనిషి తాను హేతువాదబద్ధంగా వ్యవహరిస్తున్నాను అనుకుంటాను.

మనిషికి విశ్వాసం అత్యంత ఆవశ్యకం. ఇది లేకుండా తన అవ్యక్త అగ్రాహ్య పయనంలో (in his journey through the Unknown) ముందుకు సాగిపోలేడు. అయితే ఇది పై నుంచి విధింపబడేదిగా ఉండకూడదు. అంతరాత్మనుంచి నిర్నిబంధస్ఫూర్తి గానో లేక విధి నిర్దేశంగానో రావాలి.

- శ్రీఅరవిందులు

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

విశ్వాసము భగవంతుని వరం

1. విశ్వాసము అన్నది అనుభవ జ్ఞానాల పునాదులు అవసరములేని ఒక దృఢనమ్మకం.
2. వ్యావహారిక ఋజువులతో కూడిన విశ్వాసం విశ్వాసమవదు. అది ఒక బేరమే.
3. స్వతస్సిద్ధంగా కలిగే చైత్యపురుష పరిజ్ఞానమే విశ్వాసం.
4. దైవం మీద, దైవం యొక్క గెలుపు మీద ప్రగాఢనమ్మకమే విశ్వాసం.
5. గాఢాంధకారంలో అత్యంత విశ్వసనీయమైన మార్గదర్శి విశ్వాసం.
6. దైవకృపచే మనము పొందే సర్వసమ్మతమైన బహుమతియే విశ్వాసం. ఇది శాశ్వత సత్యమునకు తటాలున తెరువబడిన తలుపులాటిది. దీని ద్వారా మనం సత్యాన్ని చూడొచ్చు. ఇంచుమించు స్పర్శించనూవచ్చు.
7. అజ్ఞానాంధకారాల ప్రారంభంలో పోరాటానికి, గెలుపుకి, విశ్వాసం సూటియైన వ్యక్తీకరణ.

- శ్రీమాత

అనువాదం : త్రివేణి

విశ్వాసము ఎంత ప్రముఖమైనదో ఎంత అద్భుతమైనదో ఎలాటి అద్భుతాలు సృష్టిస్తుందో సామాన్యులకు తెలియదు. ప్రతిక్షణం దైవంచే లేవనెత్తబడి, ఆయనకు దగ్గరగా స్వీకరింపబడాలని నీవు అనుకుంటే నిన్న లేవతీయటానికి ఆయన వస్తారు. నీకు మరీ మరీ మరీ దగ్గరవుతారు.

- శ్రీమాత

ఈ విశ్వాసమే నీవు పెంపుచేసుకోవలసినది

విశ్వాసం అనుభవంతో ముడిపడినదికాదు. అది అనుభవానికి పూర్వమే అక్కడ ఉంటుంది. అనుభవ జ్ఞానంతో కాక విశ్వాసబలంతో యోగసాధన ప్రారంభింప బడుతుంది. ఆధ్యాత్మిక జీవనంలో మాత్రమేకాక సాధారణ జీవనంలో కూడా ఇంతే. క్రొత్త అంశాలు కనుగొనేవారు, నవవిజ్ఞాన సృష్టికర్తలు మొదలగు కార్యశూరులు అందరూ, విశ్వాసబలంతోనే ముందుకు సాగుతారు. విషయ నిరూపణ సాధించేదాకా ఆశాభంగాలకి, పరాజయాలకి, తిరస్కారానికి తలొగ్గరు. వారిలో ఒకశక్తి పనిచేస్తూంటుంది. ఇదే 'సత్యము' నీకు అనుసరణీయము, 'ఆచరణీయము' అని ప్రబోధిస్తుంది. గుడ్డినమ్మకం పొరపాటుకాదా అని అడుగుతే రామకృష్ణుడు అసలు కావల్సినదే గుడ్డి నమ్మకం అన్నంత వరకూ వెళ్లారు. విశ్వాసం అంటేనే గుడ్డిది. కాకపోతే విశ్వాసమే కాదది. మరొకటేదో అది - హేతుబద్ధమైన ఊహ, రూఢియైన నమ్మకం, లేదా సునిశ్చిత పరిజ్ఞానం కావచ్చు. మరి ఏదైనా కావచ్చు.

ఇంకా అభివ్యక్తీకరింపబడక సాధించబడక, సిద్ధింపబడక ఏదైతే ఉంటోందో దానికి అంతస్సాక్షి విశ్వాసం. అయితే మనలో The Knower within us ఉన్న దివ్యజ్ఞానికి ఏ రకమైన సూచన లేకుండానే అది అనుసరణీయము, సాధింపబడవలసిన సత్యము అనే సందేదన కలుగుతుంది. మనసులో స్థిరమైన నమ్మకం ఏదీ లేకుండానే కలుగుతుంది. ప్రాణికము ఎదురు తిరుగుతుంది. గింజుకుంటుంది. తిరస్కరిస్తుంది. అయినా కూడా ఇది The feeling of faith అంతరంగంలో ఉంటుంది. నిరుత్సాహం, ఓటమి, అపనమ్మకం, అజ్ఞానం - వీటితో కూడిన దశలు లేకుండా ఏ యోగసాధకుడూ ఉండడు. తనకు తెలియకుండానే, ఏదో తనను నిశ్చలంగా ఉంచుతుంది. సాధన ముందుకు సాగిపోతూనే

ఉంటుంది. తాను అనుసరించే మార్గం సత్యమైనదనే సంవేదన, అంతకుమించిన గుర్తింపు కలుగుతుంది. దైవం యొక్క అస్తిత్వాన్ని నమ్మి, దానితో సరిపోల్చతగినది జీవితంలో వేరొకటి లేదని, అది జీవాత్మలో అంతర్గతమై ఉన్నదే అనే విశ్వాసమే యోగానికి మూలాధారం. ఈ విశ్వాసం ఉన్నంత కాలము మనిషి ఆధ్యాత్మిక జీవనానికి యోగ్యత కలిగి ఉంటాడు. ఆటంకాలు, నిరాకరణలు, నిరోధాలు - వీటితో స్వభావం కూరుకుపోయి ఉంటే ఉండుగాక; అయినాకూడా అతను ఆధ్యాత్మిక జీవనంలో విజయానికి గుర్తింపబడిన వాడుగానే ఉంటాడని నేను అంటాను.

నీవు పెంపొందించుకోవల్సినది ఈ విశ్వాసాన్నే. అది హేతువుకు, లోకజ్ఞానానికి నిబద్ధంగా ఉంటుంది. దేవుడు ఉన్నాడు. ఈ వెలుగుబాటలోనికి నీకు పిలిపునిచ్చాడు. కాబట్టి ఆయన సహకారం నీకు తప్పక ఉంటుంది. ఎన్ని ఆటంకాలనైనా ఎదురొడ్డి లక్ష్యాన్ని చేరుకుంటావు. ఇదే నీ విశ్వాసం కావాలి. ఓటమిని సూచించే అపస్వరాలు, అవి ప్రతి ఫలించే ప్రాణిక పరమైన ప్రతిస్పందనలు, తొందరపాట్లు, విజయం అసాధ్యం, ఇంతవరకు భగవదనుగ్రహంలేదు, ఇకముందు ఉండబోదు లాటి ప్రతికూల స్వరాలు వినరాదు. అపనమ్మకం కూడదు. క్లిష్టమైన ఒక ఉన్నత లక్ష్యం కోసం స్థిరంగా నిర్దేశించే మనోవైఖరిని అవలంబించాలి. "నేను విజయం సాధించే దాకా ఎన్నికష్టాలు ఎదురైనా ముందుకు సాగిపోతాను". అనేదే ఆ మనోవైఖరి. భగవంతుని విశ్వసించిన వాడు ఇంకా ఏమంటాడంటే, "భగవంతుడు ఉన్నాడు. ఆయన మార్గంలో ముందుకు పయనించటం క్షేమకరం. ఆయనను కనుగొనేదాకా ఎంత దూరమైనా పయనించి పోతాను," అని.

- శ్రీఅరవిందులు

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

విశ్వాసము భయము

.....భయం అనేది ఒక కళంకం. అది భువిపైన దివ్యశక్తుల కార్యక్రమాన్ని ధ్వంసం చేయుటకై అసుర శక్తుల నుండి నేరుగా ప్రయోగింపబడే ఒక గొప్ప అపవిత్రాంశం. అందుకే యోగము నభ్యసించదలిచినవారు ముందుగా వారిచేతననుండి; సర్వశక్తులు ఒడ్డి, నిజాయితీతో తమకున్న సహనమునంతా కేంద్రీకరించి భయం యొక్క ఛాయాలేశము కూడా లేకుండా తొలగించి వేయాలి. మార్గములో సునాయాసముగా సాగిపోవాలంటే దుర్బలమైన చిన్నచిన్న విషయాలకు ఏమాత్రం తలొగ్గక, నిర్భయంగా ముందడుగు వేయాల్సిందే.

* * *

అప్రతిహతమైన ధైర్యము, పరిపూర్ణమైన నిజాయితీ, చిత్తశుద్ధితో, ఆత్మ సమర్పణతో, ప్రతిదానికీ లెక్కలు చూసుకోకుండా, బేరసారాలకు ఆస్కారం లేకుండా, ఏదో పొందడం కోసం ఇవ్వడం కాకుండా (నిస్వార్థంగా), ఏదో రక్షణ కోసమని నమ్మకంతో కాక, ఆధారాలకోసం వెదుకులాడే విశ్వాసంతో కాక - ఇవీ మార్గంలో సాగిపోయేటపుడు అలవర్చుకోవాల్సిన అంశాలు. ఇవే సకల అపాయాల నుండి నీకు నిజంగా రక్షణ కల్పించేవి.

* * *

అసలు దైవానికి చెందినవారు ఎందుకు భయపడాలిట? తన పరిమితమైన హేతువుకు అగోచరమైన అంతకంతకు విశాల తను సంతరించుకొంటున్న అతని ఆత్మ తేజస్సుతో నిండుతున్న అతని ముఖ వర్చస్సే దివ్యత్వము యొక్క చిహ్నంగా, మార్గంలో నిర్భయంగా సాగిపోలేడా? అసలు భయపడేందుకు ఏమీ లేదు. అంతా దైవమే కదా - ఆ దైవం తప్ప మరేముందని. ఉన్నదంతా భగవంతుడే. మనల్ని అల్పమైన, అర్థరహితమైన భయాలకు లోను చేస్తున్నదంతా భగవంతుని మారు వేషములు తప్ప మరేముందని!

* * *

నా బిడ్డలెవరూ దేనికీ భయపడరు.

- శ్రీమాత

అనువాదం - కొంగర భాస్కరరావు.

దైవం

దైవమంటే సర్వోన్నత దివ్యసత్యం. ఎందుకంటే ఆ విరాట్ పురుషుడి నుండే సమస్తం ఉద్భవించింది. అతడిలోనే సర్వజీవులూ అధివశిస్తున్నాయి.

ఆ దైవంనుండే సమస్తం అభివ్యక్తమౌతుంది. ఆయనలో జీవిస్తుంది. మళ్ళీ (ప్రస్తుతం) అజ్ఞానంతో కప్పబడివున్న ఆ దివ్యసత్యంలోనికి (పయనమవ్వడమే ఈ జీవితంలో ఈ జీవాత్మ యొక్క లక్ష్యం) చేరిపోతుంది. తన సర్వోన్నత సత్యంలో దైవం ఏకం, పరాయణం. మరియు పరిపూర్ణం, అనంత, సత్,చిత్ దివ్య శక్త్యానందము.

ఈ ప్రపంచం ఒక రూపం. దాని యదార్థతత్వమే దైవం. ప్రకృతి రూపంలోనే దైవమును దర్శించాలి.

ఉన్నది అతడొక్కడే. అతడే అసలు సిసలైన, సమస్తానికి మూలమైన సనాతన విశ్వావ్యాపక ఆనందం. ఈ ఆనందమే సర్వభూత ప్రతిష్ఠితమై సమస్తానికి అతీతంగా ఉండి, అంతటినీ ఏలుతోంది. అతడే అనంత దివ్యచైతన్యం. ఈ అనంత చైతన్యమే తక్కిన సమస్త చైతన్యాలనూ సృజించి, సమన్వయ పరుస్తుంది. వాటి గతుల్ని వాటికి తెలుపుతుంది.

అతడొక్కడే అతులిత జీవనుడు, అతడే సమస్త కార్యాన్ని, జీవనానుభవాన్ని పరిపోషిస్తూ నిర్వహిస్తున్నాడు. అతని సంకల్పమే ఈ సమస్తానికి ఇంకా అనుభవంలోనికి రాని అప్రతిహతమైన సంపూర్ణమైన లక్ష్యం వైపుకు పరిణమించేందుకు మార్గ దర్శకత్వాన్ని చూపుతుంది.

అతడికే ఈ హృదయం తనను తాను అర్పించుకొంటుంది. అతడే సర్వోన్నత దివ్యప్రేమికుడిగా ఎంచి అతడినే చేరుకొంటుంది. విశ్వవ్యాప్త ప్రేమమాధుర్యంలో జీవి ఆనంద సాగరంలో ఓలలాడినట్లు అది అతడిలోనే స్పందిస్తుంది. నడయాడుతుంది.

అతడి రహస్యమయ హర్షమే ఈ జీవాత్మకు దాని అన్ని అనుభవాల్లో ఆధారంగా నిలిచి, తప్పుత్రోవ పట్టించే అహంకారం ఎన్నో అవరోధాలను కల్గిస్తున్నా, ఈ బాధలు, దుఃఖాలూ పూర్తిగా అంతరించే వరకూ పోరాడుతూనే వుంటుంది.

అనంత దివ్య ప్రియతముడిలోని ప్రేమానందంతోనే ఈ సమస్త బహువిధ వస్తుజాలాన్ని వాటి వాటి స్వమార్గాల ద్వారానే తన ఆనంద ప్రదమైన ఏకత్వంలోనికి అతడే నడిపిస్తున్నాడు.

అతడి వైపునకే మన దివ్య ఇచ్ఛా సంకల్ప శక్తి మనల్ని నడిపిస్తూ, మనల్ని, పరిపూర్ణం చేస్తూ సమస్త శక్తికీ మూలమైన ఆ అదృశ్య దివ్యశక్తి పైనే సుస్థిరంగా నిలుపగలుగుతుంది.

- శ్రీఅరవిందులు

అనువాదం : హర్షవర్ధన్

విశ్వాస రాహిత్యం మూర్ఖత్వం

శ్రీమాత తన శిష్యుడొకరికి ఒక కార్డు యిచ్చేరు. దాని మీద తన ఛాయాచిత్రంతో పాటు ఈక్రింది మాటలు :

"భగవత్సంకల్పానికి వ్యతిరేకంగా యే మానవ సంకల్పం నెరవేరదు". "మనం నిస్సంకోచంగా, నిస్సందేహంగా దైవాన్ని నమ్మినట్టయిన విజయం దానంతటదే సిద్ధించక తప్పదు".

- శ్రీమాత

మానవ స్వభావం దీనినెందుకు నిరోధిస్తూ వుంటుందో ఆశ్చర్యం. సాధారణ మానవ స్వభావమే అలాంటిది. ఒక వైపు విజయం వరిస్తూంటే పట్టించుకోకుండా ఓటమివైపు తనంతట తనే పరుగులు తీస్తుంది. అలా నేను ఎన్నో చూసేను. ఇది నమ్మశక్యం కాదు. కానేకాదు.

మానవ మూర్ఖత్వపు లోతులు తలుచుకుంటే నమ్మలేం ...... నమ్మలేం.

నేను చెప్తున్న శక్తి (ఆశించిన ప్రగతి సాధనలో కలిగే తీవ్రమైన వత్తిడి) యేదైతే వుందో అది కిందికి అలా (చేతితో మెల్లగా కిందికి దిగుతోన్నట్లు సంజ్ఞచేసి) లోతుగా యింకా లోతుగా అవచేతన వైపుగా సాగిపోతుంది.

ఆ అవచేతనలో వర్ణించలేని, నమ్మశక్యం కాని ఎన్నో అద్భుతాలు. రాత్రి తరవాత రాత్రి అలా ఎన్నో రాత్రులు వాటిని చూస్తూ గడిపాను. ఆశక్తి అలా లోలోతులకి తన మానాన తను ప్రశాంతంగా పోతూనే వుంటుంది.

అప్పుడు మనిషి అవచేతన (Subconcient) ఆర్తితో కేకవేస్తుంది. అయ్యో! యిప్పుడు కాదు. యిప్పడే కాదు. ఇంత త్వరగా కాదు". అంటూ, అందుకు వ్యతిరేకంగా మనిషి తీవ్రంగా పోరాడాలి. అది సాధారణ అవచేతన.

మామూలుగా అయితే ఆనిరోధం విషాదాంత మవుతుంది. కాని అలాంటప్పడే మనిషి తనకి తాను చెప్పకోవాలి. "నా ప్రయత్నం ఎంత ప్రయోజన కరమైనదో చూస్తాను. ఇప్పడే చూస్తాను" అని. అది విషాదాంత మవుతుందనుకోవడం పరమమూర్ఖత్వం.

మనిషి దైవాన్ని వదలకుండా పట్టుకోవాలి. అప్పడా అవచేతన అంటుంది. "సరే చూడు యిప్పడే. నీకే తెలుస్తుంది. అదెక్కడికి తీసుకెళ్తుందో". అని అలా అనడం కేవలం నిరోధించడం మాత్రమే కాదు దారితప్పించడం కూడా.

మనిషి దానిని వినక పోవడమే మంచిది. ఒకవేళ బలవంతంగా వినిపిస్తున్నా అదలా అంటున్నంత సేపు "నేను లక్ష్యపెట్టను. నేను లక్ష్యపెట్టను". అంటూ సమాధానం చెప్పాలి. నీ పనంతా పాడుచేసుకుంటున్నావ్" అని హెచ్చరిస్తుంది. "పోతేపోని". ఇదే నీ జవాబు.

దైవమే అన్నీ చేస్తున్నది అనే అనుభవం గనక నువ్వు పొందితే అప్పడే నువ్వు చెక్కు చెదరని విశ్వాసంతో చెప్పగలవు. "నీవాదాలన్నీ యెందుకు కొరగానివి. పరమాత్మతోవున్న ఆనందం, పరమాత్మ స్పృహ యీ సృష్టిని, జీవితాన్ని, హాయిని, విజయాన్ని అన్నింటినీ అదే (వేలుతో మీదికి చూపిస్తూ) చూసుకుంటుంది.

అప్పడు అన్నీ చక్కబడతాయి. అక్కడికది ముగిసి పోతుంది. సృష్టిలోవున్న దుష్టత్వం దానికి సంబంధించినదంతా

అత్యంత బలంగా శక్తివంతంగా వెలుగులోకి తోసుకువస్తుంది. అదే దాని ముగింపు.

అధిమానసం కోసం మనసు నిశ్శబ్దం కావాలి. ఎప్పుడూ నా మనసులోకి వచ్చే భావన యేమిటంటే (అమ్మనవ్వుతూ) ఒక పసిపాప మనసునెత్తిమీద కూర్చుని ఆడుతూ (ఒక చిన్న పిల్ల కాళ్ళు కొట్టుకుంటాడుతున్న భంగిమ చూపిస్తూ) వుంటుంది. ఇప్పటికీ నేను చిత్రాన్ని గీయగలిగినట్టయితే దీనిని అద్భుతంగా చిత్రించి చూపగలను. మనసు అంటే ఇహలోక సంబంధమైన మనసు (అమ్మతన బుగ్గలు పూరించి చూపుతూ) అదే యెంతో ముఖ్యమని మన మనుకుంటూన్న మనసు. అత్యంతావశ్యకమయినది అనుకుంటున్న దానిమీద ఒక చిన్న పాప కూర్చుని ఆడుకుంటూ వుంటుంది. అదే యెంతో ఉల్లాసకరమైనది.

ఓ బిడ్డా! మనకి నమ్మకం లేదు. నమ్మకం కలిగిన వెంటనే "మాకు దివ్యజీవనం కావాలి" అనుకుంటాము. కాని అదంటే భయం మళ్లీ. కాని భయంపోయిన వెంటనే అంతా నిజాయితీగా మారిపోతుంది.

"వేమీ జీవితం యెంతమాత్రం కోరుకో లేదు". (అమ్మనవ్వుతూ) ఏదో అక్కడ వుంది. అది పట్టుకుంటుంది. ఇదంతా యెంతో హాస్యాస్పదం.

మన పురాతన భావజాలాన్ని పట్టుకుని వదలకుండా వేలాడతాం. అటువంటి మృత ప్రాయమైన గతం, ఆ ప్రపంచం అంతా మాయమయిపోవాలి. కాని అది ఎక్కడ మాయమయిపోతుందో అని మన భయం.

దివ్య శిశువు మన మనోశిరస్సుమీద ఆడుకుంటూ వుంటుంది. ఈ చిత్రం నేను గియ్యగలిగితే ఎంత బాగుండును! అది చాలా అద్భుతం.

మనం ఎంత మూర్ఖులమంటే (అమ్మ హుందాగా కోపగించుకుంటున్న స్వరంతో) "దేవుడిది తప్పు. అతడలా చెయ్యకూడదు". అనే వరకు వస్తాం. అదెంత హాస్యాస్పదం బిడ్డా!

(నిశ్శబ్దం)

నాకుతోస్తున్న అత్యంత సులభమైన తరుణోపాయం. నిజాయితీగా, చిత్తశుద్ధితో నువ్వేం కోరుకుంటావో అది అప్పుడు నీ అవగాహనకందుతుంది. అర్థమవుతుంది. కాని బుద్ధికి సంబంధించిన ఆలోచనల్లో అర్థం కాదు. అది ఇక్కడ కాదు. (అమ్మ తన శిరస్సు తాకుతూ.)

"నీవు ఇచ్ఛగించినదే" "What thou willest"

(12th April 1972) మూలం : శ్రీమాత

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి

* * *

ఓ చిరుకవిత

ఓ భగవాన్ !
నేనాడూ మూర్ఛిల్లబోను. దాహమేస్తున్నది.
(The Spirit's sacred thirst - Savitri)
దాహమేస్తున్నదంటే ఎక్కడో జలనిధి ఉన్నట్టే.
నిజం, కాని ఈ జీవితంలో మనం ఏనాడూ పొందలేకపోవచ్చు.
గతకాలపు పాతప్రకృతి భూతంగా కూర్చొంటుంది.
పాత ఆవేశాలు అడ్డుగా నిలుస్తాయి.
పాత సందేహాలు తిరిగి దాడిచేస్తాయి.
మనల్ని తృప్తి పరచడానికి ఈ భువిపై కాని,
ఆవల కాని ఇతర మార్మిక జీవితాలు ఉన్నాయా?
ఓ దేవా ! నేను గాఢంగా ప్రయత్నిస్తా.

మూలం : శ్రీఅరవిందులు

అనువాదం : కె. యజ్ఞన్న

* * *

నీ అంతరజ్యోతిని విశ్వసించు

నీ నుండి సందేహాలు, నైరాశ్యం, విశ్రాంతి చలనాలను నెట్టివెయ్యి. అవి నీ నిజమైన, ఉన్నత ఆత్మ ప్రకృతిలోని భాగాలు కావు. నిస్తేజం, నిర్బలత్వంవంటి ఇతరేతర శక్తులు నిర్హేతుక చలనాలను త్రోసిపుచ్చు. మేఘాలతో కప్పబడివున్నప్పటికీ నీ ఆత్మ అంతర్జ్యోతిని నమ్ముకో, నీకు నా సహాయం కాని, అమ్మ సహాయం కాని ఉన్నట్లుగా భావించలేని క్షణాలలోసైతం మా ఇరువురి

సహాయం పనిచేస్తుంటుంది. భౌతిక చైతన్యపు తమోమయ శక్తులు వెదజల్లే చీకటి వలయాలలో సైతం నీ ఆత్మను ప్రగాఢంగా విశ్వసించు, భగవంతుని తీయని పిలుపును గుర్తుంచుకో. విశ్వాసంతో ఉండు. అంతిమ విజయం నీదే.

నీ ఆత్మలోని జ్యోతిర్నివహాన్ని, భగవంతుని పిలుపును విశ్వసించాలని నేనన్నప్పుడు, గతంలో జరిగిన ఏ సంఘటనను గూర్చి గానీ, నీలోని లోపాన్ని గూర్చిగాని నేను ప్రస్తావించడం లేదు. చీకటి శక్తుల సూచనలను, ప్రేరణలను, ఆకర్షణలను తిరస్కరించాలని, వాటిని ఎదిరించడానికి మహాసత్యాన్ని ఆవాహన చేయాలి. అంతర్గత దివ్యరోచిస్సును సాక్షాత్కరింపచేసుకోవడానికి మనసారా పిలవాలి. సంక్షోభాలలో, అసురశక్తుల దాడులలో ఇది చాలా అవసరం అని మాత్రమే నేను గట్టిగా చెప్తున్నాను.

సందేహాలు, నైరాశ్యం చుట్టుముట్టినప్పుడు "నేను దైవానికి చెందిన వాడ్ని, నాకు అపజయం లేదు". అని తలంచాలి. "నేను తగను నాలో కల్మషం ఉంది" అని భావించరాదు. "నేను అమృతత్వ శిశువును, భగవంతుడు నన్ను ఎంచుకున్నాడు. నాపట్ల నేను, ఆయన పట్ల నిజాయితీతో, చిత్తశుద్ధితో ఉంటే, విజయం తప్పదు. నేను పతనమైనా తిరిగి లేస్తాను." అని అనుకోవాలి. ఈ సత్యపథం నుండి దారితప్పడానికి వచ్చే ప్రేరణలు, ఇంకా చిన్న ఆదర్శం వైపు మళ్ళడం వంటి బలహీనతలు వుంటాయి. "నా ఆత్మను సంతృప్తి పరచే ఏకైక మహాసత్యం ఇది. ఈ దివ్యయాత్ర చిట్టచివరి గమ్యం చేరేవరకు అన్ని పరీక్షలను, కష్టాలను భరిస్తాను". అని నిర్ణయించుకోవాలి.

భగవద్దీప్తి పట్ల భగవంతుని పిలుపు పట్ల శ్రద్ధ, విశ్వాసం అంటే నా ఉద్దేశ్యం ఇదే.

మూలం : శ్రీఅరవిందులు　　　　అనువాదం : కె. యజ్ఞన్న

* * *

పూర్ణయోగానికి కావల్సినది విశ్వాసమొక్కటే

మన ఉపకరణాత్మక ప్రకృతికి (Instrumental Nature) సంబంధించిన పరిపూర్ణతలో మూడు అంశాలున్నాయి. 1. బుద్ధి, హృదయం, ప్రాణిక చేతన, దేహాల యొక్క పరిపూర్ణత. 2. అంతరాత్మ

ప్రాథమిక శక్తుల పరిపూర్ణత 3. దివ్యశక్తికి మన ఉపకరణాల సమర్పణలో పరిపూర్ణత, మరియు మన కర్మలను సమర్పించడంలో పరిపూర్ణత. సమస్త కృషికి కర్మకు, రహస్యంగానూ, బహిరంగంగానూ కీలకాధారమైన నాల్గవ శక్తి, విశ్వాసం, శ్రద్ధ. దీనిపై (faith or శ్రద్ధ) ఈ పరిపూర్ణతల పురోభివృద్ధి ఆధారపడి వుంటుంది. తాను దర్శించిన లేదా, తాను స్వీకరించడానికి తన ముందు నివేదించబడిన సత్యాన్ని సమస్త అస్తిత్వం అంగీకరించడమే పరిపూర్ణ శ్రద్ధ. ఆ సత్యంలో తాను జీవించాలనీ, దాన్ని సాధించుకోవాలనీ, అదే సత్యంగా తాను కావాలనే దాని సంకల్పం. ఆ సంకల్పానికి ఉండే విశ్వాసాన్ని కేంద్రంగా చేసుకొని దాని కార్యకలాపమంతా కొనసాగాలి. ఆత్మ, వస్తువులు, దాని జ్ఞానం కూడా అదే సత్యమనే భావనపై దాని కార్యకలాపమంతా కొనసాగాలి. బుద్ధిగతమైన నమ్మకం, హృదయాంగీకారం, దానిని స్వంతం చేసుకొని, వాస్తవం చేసుకోవాలనే ప్రాణిక మనోవాంఛ అనేవి ఆ విశ్వాసం యొక్క బాహ్యరూపాలు. ఈ అంతరాత్మ విశ్వాసానికి సంబంధించిన ఒక రూపం. ఇది జీవి కర్మాచరణకు తప్పనిసరి. ఏదో ఒక రూపంలో ఆ ఆత్మవిశ్వాసం లేకపోతే, మనిషి జీవితంలో ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేడు. ఇంతవరకూ ఆచరణలోనికి తీసుకురాలేకపోయిన పరిపూర్ణతవైపు అతను అసలేమాత్రం పురోగమించలేడు. మనిషికి శ్రద్ధ ఎలావుంటుందో అతడలా తయారవుతాడు 'యోయచ్ఛ్రద్ధాః సఏవసః', అని గీత చాలాచక్కగా యదార్థాన్ని చెప్పింది. తనలో ఏది సాధ్యమని గ్రహించి, విశ్వసిస్తాడో దాన్ని సాధించడానికతడు ఏ శ్రద్ధతో పెనగులాడుతుంటాడో దాన్నతడు తనలో సృజించుకొని తదనుగుణంగా తయారవుతాడని కూడా మనం గీత చెప్పిన దానికి జోడించవచ్చు. భగవంతునియందు, దైవశక్తియందు విశ్వాసం, మనలోనూ ప్రపంచంలోనూ దైవం ప్రత్యక్షంగా ఉన్నాడనే విశ్వాసం సమస్త ప్రపంచంలోనిదంతా దివ్యశక్తి నిర్మాణమేననీ, యోగం యొక్క దశలన్నీ, దాని పెగులాటలు, బాధలు, వైఫల్యాలు, అలాగే దానిలో సంప్రాప్తించే సంసిద్ధులు, సంతృప్తులు, విజయాలు, అన్నీ ఆమె నిర్మాణ కార్యక్రమానికి ఉపయోగపడేవి, అవసరమయ్యేవి అనే విశ్వాసం, పూర్ణయోగ సాధకునికి తప్పనిసరి. దైవం మీద, మనలో స్థిరంగా ఉన్న ఆయన శక్తి మీద, బలంగా

ఆధారపడి, దైవానికి సంపూర్ణంగా సమర్పణైతే, దైవంతో ఏకత్వాన్ని, స్వేచ్ఛను, విజయాన్ని, పరిపూర్ణతను సాధించుకోవచ్చనే విశ్వాసం పూర్ణయోగ సాధకునికి తప్పనిసరి.

ఫెయిత్ (faith) అనే ఆంగ్ల పదం 'శ్రద్ధ'ను వ్యక్తపరచడానిక చాలదు. వాస్తవానికి పరమాత్మనుండి ప్రసరించే ఒక ప్రభావం శ్రద్ధ. మన అతిమానసిక అస్తిత్వం నుండి వచ్చే, దాని వెలుగే మనకు సందేశం అవుతుంది. నిమ్న ప్రకృతిని దాని ప్రస్తుత అల్పస్థితినుండి ఒక మహోన్నతమైన ఆత్మోద్ధరణలోనికి, ఆత్మను అతిశయింప చేసుకొని ఉద్ధరించుకోవడానికి వచ్చే పిలుపు అది. ఆ పిలుపు నాలకించి, ఆ ప్రభావానికిలోనై, సమాధానం చెప్పేది, తన గమ్యం, తన మహాకార్యం బాగా ఎరుకలోవున్న ఆంతరిక ఆత్మయేగాని, బుద్ధిగాని, హృదయంగాని జీవితాని కంకితమైన జీవన మనస్సుగాని కానేకాదు. యోగమార్గంలోనికి తొలిగా ప్రవేశించడానికి ప్రేరేపించే పరిస్థితులు, మనలో పనిచేస్తున్న దానికి నిజమైన సూచిక కానేకాదు. మనలో బుద్ధి, హృదయం లేదా జీవన మనస్సు కోరిక, ప్రముఖ స్థానం ఆక్రమించవచ్చు. లేదా ఆకస్మిక సంఘటనలు, బాహ్యప్రేరకాలు మనజీవితంలో ఇంకా యెక్కువ ప్రముఖ స్థానం ఆక్రమించవచ్చు. కాని ఇవన్నీ మనపై ప్రభావం చూపించేటప్పుడు, పిలుపుకు ప్రతిస్పందించడంగాని, యోగంలో పట్టుదలతో కొనసాగడం గాని జరుగుతుందని ఖచ్చితంగా చెప్పలేం. అటువంటి సందర్భాల్లో యోగ ప్రవేశానికి తనను ఆకర్షించిన భావంతో తెగ త్రెంపులు చేసుకోవడం జరుగవచ్చు. హృదయం అలసిపోయి తగిన విధంగా స్పందించలేకపోవచ్చు;(life mind) జీవనమనసు యొక్క కోరికలు, మరి ఇతర విషయాల మీదకుపోవచ్చు. కాని ఆత్మ యొక్క నిజమైన కార్యకలాపాలకు బాహ్య పరిస్థితులు ఒక ముసుగు మాత్రమే. ఆ పిలుపు ఆత్మను తాకివుంటే, ఆంతరిక ఆత్మగనుక ఆ పిలుపును స్వీకరించివుంటే శ్రద్ధ స్థిరంగా వుంటుంది, వుండి, దాన్ని నాశనం చేసే, ఓటమి పాలుచేసే సర్వప్రయత్నాలను అడ్డుకోగలుగుతుంది. బుద్ధికి సంబంధించిన సంశయాలు, ముసురుకొనవని, హృదయం ఊగిసలాడదని, నిరాశచెందిన జీవన మనస్సు life mind డస్సి, కృశించి పెడదారిపట్టదనీ అర్థంకాదు. కొన్ని సమయాల్లో అలా

జరగడాన్ని నివారించలేం. ముఖ్యంగా మనకు అందే హేతువాద, సంశయవాద యుగానికి సంబంధించిన మనవిషయంలో ఇలాతరచుగా జరుగుతుంటుంది. అంతేగాదు ఒక మహోన్నత సత్యసూర్యుని మోముపైనుండి రంగులద్దిన మబ్బులను తొలగించకుండా, ఇంకా ఆధ్యాత్మిక అంతఃస్ఫూర్తిని, అంతరంగ అనుభవ కాంతిని వ్యతిరేకించే భౌతికవాదం వున్నంత కాలం ఇలా జరుగుతూనే వుంటుంది. ఏం జరుగుతున్నదో తెలియని అజ్ఞాన సమయాలు అనేకం తారసిల్లవచ్చు. వాటిని గురించి వేదఋషులు సైతం చాలా తరచుగా 'వెలుగునుండి వెలి వేయబడిన సుదీర్ఘ రాత్రులుంటాయి' అని వాక్రుచ్చారు. ఈ రాత్రులు చాలా కఠినమై, అంతరాత్మపై మరింత గాఢాంధకారం పరుచుకొని, విశ్వాసం పూర్తిగా హరించుకుపోయినట్లు అన్పిస్తుంది. కాని వీటన్నింటినుండి, మనలోని ఆత్మ కన్పించని తనపట్టు కోల్పోకుండా నిలిపి వుంచుకొంటుంది. అంతరాత్మ నూతన బలంతో తన సురక్షిత విశ్వాస స్థితికి తిరిగి చేరుకొంటుంది. ఆ విశ్వాస స్థితి అంతరించిపోలేదు, కేవలం గ్రహణం పట్టినట్లుండి పోయింది. ఆంతరంలోని అస్తిత్వం ఒకసారి సచేతనమై సంకల్పించడం జరిగితే అది అంతరించడం జరుగదు. మనం పతనమయ్యేటట్లు దైవం మనల్ని విడిచివేసినట్లు కన్పించినపుడు గూడా, తిరిగి మనల్ని ఉన్నత స్థితికి లేవనెత్తడానికి, అన్ని అవస్థలలోనూ దైవం మనకి చేయూతనిస్తాడు. ఇలా రక్షించబడి తిరిగి సరైన మార్గంలో కొనసాగడం తరచుగా అనుభవానికొస్తుంది. కాలక్రమంలో సందేహాల తిరస్కారాలు అంతరించిపోతాయి. అవి తిరిగి తలెత్తడం అసంభవ మౌతుంది. ఒకసారి, సమతను దృఢమైన పునాదిగా చేసుకోవడం జరిగితే అంతకంటే అధికంగా జ్ఞాన భాస్కరుడు ప్రకాశిస్తే సంశయం పూర్తిగా నశించి పోతుంది. ఎందుకనంటే సంశయానికి ఇక కారణంగాని, ప్రయోజనంగాని లేకుండా పోతాయి.

* * *

మనలో తప్పనిసరిగా ఉండవలసిన విశ్వాసాన్ని, సర్వ సాధారణ సూత్రంగానూ, ప్రత్యేక సందర్భంలోనూ సదా వర్తింప చేయడమంటే, సమస్త అస్తిత్వం, దానికి సంబంధించిన అన్ని

అంశాలూ, భగవంతుని మరియు శక్తియొక్క ప్రత్యక్ష ప్రభావాన్ని మార్గదర్శకత్వాన్ని అంగీకరించడన్నమాట. పరిశుద్ధమై, సంపూర్ణమై, బలీయమై, విశాలమై సదా అభివృద్ధి చెందుతుండే అంగీకారం ఇది. ఏకత్వంవైపు స్వేచ్ఛా, పరిపూర్ణతలవైపు, విజయవంతంగా కదలడానికవసరమైన మన సామర్థ్యం మీద, మన ఆధ్యాత్మిక సంకల్పం మీద, సంకల్పశక్తి మీద ఒక వీర్యవంతమైన విశ్వాసం ముందుగా ఉండాలి. లేదా కనీసం సంకల్పం విశ్వాసంతో కదలాలి. మనకు దైవశక్తిని గురించి ఎరుకలేనంతకాలం, ఆ శక్తి సాన్నిధ్యం మనలను పూర్తిగా ఆవహించనంత కాలం దైవశక్తి యందు బలమైన విశ్వాసాన్ని ప్రయత్న పూర్వకంగా నిలిపి వుంచుకొంటూ కదలాలి. వ్యక్తిలో పనిచేసే, సృజించి గొప్పగొప్ప స్థితులలోనికి ఉద్ధరించి చివరకు తాను సాధించిన శక్తినంతా ఆత్మబలిపీఠం మీద ఒక పవిత్ర నైవేద్యంగా సమర్పించబడే అతని భావాలపై, అతని సామర్థ్యాలపై, విశ్వాసం స్వతహాగా మనిషిలో వుంది. ఈ "ఆత్మ" బలహీనులకు లభ్యంకాదు 'నాయమాత్మా బలహీనే నలభ్యః అని శృతి కూడా చెబుతోంది. మనల్ని నిశ్చేష్టుల్ని చేసే సమస్త ఆత్మ - న్యూనతా భావాన్ని దరిచేరనీయగూడదు. సాధించడానికి మనకుగల బలాన్ని గురించి ఎటువంటి సంశయాన్ని తలెత్త నీయగూడదు. ఎందుచేత అంటే మనలో లేని అశక్తతకు, బలహీనులమనే ఊహకు, ఆత్మ సర్వశక్తిత్వాన్ని తిరస్కరించడానికి, అంగీకరించినట్లవుతుంది. ప్రస్తుత అశక్తత అదెంతగా మన మీద వత్తిడి కలిగించినా మన విశ్వాసానికదొక పరీక్ష మాత్రమే, తాత్కాలిక యిబ్బంది మాత్రమే. పూర్ణయోగ సాధకుడు అసమర్థుడననే భావానికిలోనైతే, అతనికి బుద్ధిలేదనుకోవాలి. అదివరకే అతని అస్తిత్వంలో, స్వీయాత్మలో నిబిడీకృతమైవున్న పరిపూర్ణతను అభివృద్ధి చేసుకోవడమే అతని ప్రస్తుత లక్ష్యం. ఎందుకనంటే మనిషి తనలోనే, స్వీయాత్మలోనే దివ్యజీవన బీజాన్ని కలిగివున్నాడు. అతనిలో విజయాన్ని సాధించే సామర్థ్యం దాగివుంది. అతను చేసే కృషిలోనే, విజయం ఇమిడివుంది, విజయం తథ్యం. అతని వెనుక భగవంతుని పిలుపు వుంది. సర్వశక్తి వంతమైన పరాశక్తి యొక్క మార్గదర్శకత్వం వుంది. అదే సమయంలో సమస్తమైన రాజసిక అహంకారం, ఆధ్యాత్మిక దర్పం అనే మాలిన్యాలచే మలినంగాక అతని విశ్వాసం పరిశుద్ధమై

వుండాలి. అహంకారం దృష్టితో చూస్తే స్వశక్తిగా కన్పించే అతని శక్తి, అతనిది కాదనీ, అది దివ్యమైన విశ్వజనీన శక్తిదనే భావాన్ని అతని మనస్సులో వీలైనంత ఎక్కువగా నింపుకోవాలి. దానిని తన అహంకారిక ప్రయోజనానికి ఉపయోగించుకోవడం తనను పరిమితం చేస్తుందని, అదే చివరకు ప్రతిబంధక మవుతుందనీ కూడా అతడు తన మనసులో గట్టిగా భావించాలి. మన ఆకాంక్ష వెనుక గల విశ్వజనీన దివ్యశక్తి యొక్క సామర్థ్యం అపరిమితం, దానిని సరైన దృక్పథంతో ఆవాహన చేస్తే మనలో అది పొంగి పొరలుతుంది. మనలోని ఏ అశక్తతనైనా, ప్రతిబంధకాన్నైనా, ఇపుడుగాని, కాలాంతరంలోగాని తొలగిస్తుంది. ఎందుకనంటే మన సంఘర్షణ యొక్క సమయాలూ, కాలపరిమితులూ మొదట్లో మనవిశ్వాసపు దృఢత్వం మీద, మన కృషిమీద పాక్షికంగానూ, ఉపకరణాత్మ కంగానూ ఆధారపడి వుంటుంది. అవి చివరకు మనకంటె అతి ప్రజ్ఞావంతంగా నిర్ణయాలు తీసుకొనే రహస్య ఆత్మమీద కాలక్రమేణా ఆధారపడ్తాయి. ఆ ఆత్మే యోగేశ్వరుడు, ఈశ్వరుడు.

శ్రీఅరవిందులు

అనువాదం : కోనేరు వెంకటేశ్వరరావు

సాధకులకు మార్గనిర్దేశం

ఏక్షణంలోనైనా అనుకోనిది, ఎదురు చూడనిది ప్రత్యక్షంఅవవచ్చు. ఏది ఎట్లా జరిగినా అదంతా చాలావరకు మన విశ్వాసం యొక్క తీవ్రత మీద, స్వచ్ఛత మీదనే ఆధారపడి వుంటుంది.

పరిస్థితి మీకు వీలయినంత సానుకూలంగా వుండాలంటే దైవకృపపై అచంచల భక్తి విశ్వాసాలు కలిగి వుండాల్సిందే. భగవంతునిపట్ల సంపూర్ణ విశ్వాసం ఉన్న వారికి సర్వోత్కృష్టమైనదే ఎప్పడూ జరుగుతుంది.

కష్టాలను దాటాలన్నా, బలహీనతలపై విజయం సాధించాలన్నా, ప్రశాంతతను, ఆనందాన్ని, దానితోపాటు శారీరక సమతౌల్యాన్ని ఆరోగ్యాన్ని పొందాలన్నా, మనకు "దైవకృప"పై అచంచలమైన విశ్వాసం కలగాలి. మానసిక శక్తితో దీన్ని సాధించలేమనే విషయాన్ని సుబోధకం చేయటానికే జీవితంలో మనం ఎదుర్కొనే పరిస్థితులు మనకు అనేకంగా కల్పించబడ్డాయి.

జీవితంలో మనకు ఏదీ అనుకూలంగా లేనప్పుడూ, రానురాను పరిస్థితులు క్షీణిస్తున్నప్పుడూ మనం దృఢంగా నమ్మాల్సినది ఒకటే. "దైవకృపపై అచంచల విశ్వాసం" దైవకృప మనలనెప్పుడూ ఉపేక్షించదని తెలుసుకోవాలి. నమ్మకము, ఆత్మవిశ్వాసము, ఆకాంక్ష ఉన్నవారికి దైవకృప సహాయము ఎల్లప్పుడూ లభిస్తాయి. దైవశక్తి అనంతమైనది. మన విశ్వాసమే అల్పమైనది !

విశ్వాసం సమగ్రంగాను, నిరపేక్షంగాను ఉండాలి. అది సరియైనదిగా వుండాలి. కేవలం మేధోశక్తి ఇచ్ఛాశక్తి మాత్రమే కాకూడదు. ఉన్నతమైనది, ప్రగాఢమైనదే కావాలి. మానసిక విశ్వాసం సరిపోదు. ప్రాణిక, భౌతిక, శారీరక విశ్వాసంతో అది పరిపుష్టమవాలి. ఈ రకమైన సమగ్రశక్తి నీలో నీ సత్వమంతటిలో ఉత్పన్నం కావించుకోవాలి. అపుడు దానిని నిరోధించగలిగేదేదీ ఉండదు. నీవు నీవిశ్వాసాన్ని అధోచేతనలోనికి చొప్పించి ప్రతికణంలోనూ సుస్థిరపర్చాలి.

రోగాలు నయంచేసే విషయంలో శ్రీకూలే మహాశయుడు చెప్పిన విధానాలు వినేవుంటారు. అతడు దేన్నయితే "మనోవైచిత్రం" అని పేర్కొన్నాడో అది ఇదే ! దీని రహస్యం ఆయనకు తెలిసే వుండాలి. కాని ఆయన విధానంలో మానసికానికే అతిగా ప్రాధాన్యం ఇవ్వబడింది. కాని మానసికమైన నమ్మకం ఒకటే చాలదు. దానికి ప్రాణికశక్తి, దైహికశక్తి కూడా తోడుగా ఉండాలి. విశుద్ధమైన విశ్వాసం సర్వశక్తి వంతమైనది; అనివార్యమైనది. చాలా సందర్భాలలో ఇది అలా కనబడకపోవటానికి కారణం అది లోప భూయిష్టమైన విశ్వాసం కావడమే. దీనినే మీరేలా చెప్పాలంటే; ఏదో విషయంలో మనకు విశ్వాసం ఉంటుంది. ఉదాహరణకు "మనలో దైవం ఉన్నాడు" అనే విషయం తీసుకోండి. మనలో దైవం ఉన్నాడు. వాస్తవమే! కాని ఆ విషయం మీకు అనుభవంలోనికి ఎందుకు రావటం లేదు? ఎందుకేమిటి, మీ విశ్వాసం పరిశుద్ధమైనది కాదు గనుక ! మీ విశ్వాసమే పరిశుద్ధంగా వుంటే దానిఅంతట అదే పని జరిగిపోతుంది. ఇది ముమ్మాటికీ నిజం.

ఏతావాతా మీరు గ్రహించాల్సింది ఏమంటే మీకు దైవం అనుభూతిలోనికి రానపుడు (దివ్యానుభూతి సాధించనపుడు) మీ

అంతర్గతాన్ని మీరు పరిశీలించుకోండి. నాకు ఈ దివ్యానుభూతి ఎందుకు కలుగలేదు? నా విశ్వాసంలో ఏమైనా లోపం ఉన్నదా? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.

మిమ్మల్ని మీరు నిజాయితీతో ప్రశ్నించుకుంటే మీకే తెలుస్తుంది. మీలో అనేక సూక్ష్మమైన లోపాలు కనబడతాయి. అవి చాలా స్వల్పమైనవే. కాని అవి చిన్నవైనా దూరంగా వుంచాల్సినవి. చాలా సందర్భాలలో అది స్వల్ప అహంకారంగానో, చిన్న కోరికగానో అడ్డువస్తుంది. పైకి అంతగా కనపడకపోయినా, . . . (విశ్వాసాన్ని తప్పక బలహీన పరుస్తుంది.)

దృఢమైన విశ్వాసం ఇచ్చేబలము, దాని శక్తి అది ఇచ్చే సంతృప్తి . . . (మీ ఊహకు కూడా అందవు).

- శ్రీమాత

అనువాదం : కె.ఆర్.యల్. నరసింహారావు.

క్రియాశీల చైతన్యంలో విశ్వాస పరిరక్షణ

ఎవరికైనా విశ్వాసం దైవదత్తమైనప్పుడు ఒక్కసారిగా ఆకస్మిక అంతరంగ ఆధ్యాత్మిక వికాసం కలిగినపుడు, దానిని ఎల్లప్పుడూ క్రియాశీల చైతన్యంలో భద్రంగా పదిల పరుచుకోటానికి వ్యక్తిగత ప్రయత్నమనేది మొత్తం మీద తప్పనిసరి. వారు వారి విశ్వాసానికి అంటిపెట్టుకుని ఉండాలి, విశ్వాసాన్ని వారు సంకల్పించాలి, దాన్ని అన్వేషించాలి, అలవరచుకోవాలి, కాపాడుకోవాలి.

మానవ మనస్సుకు శంకించటం, తర్కించటం, అప నమ్మకం ఇలాటి అనారోగ్యకరమై, విచారకరమైన అలవాటుంది. ఇటువంటి పరిస్థితులలోనే మానవ ప్రయత్నం తప్పక చేయాలి. వాటిని అంగీకరించకుండా తిరస్కరించాలి. వినకుండా నిరాకరించాలి. ఇంకా చెప్పాలంటే వాటిని అనుసరించకుండా తోసివేయాలి. మానసిక సందిగ్ధతలతోను, నాస్తికతతోను ఆటలాడటం అన్నిటి కన్నా ప్రమాదం. అవిశత్రువులేకాదు సరికదా, భయంకరమైన ఊహించని ఆపదలు. ఒకసారి అందులోపడితే, మాత్రం తమంతట తాము బయటకు రాగలగటం కష్టం.

కొంతమంది భిన్న భావాలతో ఆటాడటం వాటి గురించి తర్కించడం, తమకుతామే తమ విశ్వాసాలతో విభేదించటం ఉన్నత మానసిక అభిరుచి అనుకుంటారు. ఇది వారికి ఎనలేని ఆధిక్యత ఇస్తుందని వారనుకుంటారు. ఈ విధంగా వారు 'మూఢనమ్మకాలకు', 'అజ్ఞానానికి' అతీతంగా ఉన్నామనుకుంటారు. కానీ నీవు సందిగ్ధతలు, నాస్తికతలనుంచి వచ్చే సలహాలకు తలరుగ్గుతూ ఉంటే అప్పుడు నీవు అత్యంత సాంద్రమైన అజ్ఞానంలో పడిపోయి, ఋజుమార్గానికి దూరంగా వైదొలగిపోతావు. నీవు కలవరపాటుకు, తప్పలకు, చిక్కుముడితో కూడిన పరస్పర విరుద్ధాలకు లోనవుతావు. ఎల్లవేళలా దానినుంచి కచ్చితంగా బయటపడగలవని చెప్పలేము. నీవు అంతరంగ సత్యంనుంచి ఎంతదూరం వెళ్ళిపోతావంటే అది నీకు కనుచూపుమేరలో కనపడదు సరికదా ఒక్కొక్కప్పడు నీ ఆత్మానుబంధాన్ని కోల్పోతావు.

ఎవరైనా తమ విశ్వాసం భద్రంగా ఉండాలనుకుంటే వ్యక్తిగత ప్రయత్నం తప్పనిసరిగా అవసరమౌతుంది. అటుపిమ్మట, చాలాకాలం తర్వాత, ఒకానొకరోజు వెనుకకు తిరిగి జరిగినదంతా చూసుకుంటే, మనకు కనుపించే అత్యంత దారుణ సంఘటనలు సైతం మనలను ముందుకు నడిపించటానికై దైవం అనుగ్రహించినవేనని మనకు తెలుస్తుంది. మనకప్పడు మన వ్యక్తిగత ప్రయత్నంకూడా అనుగ్రహమేనని అర్థమౌతుంది. కాని ఆస్థితికి చేరుకోడానికి వారు చాలా పురోభివృద్ధి సాధించాలి, కష్టపడాలి, ఎక్కువ బాధలను కూడా అనుభవించాలి.

తామసిక ఉదాసీనతతో మఠం వేసుకుని కూర్చుని "నాకు విశ్వాసం ఉండాలని అనుకుంటే ఉంటుంది. దైవం నాకు దానిని ఇస్తాడు' అని తలచే ప్రవృత్తి బద్ధకానికి, అచేతనకు దారితీస్తుంది. చాలామటుకు ఇది చెడ్డసంకల్పాన్ని సూచిస్తుంది. అంతరంగంలోని అగ్నిజ్వాల మండుతూ ఉండాలంటే, దానికి వారు ఎరవేస్తూ ఉంచాలి. వారు దానిమీద తప్పకుండా ఒక కన్ను వేసి ఉండాలి. తాము వదిలించుకోవాలనుకున్న తప్పలనే సమిధలను, తమ పురోభివృద్ధిని ఆటంకపరచి జాగుచేసే వాటిని దానిలో విసిరివేయాలి. వారావిధంగా అగ్నికి ఆజ్యంవేయకపోతే, అదివారి అచేతన, తమస్సులనే బూడిద

కింద అణగారి పోతుంది. ఆ తర్వాత వారుగమ్యం చేరే మునుపు, సంవత్సరాలేకాదు, జన్మలు, యుగాలు గడచిపోతాయి.

ఏవిధంగా అయితే ఎవరైనా అపరిమితంగా విలువకలిగిన ఏదైనా ఒక ఆవిర్భావాన్ని అప్రమత్తంగా కనిపెట్టుకుని ఉంటారో, ఏదీకూడా దానిని చెడగొట్టని విధంగా చాలా జాగ్రత్తగా కాపాడుకుంటారో, ఆ విధంగా వారు తమ విశ్వాసాన్ని తప్పనిసరిగా కనిపెట్టుకుని ఉండాలి.

ఆదిలోని అజ్ఞానం, చీకట్లనే వాటితో పోరాడి గెలవటానికి దివ్యశక్తి నుంచి వెలువడిన సర్వోత్తమమైన ప్రత్యక్ష ప్రకటనే విశ్వాసం.

* * *

అత్యధిక భౌతిక చేతన - అత్యధిక భౌతిక మనస్సు కొరడా దెబ్బలు తగిలితేనే కర్మచేయడానికి, పురుష ప్రయత్నం చేయడానికి, ముందుకు పోవడానికి అలవాటు పడింది, అలా చేయని పక్షంలో అది జడపదార్థమే. అయితే ఊహలెలా ఉంటాయంటే అవి ఎప్పుడూ ఇబ్బందులనే, అడ్డంకులనే ప్రతికూలతలనే ఊహిస్తాయి. కష్టాలన్నింటి వెనుక జయం ఉన్నదని, దాని వేదనలు, బాధలు, దాని వైరుధ్యాలన్నింటి వెనుక దైవకృప ఉన్నదని, వాటిని సమాధాన పరచటానికి చాలా నిర్దుష్టమై, చాలా స్పష్టమై పదేపదే పునరావృతంగా వచ్చే అనుభవాలు అవసరమౌతాయి. అన్ని ప్రయాసలలోకి చాలా తరచుగా మళ్ళీ మళ్ళీ చేయవలసిన ప్రయత్నం ఒకటున్నది. అదేమిటంటే, మొత్తానికి దానికి లొంగిపోయి ఆపనిని నిలిపివేయడం, లేదా ఆ నైరాశ్యతను, ఆ సందిగ్ధతను లేదా పూర్తిగా ఓటమిపాలు చేసే ఊహలను తొలగించటం లేదా మార్పుచేయడం నీవు చేయాలి.

ఈ చేతనకు మూర్ఖునికి ఉండే మొండితనం ఉంది. బాధలలో ఉన్నప్పుడు ఎన్నోసార్లు ఇది జరుగుతుంది. ఉదాహరణకు, ఏదైనా భరించలేని బాధవస్తే, అంతరంగంలో (కణాలలోపల) ఒక దివ్యసంకేతంతో ఒక సంచలనం ఏర్పడి, కణాలు అత్యవసరమైన సూచనను పంపిస్తాయి. అంతే, అంతా ఆగిపోతుంది. బాధ మటు మాయమౌతుంది. తరచుగా (ఇప్పుడు ఎక్కువెక్కువగా) అది ఆహ్లాదకరమైన శ్రేయోభావనగా మారుతుంది. కాని ఈ మూర్ఖమైన భౌతికచేతనయొక్క మొట్టమొదటి ప్రతిస్పందన ఎలా ఉంటుందంటే

"అహో! ఇది ఎంతకాలం నిలబడి ఉంటుందో! చూస్తాంకదా"!, సహజంగానే ఈరకమైన ప్రేరణ సర్వాన్ని కూలదోస్తుంది. మళ్ళీ అంతా తిరిగి మొదలుపెట్టాలి.

అప్పడు దానిని నయం చేయాలంటే, వారికి తప్పకుండా ఎంతో ఓరిమి, అత్యంతమైన ఓరిమి ఉండాలి. అసలు విషయ మేమిటంటే ప్రయత్నం మానకుండా కొనసాగిస్తూ పోతూ, సహిస్తూనే ఉండాలి.

శ్రీఅరవిందులు దీనిని ఎన్నోసార్లు ఎన్నోవిధానాలుగా చెప్పారు. అది, ఓర్పుతో నిభాయించు. నీకు జయం తథ్యం, భరించు, సహించు, గెలుపునీదే.

అత్యంత సహిష్ణువులనే విజయం వరిస్తుంది.

మొక్కవోని విశ్వాసం, నిశ్చయంగా ఉందనేదానికి నిదర్శనం వారి అస్తిత్వంలోని ప్రతిభాగంలోనూ తప్పనిసరిగా అది ఉండటమే.

- శ్రీమాత

అనువాదం : డా. టి. ప్రసన్న కృష్ణ.

* * *

ఆందోళన నుండి దివ్యప్రగతికి పరిష్కార మార్గం

మనిషిని మనిషిగా గుర్తింపజేసే ప్రత్యేక లక్షణం తననితాను పరిశీలించుకో గలిగే వివేకం అన్నది సుస్పష్టం. జంతువు యే ప్రేరణ లేకుండా తనకితానుగా బ్రతుకుతుంది. తనని తాను పరిశీలించు కున్నా ఆ పరిశీలన అతి తక్కువగా, గుర్తించడానికి వీలుకానంత తక్కువ పరిమాణంలో వుంటుంది. అందుచేతనే అది అతి ప్రశాంతంగా చీకూచింతా లేకుండా వుంటుంది. ఏ వ్యాధి వల్లగాని, ప్రమాదంచేతగాని బాధపడడం సంభవించినా జంతువుకు ఆ బాధ తీవ్రత వుండదు. అది ఆ వ్యాధి గురించి, ప్రమాదం గురించి ఆలోచించదు. దానిని తన చైతన్యంలోకిగాని, భవిష్యత్తులోకిగాని కేంద్రీకరించదు. వ్యాధి లేదా ప్రమాదం వల్ల రాబోయే పరిణామాలను గోరంతలు కొండంతలుగా వూహించదు.

బతికినంతకాలం యేం జరుగుతుందో అనే ఆందోళన మనిషితోనే మొదలయింది. అతడి యీ యాతన కంతటికీ

మూలకారణం ఆందోళనే. ఈ రకమైన బాహ్యచైతన్యం కారణంగానే ఆదుర్దా, బాధాకరమైన వూహలు, ఆందోళన, యాతన, భవిష్యత్తులో విషాదాల గురించి ఊహాపోహలు మొదలవుతాయి. చాలామంది చాలా యెక్కువగా యీ రకమైన బాహ్య చైతన్యంతో నిత్యం యమయాతన పడుతూ వుంటారు. మనిషి తటస్థంగా వుండిపోతాడు. ముందు జరగబోయేది తెలుసుకునేంత చైతన్యం కలిగివుండడు. సృష్టిలోవున్న జీవరాసులన్నింటిలోకి మనిషి చాలా దయనీయమైన జీవి అని నిస్సందేహంగా చెప్పవచ్చు. సాధారణంగా మనిషి అలాగే వుంటాడు. అది అతడికి పూర్వీకులనించి వచ్చిన ఆటవిక వారసత్వం. అది నిజంగా చాలా దయానీయమైన పరిస్థితి. ఈ దశనించి పైకి యెదిగి చైతన్య శూన్యమయిన జంతు స్వభావం బదులు ఆధ్యాత్మికమైన అధిమానస చైతన్యం సాధించాలంటే కేవలం ఆధ్యాత్మిక సామర్థ్యం వల్లనే సాధ్యమవుతుంది. అప్పుడే మనిషికి తన వునికి (జీవితం)యొక్క లక్ష్యం తెలుసుకునే సామర్థ్యం కలుగుతుంది. తన సాధన పరాకాష్టని ముందుగా తెలుసుకోగలడు. ఉన్నతమైన ఆధ్యాత్మికశక్తిలో స్పష్టమైన వైఖరితో కూడిన నమ్మకం యేర్పడుతుంది. దీనివల్ల మనిషి తననుతాను సంపూర్ణంగా భగవంతుడికి సమర్పించుకుంటాడు. తన మీద తనకి నమ్మకం ఏర్పడుతుంది.

ఇవన్నీ మనిషికి జీవితం పట్ల, భవిష్యత్తుపట్లగల బాధ్యత తెలియజేస్తాయి. అందువల్ల అన్ని ఆందోళనలనుండి విముక్తి పొందుతాడు.

మనిషి జంతు తత్వంలోకి దిగజారడమన్నది అసంభవమని నిశ్చయంగా చెప్పవచ్చు. అతను పొందిన చైతన్యం పోగొట్టుకోడం కూడా అసంభవం. అందుచేత మనిషి యీ బాహ్య చైతన్యంతో పడే యమయాతన నించి బయట పడడానికి కేవలం ఒకే వుపాయం, ఒకే దారివుంది. ఏ ఉన్నతస్థితికి వెళ్తే యీ యాతనామయ స్థితినుండి సంపూర్ణ సమర్పణలో నమ్మకం కలిగే స్థితికి చేరగలమో అది సాధించడమే. అదే మనిషి దృఢనిశ్చయం. దీప్యమానమైన పరాకాష్టనందుకున్న దశ. అదే నీ చైతన్యాన్ని మార్చగలిగే దారి.

నిజం చెప్పాలంటే సమస్యల పరిష్కారం సూచించి నడిపించే సూత్రధారి లేకపోవడం, తనవునికికి సంబంధించిన బాధ్యత తెలుసుకునే ఉపాయం దొరకక పోవడంకంటె దయనీయమైన పరిస్థితి మనిషికి మరొకటి ఉండదు. జంతువుకి సమస్యలే ఉండవు. అది కేవలం బతకడం, తన సహజ ప్రవృత్తి నడిపించినట్టు నడవడం జరుగుతుంది. అది సామూహిక చైతన్యం మీద మాత్రమే ఆధారపడుతుంది. దానికి దానికంటే ఉన్నతమైన అంతరంగ జ్ఞానం ఉంటుంది. అయితే అది అప్పటికప్పడు దానంతట అది కలిగేది మాత్రమే. దానికి ఏదైనా ముందు సంకల్పించే అవసరం ఉండదు. దానికోసం ప్రయత్నించడం, సాధించడం, భంగపడడం లాంటివి ఉండవు. తన జీవితానికది బాధ్యత వహించవలసిన అవసరం లేదు. అందుచేత దానికేచింతాఉండదు. మనిషి తన మీద తాను ఆధారపడుతూనే పుడతాడు. అందుకవసరమైన జ్ఞానం లేకపోతే దాని ఫలితంగా నిత్యం యమయాతన పడుతూ ఉంటాడు. ఈ యాతననించి విముక్తుడు కావాలంటే ఉన్నత దివ్యచైతన్యానికి సంపూర్ణ సమర్పణే శరణ్యం. తననితాను పూర్తిగా సమర్పించుకోవాలి. తన జీవితాన్ని నడిపించే బాధ్యత, కష్టాలు, సుఖాలు మొత్తం కార్యకలాపాలన్నీ దివ్యచైతన్యానికి అప్పగించి తన ఆదేశాన్నను సరింఛి నడవాలి.

మనిషికి అవసరమైన జ్ఞానం లేకపోతే సమస్య ఎలా పరిష్కారమవుతుంది దురదృష్టవశాత్తు మనిషి తన సమస్యలన్నీ తానే పరిష్కరించుకోగలనని అనుకుంటాడు. కాని ఆ జ్ఞానం అతనికి ఉండదు. అదే అతని కష్టాలన్నిటికీ మూలకారణం. నిరంతరం అతడిలో మెదిలే ప్రశ్న నేనేం చెయ్యాలి? దాని వెనకే దానితోపాటు పుట్టేమరో ప్రశ్న ఏం జరగబోతోంది? వెంటనే జవాబు చెప్పకోలేని నిస్సహాయత.

ఆ కారణంగానే ఒక వున్నత సిద్ధాంతం మీద ఆధారపడి మొత్తం భాధ్యతంతా సంపూర్ణంగా సమర్పణ చేయడం అవసర మవుతుంది. అక్కడినుండి ఆధ్యాత్మిక క్రమశిక్షణ ప్రారంభ మవుతుంది. లేనట్టయితే ప్రశాంతత అసాధ్యం.

ఏదేమైనా మనిషికి చైతన్యం ప్రసాదించబడింది. దానివల్ల మనిషి ప్రగతిని సాధించగలడు. తనకేమి తెలియదో దానిని కని పెట్టగలడు. తనలో ఏ విధమైన మార్పు ఇంకా రావలసివుందో తెలుసుకొని ఆ విధంగా అభివృద్ధి చెందుతాడు. కదలికలేని స్థిరమైన శాంతికంటె ఉన్నత స్థితి ఉన్నదని ఆ చైతన్యం ద్వారా తెలుసుకుంటాడు. తన సంకల్పాన్ని ప్రగతిపథంలో నిలిపి ఉంచడానికి అవసరమైన సంపూర్ణ విశ్వాసాన్ని కలిగిస్తుంది. మనిషికి ఆరాటంనించి విముక్తి కలిగి ప్రగతికొరకు చేసే ప్రయత్నం జాగృతమవుతుంది. దాని ఫలితంకోసం తీసుకునే శ్రద్ధ, దాని పర్యవసానాలు అప్పడే అర్థమవుతాయి. ధ్యానయోగం (quietist) అని చెప్పబడే పద్ధతులకు ముందుగా వేసిన ముందడుగిది. ప్రాపంచిక వ్యవహారాలన్నింటిని నిరాకరించి స్థిరమైన అంతరంగ నిశ్శబ్దంలో నిమగ్నం కావాలి. జీవితమంతా దీనికి అంకితం కావాలి. అప్పడే అది అకస్మాత్తుగా మెరుపులా అనుభూతికి వస్తుంది. ప్రశాంతత లేకపోతే ఆంతర్యాన్ని గుర్తించలేము. బాహ్యపరిస్థితులకు అనుగుణంగా జీవిస్తున్నంత కాలం స్వాభావికంగా ప్రశాంతత సాధించలేము. అనవసరమైన ఆరాటంలో మనిషికి సమస్యలు పేరుకు పోతాయేతప్ప పరిష్కరించబడవు. అవి పరిష్కరించుకునే జ్ఞానంకూడా కలగదు. దివ్యశక్తి మీద పూర్తి నమ్మకంతో ప్రశాంత నిర్మల స్థితిలో సమస్యని ఎదుర్కోవాలి. నీ చేత ఏ పనిచేయించాలో ఆ అత్యున్నత దివ్యశక్తికి తెలుసు. కనుక ఆ పని ఎవరికో విడిచిపెట్టేబదులు నువ్వే అత్యంత ప్రశాంతతతో చేసినట్టయిన అదెంతో శక్తిమంతంగాను, చురుకుగాను అవుతుంది.

దీనిని జీవితంలో పరమాత్మ జోక్యం కొరకు వినూత్న దృక్పథంగా చెప్పవచ్చు. ఇది మనిషికి తన ఉనికిలో దివ్యశక్తుల జోక్యం యొక్క నూతన విధానంగా కూడా. అంతేకాదు ఆధ్యాత్మిక సిద్ధికి ఇది నూతన వైఖరి.

మూలం : శ్రీమాత

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి

కొసమెరుపు - ఓ కథానిక

ఒక గొప్ప సాధుపుంగవుడు ఉండేవాడు. నది ప్రక్కన ఆయన ఆశ్రమం. చాలామంది శిష్యులకు పాఠాలు బోధిస్తూ ఉండేవాడు ఆయన. ఒకామె ఆశ్రమానికి పాలు సరఫరా చేస్తూండేది.

ఒక రోజున పాలావిడరాలేదు. మరుసటి రోజున వచ్చినపుడు గత దినం ఎందుకురాలేదని సాధువు ఆమెనడిగాడు. అందుకు ఆమె : వర్షాలకి నది పొంగింది. నేను ఉండేది నదికి అవల ఒడ్డున. నదిని దాటలేక పోయాను. అని చెప్పింది.

సాధువు చిరునవ్వుతో అన్నాడు. "శ్రీకృష్ణనామం జపిస్తూ జనులు సంసార సాగరాన్నే విశ్వాసంతో సునాయాసంగా దాటి పోతున్నారే. అలాటపుడు ఈ సామాన్యమైన నది ఎంత ! సమస్యకాదే" - అని

తల ఊపింది పాలావిడ. తార్వత కొన్ని రోజులు గడిచాక మళ్ళావర్షం. వరుసగా మూడురోజులు కుండపోతగా కురిసింది.

అయినా పాలావిడ క్రమం తప్పకుండా ప్రతిరోజు పాలు పోసింది. సాధువుకి ఆశ్చర్యం కలిగింది. నదిని ఎలా దాటి రాగలిగావు, అని అడిగాడామెని.

"స్వామీ! మీ సలహాను పాటించాను. కేవలం శ్రీకృష్ణ నామాన్నే స్మరిస్తూ నదిమీదనుంచి నీటిపై నడుచుకుంటు వచ్చేశాను.".

సాధువు నిశ్చేష్టుడయాడు. జీవితమంతా అధ్యయనం చేస్తూ, తపస్సు చేసుకుంటూ గడిపాను. అయినా, విశ్వాసం నీకు వలె నాలో పాదుగొలుపుకోలేక పోయాను.

జ్ఞాన, అధ్యాయనాలకంటే మనకి భగవంతునికి మధ్య ఉన్న అంతరాన్ని తొలగించేది. ఆయనపైవున్న పరిపూర్ణ విశ్వాసం. ఇదే ఈ కథానిక మనకిచ్చే సందేశం.

- పి.వి. గాంధీ.

(మే 31, 2006 భవాన్స్ జర్నల్ సౌజన్యంతో)

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

సమాచార పత్రము

నొడియా (యు.పి.) బ్రాంచిలో చ్రిన్మయమిషన్‌కు చెందిన, చిన్మయ యువకేంద్రాల డైరెక్టర్, బ్రహ్మచారి గోవింద చైతన్య శ్రీమాతారవిందుల వెలుగులో "ధ్యానము మరియు చేతన" అనుఅంశముపై మే నెల 4 (2008)న ఒక ప్రసంగము చేసినారు. ది 24.05.2008న పాండిచ్చేరి నుండి విచ్చేసిన శ్రీ విజయ్ యన్. పోద్దార్ శ్రీఅరవిందుల యోగంపై ప్రసంగించారు. తర్వాత శ్రోతలు

అడిగిన అనేక ఆసక్తికర ప్రశ్నలకు సమాధానములిచ్చినారు. ఈ కేంద్రమువారు నిర్వహించుచున్న శ్రీఅరవింద శిక్షానికేతన్‌లో శ్రీసతీందర్ కె. పూరి (డైరెక్టర్, నాలెడ్జి ఎక్స్చేంజి సెంటర్) 17.05.08నాడు బాలబాలికలతో ముఖాముఖిగా సంభాషించారు. ప్రతిశనివారం రిటైర్డ్, ఎయిర్ వైస్ మార్షల్ శ్రీవిశ్వమోహన్ తివారి మరియు కల్నల్. M.K.నిగమ్ రెండేసి గంటలు పిల్లలతో గడపడం ఓ ఆనవాయితీ.

ది.01-05-08న శ్రీ అరవిందుల పవిత్ర అవశేషముల ప్రతిష్ఠాపన తృతీయ వార్షికోత్సవ సందర్భంగా మిసెస్ కుంతలదాస్ గుప్త శ్రీమాతారవిందులను గురించిన భజన కార్యక్రమమును నిర్వహించారు. పవిత్ర అవశేషముల ప్రాశస్త్యమును గురించి శ్రీడి.పి. ధని సంక్షిప్తంగా ప్రసంగించిరి.

న్యూఢిల్లీ:-ఈ బ్రాంచి వారు నిర్వహిస్తున్న శ్రీ అరవిందో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (SAIMC) వారి హోటల్ మ్యాటిరీజిన్స్‌లో (22 మరియు 23 మేనెల 2008)తర్వాత అనుఅంశముపై ఒక వ్యాసరచన మరియు గోష్టి (సింపోసియం)ను నిర్వహించారు. శ్రీ విజయ యన్. పోద్దార్ (పుదుచ్చేరి) ఈ సందర్భంగా ప్రారంభోప న్యాసము చేస్తూ ఈ గోష్టి యొక్క ప్రాశస్త్యమును గురించి వివరించారు. ఇంక జర్నలిజంమీద కీలకోపన్యాసమును ప్రొఫెసర్ మనోజ్‌దాస్ ఇవ్వగా, అడ్వర్టయిజింగ్ మీద శ్రీరాంసెహగల్, ఫోటోగ్రఫీ మీద శ్రీ రఘురామ్ మరియు సినిమా మీద శ్రీ ప్రదీప్ శంకర్‌తో ముగింపు ఉపన్యాసంతో సంపన్నమైంది.

శ్రీ విజయ్ హర్యానాలోని గుర్‌గాం బ్రాంచిని గూడా సందర్శించి స్టడీసర్కిల్స్ యొక్క అవసరాన్ని వాటి ప్రాశస్త్యాన్ని వివరించారు.

అన్నానగర్ (చెన్నై) 29 మే నుండి జూన్ 7వరకు 'యోగా' మీద సమ్మర్ కాంప్‌ను నిర్వహించిరు.


బెంగుళూర్ బ్రాంచివారు ఉల్సూర్ లేక్ వద్దగల శ్రీఅరవింద భవన్, 110, గంగాధర్ చెట్టిరోడ్, బెంగుళూరు - 560042 నందు 26, 27 మరియు 28 సెప్టెంబర్ 2008లలో రెసిడెన్షియల్ యూత్‌కాంపు నిర్వహిస్తున్నారు. దీని వివరాలు గత సంచికలోనే ఇవ్వడమైనది. గమనించగలరు.

Rs. 15/-

అఖిల భారత పత్రిక

అక్టోబరు 2008

పదార్థము పరార్థము నావిష్కరించును



- శ్రీమాతారవిందుల వాక్కులు

అఖిల భారత పత్రిక, అక్టోబరు 2008

పదార్థము పరార్థము నావిష్కరిస్తుంది

- శ్రీఅరవిందులు

విషయసూచిక — పేజి

సమాచార పత్రం :

దివ్యశాంతి ప్రశాంతతలలో శాశ్వతుడు అభివ్యక్తమై ఉంటాడు. నిన్ను కలవర పర్చేదానిని దేనినీ అనుమతించకు. శాశ్వతుడు నీకు అభివ్యక్తమవుతాడు. అన్ని ప్రతికూల పరిస్థితులలో సమత పాటించు. అక్కడ శాశ్వతుడు ప్రత్యక్షమై ఉంటాడు.

- శ్రీమాత

దేనికీ అంటిపెట్టుకుని ఉండకు

వ్యక్తి తాను ఏ వర్గానికి చెంది ఉండకుండా ఊహాగానాలను, సిద్ధాంతాలను కలిగి ఉండకపోవటం తాను చేయగలిగే శ్రేష్ఠతమమైన పని. నైతిక సూత్రాలు, నిర్బంధ ప్రవర్తనావళి నైతికదృష్టి పరంగా ఊహాజనిత భావాలతో ఏది చేయాలి ఏది చేయకూడదు అని - వ్యక్తి తాను పురోగమించాలనే దృష్టిలో సాంఘిక, మానసిక నియమాలకు అంటిపెట్టుకుని ఉండుటను మించిన ప్రతిబంధకాలు వేరేలేవు. అడ్డంకులలో ఏదో ఒక దానిని శిరసావహించి అనేక దశాబ్దములు గడిపినవారు నాకు తెలుసు. వారిలో ఏ ఒకరైనా నిష్కల్మషముగా దైవం వైపు మరలి అంతకు పూర్వం వారు భావించినదంతా అజ్ఞానమని గ్రహించి, దైవం ఏది అనుగ్రహించినా స్వీకరించుటకు సిద్ధపడితే అప్పడు ఏదైనా సంభవిస్తుంది. పురోగమించాలనే, పరివర్తన చెందాలనే తపన, జ్ఞానతృష్ణ, సత్యము, ప్రేమలు పొందాలనే ఆరాటము సహజముగానే వ్యక్తికి ఉంటే త్వరితగతిన ముందుకు వెళ్తాడు. వాస్తవానికి ఈ తపన ఒక అవసరము. ఇతరములకు ప్రాధాన్యత లేదు. నీవు ఎరిగిన విషయాన్ని విశ్వసించుట, భావించినదాన్ని, ప్రేమించినదాన్ని, నీ అలవాట్లను, నీవు అపోహపడే అవసరాలను, యధాతధంగా ఉన్న ఈ ప్రపంచాన్ని నీవు వదలక అంటిపెట్టుకుని ఉండుటే నిన్ను నిర్బంధిస్తోంది. ఒకదాని తర్వాత ఒకటిగా బంధాలన్నింటినీ వరుసగా వదిలించుకోవాలి. ఈ ముడులన్నింటినీ విడదీయాలి. ఈ విషయాన్ని వేలసార్లు చెప్పడం జరిగినా మనుషులు వీటినే అంటిపెట్టుకొని ఉండి వాటినే కొనసాగిస్తూ ఉంటారు. ఈ విషయాన్ని ఇతరులకు శక్తివంతముగా, అనర్గళంగా బోధించేవారు కూడా తమదైన దృక్పథంతో అభివృద్ధి చెందటములోని అలవాటును, తమదైన భావాలను వదిలించుకోలేక, అవిమాత్రమే

సరియైనవని, వాటినే అంటిపెట్టుకొని ఉంటారు.

ఇక ఏ సంకెళ్ళు వద్దు. విముక్తి, విముక్తి అంతే, ఆకాంక్ష, తృష్ణ మినహా సర్వమూ సర్వదా మార్పుకు సమాయత్తం కావాలి. యూరోపియన్ లేక పాశ్చాత్య భావాలలో (అవి దారుణమైనవి) మిళితమై వాటివలన కొంతమేర జీవితాలు జటిలమై "దైవము" అనే భావాన్ని ఇష్టపడనివారు ఉన్నారు. వారిని నేను చక్కగా అర్థము చేసుకున్నాను. కాని నిజంగా నీకు ఆ అవసరంలేదు. 'అలౌకికము', దివ్యప్రేమ, దివ్యసత్యము, ఉత్కృష్టము అయిన పరిపూర్ణతలు మాత్రమే వ్యక్తి యొక్క అవసరాలై ఉండాలి. అంతే! కొన్ని సూత్రాలు మాత్రమే మేలు చేస్తాయి. అవి ఎన్ని తక్కువ ఉంటే అంత మంచిది. సంతుష్ట పరచగలిగేది ఒక్కటి మాత్రమే The Thing alone can satisfy. అంతే. అదే. అది అది మినహా ఉండవలసినది, అరకొరగా ఉన్నదికాదు. నీవు ఎన్నుకున్న మార్గమే నీది. అది ఏదైనా ఫరవాలేదు. నీ మార్గము నీదే.

పరిపూర్ణ దివ్యప్రశాంతత, నిరాకులత, సమత - అంతా, నీవే అయి, నీలోనే అంతా ఉన్నప్పడు - అంతటి పరిపూర్ణ, స్వచ్ఛ, నిశ్చల వాతావరణంలో, ఏరకమైన అల్పప్రతిస్పందన నీలోని దివ్యఅభివ్యక్తీకరణకు ఆటంక మవుతుంది. నీవు నీవే! మరేమీ కాదు. విభజనలేదు. విశ్లేషణలేదు. వ్యక్తీకరణ లేదు. సంశయాత్మకుడవు కావు - సర్వమూ దివ్యపవిత్ర ప్రశాంతతయే. భగవదర్పిత దివ్యనిశ్శబ్దత.

ప్రపంచములో అన్ని ధ్యాన సముదాయములకంటే అది ఎంతో శ్రేయస్కరమైనది.

- శ్రీమాత

అనువాదం : త్రివేణి

ఎంత ప్రశాంతంగావుంటే అంత శక్తివంతుడౌతావు.

- శ్రీమాత

నీ వెంత ప్రశాంతంగావుంటే అంత శక్తివంతుడవవుతావు. ఆధ్యాత్మికశక్తికి సమత అనేదే గట్టిపునాది. నీ ఈ సమతూకాన్ని భంగం చేసే దేనినీ నీవు అనుమతించకూడదు. అపుడే నీవు ఏ రకమైన దాడినైనా ఎదుర్కొన గలుగుతావు. దీనితో బాటుగా నీవు కావల్సిన వివేచనాశక్తి కనుక కలిగిఉంటే అవాంఛనీయమైన పోకడలను (స్పందనలను) ముందుగానే కనిపెట్టి చూడగలిగి వాటిని బయటకు త్రోసివేసేందుకు నీకు చాలా సులువుగా వుంటుంది. కానీ అవి ఒక్కొక్కసారి చెప్పకుండానే వస్తాయి. అలాంటపుడు వాటిని ఎదుర్కొనడం చాలా కష్టమౌతుంది. ఆ సమయాలలో నీవు ప్రశాంతంగా, నిశ్చలంగా కూర్చొని శాంతిని, ప్రగాఢమైన నిశ్చల స్థితిని ఆవాహన చెయ్యి. నిన్ను నీవు ఆ స్థితిని గట్టిగా పట్టుకొని, నిబ్బరంగా, ప్రగాఢ విశ్వాసంతో ఊర్ధ్వ శక్తిని ఆహ్వానించు. నీ ఆకాంక్ష నిలకడగలదై నిర్మలంగావుంటే నీకు సహాయం తప్పక లభిస్తుంది.

వ్యతిరేక శక్తులదాడి అనివార్యం. వాటిని నీ మార్గంలో పరీక్షలుగా స్వీకరించి ధైర్యంగా ఈ సంకటములను అధిగమించి ముందుకు సాగిపో. ఈ పోరాటం కష్టమైనదే. కానీ నీవు వాటినుండి బయటపడినపుడు, నీకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. నీవు ఒక అడుగు ముందుకు వేస్తావు. నీనుండి అసుర శక్తులు బయటికి పోవడానికి ఇలాంటి ఏదో ఒక మార్గం వుండాల్సిన అవసరం కూడా వుంది. నీ సంకల్పానికి అది మరింత బలాన్ని చేకూర్చి, నీ ఆకాంక్షను మరింత పారదర్శకంగా ఉంచుతుంది.

ఏది ఏమైనా అవి ఇంకా అలా కొంతకాలం వుండిపోతాయి. ఎందుకంటే అవి అలావుండేందుకు నీవే దోహదం చేశావు. ఎంత వరకైతే వాటికి నీలో స్పందించేదేదో ఇంకా వుంటుందో అంతవరకూ, అవి జోక్యం చేసుకోవడం అనేది న్యాయమే అన్పించుకుంటుంది. నీలో ఏదీ వాటికి స్పందించనపుడు నీ స్వభావంలో ఏ మూలగూడ దానికి సంభంధించినది లేనపుడు అవి తప్పకుండా నిన్నువిడిచి వెళ్ళిపోతాయి.

ఎప్పుడైనా సరే, ఏ దాడి అయినా జరిగినపుడు అవి

బయటినుండి వచ్చినదనీ "ఇది నాది కాదు. దీనితో నాకెలాంటి సంబంధం లేదు" అనుకోవడమే తెలివైన వైఖరి. నీలో నిమ్నస్థాయి నుండి నీమనసులోకి ప్రవేశించే తాకిళ్లు, కోరికలు అనుమానాలు శంకలు అన్నింటి పట్ల అదేవైఖరి అవలంబించాలి. అలాకాక వాటితో నీవు మమేకమైనపుడు వాటిని ఎదుర్కొనడం చాలా దుస్తరం. నీ స్వభావం అధిగమించడం అంత తేలికకాదనే భావానికి లోనవుతావు. కాని ఒక్కసారి "కాదు. ఇది నాది కాదు. దీనితో నాకే ప్రమేయం లేదు". అని చెప్పకోగలిగితే వాటిని పారద్రోలడం చాలా తేలిక.

★ ★ ★

ప్రశాంతంగా ఉండగలిగినప్పుడే వాటిని అవగాహన చేసుకొని ఏదైన చేయగలవు. అలాకాక కలవరపాటుకు లోనైనా బలవంతం పెట్టినా, వాటికి సహాయపడటం అనేది తెలివితక్కువ తనం కింద లెక్క. భగవంతుని సన్నిధిని తెలిపే మొదటి సంకేతం, శాంతి.

అతిమానస భవిష్యత్తు ఆవిష్కరణ కోసం మనల్ని మనం సన్నద్ధం చేసుకొనడం కోసం ఇతర ప్రదేశాలకన్నా బాగా చేసేందుకు అవకాశం ఉంది కనుక మనం ఇక్కడ ఉన్నాం. ఈ విషయాన్ని మనం ఎన్నడు మరువరాదు. ఈ విషయంలో సత్సంకల్పంతో చిత్తశుద్ధి కలిగి దీనిని సిద్ధింపచేసుకొనేందుకు సన్నద్ధమై ఉన్నవారందరికీ నా విజ్ఞాపన.

★ ★ ★

ఇంత వరకు నీకు తెలిసింది, ఇంకా తెలిసుకొనబోయేదాని ముందు ఏమీ కాదని ఎప్పడు అనుకుంటావో, ఇంత వరకు చేసిందేమైనా ఉంటే అది ఇంకా చేయువలసినదానికి ప్రారంభ బిందువేనని ఎప్పడు అనుకుంటావో "భవిష్యత్తు అనేది సహస్రానేక సూర్యకిరణాల వంటి అవకాశాలతో అలరారుతూ ఇంకా సాధించాల్సింది, ఎంతో ఉన్నట్లుగా కనిపిస్తుందో, అదీ రేపటి అనుభవ సంపదలతో అలారారే నిండు యవ్వనం, నేలమీద ఎన్ని సంవత్సరాలు గడిపినప్పటికీ.

ఇంక నీ శరీరం నిన్ను పరాజితుడ్ని చేయరాదనుకుంటే అనవసరపు కలవరపాటులతో నీ శక్తి యుక్తుల్ని వృథా చేసుకోకు. ఏమి చేసినా ప్రశాంతంగా, ప్రసన్నంగా చేయి. మహత్తర శక్తి అనేది మౌనంలోనూ ప్రశాంతిలోనూ ఉంటుంది.

అనువాదం : కొంగర భాస్కరరావు

ఆత్మనిగ్రహం గురించి కథలు

ఒక పెంకి గుఱ్ఱాన్ని మచ్చిక చేయొచ్చు. కాని ఒక పెద్దపులికి కళ్ళెం తగిలించలేము. ఎందుకంటే ఎవరికీ లొంగని అసాధ్యమయిన భయంకర క్రూర స్వభావం పెద్దపులిది. పెద్దపులినించి ఏ రకమైన మంచిని ఆశించలేము. అది మనకి కీడుచేయకుండా వుండాలంటే దానిని చంపడంతప్ప మరో మార్గం లేదు.

కాని పెంకి గుఱ్ఱం మొదట లొంగకుండా అల్లరి పెట్టి ఎంత మొండితనం చేసినా, కొంచెం ఓర్పుగా ప్రయత్నిస్తే, లొంగుతుంది. తరువాత మనకి మచ్చికయి పోతుంది. మనల్ని ప్రేమిస్తుంది కూడా. చివరికి దానినోటికి ఏది అందించి నా తనంతట తనే ముందుకి వచ్చి నోరుజాచి అందుకుంటుంది.

మనుషుల్లో కూడా నిగ్రహించుకోలేనంత తీవ్రంగా, తిరగబడి బాధించే కోరికలు, ప్రలోభాలు వుంటాయి. ఇలాంటివి పెద్దపులిలాగ లొంగుబాటుకి రాకపోవడమన్నది చాలా అరుదు. ఇవి సాధారణంగా పెంకి గుఱ్ఱాలలాంటివి. అది విజృంభించకుండా వుండడానికి కళ్ళెం అవసరం. దానికి తగిన కళ్ళెం నీకు నువ్వే వేసుకోవాలి. దీని పేరే ఆత్మనిగ్రహం.

ఫ్రాన్సు దేశపు ఉత్తరభాగంలో ఒక పట్నం వుంది. అక్కడ నాకు తెలిసిన కుర్రాడొకడు వుండేవాడు. అతడు కల్లాకపటం లేని స్వచ్ఛమైన స్వభావం కలవాడు. అయినా అతిత్వరగా కోపం తెచ్చుకునే ఉద్రేకి. ఎప్పుడూ సహనం కోల్పోయి చిరాకుపడుతూనే వుండేవాడు.

ఒకరోజు అతడిని నేనడిగాను. నీలాంటి బలమైన కుర్రాడికి కష్టమైన పనేది? నిన్నే స్నేహితుడైనా అవమానిస్తే పిడికిలి బిగించివాడి మొహం బద్దలయేలా కొట్టడమా? లేక పైకెత్తిన చేతిని జేబులో పెట్టుకుని కోపాన్ని అదుపు చేసుకోవడమా"? అని.

"నా చేతిని జేబులో పెట్టుకోవడమే" అన్నది అతడి జవాబు. కాని నీలాంటి ధైర్య సాహసాలు గల కుర్రాడికి కష్టమైనది సాధించడమా? సులభమైనది చెయ్యడమా? యేది యెక్కువ యోగ్యమైనది? మళ్ళీ ప్రశ్నించాను.

"కష్టమైనది సాధించడమే" అని అతడి జవాబు.

మరింకేం. అదే మంచిది. మళ్ళీ నీకు అవకాశం వచ్చినప్పుడు అలా చెయ్యడానికి ప్రయత్నించు అన్నాను.

కొంతకాలం తర్వాత ఆ కుర్రాడు మళ్ళీ నా వద్దకొచ్చి అన్నాడు. "అత్యంత కష్టమైన పని నేను చెయ్యగలిగేను"అని. అది వివరించాడు. నాతో పని చేస్తున్న కుర్రాడొకుడు అతడు కోపిష్టి అని అందరూ అంటూ వుంటారు. ఒకసారి కోపంలో నన్ను కొట్టాడు. నేనతడి కంటే బలవంతుడినే. ఎప్పట్లాగే నేను తిరిగి కొడతాననుకొని నానించి రక్షించుకోవడానికి సిద్దపడుతున్నాడు. అప్పడు మీరు చెప్పిన మాటలు గుర్తు తెచ్చుకొని నన్ను నేను నిగ్రహించుకున్నాను. అలా నిగ్రహించుకోడం నేననుకున్న దాని కంటే చాలా కష్టమే అయింది. అయినా అతి కష్టం మీద నా చేతిని జేబులో పెట్టుకున్నాను. ఎప్పుడైతే తిరిగికొట్టకుండా నేను నాచేతిని జేబులో పెట్టుకున్నానో, మరుక్షణమే నాకోపమంతా యెగిరిపోయింది. నాస్నేహితుడి మీద జాలివేసింది. స్నేహపూర్వకంగా చేయి జాపాను. వాడు నోటమాటరాక ఆశ్చర్యంతో నోరు తెరచి నావేపు చూస్తూ ఒక క్షణం అలా వుండి పోయాడు. తరువాత నా చేయి గట్టిగా పట్టుకొని వూపుతూ ఉద్వేగంగా నువ్వు నన్నేం చేసినా నేనేమీ అనుకోను. ఇకనుంచీ ఎప్పటికీ నేను నీ స్నేహితుణ్ణి". అన్నాడు.

ఆ విధంగా ఆ బాలుడు తనకోపాన్ని అదుపులో పెట్టు కున్నాడు. ఇలా కళ్లెం వేయ్యవలసిన విషయాలెన్నో వున్నాయి.

అల్‌కొసాయ్ అనే అరబ్బీ కవి యెడారిలో నివసిస్తూ వుండే

వాడు. ఒక రోజతను ఒక చక్కని నాబా చెట్టు కలపనించి వొక విల్లు, కొన్ని అమ్ములు తయారు చేసుకున్నాడు.

రాత్రి కాగానే అడివి గాడిదల్ని వేటాడ్డానికి బయలు దేరాడు. కొంచెం సేపటకి వొకమంద నడుస్తున్న గిట్టల చప్పడు వినిపించింది. వేంటనే అతడు తన మొదటి బాణం వదిలాడు. అదొక గాడిదకి తగిలి దాని శరీరంలోంచి దూసుకుపోయింది. అప్పడు ఆ బాణం వొక రాతికి తగిలిన చప్పడులా వినిపించింది. చీకట్లో బాణం గురి తప్పిందనుకున్నాడు. మరొక బాణం వదిలాడు. మళ్లీ అలాగే జరిగింది. అది కూడా గురితప్పిందనుకున్నాడు. అలావొక దానితరువాత వొకటి ఐదు బాణాలు వదిలి అన్నీ అదే చప్పడు రావడంతో బాణాలు వెయ్యడం మానుకుని కోపంతో విల్లు విరిచి పారేశాడు. తెల్లవారి వెలుతురులో చూస్తే అయిదు గాడిదలు రాతికి యెదురుగా చచ్చి పడివున్నాయి.

అతడు కాస్త వోర్పు వహించి తెల్లవారే వరకు వేచి ఉండి ఉంటే అతడు, తన ఓరిమిని దానితో పాటు విల్లునుకూడా పోగొట్టుకుని ఉండేవాడు కాదు.

అలా అని వ్యక్తిత్వ లక్షణాలుగా ఉండే, సాహసం, జీవశక్తులను నష్టపరిచి బలహీనపర్చే శిక్షణ అంటే మాకెంతో గొప్పగౌరవం అనుకోకూడదు. పొగరుబోతు గుర్రంనోటికి కళ్లెం బిగించటమంటే దాని నోటిని చీల్చి. పళ్లు రాలగొట్టాలనికాదు. తను సక్రమంగా పనిచేయాలని భావించినపుడు, సన్మార్గంలో ఉంచటానికి కళ్లెం బిగించాలి. అలాగని అసలు తను ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేనంత గట్టిగా కళ్లెం బిగించటమూ కాదు.

దురదృష్టవశాత్తూ, మనుషుల్లో అనేక రకాల బలహీనతలున్న వాళ్లు వుంటారు. కొంతమంది వొక్క అదిలింపుతో గొర్రెల్లా ఆలోచన లేకుండా తలవంచుకుపోతారు.

బానిస మనస్తత్వంతో కూడిన విపరీత స్వభావంతో మొద్దుబారిపోయి అవసరమయిన దానికి మించిన సహనంతో స్తబ్దుగా కొంతమంది వుంటారు.

అబూహొమన్ అల్హారి అనే అతడు విపరీత సహనానికి మారు పేరు. ఒక రోజతడు ఒక విందుకి ఆహ్వానించ బడ్డాడు. తీరా అక్కడికి వెళ్ళాక, విందుకి పిలిచినతడు ఆరోజు యితడికివిందివ్వలేక పోతున్నానని, అందుకు క్షమించిమని కోరుతూ వెనక్కి పంపేసాడు. తీరా యితడు యింటికి వెళ్ళిన వెంటనే ఆ స్నేహితుడే మళ్ళీ విందువున్నది. పొరపాటుగా చెప్పేను. తప్పక రమ్మని పిలిచాడు. యితడు వెళ్తే మొదటిలాగే తిప్పిపంపేశాడు. ఇలా చాలా సార్లు యితడిని తిప్పి చివరికి అందరి సమక్షంలో అతనితో నీ ఓర్పుని పరీక్షించడానికే యిలా చేసేను. నీ ఓర్పుని, సహనాన్ని యెంతో మెచ్చుకుంటున్నానన్నాడు.

అందుకు యితడు "నువ్వు నన్నంత మెచ్చుకోనవసరం లేదులే. ఇది మెచ్చుకోదగిన విషయమే అయితే కుక్కలు కూడా నీ మెప్పుకి తగినవే అవుతాయి. ఎందుకంటే అవిపిలిచిన్పడు వస్తాయి. పొమ్మన్నప్పడు పోతాడు" అంటాడు.

అహొమన్ మనిషి. కాని కుక్క కాడుకదా! అటువంటి ఓర్పువల్ల తనకిగాని, యితరులకిగాని యే ప్రయోజనం వుండకపోగా అతడి స్నేహితుల్లో అతడి హుందాతనానికి, మంచి తనానికి హాని కలుగుతుంది. ఇంతటి మెతక స్వభావం కలవానిలో అదుపులోపెట్టుకోవలసినది ఏమీలేదా? లేకేం! ఉంది. అన్నిటికన్నా తనకు అదుపులో పెట్టడం కష్టమైనది, తన వ్యక్తిత్వ బలహీనతే. తననుతాను అదుపులో పెట్టుకోవటం తనకు చేతకాదు. అందువల్లే ప్రతివాడూ ఇష్టం వచ్చినట్లు తనను ఆదేశించే ప్రయత్నంచేసేది.

బ్రహ్మచారి అయిన యువకుడొకడు చాలా తెలివైనవాడు.

అతడికి తను తెలివైన వాడిననే విషయం తనకు కూడా తెలుసు. తన ప్రతిభని ఇంకా పెంచుకోవడానికి అదనంగా ఏం చెయ్యాలో అన్నీ చేస్తూవుంటాడు. ప్రతివారూ అతన్ని చూసి మెచ్చుకుంటూ వుంటారు. అతడు ఒక చోటినుండి మరొకచోటికి పర్యటిస్తూ వుండేవాడు. విల్లమ్ములు చెయ్యడం వచ్చిన వాడి దగ్గర విల్లమ్ములు చెయ్యడం కుండలు చెయ్యడం వచ్చిన వారి దగ్గర కుండలు చెయ్యడం, ఇళ్ళుకట్టడం మరొకరినుంచి, ఇంకా ఓడలు నిర్మాణంచేసి, సముద్రయానం చేయటం, ఇలా ఏ విద్య తెలిసిన వాళ్ళ వద్ద ఆవిద్య నేర్చుకుంటూ అనేక విద్యలలో ఆరితేరాడు. ఇలా అతడు పదహారు దేశాలు పర్యటించాడు. ఇంటికి తిరిగి వచ్చి ఎంతో గర్వంగా "నా అంతటి ప్రజ్ఞావంతుడెవరైనా ఈ భూమ్మీద వున్నాడా?" అని ప్రకటించాడు.

ఆ యువకుడిని బుద్ధ దేవుడు చూసేడు, అతడు నేర్చుకున్న విద్యలన్నిటికంటె విశిష్టమైన కళ ఒకటి అతనికి నేర్పాలనుకుంటాడు. ఒక వృద్ధ శ్రమణకుడి వేషంలో చేతిలో భిక్షా పాత్రలో అతడి ముందు ప్రత్యక్షమవుతాడు.

"ఎవరునువ్వు?" బ్రహ్మచారి ప్రశ్నిస్తాడు.

"శరీరాన్ని అదుపులోపెట్టుకోగలిగిన మనిషిని నేను." బుద్ధుడి జవాబు

"ఏమిటి నీవుద్దేశం?" మళ్ళీ బ్రహ్మచారి ప్రశ్న.

"విలుకాడు గురిచూసి బాణం వెయ్యగలడు. నావికుడు నావను నడపగలడు. భవన నిర్మాత భవనాన్ని చక్కగా నిర్మించగలడు. జ్ఞాని అయినవాడు మాత్రమే తననితాను అదుపులో పెట్టుకోగలడు." బుద్ధ దేవుడి జవాబు.

"ఏవిధంగా?" బ్రహ్మచారి ప్రశ్న.

"ఎదుటి వారిచే పొగడ బడినప్పడు, నిందించబడినప్పడు

కూడా ఎటువంటి వికారానికి లోనుకాకుండా స్థిత ప్రజ్ఞుడై వుంటాడు. సత్యమార్గాన్ని ప్రేమించి అనుసరిస్తూ ప్రశాంత జీవనాన్ని గడుపుతాడు". అని బుద్ధ దేవుడి జవాబు.

స్వచ్ఛమైన మంచి మనసున్న పిల్లలు మీరు. మిమ్మల్ని మీరు అదుపు చేసుకోవడం నేర్చుకోవాలి. స్వభావాన్ని అదుపులో పెట్టేందుకు ఒక గట్టి కళ్ళెం వెయ్యవలసి వచ్చినప్పడు వెయ్యండి. కాని ఫిర్యాదు చెయ్యకండి. ఎంత ప్రయత్నించినా కదలని కొయ్యగుఱ్ఱం కంటె క్రమంగా అదుపులోకి వచ్చే చురుకైన గుఱ్ఱం మేలు. దానికి కళ్ళెం వెయ్యాలి గాని కొయ్య గుఱ్ఱానికి వెయ్యడం హాస్యాస్పదం.

- శ్రీమాత

శ్రీమాత తన గురించి తాను చెప్పినది.

అన్ని విషయాలు అందులో అత్యంత బాధాకరమైన విషయాలైనాసరే, నాకు తెలిసినప్పడు వాటి ప్రభావం నామీద బొత్తిగా వుండదు. అవన్నీ అత్యంత ప్రశాంతంగా తటస్థంగానే స్వీకరిస్తాను. అలాగని క్రియాశూన్య వైఖరితో కాదు. ఏవిధమైన బాధ, ప్రతిస్పందన లేకుండా కేవలం తటస్థంగా స్పష్టమైన సమభావంతో వుంటాను. ఈ సమత్వభావనతోనే యేది చెయ్యాలి, యేం చెప్పాలి, యేం వ్రాయాలి, యేం నిర్ణయించుకోవాలి అన్నవి చాలా సంక్షిప్తంగా ప్రతీదీ స్వయంగా, భాధ్యతగా, స్పష్టమైన అవగాహనతో, నిర్వర్తించబడుతుంది. అంతా సమగ్ర సమతా వైఖరిలోనే జరుగుతుంది. అదే సమయంలో శక్తివంతమైనస్పృహతో పరిపూర్ణ తటస్థ వైఖరిలో నిర్వహించబడుతుంది. ఆ నిర్వహణలో దివ్యశక్తి పొంగి ప్రవాహవేగంతో పనిచేస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

దైవం సర్వాంతర్యామి

సర్వోపగతుండు దైవము. మనము, ఇతరులు, జ్ఞాని , అజ్ఞాని, మిత్రుడు, శత్రువు, మనిషి, పశువు, పుణ్యాత్ముడు, పాపాత్ముడు, వీరిమధ్య సారభూతంగా మనం విచక్షణ చూపనవసంరం లేదు. ఎవ్వరినీ ఈసడించరాదు. ద్వేషించ కూడదు. అసహ్యించుకోకూడదు. అందరిలో ప్రచ్ఛన్నంగా, లీలా వినోదిగా, అధిష్ఠితుడై ఉన్న సర్వేశ్వరునే మనం దర్శించాలి. కొందరిలో కొంతగాను, మరికొందరిలో మరింతగాను వ్యక్తమవుతాడు. కొందరిలో గుప్తంగా, ఇంకొందరిలో పూర్తిగా వక్రీకరింపబడి, ఆయన సంకల్పానుసారంగా, వారివారి స్వభావ, రూప, లీలా విన్యాసాలకు అనుగుణంగా వెల్లడి కాబడతాడు. ఒకే జీవాత్మమనమంతా. భిన్నరూపాలు వహించి ఉన్న వాళ్లం. ద్వేషం, అయిష్టత, తృణీకారం, అసహ్యం, అంటిపెట్టుకొని ఉండటం, అనుబంధం, ప్రత్యేక ఇష్టాయిష్టాలు - ఇవి సహజమే. ఒక స్థాయిలో అవసరమే. తప్పనిసరియే. అవి మనలోని దివ్యప్రకృతికి సమ్మతమై, దానిని పరిపోషించి నిలపెట్టడానికి సహకరిస్తాయి. అయితే ఇవి కర్మయోగికి అవశేషాలు, తప్పటడుగులు. అవిద్యా ప్రక్రియలు. ఆధ్యాత్మిక పురోగమనంలో అవి స్వభావం నుంచి వైదొలగుతాయి. పరిణతి చెందని జీవాత్మ సఫలమవటానికి ఇవి అవసరం. దివ్యసంస్కారంలో పరిణితి చెందిన జీవాత్మనుంచి ఇవి జారుకుంటాయి. మనం పొందగోరే దివ్య చేతన ఉత్థానం దుర్భేద్యంగాను, తీవ్రముగాను కనపడవచ్చు. తీవ్ర వినాశకరంగానూ ఉండవచ్చు. కాని అక్కడ ద్వేషము ఉండదు. అది ఒక దివ్య వక్రోక్తిగా కనిపిస్తుంది. అంతే కాని అదితృణీకారము కాదు. ఒక నిర్మలమైన సమ్యక్‌దృష్టి . నిరాకరణ బలీయంగా ఉండవచ్చు. అంతమాత్రంచేత అక్కడ అసహ్యము, అయిష్టత ఉండదు. ఒక వేళ విధ్వంసం చేయాల్సివచ్చినా అందుకు

ఏవగించుకోకూడదు. అది శాశ్వతుడు అయిన వాని యొక్క ప్రచ్ఛన్న తాత్కాలిక సంచాలనంగా గుర్తించాలి.

<u>సర్వం విశ్వేశ్వరమయం:</u> ఏకైక పరమాత్మయొక్క అభివ్యక్తీరణ యే సృష్టి అంతా. కాబట్టి సర్వులయెడల ఆత్మసారూప్యతా భావన (equality of soul) కలిగిఉండాలి. సుందరము, వికారము, లోపభూయిష్టము, పరిపూర్ణము, ఉన్నతము, నీచము, ఖేదము మోదము, మంచి,చెడు వీటన్నిటి పట్ల సమభావంకలిగి ఉండాలి. అపుడిక ద్వేషము, తృణీకారము, ఏవగింపు - వీటికి తావుండబోదు. ప్రత్యామ్నాయంగా సమదృష్టియే ఉంటుంది. అది విషయాలను అవి ఉన్న నిర్ణీతస్థలాలో, వాటియొక్క వాస్తవ లక్షణాలను దర్శిస్తుంది. సమస్త విషయాలు తమ శక్త్యానుగుణంగా వ్యక్తమవటం, లేదా అవ్యక్తంగా ఉండటం, బాగుపడటం లేదా భ్రష్టమవటం జరుగుతుంది. తమ స్వభావానికి ఉద్దేశింపబడిన పరిస్థితులలో ఏదోలోపం వాటికి తప్పకపోవచ్చు. ఎందుకంటే ఇక్కడ మనం ఒకటి తెలుసుకుంటాం. (అది ఏమిటంటే) సమస్త విషయాలు తమ శక్త్యానుగుణంగా వ్యక్తమవటమో లేదా అవ్యక్తంగానే ఉండిపోవటమో జరుగుతుంది. వృద్ధి పొందటమో, వక్రంగా తయారుకావటమో జరుగుతుంది. లేదా వాటి యొక్క నిర్దేశిత పరిస్థితులో తప్పనిసరియైన లోపంతో వ్యక్తమవుతుంది, లేదా తమ వర్తమాన ప్రాధాన్యత కాక ప్రయోజనానికి అనుగుణంగా వ్యక్తమవుతుంది. లేదా తమ స్వభావ పరిణామ క్రియానుగుణంగా వ్యక్తమవుతుంది. లేదా అక్కడ ఉన్న మొత్తం విషయ సముదాయం కార్యరూపం దాల్చవలసిన దివ్యశక్తిగా, అంతిమఫలితంగా పరిపూర్ణ కార్యరూపం దాల్చి అభివ్యక్త పురోగతికి అనుగుణంగా వ్యక్తమవుతుంది. లేదా అవ్యక్తంగానే ఉండిపోవచ్చు. That truth is what we must seek and discover behind the

transitory expression , అనిత్యమైన వ్యక్తీకరణల వెనుకనుండే 'తత్' నిత్యసత్యమునే మనము అన్వేషించి కనిపెట్టవలసినది. అప్పుడే పైకి అగుపించే బాహ్య రూపాలకు, వికృతాలకు, లోపాలకు నిరుత్సాహపడకుండా మరుగున ఉన్న అమలిన స్వచ్ఛ సుందర పరిపూర్ణ దైవాన్ని ఆరాధించగలం. నిజానికి సర్వమూ పరిణామం చెందాలి. వికృతమై ఉన్నదానికి బదులు దివ్య సౌందర్యాన్ని స్వీకరించాలి. అపరిపూర్ణంగా ఉన్నదానితో సరిపెట్టుకోకుండా పరిపూర్ణతకు కృషి చేయాలి. సర్వోన్నత శ్రేయమే సార్వత్రిక లక్ష్యం కావాలి, కాని హానికరమైనది కాకూడదు. ఏమి చేయవలసి వచ్చినా అది ఆధ్యాత్మిక అవగాహన పరిజ్ఞానంతో చేయాలి. దివ్యానంద సుందర పరిపూర్ణ శ్రేయమే అనుసరణీయం. అంతేకాని వీటికి సంబంధిత మానవ ప్రమాణాలు కాదు. సమత లేకపోవటం అనేది, అజ్ఞానం చేతనే మనం ఇంకా నడిపించబడుతున్నామనే దానికి సంకేతం. నిజానికి మనకేది అర్థంకాదు. పాత అపరిపూర్ణతలు నాశనం చేసేది క్రొత్తవాటిని సృష్టించటానికే అనేది అసంబద్ధంకాదు. ఎందుకంటే, దివ్యమైన విలువలస్థానంలో మేధోవరమైన యుక్తాయుక్త పరిజ్ఞానం, వాంఛితాత్మలతో పూరిస్తున్నాం.

సమత్వమంటే కొత్త రకమైన అజ్ఞానం, అంధత్వంకాదు. మసక దృష్టిని అది కోరదు. రకరకాలైన వన్నెలు, చిన్నెలను నిర్మూలించే ప్రయత్నంచేయదు. తేడాలుంటాయి. వ్యక్తీకరణలో వైవిధ్యం ఉంటుంది. వైవిధ్యాన్ని మరింత యుక్తంగా గ్రహిస్తాం. పక్షపాతంతో, అనుచిత రాగద్వేషాలతో, ప్రశంసా, తృణీకారాలతో, సానుభూతి, అయిష్టతలతో ఆకర్షణలతో, మసకదృష్టితో-గ్రహించం. ఈ వైవిధ్యాలకు వెనుక మనం ఎప్పుడూ దర్శించేది అంతర్నిహితంగా అధివసించి ఉండే The Complete and Immutable-పరిపూర్ణుని, నిర్వికారుని. మనకది అదృశ్యంగా ఉంటే

వివేకవంతమైన దివ్యప్రయోజనంలో, విశిష్టమైన అభివ్యక్తీకరణలో నమ్మకం కుదురుతుంది. తెలుసుకుంటాం. సంవేదన కలుగుతుంది. మానవ విలువలకు అది పరిపూర్ణ సామరస్య పూర్వకంగా కనిపిస్తున్నదా లేక అపరిపూర్ణంగాను, వెురటుగాను, అసంబద్ధంగాను దుర్మార్గంగా ఉన్నదా అనే అవగాహనతో కూడిన వివేకం కలుగుతుంది.

సర్వకర్మాధిష్ఠానదైవం:

అందుచేత సర్వసంఘటనల పట్ల, బాధాకరమైనవి అయినా, ఆనంద ప్రదమైనవి అయినా - గెలుపు, ఓటమిలు, మర్యాద, అమర్యాదలు, కీర్తి, అపకీర్తిలు, అదృష్ట, దురదృష్టాలు, అన్ని విషయాలలోను ఒకే రకమైన సమబుద్ధి కలిగి ఉంటాం. ఎందుకంటే అన్ని సంభావ్యతలలోను, సర్వఫలాధిపతి యొక్క ఇచ్ఛాశక్తిని దర్శిస్తాం. పరిణామ ప్రక్రియ తాలుకు వ్యక్తీకరణలో మరో ముందడుగును గమనిస్తాం. కాకపోతే దర్శించగలిగే అంతర్చక్షువు ఉండాలి. అలా ఉన్నవారే, శక్తులలో, వాటియొక్క లీలావిలాసహేలలలో, తత్ఫలితాలలో, విషయములలో, సకలజీవులలో దైవాభివ్యక్తతను దర్శిస్తారు. విషయాలన్నీ దివ్యసన్నివేశాలుగా సాగుతుంటాయి. సర్వజనీనమైన ప్రతిచలిత చాలనము - వ్యథ, కామన, ఆనందము, పరితృప్తి - వీటన్నిటి అనుసంధానానికీ అవసరమయేవే. వీటిపై తిరుగుబాటు, వీటిని నిందించటం, గగ్గోలుపెట్టడం - ఇవన్నీ అజ్ఞానపూరిత, క్రమశిక్షణా రహితమైన అంతర్బుద్ధిప్రేరణలు, ఈ లీలాహేలలో వాటి ప్రయోజనం వాటికి ఉంది. అవసరమే. సహకారికూడా. దివ్యాభివృద్ధికి, సమయం వచ్చినపుడు సాధికారిక ఆదేశాలుగా ఉపకరిస్తాయి. కాని అజ్ఞానంతో కూడిన తిరుగుబాటు పరిణతి చెందని జీవాత్మ, లేక, అపరిపక్వయౌవన దశకి సంబంధించినది. పరిపక్వ జీవాత్మ

ఖండించదు. అవగాహనతో వశపర్చుకుంటుంది. గగ్గోలు పెట్టదు. స్వీకరిస్తుంది. మెరుగు పరిచి పరిపూర్ణ సాధనకు శ్రమిస్తుంది. అంతర్గతంగా తిరుగుబాటు చేయదు. ఆజ్ఞాపాలనకు కృషి చేస్తుంది. సాధిస్తుంది. రూపాంతరీకరిస్తుంది. కాబట్టి అన్ని విషయాలను సమ్యక్ దృష్టితో జగదీశ్వరునినుంచి స్వీకరించాలి. వైఫల్యాన్ని మార్పుగా తీసుకోవాలి. దివ్యముహూర్తం ఆసన్నమయ్యే దాకా నిశ్చలంగా విజయంలో భాగంగా అంగీకరించాలి. దివ్య విధివిధానంలో భాగాలుగా సంభవిస్తాయి. మరీ అంత హర్షాతిరేకాలకు లోబడి పోకూడదు. వాటి అనుభూతిలో, మనో, శరీర, జీవాత్మలు తీవ్రాతితీవ్ర దుఃఖానుభవాలలో కూడా స్థిరంగా నిలబడతాయి. అలా మహత్తరమైన సమతూకంతో సమచిత్తంతో, స్థిరంగా అన్ని విషయాలను ప్రశాంతంగా ఎదుర్కొన గలగాలి. పరమోన్నత బ్రహ్మానంద స్థాయికి చేరుకోగలిగేందుకు సన్నద్ధమయ్యే వరకు ఇలానే కొనసాగాలి. తప్పదు.

సమత లేకుండా సాధనకి సుస్థిరపునాది అసాధ్యం. ఎలాటి అననుకూల పరిస్థితులనైనా, మనుష్యుల ప్రవర్తనలు ఎంత తిరస్కరించవలసినవిగా, అయోగ్యంగా ఉన్నా వాటిని పరిపూర్ణ ప్రశాంతతో, ఏ వ్యాకులపాటులేకుండా, స్వీకరించగలగటం, నేర్చుకోవాలి. ఇవన్నీ సమతకు సవాళ్లు. అంతా సవ్యంగా ఉండి, పరిస్థితులు సానుకూలంగా ఉన్నపుడు నిబ్బరంగా ఉండటం సులువే! ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవలసి వచ్చినపుడే, నీ నిశ్చల, ప్రశాంత సమతలకు అవి పరీక్షలుగా ఉంటాయి. కాని అవి అపుడే మరింత బలపడతాయి. పరిపూర్ణతను సంతరించుకుంటాయి.

- శ్రీఅరవిందులు

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

నిష్క్రియ, సక్రియ సమత

- శ్రీఅరవిందులు

సమతకు రెండు పార్శ్వాలున్నాయి. ఒకటి నిష్క్రియ సమత, రెండు సక్రియ సమత.

సంపూర్ణ మరియు పరిపూర్ణ సమతను సవివరంగా పరిశీలించినట్లైతే, దానికి రెండు పార్శ్వాలున్నట్లు కన్పిస్తుంది. అందుచేత ఒకదాని తర్వాత మరొకటిగా చేసే రెండు సాధనా పద్ధతుల ద్వారాకూడా సమతా స్థితికి చేరుకోవచ్చు. ఒక పద్ధతి నిమ్న ప్రకృతి చర్యలనుండి మనల్ని విముక్తంచేసి దివ్య అస్తిత్వం యొక్క స్థిర శాంతిలోని కనుమతిస్తుంది. రెండో పద్ధతి ఉన్నతతర ప్రకృతికి సంబంధించిన పూర్ణ అస్తిత్వంలోనికి, శక్తిలోనికి ఉద్ధరిస్తుంది. అంతేగాక దివ్యమైన అనంతజ్ఞానం, దివ్యకర్మకై సంకల్పం, ఆనందాల సమతా స్థితికి, విశ్వజనీనతలోనికి ఎదిగేటట్లు చేస్తుంది. మొదటి పార్శ్వం ఒక నిష్క్రియ లేక అభావసమతగా చెప్పవచ్చు. దృగ్గోచర జగత్తు యొక్క ఆటుపోట్లను, కన్పించే ద్వంద్వాలను, మనపై విధించే ప్రతిచర్యలను, నిర్వికారంగా స్వీకరించగల సమత అది. రెండో పార్శ్వం సక్రియమైనది, సద్భావాత్మకమైన సమత. ఇది దృగ్గోచర జగత్తును అంగీకరిస్తుంది, కాని ఏకైక దివ్యపురుషుని యొక్క అభివ్యక్తిగా మాత్రమే. మనలోని దివ్య స్వభావంనుండి బహిర్గతమయ్యే సమతా దృష్టితో స్వీకరించి వాటిని వాటిలోనే దాగివున్న విలువల్లోనికి రూపాంతరం చెందిస్తుంది. ఏకైక బ్రహ్మం యొక్క శాంతిలో నివసిస్తూ మొదటి పార్శ్వం జగత్తులో చురుగ్గా వున్న అవిద్యను తనకు దూరంగా నెట్టివేస్తుంది. రెండో పార్శ్వం ఆ దివ్య శాంతిలోనేగాక, దైవ ఆనందంలో గూడా నివసిస్తుంది. ప్రకృతిలో జీవిస్తున్న జీవితంపై

దివ్యజ్ఞానాన్ని, శక్తిని, అంతర దివ్యసత్తయొక్క ఆనందాన్ని విధిస్తుంది.

నిష్క్రియాత్మక లేక ఉదాసీన సమతకు దారితీసే త్రివిధమార్గాలు :

ఒక అభావ లేక నిర్వికారంగా, జరిగేదాన్ని స్వీకరించే స్థితికి దారితీసే కృషి మూడు విభిన్న సూత్రాల ఆధారంగా జరుగుతుంది. ఈ మూడు విధానాలూ ఒకే ఫలితంవైపు, వాటి పతాక స్థాయియైన - క్షమ, ఉదాసీనత, శరణాగతికి దారితీస్తాయి.

క్షమ : (సంకల్ప మార్గం)

దృగ్గోచర జగత్తుకు సంబంధించిన సంస్పర్శలు, ఆటుపోట్లు, సూచనలు మనల్ని అన్నివైపుల నుండి చుట్టు ముడ్తుంటాయి. ఒత్తిడి కలిగించే వాటి భావోద్వేగాలు, ప్రకోపింపజేసే ప్రభావాలు, కదిలించి వేసే బుద్ధిగత ప్రతిస్పందనలు మనల్ని ఆవహించకుండా (భావాతీతంగా) భరించగల మనలోని ఆత్మశక్తి మీద క్షమ ఆధారపడివుంటుంది.

రెండో విధానం : పక్షపాతంలేని ఉదాసీనత :

వస్తువుల యెడల ఆకర్షణ, వికర్షణ, రెండింటినీ తిరస్కరించడం, వాటియెడల వివేకవంతమైన ఉదాసీనతను, నిషిద్ధ వస్తువులుగా తిరస్కారాన్ని అభివృద్ధి చేసుకోవడం విషయాల యందు అనాసక్తిని, వైరాగ్యాన్ని అలవాటు చేసుకోవడం ఈ రెండో విధానం. సంకల్పం సదా ఆవశ్యకమైనప్పటికీ, ఈ ధోరణి సంకల్పం మీద కంటె జ్ఞానం మీదే ఎక్కువగా ఆధారపడ్తుంది. మనకు సంబంధించిన ఆవేగాలనుబాహ్యమనస్తత్వంయొక్క భ్రాంతిజనకాలుగాఈధోరణి పరిగణిస్తుంది. లేదా ఏకైక సమతాభావానికి సంబంధించిన స్థిర సత్యానికి తగని, నీచపోకడలుగా పరిగణిస్తుంది. వివేకి యొక్క ప్రశాంత పరిశీలనాత్మక సంకల్పం వీటిని ఉద్వేగ రహితమైన బుద్ధి దగ్గరకు చేరనీయకుండా తిరస్కరించవలసిన ఒక ప్రాణిక లేక

భావావేశానికి సంబంధించిన అలజడిగా పరిగణిస్తుంది. అది మనస్సునుండి కోరికను ఆవలికి నెట్టివేస్తుంది, ద్వంద్వ విలువల నాపాదించేఅహంకారాన్నివిసర్జిస్తుంది.కోరికస్థానంలోప్రాపంచిక ఆటుపోట్లవల్ల బాధపడని, ప్రేరేపింపబడని వాటిల్లో తగుల్కొనని విశుద్ధాత్మను నెలకొల్పుతుంది. భావోద్వేగాల మనస్సును శాంతింప జేస్తుంది. అజ్ఞాన భావాలను, బుద్ధ్యాత్మగూడా తిరస్కరిస్తుంది. అల్పజ్ఞానానికి సంబంధించిన ఆసక్తులన్నింటికీ అతీతమైన మార్పులేని శాశ్వతమైన ఒకే ఒక సత్యస్థాయికి బుద్ధ్యాత్మ ఉద్ధరించబడుతుంది.

భగవదేచ్ఛకు శరణాగతి (హృదయమార్గం)

మూడోమార్గం శరణాగతి. భగవత్సంకల్పానికి దాసోహమనే క్రైస్తవ సిద్ధాంతం మీద ఆధారపడిన విధానమై వుండవచ్చు లేదా కాలంలో పనిచేసే విశ్వసంకల్పం యొక్క ఒక అభివ్యక్తిగా విషయాలను, సంఘటనలను, నిరహంకారంగా అంగీకరించే విధానం. పురుషోత్తమునికి సంపూర్ణ సమర్పణా విధానమిది. మొదటిది సంకల్పానికి సంబంధించిన మార్గం, రెండోది జ్ఞానమార్గం, అవగాహనగల తార్కిక బుద్ధిమార్గం. అందుచేత ఇది చిత్తవృత్తి, హృదయానికి సంబంధించిన మార్గం, అంతేగాక భక్తి సూత్రానికి చాలాదగ్గర సంబంధంగల మార్గం. దీన్ని చివరికంటూ అనుసరిస్తే పైవాటి ఫలితమైన పరిపూర్ణ సమత దగ్గరకే చేరుస్తుంది. ఎందుచేతనంటే అహంకార గ్రంథి పట్టు సడలింది, నేను, నాది, అనే భావం అంతరించడం ఆరంభమైంది, ఆహ్లాదం కలిగించే వాటికి సంతోషించడం, అలాకానివాటికి విచారించడం ఎంతమాత్రం జరగడం లేదని గ్రహించాం. ఆసక్తితో వాటిని అంగీకరించడం లేదా బాధతో తిరస్కరించడం గాకుండా వాటిని భరిస్తున్నాం. మన అస్తిత్వపు సారథికి నివేదించిన పిదప, వాటివల్ల మనకు వ్యక్తిగతంగా లభించే ఫలితాలను గురించి పట్టించు కోవడం క్రమంగా మానివేస్తాం.

భగవంతుని దరిచేరడమనే ఒకే ఒక్క విషయాన్ని మనం ప్రధానంగా తీసుకుంటాం. లేదా విశ్వజనీన మరియు అనంత భగవదస్తిత్వంతో సంపర్కం కలిగి, సమశ్రుతిలో వుండడమే ప్రధాన మనుకుంటాం. లేదా దైవంతో మమేకమై, ఆతనికి వాహికగా, పరికరంగా, సేవకునిగా, యిష్టునిగా, అతనిలో ఆనందిస్తూ, ఆయనతో మన బాంధవ్యం నిలుపుకోవడం తప్ప మరో లక్ష్యంగాని విషాదానందాలకు కారణంగాని లేకుండా జీవించడమే ప్రధానంగా భావిస్తాం.

మనలోనించి విడివిడి మూలాలనుండి ప్రారంభమైనా ఈ మూడు మార్గాలూ బాహ్యస్పర్శలకు మానసికమైన మామూలు ప్రతిచర్యల యెడల వాటికిగల విముఖత్వం ప్రధాన కారణం వల్ల ఒకచోట కలుస్తాయి. ప్రాకృతిక బాహ్యచర్యల నుండి ఆత్మ విడివడిన రెండో కారణంవల్ల కూడా ఇవి ఏకీభవిస్తాయి.

గుణాత్మక, క్రియాత్మక సమత

ప్రపంచంనుండి ప్రశాంతంగా వెనుతిరిగి లేక ప్రశాంతంగా ప్రపంచంతో తలపడడమేగాక తిరిగి ప్రశాంతత, సమతగల పరమాత్మ శక్తితో ఆ ప్రపంచంపైకి తిరిగిరాగల, దానిని స్వాధీనం చేసుకోగల మరింత సజీవ సమతను సాధించినపుడు మన పరిపూర్ణత మరింత పరిపూర్ణం, సర్వస్వీకరణాత్మకం అవుతుందనేది స్పష్టం. ఇది సుసాధ్యమే. ఎందుకనంటే, ప్రపంచం, ప్రకృతి, కర్మ, వాస్తవానికి పూర్తిగా భిన్నమైనవిగావు, అవి పరమాత్మ, సర్వాంతరాత్మ, దైవంయొక్క అభివ్యక్తియే, సామాన్య మనస్సు యొక్క ప్రతిచర్యలు, (reactions) దైవవిలువలకు భ్రష్టరూపాలు. పరమాత్మ, అంధపదార్థ నిశ్చేతనలో అంతర్లీనమైనపుడు ప్రారంభమైన అజ్ఞానం, భ్రష్టీకరణ వల్ల దివ్యవిలువల చర్యలు మారిపోయాయి అనే సత్యం ఈ భ్రష్టత్వం వల్లే భ్రష్టత్వమే మనకు తెలియజేసిందనేది స్పష్టం. ఒకసారి భగవంతుని చేతనకు, పరమాత్మ చేతనకు పూర్తిగా చేరుకొంటే అపుడు మనం

యదార్థమైన దివ్యవిలువను విషయాలకు ఆపాదించగలం, విషయాలను, శాంతంగా, ఆనందంగా, జ్ఞానంతో, పరమాత్మ సంకల్పదృష్టితో స్వీకరించగలం, వాటిపై పనిచేయగలం. మనం అలా చేయడం ప్రారంభించి నపుడు జగత్తులో అన్నింటి నుండి సమానమైన ఆనందాన్ని అంతరాత్మ అనుభవిస్తుంది. సమస్త శక్తులతో ఒకే సంకల్పం సమత్వంతో వ్యవహరిస్తుంది, ఈ దైవ అభివ్యక్తీకరణ యొక్క దృగ్గోచర జగత్తు వెనుకగల ఆధ్యాత్మిక సత్యాన్ని స్వంతం చేసుకొనే ఒక సమతా జ్ఞానాన్ని పొందడం అంతరాత్మకి ప్రారంభమౌతుంది. నిండైన అనంత ప్రకాశంలో శక్తిలో, ఆనందంలో దైవం ప్రపంచాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు అంతరాత్మ కూడా స్వాధీనం చేసుకొంటుంది.

అందుచేత అభావ మరియు నిష్క్రియాత్మక సమత స్థానంలో సద్భావ, సజీవ సమతా యోగాన్ని ప్రతిష్ఠించి తద్వారా ఈ సమస్త జగత్తుతో వ్యవహరించవచ్చు.

సద్భావ సమత లేక క్రియాత్మక సమతావిధానం:

సమస్తాన్నీ తాదాత్మ్యతా భావంలో దర్శించడం, సమస్తాన్ని భగవంతునిలో దర్శించడం, భగవంతుని సమస్తంలోనూ దర్శించడమనే ఏకత్వానికి సంబంధించిన నూతన జ్ఞానం మొట్టమొదట ఈ మార్గాన్ననుసరించే వారికుండాలి. సమస్త దృశ్యమాన జగత్తు, సమస్త సంఘటనలు, సమస్త సంభావ్యతలు, వ్యక్తులందరూ, శక్తులన్నీ, ఒకే పరమాత్మయొక్క ముసుగులనీ, ఒకే ఉత్సాహంయొక్క సంచలనాలనీ, కర్మచేసే ఒకే శక్తియొక్క ఫలితాలనీ, ఒకే దివ్య జ్ఞానంతో పాలింపబడుతున్నాయనీ సమభావంతో అంగీకరించేసంకల్పంవుండాలి. ఈ మహత్తర జ్ఞాన సంకల్ప పునాదిపై, ప్రతిదాన్నీ, అలజడిలేని అంతరాత్మ, మనస్సులతో ఎదుర్కొనే బలం అభివృద్ధి చెందుతుంది. స్వీయాత్మ విశ్వాత్మతో మమేకం అవుతుంది.

సమస్త జీవరాశులతో ఏకత్వానుభూతి, ఏకత్వ దృష్టి లభిస్తుంది. సమస్తక్రియాశక్తులు, ఊర్జాలు, ఉత్సాహాలు, ఫలితాలు స్వీయ ఆత్మశక్తే గనుక నాకత్యంతర సన్నిహితమైనవి, నావే. నోరు మూయించవలసినవి తుద ముట్టించవలసినవి, త్రోసిపార వేయవలసినవి. అహంకారిక మైనవే తప్ప ఆత్మానుబంధితమైనవి కాదనేది తేటతెల్లమే అపుడే పరిపూర్ణత సిద్ధించేది. నేనిపుడు వ్యక్త్యాతీత లేదా విశ్వజనీన ఆత్మకు సంబంధితుడను. ఎందుచేతనంటే ఇపుడు నావ్యక్తిత్వం విశ్వాత్మ కార్యకలాప కేంద్రం. ఇంకా ఇతరమైన సమస్త వ్యక్తిత్వాలతో నిర్వ్యక్తికవిషయాలుగా, క్రియాశక్తులుగా కన్పించే వాటితో కూడా సంబంధం కలిగిన కేంద్రంకూడాయిది. కాని వాస్తవానికి అవికూడా వ్యక్త్యాతీత పురుషుడైన ఒకేఒక భగవంతుడు, పరమాత్మ, పరమాత్మశక్తి యొక్క, శక్తులే. నా వ్యక్తిత్వం ఆయనిదే. వైశ్వానిక సత్తతో ఏమాత్రం పొసగనిది కాదు. దానినుండి విడివడి ఉన్నదీగాదు. అది స్వతహాగానే వైశ్వానికమైనది. విశ్వానంద జ్ఞాతమయినది. తాను తెలుసుకున్నదానితో, పనిచేయుదానితో, సుఖానుభవాలతో ఏకమైనది. వాటన్నిటికి ప్రియమైనది. ఏకమైన సమానమైన విశ్వజ్ఞానానికి విశ్వసమతాసంకల్పానికి భగవంతుని సమస్తబ్రహ్మాండ అభివ్యక్తీకరణ. సమస్తానికీ సమత్వ ఆనందాన్ని చేకూర్చడం జరుగుతోంది.

ఈ పద్ధతికి గల మూడు ఫలితాలు లేక శక్తులను మనం విశ్లేషించుకుందాం.

ఉదాసీన, క్రియాశీల సమత : పూర్ణయోగం :

పూర్ణయోగం అంతర్యామి మార్గదర్శకాన్నిబట్టి స్వభావ అనుగుణంగా ఉదాసీన, క్రియాశీల సమతావిధానాలను రెంటినీ వినియోగించుకొంటుంది. అది ఉదాసీన మార్గానికి తనను తాను

పరిమితం చేసుకోదు, ఎందుకనంటే అది ఏదో వ్యక్తిగత ప్రశాంత ముక్తికి లేదా క్రియాశీల మరియు విశ్వజనీన ఆధ్యాత్మిక సత్తనిరాకరణ స్థితికి మాత్రమే దారితీస్తుంది. ఇది సమతకు గల పరిపూర్ణ లక్ష్యానికి పొసగని విషయం.

పూర్ణయోగం క్షమా విధానాన్ని గూడా ఉపయోగించుకొంటుంది. కాని వైరాగ్య బలంతోనూ, నైష్ఠికతతోనూ తృప్తిపడి ఆగిపోదు. సరికదా ముందుకు పోయి కార్యోన్ముఖమయ్యే బలాన్ని, సాధికారతను సంతరించుకొంటుంది. ఆ స్థితిలో ప్రయత్న పూర్వక క్షమ ఇంకెంత మాత్రం అవసరంలేదు. కారణం అప్పటికి అతని ఆత్మ ఒక ప్రశాంత శక్తి వంతమైన స్తితిలో వైశ్వానిక శక్తిని, అప్రయత్నంగా స్వాధీనంచేసుకొని వుంటుంది. అంతేగాక అదితన ప్రతిచర్యలనన్నింటినీ ఏకత్వంలోనూ, ఆనందంలోనూ ఉండి సునాయాసంగా, సంతోషంగా నిర్దేశించు సామర్థ్యం కలిగి వుంటుంది.

పూర్ణయోగం పక్షపాత రహితమైన ఉదాసీనతా విధానాన్ని వినియోగించుకొంటుంది. కాని విషయాలన్నింటినుండి విడి వడేఒక ఏకాకిని చేసే ఉదాసీనతలో మునిగిపోక, ఆత్మ సమతకుగల మహనీయ విలువలలోనికి సమస్త అనుభవాన్ని రూపాంతరీకరించు శక్తి కలిగిన జీవితాన్ని పక్షపాతం లేకుండా ఒక ఉన్నత స్థాయి వైపుకుద్ధరిస్తూ సాగిపోతుంది.

పూర్ణయోగం జీవితాన్నుండి ఉపసంహరించుకోవడం, శరణాగతి, విధానాలను గూడా తాత్కాలికంగా ఉపయోగించుకొంటుంది. దైవానికి తన వ్యక్తిగత అస్తిత్వాన్నంతట్నీ సమర్పించడం ద్వారాఅది సర్వాన్నీ స్వంతం చేసుకొనే ఆనందస్థితికి చేరుకొంటుంది. ఆస్థితిలోజీవితాన్నుండిఉపసంహరించుకోవలసినఅవసరంలేదు. విశ్వంలో పరిపూర్ణ సామరస్యతగల స్థితికి చేరుకొంటుంది. అంటే కేవలం అన్నింటికీ తలవూచుతూ అనుమతించడం గాక సర్వాన్నీ

ఆలింగనం చేసుకొనే ఏకత్వస్థితికి చేరుకొంటుంది.

పూర్ణయోగం, సద్భావాత్మక, క్రియాశీల విధానాన్ని గూడా సంపూర్ణంగా ఉపయోగించుకొంటుంది. ఈ సృష్టిని, పరిపూర్ణమైన వ్యక్తిగత జ్ఞాన శక్త్యానందాల క్షేత్రంగా మాత్రమే మార్చివేసే ఫలితాన్నిచ్చేట్లు, వస్తువులను, విషయాలను, వ్యక్తిగతంగా అంగీకరించే స్థితినిదాటి ఇంకా ఆవలికి పోతుంది. తన కోసమేగాక ఇతరులకోసం, ఇతరుల మనుగడలోనివసించే ఏకత్వాన్నది కలిగి వుంటుంది. అదేపరిపూర్ణత కోసంతపించేఇతరులకుసాయమందిస్తూ, వాళ్ళుఆపరిపూర్ణతను సాధించడానికి, ఆవైపు ఉద్యమించడానికిసాయమందించేశక్తిగా పూర్ణయోగంతయారవుతుంది.

పూర్ణయోగం దైవంకోసం జీవిస్తుంది, ప్రాపంచిక జీవితాన్ని త్యజించదు. భువి, దివిలపై సంగంగాని, ఆముష్మిక మోక్షం పై రాగంగాని ఉండవు. దైవం యొక్క సమస్త భూమికలలోనూ, పరమాత్మలో, ప్రకృతిలో, అతనిలో సమతతో నివసించే సామర్థ్యం కలిగి వుంటుంది.

అనువాదం : కె.వి.రావు

కాంతి కిరణాలు

దైవంపట్ల సచ్చైతన్యంగా ఉండటమే మన జీవితలక్ష్యం.

నీ అంతరంగంలో భగవత్సాన్నిధ్యాన్ని కనుగొని దాని మార్గ దర్శకత్వంలో నీ జీవితాన్ని, భావాలను, భౌతిక కర్మాచరణను, దానికి (దైవానికి) సమర్పణ కావించటం జీవనానికి వాస్తవమైన లక్ష్యం. ఇది జీవితానికి సత్యప్రకాశవంతమైన మనుగడను ప్రసాదిస్తుంది.

మార్చి 28, 1970

★★★

జీవితానికి ఒక ప్రయోజనం ఉంది.

దైవాన్ని కనుగొని, సేవించటమే ఈ ప్రయోజనం. దైవం ఎక్కడో సుదూరంగా లేడు. మనలోనే మనభావాలకి, ఆలోచనా సముదాయానికి ఊర్ధ్వంగా ఉన్నాడు. దైవంతోనే ప్రశాంతత, నిశ్చయత, సమస్యలన్నింటికీ పరిష్కారము. నీ సమస్యలన్నిటినీ దైవానికే అప్పగించు. ఆయనే నిన్ను ఒడ్డుకు చేరుస్తాడు, నీ అన్ని బాధలనుంచి.

దైవాన్వేషణ జీవిత పరమార్థం. దైవాన్ని కనుగొన్నపుడే జీవితసాధన సిద్ధిస్తుంది.

దైవార్పణంగా దైవంలో విలీనమైన జీవితమే, సార్థకమైన జీవితం.

ఫిబ్రవరి 21, 1971

★ ★ ★

జీవితలక్ష్యం సౌఖ్యం కాదు. విధి నిర్వహణ సామాన్య జీవనలక్ష్యం. ఆధ్యాత్మిక జీవనలక్ష్యం దైవసిద్ధి.

సుఖ జీవనం కోసం జీవించకు. దైవాన్ని సేవించటానికి బ్రతుకు. అపుడు ఆ జీవనానుభవం నీకు ఊహాతీతంగా ఉంటుంది.

మార్చి 1972

★ ★ ★

వ్యక్తిగత మోక్షాన్వేషణకాక, మనకు కావల్సినది, దైవానికి జీవిత పరిపూర్ణ సమర్పణ.

దైవము :

(దైవము) మాట అంటేనే భయపడేవారికి : దైవము అంటే మా ఉద్దేశం-మనము సముపార్జించవలసిన జ్ఞాన సముదాయము, పొందవలసిన సర్వాధికారము, కావలసిన సమగ్రప్రేమ,

సాధించవలసిన పరిపూర్ణత, కాంతి, ఆనందములలో అభివ్యక్తీ కరింపవలసిన సామరస్యపూర్వకము ప్రగతిశీలము అయిన మనోనిబ్బరము, సిద్ధింపచేసుకోవలసిన అవ్యక్త, నవ్యోజ్జ్వల కాంతి వైభవము - ఇదీ.

సెప్టెంబరు 7, 1952.

★ ★ ★

నీ ప్రగాఢ ఆకాంక్షలో భగవంతుని నుంచి ఏమి అభిలషిస్తావో నిజానికి అదే దైవము.

★ ★ ★

మనము ఆకాంక్షించి తప్పనిసరిగా సిద్ధింపచేసుకోవలసిన పరిపూర్ణత్వమే దైవము.

నవంబరు 8, 1969

మనిషిలో దివ్యత్వము :

తనలో కాపురమున్న దైవాన్ని వహిస్తూ ప్రతిజీవీ ఉంటాడు. మొత్తం విశ్వంలో, మానవుడు అంతటి బలహీనుడు, మరెవరూ లేకపోయినప్పటికీ, అంతటి దివ్యుడూ మరెవ్వడూ లేడు.

అక్టోబరు 2, 1951

★ ★ ★

దివ్య సత్యమునకు సంబంధించి మనమంతా దివ్యులమే. అతి కష్టం మీద కాని మనకది తెలియదు. సరిగ్గా, అదే మనలో దైవమని మనకు తెలియకుండా ఉండే మనం పిలుచుకునే "మనమే" దైవం.

★ ★ ★

మనలను మనం అధిగమించడంలో చేసే మన కృషికి తగినంత పరిమాణంలో మన విలువ ఉంటుంది. మనలను మనం అధిగమించటమే దివ్యత్వాన్ని పొందటం.

★ ★ ★

సాధారణ మానవత్వము భరించరానిది.

వాస్తవంగా తెలుసుకోవలసిన విజ్ఞానం కోసం, నిజంగా శక్తివంతమైన శక్తి కొరకు, నిష్కపటమైన ప్రేమకోసం మనం ఆకాంక్షించాలి.

విశ్వవ్యాప్త దైవము :

సర్వత్రా, చెత్తబుట్టలో కూడా దైవము ఉన్నదా?

సర్వవిశ్వము దివ్యాభివ్యక్తీ కరణయే. కాని మౌలికంగా పరిపూర్ణ నిశ్చైతన్యంలో అభివ్యక్తీకరణ ఆరంభమై, పిమ్మట నెమ్మది నెమ్మదిగా ఈ దివ్యచైతన్య దిశగా పునరుత్థానం చెందుతోంది.

★★★

దైవం భౌతికస్థాయిలో సౌందర్యముగాను, మానసిక స్థాయిలో విజ్ఞానము ద్వారాను, ప్రాణిక స్థాయిలో శక్తిగాను, చైత్యస్థాయిలో ప్రేమగాను వ్యక్తమవుతుంది.

మనం ఉన్నతంగా యెదిగినపుడు ఈ నాలుగు దశలు సమగ్ర చైతన్యంగా పరస్పరం సమైక్యమై పరిపూర్ణ ప్రేమ, తేజో, శక్తి, సౌందర్యాలుగా సర్వత్రా పరివ్యాప్తమై నిండి ఉండుటను కనిపెడతాము. విశ్వ కేళీలీలా పరితృప్తి కోసం మాత్రమే ఈ ఏకైక చైతన్యం బహుముఖాలుగా విభక్తమవుతుంది.

★★★

విశ్వంలో అద్భుతాలకు అంతేలేదు. అల్పమైన అహం యొక్క పరిమితులనుంచి మనం విముక్తులమయే కొలదీ ఇంకా మరెన్నో అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి మనకు.

★★★

ఓ, మరిక ఎడతెరపి లేకుండా మార్పు చెందేరూప సముదాయాలను గమనించడం ఎంతమాత్రమూ కాదు సుమా! సర్వేసర్వత్రా ఉన్న "నిత్యం ఏకం పరాయాణం",ను ధ్యానించుటయే!

సెప్టెంబరు 29,1954

★★★

భయాంధకార పీడకల, ఈ భ్రాంతి మయలోకం. దీనిపై, దైవం తనఉన్నత అస్తిత్వ ఆశ్రయాన్ని అనుగ్రహించారు. పదార్థంలోని ప్రతి అణువు ఆయన యొక్క అనంతత్వ లేశము ఎంతో కొంత కలిగి ఉన్నదే!

14,నవంబరు, 1954

★★★

సర్వసృష్టి ఆయనతో పలుకుతుంది దైవంగురించి. హృదయాంత రంగంలో దాని నెలా ఆలకించాలో ఆయనకు తెలుసు.

డిశంబరు 8, 1965

★★★

దైవంయొక్క విధివిధానాలు :

దైవకృప అద్భుతము, సర్వశక్తిమంతము.

సర్వేశ్వరుని విధివిధానాలు పూర్తిగా ఆహ్లాదభరిత చమత్కార సంజనితాలు.

★★★

దైవాన్ని ఆహ్వానించటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండు. ఏ సమయంలోనైనా ఆయన నీకు దర్శన మివ్వచ్చు.

ఒక్కొక్కపుడు నిర్ణీత స్థలంలో ఆయన నిన్ను నిరీక్షింప చేసినా నీవు ఆలశ్యం చేయటానికదెంత మాత్రమూ హేతువు కాకూడదు.

సెప్టెంబరు 23, 1956

★★★

మనసు మార్చుకోవటానికి తప్పనిసరిగా, అందరి వలెనే, దైవానికీ హక్కువున్నది.

మానవ ధర్మం ప్రకారం తప్పుచేసినవాడు శిక్షింపబడాలి.

కాని మానవ ధర్మానికి మించిన ఉన్నత విధివిధాన మొకటి ఉన్నది. అదియే దివ్యధర్మము The Divine Law. దయాదాక్షిణ్య ధర్మము.

ఈ ధర్మము కారణంగానే ప్రపంచం నిలిచి ఉంటూ, దివ్యప్రేమల దిశగా పురోగమిస్తోంది.

నవంబరు 1966

శ్రీమాత - "కాంతి కిరణాలు" - సంకలనం నుంచి సేకరణ

(సశేషం)

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

సమత అంటే అర్థం

సమత్వం అంటే చెక్కుచెదరని మానసిక, ప్రాణికములతో కూడిన ప్రశాంతత. సమత్వం అంటే నీకు సంప్రాప్తించిన వాటి వలన గానీ, లేదా నీ గురించి చెప్పబడిన వాటి వలన గానీ, లేదా నీకు చేయబడిన వాటివలన గానీ, ఉద్విగ్నతకు లోనుకాకుండా లేదా చెదరకుండా ఉండటమే కాకుండా, వాటివంక సూటిదృష్టితో చూసి, ఏ విధమైన సొంత మానసిక అనుభూతుల వక్రీకరణకు లోనుగాకుండా, వాటి వెనుకనున్న వాటినీ, అవి ఎందుకు జరుగు తున్నవనీ, వాటి నుంచి ఏ పాఠం నేర్చుకోవాలనే దానిని గురించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అంటే ప్రాణిక గమనాలను స్వాధీన పరచుకోవటం. కోపం ప్రతిదానికి స్పందించేతత్వం, గర్వమే కాకుండా కోరిక తదితరము లేవీ కూడా అవేశానికి లోనయ్యే సత్వము లోబరచుకోనీయకుండా, వాటివలన ఉత్పన్నమయ్యే ఉద్వేగం, ప్రేరణలతో మాట్లాడకుండా, ప్రవర్తించకుండా, ఎల్లప్పుడూ, ఆత్మానుగత అంతఃప్రశాంత స్థితిలో ప్రవర్తించడం, మాట్లాడటం చేయాలి. ఈ విధమైన సమత్వాన్ని సమగ్ర పరిపూర్ణ పరిమాణంలో

ఎంతైనా కలిగి ఉండటం తేలికైన విషయం కాదు, కాని, ఎవరైనా, ఇతోధికంగా ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉండాలి. అంతరంగ పరిస్థితికి, బాహ్యకర్మలకు ఎక్కువగా దానినే ప్రాతిపదికగా చేసుకోవాలి.

సమత్వం అంటే మనుషులమీద, వారి ప్రకృతి మీద చేసే వాటి మీద, వారిని నడిపించే శక్తుల మీద సమాన దృష్టిని కలిగి ఉండటం. అది ఒక వ్యక్తిగత అభిప్రాయంతో చూసే దృష్టిని, న్యాయ నిర్ణయాల అంచనాలను, మానసిక పక్షపాతాన్నంతటిని కూడా మనసునుంచి దూరంగా త్రోసివేసి, వారిని గురించిన సత్యదృష్టిని పొందే సహాయం చేస్తుంది. వ్యక్తిగత అభిప్రాయాలు ఎల్లప్పుడూ ఉన్నదానిని వక్రీకరించడమేకాక, మనుషులచర్యలలోను, ఒక్క చర్యలను మాత్రమే కాకుండా, వెనుక ఏమీలేని విషయాలను చూస్తుంది. ఫలితం - పొరపాటుగా అర్థం చేసుకోవటం, పొరపాటు నిర్ణయాలు. ఇవి నిజానికి పైదొలగించుకోగలిగేవే. వేటి బారినైతే పడకుండా తప్పించుకోవచ్చో, ఆ అల్ప విషయాలు భూతద్దంలో అగుపించి పెద్ద దుమారమే లేపుతాయి. జీవితంలో జరిగే వాటిలో సగానికిపైగా ఈరకమైన అనర్థాలు ఈ కారణాలవల్లనే జరగడం నేను చూశాను. కాని సామాన్య జీవితంలో వ్యక్తిగత అభిప్రాయాలు, సున్నితత్వం అనేవి మనిషి ప్రకృతిలో ఎప్పుడూ అంతర్భాగంగా ఉంటాయి, ఆత్మరక్షణకు అవి అవసరం కావచ్చు, కాని అక్కడకూడా మనుషుల మీద, విషయాలమీద బలమైన విశాలమైన, సమాన అవగాహన ఉండటమనేది ఆత్మ రక్షణకు (line of defence) రక్షణరేఖగా ఇంకాస్త బాగా తోడ్పడుతుందని నేను అనుకుంటాను. కాని ఒక సాధకునికి, వాటిని అధిగమించి, ఆత్మలోని దృఢమైన ప్రశాంతతలో జీవించడం అతని పురోగతిలో తప్పని సరైన అంశం.

★ ★ ★

మన సత్వము, స్వభావము - అంతటినీ అనంతుని యొక్క శాశ్వత ప్రశాంతతో పర్యవసింపచేసే చైతన్యమే సమతకు నిర్వచనం.

★ ★ ★

సమత్వం మనోనిశ్చలతకాదు, దూరంగా వైదొలగి ఏమీ పట్టనట్లు ఉండటం కాదు, ఉదాసీనతకాదు, అచేతనతో కూడిన ప్రాణిక నిర్వ్యాపారంకాదు, ఉదాసీనతతో కూడిన ఏచలనానికి లేదా అటువంటి ఏవిధమైన చలనానికి కూడా ఆమోదం తెలుపని స్థితికాదు. పైగా, ఈ విషయాలు, ఒక్కొక్కప్పుడు, ఆధ్యాత్మిక నిబంధనలుగా పొరపాటుపడటం జరుగుతుంది. కాని, ఇది, ఒక విశ్వవిశాల సర్వతోముఖ నిశ్చల గ్రహణశక్తి. దివ్యప్రకృతి శక్తికి పరోక్షంగా సాక్షీమాత్రంగా ఉండే దివ్యాత్మ The Witness Spirit behind Nature. ఈ బాహ్యప్రపంచంలో అంతాకూడా చలనమై అరకొర క్రమబద్ధతతో, కొంత కలవరపర్చే శక్తుల వ్యవస్థగా కనపడుతుంది. కాని వాటి వెనుక పరోక్షంగా పరిపోషించే శాంతి, నిశ్శబ్దత, విశాలత్వములను గ్రహించగలం. అది సచేతన ప్రశాంతత తప్ప అచేతనమైనది కాదు. అది అశక్తతకాదు. అంతర్నిహిత సర్వశక్తి వంతంతో గాఢమై, స్థిరమై, విశ్వంలోని సమస్త చలనములను తనతో ఉంచుకోగలిగిన ప్రజ్ఞకలిగిన అచంచలశక్తి. సర్వవిశ్వచలిత చాలనాలను భరించగలిగేది.

★ ★ ★

అది పూర్తిగా నిర్వ్యాపారస్థితియో, ఉదాసీనతాయో కాదు, అనుభవాలనుంచి ఉపసంహరించుకోవటం కాదు, కాని ప్రస్తుత మానసిక, జీవన ప్రతి క్రియలకంటె ఉత్కృష్టమైనది. అది ఆధ్యాత్మిక పద్ధతిలో జీవితానికి సమాధానం ఇవ్వటం వంటి లేదా ఒక విధంగా చెప్పాలంటే దానిని ఆలింగనం చేసుకుని అంతర్గత ఆత్మ, ఈశ్వరుల పరిపూర్ణమైన కర్మ అయేటట్లుగా ఒత్తిడి చేయడం. ఇది జీవాత్మ ఆధిపత్యంలో జీవనవిధానానికి తొలిరహస్యం The first secret of the soul's mastery of existence.

★★★

జడత్వంతో కూడిన అంగీకారం సమతకాదు, ఉదాహరణకు, సాధనాకృషిలో తాత్కాలికమైన అపజయం కలిగినప్పుడు వారు సమత్వాన్ని పాటించాలి, దానివల్ల కలవరపాటు, అధైర్యానికి గురికాకూడదు, అలాగే అపజయాన్ని దైవేచ్ఛగా స్వీకరించకూడదు, ప్రయత్నాన్ని విరమించకూడదు, పైగా, నీవు చేయవలసిన దేమిటంటే అపజయానికి కారణాన్ని, అర్థాన్ని వెతికిపట్టుకుని, విశ్వాసంతో విజయందిశగా ముందుకు వెళ్ళడమే. అలాగే, వ్యాధి బారినపడినప్పుడు కూడా, నీవు కలత చెందటం, వణికిపోవడం లేదా వ్యాకులతకు లోనవడం కూడదు. అంతేకాక, వ్యాధిని దైవేచ్ఛగా స్వీకరించకూడదు, చేయవలసినదల్లా దానిని శారీరిక లోపంగా చూసి, మానసిక తప్పిదాలను, ప్రాణిక అస్తవ్యస్తతలను ఏవిధంగా వదిలించుకోవటానికి ప్రయత్నం చేస్తామో అలాగే దానిని వదిలించుకోవాలి.

ద్వేషము, తిట్లు, శాపనార్థాలు, అనేవి సరియైన నడవడి కాదనే దానిలో సందేహం ఎంత మాత్రం లేదు. అన్ని విషయాలలోనూ, అందరినీ, శాంత చిత్తంతోను, సుస్పష్టంగాను చూడటం అనేది కూడ సత్యమే. మమేక మవకుండా తాముచేసే న్యాయనిర్ణయాలలో పక్షపాత రహితంగా ఉండటం వాస్తవంగా సరైన యోగి వ్యవహారశైలి. అందరినీ, స్నేహితులనూ శత్రువులనూ కలిపి సమానంగా చూసినప్పుడు, మనుషులు ఏమిచేసినా లేదా దానివలన ఏమి జరిగినా కలత చెందకుండా ఉండినప్పుడు సమగ్ర సమత్వస్థితిని ప్రతిష్ఠించవచ్చు. అప్పుడు, మననుంచి ఇంతమాత్రమేనా ఆశించేది అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అదే అయితే, సర్వసాధారణమైన నడవడి ఏమవుతుందంటే అన్నింటికీ తటస్థతతో అంటీ ముట్టకుండా ఉండటం. కాని పరిపూర్ణమై, ఏ షరతులకూ లోబడని సమత్వాన్ని గట్టిగా నొక్కిచెప్పేగీత, ఇంకా ఈవిధంగా చెప్తోంది, 'యుద్ధం చెయ్యి, శత్రువును దునుమాడు,

విజయాన్ని వరించు'. సాధారణంగా ఏకర్మనూ చేయనవసరంలేని పరిస్థితిలో, వ్యక్తిగత సాధన కోసం సత్యంకోసం జయం సాధించాలనే ఇచ్ఛలేనప్పుడు ఉదాసీనతతో కూడిన సమత్వం సరిపోతుంది. కాని ఇక్కడ ఒకపని చేయవలసిన అగత్యం ఉంది, సత్యాన్ని స్థాపించవలసి ఉంది, కనపడేవాటిని, వ్యక్తులను, చేష్టలను, వాటి పనిముట్లుగా వాడుకునే అదృశ్య శక్తులను, క్రమపద్ధతిలో దేనికైతే వ్యతిరేకంగా అపారమైన శక్తులు మోహరింపబడి ఉన్నప్పుడు సత్యాన్ని స్థాపించవలసి ఉంది. దివ్యసత్య అన్వేషకుడుగా, అనుయాయుడుగా అక్కడ తాను ఉన్నపుడు దివ్యసత్యమువైపు మొగ్గు చూపవలసినవాడై ఉండాలి. సత్యమును భ్రష్టు పట్టించే శక్తులకు, వ్యక్తులకు వ్యతిరేకంగా పోరాడి వాటి ఆట కట్టించ వలసినవాడు కావాలి. అర్జునుడు ఏ పక్షమూ వహించదలుచు కోలేదు, దాడి చేయడానికి వచ్చిన వారి మీద కూడ ఎటువంటి వైరపూరిత చర్యను ఆచరించడానికి తిరస్కరించాడు. సమత్వం ఆవశ్యకతను ఎంతగానో నొక్కిచెప్పిన శ్రీకృష్ణుడు అతని వైఖరిని తీవ్రంగా మందలించి, అదే స్వరంతో ప్రత్యర్థిమీద యుద్ధం చేయమని ఒత్తిడి చేసాడు."సమత్వం" కలిగి ఉండు. అంతేకాదు, సమ్యక్ దృష్టితో సత్యమును దర్శించు, పోరాడు". కాబట్టి, సత్యం పక్షం వహించడం, అసత్యం చేసేదాడులు అవి ఎటువంటివైనా వాటికి ఆమోదం తెలుపకుండా తిరస్కరించడం, జంకులేని నమ్మకంతో, శత్రువులకు, దాడి చేసేవారికి వ్యతిరేకంగా పోరాడడం, సమత్వానికి విరుద్ధమేమీ కాదు. అలా అనుకోవటం అహంకార పూరిత భావన. దానిని విసిరి పారవేయాలి. ద్వేషం, ప్రాణిక సంబంధమైన దుష్టభావన నిరాకరించాలి. కాని, భక్తిని విశ్వాసాలు కలిగి ఉండడం, శత్రుత్వం వహించి దాడిచేసేవారితో, వైరులతో రాజీకి నిరాకరించడం లేదా వారి భావాలతో, పట్టుబట్టి అడిగే వాటితో ఊగిసలాట ధోరణితో 'తప్పేముంది, వారు మననుంచి ఆశించేదానితో మనం రాజీపడగలమని' అనడం, లేదా వారిని

సహచరులుగా, మన సొంతమనుషులుగా ఒప్పుకోవడం - అనేటటు వంటి వాటన్నింటికీ గొప్ప ప్రాముఖ్యం ఉంది. ఆ దాడి కనుక, భౌతికంగా, కర్మకు, నాయకులకు, కార్యనిర్వాహకులకు ప్రమాదకరమైనదైతే వారు దానిని తక్షణం చూడడం జరుగుతుంది. కాని దాడి కపటోపాయంతో సూక్ష్మతరమైనదైతే, ఉదాసీనతతో వ్యవహరించ గలగడం సబబేనా? ఇది అంతరంగంలోను, బాహ్యంలోను ఒక ఆధ్యాత్మిక యుద్ధం. తటస్థ విధానంతోను, రాజీపడటంతోను లేక ఉదాసీనతతో కాని వారు వైరిశక్తులకు దారి సుగమంచేసి, సత్యాన్ని, దాని బిడ్డలను నాశనం చేయటానికి అనుమతించి నట్లవుతుంది. ఈ దృక్పథంతో నీవు దీనిని చూసినట్లయితే, అంతరంగిక ఆధ్యాత్మిక సమత్వం సరైనదైనప్పుడు, కార్యశీలమైన భక్తి విశ్వాసాలతో ఒక పక్షాన ధృఢంగా నిలబడటం అనేది కూడ సరైనదే అవుతుంది, అవి రెండు ఒకదానికొకటి పొసగకపోవడం అనేది లేదు.

నేను, దీనిని, సహజంగానే, ప్రత్యేకమైన సందర్భాలన్నింటికీ, వ్యక్తిగత ప్రశ్నలకు వర్తించకుండా, ఒక సార్వత్రికమైన విషయంగా పరిగణించి చర్చించాను. తులనాత్మకంగా సమ్యక్ దృష్టితో దర్శించాల్సిన క్రియా సూత్రమిది.

- శ్రీఅరవిందులు

అనువాదం : డా.టి. ప్రసన్నకృష్ణ

మనము దైవకృపను మాత్రమే నమ్ముటను తప్పక నేర్చుకొనవలెను మరియు అన్ని పరిస్థితులలో సహాయము కొరకు పిలవవలెను. అంతట ఆ దైవకృప స్థిరముగా అద్భుతములను చేస్తుంది.

దైవానికి,దివ్యమాతకు మనం ఆత్మసమర్పణ కావించాలి. ఇది కష్టతరమైనదే.సఫలము నొందు ఆశయంతో మన అంతరాత్మ ఆ కష్టమును స్థిరచిత్తంతో తిరస్కరించవలెను.


- శ్రీఅరవిందులు

సమాచార పత్రము

శ్రీఅరవింద సొసైటీ బీచ్ ఆఫీసు మీటింగ్ హాల్ నందు ఆగష్టునెల 13,14 తేదీలలో రెండు దినములు ప్రసంగాలు మరియు 'ప్రశ్నోత్తరాలు' కార్యక్రమం ఏర్పాటు జరిగినది. ఇందులో ఆచార్య మనోజ్ దాస్ తననడిగిన ప్రశ్నలకు శ్రీమాతారవిందుల వెలుగులో సమాధానములనొసగిరి. డా॥ ఆలోక్ పాండే, ప్రొ॥ కిట్టూ రెడ్డి, శ్రీ శ్రద్ధాళు రనడే, శ్రీ మాత్రి ప్రసాద్, శ్రీ కైవల్య స్మార్ట్, శ్రీ కె.విజయ్ పోద్దార్ మొదలైన పెద్దలు ప్రసంగించిరి. ఈ సందర్భంగా ఉమెన్స్ కౌన్సిల్ వారు 'శ్రీఅరవిందుల భారతదేశం' అన్న అంశంపై ప్రసంగం ఏర్పాటు చేసారు. శ్రీ యం.యస్. సౌందర్ రాజన్ తమిళంలో ఒక ప్రసంగం ఇచ్చారు.

బీచ్ ఆఫీసు హాలునందు శ్రీ ఆలోక్ పాండే గారు 'సావిత్రి' మీద - ఐదు రోజుల అధ్యయనం - నిర్వహించి పుస్తకముల వారిగా కూడా ఒక విహంగ వీక్షణం శ్రోతలలో ఆసక్తి కల్గించారు. జె.బి. పెటిట్ హై స్కూల్, ముంబాయ్ నుండి పాండిచ్చేరి సందర్శించిన 36 మంది విద్యార్థుల కొరకు ఐదురోజుల కాంపు నొకదానిని నిర్వహించిరి. శ్రీఅరవింద సొసైటీ కేంద్రములచే మే మరియు జూన్ నెలలో సమ్మర్ కాంపులను దేశ వ్యాప్తంగా నిర్వహించి శ్రీమాతారవిందుల దివ్య సందేశముల పట్ల అవగాహన కలిగించే ప్రయత్నం చేయబడినది. అందు ముఖ్యంగా పైగంబర్ (యు.పి.) 22 రోజుల వర్క్‌షాప్; ఓంపురి (గుజరాత్) వారు 4 రోజుల కాంపు (12 నుండి 15 వరకు) బెంగుళూర్ (కర్నాటక) బ్రాంచివారు 14 మరియు 15 జూన్ నెలలో శ్రీ కిట్టూ రెడ్డి గారిచే రెండు రోజుల రెసిడెన్షియల్ కాంపు ముఖ్యంగా పేర్కొనదగినవి.

నోయిడా (యు.పి.) ముస్సోరి (ఉత్తరాఖండ్) న్యూఢిల్లి, చెన్నై మరియు బయోరా (యమ్.పి.) మొదలైన ప్రదేశాల నుండి గూడా



KS Reddy 12/11/08

Rs. 15/-

అఖిల

అఖిల భారత పత్రిక

నవంబరు ౨౦౦౮

పదార్థము పరార్థము నావిష్కరించును

- శ్రీమాతారవిందుల వాక్కులు

అఖిల భారత పత్రిక, నవంబరు 2008

పదార్థము పరార్థము నావిష్కరిస్తుంది

- శ్రీఅరవిందులు

విషయసూచిక

ఆధ్యాత్మిక జీవనము, ధర్మజీవనము, నైతిక నడకవడిక ప్రాతిపదికగా సాధారణ మానవజీవనము ఈ మూడూ వేర్వేరు అంశాలు - ఏది ఎవరు కోరుకుంటారో తెలుసుకోవాలి. మూడింటినీకలగాపులగం చేయకూడదు.

- శ్రీఅరవిందులు

ఆ తర్వాత - ఆ మార్గం వైపు

(1893లో ఇంకా పదిహేనేళ్లు అయినా నిండని ప్రాయంలో శ్రీమాత వ్రాసిన కథ)

★★★

అదో రహదారి. ఆ దారి ప్రక్కన కనువిందు చేసే రకరకాల పూలమొక్కలు. అల్లిబిల్లిగా అల్లుకున్న మొక్కల రెమ్మల నుంచి ఎర్రమందారాలు, రకరకాలైన పువ్వులు పలకరిస్తూన్నట్లు. అల్లంతదూరాన పసుపు పచ్చని పైరుచేలపై మెరిసే సూర్యుడు, పసిడి వన్నె కాంతులు కురిపిస్తున్నాడు.

ఓ యువకుడు ఆ స్వచ్ఛమైన ఉదయ సమీరాలకి పరవశించిన ఉత్సాహంతో స్వేచ్ఛగా కేరింతలుకొడుతూ పైలా పచ్చీసుగా ఆనంద పారవశ్యంతో త్వరత్వరగా పరుగులాటి నడకతో పోతున్నాడు. కొంతదూరం ఆదారినలా పోయాడతను. నాల్గుదారుల కూడలికి చేరుకున్నాడు. అక్కడనుంచి అన్ని వైపులా ఎన్ని మార్గాలో! అన్ని వైపులా పాదముద్రలు కలగాపులగంగా కనిపిస్తున్నాయి. ఎప్పటిలానే సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. పక్షుల కిలకిలారావాలతో చెట్లు నిండి ఉన్నాయి. అందమైన ఆహ్లాదకరమైన రోజు. ఆశావహంగా ఉంది. మన యువకుడు మరేమీ ఆలోచించలేదు. తనకు దగ్గరగా ముందు ఉన్న దారివైపుగా మరలి ముందుకు సాగేడు. అప్పటికి తనకదే చేయవలసినపని అనిపించింది. ఇంకోదారికి మళ్లవచ్చుగా అని అపుడతనికి అనిపించక పోలేదు. మరోదారిని పట్టిపోతేనో అని ఒక్క క్షణం అనుకున్నాడు. తాను సాగిపోయే దారి ఎక్కడికి చేరుస్తుందో తెలియనపుడు మరోమార్గం చేపట్టే అవకాశం తనకెప్పుడూ ఉండనే ఉంది. వెను తిరుగు! "వెనుతిరుగు! సక్రమ మార్గంలో లేవు నీవు", అని వినిపించినట్టైయింది అతనికి. అయితే

చుట్టూఅంతా ఆహ్లాదభరితంగా, ఆనందంగా ఉంది. ఉత్సాహంగా ఉంది. ఏమిచేయాలి? తనకు తెలియదు. ఏ నిర్ణయం లేకుండా అలాపోతూనే ఉన్నాడు. అలా కదిలిపోతూండటంలోనే ఆనందం పొందాడు. "కొంత సేపయాక", తను విన్నదానికి సమాధానంగా, కొంత సేపయాక "సమయం ఉందికదా", అని బదులిచ్చాడు. తన చుట్టూ పచ్చటి తివాచీ పరిచినట్లున్న పచ్చగడ్డి తన చెవిలో - "తర్వాత - తర్వాత" అని గుసగుసలాడింది. ఆహాహా! ఈసుగంధ పరిమళవాయువు, వెచ్చటి సూరీడు. ఎంత హాయి కొల్పుతున్నాయి! "తర్వాత!తర్వాత!" అవును తర్వాత- అనుకుంటూ ఇంకా ముందుకు సాగాడు. పోగాపోగా దారి మరింత వెడల్పు అయింది.

అల్లంత దూరాన్నుంచి మాటలు వినపడ్డాయి. "మూర్ఖుడా! ఎటుపోతున్నావు? నీ పతనం వైపుగా పోతున్నానని గ్రహించవా? నీవు యువకుడివి. మాదరికిరా. ఇది నిజంగా సత్య శివసుందర మార్గము. దౌర్బల్యానికి, సోమరితనానికి లోబడి పెడదారి పట్టావు. వర్తమానంలో నిద్రపోకు. భవిష్యమార్గానికి తిరిగిరా". తనకు రుచించని ఆ మాటలకు సమాధానంగా, "తర్వాత, తర్వాత", అన్నాడు. అతని మాటలకి అక్కడి పుష్పాలు మందహాసం చేశాయి. 'తర్వాత', అని మారుపలికాయి. మార్గం ఇంకా వెడల్పు అయింది. సూర్యుడు నడినెత్తికి చేరుకున్నాడు. మా దొడ్డరోజు అది. కాలిబాట, రోడ్డు అయింది.

ఆ రోడ్డు అంతా తెల్లటి దుమ్ముతో కప్పబడి ఉంది. ఇరువైపులా సన్నని చెట్లు అంచు కట్టినట్లున్నాయి. ఏదో ఏటి ప్రవాహం ప్రక్కనే గలగలలాడుతూ ప్రవహిస్తూన్న చప్పుడు, ఊరికే అలా నలుదెశలా పరికించాడు. అనంతంగా కనిపించిందా రోడ్డు.

పిల్లవాడికి కాస్తంత చికాకు కలిగింది. "ఎక్కడున్నాను? ఎటుపోతున్నాను? ఆ! ఏమైతే ఏం? ఎందుకొచ్చిన ఆలోచన? ఏమి

చేయాలి కనుక? ఈ అనంత మార్గాన పడి అలా అలా గాలి వాటుగా మందగతిని ముందుకు సాగిపోదాం. రేపు ఆలోచించవచ్చు".

చిన్నచెట్లు మాయమైనాయి. ఓక్ చెట్లు ఇరువైపులా బారులు తీరి ఉన్నాయి. బాటసారి అలసిపోలేదు. పారవశ్యా వస్థలోనే తేలిపోతున్నాడు.

పోగాపోగా మురిక్కాలువ. లోతుగా ఉంది. ఓక్ చెట్ల స్థానంలో ఫిర్‌చెట్లు చోటు చేసుకున్నాయి. సూర్యుడు పశ్చిమాద్రికి క్రుంగుతున్నాడు. మనబాటసారికి విభ్రాంతి కలిగింది. చుట్టూ కలయ చూశాడు. అకడొకలోయ. మనుష్యరూపాలు లోతైన ఇరుకు తోవలో చుట్టూ దొర్లటం గమనించాడు. ఫిర్ చెట్లను ఆసరాగా పట్టుకుని ఉన్నారు. నేలలో నుంచి పైకి పొడుచుకువచ్చే మూలాలు, కేవలంశిలలు. చుట్టూ చూశాడు. కొంతమంది లోయలో నుంచి పైకి యెగబ్రాకే ప్రయత్నం చేస్తున్నారు. అంచులు చేరుకొనే లోపు తలలు వెనక్కి తిరిగి పడిపోతున్నారు.

బొంగురు గొంతుకలతో బాటసారి నుద్దేసించి అరుస్తున్నారు. "ఈ స్థలం నుంచి పారిపో. వెనుతిరిగిపో. నాల్గురోడ్డుల కూడలికి చేరుకో. ఇంకా సమయం మించిపోలేదు". యువకుడు కాస్త సంశయించాడు. తర్వాత సమాధానంగా అన్నాడు, "రేపు", అని లోయలో పోర్లాడుతున్న వాళ్లు తనకు అగుపడకుండా ముఖం చేతులతో కప్పుకున్నాడు. రోడ్డంట పరుగు లంఘించుకున్నాడు. మార్గాంతరం కోసం ప్రయత్నించలేదు. ప్రబలమైన ప్రేరణ ఏదో ముందుకు లాగింది. ముఖం వాడింది. ముడతలు పడింది. బట్టలు నలిగిపోయినాయి. ఎంతో నిరాశగా ఉన్నాడు. అలాగే పరుగెడుతున్నాడు. తుదకు ఆ దిక్కుమాలిన ప్రదేశం నుంచి దూరంగా పోవాలనుకున్నాడు. కళ్లు తెరిచాడు. అక్కడిక ఫిర్

చెట్లులేవు. పనికి మాలిన రాళ్లు, బూడిద ఉన్నాయి చుట్టూ. దిక్చక్రానికి ఆవల సూర్యుడు నిర్గమించాడు. చీకట్లు ముసురు కుంటున్నాయి. అంతా అంతులేని ఎడారి. రోడ్డు అందులో కలిసి మాయమైపోయింది. పరుగెత్తి పరుగెత్తి అలసిపోయాడు. నిరాశోపహతుడయాడు. ఆగుదాం అనుకున్నాడు. తప్పదు. ముందుకు సాగాలి. అంతా విధ్వంసం. ఉక్కిరి బిక్కిరి చేసే అరుపులు. కంకాళాల మీద కాళ్ళు తడబడుతున్నాయి. అల్లంత దూరంలో గాఢమైన పొగమంచు భయంకరమైన ఆకృతులుగా కనిపిస్తోంది. నల్లటి రూపాలు పైకెగశాయి. ఏదో మహా ఘోరమైన వైపరీత్యం సంభవిస్తోందేమో అనిపిస్తోంది. తాను ఊహించిన లక్ష్యంవైపు నడవటానికి బదులు ఎగిరి పోతున్నాడు. భయంకర శబ్దాలు తనను నడిపిస్తున్నాయి. పిశాచాలను పట్టించుకోలేదు.

చివరికి ఒక నిర్మానుష్యమైన భవంతి చూశాడు. తన ముందు అంతా చీకటి. అగమ్య గోచరం. దయ్యాల దుర్గం అనుకున్నాడు భయంతో వణికిపోతూ. విషాద భరితంగా ఉన్న స్థలం గురించి పట్టించుకోలేదు. ఈ నల్లటి పెద్దగోడలు తనను ప్రభావితం చేయలేదు. దుమ్మునేలపై నిలబడ్డాడు. భయంకరమైన గోపురాలను చూశాడు. ఏం చలించలేదు. లక్ష్యం చేరుకున్నాననుకున్నాడు. అలసట, నిరుత్సాహం మరిచాడు. దుర్గాన్ని చేరుకుని గోడకి ఆనుకున్నాడు. అంతే గోడకూలింది. చుట్టూ ఉన్నదంతా చూస్తూండ గానే కూలిపోయింది. దుర్గం, దానిగోడలు, గోపురాలు, బురుజులు ఒక్కసారి నేలకూలాయి. మట్టిలో కలిసి పోయాయి. మాయమయ్యాయి. మట్టిలో కలిసి కూరుకు పోయాయి. నేలంతా మరింత మట్టి పేరుకుపోయింది.

గుడ్ల గూబలు, కాకులు, గబ్బిలాలు నలుదిశలా ఎగురుతున్నాయి. దురదృష్టవంతుడైన బాటసారిచుట్టూ ప్రదక్షిణం

చేస్తున్నాయి. వికృతమైన అరుపులు. బాటసారి నిశ్చేష్టుడయాడు. ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. దిక్కు తోచలేదు. కదలలేక పోయాడు. అకస్మికంగా భయంకరమైన వాటిలోకల్లా భయంకరమైన భూతాలు - ఒంటరితనం, నిరాశ, ఏవగింపు అనే పేర్లతో తనముందు, పైకిలేచి నిలబడ్డాయి సజీవంగా. ఆ విధ్వంసాల మధ్య అగాధం. దానిపై వివర్ణము, దీనము అయిన ఆత్మాఘాతం ఆత్మహత్య అస్పష్టంగా పరికించాడు. ఈ తీవ్ర విద్వేషపూరిత పిశాచాలు తనను చుట్టిముట్టి, గట్టిగాపట్టుకుని నోరుతెరుచుకుని ఉన్న అగాధం వైపు ఈడ్చుకు పోతున్నాయి. విడిపించుకునేందుకు విఫల ప్రయత్నం చేశాడు, పారిపోవాలనుకున్నాడు. అవి తమవైపు లాక్కుని వశపర్చుకున్నట్లు అనిపించింది, అరిచాడు. తనకేకలకు సమాధానం లేదు. ఆ భయంకర ఆకృతుల పిడికిలిలో అలా ఉండిపోయాడు. తను ఉన్ననేల కిందికి దిగి పోతున్నట్లనిపించింది. అలసట, నీరసం, కళ్లులోతుకు పోయినై. చుట్టూ కలయ చూశాడు. అంతా చీకటి రక్షించండని కేకలు పెట్టాడు. వినేవాళ్లు వేరు సరికదా, భయంకరమైన వికటాట్టహాసాలు, ఇకిలింపులు వినిపించాయి.

బాటసారి లోయ అంచున ఉన్నాడు. చేసిన ప్రయత్నాలన్నీ నిష్ప్రయోజనాలైనాయి. ఎంతగానో పెనుగులాడాడు. చివరికి పడిపోయాడు - మంచం మీదనుంచి-!

ఓ యువ విద్యార్థి మరుసటి రోజుకి ఓ సుదీర్ఘ వ్యాసం తయారుచేసుకోవలసి ఉన్నాడు. ఆనాటి పనితో మరి అలసిపోయాడు. ఇల్లు చేరుకుంటూ, "తర్వాత పని చేసుకుంటాను", అనుకున్నాడు. పెందరాడే పడుకుంటే, మర్నాడు పెందరాడే లేచి, తొందరగా పని పూర్తి చేసుకోవచ్చు, మరింత బాగా పనిచేసుకోవచ్చు అని వాయిదా వేసి పడుకున్నాడు. తానెంత నిజం

మాట్లాడుకుంటున్నాడో తనకు తెలియలేదు. ఆతని నిద్ర భయంకరమై కలతో, కలత నిద్రే అయింది. ఒక్క కుదుపుతో మేల్కొన్నాడు. అపుడు తన స్వప్నం గురించి ఆలోచిస్తూ, బాధతో గట్టిగా అరిచాడు. "ఇపుడు అర్థమైంది. తర్వాత చూదాంలే అనేమార్గం రేపటిదారి. ఆ గొప్ప దుర్గం అనుకున్నది శూన్యగృహం". తన తెలివికి తనే పొంగిపోతూ పని ప్రారంభించాడు. ఈ వేళ చేయవలసిన పని రేపటి కెన్నడూ వాయిదా వేయకూడదని ప్రమాణం చేసుకున్నాడు. తర్వాత చూదాంలే అనే దారి రేపటి దారి. అది గాలిమేడలకి చేరుస్తుంది.

- శ్రీమాత

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

నీ కర్తవ్య కర్మ, నీ అస్తిత్వ లక్ష్యం

దివ్యమానవుని గానూ, దివ్యత్వానికి పరిపూర్ణ యోగ్యుడు గానూ రూపుదిద్దుకోవటానికి నీవిక్కడున్నావు. అదే నీకర్తవ్య కర్మ నీ అస్తిత్వ లక్ష్యం. నీవు చేసే, తక్కినదంతా నిన్నందుకు సిద్ధం చేసేవి లేదా ఆమార్గంలో నీకు సంతోషం కలిగించేది లేకపోతే నీ కార్యం నుండి నిన్ను పతనం చేసేవి. గమ్యం చేరటంలో పొందే సంతోషంలోనే నీ అస్తిత్వం యొక్క గొప్పదనం, మహదానందం వున్నాయి. అదే నీ గమ్యం, అదే నీ కర్తవ్యకర్మ, అంతేగాని నీవనుసరించే మార్గం యొక్క శక్తిలోగాని, ఆమార్గంలో లభించే సంతోషంలో గానిలేదు. నీ మార్గంలో సంతోషం కలగడానిక్కారణం, నిన్నేది తనవైపు ఆకర్షిస్తున్నదో అది నీమార్గం మీద నీతో పాటుండడం. అది నీకు శక్తినిచ్చింది నీ అస్తిత్వ శిఖరాలకు నీవు ఆరోహించడానికే.

నీకు విధ్యుక్త ధర్మమంటూ ఏదైనా వుండివుంటే, ఇదే నీ విధ్యుక్త ధర్మం. నీ లక్ష్యం ఏమిటని అడిగితే ఇదే నీ లక్ష్యం. ఆనందం

కావాలని నీవు పట్టుబడ్తే, ఇంతకంటే అధిక ఆనందమంటూ మరేదీలేదు. ఎందుచేతనంటే తక్కిన సంతోష మంతా పరిమితము, అంతరాయాలున్నదే. కలలోని సంతోషంలాంటిది లేదా నిద్రాసుఖం లాంటిది లేదా ఆత్మ విస్మృతి వల్ల కలిగే సంతోషం లాంటిది. కాని ఇది నీ మొత్తం అస్తిత్వానికి కలిగే సంతోషం. అస్తిత్వం అంటే ఏమిటి అని నీవడిగితే, దైవమే నీ అస్తిత్వం, తక్కినదంతా దాని శకలం యొక్క లేదా దాని వికృత ఆకారమే. నీవు పరమ సత్యాన్ని అన్వేషిస్తూంటే, ఇదిగో ఇదే ఆపరమ సత్యం. దాన్ని నీముందు నిలుపుకో, దానియందున్న విశ్వాసంతో అన్ని విషయాలను దర్శించు.

ఒక తెరలో నుండి చూచి, చూడగా కన్పించిన దానినే పరమసత్య రూపము అని పొరబడిన ఒకరు, నీవు నీవుగానే తయారు గావడమే నీ లక్ష్యం అని బాగా చెప్పారు, మనిషి స్వభావం తనకు తాను అతీతుడుగా అతిశయించడం. నిజానికదే అతని స్వభావం. తనను తాను అధిగమించడమే వాస్తవానికి దివ్యలక్ష్యము (The divine aim)

అయినపుడు నిన్ను నీవు దేనికి అతీతంగా ఎదగవలసి ఉన్నావు? నీవు ఏమిగా మారాలి? దేనిగా నీవు తయారు కావాలి? ఆ ఆత్మ అంటే ఏమిటి? ఇదిగో ఇక్కడే నీవు పొరపడకూడదు. నీఆత్మను నీవు తెలుసుకోకపోవడం అనే తప్పిదం, నీసమస్త దుఃఖానికి మాతృస్థానం, నీ సమస్తతత్తర బాటుకు కారణం.

నీవు ఏ self నీవు ఆత్మగా పైకి కన్పిస్తున్నావో దాని కతీతుడవై నీవు ఎదగాలి. నీవు మనిషి అని అనుకోనేది అతనినే, పైకి కన్పించే Apparant Purusha - బాహ్యపురుష. ఎవరీమనిషి?

ప్రాణిక భౌతిక పదార్థాలలో మూసుకుపోయిన ఒక మానసికజీవి. ప్రాణిక భౌతిక పదార్థాలతో మూసి వేయిబడకుండా

ఎవరైనా ఉన్నా, అతడు మనస్సుకు బానిసై వుంటాడు. ఇదొక అత్యంత భారమైన దాస్యం. మనస్సుకు బానిసత్వమంటే, అన్యతానికి, పరిమితికి, పైకి కన్పించేదానికి బానిసకావడం. మనఃప్రాణ, పదార్థాల తెరవెనుక ఆత్మగావున్న నీవు, ఆత్మగానే తయారుగావాలి. ఆధ్యాత్మిక, దివ్యమైన, మానసాతీతునిగా యదార్థమైన పురుషునిగా జీవించాలి. ఎందుచేతనంటే మానసిక జీవికంటే ఉన్నతుడైన వాడే దివ్యమానవుడు. నీవు నీ మనస్సును, నీ జీవనాన్ని, దేహాన్ని పాలిస్తూ జీవించగలగాలి. ఏ ప్రకృతికి నీ విపుడు పనిముట్టువో, ఏ ప్రకృతి తన పాదాలక్రింద నిన్ను త్రొక్కి పెట్టివుంచిందో, దాని కన్న ఉన్నతంగా నీవు ఉద్ధరించబడి ఆ ప్రకృతికి సామ్రాట్టువికావాలి. బానిసవు కాగూడదు, స్వేచ్ఛామయుడవుగావాలి, నీ అస్తిత్వమంతా, చీలిపోకుండా ఒకే ఒక కేంద్రంగావాలి. మృత్యువుచే మరుగు పరచబడకుండా అమృతుడవు గావాని. చీకటితో ఆవరించబడకుండా పూర్ణ ప్రకాశవంతుడవు గావాలి. 'తమసోమా జ్యోతిర్గమయి' 'మృత్యోర్మా అమృతంగమమ'. సంపూర్ణానంద స్వరూపుడవుగావాలి. బాధా వ్యధలచేతిలో ఆటవస్తువు కాకుండా బలహీనత బారినపడకుండా శక్తివంతుడవగు స్థితి కుద్ధరించబడాలి. అనంతంలో నివసిస్తూ సాంతాన్ని స్వాధీనం చేసుకొని వుండాలి. భగవంతునితో ఏకమై అతని అస్తిత్వంలో జీవించాలి. నీవునీవుగా తయారుగావడమంటే ఇలా జీవించడం. ఇలా జీవించే నీనుండే సమస్తమూ వెలువడాలి. నీలో నీవు స్వేచ్ఛతో జీవించు, అలా వున్నపుడే నీవు నీమనస్సులో, జీవితంలో, దేహంలో స్వేచ్ఛగా జీవిస్తావు. ఎందుచేతనంటే, ఆత్మ అంటేనే స్వేచ్ఛ.

భగవంతునితో, సమస్త జీవరాశులతో ఒకటైపోవాలి. అల్పమైన అహంకారంలోగాక నీలోనీవు జీవించు. ఎందుకనంటే ఆత్మ అంటే ఏకత్వమే.

నీవునీవుగా అమృతుడివి, అలా జీవించు. అంతేగాని మృత్యువు పై విశ్వాసాన్ని నిలుపుకోవద్దు. మృత్యువు నీకుకాదు దేహానికే, ఆత్మ అమరం.

అమృతునిగా తయారు గావడమంటే, సత్తలోనూ, చేతనలోనూ ఆనందంలోనూ అనంతంగా పరిణమించడమే. ఎందుకనంటే ఆత్మ ఆనందంలోనూ అనంతంగా పరిణమించడమే. ఎందుకనంటే ఆత్మ అనంతం. సొంతం అనంత ఆత్మవల్లే జీవిస్తుంది.

ఇది, నీ అసలు తత్త్వం, కాబట్టి ఈ అన్నింటిలాగా నీవు కాగలవు. నీవు ఇవిగాక పోయివున్నట్టైతే ఎప్పటికీ నీవివి గాలేవు. నిజానికి నీవు పైకి కన్పించేవిగాక మరొకటి, అయినపుడు బాహ్యాకారాలకు నిన్నునీవు బానిసగా ఎందుకు చేసుకుంటావు?

లే నిన్ను నీవు అధిగమించు! నీవు నీవుగా తయారవ్వు. నీవు మనిషివి, మనిషి స్వభావమే తననుతాను మించి ఎదగడం. అతడు మానవ-మృగం. అతడు మృగమానవ స్థితిని దాటిపైకి అభివృద్ధి చెందాలి. అతడు చింతనా శీలుడు, నిపుణుడైన పనిమంతుడు, సౌందర్యోపాసకుడు. చింతన స్థాయినుండి ఎదిగి జిజ్ఞాసిగావాలి. పనిమంతుని స్థాయి అధిగమించి సృజన శీలిగావాలి, తాను సృజించిన దానిని శాసించువానిగా ఎదగాలి. సౌందర్యారాధన స్థాయినుండి ఎదిగి, సమస్త సౌందర్యాన్ని, సమస్తానందాన్ని ఉపభోగించాలి. భౌతికమైన అతడు అమృత ద్రవ్యంగా తయారయ్యేట్లు ఆకాంక్షించాలి. ప్రాణిక జీవియైన అతడు మానసిక జీవియై పాక్షిక జ్ఞానం కలిగిన అతడు సంపూర్ణ జ్ఞాన ప్రకాశాన్ని, దివ్యదృష్టిని సముపార్జించుకోవాలి.

వీటిని సాధించడమంటే దివ్యమానవ స్థాయికెదగడమే. అంటే మనస్సు స్థాయినుండి అతిమనస్సులోనికి ఎదగడం. దానిని దివ్యమనస్సు అనిగాని, దివ్యజ్ఞానమనిగాని, అతి మనస్సు అనిగాని చెప్పవచ్చు. అతిమనస్సు, దివ్య సంకల్పం, దివ్యచేతన యొక్క శక్తి, వెలుగు, అతి మనస్సుతోనే పరమాత్మ తననుగానే లోకాలను దర్శించాడు, తననే లోకాలుగా సృజించుకొన్నాడు. అతి మనస్సుతోనే అతడు వాటిలో నివసిస్తున్నాడు, వాటిని పాలిస్తున్నాడు. దానివల్లే అతడు స్వరాట్టుగా, సామ్రాట్టుగా అయినాడు.

అతి మనస్సే దివ్యమానవుడు. అందుచేత మనస్సుకన్న ఉన్నతోన్నతంగా తనను ఉద్ధరించుకోవడం అనేది తప్పని సరైన ఒక షరతు.

దివ్యమానవునిగా జీవించడమంటే దివ్యజీవనం జీవించడం. దేవునిగా జీవించడం. దేవుళ్లు భగవంతుని శక్తులు గదా, మానవజాతి మధ్య భగవత్ శక్తిగా నివసించాలి.

దివ్య పురుషునిలో నివసించడానికి పరమాత్మ యొక్క చేతన, ఆనందం సంకల్పం జ్ఞానం ఇవి నిన్ను నింపివేయనీ. నిండిపోయి నీతో, నీ ద్వారా వాటిని క్రీడించనీ. ఇదీ దానర్థం.

నిన్ను నీవు నూతన దివ్యరూపంలోనికి మార్చుకోవడం జరగాలి. అది, దివ్యజీవన శిఖరాగ్ర స్థితి. అంటే నీలో భగవంతుని ఆవిష్కరించుకోవడం, అతనిని సమస్తంలోనూ గ్రహించగలగడం. భగవంతునిలో జీవించు, అతని వెలుగుతో ప్రకాశించు, అతని శక్తితో కర్మ అనుష్ఠించు. అతని ఆనందంతో ఆనందించు. ఆ బడబాగ్నిగా, ఆ మహాతేజస్విగా ఆ మహాసాగరంగా జీవించు. ఆమహాదానందంగా, ఆమహనీయతగా, ఆ సౌందర్యంగా జీవించు.

ఆంశికంగానైనా నీవు అలాకాగలిగితే, దివ్యమానవత యొక్క ప్రాథమిక స్థాయిలలోనికి నీవు వికసించినట్లే.

- శ్రీఅరవిందులు

అనువాదం : కె.వి. రావు

అంతరంగ పరిణతి

శ్రీఅరవిందులవారి లక్ష్యం ఏదో ఒక మతాన్ని అభివృద్ధి పర్చాలని, లేక ప్రాచీన మతాలను సంలీనం చేయాలని లేదా ఒక క్రొత్త మతం స్థాపించాలనీ కాదు. వీటిలో ఏ ఒక్కటైనా కూడా ఆయనను తమ ప్రధాన సంకల్పం నుంచి దూరం చేసేవే. వారి యోగం యొక్క ఏకైక లక్ష్యం అంతరంగ ఆత్మపరిణతి, తద్వారా, దానిననుసరించే వారు, అందరిలో ఏకంసత్"ను కనుగొంటూరు. కనుగొని, మానవస్వభావాన్ని అతిమానస చైతన్యం కంటె ఉన్నతతరమైన చైతన్యాన్ని రూపొందింప చేస్తారు.

- శ్రీఅరవిందులు

యోగం, మతం మధ్య తేడా

- శ్రీమాత

ప్రశ్న : ప్రియజననీ!

యోగం, మతం మధ్య తేడా ఏమిటి?

జ: ఆహో (ఏమి ప్రశ్న)! కుక్కకు, పిల్లికి మధ్య తేడా ఏమిటి? అన్నట్లుంది.

(సుదీర్ఘ నిశ్శబ్దం)

ఎవరైనా ఏదో విధంగా భగవంతుడ్ని గూర్చి విన్నాడని, అటువంటి దైవం ఏదో ఉన్నదన్న ఒక వ్యక్తిగత భావం కల్గిందని అనుకుందాం. ఇక ఆ దైవాన్ని పొందడానికి అన్ని రకాల ప్రయత్నాలు మొదలు పెడతాడు. సంకల్పం కోసం యత్నాలు, సాధన, క్రమశిక్షణ, ఏకాగ్రత, మున్నగు చర్యలు, భగవంతుడేమిటో కనుగొన డానికి, ఆయనతో బంధాలు పెంచుకోడానికి, ఆయనతో విలీనం అవడానికి

ప్రయత్నాలు మమ్మురం అవుతాయి. అప్పుడు మనం ఆ వ్యక్తి యోగాన్ని ఆచరిస్తున్నాడని అర్థం చేసుకోవచ్చు.

ఆ వ్యక్తి తను అనుసరించిన ప్రక్రియలన్నింటినీ రాసుకొని, ఒక నిర్ణీత పద్ధతిని రూపకల్పన చేసి, తాను కనుగొన్నదానిని పూర్ణమైన విధానాలని ప్రకటిస్తాడు. ఉదాహరణకు, ఆ వ్యక్తి ఇలా అంటాడు. భగవంతుడు ఇలా వుంటాడు - ఆయన్ని కనుగోనాలంటే నువ్వీ పనిచేసి తీరాలి. ఈ వైఖరిని అవలంబించాలి. ఈ పూజ చెయ్యాలి. ఇదే సత్యం అని నువ్వు అంగీకరించాలి. "నేను ఇదే సత్యం అని ఆమోదిస్తున్నాను. నేను దానికి బద్ధుడ్నై వుంటాను. నువ్వు చెప్పిన పద్ధతి సరియైనది. అదొక్కటే ఉన్నది." అని నువ్వు తేల్చాలి. అదంతా రాసి, వ్యవస్థీకృతం చేసి, నిర్ణీత విధానాలుగా, పూజాదికాలుగా ఏర్పరిస్తే అది మతం అవుతుంది.

* * *

ప్రశ్న: ప్రియజననీ! నేటి ప్రపంచంలో చాలా మంది ప్రజలు ఏదో ఒక మతాన్ని అనుసరిస్తున్నారు. వారికి దైవం సహాయ పడుతుందా!

జ: అంత ఎక్కువ అందదు.

ప్రజలు బహుశా ఇపుడు మళ్లీ మతాన్ని అనుసరిస్తున్నారు. ఈ శతాబ్దం ప్రారంభంలో చాలా కాలంపాటు వారు మతం జ్ఞానానికి విరుద్ధమైనదని ఖండించారు. ముఖ్యంగా బుద్ధి సంపన్నులు ఆ పని చేసారు. ఇటీవల సక్రియాత్మక విధానాలకన్నా మరేదో మతపరమైన భావాల వైపు ఉద్యమం ఒకటి ప్రారంభమైంది.

ఇతరుల దృష్టిలో తాము చెడ్డవారు కాదని అనిపించు కోడానికి, ఒక విధమైన సాంఘిక ఆచారంగా ప్రజలు మతాన్ని అనుసరిస్తున్నారు. ఉదాహరణకు గ్రామాలలో మతపరమైన

ఉత్సవాలకు, పూజాదికాలకు వెళ్ళకుండా ఉండలేవు. ఎందుకంటే నీ ఇరుగు పొరుగువారు నీవైపు వేలెత్తి చూపుతారు. కాని దీనికీ, ఆధ్యాత్మిక జీవన స్రవంతికి అసలు సంబంధం లేదు:

(నిశ్శబ్దం)

భారతదేశానికి మొదటిసారి నేను జపాన్ నౌకలో వచ్చాను. ఈ నౌకలో క్రైస్తవమత శాఖలకు చెందిన ఇద్దరు మతాచార్యులు ఉన్నారు. ఇద్దరూ ఆంగ్లేయులే. ఒకరు ప్రొటస్టంటు, ఇంకో అతను ప్రెస్బిటేరియన్ అనుకుంటాను. ఆదివారం నాడు ఆ నౌకలోనే మతపరమైన ఉత్సవం ఒకటి జరుపవలసి వచ్చింది. ఎవరు జరపాలన్న విషయంలో పోట్లాట రావల్సినదే కొంచెంలో. చివరికి వారిలో ఒకతను హుందాగా వెనక్కి తగ్గాడు. ఎవరో గుర్తు లేదు. ఆంగ్లికను అనుకుంటాను. ప్రెస్బిటేరియను పూజలు నిర్వహించాడు. నౌకలోని విశ్రాంతి మందిరంలో ఈ ఉత్సవం జరిగింది. అందరూ తమ జాకెట్లు ధరించారు. తలపై టోపీలు, నెక్‌టైలు, బూట్‌లు ధరించారు. చేతిలో పుస్తకంతో అంతా అక్కడ చేరారు. మహిళలు కూడా ప్రార్థనా గ్రంథాలతో చేరారు. ఒక మత చార్యుడు ఉపన్యాసం ఇచ్చాడు. అంతా శ్రద్ధాభక్తులతో విన్నారు. అది పూర్తికాగానే తమ విధిని తాము చేశామన్న సంతృప్తి అంతా వ్యక్తం చేశారు. అయిదు నిముషాలు పిమ్మట వారు బార్‌లో చేరి మద్యపానం, పేకాట ప్రారంభించారు. అంతకు ముందే జరిగిన మత ప్రార్థన, ఉపన్యాసం మరిచిపోయారు. వారి విద్యుక్త ధర్మం వారు నెరవేర్చారు. దానిని గూర్చి చెప్పడానికి ఇంకేమీ లేదు.

మతాచార్యుడు నా వద్దకు వచ్చి "మీరెందుకు హాజరు కాలేదు." అని మర్యాదగానే అడిగాడు. "సర్, నాకు మతంలో నమ్మకం లేదు" అని అన్నాను.

"ఓహో! నువ్వు భౌతిక వాదివా?"

'కాదు"

"మరి?"

"నేను నిజంగా ఎందుకు రాలేదో చెబితే మీరు బాధపడతారు. నేను చెప్పకపోవడమే మంచిది" అని అన్నాను. కాని పదేపదే అడిగారు. నేను చెప్పక తప్పలేదు. "ప్రయత్నించి ఆలోచించండి. మీరు చిత్తశుద్ధితో ప్రార్థన చేయలేదు. ఏదో సాంఘిక ధర్మాన్ని, ఆచారాన్ని ఆచరించారు. భగవంతునితో పొందుకోరే ఉద్దేశం కనిపించలేదు." అని అన్నాను.

" భగవంతునితో సంలీనం కోసం ధ్యానమా? మేము చేయలేము. కొన్ని మంచి మాటలు చెప్పుకోడం, తప్ప మేము ఏమీ చేయలేదు. భగవంతునిపై ధ్యానం చేస్తూ ఆయనతో బంధం పెట్టుకోడం మాకు సాధ్యం కాదు." అని అన్నారాయన "అందువల్లనే నేను రాలేదు. నాకు అటువంటి ప్రార్థనలో ఆసక్తిలేదు" అని అన్నాను.

ఆయన నన్ను అనేక ప్రశ్నలతో ముంచెత్తాడు. తాను చైనాలో, వారిని మత మార్పిడి చేయడం కోసం అక్కడికి వెళ్తున్నాను." అని ఆయన అన్నారు. దానితో నాకు చిరాకు వచ్చింది. మీ మతం పుట్టక పూర్వమే, - (మీ మతం పుట్టి రెండువేల సంవత్సరాలైంది)- చైనాలో అత్యున్నతమైన తాత్విక చింతన వుంది. భగవంతునివైపు నడిచే మార్గం వారికి తెలుసు. పాశ్చాత్యులు అనాగరిక ఆది మానవులులాంటివారని చైనీయుల భావన. మీకన్నా ఎక్కువ తెలిసిన వారి మతం మార్చడానికి మీరు వెళ్తున్నారా? వారికి మీరేం బోధించగలరు? జీవితం పరిత్య జించడం ద్వారా మరింత ప్రగాఢమైన ఆధ్యాత్మిక చైతన్యం వైపు ప్రయాణించాలి. అది చేతకాని మీరు వెళ్లి, వారి మతాన్ని మార్చడం సముచితంకాదు." అని అన్నాను.

అయిన ఊపిరి తిప్పుకోలేకపోయాడు. "మీ మాటలు నాలో నమ్మకం కల్గించడం లేదు" అని అన్నాడు.

"నేను మిమ్మల్ని నమ్మించాలనుకోవడం లేదు. నేను ఉన్న పరిస్థితిని గూర్చి వివరించాను. అనాగరికులు, ఆదిమానవుల వంటివారు, నాగరికత బాగా వికసించిన దేశంలో బోధించేదేమిటి? వారికి దైవం గూర్చి బాగా తెలుసు. అంతే చెప్పాలనుకున్నాను." అని అన్నాను.

అంతే దానితో మా సంభాషణ ముగిసింది.

అనువాదం : యజ్ఞన్న

పరిమితులతో అనిత్యులమైన మనకంటె ప్రముఖ తరము ఉన్నత తరము అయిన ఒక మహత్ శక్తి యొక్క అస్తిత్వ భావనతో ఆపరమశక్తికి పూజానుష్ఠాన సమర్పణతో, ఇంకా, దాని ఇచ్ఛాశక్తికి, కోర్కెలకు, నియమాలకు సవిధేయంగా ఉండటం తోను ఆరంభమవుతుంది మొత్తం మతం అంతా. అయితే అలాభావించి, అర్చించి, పూజించి, విధేయంగా ఉండే పరమశక్తికి, అర్చకునికి మధ్య అపారమైన ఒక అగాధాన్ని సృష్టిస్తుంది మతం తన ప్రారంభాలలో. యోగమైతే పరమోచ్ఛస్థితిలో ఈ అగాధాన్ని తొలగిస్తుంది. ఎందుకంటే యోగం అంటేనే సమైక్యత కాబట్టి.

- శ్రీఅరవిందులు

నైతికత - ఆధ్యాత్మికత - వీటి తారతమ్యము

ఆధ్యాత్మికత, నైతికత అనేవి వేరు భావనలు. ఈ రెండింటికి చాల తేడా వుంది. కాని సర్వసాధారణంగా ఈ రెండూ ఒకటి అనుకుంటూ ఉంటాము.

"ఆధ్యాత్మిక" లేక "యోగ" జీవనం మనలో దైవచేతనను కలిగించి తద్వారా మన అంతశ్చేతనను పరిశుద్ధము, తీవ్రతరము, మహత్వపూర్ణము గావించడానికి ఉద్దేశించబడింది. అది మనలో

దాగియున్న దైవత్వాన్ని ఆవిష్కరిస్తుంది. వ్యక్తిత్వానికి అది పరిపూర్ణమైన విలువను, ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. ఇది భగవంతుని ప్రణాళికలో ఒక భాగం.

ఇక "నైతికత" అనేది మానవుని మనస్సు ఏర్పాటు చేసుకున్న భావన. మనసే మంచి చెడ్డలను నిర్వచించి కొన్ని ఆదర్శాలను నెలకొల్పుతుంది. ఇది అందరూ తప్పక ఆచరించాల్సిన విధానంగా రూపొందుతుంది. ఈ నైతిక నియమాలు దేశ, కాల, సామాజిక పరిస్థితులను అనుసరించి ఒక్కొక్క చోట ఒక్కొక్క విధంగా ఉంటాయి. 'నైతికత' అంతరాత్మ యొక్క వైవిధ్యానికి, ఇచ్ఛకు భిన్నంగా ఒక విధంగా 'కృతకమైన' ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. ఒకానొక మానసికమైన, స్థిరమైన పరిమితమైన ప్రమాణాన్ని నెలకొల్పి దాన్నే అందరూ అనుసరించాలని శాసిస్తుంది. ఈ 'నైతికతను' అంతా శిరసావహించాల్సినదే. ఇది మనిషి తన కోసం తాను ఏర్పాటు చేసుకొన్న విధానం. ఇది దైవం నుండి వచ్చినది కాదు. దైవానికి సంబంధించినదీ కాదు.

"నైతికత" నిర్ణయించటంలో మనసు ప్రతీదాన్ని ఇది 'మంచి' ఇది 'చెడు' అని విభజిస్తుంది. ఈ విభజన సహేతుకమైనది కాకపోవచ్చు. సాపేక్షమైన భావనలు నిరపేక్షమైనవిగా నిర్ధారించబడవచ్చు. ఈ విధంగా నిర్ణయించిన 'మంచి' 'చెడ్డలు' ఒక్కొక్క చోట ఒక్కొక్క రకంగా ఉంటాయి. దేశకాల పరిస్థితులను బట్టి ఈ విలువలు మారుతూ ఉంటాయి. "నైతికత" కోరికలను "మంచివి" లేదా "చెడ్డవి"గా నిర్ణయించి, 'మంచి'ని అనుసరించమనీ, 'చెడు'ను తిరస్కరించమని ఆదేశిస్తుంది.

దీనికి భిన్నంగా "ఆధ్యాత్మిక జీవనం" అసలు కోరికలనే త్యజించమంటుంది. దైవాన్నుంచి నిన్ను దూరం చేసేవి ఎలాంటివైనా సరే, వాటిని దూరంగా ఉంచాల్సిందే. ఈ నియమం ఎంత

అభిలషణీయమైనదో, అంత కష్టసాధ్యమైనది కూడా! కానీ అంతః చేతన యొక్క పరిణామ క్రమంలో దీన్ని సాధించాల్సిన అవసరం ఉంది. అంతర్గత, మానసిక స్పందనల నుండి, వాటినుండి కలిగే బాహ్య ప్రతి చర్యలనుండా అప్రమత్తులమై ఉండటం ఎంత ముఖ్యమో దాని కన్న "ఆధ్యాత్మిక దృక్పథం" అంత సర్వోత్కృష్టమైనది. మనిషి తన వ్యక్తిత్వానికి తానే యజమానిగా వ్యవహరించటమే దీని ఉద్దేశ్యం. చేతన యొక్క పరిణామ క్రమంలో దాటవలసిన ఒక ముఖ్యమైన మజిలీ ఇది. ఈ దశలో వ్యక్తి తన "అహాన్ని" స్వాధీన పరచుకొని దాన్ని వర్జించగలుగుతాడు. ఒకవేళ అది పూర్తిగా తొలగక పోయినా రాను రాను క్రమంగా బలహీన పడుతుంది. చేతన యొక్క పరిణామ క్రమంలో ఈ దశను తప్పించుకొని ఎవరూ ఆవలి ఒడ్డు (ఆధ్యాత్మికతకు) చేరలేరు. ఒకవేళ ఎవరైనా మూర్ఖంగా ప్రయత్నిస్తే నిమ్న ప్రకృతిలోని బలహీనతలనే నిజమైన స్వేచ్ఛ అని భ్రమించే ప్రమాదంలో పడ్డట్టే!

ఎంత విశిష్టమైన, పరిపూర్ణమైన వ్యక్తియైనా ఈ నైతిక పరిపూర్ణత్వాన్ని సాధించకపోతే మానసిక స్థాయినుండి, ఆధ్యాత్మిక స్థాయి దిశగా సాగిపోలేడు. బాహ్య ప్రకృతిలోని బలహీనతలను అధిగమించకుండా అంతర్గత శక్తులను ప్రదర్శించుకోవటానికి అడ్డదారులు తొక్కేవారు ఎందరో ఉన్నారు. వారంతా ఆత్మ వంచన చేసుకుంటూ భ్రమలోనూ, ప్రమాదంలోనూ చిక్కుకొని ఉన్నవారే!

పరిపూర్ణ స్వాతంత్ర్యంతో కూడిన నిజమైన ఆధ్యాత్మిక జీవనం "అత్యున్నత నైతిక విలువల సాధన" కంటే సమున్నతమైనది. ఈ స్వేచ్ఛ విచ్చలవిడి తనానికి గాని, కట్టుబాటును ఏవగించు కోవటానికి గాని దారి తీయకుండా సాధకుడు జాగ్రత్త పడాలి.

వ్యక్తి నిరంతరమూ ఔన్నత్యాన్ని సాధిస్తూ పోవాల్సిందే. మానవుడు సాధించగల అత్యున్నత ఆధ్యాత్మిక శిఖరాలు తన లక్ష్యంగా నిర్దేశించుకోవలసిందే!

- శ్రీమాత

అనువాదం : కె.ఆర్.యల్. నరశింహారావు

ఆధ్యాత్మికత అంటే

ఆధ్యాత్మికమనగా మనస్సుకన్న, జీవితం కన్న ఉన్నతమైన దాని యొక్క గుర్తింపు, మన సాధారణ మానసిక, ప్రాణిక స్వభావం కన్న పరమమైన, పవిత్రమైన, గొప్ప దివ్యచేతనపట్ల ఆకాంక్ష, మనిషిలోని అల్పత్వం నుండి, నిమ్న భూమికల శృంఖలాల నుండి అతనిలో నిగూఢంగా వుంటున్న ఉన్నత స్థాయికి అతని ఆత్మయొక్క ఉత్థానము.

* * *

నీవు నీ అహంకారాన్ని,గాక, నీలోని మరొక చేతనను గుర్తించి, దానిలో, దాని ప్రభావం క్రింద అధికాధికంగా జీవించడం ఆధ్యాత్మికం అవుతుంది. అదిగో, అదే, ఆ చేతనయే, విశాలమైన, అనంతమైన, స్వయంభువులైన, అహంకార రహిత పరిశుద్ధ చేతనే ఆధ్యాత్మికం అనబడుతుంది.

(ఆత్మ, బ్రహ్మం, దైవం . . . .)

* * *

దివ్య పరిపూర్ణత మనకి ఊర్ధ్వాన, నిరంతరం వున్నది. కాని మనిషి తన చేతనలో దివ్యత్వాన్ని సంతరించుకొని తన బాహ్యాంతరాలలో దివ్య జీవనం సాగించటమే ఆధ్యాత్మికము. అంతేకాని, ఆ పదానికి అన్వయించే తక్కిన అల్పార్థాలన్నీ అసంపూర్ణములు, వికృతములు, కపటములు.

మూలము :- శ్రీఅరవిందులు

అనువాదం :- బి. నరసింహయ్య

యోగా అంటే ఏమిటి?

1. నేను ఆకాంక్షించే అనంతశక్తి, అపరిమిత జ్ఞానము, పరమానందం పొందగలనా? తప్పకుండా, అనంతత్వానికి అంతం లేదు. అందుచేత అది నేను పొందడం అన్నది సరైన పదం కాదు. అదే నేనుగా మారాలి. అంటే మనిషి దైవంగా మారడం ద్వారా దివ్యత్వాన్ని పొందగలడు.

* * *

2. అయితే పరమాత్మగా మారడానికి ముందు అతడితో అనుబంధ మేర్పరుచుకోవాలి. ఆ సంబంధం దిశగా అడుగులు వేయడమే యోగా యొక్క అత్యున్నత లక్ష్యం, అతి విశిష్టమైన ప్రయోజనం. మానవ పరిధులలోనే మన మీ సంబంధం వృద్ధి చేసుకుంటాం. అవి ప్రార్థన, ఆరాధన, స్తోత్రం, త్యాగం, చింతన, నమ్మకం, శాస్త్రం మరియు వేదాంతం. మన శక్తికి మించిన ఇతర సంబంధాలు కూడా వున్నాయి. అయితే మన మానవ పరిధిలోవున్న అభివృద్ధే ఇంకా పూర్తికాలేదు. ఆ సంబంధాలన్నీ వివిధ సాధనల ద్వారా పొందవలసి వుంటుంది. ఆ సాధనే యోగా అంటారు.

* * *

3. మానవుడి వ్యక్తి చైతన్యానికి, దివ్యచైత్యన్యానికివున్న అనుబంధమే యోగా మూలసారం. జగన్నాటకంలో జగత్తు జగత్తు యొక్క అసలుమూలం, సత్యాత్మ. సార్వత్రిక తత్వం విడిపోయి వుంటుంది. ఆ రెండింటి కలయికే, యోగా.

* * *

4. ముఖ్యంగా, ప్రస్తుతం మనలో ఆత్మ స్వరూపం గురించి వున్న అపోహలని రూపుమాపే ప్రక్రియలు వాటి ఫలితాలు ఏవైతే వున్నాయో వాటి ద్వారా మామూలు జంతు స్థాయినుంచి, మానసిక

స్థాయినుంచి ఒక విశాలమైన, వున్నతమైన నూతన చైతన్యానికి ఉద్ధరించేది. అహంకారంనుంచి విశ్వచైతన్యానికి మార్చే ప్రక్రియ యోగా. విశ్వచైతన్యాన్ని, విశ్వాతీత చైతన్య దిశగా(towards supra cosmic) అధిరోహింపజేసేదే యోగా. సృష్టి సమస్తానికి మూలం, ఆధారం అయిన అవగాహనకందని అనిర్వచనీయమైనదది. జంతు దశలో వున్న మానవ బుద్ధిని దివ్యచైతన్యానికి చేర్చేదారి యోగావే. అక్కడి నుండే మనిషి అవతరించాడు.

* * *

5. పరమాత్మతో కలయికే యోగా అంటే. వ్యక్తిగతం, వైశ్వానికం, విశ్వాతీతం ఈ మూడింటి కలయిక. లేదా సంకుచితమైన అహం, వ్యక్తి, మనస్సు, ప్రాణికం, శరీరం ఈ పరిమితులకు లోబడని అపరిమిత అనంత చైతన్యం యేదైతేవుందో, దానిలోకి ప్రవేశం కల్పించేది. సర్వసృష్టి వునికికి కారణమైన మూలసత్యం అంటే వ్యక్తి ఆంతర్యంలో ఉన్న అంతరాత్మ లేదా స్వయంగా మనిషిలో జాగృతమైన ఆత్మ ఏదైతే వుందో అది, ఒక గంభీర చైతన్యం లేదా విశ్వచైతన్యం లేదా పరమాత్మలో విలీనం కావడమే, యోగా.

* * *

6. సహజ స్వభావం కలిగి ఉన్న సామాన్య మానవునికి, యోగికి తేడా: యోగి తనలో పనిచేస్తున్న అహంకారయుత, విభజన స్వభావం కలిగియున్న నిమ్న ప్రకృతిని, దివ్య ప్రేరణతో కూడిన ఉన్నత ప్రకృతి యొక్క సమగ్ర క్రియా కలాపంలోనికి మార్చటమే-

* * *

7. మన జీవ చైతన్యమంతా పరమాత్మలో అనుబంధం, సంబంధం యెల్లప్పుడూ వుండేటట్టు కృషిచేసే పద్ధతి నవలంబించాలి. మన సంపూర్ణ ఆత్మ పరివర్తన ద్వారా ఆ దైవంలో వీలీనం కావాలని అర్థించాలి. ఆ పరమాత్మే మన ఆంతర్యంలో నిజమైన పరమ పురుష.

అతడే సాధకుడు, సాధన, యోగాధిపతి కూడా . అతడివల్లే నిమ్న వ్యక్తిత్వం దివ్యపరివర్తనా మూర్తికి కేంద్రంగా స్వయం పరిపూర్ణతని సంతరించుకుంటుంది. స్వీయపరిపూర్ణతకు దివ్య ఉపకరణ మవుతుంది. తత్ఫలితంగా మనలో కొలువైవున్న దివ్య చైతన్య శక్తి తీవ్రతలు, తపశ్శక్తి వత్తిడి స్వీయ చైతన్య సిద్ధిని కలుగచేస్తుంది, సర్వాంతర్యామి, సర్వకారకుడు ఆ పరమాత్మ పరిమితమైన, అంధకారమయిమైన జగత్తు మీదకి ప్రగతి తేజస్సుతో దివ్యశక్తులతో అవతరించి తన ప్రభావంతో అన్ని విధాల న్యూనతా భావంతో, అశాశ్వత కార్యకలాపాలతో , నిండివున్న నిమ్న ప్రకృతికి బదులుగా తనదైన శాశ్వత దివ్య సత్య ప్రక్రియని సంస్థాపన చెయ్యడం సంభవిస్తుంది.

మూలం : శ్రీ అరవిందులు.

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి.

ఆహారం పట్ల వైఖరి

ఆహారంపై మక్కువ, కాంక్ష, ఆతృత ఉండడం వల్ల అది మన జీవితంలో అనవసరమైన ప్రాధాన్యత పొందుతోంది . అది యోగ విధానానికి విరుద్ధమే. ఒక రుచిని ఆస్వాదించడం తప్పు కాదుగానీ, దానిమీదే మనసు పెట్టుకొని వెంపర్లాడడం, దొరికినప్పుడు అదే పరమానందంగా భావించి దొరకనిక్షణాన దిగులు చెందడం మంచిదికాదు. ఎప్పుడూ శాంతంగా, సమరసభావంతో ఉండాలి. భోజనం రుచిగా లేకపోయినా, సరిపడినంత లేకపోయినా బాధపడకూడదు. సరిగ్గా సరిపడినంతే తినాలిగానీ ఎక్కువగానీ , తక్కువ గానీ తీసుకోరాదు. భోజన విషయంలో అత్యాకాంక్ష లేదా అయిష్టం గానీ పనికిరాదు.

ఆహార విషయంలో కోరిక తగ్గించుకోవాలనుకున్నప్పుడు ఎప్పుడూ దానిగురించే ఆలోచిస్తూ బుర్రపాడు చేసుకోకూడదు. జీవితంలో దానికివ్వ వలసిన స్థానం దానికిచ్చి ఇంక దాన్ని గురించిన ఆలోచనలు వదిలిపెట్టి మిగతా విషయాలమీద మనసులగ్నం చేయాలి.

* * *

యోగాభ్యాసం చేయాలనుకున్నప్పుడు చిన్నాపెద్దా విషయాలన్నిటిలో కూడా యోగవైఖరిని అవలంబించాలి. కోరికల విషయంలో బలవంతంగా వాటిని అణచి వెయ్యాలనే వైఖరి కాక వాటిపట్ల ఉదాసీనత, సమదృష్టి అవలంబించట మనేది ఈ యోగ మార్గంలో తెలుసుకోవాలి. బలవంతంగా అణచుకోవడమనేది స్వేచ్ఛా విహారంతో సమానమే. ఈ రెండు సందర్భాలలో కూడా కోరిక నిలిచే ఉంటుంది. ఎందువల్లనంటే మొదటి దానివల్ల అది నిద్రాణమైనా విజృంభించే స్థితిలో ఉంటుంది, రెండవ సందర్భంలో అది పరిపుష్టి చెందుతుంది. చేయవలసిందేమంటే ఒక అడుగు వెనక్కివేసి, నిమ్న ప్రాణికంతో సంబంధంలేనట్లు అది కల్పిస్తున్న గోలనూ, కోరికలనూ పట్టించుకోకుండా చైతన్యంలో దానికి సంబంధించిన సంపూర్ణ సమతను నెలకొల్పుకోవాలి. అప్పుడు క్రమక్రమంగా నిమ్న ప్రాణికం శుద్ధమై ప్రశాంతంగా, సమానంగా తయారవుతుంది.[1] ఒక్కొక్క కోరిక కలిగినపుడల్లా దాన్నొక బాహ్యక్రియ మాదిరిగా ఉదాసీనంగా పరికించి వచ్చిన దాన్ని వచ్చినట్లే చైతన్యం నుంచి తిరస్కరించి వెనక్కి తిరిగి పోనివ్వాలి, అప్పుడు దాని స్థానంలోకి సరైన ప్రవృత్తి, సరైన చైతన్యం వచ్చి నిలుస్తాయి.

* * *

జిహ్వాచాపల్యాన్ని అధిగమించవలసిందే అయినా దాన్ని గురించి అదే పనిగా ఆలోచించకూడదు. ఒక రకమైన సమదృష్టి పాటించటమే ఆహారంపట్ల సరైన వైఖరి అని చెప్పాలి. శరీర పోషణకి చాలినంత ఆహారం తీసుకోవాలి. దానికి ఎంత అవసరమో అంతే తినాలి; తక్కువ తీసుకుంటే దానికి సరిపోక విలవిల్లాడుతుంది. ఎక్కువ తీసుకుంటే అది ప్రాణికదేహాన్ని పరితృప్తి చేయడమే అవుతుంది. జిహ్వాకోరుకునే ఆహారం విషయంలో మనస్సూ, ప్రాణికమూ కూడా ఒకే వైఖరి అవలంబించి "దొరికితే తీసుకుంటాం, లేకపోతే బాధపడము" అనుకోవాలి. ఆహార విషయంలో అతి ఆసక్తి

---

[1] ఉపవాసం ఉండటమనేది ఈ కోవలో చేరుతుంది. అందువల్ల ఆ ఊహ దరిచేరనీయకు.

పెంచుకోవటం, లేకదాన్ని అణచుకోవడం ఎక్కువ ఆలోచించక పోవడం, ఇదే శ్రేయస్కరము, వివిధ ఆహార పదార్థాలు వాటి వాటి భౌతిక చర్యలను మినహాయించి చూస్తే అవి వివిధ గుణాలకు పరిపుష్టి నిస్తాయనీ ఆ విధంగా అవి పరోక్షంగా ఉపయోగ కరంగాగానీ లేక హానికరంగాగానీ అవుతాయంటారు. అది విశ్వాసానికి సంబంధించిన విషయము. అంతకంటే ఏ పదార్థాలు సాత్వికాహారం, ఏవికావు అంటే మాత్రం నిర్ణయించడం కష్టము. ఆధ్యాత్మపరంగా చెప్పాలంటే పదార్థగుణం అనేది కేవలం ఆ పదార్థంలో కాకుండా దానితోకూడి ఉన్న గుప్త వాతావరణంపైనా, దానితోపాటు వచ్చే దానిశక్తి మీదా ఆధారపడుతుంది.

* * *

అన్నిరకాల ఆహార పదార్థాలను సమరస భావంతో తీసుకోవాలంటే దానికి ప్రత్యేక అభ్యాసం అవసరములేదు, అది అభ్యాసంతో వచ్చేదీ కాదు. సమరస భావన అనేది చైతన్యంలో ఏర్పరుచుకోవాలి, ఆ సమత్వభావం పెంపొందుతూ ఉంటే దాన్ని అన్నిచైతన్యరంగాలలోకీ విస్తరింప చేసుకోవచ్చు.

* * *

రుచిపై మక్కువ పెంచుకోకుండా ఉంటే అది ఎన్నటికీ బంధము కాబోదు. జిహ్వకు కట్టుబడనంతవరకు రుచిని ఆస్వాదించటంలో తప్పులేదు. రసాస్వాదనలోని ఆనందాన్ని భగవదర్పణంగా భావించవచ్చు.

ఆహారం మనం భుజించేటప్పుడు అది మనలో ఉండే భగవంతునికి అర్పిస్తున్నామనే స్పృహతో భుజించాలి. అది దేవాలయంలో నివేదన చేస్తున్న భావనతోనే ఉండాలికానీ దాన్నొక

భౌతిక అవసరంగా గానీ, ఆత్మ పరితృప్తి కోసమైనదిగా గానీ అనుకోకూడదు.

అంటే ఆహారం మనలోని అహంకుగానీ, వాంఛకుగానీ కాకుండా అన్ని కర్మలకూ అధినాధుడైన భగవంతుని నివేదనకు మాత్రమే.

- శ్రీఅరవిందులు

నీలో కోరిక కలిగినప్పుడు నీవు కోరిన ఆ వస్తువే నిన్ను నడిపిస్తుంది. అది నిన్నూ, నీ జీవితాన్ని ఆవహించి నిన్ను దానికి బానిసను చేస్తుంది. ఆహార విషయంలో నీవు పేరాశతో ఉంటే దానికి నీవు కర్తవుకాక దాసుడిగానే ఉంటావు.

దైహిక చైతన్యానికి సంబంధించి దేనిపట్ల అయినా నీకు చాపల్యం ఉన్నట్లయితే - వాటినే నీవు అత్యవసరాలనిగానీ మరేమైనా అనవచ్చు - అదే సాధనలో నీకు ఒక పెద్ద ఆటంక మవుతుంది. చాపల్యంతో కూడిన ఏ చిన్నపరితృప్తి అయినా నీగమ్యానికి వెనకడుగే అవుతుంది.

- శ్రీమాత

అనువాదము : అమరవాది ప్రభావతి

అమరవాది వెంకట రామశాస్త్రి

A heaven of creative truths above,
A cosmos of harmonious dreams between,
A chaos of dissolving forms below,
It plunges lost in our inconscient base
Out of its fall our denser Matter came.
Savitri *Sri Aurobindo*

భారతదేశ ద్రష్టగా శ్రీఅరవిందులు

శ్రీఅరవిందులు రాజకీయాల నుంచి నిష్క్రమించారు, రాజకీయాలన్నింటినీ, ఎవరైనా, తప్పనిసరిగా వర్జించాలనే ఒక ముఖ్యమైన నిబంధన వారి ఆశ్రమంలో ఉంది; అది, శ్రీఅరవిందులు ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలను పట్టించుకోక పోవటం కాదు. మరి ఎందువల్లనంటే రాజకీయం అనేది ఇప్పుడు ఆచరించబడుతున్న విధానంలో, నీచమై, అసహ్యమై, పూర్తిగా అసత్యం, మోసం, అన్యాయం, అధికార దుర్వినియోగం, హింసల ప్రాబల్యంలో ఉన్నది. కారణం, రాజకీయాలలో ఎవరైనా విజయం పొందాలంటే వారు తమలో దంభాచారం, నటన, వంచన, నియమాలకు కట్టుబడని గాఢవాంఛ మొదలైన దుర్లక్షణాలను అలవాటు చేసుకోవాలి.

చిత్తశుద్ధి, నిజాయితీ, నిస్వార్థత, చేయవలసిన పనిలో ప్రతిఫలాపేక్ష లేకపోవటంతో పాటుగా భగవదర్పణా భావం, ఉదాత్తశీలమైన నడవడి, అరమరికలు లేని ఋజువర్తన, మనయోగానికి తప్పనిసరైన ప్రాతిపదిక. ఈ ప్రాథమిక విశిష్టగుణాలను ఎవరైతే ఆచరించి చూపించరో వారు శ్రీఅరవిందుల శిష్యులు కారు, వారికి ఆశ్రమంలో స్థానం లేదు. అందువల్లనే నేను ఆశ్రమం మీద వక్రబుద్ధి, దుష్టమైన, బుద్ధిహీనమైన నిరాధారములైన ఆరోపణలకు సమాధానం ఇవ్వడానికి నిరాకరిస్తాను.

శ్రీఅరవిందులు ఎప్పుడూ తన మాతృభూమిని ప్రేమించే వారు. ఆయన ఆమెను ఘనంగాను, ఉదాత్తంగాను, పవిత్రంగాను ప్రపంచంలో తన ప్రముఖమైన విద్యుక్త ధర్మ కార్యనిర్వహణకు యోగ్యమైన విధంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయన ఆమె,

హీననీచస్థితులు గుడ్డి స్వార్థపరత్వాలు, యదార్థ జ్ఞానశూన్యమైన పక్షపాత ధోరణులలో కూరుకుపోనివ్వలేదు. ఇందువలననే, ఆయన ఇచ్ఛకు పూర్తి అనుగుణంగా మేము సత్యం, పురోగతి, మానవజాతి పరివర్తన అనేవాటి ప్రమాణాలని ఉన్నతమైన స్థాయిలో ఉద్ధరిస్తూ, అజ్ఞానం, మూఢత్వం, వైరభావం మొ॥ చెడ్డతలంపులతో దానిని మలిన పరచాలనుకుంటూ, బురదలోకి దిగలాగేవారిని ఏమాత్రం లక్ష్యపెట్టకుండా తీర్చిదిద్దాము. ఉన్నతస్థాయికి తీసుకువెళ్ళాము. ఆ విధంగా చేయడం వలన, ఆత్మ చైతన్యం కలిగిన వారెవరైనా దానిని దర్శించి, దాని దరిచేరి లక్ష్యశీలురు కాగలరు.

25 ఏప్రియలు 1954 - శ్రీమాత

అనువాదం : డా. టి. ప్రసన్నకృష్ణ

ఉన్నతాశయ జ్వాలల తేజస్వినీ మాతకు సంకీర్తన

(జనవరి 1927లో కె. అమృత అనే శ్రీఅరవిందుల శిష్యుడు వ్రాసిన సంకీర్తనను శ్రీఅరవిందులు సంస్కరించి మూడుభాగాల సంకీర్తనగా రూపొందించి తన దస్తూరీలో లిఖించారు.1959,1976లలో ఈ లేఖాప్రతిని శ్రీఅరవిందుల వారిదిగా గుర్తించి “ది అవర్ ఆఫ్ గాడ్” పేర ప్రచురించారు. - సంపాదకుడు)

చీకటి గుహల్లో ప్రకాశంవలె ఒక అంతర్గత పరిపూర్ణత ఆవహించింది. జీవనపు బహుళ తంత్రుల్లో అది నిండి, ప్రకాశించి ధ్వనించింది. వర్తమానపు పరివర్తన రూపాల ప్రాతిపదికపై భవిష్యత్ నూతన రూపాలను ఆవిష్కరించటానికి వీలుగా మరుగున పడిన గత విజయాలతో సంబంధాలను ఏర్పరచుకొంది. ఊర్ధ్వస్థిత స్వర్గాల నుండి అవతరించే కాంతి కిరణాలను కలిసి అధమ ప్రకృతిని, తమస్సును జ్యోతిగా, సత్యంగా అసత్తును, అసహ్యాన్ని సుందరంగా, సన్మార్గంగా, మార్చటానికి జీవన ప్రవాహాలు ఉప్పొంగాయి.

ఓ తేజస్వినీ మాతా! నా మనస్సులోని ఇరుకు పొరల్లో నువ్వు ఉదయించావు. అందులోని అగాధపు కాలిన్యాల నుండి అడ్డుగోడల మధ్య నుండి శాశ్వతత్వాన్ని సంతరించుకొనే హృదయం వంటి దాన్ని నీవు సృష్టించావు. నిస్సీమ మనో పొలిమేరల్లో కవోష్ణమైన, సజీవ గృహాన్ని దర్శింపచేశావు. అక్కడ నేను సురక్షితంగా విశ్రాంతి పొంది సేద తీర్చుకోగలను.

నిమ్నస్థాయిలో కదిలే శక్తుల గజిబిజిలు ఉన్నాకాని అందులోనే నీ సాక్షాత్కారాన్ని భావించగల్గుతున్నాను. ఊర్ధ్వ భాగంలో కదిలే శక్తుల అల్లికలూ ఉన్నా అక్కడా నువ్వు ప్రవేశించి మునుపెన్నడూ లేని జీవనపు వెచ్చదనాన్ని కల్పించావు. మసక వెలుగులను జీవనకాంతి ధారలతో నింపావు. నీ సజీవ, క్రియాశీల అస్తిత్వం అంతటా వ్యాపించి ఉంది. నీ సర్వవ్యాపకత్వంకోసం సాగిన నా కోరికల నిప్పురవ్వల, ఆకాంక్షల శబ్దాలను నీవు ఆలకించావు. నేను బుద్ధి మాంద్యంతో అన్వేషించిన దానికంటే ఎక్కువగా దర్శింపచేశావు. సత్య, ధర్మబద్ధంగా ఉన్నప్పుడు నాతో సన్నిహితంగా ఉండి నాతో ఒకటై మెలగావు. తప్పుదారి బట్టినప్పుడు దూరమయ్యావు.

నీలినీడలు ఏ మాత్రం నా చుట్టూ లేనప్పుడు నా అణువణువూ కపటత్వం డాంబికత్వాలనుండి నిర్ముక్తం అయి నప్పుడు నా శరీరంలోని అణువణువూ నీ శాశ్వత నివాసంగా, దేవాలయంగా మారినప్పుడు; నీతో ఐక్యమైకూడా నిన్ను పూజించ గల్గినప్పుడు, సజీవ భక్తి జలధారల్లో గడ్డకట్టిన విజ్ఞాన స్వర్ణాన్ని నీవు కరగించినప్పుడు; నా ద్రవ్యాన్ని ఛేదించి శక్తిని నీవు బహిర్గతం చేసినప్పుడు; నా గర్వం నీ చేతిలో శక్తిగా, నా తెలివి తక్కువతనం ప్రకాశంగా, నా సంకుచితత్వం వైశాల్యంగా, నా స్వార్థం కేంద్రీకృతమైన శక్తుల సత్య సమాహారంగా, నా పేరాశ సత్య

మూలాన్ని అందుకొనే అవిశ్రాంత సత్యాన్వేషణా సామర్థ్యంగా, నా అహంకారం సత్య, సచేతనా సాధన కేంద్రంగా, నా మనస్సు నీ అవతరణ మార్గంగా, నా హృదయం నీ నిర్మల అగ్నిజ్వాలల కుంపటిగా, నా జీవితం నీవు మలిచేందుకు వీలైన నిర్మల, పారదర్శ పదార్థంగా, నా శరీరం నాకు ఉద్దేశించిన నీలోని భాగాన్ని ధరించే సచేతన పాత్రగా అయినప్పుడు, ఓ తేజస్వినీ మాతా! నా ప్రస్తుత, భవిష్యత్ లక్ష్యం అనంత సత్య, ఋజు మార్గంలో నెరవేరుతుంది. నాలో ఉన్నతాశయం జాగృత మౌతుంది. నాలో ఆకాంక్షా జ్వాలను రగిలింపచేయి!

* * *

నీ నుంచి నాకు వినిపించేదంతా తక్షణమే విదిత జ్ఞానంగా, ఆత్మ సాక్షాత్కారంగా, అద్వైత ప్రకాశంగా, బాహ్యాభ్యంతరాల చైతన్యంగా రూపాంతరం చెందే జాగృతిని నాలో సృష్టించు. ఓ మాతా! నీ నుంచి నేను సమకూర్చుకున్నదంతా సర్వాంతర్యామి అయిన అంతర్గతంలోని విస్తారపు లోతులుగా మార్చు. బ్రహ్మానందాన్ని అనుభవించేందుకు అన్ని రకాలుగా నీతో సారూప్యం పొందేలా చేస్తూనే భక్తితో నిన్ను కొలిచేందుకు వీలుగా నీ నుండి వేరుగా ఉంచు. జీవితం - దాని కదలికలూ, ఉష్ణమూ - కాంతి, శక్తి - దాని అభివ్యక్తి, నిజమైన జ్ఞానమూ - దాన్ని అమలుపరిచే శక్తి ఏ విధంగానైతే కలిసి ఉంటూనే వేరుగా ఉంటాయో, అట్లాగే నేనూ నీలో ఒకటిగా ఉంటూనే - వేరుగా ఉండాలి. నాకు నువ్విచ్చేది ఒక సంపదగాకాక నేను స్వయంగా దర్శించిన పదార్థంవలె చేయి.

నీలో ఒకనిగా నిన్ను దర్శించి, ఆలకించే విధంగా, నా చేతనలోని విభజనలను అంతం చేయి. నీతో తాదాత్మ్యతద్వారా

సంక్రమించే విజ్ఞానం కొరకు, దివ్యదృష్టి కొరకు, దివ్యశ్రవణం కొరకు, నీవే ఐన సారూప్యంకోసం నా జీవశక్తులన్నీ ఆకాంక్షతో తపిస్తున్నాయి. నీ అనంత, జాజ్వల్యమాన విస్తారంలో ఒక చిన్న విభాగంగా నన్ను అవతరింపచేయి.

నాలో ఉన్నతాకాంక్షాగ్నులను ప్రజ్వలింపచెయ్యి. తక్షణమే అన్ని విధాలుగా నా శరణాగతిని సుసాధ్యం చెయ్యి. నాలో చైత్య పురుష, వికాసాన్ని గ్రహణశక్తిని విస్తరింపచెయ్యి. లోలోతుల్లోని ఆత్మవిచార ధారలకు ఆటంకమయే పై పొరలను తొలగించు. ఓమాతా! నాలో నాది అని ఉన్నదాన్నీ, కానిదాన్నీ వైదొలగించు, ఓ తేజస్వినీ మాతా!

నా శరీరంలోని అణువులూ, నరనరాల పోగులూ, పంచప్రాణ ధారలూ, హృదయ జ్వాలలూ, మనోశక్తులూ అన్నీ నీకు సంపూర్ణ సమర్పణ గావించేట్టు. తద్వారా నా జీవనంలో కపటం లేకుండా, చేతనలో విభజన లేకుండా, సత్తసలిలాలలో మరణం లేకుండా నరాల దొంతరలో దైన్యము, అసమతుల్యత లేకుండా, శరీరంలో వ్యాధి లేకుండా చేయి.

నీ స్వరం నాకు ఈ విధంగా ప్రత్యుత్తరం ఇస్తున్నది.

"భౌతికంగా పంచశక్తుల సమర్పణ ద్వారా, నిన్నంటి కేంద్రీకృతమై ఉన్న చైత్యపురుష ప్రేరణ యొక్క గంభీర తీవ్రత ద్వారా నీలో దాగిఉన్న ఆనందాన్ని, నీ చేతనలో నిబిడీకృతమై ఉన్న సమృద్ధతను ఎల్లప్పుడూ పెంపొందింప చేసుకో. మొట్టమొదట నీలోని నా సంకల్పాన్ని తెలుసుకో. ఆ తర్వాత తెలుసుకున్న దానిగా రూపాన్ని పొందు. "నీ సర్వస్వమంతా నాలో ఉందని" తక్షణమే, ఎల్లప్పుడూ తెలుసుకో.

అనువాదం : ఆచార్య, యం. రాజగోపాలాచార్య
కాకతీయ విశ్వవిశ్వ విద్యాలయం

శ్రీమాత నీతోనే సర్వదా ఉన్నదని గుర్తుంచుకో
ఆమె నీ విధంగా సంబోధించు - నీకష్టాలన్నిటి
నుంచి నిన్ను ఆమె కడతేరుస్తుంది
ఓ జననీ! నావివేకానికి నీవే వెలుగువి,
నా ఆత్మశక్తివి, నిశ్చల ప్రాణశక్తివి; శారీరక సహన
శక్తివి. నీపైన మాత్రమే నేను పరిపూర్ణంగా ఆధారపడి
ఉంటాను. నీవాడనే నేను పూర్తిగా కావాలని అభిలషిస్తాను.
మార్గంలో నేనెదుర్కొనే ఆటంకాలన్నిటినీ
నన్ను అధిగమింపజేయి.

-శ్రీ మాత

అనుబంధం (తరువాయిభాగం)

కాంతి కిరణాలు

మాతా,

అన్యాయాన్ని దైవం శిక్షిస్తుందా? ఎవరినైనా శిక్షించటం తనకు సాధ్యమా?

విషయాలను, మనుష్యులు దర్శించినట్లుగా దైవం దర్శించదు. కాబట్టి తనకు శిక్షించటం, భూషించటంలాటి అవసరం ఉండదు. ప్రతికర్మ దాని కర్మ ఫలాన్ని, పరిణామాలని తనలోనే వహించుకుని ఉంటుంది. దైవానికి దగ్గరగా చేర్చటం, దూరం చేయటం కర్మ లక్షణాన్ని బట్టి ఉంటుంది. మరదే సర్వోన్నత పరిణామం.

జూలై 25, 1970

మనుష్యులు దైవంనుంచి నిష్క్రమించగలరు. తరుచు వారిది చేస్తూనే ఉంటారు. మరైతే దైవానికి మనుష్యులనుంచి నిష్క్రమించటం అనేది అసంభవం.

* * *

దైవము నీ వైపునకు చాలాబాగా ఒదిగే ఉంటారు. మరి నీవే ఆయనను అర్థం చేసుకునేందుకు, ఆయన ఎత్తుకి సరిగా యెదిగి రావాలి మరి.

* * *

దైవాన్ని అర్థం చేసుకోవటానికి నీవు కూడా దైవమే అవాలి.

మే 24, 1972

<u>దైవంతో బంధుత్వం:</u>

ఒక్క పరమేశ్వరుడు తప్పించి సర్వమూ సాపేక్షమైనదే. (అన్యోన్యాశ్రయత్వం కలదే). ఒక్క సర్వేశ్వరుడే పరిపూర్ణుడు (absolute). కాని ప్రతిజీవునికి కేంద్రమై సర్వేశ్వరుడున్నాడు. ప్రతిజీవి తనలో తన పరిపూర్ణత్వాన్ని వహించి ఉన్నాడు.

* * *

ఎంత అయినా ఇది చాలా సూక్ష్మమైన విషయం. అంతర సత్వములో మనము ఏమిటో అదే మనము కావాలి.

మే 18, 1954

"నిన్ను నే నెరుగుదును", అని దైవానికి ఎవ్వరు చెప్పలేరు. అయినాకాని, వారిని తమ లోలోపల వహించే ఉంటారు. దివ్యవాక్కు యొక్క ప్రతిధ్వనిని (echo) తమ నిశ్శబ్దాంతరంగంలో ఆలకించగలరు.

నవంబరు 13, 1954

మనం పురోగమించే కొలదీ అహంకారంనుంచి పరిశుద్ధుల మయేకొలది, దైవంతో మన సన్నిహితత్వము (స్నేహము) అంతకంతకు సుస్పష్టము సచైతన్యము అవుతుంది.

* * *

చైతన్యము, సమచిత్తము, ప్రేమ పెరిగే కొలదీ దైవంతో సన్నిహితత్వం ఎప్పుడూ పెరుగుతూ ఉంటుంది.

* * *

భగవంతుని హింసతో కైవసం చేసుకోలేవు. ప్రేమ సామరస్యాల ద్వారా మాత్రమే ఆయన దరి చేరగలవు.

జూలై 13, 1966.

నిన్ను నీవు దైవార్పణం కావించుకోవటం, దైవాన్ని స్వీకరించి దైవమే కావటం, దైవాన్ని ప్రసారంచేసి వ్యాపింపచేయటం - ఏక కాలంలో ఈ మూడు సంచలనాలతో సమకూడి ఉంటుంది దైవంతో నీ పూర్తి అనుబంధం.

దైవం నీతోనే ఉన్నారు:-

నీవేకాంతంగా లేవనే విషయం నీవెప్పుడు మరువకు, నీతో సహకరిస్తూ, మార్గదర్శకత్వం వహిస్తూ దైవం నీతోనే ఉన్నాడు. నిన్నెప్పుడు భంగపర్చని చెలికాడాయన. సుఖాన్ని, బలాన్ని సమకూర్చే స్నేహితుడు. నీవు మరింతగా ఏకాంతాన్ని అనుభవిస్తూన్నపుడు ఆయన తేజోవంతమైన దివ్య సన్నిధానాన్ని అవగతం చేసుకొనేందుకు మరింతగా సంసిద్ధుడవై ఉంటావు. విశ్వాసం కలిగి ఉండు. సర్వమూ ఆయన నీకు సమకూరుస్తాడు.

సెప్టెంబరు 27, 1951

మనకు కావల్సినదంతా మనం దైవంతోనే పొందుతాము. ఎప్పుడూ

ఏప్రిల్ 17, 1954

దివ్య కాంతిలోనే దర్శిస్తాం. దివ్యజ్ఞానం వల్లనే తెలుసుకుంటాం, దైవేచ్ఛతోనే సాధిస్తాము.

అక్టోబరు 1, 1954

దైవాతిక్రమణలో అంతా అసత్యమే, భ్రమయే. అంతా దుః ఖ కరమైన అస్పష్టతయే. దైవములోనే జీవనము, కాంతి, ఆనందము, ఉన్నత సర్వోత్కృష్ట ప్రశాంతతా దైవములోనే.

అక్టోబరు 2, 1954

మనకు ఉన్నబలం అంతా దైవంలోనే, ఆయనతోనే మన ఆటంకాలన్నిటినీ అధిగమించగలం.

అక్టోబరు 4, 1954

నిశ్చల నిసీధిలో మధుర సంకీర్తనంగా దివ్యనాదం విని పిస్తుంది.

అక్టోబరు 7, 1954

దివ్యవాక్కులు ఓదారుస్తాయి. ఆశీర్వదిస్తాయి, ఉపశమనం కలిగిస్తాయి, వెలుగునిస్తాయి. దైవంయొక్క ఆపన్నహస్తం అనంత విజ్ఞాన భాండారాన్ని దాచి ఉంచిన ముసుగు మడతలను పైకి వైదొలగిస్తుంది.

నవంబరు 18, 1954

దైవం సజీవంగా మనలో ఉన్నదనే భావనలో మనం రాబోయే సంఘటనల కోసం ప్రశాంతతో నిరీక్షిస్తాం. ఆయనను మనలోనే మనం వహించి ఉండటం వల్ల సర్వత్రా ఆయనకు మార్గం సుగమమే.

నవంబరు 24, 1954

వైఫల్యాలను అనంతుని విజయాలుగా దివ్యవైభవం రూపాంతరీకరిస్తుంది. ఆయన ఉజ్వల తేజోమయ కాంతిలో నీలినీడలు మాయమయి పోతవి.

డిశంబరు 9, 1954

దైవ సన్నిధానం మనకు ప్రశాంత శక్తిని, ప్రశాంత కర్మాచరణకు, అన్ని పరిస్థితులలో నిరవధిక ఆనందాన్ని సమకూరుస్తుంది.

డిశంబరు 13, 1954

దైవము దగాచేయని నమ్మకమైన నేస్తము, శక్తి, ఆలంబన, దివ్యమార్గదర్శి. చీకట్లను చెదరకొట్టే దివ్యకాంతి దైవము. విజయాన్ని సుస్థిరపరిచే విజేత.

డిశంబరు 23, 1954

దైవం నుంచి వచ్చే ప్రత్యుత్తర మొక్కటే ఎన్నడూ విఫలంకానిది. దివ్యప్రేమయే ఎప్పుడూ వైఫల్యం లేనిది. దైవమే నీతో సర్వదా ఉండేది. దైవాన్నే ప్రేమించు.

ఆగష్టు 6, 1963

ఏకైక వ్యాపకము, ఏకైక లక్ష్యం, సమైక్య ఆనందము - ఒక్కదైవమే.

* * *

డిశంబర్ 8 1965

స్వీయ ఏకాగ్రత (Concentration upon one self) అంటే శిథిలము, మృత్యువు. దైవం పై ఏకాగ్రత మాత్రమే చైతన్యాన్ని, పెంపుని, సిద్ధిని సమకూరుస్తుంది.

* * *

దైవానికి మాత్రమే చెంది ఉండటం, దైవము కొరకు మాత్రమే పనిచేయటం, అన్నిటికీ మించి దైవం నుంచి మాత్రమే బలం, శాంతి, సంతృప్తి అపేక్షించటం - ఆదర్శవంతమైన దృక్పథం.

దైవము సర్వదయామయుడు. లక్ష్యసాధనకు మనకు కావల్సినదంతా సమకూరుస్తాడు. వీలైనంత వేగంగా మనలను లక్ష్యమునకు నడిపిస్తాడు.

సమస్త ఆలోచనలు, భావాలు, క్రియలు, ఆశలు - అన్నీ, - పరమేశ్వరుని దిశగా మరల్ప బడుగాక. ఆయన పైననే కేంద్రీకరింపబడుగాక. ఆయన మాత్రమే మనకు రక్ష సహకారము.

* * *

నది సముద్రము వైపునకే సాగిపోవునటుల మన ఆలోచనలు, మనో భావనలు - అన్నీ దైవము వైపుగానే మరలి ముందుకు సాగిపోతవి.

- శ్రీమాత

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

సవరణ

అక్టోబర్ సంచికలో (పేజి 30)లో ఈక్రింది విధంగా సవరణ చేయబడినది

సర్వసృష్టి ఆయనతో పలుకుతుంది దైవం గురించి హృదయాంతరంగంలో దానినెలా ఆలకించాలో ఆయనకుతెలుసుకు

బదులుగా

సర్వసృష్టి దైవం గురించి పలుకుతుంది - తన హృదయాంత రంగంలో దానినెలా ఆలకించాలో తెలిసినవారికి

సమాచార పత్రం

లక్నో (యు.పి.): బ్రాంచివారు ఆగష్టు 7న, ఒక కార్యక్రమమును ఏర్పాటు చేయగా దానికి ముఖ్య అతిథిగా, డా॥ శంభూనాధ్ విచ్చేసి శ్రీమాతారవిందుల జీవితాలను గురించి ప్రసంగించారు. ఇందులో ఇంకా శ్రీ జె.పి. తివారి, శ్రీ పి యం. సక్సేనా, శ్రీయస్.పి.శర్మ మరియు డా॥ అఖిలేష్ గూడా పాల్గొనిరి.

డెహ్రాడన్ (ఉత్తరాఖండ్): శ్రీ కె.పావన్ (పాటియాలా బ్రాంచి) 'ఆత్మవికాసం' అన్న అంశంపై విద్యార్థులకు (ది. 26.7.2008న) చక్కని అవగాహన కల్గించారు. అంతేగాక 26 మరియు 27 తేదీలలో 'సావిత్రి' గురించి ప్రసంగించి సదస్సులను, ఎంతగానో అలరించారు.

కడలూరు (తమిళనాడు): 17 ఆగష్టు 2008న తమకేంద్రం యొక్క 6వ వార్షికోత్సవమును జరుపుకున్నారు. శ్రీ పి. గోపాలకృష్ణన్ తమ కేంద్రం చేపట్టిన వివిధ కార్యక్రమాలను గురించి వివరించారు. పుదుచ్చేరి శ్రీఅరవింద సొసైటి నుండి విచ్చేసిన శ్రీమతి సుశీల మెల్వానీ, శ్రీ యమ్.యన్. సుందరరాజన్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ కేంద్రంవారికి చక్కని మార్గనిర్దేశం చేసినారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక పుష్పప్రదర్శన మరియు ఫోటోల ప్రదర్శన ఏర్పాటు చేయగా సభ్యులందరు ఎంతో ఆసక్తిగా తిలకించినారు.

విశాఖపట్నం (ఆ.ప్ర.) : కేంద్రంవారు శ్రీఅరవిందాశ్రమం ప్రొ॥ కిట్టూరెడ్డి గారితో 30 మరియు 31 జులై 2008న రెండు రోజులు ప్రసంగములు ఏర్పాటు చేసినారు. ఇందులో పాల్గొన్నవారు అనేక ప్రశ్నలు వేయగా శ్రీ కిట్టూరెడ్డి వారికి సముచిత సమాధానములు ఇచ్చి సంతుష్టులను చేసినారు. ఇవిగాక మరి రెండు ప్రసంగములను ఆలిండియా రేడియో విశాఖ పట్నం కేంద్రంవారు ప్రసారం చేసినారు. "శ్రీఅరవిందులు - భారత స్వాతంత్రోద్యమం" మరియు "శ్రీఅరవిందుల భారత దర్శనము" అను అంశములపై బహిరంగ ఉపన్యాసములు గూడా ఏర్పాటు చేయబడినవి. ఈ కార్యక్రమాలలో డాక్టర్ వై. పార్థసారథి, ఆచార్య శ్రీ కె.వి. రమణ, శ్రీ టి.వి. రమణరావు, డా॥ డి. వెంకటేశ్వరరావు, శ్రీ కె. కోటిరెడ్డి, శ్రీ కె. అప్పారావు ప్రభృతులు పాల్గొనిరి.

ఇవిగాక నైవెలీ (తమిళనాడు) సోనాపూర్ (పశ్చిమ బెంగాల్) రాయచూర్ (కర్నాటక) భూపాల్ (మ.ప్ర.) తదితర కేంద్రాలలో ఆసక్తికరమైన కార్యక్రమాలు జరిగినట్లు వార్తలు అందినవి.

Rs. 15/-

అఖిల

అఖిల భారత పత్రిక

డిసెంబరు ౨౦౦౮

పదార్థము పరార్థము నావిష్కరించును



- శ్రీమాతారవిందుల వాక్కులు

అఖిల

భారత పత్రిక - డిసెంబరు 2008

పదార్థము పరార్థము నావిష్కరించును.


విషయసూచిక

శ్రీఅరవిందులకు మనం అర్పించే అత్యుత్తమ నివాళి ఏమంటే
(ఆధ్యాత్మిక) ప్రగతిపట్ల పిపాస కలిగి ఉండటం, ఇంకా,
దివ్యప్రభావానికి సత్వమునంతటినీ ఉన్మీలనం కావించి
ఉంచటం. అందుకు ఈ భూమిపై అవతరించిన దివ్య
సందేశకులు వారు.

- శ్రీమాత



MAHA SAMAHI



DECEMBER 9,1950,
TO THEE WHO HAST BEEN THE MATERIAL ENVELOPE OF OUR MASTER, TO THEE OUR INFINITE GRATITUDE, BEFORE THEE WHO HAST DONE SO MUCH FOR US, WHO HAST WORKED, STRUGGLED, SUFFERED, HOPED, ENDURED SO MUCH, BEFORE THEE WHO HAST WILLED ALL, ATTEMPTED ALL, PREPARED, ACHIEVED ALL FOR US, BEFORE THEE WE BOW DOWN AND IMPLORE THAT WE MAY NEVER FORGET EVEN FOR A MOMENT, ALL WE OWE TO THEE.

శ్రీఅరవిందుల మహాసమాధి

[“తమ రూపాంతరీకరణ కార్యక్రమమును మరింత పరిపూర్ణంగా క్రియానిత్యం చేయుటకై”1950 డిసెంబరు 5వ తేదీన శ్రీఅరవిందులు తమ భౌతిక దేహమును త్యజించినారు. ఆశ్రమ ప్రాంగణంలో 9వ తేదీన వారి పార్థివ దేహము సమాధిలో నిక్షిప్తం చేయబడింది. ఈ సందర్భంగా డిసెంబరు 7వ తేదీన శ్రీమాత ఇచ్చిన సందేశం.]

“ప్రభూ! మీరు తలపెట్టిన కార్యము పూర్తిగా సాధించబడు వరకు, మాకు మార్గనిర్దేశము చేయుచు మమ్ముల ప్రభావితం చేయుచు, మీ చేతనా పరంగానే గాక, క్రియాశీలమైన మీ సాన్నిధ్యశ్రీలను ప్రసరించుచూ, మా మధ్యనే ఉందుమని స్పష్టముగా ఈ ఉదయము వాగ్దానము చేసియున్నారు. మీరు సర్వశక్తులతోనూ మా మధ్యనే ఇక్కడనే ఉపస్థితులమై ఉందుమనియు, ఈ పృథ్వి రూపాంతరీకరణము పూర్తియగు వరకూ మమ్ము విడిచిపోమనియూ ఏమాత్రం సందేహమునకు ఆస్కారంలేని విధంగా మాకు ఆశ్వాసన(Promised) మిచ్చియున్నారు. ఈ మహాద్భుతమైన మీ సాన్నిధ్యమునకు మేము అన్ని విధముల అర్హులమగునట్లుగానూ, ఇకముందు కూడా మీరు తలపెట్టిన మహాకార్యములో పాల్గొనుటకై మా సర్వస్వమూ అంకితము చేయునట్లుగానూ మమ్ము అనుగ్రహింతురు గాక!

(శ్రీమాత)

7 డిసెంబరు 1950

* * *

శ్రీమాత సందేశములు

ప్రతి అవతారం శాశ్వతత్వ సంస్థాపనలో పరిపూర్ణమైన సిద్ధికోసం పిలుపునిచ్చి ఆ వైపుగా దిశానిర్దేశం చేసేందుకే వస్తుంది. అయితే ప్రతి అవతారానికి ఎదురుగా అంతకు ముందటి అవతారాన్ని దేవతామూర్తిగా

నిలబెట్టి ప్రత్యర్థిగా చూపే అలవాటు మానవులకు ఎప్పుడూ ఉంటూనే ఉంది. అలాగే ఇప్పుడు శ్రీఅరవిందులు భవిష్యత్తులో పొందవలసిన సిద్ధిని గురించి ప్రపంచాన్ని జాగృతం చేసేందుకు వచ్చినారు. ఎప్పటిలాగే వారి సందేశముగూడా అంతకుముందు సందేశాల వలెనే వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. కాని సత్యం ఏమిటి అనేది భవిష్యత్తులో ఋజువు అవుతుంది. వారు తలపెట్టిన మహాకార్యం నెరవేరి తీరుతుంది.

- శ్రీమాత

21.02.1957

* * *

శ్రీఅరవిందులు రేపటి ఆవిష్కరణ గురించి, నూతన జాతిని గురించి, రేపటి నూతన ప్రపంచాన్ని గురించి, అతిమానసం గురించి పిలుపునిచ్చేందుకు ఆ పరాత్పరుని నుండి దిగివచ్చినారు. మనం దానికోసం నిజాయితితో సముల్లాసంగా సంసిద్ధులమ గుదముగాక!

శ్రీమాత

15.08.1972

* * *

శ్రీఅరవిందులు భవిష్యత్తుకు చెందినవారు. భవిష్యత్తుకు చెందిన సందేశమును గొనివచ్చినారు. మనం శీఘ్రముగా దైవం నిర్దేశించిన ఆ ఆనందకరమైన భవిష్యత్తు వైపుగా సాగిపోయేందుకు ఇంకా దిశానిర్దేశం చేస్తూనే ఉన్నారు.

శ్రీమాత

* * *

వారి సందేశములను బాగా అర్థం చేసుకొనుటకు దానిని ఆచరించడం ఒక్కటే! వారు ఎంతో ఉదారంగా భూమిపైకి వర్షించిన వెలుగు, జ్ఞానం మరియు శక్తిపట్ల మన కృతజ్ఞత చూపేందుకు అదే ఉత్తమోత్తమ మార్గమవుతుంది.

శ్రీమాత

అఖిల భారత పత్రిక, డిసెంబర్ 2008

ఇది గర్వాన్ని, ఆడంబరాన్ని, రాజసికమైన ప్రాణిక మనసును, గాఢవాంఛని, మనలో ప్రేరేపిస్తుంది. దానిని అధిగమించి జయించలేకపోతే ఆధ్యాత్మిక పతనానికి దారితీస్తుంది. తప్పు ఇది ఎందుకని అంటే ఇది అహంకార పూరితమైన భావన. అతి మానస పరిణామానికి మొదటి షరతు అహంకార నిర్మూలనం. క్రియాశీల స్వభావం కలిగిన, చురుకైన ఇచ్ఛాశక్తి కలిగిన వ్యక్తి యొక్క కర్మలు చాల సులువుగా అధికార వ్యామోహం దిశగా పయనింపచేస్తాయి. అందుకే ఇది చాల ప్రమాద భరితం. అతిమానస పరిణామ దశలో శక్తి, అధికారం ఎటూరాక తప్పదు. పరిపూర్ణ కర్మనిర్వహణకిది కావాల్సినది. కాని వచ్చేది దివ్యశక్తి, స్వభావాన్ని, జీవనాన్ని, వశపర్చుకుంటుంది. పనిచేసే ఏకైకుని యొక్క శక్తి The power of the One through the spiritual individual. ఆధ్యాత్మిక వ్యక్తి ద్వారా. ఇదేమీ వ్యక్తిగత హోదాని, వ్యక్తిగత శక్తిని పెంచుకోవటానికి కాదు. అంతిమ సార్వభౌమాధికత్వమును సాధించికోవటమూ కాదు. మానసిక, ప్రాణిక అహంకార పూరిత వేర్పాటు ధోరణి పెంచుకో వటమూ కాదు. ఆత్మ సాధన Self-fulfilment ఈ యోగ సాధన ఫలితం - వ్యక్తిగత ఔన్నత్యాన్ని పెంచుకోవటం లక్ష్యం కానేకాదు.

6. ఏకైక ప్రయోజనం దైవముతో సమైక్యత:

ఒకే ఒక లక్ష్యం ఆధ్యాత్మిక పరిపూర్ణత. నిజ అంతరాత్మను తెలుసుకోవటం. దివ్యచేతన నావహింపచేసుకొని దివ్య స్వభావం కలిగిఉంటూ, దైవంతో సమైక్యత. మిగిలినదంతా దానికి సంబంధించిన విధివిధాన వివరమును సంవిధానపర్చే పరిస్థితి. అహంకార పూరిత సంవేదనలు, కామనలు, పేరు ప్రఖ్యాతల కోసం వ్యామోహం పంతం నెగ్గించుకోవాలనే మొండిపట్లు,- ఇవి. ఉన్నత తర చేతనకివి విరుద్ధాలు. అతిమానస పరివర్తన అల్లంత దూరంలోకూడా చూచే అవకాశం ఉండదు. అధిగమించలేని ఆటంకాలే అవుతాయి ఇవన్నీ. ఉన్నతరమైన సత్వాన్ని పొందటానికి అల్పమైన నిమ్న సత్వాన్ని వదులుకోవాలి. ఒకే ఒక శ్రేష్ఠమైప్రేరణ. అదే దైవంతో సంలీనం. అంతే. స్వీయ సత్వముయొక్క సత్యాన్వేషణ - ఆ ఉన్నతతర చేతనలో, సత్యజీవనంలో, స్వభావ పరిపూర్ణత - ఇవి ఆ చాలనం యొక్క సహజ సిద్ధిమైన పరిణామాలు. పరిపూర్ణ లక్ష్యసిద్ధికి అత్యావశ్యకమైన షరతులు. అది కేంద్రలక్ష్యసాధనలో అంతర్భాగం. ఎందుకంటే మరి అదే అవసరమైన పురోగతి, ప్రముఖమైన పరిణామ పర్యవసానము కూడా.

7. అతిమానస పరివర్తన మాత్రమే అంతిమము పరమము అయినస్థాయి:

ఇది మనసులో తప్పక ఉంచుకోవాలి. అతిమానస పరి వర్తనము కష్టము. సుదీర్ఘము. పరమము. ఇది సుదూర చిట్టచివరి ప్రస్థానంగా పరిగణించాలి. అంతేకాని తొలి లక్ష్యంగా కాదు. నిరంతరము దృష్టిపథంలో ఉండవలసినది. ఎన్నో సుదీర్ఘ క్లిష్టపరీక్షా స్థాయిలనంతరం, స్వభావంలో చోటు చేసుకున్న కష్ట సాధ్యమైన స్వీయ ఆత్మవికాసానంతరం మాత్రమే ఈ సంభావ్యత దృగ్గోచర మవుతుంది.

- శ్రీఅరవిందులు

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

రూపాంతరీకరణానికి సోపానాలు

సాధకుడు ముందుగా యోగికి ఉండవలసిన అంతఃచేతనను సాధించాలి. దానిని, తనలో సహజంగా నెలకొని ఉన్న భావనల, మరియు దృక్పథాల స్థానంలో పునఃస్థాపించాలి. ఈ విధంగా తన వర్తమాన సత్వనిర్మాణ శైలిలో విప్లవాత్మకంగా మార్పులు తీసికొని రావాలి. తరువాత ఈ ఆధ్యాత్మిక చేతన సహాయంతో ఇంకా లోతులలోనికి వెళ్ళి మరుగు పడియున్న చైత్యపురుష అస్తిత్వాన్ని గుర్తించి దాని వెలుగు అజమాయిషీలలో బాహ్యేంద్రియాలను అంతరంగాన్ని చైతన్యమయం గావించాలి. దైహిక, మానసిక తత్వాలను, వాటి కార్యకలాపాలను, అభిరుచులను, ఆత్మను అభివ్యక్తీకరించగల పనిముట్లుగా మార్చాలి. దానితోపాటుగా వ్యక్తి యొక్క సత్తను, భగవంతుని దివ్య తేజము, శక్తి, పరిశుద్ధతలతోను, స్వేచ్ఛా విస్తృతులతో పరిపూర్ణం గావించాలి. వ్యక్తికి సహజంగా వుండే దైహిక, మానసిక అవధులను అధిగమించి. అహంకారాన్ని విడిపోయేటట్లుచేసి, విశ్వచేతనలో ప్రవేశించాలి. ఆత్మను సాక్షాత్కరింప జేసుకోవాలి. ఆధ్యాత్మికతతో నిండిన మనో హృదయ జీవశక్తులను, భౌతిక చేతనను సాధించాలి. అప్పుడు మాత్రమే అతిమానసం యొక్క మార్గంలో ప్రవేశించే అవకాశం ఉంటుంది. దాని తర్వాత వచ్చేది మాత్రం ఒక కష్టతరమైన ఆరోహణక్రమం. అందులో ప్రతిమజిలీ కష్టసాధ్యమైనదే! చైతన్యంతో త్వరత్వరగా పరిణామం చెందటమే యోగం.

ఈ పరిణామం ఎంత త్వరగా జరిగినా సరే - అంటే ఒక శతాబ్దం, ఒక సహస్రాబ్దం, లేదా అనేక వందల జన్మలలో సాధించ గలిగేది ఒక్క జన్మలో

సాధించగలిగినా - ఈ పరిణామక్రమం దశలు మాత్రం తప్పవు. ఎంత వేగవంతంగా జరిగినా, ఎంత చైతన్యంతో కొనసాగినా, ఈ దశలను (మజిలీలను) పరిహరించటం సాధ్యంకాదు. చివరి దశను ముందుకు తీసికొని రావటం వీలుపడదు. ఈ క్రమాన్ని తప్పించటం కూడా కుదరదు.

అతి తొందరపాటు వలన కొందరు సాధకులు అతిమానసాన్ని అత్యంత చేరువలో సాధించాలని తాపత్రయ పడతారు. ఏ కొంకి కర్రతోనో దాన్ని ఉన్నత స్థానం నుండి క్రిందకులాగ ప్రయత్నిస్తారు. ఇది అర్థంలేని ఆశ మాత్రమే కాదు. ప్రమాదకరం కూడా!

- శ్రీఅరవిందులు

అనువాదం : కె.ఆర్.యల్. నరశింహరావు

మొదట అంతర్గతమైన యోగచైతన్యాన్ని సముపార్జించాలి.

మనిషిలో ఎప్పుడూ రెండు విభిన్నమైన చైతన్యాలుంటాయి. ఒకటి బహిర్గత చైతన్యం, దీనిలోనే మనిషి సాధారణంగా జీవిస్తూ ఉంటాడు. రెండవది అంతర్గతమైనది. గుప్తరూపంలో ఉంటుంది. తాను 'సాధన' చేస్తున్నపుడు ఈ అంతర్గత చైతన్యం వికసించడం మొదలు పెడుతుంది. అప్పుడు సాధకుడు అంతరంగంలోకి ప్రవేశించగల్గి అచ్చట వివిధ రకాలైన అనుభవాలను పొందుతాడు. తన సాధన వృద్ధి చెందుతున్న కొద్దీ అతడు తన అంతరంగంలోనే అధికాధికంగా ఉండటం మొదలు పెడతాడు. ఇలా లోపలిగా ఉంటున్న కొద్దీ ఈ బాహ్యమంతా పైపైదిగా తోస్తుంది. కానీ మొదట్లో ఈ అంతర్గత చైతన్యం ఏదో కలలాగా, బాహ్యచైతన్యం చూస్తే మెలకువలోని వాస్తవంలాగా అనిపిస్తుంది. తరువాత మెల్లగా అంతర్గత చైతన్యమే నిజమైనదిగా, ఈ బాహ్యం (చాలామందికి) ఒక స్వప్నంలాగా, భ్రాంతిలాగా, పూర్తిగా బయటిదిగా కనిపిస్తుంది. ఈ అంతర్గత చైతన్యం నిగూఢ ప్రశాంతతకు వెలుగుకూ, ఆనందానికి, ప్రేమకు, దైవంలో పూర్తి సాన్నిహిత్యానికి లేదా దివ్యసాన్నిధ్యానికి, దివ్యమాతకు నివాసంగా తయారవడం మొదలు పెడుతుంది. అలా అతడు రెండు చైతన్యాలను తెల్సుకొంటాడు. బాహ్య చైతన్యం దానికి ప్రతిరూపమైన అంతర్గత చైతన్యంగా, ఉపకరణంగా మార్పు చెందాలి. పరిపూర్ణమైన శాంతిగా, ప్రకాశంగా, దైవంతో మమేక మయ్యేదిగా అయిపోవాలి.

- శ్రీఅరవిందులు

అనువాదం : హర్షవర్థన్

తరువాత - నీలో తెరమరుగైవున్న చైత్యపురుషుని ఆవిష్కరించుకోవాలి

మనలోని చైత్యాంశ దైవంతో సదాసంపర్కం కలిగివుంటూ సరాసరి దైవం నుండి అవతరించింది. దివ్యమైన సంభావ్యతలతో గర్భితమైవున్న కేంద్రం ఇది. మనఃప్రాణ దేహాల ఈ నిమ్న త్రివిధ అభివ్యక్తికిదే ఆధారం. సమస్త జీవులలోనూ ఈ దివ్యాంశ వున్నది. కాని ఈ జీవుల సాధారణ చేతన వెనుక దాగివుంది. ఇది మొదట్లోనే అభివృద్ధి చెందివుండదు. ఒకవేళ అభివృద్ధి చెందివున్నప్పటికీ, ఎప్పుడూ లేక తరచుగా ముందుకొచ్చి వుండదు. ఉపకరణాల అపరిపూర్ణ సాధనాలద్వారా, వాటి పరిమితులకు లోబడి అవి అనుమతించి నంతవరకు, అది తనను వ్యక్తపరచుకొంటుంది. భగవంతుని వైపుసాగే చేతనానుభవం ద్వారా మనలో ఒక ఉన్నత తర కదలిక జరిగిన ప్రతిసారీ బలం పుంజుకొంటూ అదివృద్ధి చెందుతూంటుంది.

* * *

ఆంతరిక ఏకాగ్రతను సాధించడానికి గల మార్గాలు:

1. దివ్యమాతను గురించిన భావంమీద, రూపం లేదా నామం మీద, ఏది నీకు తేలిక అనిపిస్తుందో, దానిమీద నీచేతనను హృదయంలో స్థిరంగా నిలపాలి.

2. హృదయంలో ఈ ఏకాగ్రత ద్వారా క్రమంగా, అధికాధికంగా మనస్సును ప్రశాంత పరచుకోవాలి.

3. హృదయంలో దివ్యమాత సన్నిధికై, ఆకాంక్ష నిలుపుకొంటూ, తద్వారా మనస్సు, జీవితం, కర్మలను నియంత్రించుకోవాలి.

కాని మనస్సును ప్రశాంతపరచి, ఆధ్యాత్మిక అనుభవాన్ని పొందడానికి ముందుగా వ్యష్టి ప్రకృతిని తప్పని సరిగా పరిశుద్ధం చేసి సన్నద్ధం చేయాలి.

- శ్రీఅరవిందులు

దైవం కొరకు ఆకాంక్ష - ఇది ప్రప్రథమ ఆవశ్యకత. ఆ ఆకాంక్షను పెంచి పోషించుకొంటూ, అది సదాజాగృతమై వుండేట్లు, సజీవంగా ఉండేట్లు చూడాలి. దానికోసం ఏకాగ్రత కావాలి. దైవసంకల్పం, దైవకార్యానికి ఒక సమగ్ర నిరపేక్ష సమర్పణను దృష్టిలో వుంచుకొన్న ఏకాగ్రత కావాలి.

హృదయంలో ఏకాగ్రత నిలుపుకోవాలి. హృదయంలోనికి ప్రవేశించి లోలోపలికి, నీవు ఎంతగా వెళ్ళగలిగితే అంతగా చాలా లోతుకు, చాలా దూరం

వెళ్ళు. ఇతర చోట్లకు విస్తరించుకొన్న నీ చేతన సూత్రాలను ఒక్కచోటికి చేర్చు, వాటన్నింటినీ చుట్టచుట్టి నీతోపాటు తీసుకొని ఒక్కదూకుదూకి లోతుకు మునిగిపో.

హృదయంలోని ప్రగాఢ ప్రశాంతిలో ఒక అగ్ని ప్రజ్వరిల్లుతోంది. అదే నీలోని దివ్యాంశ-నీయదార్థ సత్త లేక అస్తిత్వం. దాని గొంతు విను, దాని ఆదేశాలను పాటించు.

* * *

(చైత్యాంశ) ఆవిష్కారం వ్యక్తిగత విషయం. ఆ గమ్యాన్ని చేరడానికి తీవ్రమైన పట్టుదల, దృఢసంకల్పం, అకుంఠిత దీక్ష తప్పనిసరి. ప్రతి వ్యక్తీ-చెప్పాలంటే-తనకు ఎదురయ్యే యిబ్బందుల ద్వారా తన మార్గాన్ని తానే వెతుక్కోవాలి. గమ్యాన్ని గూర్చి కొంత అదివరకే తెలిసి వుంది, ఎలాగంటే గమ్యాన్ని చేరిన వారిలో చాలా మంది కొంచెం అటూ యిటూగా దాన్ని గురించి అది వరకే వర్ణించి వున్నారు. అప్రయత్నంగా, నిష్కల్మషంగా అది లభించి నపుడు ఆ ఆవిష్కారం మహోన్నత విలువ గలదవుతుంది. కాని అది సాధారణ మానసిక ధర్మాలన్నింటి నుండి తప్పించు కొంటుంది....

నీకు గల మానసిక అవగాహనతో, నీవు మాట్లాడే భాషతో, నీవు జీవిస్తున్న పరిసరాలకు సంబంధించిన అలవాట్లు, ఆచారాలతో నీవు జన్మించిన దేశం లేదా నీవున్న కాలంతో సంబంధం లేనిదై, నీ శరీరం, జీవన పరిస్థితుల మీద ఆధారపడక నీలో స్వేచ్ఛ కలిగి వున్న దానిని తెలుసుకోవడంగా అది ప్రారంభమౌతుంది. నీ అస్తిత్వ పులోతులలో ఒక అర్థంలో విశ్వజనీనత, అపరిమిత వికాసం, నిరవధిక కొనసాగింపు దేనియందున్నాయో దానిని కనిపెట్టాలి.

కాని నేనిత: పూర్వమే చెప్పినట్లు ఆ ఆవిష్కారానికి గల మార్గం చాలా దీర్ఘమైనది, కష్ట భూయిష్టమైనది, పరిష్కరించవ లసిన అనేక వ్యూహాలు, సమస్యలతో నిండి వుంది, దాన్ని సాధిం చాలంటే నీలో వెనకడుగు వేయని తీవ్ర నిర్ణయం వుండాలి.

ఒక గొప్ప ఆవిష్కారం జరిగే తెలియని క్షేత్రం కోసం, కీకా రణ్యం మధ్యగా సాగే ఒక అన్వేషకుని యొక్క కంటక మార్గం లాంటిది అది. నూతన ఖండాలను

కనుగొనేందుకు ఎంత ఓర్పు, ధైర్య స్థైర్యాలు అవుసరమౌతాయో కనీసం ఆ మాత్రమైనా అవి అవుసర మైయ్యేంత గొప్పది చైత్యపురుష ఆవిష్కారం. దానిని సాధిం చాలని తీర్మానించుకొన్న వ్యక్తికి, కొన్ని తేలికపాటి సలహాలు ఉపయోగ పడవచ్చు.

మొట్ట మొదటిది అన్నింటికంటే అతి ముఖ్యమైన విష యమేమిటంటే, మనస్సుకు ఆధ్యాత్మిక విషయాల మీద తీర్పు చెప్పగల సామర్థ్యం లేదు అనేది గ్రహించాలి. ఈ విషయాన్ని గురించి వ్రాసిన వారందరూ అలాగే అన్నారు. కాని దాన్ని ఆచరి ంచిన వాళ్ళు చాలా తక్కువే అని చెప్పాలి. అయినప్పటికీ ఆ మార్గం మీద ముందుకు పోవడానికి, ఏవిధమైన మనోభావాలను రూపొందించుకోవడంగాని, ప్రతిచర్యలకు పూనుకొనడంగాని చేయగూడదు, ఇది తప్పనిసరి.

వ్యక్తిగత సుఖ సంతోషాలకు, సంతృప్తికి, భోగానుభవానికి, వెంపర్లాడడం మానుకోవాలి. అభివృద్ధి కోసం మాత్రమే జ్వలించే అగ్నిలా జీవించాలి, నీ అభివృద్ధికి సాయపడే దేన్నైనా సరే స్వీకరించి, దానితో కావలసిన అభివృద్ధిని వెనువెంటనే సాధించుకోవాలి.

నీవు చేసే ప్రతి పనిలో సంతోషం పొందడానికి ప్రయత్ని ంచు, కాని దేన్నీ సంతోషం కోసం చేయవద్దు.

ఉద్రేకపడొద్దు. క్షోభ్యం గాని, కలత గాని చెందవద్దు. ఎటు వంటి పరిస్థితులెదురైనా ఎంతో ప్రశాంతంగా వుండు. ఇదంతా చేస్తూ, ఇంకా సాధించివలసిన అభివృద్ధి ఏమున్నదా అని జాగ్రత్తగా గమనిస్తూ వుండి, కాలం వృధా చేయకుండా వెంటనే సాధించు. భౌతిక సంఘటనల్లో, పైకి కన్పించేదే యదార్థమని భావించొద్దు. ఎల్లప్పుడూ దేన్నో వ్యక్త పరచడానికి జరిగే అస్పష్ట ప్రయత్నాలే అవన్నీ. అసలు సత్యమెప్పడూ మన, పైపై అవగాహన కందకుండా తప్పించుకు పోతూనే వుంటుంది.

ఇతరుల ప్రవర్తనకు కారణమైన వారి స్వభావంలో మార్పు తీసుకురాగల శక్తి నీకుంటే తప్ప ఇతరుల గురించి చెడుగా మాట్లాడకు. ఒక వేళ నీకా సామర్థ్యం వుంటే వారిని మార్చు, అంతేగాని పితూరీ చేయకు.

నీవేంచేస్తున్నా, నీముందు లక్ష్యంగా పెట్టుకొన్న నీ గమ్యాన్ని మరవొద్దు. ఈ మహనీయ సాక్షాత్కారాన్ని సాధించడానికి నీవొక సారి పూనుకొన్న తర్వాత,

నీచమూ, ఉచ్ఛమూ అనేదేదీ వుండదు. నీ లక్ష్యసాధన, వేగంగానో, ఆలస్యంగానో జరిగేట్లు చేయడంలో అన్నీ సమాన ప్రాముఖ్యతగలవే.

ఆ మహా సాక్షాత్కారానికై నీవు చేసే కృషికి ఒక దృఢమైన ఆధారంగా నీదేహం నిలబడ్డానికి కావలసిన ద్రవ్యాన్ని అందించేం దుకు, నీవు తీసుకోబోయే ఆహారం ఉపయోగపడాలనీ, ఈ కృషికి అవుసరమైన స్థైర్యానికి, దృఢ దీక్షకు తగిన శక్తిని అందించాలనే ఆకాంక్షతో నీవు భుజించ బోయే ముందు కొద్ది సెకన్ల పాటు ఆహారం మీద ధ్యానించు.

శక్తిని కోల్పోయిన నీ నరాలకు తిరిగి శక్తినివ్వాలని, మే లుకొన్న తర్వాత నూతన జవ సత్త్వాలతో, ఈ మహా సాక్షాత్కార లబ్ధి కై తిరిగి సాగించే నీ పయనానికి కావలసిన స్థిర శాంతులు నీ మస్తిష్కానికి లభించేలా ఆకాంక్షిస్తూ కొద్ది క్షణాలు నిద్రకుపక్రమి ంచే ముందు ధ్యానించు.

ఈ మహాసాక్షాత్కార లబ్ధికై నీవు ముందుకు పోవడానికి నీవు చేసేపని సాయపడాలని లేదా కనీసం ఆటంకం కలిగించ కుండా వుండాలని, నీవు పనికుపక్రమించే ముందు ధ్యానించు.

నీవు మాట్లాడ బోయే ముందు, పలికే మాటలనొక్కసారి మననం చేసుకొని పరీక్షించుకొని, తప్పనిసరిగా పలుకవలసిన అవసరమున్న వాటినే పలుకు. ఈ మహాసాక్షాత్కారాన్ని సాధించే మార్గంపై నీ అభివృద్ధికేవిధమైన అపకారం కలిగించని వాటిని మాత్రమే బయటపెట్టు.

మొత్తం మీద నీ జీవన లక్ష్యాన్ని, నీ జీవన కార్యాన్ని ఎప్పడూ మరచి పోవద్దు. నీవు పొందవలసిన మహాసాక్షాత్కారాన్ని సాధించాలనే సంకల్పంతోనే సదా జీవిస్తూండాలి. నీ అస్తిత్వం యొక్క సమస్త కదలికలనీ అతిశయించి వుండి నిన్ను గమనిస్తూ నీపైన వుండే తేజోరాశియైన ఒక విహంగంలా, నీవేంచేస్తున్నా, నీవేమై వున్నావోదానంతట్నీ గమనిస్తుండే సంకల్పాన్ని నిలిపి వుంచుకోవాలి.

అవిశ్రాంతంగా పట్టుదలతో సాగే నీ కృషి ముందు నిలు వలేక అంతరంగంలో ఒక ద్వారం ఆకస్మికంగా తెరచుకొంటుంది. అమృతత్వాన్నందుకొన్నట్లు అనుభూతి కలిగించే, కళ్ళు మిరుమిట్లు గొలిపే, నీవదివరకే నివసించి వుండిన, సదా నివసించబోయే వైభవంలోనికి

ప్రవేశిస్తావు. నశించేది బాహ్య రూపాలు మాత్రమే. యదార్థంగా నీవేమిటో దానితో పోలిస్తే ఈ రూపాలు విడిచి వేయబడే జీర్ణ వస్త్రాల్లాంటివనే ఘనిష్ఠ అనుభవం నీకు కలుగుతుంది. ఆ వైభవం నీకు అమృతత్వం తప్పక లభిస్తుందనే అనుభూతిని కలిగిస్తుంది.

సమస్త బంధనాలనుండి స్వేచ్ఛ పొంది నిటారుగా తలె త్తుకొని నిలబడతావు. విశ్వ ప్రకృతిచే నీపై విధించబడిన పరిస్థితుల భారం క్రిందపడి నలిగిపోకుండా, దానిని సహించి, భరిస్తూ, ఎంతో శ్రమిస్తూ ముందుకు సాగడానికీ బదులు, తిన్నగా, స్థిరంగా, నీ భవిష్యత్తు నెరిగిన ఈ జీవితాన్ని నీ స్వాధీనంలో ఉంచుకొని సాగి పోగలుగుతావు.

అయినప్పటికీ, సర్వవిధ దేహ బానిసత్వంనుండి విడుదల, సర్వవిధ వ్యక్తిగత రాగబంధాల నుండి విముక్తి, చరమ మహోన్నత సాక్షాత్కారంకాదు. నీవు శిఖరానికి చేరుకొనే ముందు ఎక్కవలసిన ఇతర మెట్లున్నాయి. ఈ దశలననుసరిస్తూ భవిష్యత్తులో, భవిష్యత్తువైపు ద్వారాలను తెరచే, తెరువగల ఇతరమైన దశలున్నాయి.

- దివ్యమాత

అనువాదం - కె.వి. రావు

చైత్యీకరణ - ఆధ్యాత్మీకరణ - ఏకకాల సంభావ్యములా?

చైత్యీకరణానికి ఆధ్యాత్మీకరణానికి మధ్య తేడా వుంది. ఆధ్యాత్మీకరణ పైనుండి అవతరించే పరివర్తన. చైత్యీకరణ వ్యక్తి లోపల నుండి మన : ప్రాణ శరీరాలపై చైత్య పురుష, ఆధిపత్యం వహిస్తూ కలిగించే చైత్య పరివర్తన.

* * *

తొలుత చైత్యపురుష పరివర్తన కలగాలి. మన వర్తమాన స్వభావం అంతా ఆత్మ ఉపకరణంగా మారాలి. దానిపైన లేదా దానితో పాటే ఆధ్యాత్మిక పరివర్తన సాగాలి. అంటే మన సత్తా సర్వత్రా ఉన్నత దివ్యకాంతి దివ్యజ్ఞానము, దివ్యఆనందం, దివ్యపరిశుద్ధత అవతరించాలి. ఆ అవతరణం మన జీవిత నిమ్న భూమికల్లో, మన దేహంలో, మన అవచేతన యొక్క అంధకారంలో సైతము జరగాలి. చివరగా అతిమానస పరివర్తనా ప్రభవం జరగాలి. దీనితో బాటు అతిమానసంలోనికి అధోభూమికల చేతన యొక్క ఆరోహణ పూర్తిగా జరగాలి. ఆ తర్వాత మన సత్తా స్వభావాలలోనికి అంతా కూడ అతిమానస చేతన రూపాంతరీకరణ కార్య అవతరణం జరగాలి.

* * *

హృదయ కేంద్రంలోని ఏకాగ్రతా శక్తి ఆ కేంద్రాన్ని తెరవాలి. ఆకాంక్ష, ప్రేమ,భక్తి, సమర్పణల శక్తి ద్వారా చైత్యాత్మను కప్పి ఉంచి నట్టి తెరను తొలగించాలి. తొలగించి ఆ చైత్యాత్మ మన : ప్రాణ శరీరా లను పాలించుటకై, దానిని ముందుకు తెచ్చి, వాటినన్నింటిని దైవం వైపు త్రిప్పాలి. అలా చేయుటలో ఆకార్యాన్ని వ్యతిరేకించే వాటన్నింటినీ తొలగించాలి. ఈ యోగంలో అదే చైత్య రూపాంతరీకరణం.

శిరస్సుపైనున్న ఏకాగ్రతాశక్తి, శాంతిని, నిశ్శబ్దతను, దేహ స్ఫురణ నుండి విముక్తిని, మనో జీవితాలతోగల తాదాత్మ్యం నుండి విముక్తిని,కొని తేవాలి. తద్వారా అది నిమ్న చేతన (మన : ప్రాణ శరీరాలు) తన పైనున్న ఉన్నత చేతనను కలిసికొనుటకై మార్గాన్ని తెరచి, ఉన్నత చేతనా శక్తులు (ఆధ్యాత్మిక స్వభావం) మనో జీవిత దేహాలలోనికి అవతరించునట్లు చేయాలి ఈ యోగంలోయీ పద్ధతి ఆధ్యాత్మిక రూపాంతరీకరణం అని పిలువబడుతుంది.

* * *

ఊర్ధ్వం నుండి అవతరించి స్థిరపడిన శాంతి, వెలుగు, జ్ఞానము, శక్తి, ఆనందముల సమాహారమే ఆధ్యాత్మిక పరివర్తనము, అది ఆత్మను గూర్చిన, దైవాన్ని గూర్చిన, ఉన్నత విశ్వ చేతనను గూ ర్చిన, ఎరుకతోనుండును. అది నిమ్న చేతననంతా ఆధ్యాత్మిక చేతనగా పరివర్తన చెందించును.

* * *

ఆధ్యాత్మిక రూపాంతరీకరణం అనగా కేవలం ముక్తి కాదు.లేదా ఎలాంటి చేతనావతరణం లేకయే పొందగలిగే దైవ సాక్షాత్కారమూ కాదు. అది సామర్థ్యంతో కూడిన ఒక క్రియాత్మక ప్రక్రియ. అది వ్యక్తియందలి అధః చేతన వరకు ప్రతిభూమికలోను, నిశ్చలమైన క్రియాత్మకమైన తన ఆధ్యాత్మిక ఛేతనను ప్రవేశపెట్టును. ఈ ఆధ్యాత్మికచేతనను పూర్తిగా వదలితే, కేవలం పరిశుద్ధత, మనోవిజ్ఞానము, ప్రాణశక్తి నిశ్చలతవల్ల మాత్రమే ఆ ప్రక్రియ చేకూ రదు. అనగా నిశ్చలాత్మకమైన, క్రియాత్మకమైన దివ్యచేతనను క్రిందికి అన్ని భూమికల లోనికి కొని తెచ్చి, ప్రస్తుతమున్న చేతన స్థానమున ఆ దివ్యచేతనను పూర్తిగా ప్రతిష్ఠించుట అని అర్థము

* * *

మూలము: శ్రీఅరవిందులు: అనువాదము : బి. నరసింహయ్య

ప్రొద్దుటూరు

ఉపదేశోపాఖ్యానము (గుజరాతీమూలం)

ఈ రోజు మీకొక జ్ఞానబోధకమైన కథచదివి వినిపిస్తాను. ఇది పురాతన కాలానికి సంబంధించిన కథ. పూర్వకాలం అచ్చుయంత్రాలు, పుస్తకాలులేని రోజుల్లో ఒక్క గురువు, లేదా ఉపదేష్ట మాత్రమే జ్ఞానాన్ని పొందియుండేవారు. దాన్ని అర్హతగల వారికే ఉపదేశించేవారు. ఎవరైతే నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టగలరో వారే గురువు దృష్టిలో అర్హతగల వారి కింద లెక్క. మొదట ఒక తత్వాన్ని బోధించి, అది ఆచరణలో పెట్టటం చూసిన పిమ్మట మరొకదాన్ని బోధించడానికి సుముఖంగా ఉండేవారు.

ఇప్పటి పద్ధతి మారిపోయింది. ప్రతివారికీ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి అవి చదివిన తర్వాత ఆచరణలో పెట్టడం, పెట్టకపోవడం అతని ఇష్టమే. అంత వరకూ బాగానే ఉంది కానీ దానివల్ల కొంత మంది ఒక సందిగ్ధావస్థకులోనవుతున్నారు. చాలా పుస్తకాలు చదివిన వారు తాము బాగా చదువుకున్నారు కాబట్టి ఆచరణలో పెట్టడానికి కష్టపడనక్కర్లేదు; అన్నిరకాల అద్భుతానుభవాలు తమకు కల్గుతాయని ఆశిస్తారు. కానీ ఆతర్వాత "అన్నీ చదివి నేను యధాప్రకారంగా పూర్వంలాగే ఉన్నాను, అవే సంకట పరిస్థితులు, ఏమీ మారలేదు, ఏమీ సాధించలేదు" అనే మాటలు వింటూంటాము.

కానీ వారు ఒక్క విషయం మరిచిపోతున్నారు. వారు చదివిన దాన్ని ఆచరణలో పెడుతూ తగినంత అర్హత సంపాదించ కుండానే అపార మానసిక, మేధోపరిజ్ఞానాన్ని సంపాదించ కుంటారు. దానిని గురించి ఎంత సేపైనా మాట్లాడగలరు. కానీ ఆచరణలో పెట్టకపోవడం వల్ల వారి చైతన్యస్థితికీ, వారి భావాలకీ పొంతన ఉండదు.

ఇటువంటి నిదానంలేని వారికోసమే ఇప్పుడొక కథ చదివి వినిపిస్తున్నాను. పుస్తకాలు లేని ఆరోజుల్లో జ్ఞానం కోసం కేవలం ఒక గురువు పైనే ఆధారపడవలసి వచ్చేది. ఆ గురువు కూడా తన గురువునించి మాత్రమే ఆ జ్ఞానాన్ని సంపాదించి ఉండాలి. నీకు కావాలంటే ఆ గురువు నిన్ను పరిశీలించి నీకు అర్హత ఉన్నట్లు తోస్తేనే నీకు బోధిస్తాడన్నమాట.

(శ్రీమాత కథ ఆరంభిస్తారు)

ఒకానొకప్పుడు జునూన్ మహాశయుడని ఒక తపస్వియైన పండితోత్తముడుండేవాడు. ఆయన అనుభవజ్ఞుడైన జ్ఞాని కావడంవల్ల అందరి

గౌరవ అభిమానాల్ని పొందేవాడు. చాలా మంది బాలురు, యువకులు జ్ఞానోపదేశానికై ఆయన ఆశ్రమానికి వచ్చి చాలాకాలం అక్కడే ఉండి అనేక శ్రమలకోర్చి పాండిత్యం సంపాదించి తిరిగి వెళ్ళేవారు.

ఒకరోజు యూసఫ్ హుస్సేన్ అనే యువకుడు ఆయన దగ్గరకు వచ్చినప్పుడు అతనెవరో తెలుసుకోకుండా ఆశ్రమంలో ఉండటానికి అనుమతిచ్చాడు. నాలుగు సంవత్సరాలు గడిచిన తర్వాత అతన్ని పిలిచి గురువుగారు "ఎందుకిక్కడికి వచ్చావు" అని ప్రశ్నించారు. మతోపదేశం కోసమని అతను సమాధాన మివ్వగా వెంటనే గురువు ఒక సేవకుని పిలిచి" నేను చెప్పిన ప్రకారం పెట్టెను తయారు చేశావా" అని అడుగుతాడు. సేవకుడు అది తయారుగా ఉందని చెప్పగా ఆ పెట్టెను తెప్పించి దాన్ని యూసఫ్‌కిచ్చి ఈ విధంగా చెపుతాడు, "నీవు ఈ పెట్టెను జాగ్రత్తగా తీసుకెళ్ళి నీలా నది ఒడ్డున ఉన్న నామిత్రునికి అప్పగించి రా. ఏ విధమైన పొరపాటు చేయకుండా ఇచ్చి తిరిగి వచ్చిన తర్వాత నీకు ఉపదేశం ప్రారంభిస్తాను." ఆ విధంగా ఎన్నో జాగ్రత్తలు చెప్పి పెట్టెనిచ్చి నీలా నదికి వెళ్ళే మార్గాన్ని వివరిస్తాడు. యూసఫ్ పెట్టె తీసుకొని గురువుకి పాదాభి వందనం చేసి బయల్దేరుతాడు.

గురువుగారి మిత్రుడుండేది చాలా దూరప్రదేశం కావటంవల్ల, వాహన సౌకర్యాలు లేని కాలం కావడంవల్ల, యూసఫ్ కాలినడకనే బయల్దేరాడు. అతను ఉదయమంతా నడిచి మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రంగా ఉండటం చేత ఒక చెట్టు నీడన విశ్రమిస్తాడు. అతని చేతనున్న పెట్టె చాలా చిన్నది. ఇంతవరకూ గురువుగారి మాటలు తలుచుకుంటూ బయల్దేరిన యూసఫ్ పెట్టె సంగతి పట్టించుకోలేదు.

ఇప్పుడు కొంచెం సేదదీరగానే మనస్సులో ఆలోచనలు మొదలైనాయి. అటువంటి సమయాల్లో మనస్సులో వెర్రి మొర్రి ఆలోచనలు కలగకుండా ఉండవు. "అబ్బ! పెట్టె ఎంతముద్దుగా ఉందో! తాళం కూడా వేసినట్టులేదు. చాలా తేలికగా కూడా ఉంది. అసలు లోపల ఏమైనా ఉన్నదా?" అనుకుంటూ తెరిచి చూడాలని చేయి చాపాడు "ఏమో! ఖాళీగానే ఉందేమో! అయినా నాకెందుకు? గురువుగారు తమ మిత్రునికి ఇమ్మన్నారు. అంతే. అంతవరకే." అనుకుంటూ కొంతసేపు స్థిమితంగా కూర్చున్నాడు. కానీ మనస్సు మాత్రం

ఊరుకోలేదు. "ఇంత చిన్న పెట్టె, లోపల ఖాళీగా ఉన్నట్లుంది. పైగా తాళం కూడాలేదు. తాళం వేయలేదు కాబట్టి లోపల విలువైనవి ఏమీ ఉండకపోవచ్చు. ఒక్కసారి మూతతీసి చూస్తే నష్టమేమీ ఉండదుగా! మళ్ళీ వెంటనే మూసేయవచ్చు."

ఈ విధంగా యూసఫ్ ఊహలన్నీ ఆ పెట్టే చుట్టూ తిరగడం మొదలు పెట్టాయి. ఇక వాటినుంచి తప్పించుకోవడం అతని వశంకాలేదు. ఒకే ఒక్కసారి చూసి మూసేద్దామనుకుంటూ చేయి చాచీ, ముడిచీ చిట్టచివరకు మెల్లగా, జాగ్రత్తగా పెట్టె మూత తెరిచాడు. ఇట్లా మూత తీసీ తీయడంతో అందులోనుంచి ఒక చిట్టెలుక అమాంతం కిందకు దూకి పారిపోయింది. ఆ ఎలుక ఎంతో సేపట్నుంచీ ఊపిరాడక అందులో ఉందేమో, ఒక్క క్షణమైనా ఆలస్యం చేయకుండా ఎటో పారిపోయింది.

యూసఫ్‌కి మతి పోయినంత పనైంది. దిగ్భ్రాంతితో కళ్ళు పెద్దవి చేసిచూశాడు. ఖాళీ పెట్టె కనిపిస్తోంది. గుండెదడ ప్రారంభమైంది. ఇంతాచేసి ఆ మహాత్ముడు ఒక చిట్టెలుకను పంపించాడు. నేను దాన్ని గూడా చివరి దాకా తీసుకెళ్ళ లేకపోయాను. చాలా పెద్ద పొరపాటు చేశాను. ఇప్పుడిక చేయవలసిందేమిటి? యూసఫ్ చాలా చింతించాడు. చేసేదేమీ లేక చెట్టు చుట్టూ ప్రదక్షిణం చేశాడు. దిగాలుపడి పైకీ కిందికీ రోడ్డు వైపుకీ చూస్తూ చేతులు వణుకుతుండగా ఖాళీపెట్టె మూత పెట్టి పట్టుకొని ప్రయాణం కొనసాగించాడు.

నీలా నదిగట్టు దాకా వెళ్ళి గురువుగారి స్నేహితుని చేరి పెట్టెని అందజేసి తప్పు చేయడం వల్ల బిక్కుబిక్కుమంటూ ఒక మూలన నిలబడ్డాడు. ఆ స్నేహితుడు ఒక గొప్ప యోగికావటం వల్ల పెట్టె తెరిచి చూసి విషయం అర్థం చేసుకున్నాడు. "నాయనా! యూసఫ్, ఎలుకను పోగొట్టుకున్నావుగదా! ఇక గురువుగారు నీకు ఉపదేశం ఇవ్వరు. సంపూర్ణమైన స్వాధిపత్యముంటేగానీ పరమమైన జ్ఞానం పొందటానికి అర్హులుకారు. నీసంకల్పశక్తి పైన గురువుగారికి నమ్మకం లేకపోవడం వల్లనే ఈ చిన్న చమత్కారంతో నిన్ను పరీక్షించారు. ఒక అల్పమైన ఎలుకను పెట్టెలో జాగ్రత్తగా ఉంచి అప్పగించలేక పోయావుగదా! పెద్దపెద్ద ఊహలను తలలో ఎట్లా భద్రపరుచుకోగలవు? విలువైన జ్ఞానాన్ని

హృదయంలో ఎలా పదిలపరుచుకోగలవు? ఏదీ నిరర్థకంగాదు. గురువుగారి దగ్గరకు తిరిగివెళ్ళి నిష్ఠ, నిలకడ నేర్చుకో. అలా అర్హత సంపాదించుకొని ఏదో ఒకనాడు ఆ మహాత్మునికి నిజమైన శిష్యుడివి కాగలవు.

ఖిన్నుడై తిరిగి వచ్చి యూసఫ్ గురువు గారితో తను చేసిన తప్పు వివరించినప్పుడు ఆయన "యూనస్! నీవొక సదవకాశాన్ని జారవిడుచుకున్నావు. ఏంచేస్తాము. అల్పమైన ఎలుకను జాగ్రత్త చేయలేని వాడివి, నిధులన్నిటిలోకీ అత్యంత విలువైన దివ్యసత్యాన్ని ఎలా నిలుపుకోగలవు? దానికి ఎంతో ఆత్మ సంయమనం అవసరము. నువు ముందర అది నేర్చుకో. నీ మనస్సు నీ అధీనంలో ఉంచుకోవడమెలాగో తెలుసుకో. అది లేకుండా ఎటువంటి పెద్ద విషయాలనూ సాధించలేవు.

సిగ్గుతో తలదించుకొని వెళ్ళిపోయిన యూసఫ్‌కి అప్పట్నించీ స్వాధిపత్యం ఎలా సాధించాలా అనే ఆలోచన తప్ప వేరే ఆలోచన లేదు. అలా ఆలోచిస్తూ సంవత్సరాల తరబడి కష్టపడి, కఠోర దీక్షతో తపస్సు చేసి చివరకు తన స్వభావాన్ని నియంత్రించడం అలవరచుకున్నాడు. గురువుగారి దగ్గరకు వెళ్ళినప్పుడు అతని సంసిద్ధతను చూసి ఆ మహాత్ముడు ఆనంద భరితుడైనాడు. ఆ విధంగా యూసఫ్ జునూన్ మహాత్ముని దగ్గర ఉపదేశ సారాన్ని పొందాడు. కొంతకాలం గడిచిన తర్వాత యూసఫ్ గొప్ప విజ్ఞతను, పరిపూర్ణతను సాధించి ఇస్లాంమతంలో ఒక అసాధారణ సిద్ధునిగా పేరు పొందాడు.

ఈ కథ చెప్పి శ్రీమాత పిల్లలతో ఇంకా ఇలా చెపుతున్నారు. ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే అసహనమనేది ఉండ కూడదనీ, జ్ఞానాన్ని పొందాలనుకుంటే అది తప్పనిసరి నియమమనీ, మీరే జ్ఞానం సంపాదించినా కూడా దాన్ని ఆచరణలో పెట్టాలంటే ఆత్మ సంయమనం ఉండాలి.

ఇక్కడకు వచ్చి ఉంటున్న మీకందరికీ అనేక విషయాలు చెప్పడం జరిగింది. ఒక సత్యలోకంతో మీకు సంసర్గముండేటట్లు చేశాను. మీరు అందులోనే జీవిస్తున్నారు. ఆ గాలే పీలుస్తున్నారు. మీలో ఏకొద్ది మందైనా ఆచరణలో పెడితే దానికి విలువ ఉంటుందని గ్రహించారా? మంచి విషయాలను అర్థం చేసుకొని వాటి ప్రకారం జీవిస్తూ, వాటిని సిద్ధింపచేసుకునే ప్రయత్నం ముఖ్యం, కేవలం జ్ఞానాన్ని గురించీ, చైతన్యాన్ని గురించి మాట్లాడుతూ, ఆత్మసమానత్వం, సార్వత్రికం,

అనంతత్వం, శాశ్వతత్వం, పరమసత్యం, దైవసన్నిధి అంటూ కబుర్లు చెపితే అది వ్యర్థప్రేలాపనే అవుతుందనే విషయం మీలో ఎంత మందికి తెలుసు? "ఇక్కడ నేను చాలా కాలంగా ఉన్నాను. నా ప్రయత్నాలకి తగిన ప్రతిఫలం రావాలి" అని అనుకోకండి. నిరంతర ప్రయత్నం, ఓరిమి, నిశ్చలత్వం ఉంటే నీ బలహీనతలను, లేకితనాన్ని, అల్పబుద్ధిని అధిగమించి ఆత్మ సంయమనం సాధించగలవు. అహం లేకుండా ప్రేమించలేని వాళ్ళు దివ్యప్రేమను గురించి మాట్లాడితే ప్రయోజనమేముంటుంది? భూత, వర్తమానాలతో పూర్తిగా మమకారం పెట్టుకున్నవాళ్ళు అమరత్వాన్ని గురించి మాట్లాడితే అర్థమమేముంటుంది? అన్నీ పొందాలనుకున్నప్పుడు దానికోసం ఏమీ వదులుకోనంటే ప్రయోజనముండదు.

మీరంతా చాలా చిన్న వాళ్ళు కాబట్టి మీరనుకున్న గమ్యం చేరటానికి అవసరమైన మూల్యం చెల్లించాలనే విషయం తెలుసుకోండి. ఇంకా పరమమైన సత్యాలను అర్థం చేసుకోవాలను కున్నప్పుడు మీ దినచర్యలో వాటిని ఆచరించడం తప్పనిసరి.

- శ్రీమాత

అనువాదం : అమరవాది ప్రభావతి
అమరవాది వేంకట రామశాస్త్రి

ఇహలోకం - పరలోకం

శ్రీఅరవిందుల (పూర్ణ)యోగం

భారతావని ఆత్మగూర్చి నీ వ్యాఖ్యానంపైన, పరలోకం విషయం పక్కనపెట్టి ఇహలోకం సంగతి ఆలోచించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి అని నీ మిత్రుడు చేసిన వ్యాఖ్యానాలపై నా భావాలు ఇక్కడ పొందుపరుస్తున్నాను. ఏ సందర్భంగా నీ మిత్రుడు ఆ వ్యాఖ్య చేశాడో నాకు అర్థం కావడంలేదు. ఇహలోకం అంటే అతని అర్థం ఏమిటో తెలియదు. ఈ విషయంలో నా భావాలు చెప్పడం అవసరం. నేను భారతదేశం వచ్చినప్పటి నుండి నా జీవితం, నా యోగం ఇహలోకం చుట్టూ, పరలోకం చుట్టూ విస్తరించివున్నాయి. ఏ పార్శ్వంలోనూ దేనినీ విడిచిపెట్టలేదు. ఇహలోకంలోనివే మానవ ప్రయోజనాలు, పురుషార్థాలూ. అవన్నీ చాలావరకు నా మనోపరిధిలో ప్రవేశించాయి. రాజకీయాలు బాగా కొన్ని నా జీవితంలో అడుగుపెట్టాయి. బొంబాయిలో అపోలోబందర్ వద్ద

భారతభూమిపై అడుగు పెట్టగానే నాకు ఆధ్యాత్మిక అనుభవాలు కలిగాయి. అవి ఇహలోకానికి, భిన్నమైనవికావు. ఆ అనుభవాలు ఇహలోకంపై అపారమైన, ప్రగాఢమైన ముద్రవేశాయి. భౌతిక ప్రదేశ మంతటా 'అనంతం' పరివ్యాప్తమైనట్లు, భౌతిక వస్తువులలో, దేహాలలో అంతస్థిత దైవం భాసిస్తున్నట్లు భావాలు కలిగాయి. అదే సమయంలో నేను అతిభౌతిక ప్రపంచాలలో, భూమికలలో ప్రవేశించిన అనుభూతి కలిగింది. భౌతిక స్తరంపై వాటి ప్రభావాలు తెలిసాయి. అందువల్ల ఈ అస్తిత్వానికి గల రెండు అంతిమ తీరాల మధ్య ఎటువంటి భిన్నత్వాన్నికాని, సామరస్యంలేని వ్యతిరేకతనుగానీ నేను అంగీకరించలేను. నా దృష్టిలో సర్వము బ్రహ్మమయమే భగవంతుడు సర్వత్రా దీపిస్తున్నాడు. ఈ ఇహలోకాన్ని త్యజించి, పరలోకాన్ని ఎంచుకోవడానికి ప్రతి వ్యక్తికీ హక్కువుంది. ఆ నిర్ణయం వల్ల అతనికి శాంతి దొరికితే అతను ధన్యుడే. అయితే శాంతిని పొందడానికి అటువంటి త్యాగం చేయాలని నేననుకోను.

నా యోగంలో ఆధ్యాత్మిక, భౌతిక ప్రపంచాలకు స్థానం వుంది. అంతేకాదు. మానవ హృదయాలలో, ఈ భౌతిక జీవన సరళిలో భగవత్ చైతన్యాన్ని, భగవత్ శక్తిని నెలకొల్పడానికి నా యోగం ద్వారా ప్రయత్నాలు సాగించాను. అది వ్యక్తిగత మోక్షం కాదు. ఈ భూమిపై దివ్యజీవనం స్థాపించడమే నా లక్ష్యం. ఈ లక్ష్యం పరిధిలోకి భౌతిక లక్ష్యాలు, భౌతిక విషయాలు కనుక వస్తే, ఆ లక్ష్యంలోని ఆధ్యాత్మికతత్వం ఏ మాత్రం కలుషితం కాదు. ఆ లక్ష్యంలోని భారతీయత అసలు దెబ్బతినదు. ఇదే నా ఉద్దేశ్యం. అది ఎప్పటికీ మారదు. ఈ ప్రపంచ యదార్థత, ప్రకృతి, వస్తువులు, భగవంతుని విషయంలో అదే నా దృక్పథం, నా అనుభవం. వాటికెనుక గల పూర్ణసత్యం అదే. అందువల్లనే దీనిని పూర్ణయోగం అన్నాను. ఇటువంటి పూర్ణయోగ పద్ధతిని తిరస్కరించవచ్చు, నమ్మకపోవచ్చు. పరలోకం ఆధ్యాత్మిక అవసరం అని వారు నమ్మవచ్చును. అయితే అటువంటి భావాలు ఉంటే ఈ పూర్ణయోగం అసంభవం అవుతుంది. ఇతర ప్రపంచాల అనుభవాన్ని నా యోగంలో పొందుపరిచాను. అంతేకాదు. పరమోన్నత పరాత్పర (Supreme Spirit) భూమిక, ఇతర భూమికలు, మన జీవితంపైన, భౌతిక ప్రపంచంపైన వాటి ప్రభావాలన్నీ ఈ యోగంలో చేర్చబడ్డాయి. పరమోన్నత పురుషుని, లేదా ఈశ్వరుణ్ణి సాక్షాత్కరింప

చేసుకోవాలని, శివుడు, ప్రపంచ ప్రభువును, మన ఆత్మల అధినాయకునిగా కృష్ణుని సిద్ధింప చేసుకోవాలని మాత్రమే ఎవరైన పట్టు పట్టవచ్చును. ఈ యోగంలో ప్రధానమైన ఫలితాలు పొంది, తరువాత పూర్ణ ఫలితాలవైపు తిరగవచ్చును. అయితే దివ్యజీవన ఆదర్శాన్ని, పరమాత్మ జయించిన ఈ ప్రపంచాన్ని వారు ఆమోదించివుండాలి. సృష్టి అంతటా మెరిసే ఈ మహాసత్యం, ఈ ప్రపంచం అనుభవం వల్ల ఒక నిర్ణీత దృక్పథానికి వచ్చిన నాకు దివ్యజీవనం, సావిత్రి గ్రంథాలు రాయడానికి ప్రేరేపణ కలిగింది. ఈశ్వర సాక్షాత్కారం అతిప్రధాన లక్ష్యం. అందులో సందేహం లేదు. కాని భక్తి, ప్రేమలతో భగవంతుని దరి చేరడం, ఒకరు చేసే నిత్య కర్మలతో ఆయన్ని సేవించడం, ఆయన్ని తెలుసుకోవడం, కూడా పూర్ణయోగం పథంలో ముఖ్యమైనవి. మేధాస్ఫూర్తితో మాత్రమే కాకుండా, ఆధ్యాత్మిక అనుభవ ధారలో భగవంతుని తెలుసుకొనడం కూడా పూర్ణయోగ మార్గంలో ఆవశ్యకమే.

* * *

ఒక ఆశ్రమవాసి అన్నట్లు ఈ ఆశ్రమం ఆధ్యాత్మిక, అతిమానస యోగం చేసే ఒక పరిశోధనాగారం కాబట్టి, భిన్న మానవాళికి చెందిన వారందరికే ప్రాతినిధ్యం కల్పించడం అవసరం. అనివార్యం. అనుకూలమైన, అనుకూలం కాని భిన్న మనస్తత్వాలు గలవారిని ఈ రూపాంతర పరిధిలోనికి తేవాలి. ఒకే వ్యక్తిలో ఈ రెండు విభిన్న ధోరణులు కలిసిపోయి ఉంటాయి. ప్రాణికమైన ఇబ్బంది లేని వారు, కేవలం సాత్విక, సంస్కారం వంతులు యోగం కోసం వస్తే, ఈ రూపాంతర ప్రయత్నం విఫలం అవుతుంది. ఎందుకంటే, పృథ్విప్రకృతిలో ప్రాణికతత్వాన్ని ఎదుర్కొని జయించడం జరగలేదు. కొన్ని నిర్దిష్ట పరిస్థితులలో మానస, ప్రాణిక, భౌతిక కోశాలపై అధిమానస (overmental) ఆవరణను నిక్షిప్తం చేసి, ప్రభావితం చేయవచ్చును. కాని మానవప్రకృతిని అతిమానస, సార్వభౌమ రూపాంతరీకరణం చేయడం సంభవించ లేదు.

ప్రపంచం నలుమూలల నుండి, భిన్నజాతుల వారు ఆశ్రమానికి రావడం జరిగింది. అటువంటి సామూహిక యోగ సరళిలో ప్రతి భూమికను శోధించి, పరివర్తనం కావించాలి. కాబట్టి, అనేక కష్టాలు ఎదురవుతాయి. ఈ పరిశోధనశాలలో ప్రాథమిక కార్యసరళి పూర్తికాగానే, జీవితంలోని అన్ని కోణాలు రూపాంతరం చెంది తీరతాయి.

మామూలుగా కనిపించే మానవ సహవాస ధోరణులకు ప్రాధాన్యం ఇవ్వలేదు. (అయితే ఆశ్రమవాసుల మధ్య సుహృద్భావం, మర్యాద, ఇతరుల భావాలను గౌరవించడు మాత్రం ఉన్నాయి.) ఎందుకంటే ఆశ్రమలక్ష్యం అది కాదు. ఒక వినూత్న చైతన్యంలో సమైక్య బంధం - అది లక్ష్యం. ఎవరికి వారు మొదటగా సాధన చేసి, కొత్త చైతన్యం పెంపొందించుకోవాలి. ఏకత్వం సాధించాలి.

సాధకులలోని తప్పుల్ని, పైనుండి అవరోహించే దైవ మహత్కాంతి తొలగించి తీరాలి. సాత్విక పంథాలోనే వున్నవారి ప్రకృతిని ఒక సాత్విక నియతి మార్చివేస్తుంది.

* * *

ఈ ఆశ్రమం మామూలు ఆశ్రమాల లక్ష్యంతో కాకుండా వేరే లక్ష్యంతో సృష్టించబడింది. జీవితాన్ని పరిత్యజించడం ఈ లక్ష్యం కాదు. మరో జీవన సరళి, రూపాన్ని పరిణమింపచేయడానికి కేంద్రబిందువుగా ఈ ఆశ్రమం పనిచేస్తున్నది. చిట్టచివరి ఈ జీవన రూపం ఉన్నతతర ఆధ్యాత్మిక చైతన్యంతో ప్రదీప్తమై, మరింత ఉన్నతమైన ఆధ్యాత్మిక జీవనాన్ని సంతరించుకుంటుంది.

* * *

ఇది ఇతర ఆశ్రమాలవంటిది కాదు. ఇందులో, సభ్యులు సన్యాసులుకారు. ఇక్కడ యోగలక్ష్యం మోక్షం కాదు. మనిషిని ఆధ్యాత్మికంగా సన్నద్ధంచేసే పనిఇది. అటువంటి పని యోగ చైతన్యంపై, యోగ శక్తిపై ఆధారపడి వుంటుంది. మరోపునాది లేదు. అటువంటి ఆధ్యాత్మిక సన్నద్ధతలో భాగంగా ప్రతిసభ్యుడు ఏదో ఒకపని చేయడం జరుగుతుంటుంది.

- శ్రీఅరవిందులు

అనువాదం : కె. యజ్ఞన్న

మృత్యు దేవత కర్తవ్యం సృష్టిని జాగృతపర్చటం

సూక్తులు :-

1. ఈ జగత్తు 'మృత్యువు' చేత నిర్మించబడింది, తన మనుగడ కోసం, మృత్యువును రద్దు చేయగలవా? అప్పుడు జీవనం కూడా నశిస్తుంది. మృత్యువుని నీవెప్పుడూ తుడిచి పెట్టలేవు. కాకపోతే జీవన విధానాన్ని ఇంతకంటె ఉన్నతంగా మార్చుకోగలవు.

2. ఈ ప్రపంచం ద్వేషంచే నిర్మించబడింది, తన మనుగడ కోసం. ద్వేషాన్ని నిర్మూలిస్తావా? అయితే మరి ప్రేమకూడా నశిస్తుంది. ద్వేషాన్ని నీవు రూపుమాపలేవు, కాని, అందుకు వ్యతిరేకంగా దానిని ఉన్నతంగా అమిత ప్రేమానందాలుగా రూపాంతీ కరించవచ్చు.

3. ఈలోకం అవిద్య మరియు పొరపాటు వీటిచేత నిర్మాణం కాబడింది, (తమను) తాము గుర్తెరగడం కోసం. అజ్ఞానం పొరపాటు - లను నిర్మూలిస్తావా? అపుడు విజ్ఞానమూ ఉండదు. అజ్ఞానం, పొరపాటు - లను తుడిచి పెట్టలేవు; కాని వాటిని పూర్తిగా, దేదీప్యమానంగా అతిశయించే వివేకంగా, రూపాంతీకరించగలవు.

4. జీవితం మాత్రమేవుండి మృత్యువు లేకపోతే శాశ్వతత్వానికి మనుగడ లేదు. ప్రేమ మాత్రవే ఉండి ద్వేషం లేకపోతే ప్రేమ నిరుత్సాహము, క్షణికానందంగా మాత్రమే మిగిలిపోతుంది. హేతువాదం మాత్రమే మిగిలిపోతుంది. హేతువాదం మాత్రమేవుండి అజ్ఞానం లేకపోతే మన వుత్తమొత్తమసిద్ధులన్నీ సాధారణ తర్కానికి, ప్రాపంచిక విషయ పరిజ్ఞానానికి మాత్రమే పరిమితమయిపోతాయి.

5. రూపాంతీకరింపబడిన మృత్యువు శాశ్వత దివ్యజీవనంగా అంటే అమృతత్వంగా పరిణామం చెందుతుంది. ద్వేషం పట్టలేని పారవశ్యంతో కూడిన దివ్య ప్రేమగా పరిణమిస్తుంది. విజ్ఞాన, వివేకాలకతీతంగా ఉత్సాహభరితంగా గంతులు వేసే దివ్యతేజంగా, అజ్ఞానం రూపాంతరం చెందుతుంది.

శ్రీమాత ఇంతకుముందు చెప్పినది

"ప్రార్థన ఎందుకు? ఆకాంక్ష దేనికి? ఈ అడగడం యేమిటి? భగవంతుడు ఏదనుకుంటాడో అది చేస్తాడు. ఏది చేస్తాడో అదే అనుకుంటాడు. ఇలా కొంతమంది వితండవాదం చేస్తారు. అది నిజమే! ఆవిషయం పదేపదే చెప్పక్కరలేదు. కాని "ఓప్రభూ! నీ దర్శన భాగ్యం కలిగించు అన్న గాఢప్రచోదితమైన అభ్యర్థన మరింత తీవ్ర దివ్య ప్రకంపనలతో భగవద్దర్శనానికి దగ్గర చేరుస్తుంది.

లేనట్టయితే పరమాత్మ యీ సృష్టిని యథాతథంగా యెప్పటికీ సృష్టించి వుండేవాడు కాదు. గాఢమైన దివ్య ఆకాంక్షలో ఒక ప్రత్యేక శక్తి, ఒక ప్రత్యేక

ఆనందం, ఒక ప్రత్యేక ప్రకంపన ఉన్నాయి. అవే సృష్టికి పునరుజ్జీవనం ప్రసాదిస్తాయి.

అందుచేతనే పాక్షికంగా, కొంచెం కొంచెంగా సృష్టి వికాసం జరుగుతుంది. ఒక శాశ్వత పరిపూర్ణ ప్రపంచం, పరిపూర్ణతతో శాశ్వతంగా అభివ్యక్తమయి ఉండిఉంటే కొంచెం క్రమం జరిగే ప్రగతిలో వుండే ఆనందం కరువయి వుండేది.

శ్రీమాత వ్యాఖ్యానాలు

అదే భావం, అంటే, ప్రతికూలత, వైరుధ్యాలు ప్రగతికి ప్రేరణలు. అభివ్యక్త, అనభివ్యక్తాలకతీతంగా ఉన్న దివ్య ప్రేమతత్వంకి నిరుత్సాహంతో లేదా ద్వేషంతో పనిలేదు. శ్రీఅరవిందుల వారి అభిప్రాయంలో మాత్రం, యీ వైరుధ్యాలు, వ్యతిరేకతలు అతి త్వరితంగా, అత్యంత సఫలీకృత మార్గాల ద్వారా పదార్థ ప్రపంచాన్ని తీర్చిదిద్దుతాయి. అందువల్ల దాని అభివ్యక్తీకరణ వేగవంతం అవుతుంది.

ఒక అనుభవంగా చెప్పాలంటే యిది ఖచ్చితంగా ఇంతే. అంటే-ఎలాగంటే శాశ్వత పరమోన్నత దివ్యప్రేమతో అనుబంధం ఏర్పరచుకున్నపుడు ఒక మానసిక అనుభూతి, సంవేదన కలుగుతుంది. ఇది మానసిక అవగాహన కాదు. (కాని) ఇది ఒకరకంగా వాస్తవికమైనదే. అత్యంత తేజోవిరాజితమయిన పదార్థ చైతన్యం, ఎంత మహత్తరంగా తీర్చిదిద్దబడి తయారు కాబడినా దానికి' తత్' That- ను అభివ్యక్తీకరించటం అసాధ్యమే. మొట్టమొదట ఈ రకమైన అశక్తతా అనుభవం కలుగుతుంది. తర్వాతే ఒకరకమైన అనుభూతి కలుగుతుంది. One cannot call it exactly cruelty, because it is not cruelty as we know it - ఖచ్చితంగా చెప్పలేని ఏదో ఒక అస్పష్టరూపం అభివ్యక్తమవుతుంది. అది మనం అనుకుంటున్న ద్వేషం కాదు, కాని యీ పరిస్థితులన్నింటి పరిధిలో ఒక ప్రకంపన రూపంలో అభివ్యక్తం అవుతుంది. ఇది ఇక్కడ అభివ్యక్తమైన ప్రేమను తిరస్కరిస్తుంది. స్పష్టంగా చెప్పాలంటే పదార్థ ప్రపంచంలో ప్రేమ అభివ్యక్తికి, ఏదో, అడ్డుపడుతోంది. సాధారణ ప్రపంచం గురించి నేను చెప్పడం లేదు. ప్రస్తుత చైతన్యం at its highest గురించి మాట్లాడుతున్నాను. ఈ ప్రతికూలతను ఢీకొన్న చైతన్యంలో ఒక భాగం (పాక్షిక చైతన్యం) ప్రేమమూలమునకు నేరుగా విజ్ఞాపన చేస్తున్నది. అదొక అనుభవం. జరిగిన దాన్ని గురించే నేను

మాట్లాడుతున్నారు. ఈ తిరస్కార అనుభవం లేకుండా దానికంత గాఢత ఉండేది కాదు. అడ్డాలు తొలగింప బడినాయి. అంతకు ముందు ప్రత్యక్షంకాలేని విధంగా ఒక వెల్లువలా యెల్లలన్నీ ఛేదించుకుని ఇంతకు ముందెప్పుడూ వ్యక్తం కాబడనిది వ్యక్తం కాబడింది.

జీవన్మరణ సమస్యగా అందరూ పరిగణించే అనుభవం లాగే దీనిని ఎవరైనా చూస్తారు. సావిత్రిలో చెప్పినట్లు మరణం లేక మరణ సంభావ్యత గురించిన నిరంతర దీర్ఘాలోచన ఆ రకమైనదే. పుట్టింది మొదలు గిట్టేవరకు మనల్ని విడవకుండా నిరంతరం తోడుగావుండే మిత్రుడే యీ మృత్యుభీతి. దీనితోపాటు మన జీవకణాల్లో నిక్షిప్తమైన ఒక శాశ్వత దివ్యశక్తి కోసం తీవ్రస్థాయిలో పిలుపు ఉంటుంది. ఈ నిరంతర మృత్యు భయం లేకుంటే తీవ్రస్థాయిలో ఆ పిలుపు ఉండదు. అయితే ఇవన్నీ పరమాత్మ అభివ్యక్తిని వేగిరపరచి పరిపుష్టం చేసే మార్గాలుగా మనం అర్థం చేసుకోవాలి. అయితే సాధనాలు మొరటు. ఎందుచేతనంటే అభివ్యక్తీకరణ కూడా మొరటే. ఇది పరిపూర్ణతను సంతరించుకొని, అభివ్యక్తీకరణకి సంసిద్ధమయేకొలదీ, ఈ మొరటు మార్గాలన్నీ సూక్ష్మమార్గాలుగా మారుతాయి. అభివ్యక్తీకరణ నిరంతర ప్రగతి దాయకమైనది. ప్రపంచం మూర్ఖమైన వ్యతిరేకతల అవసరం లేకుండా ప్రగతి సాధిస్తుంది. స్పష్టంగా చెప్పాలంటే ప్రపంచమింకా బాల్యావస్థలోనే వుంది. మానవ చైతన్యం ఇప్పటికీ శైశవ దశలో వుంది.

ఇది అతిస్పష్టమైన అనుభవం.

దీనిననుసరించి ప్రగతిసాధనకి, భూమి మరణించాల్సిన అవసరం లేదు. మరణమిక ఎంతమాత్రం ఉండదు. ప్రగతి సాధనకి భూమివేదన పడాల్సిన అవసరం లేనపుడు బాధనేది లేకుండా పోతుంది. అలాగే ప్రేమించాలంటే ద్వేషించాల్సిన పని లేనపుడు ద్వేషమే ఉండదు. అత్యంత త్వరితంగా, ప్రభావిత మార్గాల ద్వారా జడత్వం నుండి బయటపడే మార్గం ఇదే. ఇదే సాఫల్యానికి దారితీస్తుంది.

(సుదీర్ఘ మౌనం)

సృష్టికి ఒక స్పష్టమైన దృక్పథం వున్నది. అది అత్యాధునిక మైనది కావచ్చు. అదే గందరగోళం, తికమక, నిరభిమానం లాంటి వాటి నుంచి

తప్పించుకోవలసిన అవసరం. గందరగోళం, తికమక పరిస్థితిని తమకనుకూలంగా మార్చుకోడానికి వీలైనంతవరకు ప్రయత్నిస్తాయి. అప్పుడు అవి ఘర్షణ విఫల ప్రయత్నం, వ్యర్థ ప్రయాస అవుతాయి. అది నువ్వేస్థాయిలో వున్నావో దాని మీద ఆధారపడి వుంటుంది, కాని పదార్థ ప్రపంచం క్రియలో పనికిరాని క్లిష్టతన్న మాట. సమన్వయలోపం. అపార్థాలు, గందరగోళం, తికమకలు. దీనినే వక్రత్వంగా వేదాలలో పేర్కొనడం జరిగింది. దీనికి సమానార్థక పదం నాకు తెలియదు. ఇది ఏదో ఒక మెలిక. సూటిగా చివరివరకు పోవడానికి బదులుగా అనవసరమయిన గజిబిజి. నిరాడంబరంగా జరిగే స్వచ్ఛమైన దైవ కార్య నిర్వహణకి, సామరస్యానికి ఇది వ్యతిరేకం, సారళ్యత సూటిగా పశివానివలె ఉంటుంది. కావల్సినది సూటిగా ఉండటమే. పనికిమాలిన డొంక తిరుగుడు కాదు. అయితే disorder is a way of stimulating the need for the pure divine simplicity స్వచ్ఛమైన దైవ నిరాడంబరతకి యీ తికమక కూడా ఒక విధమైన ప్రేరణ -

ప్రతి విషయం ఎంతో సరళసుందరంగా ఉంటే ఎంత బాగుండును ! అని శరీరం ఎంతగానో అనుకుంటుంది The body feels very strongly that everything could be so simple!

అపుడేమవుతుందంటే, ఈ రకమైన సత్త్వము, కలగా పులగంగా ఉండే వ్యక్తిత్వము - This kind of individual agglomerate రూపాంతరీకరింపబడటానికి అనువుగా ఉంటుంది. It can be transformed. అంటే, ఖచ్చితంగా, కావల్సినదేమంటే to become more simple, simple, simple. దివ్య ప్రకృతియొక్క సంక్లిష్టతలన్నీ అవగాహన చేసుకోవటానికి ఇపుడు ఆరంభించారు. ఇవన్నీ చాలా చిక్కులతో కూడుకున్నవి. సూక్ష్మాతి సూక్ష్మమైన; అల్పాతి అల్పమైన విషయాలు, కార్యకలాపాలు కూడా ఊహాతీతంగా ఉండే సంక్లిష్టమైన వ్యవస్థకి సంబంధించిన ఫలితాలే. ఈ విషయాలన్నీ ప్రణాళిక బద్ధంగా సమన్వయం పర్చటం మనిషి ఊహకి అందనివి. అసాధ్యం. ఇపుడు విజ్ఞానశాస్త్రం వీటిని కనుగొంటోంది. వాటి కార్యాచరణ ధర్మం దివ్యంగా మార్గాలంటే if the functioning is to be divine ఈ అస్తవ్యస్త గందర గోళం నుంచి తప్పించుకోవాలంటే it must be simglifiad, simglified, simplified సరళీకృతం కాబడవలసినదే!

(సుదీర్ఘ మౌనం)

ప్రకృతి స్వయం వ్యక్త ప్రయత్నంలో, ఆదిమ దివ్యసారళ్యతను (Primal Simplicity) సృజించే క్రమంలో, నమ్మశక్యంకాని యించుమించు అనంతమైన సంక్లిష్టతతో కూడిన విధానాన్ని అంగీకరిస్తుంది.

మళ్ళీ మనం అదే విషయంలోనికొచ్చాం. ఈ మితిమీరిన సంక్లిష్టత వలన నిరాడంబరత శూన్యమయిపోదు; సరికదా సంపూర్ణంగా సానుకూల మవుతుంది. సంపూర్ణ నిరాడంబరత, అసంపూర్ణత ఎలాటిదంటే అది అన్నిటినీ తనలోయి ముడ్చుకున్నది. ఈ సంక్లిష్టత లేనినాడు ఆ నిరాడంబరత శూన్యమే అవుతుంది.

ప్రస్తుతం ఇటువంటి పరిశోధనలే జరుగుతున్నాయి. శరీర నిర్మాణ శాస్త్రంలో ఉదాహరణకి, శస్త్రచికిత్సా విధానాలు కనుగొంటున్నారు. వారు చేసే పదార్థ మూలకాల వర్గ విభజన ఎలా ఉందంటే ఆశ్చర్యకరమైన నమ్మకశక్యం కాని ఒక భయంకర సంకీర్ణతగా పరిణమిస్తున్నది. ఇదంతా ఏ ప్రయోజనం కోసమంటే to express quinty, the one Simplicity దివ్యైక్యత ప్రకటించే ప్రయత్నంలో ఒక సరళ విధానం.

(మౌనం)

బహుశా ఇది వేగవంతం అవుతుంది. గాఢమైన, సఫలీకృతమయే ఒక ఆకాంక్ష చాలు to attract "That" "తత్"-ను ఆకర్షించేందుకు. అది సంక్లిష్టతని సరళతగా పరిణమింప జెయ్యగలగుతుంది. ద్వేషాన్ని ప్రేమలోకి అలాగే వ్యతిరేకతలన్నీ సారళ్యతలుగా పరిణమింప చేయగలుగుతుంది.

ఫిర్యాదు చెయ్యడం, ఏదేదో చెప్పడం అన్నదొక దయనీయ స్థితి, దానివల్ల ఏ ప్రయోజనం ఉండదు. ఎందు చేతనంటే అదలాగే ఉంటుంది. అది ఎంతో కాలం అలాగే ఉండదు. కనుక అది అలా ఉండకపోయినట్టయితే అని వూహించరానికి ఇంకా బాగుంటుంది.

మనం తొందరపడాలి. అవసరమైనది చేయాలి. దీనికి స్వస్తి చెప్పాలి. ఇదే ఆచరణ యోగ్యమైనది.

- శ్రీమాత

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి

స్థిరమైన ఎంపిక చేసుకో!

1. గాఢమైన కోరికలేకుండా ఉండు. అన్నింటికిమించి దేన్నీ హక్కుగా భావించకు. కాని అనుక్షణం నీవుండగలిగేది, సర్వోన్నతంగానే.
2. ఈ విశ్వ అభివ్యక్తీకరణలో నీస్థానమేమిటో సర్వోన్నతుడే నీకు చూపిస్తాడు.
3. ఈ విశ్వ స్వర సమ్మేళణంలో నీస్థానం దైవం చేసిన తిరుగులేని నిర్ణయం. అయితే, అది ఎలాంటి స్థానమైనా, అందరిలాగే నీకూ అత్యంత ఉన్నత శిఖరాలకు, అతిమానస చేతనాస్థాయి వరకు - చేరగల సమానావకాశం ఉంది.
4. నీ అస్తిత్వం యొక్క నిజస్థితి నీవు తప్పించుకోలేనిది. ఏదీ, ఎవ్వరూ దాన్నించి నిన్ను వేరుచేయలేరు. అయితే దాన్ని సాఫల్యం చేసుకుందుకు కావలసిన మార్గాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ నీకుంది.
5. పరిణామ ఆరోహణాక్రమంలో ప్రతివారికి వారి మార్గాన్ని వారు ఎన్నుకునే స్వేచ్ఛ వుంది. ఆరోహణలో అత్యంత క్లిష్టమైన దివ్య సత్య శిఖరాగ్రాలను కూడా శీఘ్రంగా చేరగలరు.

లేదా వెనుతిరిగి సామాన్యమైన అవరోహణా గతిలో పునరపి జననం, పునరపి మరణంగా నిరంతర చక్ర భ్రమణమూ చేస్తూంటారు.

6. అనంత కాలగమనంలో, లేదా నీ ప్రస్తుత జన్మలోనే నీవు శాశ్వతమైన తిరుగులేని నిర్ణయం తీసుకోవచ్చు .... అపుడు నిర్ణయాన్ని ప్రతి నూతన సందర్భంలో ధృఢ పరచుకుంటూ ఉండాలి. అలా కాకపోతే నీవు అంతిమ నిర్ణయంతీసుకొనే వరకూ, సత్యాసత్యాల మధ్య పెనుగులాట తప్పదు.
7. నీవు ప్రారంభంలో తిరుగులేని నిర్ణయం తీసుకోక పోయినపుడు, కాలంకలిసి వచ్చి, అదృష్టం తలుపుతట్టి విశ్వేతిహాసం ఒక అపూర్వమైన మలుపు తిరిగి, దివ్యకృప భూమ్మీద వర్షించి, సాక్షాత్తూ దైవమే అవతారమై దిగి వచ్చినపుడు అలాంటి అద్భుత సమయంలో నీ భాగ్యం వల్ల జీవించే ఉంటే నీవు అపుడు గొప్ప నిర్ణయం తీసుకోవడమే నీకు ఆ లక్ష్యాన్ని సూటిగా చేరే సమర్థత కలుగచేస్తుంది. జీవితాన్ని సఫలీకృతం చేసుకునే అవకాశమూ లభిస్తుంది.

- శ్రీమాత

అనువాదం : డి : సత్యవాణి

అఖిల భారత పత్రిక, డిసెంబర్ 2008

వ్యక్తిగతమైన ఒక ప్రశ్నకు శ్రీమాత సమాధానం

సూక్తులు:

నేను మృత్యువును సమ్మతించనా లేక అతనికి యెదురు తిరిగి పోరాడి గెలవనా? అది నాలో ఉన్న దైవం కోరి వరించిన టులనే. నేను జీవించినా మరణించినా సర్వదా నేను ఉన్నాను.

మృత్యువు అని నీవు పిలుస్తు ఉన్నది ఏది? దేవునికి మరణ మున్నదా? ఓ! నీవు మరణానికి భయపడుతున్నావు. జీవితమే మృత్యుముఖంతో నీతో ఆడుకోటానికి వచ్చేది. అది భయమనే ముసుగును ధరిస్తున్నది.

భౌతికమైన అమరత్వాన్ని పొందుటకు ఒక సాధనం ఉంది. అందుకు మనం మృత్యువును ఎన్నుకున్నాం. కాని అది దివ్య ప్రకృతి పరంగా అనివార్యం కాదు. ఓకే వస్త్రాన్ని వందపళ్ళు ధరించుటకు, మార్పులేని, సంకుచితమైన, ఇరుకు నివాసంలో నిరంతరంగా బంధింప బడుటకు ఎవరు ఇచ్ఛగిస్తారు?

సూక్తులు, తలపులు - శ్రీఅరవిందులు.

ప్రశ్న :- ఒక వ్యక్తి తన జీవితములో నిర్వహించవలసిన పని పూర్తయినదని భావించినా, తాను సమర్పించుటకు ఏదీ లేకపోయినా, నిరర్థకముగా, బలవంతముగా జీవించుట కంటే మరణించి తిరిగి జన్మించుట మేలని భావించుట ఉచితమా?

జవాబు :- తన కోరికలకనుగుణముగా పరిస్థితులు అను కూలించనపుడు అసంతృప్తి చెందిన అహంకారము యొక్క స్వగతము ఇది. కాని దైవానికి చెందిన వారు, సత్యాన్ని తెలుసుకొని దానిలో జీవించాలను కొని, ఈ భూమి మీద తన ప్రయోజనమును తెలుసుకొని, దానిని కొనసాగించినంతవరకు దైవము అతనిని ఈ భూమి మీద ఉంచి, ఇక్కడ అతను చేయవలసినది పూర్తి అయిన పిమ్మట, అతను నిష్క్రమించుటకు దైవం అనుమతిస్తాడు. కావున ఈ ప్రశ్న ఉదయించదు. దివ్య జ్ఞానంలో దృఢవిశ్వాసం కలిగి అతను నిశ్చలంగా జీవిస్తాడు.

- శ్రీమాత

అనువాదం : త్రివేణి

యోగ మార్గం

మార్గము :

సత్యము, అసత్యము, వెలుగు, చీకటి, పురోగతి, తిరోగతి, ఉన్నత శిఖరాల ఆరోహణ, లేదా, పాతాళంలోనికి పతనం - నిరంతరం వీటిలో అదోఇదో ఎంపిక యే జీవితం. ఎన్నుకునే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి ఉంటుంది.

ఫిబ్రవరి 29.1952

దివ్యమార్గము లేకపోతే గజిబిజి - ఈ రెండింటిలో ఒకటి ఎంపిక చేసుకోవలసిన సమయం ప్రతివాని జీవితంలో ఆసన్న మవుతుంది. ఇక్కడో అడుగు అక్కడో అడుగుగా ఉండలేవు. ఆలాప్రయత్నిస్తే కనక చిందరవందరగా చినిగి పోతావు.

నిర్ణయం తీసుకోలేని హృదయం మృత్యువునే చేరేది.

నీకు మరోగత్యంతరం లేదని భావించినపుడు మాత్రమే ఆధ్యాత్మిక మార్గమును పాటిస్తావు.

అక్టోబరు 27,1982

ముందు మానసిక దృక్పథం కలుగుతుంది. తర్వాత నెమ్మ దిగా అనసరించి నచ్చేది ఆచరణ, జీవితచ్ఛని అతి భద్రంగా నిలిపి ఉంచటం, నీకు తెలిసిన సత్యముతోమే మేకం కావటం అతిముఖ్యం. అప్పడిక ఆపటం, వెనుతిరిగటం అసంభవం.

మనుష్యులందరికే వారివారి ఆధ్యాత్మిక విధినిర్దిష్టమైనదేదో వారి యొక్క దృఢ సంకల్మానుగు ఇంగా చేరునయి గాని దూరంగా గాని ఉంటుంది. పరిపూర్ణ చిత్తశుద్ధితో ఇచ్ఛగించాలి.

ఏప్రిల్ 11,1965.

యోగా :

సాధకుడు - యోగమునకు అనుగుణమైన సక్రమశిక్షణ పాటించే వాడు.

సాధన - యోగ సంబంధిత క్రమ శిక్షణ

యోగము - దైవముతో సమైక్యత (ఈ సమైక్యతకు నడిపించే మార్గము)

ప్రపంచమంతా రూపాంతరీకరణ ప్రక్రియలో పురోగమి స్తోంది. యోగ క్రమశిక్షణ కనుక నీవు పాటించి నట్టైయితే ఈ ప్రక్రి యకి ఊపు అందించిన వాడివి అవుతావు.

జివితమంతటితో సమ నిష్పత్తిలోనే యోగ ఉంటుంది.

పూర్ణయోగం :-

ప్రపంచంలో ఉన్న మూడు భావాలు:

1) బౌద్ధము, శంకరవాదము:

ప్రంపంచం ఒక భ్రమ. ఒక అజ్ఞానక్షేత్రము. అజ్ఞానం వల్ల బాధ చేయవల్సినదొకటే. వీలైనంత త్వరగా ప్రపంచాన్ని వదిలి శూన్యంలోనికి నిష్క్రమించటం (into the original Now - Existemie ov Non - Manifestation)

2) అందరికీ తెలిసిన సాధారణ వేదాంధోరణి

దైవం సర్వోసగతుండు కాబట్టి సారభూతంగా ప్రపంచం దైవీ సంభూతమైనది. కాకకోతే దాని బాహ్యా వ్యక్తీకరణ అస్పష్టం, వక్రం, అజ్ఞాన యుతం, అపసవ్యం. మరిచేయ వల్సినదొకటే. అంతరంగ దివ్యచేతనలో స్థిరపడి ఉంటూ, ప్రంపంచం గురించి పట్టించుకోకుండా ఆ చైతన్యంలోనే స్థిరపడి ఉంటం. ఎందుకంటే బావ్యా ప్రపంచంమారదు. సహజసిద్ధమైన అవిద్య, నిశ్చైతన్య స్థాయిలోనే ఎప్పుడూ ఉంటుంది.

3. శ్రీ అరవిందుల దృక్పథం :

ఇపుడే విధంగా ఉన్న ప్రపంచం దివ్య సృష్టిగా ఉద్దేశింపబడినది.

కాని అలాకనపడదు, అస్పష్టంగాను, అపసవ్య ంగాను, వ్యక్తీ కరింపబడి ఉంటుంది.

దివ్య చైతన్య, ఇచ్ఛా శక్తుల వ్యక్తీకరణగా ఉండదు. కాని గుణ,శీల, కార్య పద్ధతులలో అలానే ఉండవలసి ఉన్నది. దివ్యకాంతి, దివ్య జ్ఞానము, దివ్యశక్తి, దివ్యప్రేమ, దివ్యసౌందర్యము - దైవము యొక్క దివ్య రూపాలుగా పరిపూర్ణంగా అభివృద్ధి చెంది అభివ్యక్తీ కరిపంబటానికి నిర్దేశింపబడి ఇదంతా సృష్టింపడినది.

ఇదీ దీనిగురించిన మా భావన, మేము అనుసరించే లక్ష్యము.

ఫిబ్రవరి 24,1936

సర్వోన్నత చైతన్యం (సత్ చిత్ ఆనంద్) లో సమైక్యత సా ధారణ సాధకులకు ఆదర్శం. ఇది సాధించిన వారు వ్యక్తిగత ముక్తితో పరితృప్తిచెంది ప్రపంచాన్ని దాని పాపాన దానిని వదిలిపోతారు. అందుకు భిన్నంగా, శ్రీ అరవిందుల వారి సాధన ఇతరులు ఎక్కడ వదిలిపోతారో అక్కడ నుంచి ప్రారంభమవుతుంది. ఒకమారు సర్వోన్నతునితో సమైక్యత సాధించిన పిమ్మట, ఆసాధను, సిద్ధిని బాహ్య ప్రపంచానికి తీసుకురావాలి. భౌతిక ప్రపంచ జీవన పరిస్థితులను అది మార్చాలి. పూర్తి రూపాంతరీకరణ సాధించాలి. ఈ లక్ష్యం సాధించే వరకు పూర్ణయోగసాధకులు తపో, ధ్యాన, జీవనం కొరకు ప్రపంచం నుంచి నిష్క్రమించరు. తమ సమ యంలో మూడవ వంతు ప్రతి ఒక్కరు ఏదో ఒక ఉపయుక్తమైన పనికి వినియోగిస్తారు. ఆశ్రమంలో అన్నిరకాలైన కార్యకలాపాలకు ప్రాతినిధ్యం ఉంది. ఎవరిస్వభావానికి అనుగుణమైన పనిని వారు ఎన్నుకుంటారు. అయితే చేసే పనిమాత్రం నిస్వార్థసేవాభావంతో నిర్వర్తిస్తారు. ఆదర్శం ఎప్పుడూ సమగ్రరూపాంతరీకరణమే. ఇది దృష్టిలో ఉంచుకోవాలి.

ఈ ప్రయోజన సాధనకే ఆశ్రమం వ్యవస్థీకరించబడింది బ్రతుకు తెరువు గురించిన చింత ఎవరికీ కలుగకుండా ఆశ్రమ వాసులందరి సహేతుకమైన అవసరాలు నెరవేర్చబడుతది.

పాటించి వలసిన నియమాలు బహుకొద్ది : కాబట్టి స్వీయ పురోగతి

సాధించటానికి ప్రతిఒక్కరికీ కావలసిన స్వేచ్ఛ ఉంటుంది. కాకపోతే కొన్ని ఖచ్చితమైన నిషిద్ధాంశాలు ఉన్నాయి: 1) రాజకీయాలు, 2) పొగతాగటం, 3) మద్యపానం, 4) సెక్సు.

చిన్నపెద్ద, కుర్రవాళ్లు, వయసు వచ్చిన వాళ్లు - అందరి యొక్క శారీరక పరిపోషణకి, సంక్షేమా లక్ష తగినరీతిలో శ్రద్ధ వహింపబడుతుంది.

సెప్టెంబరు, 24,1953

చిన్న, పెద్ద, కుర్రవాళ్లు, వయసు వచ్చిన వాళ్లు - అందరి యొక్క శారీరక పరిపోషణకి, సంక్షేమాలకు తగినరీతిలో శ్రద్ధ వహింపబడుతుంది.

సెప్టెంబరు, 24,1953

(లోతుల్లోకి) పోయేకొలదీ నేను తెలుసుకున్న దేమంటే, శ్రీ అరవిందుల వారి యోగం కర్మాచరణ ద్వారానే ఉత్తమోత్తమంగా అనుష్ఠింపబడుతుంది, అని

అక్టోబరు 9,1966

నీవేది ఆచరించావన్నదికాక, ఏ అంతరంగంతో ఆచరిం చావన్నది పూర్ణయోగానికి ప్రధానం.

1971

తపశ్య:

ఏ రకమైన ఆధ్యాత్మిక లక్ష్యసాధన కోసం అయినా కాని, ఇచ్ఛా శక్తి చేత ప్రభావితం కాబడిన క్రమ శిక్షణయే తపస్సు.

తపస్సు: దైవమును సిద్ధింపచేసుకొనే లక్ష్యంగా పాటించే క్రమశిక్షణయే తపస్సు.

మనిషిగా ఉండటానికి క్రమ శిక్షణ అత్యావశ్యకం క్రమ శిక్షణ అత్యావశ్యకం క్రమశిక్షణ లేని వాడు పశువు.

మనిషిగా మనుగడ ప్రారంభమయేది ఉన్నత తరస్థాయి మనిషిగా

మనుగడ ప్రారంభమయేది, మరియు, రూపాంతరీ కరణకు క్రమశిక్షణను ఆమోదించినపుడు మాత్రమే. ఇందుకోసం నిమ్న ప్రకృతిని, దానితాలూకు కామనలను అదుపులో ఉంచు కోవడం ద్వారానే తప్పక ప్రారంభంకావాలి.

మార్చి 19,1972

సన్యాసి ఆచరణలు:

గుహలో సాధనసులు వని నేను అనుకోను. అక్కడ చిత్తు శుద్ధి బహిర్గతం కాదు. జీవనకర్మాచరణలో అంబపార్గతమవుతుంది. గుహలో నీవు యోగిలా అగుపించగలవు. జీవితంలో నటన కష్టం. ఎందుకంటే నీవు యోగిలానే (వాస్తవంగా) ప్రవర్తించాలి.

సెప్టెంబరు, 1935

నీవు ఎంత తింటున్నావు, తగినంతగా క్రమం తప్పకుండా నిద్రపోతున్నావా అనే విషయం మేము తెలుసుకో కోరుతున్నాం. ఈరెండు విషయాలు చాలా ప్రాముఖ్యం కలవి. ఎందుకంటె ఈ రకమైన సాధన తట్టుకోవటానికి, బుద్ధి, శరీరము, నాడీ వ్యవస్థలు, నిద్ర, పోషక ఆహారం లేకుండా శక్తి హీనం కాకూడదు.

డిశంబరు 16,1940

ఇక్కడ గ్రహణశక్తి అత్యావశ్యకం. సమతూకం, శాంతి, నిశ్చలతలపై పూర్ణయోగం ఆధారపడి ఉంటుంది. అంతే తప్ప అనారోగ్యకరమైన బాధను అనుభవించే అనవసర సహనంపై కాదు.

మే 12, 1969

కఠోరనియమం పాటించినంత కాలం దానికి ప్రతి క్రియలుంటాయి. అత్యావశ్యక మయినపుడు అది మంచిదే.

* * *

ప్రశ్న : నేను కొంతకాలం ఏకాంతంగా గడపాలా?

నిశ్శబ్దాన్ని, ఏకాంతాన్ని అభిలషించేవి పాతయోగ పద్ధతులు. రేపటియోగం కర్మానుష్ఠాంలో ప్రపంచంలో అనుబంధం కలిగి ఉంటూ దైవాన్ని కనుగొనటం అంతర్ముఖుడవై, విచారించి, ఏది నీకు కావాలో చెప్పు.

జనవరి 24, 1971

శారీరకంగా పూర్తి విశ్రాంతి (retirement) ఎప్పుడూ అంత ఆరోగ్యం కాదు. తాత్కాలిక విరమణ తరుచు హాయికారి కావచ్చు. ప్రధాన విషయం అంతర్గతమైన నిర్లిప్తత దైవం వైపు మరలటం.

ఏకాగ్రత:

నిలువ చేసుకొని ఏకాగ్రం చేయటానికి అత్యసరమైన (movement) చలనం, పరివ్యాప్త పరిచి వ్యాపింపచేసే చలనం కంటె ఏమంత తక్కువ ఆవశ్యకమైనది కాదు.

ఏప్రియల్ 13, 1935

ఖచ్చితమైన లక్ష్యంపై ఏకాగ్రత పురోగమనానికి సహకరిస్తుంది. లక్ష్యంపై ఏకాగ్రత హెచ్చేకొలదీ అది మరింత వికసితమై సుస్పష్టమవుతుంది.

ధ్యానం:

నీవుధ్యానంలో కూర్చున్నపుడు బాహ్యమనసు జోక్యం లేకుండా, పూర్తిగా నిరపేక్షంగా, దేనికోసం పట్టుపట్టకుండా, పశివానివలె నిష్కపటంగా సహజంగా ఉండాలి. ఈ నిబంధన ఒకసారి నెరవేర్చబడినపుడు మిగిలినదంతా లోలోపలి అంతరంగ ఆకాంక్షపై ఆధారపడి ఉంటుంది. అపుడు నీవు దైవాన్ని ఆహ్వానిస్తే అందుకు సమాధానం కూడా నీకు లభ్యమవుతుంది.

జనవరి 26, 1935

ధ్యానానికి ప్రేరణ, హేతుబద్ధ నిర్ణయంగా కాక అంతరంగం నుంచి సహజ సిద్ధంగా రాకపోతే, ధ్యానానికి నీవెంత యెక్కువ సమయం కేటాయించినా అది అంత ఉపయోగకరంగా ఉండదు.

అక్టోబరు 17, 1939

నిరంతరమూ ఏకాగ్రతతో అంతరంగంలోకి కూడ తీసుకుని ఉంచుకునే దృక్పథం పాటించి నిపుకోవటం, నిర్ణీత ధ్యాన సమయాలు కొన్ని ఉండటంకంటే, ఎంతో మరింత ముఖ్యం.

గురువు:

నేటి మన ఈ ఆధునిక కాలంలో భౌతికంగా సంతృప్తి కలుగజేసే విజయము మాత్రమే గణనీయంగా ఉంటోంది. అయినప్పటికీ కూడా అసంతృప్తి

పరులైన జనులు హెచ్చుసంఖ్యలో ఎప్పుడూ జీవితాన్ని గురించి అన్వేషణ సాగిస్తూనే ఉన్నారు. మరోవైపు పీడిత ప్రజానీకానికి జ్ఞానకాంతులను ప్రసరింపజేసి సహాపడే జ్ఞాన సంపన్నులైన సాధుపుంగవులూ ఉన్నారు. జిజ్ఞాసువులు, జ్ఞానప్రదాతలు - ఉభయులు భేటీ పడినపుడు ప్రపంచంలో ఓ క్రొత్త ఆశ చిగురిస్తుంది. అలముకొన్న చీకట్లలోనికి కాస్తంత కాంతి చొచ్చుకుని పోతుంది.

నేను ఏకాంతంగా ఉన్నపుడు పొందే ఏకాంత అనుభూతిని ఎలా పరిష్కరించాలో అందుకు మీ సహకారం నేను అర్థించవచ్చా?

ప్రపంచంలో ఏకాంతాన్ని అనుభూతి పొందేవాళ్లు దైవంతో సమైక్యతకు సంసిద్ధంగా ఉన్నవాళ్లు.

(సశేషం)

From : The Mother's "Rays of light" -

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు.

నూతన ప్రచురణ

శ్రీఅరవిందుల మహాకావ్యం, 'సావిత్రి'కి సరళ తెలుగు వచనంలో స్వేచ్ఛానువాదం. (1250 పేజీలు). రెండు సంపుటాలుగా ప్రచురణ.

అనువాదకులు : శ్రీ కోనేరు వెంకటేశ్వరరావు

వెల రు 800/-లు. శ్రీఅరవిందసొసైటీ కేంద్రాలకి బ్రాంచీలకు40% రాయితీ. 10 సెట్లు, అంతకు అదనంగా ఆర్డరు ఇస్తే, పోస్టేజి ఉచితం.

ప్రతులకు :- శ్రీమాతారవింద దివ్యజీవన కేంద్రం,
శ్రీఅరవిందపురం - అడ్డాడ పోస్టు - 521390
కృష్ణాజిల్లా - ఆంధ్రప్రదేశ్‌కి వ్రాయవచ్చు.

సమాచారపత్రం

సావిత్రి అధ్యయనం : శ్రీఅరవిందుల మార్మిక మహాకావ్యం 'సావిత్రి' గురించి డా॥ అలోక్ పాండే గారు శ్రీఅరవింద సొసైటీ బీచ్ ఆఫీసునందు యధాపూర్వం ఫిబ్రవరి 22 నుండి 28 వరకు అధ్యయన తరగతులు నిర్వహించెదరు.

శ్రీ గోపాల్ భట్టాచార్య గారు : 20 ఆగష్టు నుండి 24 సెప్టెంబరు వరకు జర్మనీ మరియు అమెరికా దేశములందు పర్యటించి వివిధ విషయములపై ప్రసంగాలు చేసారు. ముఖ్యంగా జర్మనీలో శ్రీఅరవిందుల జయంతి వేడుకలలో పాల్గొని చక్కని ప్రసంగములు చేసి పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినారు. అమెరికాలో ప్లాటిస్ బర్గ్, న్యూయార్క్, బర్లింగ్‌టన్‌లలో ఉపన్యాసాలు ఇచ్చినారు.

ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నము నందు 26 సెప్టెంబరున యధాపూర్వం వార్షిక (6వ) ప్రసంగాలు జరిగినవి. లెఫ్టినెంట్ (విశ్రాంత) అశోక్ ఛటర్జీ (డైరెక్టర్ ఆఫ్ శ్రీఅరవిందో ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అరోవిల్) శ్రీఅరవిందుల వెలుగులో 'భారతీయ వారసత్వం' అన్న అంశంపై ఆసక్తి దాయకమైన ప్రసంగం చేసినారు.

తిరుపతి : తిరుపతి బ్రాంచివారు శ్రీఅరవిందుల పవిత్ర అవశేషముల 9వ వార్షికోత్సవమును 12.09.08న ఘనందాగా నిర్వహించారు. శ్రీ యమ్. బలరామిరెడ్డి గారు, శ్రీ బి. వెంకట్రామయ్య గారు శ్రీఅరవిందుల పవిత్ర అవశేషముల సన్నిధి యొక్క ప్రాశస్త్యమును గురించి మహోపన్యాసములు ఇచ్చిరి. తిరుపతి - తిరుమల దేవస్థానము నుండి శ్రీ శేషాద్రిగారు ముఖ్య అతిథిగా ఏతెంచినారు. శ్రీమద్భాగవతం మరియు మహాభారతములందు శ్రీకృష్ణతత్వముపై శ్రీమేడసాని మోహన్ గారు చక్కని ప్రసంగం చేసి ఆహూతులను అలరించినారు.

బెంగుళూరు : శ్రీఅరవిందో కాంప్లెక్స్, జె.పి.నగర్, నందు ప్రొఫెసర్ మనోజ్‌దాస్ గారు "మృత్యుంజయత్వం - ఒక స్వప్నం మరియు వాస్తవం" అను అంశంపై ఆగష్టు 25న ప్రసంగించిరి. శ్రీచంద్రశేఖర్ రథ్ "శ్రీఅరవిందుల వెలుగులో వేదాలు - ఉపనిషత్తులు" అన్న అంశంపై ఆసక్తిదాయకమైన ప్రసంగములు చేసారు.

ఇవిగాక నౌగాంగ్ (మధ్యప్రదేశ్) తిరుచ్చి (తమిళనాడు) నోయిడా (కెన్యా)ల నుండి మరియు ఇతర ప్రదేశాల నుండి గూడా అనేక కార్యక్రమములు జరిగినట్లు వార్తలు అందినవి.